# ఆర్యకథానిధి

రచన

శ్రీ వావిలికొలను సుబ్బారావు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
2024

# ARYA KATHA NIDHI

By
**Sri Vavilikolanu Subbarao**

Editor
**Dr. Akella Vibhishana sarma**
Special Officer
Publications Division

T.T.D. Religious Publications Series No. 1500
@ All Rights Reserved

First Edition : 2024

Copies : 200

Price :

Published by :
**Sri J. Syamala Rao,** I.A.S.,
Executive Officer
Tirumala Tirupati Devastanams,
Tirupati - 517 501

**D.T.P.**
Publications Division,
T.T.D, Tirupati

Printed at
**Tirumala Tirupati Devasthanam's Press**
Tirupati - 517 501

# ముందుమాట

భారతదేశంలో ఎన్నో ఆలయాలు అంగరంగ భోగాదులతో అశేషభక్తజనావళికి ఆకర్షకమై వెలుగొందుతున్నాయి. కొన్ని కారణాంతరాలవల్ల పూర్వ వైభవమంతా కోల్పోయినా, కారణజన్ములయినవారి దృఢసంకల్పంతో తిరిగి జాజ్జ్వల్యమానంగా వెలగడం చరిత్రకారులకు తెలిసిన అంశం. అలాంటి ఆలయాలలో రాయలసీమలోని కడప సమీపంలోని ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయం ఒకటి. ఈ ఆలయోద్ధరణలో తలమునకలయినవారు శ్రీవావిలికొలను సుబ్బారావు. వీరు 1863లో జన్మించి 1939లో కైవల్యాన్ని పొందారు.

భారతీయులు 'సప్తసంతానాలను' పుణ్యకార్యాల పట్టికగా ఇచ్చారు. తటాకనిర్మాణం, ఆలయనిర్మాణం, గ్రంథరచనలు వాటిలో ప్రముఖమైనవి. వాసుదాసుగా ఖ్యాతిగాంచిన శ్రీసుబ్బారావుగారు ఈ మూడురంగాలలోను సాటిలేని మేటిగా రాణించినవారు. వారి మహోదాత్తసేవలలో ఒంటిమిట్ట కోదండ రామాలయ ఉద్ధరణ ప్రధానమయినది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయాక రామనవమి ఉత్సవాలు ఎక్కడ జరపాలని ఆలోచించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో కళాసంపద, చారిత్రకతను కలిగిన 'ఒంటిమిట్ట'ను నిర్ణయించింది. ఆనాటి నుండి ఈ క్షేత్రం అందరిదృష్టిలో మరింతగా విరాజిల్లుతున్నది. పైగా ఈ క్షేత్ర అభివృద్ధిలో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రముఖ బాధ్యత వహించడంతో ఈ క్షేత్రం దినదినాభివృద్ధి చెందుతున్నది. పూర్వం కేవలం ఆలయోద్ధరణమేగాక ఈ ఆలయఘనతను త్రికరణశుద్ధిగా చేపట్టినవారు

శ్రీ వావిలికొలను సుబ్బారావుగారు. వారి రచనలైన ధార్మిక గ్రంథాలను ముద్రించి పాఠకలోకానికి అందివ్వాలని కట్టుదిట్టమయిన ప్రణాళికను తి.తి.దే. సిద్ధం చేసింది. ఆ ప్రణాళికలో ఒక భాగమే 8 భాగాలుగా ఉన్న 'ఆర్యకథానిధి'ని ఒకే సంపుటంగా ముద్రించుకోవడం.

"ఆర్యకథానిధి" అనే గ్రంథంలో పితృభక్తి వలన ఫలితము, గురుభక్తి, గురువును ధిక్కరించడంవలన కలిగే నష్టం, తల్లిదండ్రుల మాటను జవదాటరాదు, ఆడితప్పరాదు, స్వామికార్యం శ్రద్ధతో చేయవలెను, స్వామిద్రోహం చేయరాదు, దొంగతనం చేయరాదు, శ్రద్ధకొలది విద్య మొదలైన శీర్షికల్లో అనేక కథలద్వారా సమాజానికి హితోపదేశం చేశారు.

"ఆర్యకథానిధి" అనే ఈ గ్రంథానికి సరళమైన భాషలో పీఠికను అందించిన ఆచార్య కె. సర్వోత్తమరావుగారికి హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ గ్రంథాన్ని పరిశీలించి, ముద్రించడంలో తన బాధ్యతను నిర్వహించిన తి.తి.దే. ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ గారికి, నా శుభాభినందనలు.

*సదా శ్రీవారి సేవలో...*

**శ్రీకార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

## ప్రణుతి

'ఆర్యకథానిధి' రచయిత వావిలికొలను సుబ్బారావు గారు. వీరు 1863–1939 మధ్యకాలంలో జీవించినవారు. రెవిన్యూ ఉద్యోగిగా జీవితం మొదలెట్టినా సుమారు 16 సంవత్సరాలు చెన్నపురి రాజధాని సర్వకళాశాలలో ఆంధ్రపడితపదవిలో రాణించినవారు. వీరిని గురించి శ్రీ నిడదవోలు వెంకటరావుగారు.

'పాండిత్యము చేతనే కాక పవిత్రమగు ఆధ్యాత్మిక భావనచే విషయరక్తులగువారిని పరమభక్తులుగా నొనరించుటయే కాక ఆంధ్ర భాషాభిమానము వారిలో నుద్దేశింపచేసి, తాను తరించి యితరులను తరింపచేసిన ధన్యాత్ములు వీరు' అని శ్లాఘించారు.

శ్రీసుబ్బారావుగారు తన పండిత పదవీవిరమణానంతరం తన కాలమంతా భక్తిమార్గంలో గడిపినవారు. భక్తిసంజీవని పత్రికాధిపులుగా, వాసుదాసులై ముక్తులయ్యారు. రామాయణ రచన చేయడంగాక అద్దానికి మందరమనే గొప్ప వ్యాఖ్యానం విజ్ఞానసర్వస్వమనేలాగున తీర్చిదిద్దారు. శేషజీవితాన్ని ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయ పునరుద్ధరణ కార్యక్రమంలో గడపుట మాత్రంగాక ధార్మికగ్రంథాలు రచించి ధన్యులైనవారు. ప్రబంధాలు వ్రాసినా, శతకాలు వ్రాసినా, వ్యాకరణ రచనలు చేసినా, నాటకాలు రచించినా వాటిలో వారి 'ఆర్యకథానిధి' సంపుటాలు తెలుగువారి కాదరణ పాత్రములయ్యాయనడం సత్యం. తెలుగువాఙ్మయ ప్రపంచమున భక్తకవులలో ప్రత్యేక స్థానమలంకరింపదగిన వారు ఆంధ్రవాల్మీకి బిరుదాంకితులు వావిలికొలను సుబ్బారావు.

కాసంత సాహిత్యపరిచయం గలవారికి అష్టైశ్వర్యాలు, అష్టభోగాలు, అష్టదిక్కులు, అష్టదిగ్గజకవులు లాంటి పదబంధాలు సుపరిచితమే. అలాగే శ్రీవావిలికొలను సుబ్బారావుగారు ఈ ధోరణిలోనే పాఠకులకు అందించిన

అమూల్య గ్రంథం 'ఆర్యకథానిధి' ఈ పేరుగల పుస్తకం ఎనిమిది భాగాలుగా గతంలో వెలువడ్డాయి. ప్రస్తుతం ఈ ఎనిమిది భాగాలు ఒక సంపుటంగా తి.తి.దే.వారు ముద్రిస్తున్నారు.

అమరం 'అరణీయా ఆర్యాః ఋగతౌ' అందరిచేత పొందదగినవారని ఆర్యశబ్దానికి వివరణ ఇచ్చింది. అలాగే కథాశబ్దానికి 'కథ్యతే ఇతి కథా' అనే వివరణతో బాటు కథా భేదాలను తెలిపింది. ఇక 'నితరాం ధీయతే అస్మిన్నితి నిధిః' అని నవనిధులపేర్లను, ఆ నిధుల ఆకారాలను కూడా సంగ్రహంగా విశదం చేసింది. ఆ వివరణలోని చాల అంశాలు కథానిర్వచనానికి సహకరిస్తాయి. కొనియాడబడేది, వరింపబడేది, స్మరింపబడేది, దుఃఖాన్ని ఉపశమింపజేసేది 'కథ' లాంటివి.

శ్రీవావిలికొలను సుబ్బారావుగారి 'ఆర్యకథానిధిలో' 132 కథలున్నాయి. ఈ కథలన్నీ ముఖ్యంగా శ్రీమద్రామాయణం, మహాభారతం, భాగవతాది గ్రంథాలలోనివే. ఇవేగాక పంచతంత్రం బృహత్కథలోనివి కూడా కొన్ని వున్నాయి. వీటితోబాటు శ్రీవావిలికొలను సుబ్బారావుగారు జనవ్యవహారంలో వేళ్ళూనుకున్న కథలను కూడా తన రచనలో పొందుపరచినారు.

132 కథలను వివిధ కోణాల్లో పరిశీలిస్తే కొన్ని విభాగాలున్నట్లు తెలియవస్తుంది. మొదటిది పురుషార్థవిభాగం. భారతీయులకు పురుషార్థాలంటే ధర్మ, అర్థ, కామ, మోక్షాలు. ఇక రెండవది మానవుల శారీరకదశలకు సంబంధించినవి. అంటే బాల్య, కౌమార, యౌవన, వార్ధక దశలకు అనుగుణమయిన రచనలు. మూడవది ఈ కథలలోని వ్యక్తులు దేవతలు, దేవుళ్ళు, రాజులు, మంత్రులు, రాజపరివారం, మునులు, పురోహితులు. నాల్గవది సామాన్యగృహస్థుల కథలు. ఐదవది ప్రాణికోటిలో చేపలు, కొంగలు, జింకల స్వభావాలతో సమ్మిళితమయినవి.

అన్నిటికి మించి ఆర్యకథానిధిలో రకరకాల కౌటుంబికుల కథలున్నాయి. విభిన్న సమస్యల నేపథ్యం గలవి కొన్ని. తండ్రికొడుకుల మనస్తత్వవిభేదం, మాతాశిశువుల అనుబంధం, కారణాంతరాలవల్ల భర్త, కుమార, భార్యాగణం దారితప్పిన కథలున్నాయి. యుగాలు మారినా జగాలుమారినా కౌటుంబిక సమస్యలలో పెద్దతేడాలేదు. అవి నేటికీ నిత్యనూతనం.

శ్రీవావిలికొలను సుబ్బారావుగారి శైలిని గురించి రెండు మాటలు. శ్రీవారు జీవించినకాలంలో గ్రాంథికశైలికే ప్రాధాన్యం. బాలవ్యారణకర్త చిన్నయసూరి రచిత మిత్రలాభ, మిత్రభేద రచనాశైలి అందరికి ఆమోదయోగ్యంగా ఉండేది. కొక్కొండ వెంకటరత్నంగారి వీరగ్రాంథికానికి సామాన్యులలో స్పందన అంతంతమాత్రమే. శ్రీ సుబ్బారావుగారు చిన్నయసూరి శైలిని అనుసరించినా ఎక్కడా తెలుగుతనానికి లోపం రానీయలేదు. 132 కథలలో అచ్చ తెలుగుశబ్దాలు. నుడికారాలు, పలుకుబళ్ళు, సామెతలు ఆభరణంలో ప్రకాశించే మణులలాగ పాఠకుల దృష్టికి ఆనుతాయి. తాను కథలను రమ్యంగా తీర్చినా ప్రతికథ చివర ఒక పద్యం కచేరీలలో ముక్తాయింపుగా తీర్చారు. అవసరమయినచోట కొన్ని కథలలో పద్యాల సంఖ్య పెరిగి వుండవచ్చు. ఈ జోడింపు కారణంగా సామాన్య విద్యార్థులకు పద్యవిద్యానురక్తి పెరగడానికి వీలయింది. కౌటుంబిక కథలలో మాత్రం 'సంవాదశైలి' కనిపిస్తుంది. ఇంతటి సంయమనంతో వ్రాసిన కథాసంపుటాలు ఆ రోజుల్లో లేవు. ఇందుకు ప్రత్యక్షసాక్ష్యం ఆర్యకథానిధిని ముద్రించిన శ్రీకోదండరామసేవక ధర్మసమాజం వారు 1973 ప్రచురణలో లోగడ ఆర్యకథానిధి 18 మార్లు ముద్రితమని ఘంటాపథంగా చెప్పడమే. ఈ వాక్యం బట్టి ఆనాటి ప్రజల, పాఠకుల పఠనాశక్తి, పుస్తకాలు కొనాలనే ఆసక్తి రెండూ అవగతమవుతాయి.

గతంలో కుటుంబ జీవనంలో తాతలు తమ మనుమలను, మనుమరాండ్రను దగ్గరకు చేర్చుకొని కథలు చెప్పేవారు. పిల్లలు చెవియొగ్గి వినేవారు. ప్రాథమిక పాఠశాలల్లో, ఉన్నత పాఠశాలల్లో నీతిబోధకం పేరుతో ప్రత్యేక కాలవిభజన కూడా ఉండేది. కారణాంతరాలవల్ల ఇవన్నీ గతస్మృతులుగా మిగిలిపోయాయి. వీటివల్ల విద్యార్థులు తమ్ముతాము దిద్దుకొనేవారు. సరిఅయిన బాటలో నడిచేవారు. ఈనాడు వ్యక్తిత్వ వికాసంపేరుతో తల్లిదండ్రులు లక్షలు లక్షలు ఖర్చు పెట్టేవారు మరోమారు తమ్ముతాము పునరాలోచనలో పడవలసిన అవసరముంది.

సద్గ్రంథపఠనకోసం తి.తి.దే. తక్కువ వెలలో పుస్తకాలు ముద్రిస్తున్నది. అలాగే ఆర్షధర్మప్రచారానికి వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నది. ఉచితంగా శతకాలను అర్హులయిన వారికి అందజేస్తున్నది.

శ్రీవావిలికొలను సుబ్బారావుగారి 'ఆర్యకథానిధి' పునర్ముద్రణావసరంలో శుద్ధప్రతి తయారుచేసే అవకాశం కల్పించిన తి.తి.దే. అధికారులకు కృతజ్ఞతలు.

**తిరుపతి**

**– ఆచార్య కె. సర్వోత్తమరావు**

## నివేదన

భారతదేశంలో వ్యవహరింపబడే అన్ని భాషలలోను కథా సాహిత్యముంది. కథలంటే ఇష్టపడని వారు ఎవరూ ఉండరు. పిల్లలయితే చెవి కోసుకొంటారని చెప్పడం సహజం. ఆలోచిస్తే కోసుకోవడం కాదు. ఇష్టంతో వినడానికి సిద్ధపడడం అనే భావం. కూసు అన్నది ద్రవిడ శబ్దం. ఈ శబ్దానికి Sharpness అని ఆంగ్లార్థం. కథ చెప్పేవానిముందు శ్రోత చెవియొగ్గి వినడమన్నమాట.

ఒక అంశాన్ని రమ్యంగా చెప్పడానికి, అర్థవంతంగా చెప్పడానికి, ఆకట్టుకొనేలా చెప్పడానికి కథనం బాగుండాలి. జనపదాలు తక్కువై, నగరాలు కొన్ని అయినపుడు చుట్టూ ఉన్న ప్రకృతి మనుష్యులకు ఉత్తేజంగా, ఉల్లాసంగా ఉండేది. ప్రకృతితో కలిసి జీవించే దశలోనే ప్రాణుల/ జంతువుల కథలు ఎక్కువ వచ్చాయి. పంచతంత్రకథలు ఇలాంటివి.

రామాయణంలో ఉపకథలు కొన్నయినా, భారతంలో ఆరణ్య శాంతి పర్వాలలో కథలెక్కువ. ఈ కథలు మానవాళికి సత్ప్రవర్తక బోధకాలు. నీతివంతమయిన జీవన విధానానికి మార్గదర్శకాలు. మంచి మార్గంవైపు వెళ్ళడానికి దిక్సూచికలు.

ఆంగ్లవిద్య క్రమంగా భారతదేశంలో వ్యాపిస్తున్న రోజులలో భారతీయతకు సంబంధించిన కథాశ్రవణం వెనకబడ్డది. ఈ కారణంగా హైందవ సమాజంలో విచిత్రమయిన ధోరణులు ప్రబలమైనాయి. ఈ అసహజ వాతావరణం సమాజం మీద పడకుండ వుండడానికోసం 'వాసుదాసు' గారు 'ఆర్యకథానిధి' పేర మొదట ఒక పుస్తకం ప్రచురించారు. ప్రజల ఆదరణ, చదువరుల ఉత్సాహం గుర్తించి క్రమంగా 8 సంపుటాలు తన జీవితకాలంలో ప్రకటించారు. అన్నిటికన్నా మించి ఊహించనిరీతిలో ఈ కథాసంపుటాలు 18 ముద్రణలు కావడం, చదువరుల ఆసక్తిని పెంచడం విశేషం.

ఏ సమాజం బాగుపడాలన్నా పాతక్రొత్తల మేలుకలయిక అవసరం. అందుకే తి.తి.దే. వాసుదాసు గారి ఆర్యకథానిధులను పునర్ముద్రించాలని భావించింది. ఇలాంటి పుస్తకాల ముద్రణకు ఆమోదం తెలిపిన తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారి గారికి, పునర్ముద్రణ సమయంలో ప్రూఫులు సరిచూడడం మాత్రంగాక ప్రణుతి పేరుతో ఉపోద్ఘాతం వ్రాసిన ఆచార్య కె. సర్వోత్తమరావు గారికి నమస్సులు.

**– ఆకెళ్ళ విభీషణశర్మ**



ఆపదా మపహర్తారం

దాతారం సర్వసంపదామ్



లోకాభిరామం శ్రీరామం

భూయో భూయో నమామ్యహమ్

**కం. నీపాదకమలసేవయు**
**నీపాదార్చకులతోడి నెయ్యము నితాం**
**తాపార భూతదయయును**
**దాపసమందార! నాకు దయసేయఁగదే**

## విషయసూచిక


| విషయములు | పుట.సంఖ్య |
|---|---|
| 1. ఆడి తప్పరాదు | 1 |
| 2. బాలురు తెలియక చేసిన పాపము తల్లిదండ్రులను బాధించును | 1 |
| 3. తల్లిదండ్రులమాట మీఱరాదు | 2 |
| 4. తాను కష్టపడియైనఁ దల్లిదండ్రుల సుఖపెట్టవలయును | 3 |
| 5. పితృభక్తివలన ఫలము | 3 |
| 6. గురుభక్తి | 4 |
| 7. గురువును ధిక్కరింపరాదు | 5 |
| 8. సౌభ్రాత్రము | 5 |
| 9. పొగరు కీడు కలిగించును | 6 |
| 10. ఆశ దుఃఖమును కలిగించును | 7 |
| 11. త్రాగుబోతులు నాశమగుదురు | 7 |
| 12. అధికార మున్నదని మిడిసిపడరాదు | 8 |
| 13. గొప్పవాఁడు పరుల నవమానింపరాదు | 8 |
| 14. మనుష్యుడు చేయుపనులను దేవుడు చూచుచుండును | 9 |
| 15. స్వామికార్యము శ్రద్ధతో జేయవలయును | 10 |
| 16. స్వామిద్రోహము చేయరాదు | 11 |
| 17. దొంగతనము చేయరాదు | 12 |
| 18. చెఱుపకురా చెడెదవు | 12 |
| 19. శ్రద్ధకొలఁది విద్య | 13 |
| 20. చదువునప్పుడు దిక్కులు చూడరాదు | 13 |

| | |
|---|---|
| 21. నమ్మినవారిని చెఱుపరాదు | 14 |
| 22. నెపములేని సత్యము చెప్పవలయును | 15 |
| 23. తండ్రిమాట మీఱువాఁడు చెడును | 15 |
| 24. రుక్మాంగదుఁడు | 16 |
| 25. మద్యపానము మహాపాతకము | 17 |
| 26. ఆలుమగల ప్రేమ | 18 |
| 27. దమయంతి | 18 |
| 28. సావిత్రి | 19 |
| 29. గాంధారి | 20 |
| 30. సీత | 20 |
| 31. చంద్రమతి | 21 |
| 32. సుకన్య | 22 |
| 33. భక్తిలేనిపూజ పత్రిచేటు | 23 |
| 34. సత్యాద్రౌపదీ సంవాదము | 24 |
| **రెండవ భాగము** | |
| 1. భగవంతుఁడు సర్వవ్యాపి | 25 |
| 2. ఈశ్వరుని దూషింపరాదు | 26 |
| 3. సాధువులను బాధింపరాదు | 26 |
| 4. దిక్కులేనివారికి దేవుఁడే దిక్కు | 27 |
| 5. దుష్టులకు మేలుచేయరాదు | 28 |
| 6. దత్తాపహారము మహాపాపము | 29 |
| 7. నీచులఁ జేరఁదీయరాదు | 30 |

| | |
|---|---|
| 8. రాజు దేవాంశమునఁ బుట్టినవాఁడు | 31 |
| 9. రాజద్రోహము మహాపాతకము | 32 |
| 10. పెద్దల ధిక్కరింపరాదు | 33 |
| 11. నవ్వుచుఁ జేసిన ఏడ్చుచు అనుభవింపవలయును | 34 |
| 12. పెద్దలను పరిహసింపరాదు | 35 |
| 13. పాపఫలము శిక్షచేఁ బోవును | 35 |
| 14. ప్రభుభక్తి | 37 |
| 15. వినయముగల వానికి విపత్తులేదు | 37 |
| 16. దీర్ఘసూత్రుఁడు చెడిపోవును | 38 |
| 17. దధీచి | 39 |
| 18. ఒకఁడు పాపము చేయును, పలువురు దాని ఫల మనుభవింతురు | 40 |
| 19. దైవమును నమ్మి చేసిన కార్యము చెడదు | 41 |
| 20. శబరి-గురుసేవ శ్రేయస్కరము | 42 |
| 21. హానికరమగు సత్యము పలుకరాదు | 43 |
| 22. చెడువారికిఁ చెడుగుణము మంచివానికి మంచి గుణమే యెదుటివారియందుఁ గనఁబడును | 44 |
| 23. కులమునకు గుణము కారణము | 45 |
| 24. ఆత్రగానికి బుద్ధిమట్టు | 46 |
| 25. తక్కువవారి నవమానింపరాదు | 47 |
| 26. ఐశ్వర్యమదము | 48 |
| 27. దయావంతులు దీనుల కష్టము చూడలేరు | 49 |

28. ఊరివారి బిడ్డను రాచవారిబిడ్డ కొట్టిన
రాచవారి బిడ్డను దేవుఁడు కొట్టును 49

29. పరుల యున్నతికి అసూయ పడరాదు 50

30. చేసిన ఋణము చెల్లింపక తీఱదు 51

31. ఆశ్రితుని విడువరాదు 52

32. వంచకులు దమ మేలుకొరకే యితరులకు
హిత ముపదేశింతురు 54

33. సత్కీర్తి స్వర్గము కలిగించును 55

34. అపకారికి ఉపకారమే చేయవలయును 57

**మూడవ భాగము**

1. ఆచారము మొదటి ధర్మము 59

2. అల్పున కధికారము వచ్చిన అయినవారిని మఱచిపోవును 59

3. అన్యాయమందుండువానిని తోడబుట్టువులును విడుతురు 60

4. న్యాయమందుండువానికి పశుపక్షులును సాహాయ్యము చేయును 61

5. ఇరువురు కలహించిన మూఁడవవానికి లాభము 62

6. దైవసంకల్పము తప్పింప సాధ్యపడదు 63

7. తన పరువుకొలఁది ప్రవర్తింపవలయును 64

8. చేయఁగూడని పనిని గురువు చెప్పినను చేయరాదు 64

9. లోభము మహాపాపము 66

10. పుణ్యాపాపములు సమభాగములు 67

11. ఉడుతకు ఉడుతాభక్తి 68

12. శరణాగత రక్షణము 69

13. బలవంతునితో విరోధింపరాదు 70
14. అడుగని భక్తునికి దైవమన్నీ యిచ్చును 71
15. జూద మాడరాదు 72
16. వేఁట లాడరాదు 72
17. నీచులు తమ మేలునకై సాధువులకు కీడు చేయుదురు 73
18. తానొక్కటి తలఁచిన దైవమొకటి తలఁచును 74
19. దేవునిసొత్తు నపహరింపరాదు 76
20. ఆశ్రయమును విడువరాదు 77
21. అనసూయ 78
22. తల్లివలెఁ గూతురు 79
23. చండి 79
24. గురుభక్తి 80
25. అప్పుదీసి ముంచరాదు 82
26. శీలము సర్వసంపదలకుఁ గారణము 85
27. అపనింద లాడరాదు 86
28. గొల్లకృష్ణన్న 87
29. బాలరాజు కథ 90

**నాలుగవ భాగము**

1. ఏ దానము మేలనిన నిదానమే మేలు 92
2. ప్రీతితో నిచ్చినది పిడికెఁడే చాలు 97
3. నాడీజంఘుని చరిత్రము 105
4. అంబరీష చరిత్రము 112
5. హరిభక్తులకుఁ బరాభవము లేదు 115

**ఐదవ భాగము**


| | |
|---|---|
| 1. ధర్మవ్యాధ చరిత్రము | 121 |
| 2. శైబ్య చరిత్రము | 135 |
| 3. జడ భరతోపాఖ్యానము | 139 |
| 4. ధ్రువ చరిత్రము | 142 |
| 5. విక్రమార్కుని పూర్వజన్మ కథ | 157 |


**ఆరవ భాగము**


| | |
|---|---|
| 1. మార్కండేయ చరిత్రము | 165 |
| 2. అన్నదానమహిమ | 170 |
| 3. తోడువచ్చునవి పుణ్యపాపములు రెండే | 176 |
| 4. భక్తుల యోగక్షేమములు భగవంతుఁడే వహించును | 186 |
| 5. నిజమైన చండాలుఁ డెవఁడు? | 191 |
| 6. నిజమైన పాపియెవఁడు? | 194 |
| 7. గృహస్థుఁడుత్తముఁడా? సన్న్యాసియుత్తముఁడా? | 198 |
| 8. గండకీ చరిత్రము | 203 |
| 9. వాల్మీకి చరిత్రము | 212 |


**ఏడవ భాగము**


| | |
|---|---|
| 1. సంతృప్తియే పరమసుఖము | 235 |
| 2. ఇంద్రియజయము దుష్కరము | 240 |
| 3. ఇల్ల నారాయణమ్మ | 244 |
| 4. జితక్రోధుఁడు, శిబి | 249 |
| 5. శ్రద్ధానుసారము ఫలము | 252 |

6. మతిలేనిరాజు 259

7. జారయైన రాజదార 260

8. నూఱు వినుము, ఒకటి చెప్పుము 269

**ఎనిమిదవ భాగము**

1. అజామిళోపాఖ్యానము 272

2. కోమటి యుక్తి 290

3. కలిపురుషుఁడు - బ్రాహ్మణుఁడు 293

4. కలియుగ ధర్మములు 295

5. కలికాల సాధుత్వము 301

6. పితృశ్రాద్ధము - మార్జాలబంధనము 302

7. భక్తిలక్షణము 306

8. కామము - భక్తి - లీలాశుకుఁడు 308


* * *

శ్రీరామచంద్రాయనమః

# ఆర్యకథానిధి

## ప్రథమ భాగము

### 1. ఆడి తప్పరాదు

పూర్వము హరిశ్చంద్రుఁడను ఒక రాజు కలఁడు. ఆయన యెన్నఁడు పలికి బొంకినవాఁడు కాఁడు. హరిశ్చంద్రుఁడు అబద్ధమాడఁడని వసిష్ఠుఁడు చెప్పెను. అతనిచేత నబద్ధమాడించెదనని విశ్వామిత్రుఁడు వాదించెను. అప్పుడు విశ్వామిత్రుఁడు హరిశ్చంద్రుని మోసముచేసి రాజ్యమును గుంజుకొనెను. పెండ్లాము తోడను చిన్నకుమారుని తోడను, అడవులకు దఱుమగొట్టెను. మఱియును అప్పు తీసుకున్నాఁడని సాకు పెట్టి హరిశ్చంద్రుని పెండ్లామును కొడుకును అమ్మెను. ఆయననుగూడ నొక మాలవాని కమ్మెను. ఆయన కుమారుని చంపెను. ఇంత చేసినను హరిశ్చంద్రుఁ డసత్యమాడలేదు. విశ్వామిత్రుఁడు తానే ఓడితినని ఒప్పుకొనెను. దేవతలు సంతోషించి హరిశ్చంద్రునికి పుణ్యలోకము లిచ్చిరి.

**ఆ. ధనము గోలువడినఁ, దన యాలుబిడ్డలు**
**నష్టమైన, నెంతకష్టమైన,**
**మానహీనమైనఁ, బ్రాణంబు పోయిన,**
**నాడి తప్ప రెప్పు డనఘమతులు**

### 2. బాలురు తెలియకచేసిన పాపము, తల్లిదండ్రులను బాధించును.

మాండవ్యుఁడను ఒక ఋషి తపస్సు చేయుచుండెను. కొందఱు దొంగలు సొమ్ము దొంగిలించి రాజబంట్లు తఱుము కొనారాఁగా ఆ సొత్తులను ఆ ఋషి ప్రక్కనుంచి పరువెత్తిపోయిరి. భటులువచ్చి ఆ ఋషియే దొంగయనుకొని పట్టుకొనిపోఁగా మెడలో కొఱ్ఱుగుచ్చి వ్రేలదీయుఁడని రాజు ఆజ్ఞాపించెను. తరువాత కొన్నిదినముల కతఁడు దొంగకాఁడని తెలిసి రాజు అతనిని విడిపించెను.

అతఁడు యమధర్మరాజు నొద్దకుపోయి నా కిట్టి శిక్ష యేలచేసితి వనెను. నీవు చిన్నప్పుడు తూనీగల మెడలో సూదుల గ్రుచ్చి ఆడుకొంటివి. కావున నట్టిశిక్ష నీకు కలిగెనని యముఁడు చెప్పెను. "నేను చిన్నతనమునఁ దెలియక చేసితిని. నేను తెలియక చేసినపుడు నా కా పాపమెట్లు వచ్చును? ఆ పాపము నాకు మంచి చెడ్డ చెప్పని నా తల్లిదండ్రులది. నీ వీ ధర్మ మాలోచింపక నాకు శిక్ష విధించితివి. కావున నీవు శూద్రుఁడవుగా భూమిమీఁదఁ బుట్టి దుఃఖము అనుభవింపుము" అని మాండవ్యుడు శపించెను.

**ఆ. బాలురైనవారు, బాల్యంబుననుజేయు**
**పాపముల ఫలంబు వారి తల్లి**
**దండ్రులకు, లభించుఁ దప్పక, కావున,**
**వారు దిద్దవలయు, బాలురకును**

## 3. తల్లిదండ్రులమాట మీఱరాదు

అయోధ్య యను పట్టణమును దశరథుఁడను రాజు పాలించుచుండెను. ఆయన మూడవభార్యపేరు కైకేయి. ఆ రాజు ఒకనాఁడు రాక్షసులతో యుద్ధము చేయబోయెను. కైకేయి కూడఁ జనెను. రాక్షసునిచేత రాజుచిక్కి చావనుండఁగా రెండుమాఱులు ఆమె కాపాడెను. దానికి సంతోషించి రాజు ఆమెకు రెండువరముల నిచ్చెద ననెను. తన యిష్టము వచ్చినప్పుడు కోరుకొనెదనని కైకేయి చెప్పెను. తరువాత కొన్నాళ్ళకు రాజు తన పెద్దభార్య కొడుకయిన శ్రీరామునకు పట్టాభిషేకముచేయఁ బ్రయత్నించెను. అప్పుడు కైకేయి రాజా! నీ విచ్చెదనని చెప్పిన రెండువరముల నా కిప్పు డిమ్మని అడిగెను. ఇచ్చెదను అవి యేవి? అని రాజడుగగా నా కొడుకైన భరతునకు పట్టాభిషేకము చేయుము. శ్రీరాముని పదునాలుగేండ్లు అడవులకు పంపుమనెను. రాజు అసత్యమాడలేక శ్రీరాముని, 'రామా! నీవు పదునాలుగేండ్లు అడవికిపొమ్ము" అనెను. ఏమితప్పుచేసితిని? ఏల పొమ్మనెదవు? అని రాముఁడు అడుగలేదు. తండ్రిమాట మీఱరాదని రాముఁడు అడుగలేదు. తండ్రిమాట మీఱరాదని రాముఁడు అడవులకు పోయెను.

ఆ. తండ్రి చెప్పినట్టు తప్పైన నొప్పైన
వినఁగవలయుఁ గొడుకు ప్రీతితోడఁ
దల్లిదండ్రులాజ్ఞ దాఁటెడు నాతఁడు
సుతుఁడు గాఁడు పాపరతుఁడు గాని

## 4. తాను కష్టపడియైనఁ దల్లిదండ్రుల సుఖపెట్టవలయును

శంతనుఁడను రాజు సత్యవతిని పెండ్లాడఁ గోరెను. సత్యవతికి పుట్టెడి కొడుకునకు నీ తరువాత రాజ్య మిచ్చెదవా? అని సత్యవతి తండ్రి శంతను నడిగెను. "నాకు భీష్ముఁడు పెద్ద కొడుకు గలఁడు. కావున నీయఁజాలను" అని రాజుచెప్పి వెడలిపోయెను. భీష్ముడు ఈవార్తవిని తన తండ్రికోరిక నెఱవేర్పవలయునని సత్యవతి తండ్రియొద్దకుఁ బోయి "అయ్యో! మీ సత్యవతిని మాతండ్రికిచ్చి వివాహము చేయుము" అని వేఁడెను. నీ తండ్రి వెనుక నీవు రాజ్యమును కోరవేని అట్లే ఇచ్చెదనని యతఁడనెను. నేను రాజ్యమును కోరనని భీష్ముఁడు ప్రమాణము చేసెను. నీవు కోరకున్న నీకు పుట్టెడు కొడుకులు కోరకుందురా? యని ఆతఁడడిగెను. నేను పెండ్లియే చేసికొనను అని భీష్ముఁడు ఒట్టుపెట్టుకొనెను. అప్పుడు సత్యవతిని శంతనుఁడు వివాహము చేసికొనెను. భీష్ముఁడు చచ్చువఱకు బ్రహ్మచారిగానే ఉండెను.

ఆ. కలిగెనేని తనకుఁ గష్టంబొ నష్టంబొ
దాని నోర్చియైనఁ దల్లిదండ్రు
లకును సమ్మదంబు సుఖమును గూర్తురు
పుణ్యవంతులైన పురుషు లెందు

## 5. పితృభక్తివలన ఫలము

కౌశికుఁడను ఒక బ్రాహ్మణుఁడు కలఁడు. వాఁడు ముసలి తల్లిదండ్రులతో చెప్పక ఇల్లు విడిచి తపస్సు చేయఁబోయెను. ఒక చెట్టుక్రింద తపస్సు చేయుచుండఁగా నొక కొంగ వానిమీఁద రెట్టవేసెను. కౌశికుఁడు కోపముతో దానిని చంపెను. అప్పుడు మధ్యాహ్నమైయుండెను. వాఁడు ఊరిలో భిక్షమునకుఁబోఁగా నొక ప్రతివత

'నీవు పాపివి. నీవు మిథిలా పురమున నుండు ధర్మవ్యాధుండను పేరుగల కటిక వాని యొద్దకుఁ బోఁగా, అతఁడు వానిని జూచి "నీవు పతివ్రత పంపఁగా జ్ఞానము సంపాదించుకొనుటకు వచ్చితివి కదా" అనెను. నీకెట్లు తెలియు'నని కౌశికుఁడడిగెను. నా యింటికి రమ్మని పిలుచుకొనిపోయి అతఁడు ముసలివారై యున్న తన తల్లిదండ్రులను చూపి యిట్లనెను. "వీరే నాకు దైవము. వీరిని మించిన దైవము నాకు లేదు. వీరినే నేను ప్రతిదినము పూజింతును. వీరికి అన్నివిధముల సుఖము గలిగింతును. వీరి సంతోషమే నా సంతోషము. కావున నా కట్టిజ్ఞానము గలిగినది. నీవు దుష్టుఁడవు. నీ కొఱకై నీ తల్లిదండ్రులు ఏడ్చి యేడ్చి కన్నులు పోవ దిక్కులేక పడియున్నారు. నీవింటికిఁ బోయి వారిని రక్షించి సేవింపు" మని పంపెను. వాఁడు అట్లే చేసి పుణ్యలోకమును సంపాదించెను.

**ఆ. వసుధఁదల్లి దండ్రి ప్రత్యక్ష దేవతల్**
**వారి విడిచి తపముగోరునతడు**
**వీటి పాయసంబు విడనాడి పుల్లియ**
**మెతుకు లేతి తినుచు బ్రతుకువాడు**

## 6. గురుభక్తి

ధౌమ్యుఁడను ఋషికి ఆరుణి ఉపమన్యువు యని యిద్దరు శిష్యులుండిరి. ఒకనాఁడు ధౌమ్యుఁడు ఆరుణిని బిలిచి "శిష్యా! నా పొలములోని నీరంతయు గనిమలను త్రెంచుకొని పోవుచున్నది. నీరు పోకుండ నెట్లైనను జేసిరమ్ము" అని చెప్పి పంపెను. ఆరుణి పోయి చూడ ఒక మనుష్యుని పొడవున కట్ట తెగి నీళ్ళు పోవుచుండెను. రాలతోను మట్టితోను కట్టవేసెను. గాని కట్ట నిలువలేదు. అది చూచి ఆరుణి "నాగురువులు నీళ్ళుపోకుండఁ జేసి రమ్మనిరి. కట్టవేసిన నిలువు లేదు. ఊరకపోయిన గురువునాజ్ఞ చేసినవాఁడను గాను" అని యెంచి తానే యా నీటికి నడ్డముగ పండుకొని నీరు పోకుండఁ జేసెను. పుందువంటి చలి బాధించుచున్నను విసుఁగు కొనక కదలక మెదలక పండుకొని యుండెను. ఎంత సేపయినను శిష్యుఁడు రాలేదు. ఏమిది యని గురువే పొలమునొద్దకు వచ్చి ఆరుణీ ఆరుణీ యని యఱచెను. అయ్యా! ఇచ్చట నీటికి అడ్డము పండుకొని

ఉన్నానని అతఁడఱచి చెప్పెను. అప్పుడు గురు వతని నడతకు సంతోషించి సకలవిద్యలు జ్ఞానము నుపదేశించెను. ఆ జ్ఞానము చేత వాఁడు పుణ్యలోకములను సంపాదించెను.

**ఆ. తనశరీర మిచ్చు తల్లిదండ్రులకంటె**
**గురువు జ్ఞానదాత గొప్పవాఁడు**
**కరము భక్తిగలిగి కష్టంబులకు నోర్చి**
**గురునిఁ గొలువ నిహము పరము గలుగు**

## 7. గురువును ధిక్కరింపరాదు

త్రిశంకుఁడను రాజు దేహముతోడ స్వర్గమునకు పోవలయునని తలఁచెను. దానికొక యుపాయముఁ జెప్పుమని అతఁడు తన గురువగు వసిష్ఠుని అడిగెను. అది నీకు సాధ్యపడదని ఆయన చెప్పెను. ఆ గురువును నిందించి ఆయన కొడుకుల నట్లే అడిగెను. వారును నీకు సాధ్యము కాదనిరి. వారిని రాజు దూషించెను. వారు కోపించి "మాలవాఁడవుకమ్ము" అని శపించిరి. వెంటనే త్రిశంకుఁడు మాలవాఁడయ్యెను. విశ్వామిత్రుఁడు తన తపస్సుచేత త్రిశంకుని స్వర్గమునకు పంపెను. గాని దేవతలు క్రిందఁబడఁద్రోసిరి. ఇప్పుడు త్రిశంకుఁడు స్వర్గమునందును లేక భూమియందును లేక నడుమ వ్రేలాడుచున్నాఁడు. నేఁటికిని రాత్రులయందు దక్షిణపు దిక్కున చుక్కవలె కనఁబడును.

**ఆ. గురువు జ్ఞానదాత గురునాజ్ఞ నడచిన**
**నుభయలోకసుఖము లొందఁ గలుగు**
**గురుని ధిక్కరించు కూళకు రెండు లో**
**కంబులందు సుఖము కలుగఁబోదు**

## 8. సౌభ్రాత్రము

దశరథునకు రాముఁడు, లక్ష్మణుఁడు, భరతుఁడు, శత్రుఘ్నుఁడు అని నలుగురు కొడుకులుండిరి. తన పెండ్లాము మాట విని దశరథుఁడు రాముని

పదునాలుగు సంవత్సరము లడవులందు ఉండc బొమ్మనెను. తండ్రిమాట మీఱలేక రాముcడు తన భార్యతో నడవికిc బోవ సిద్ధపడెను. ఆయనను విడిచి ఉండలేక ఆయన తమ్ముcడు లక్ష్మణుcడుకూడcబోయి అన్నకు వదినెకు భక్తితో సేవలు చేయుచుండెను. రాముc డరణ్యమునకుc బోయినపుడు భరతుcడు, శత్రుఘ్నుcడు యింటలేరు. అన్న అడవికి పోయినాcడని విన్నతోడనే, వారు అన్ని సౌఖ్యములను వదలిపెట్టిరి. నారచీరలు కట్టుకొనిరి, కందమూలములు తినుచుండిరి. అన్నగారి నెంత వేcడుకొనినను ఆయన రానందున ఆయన పాదుకలకు పట్టాభిషేకము చేసి మరల ఊరికి అన్న వచ్చువరకు భరతుcడు భృత్యునివలె పనులు చేయుచుండెను.

**ఆ. ఊర నూర భార్య లొదవంగc గలవార**
**లూర నూర బంధు లుండువారు :**
**అన్నదమ్ము లెందు నబ్బరు గావునc**
**బరమమైత్రి వలయు భ్రాతలందు**

## 9. పొగరు కీడు కలిగించును

పరీక్షితుcడనురాజు వేటకుcబోయి వచ్చునపుడు మిక్కిలి డప్పిగొనెను. ఎక్కడను నీళ్లు అగపడలేదు. ఆ సమీపమందు శమీకుcడను ఋషి తపస్సు చేయుచుండెను. “అయ్యా! దాహము బాధించుచున్నది. నీళ్ళిచ్చెదవా?” యని రాజు ఆయన నడిగెను. ఆయన దేవుని ధ్యానము చేయుచుండుట చేత బదులు చెప్పలేదు. “నేను రాజును. వీడు బీcదబ్రాహ్మణుcడు; నేను పిలిచిన వీcడు పలుకcడు. వీని కింతపొగరా” యని కోపించి అక్కడ చచ్చినపాము ఒకటి ఉండcగా తెచ్చి రాజు ఆ ఋషి మెడలో వేసి పోయెను. తరువాత కొంతసేపటికి ఆయన కుమారుcడు శృంగి అనువాcడు వచ్చి తండ్రిమెడలోని పామునుజూచి భయపడి అఱచెను. అందఱు వచ్చి చూడcగా నది చచ్చినపాము. అదిచూచి శృంగి కోపించి నా తండ్రిమెడలో పామును వేసినవాc డేడుదినములలో పాము కఱచి చచ్చునని శాపము పెట్టెను. ఆ ప్రకారము పరీక్షిత్తు పాముకఱచి చచ్చెను.

ఆ. "తగునిది తగదని మదిలో
వగవక సాధులకుఁ బేదవారికి నెగ్గుల్
మొగిఁ జేయు దుర్వినీతుల
కగు ననిమిత్తాగమంబులైన భయంబుల్"

## 10. ఆశ దుఃఖమును కలిగించును

సృంజయుఁడను రాజు ధనాశగలవాఁడై బంగారు నిచ్చుకొడుకు గావలయునని దేవునిఁ బ్రార్థించెను. ఆయన కోరిక ప్రకారము సువర్ణష్ఠీవియను కొడుకు కలిగెను. వాని చెమట, ఉమ్మి, మూత్రము వాని దేహములోనుండి వచ్చినది. సర్వము బంగారై యుండెను. సృంజయుఁ డాశ దీర బంగారముతోనే ఇండ్లు వాకిండ్లు దొడ్లు మొదలైనవి కట్టించెను. ఇట్లుండగా కొందఱు దొంగలా పిల్లవానిని దొంగిలించుకొని పోయిరి. ఒక అడవిలోనికిఁబోయి వాని కడుపులో బంగారున్న దేమో యని బుద్ధిలేనివారై వారు వాని పొట్ట చీల్చి చంపిరి. రాజు దేశమంతయు వెదకింపఁగా నడవిలో పిల్లవాని శవము కనబడెను.

ఆ. న్యాయమైన మార్గమందుఁ దాఁ గష్టించి
ధనము మితముగాఁగ దగును గూర్ప
వక్రమార్గమునను వచ్చు పెన్విత్తంబు
మొదలు ముంచు తెచ్చుఁ దుదకుఁ గీడు

## 11. త్రాగుబోతులు నాశమగుదురు

యాదవులవంశము లోకమున ప్రసిద్ధము. బలరాముఁడు కృష్ణుఁడను అవతారపురుషులు ఆ వంశమున బుట్టినవారే. యాదవులందఱు మిక్కిలి బలవంతులు. వారిని జయించువారు లోకమున లేకుండిరి. అయినను వారు త్రాగుబోతులు. ఒకనాఁ డందఱు తప్పత్రాగి సముద్రమున వినోదముగ మాటలాడుచుండిరి. అప్పుడొకఁడు మఱియొకని ఎగతాళి చేసెను. త్రాగినమత్తుచేత అది మఱియొకఁడు నవ్వులాటయని తెలియక హాస్యము చేసిన వానినికొట్టెను.

దానమీఁదకలహము పెరిగెను. ఒకప్రక్క సగముగుంపు మఱియొకప్రక్క సగము గుంపు చేరి యుద్ధముచేసి ఒకఁడైన మిగులకుండునట్లందరు చచ్చిరి.

**కం. సారాయంబును యువతియు**
**నారయ నస్వాదువిషము లవి మరగినచోఁ**
**గూరును రోగము దుఃఖము**
**నారక బాధలును నెట్టి నరునకు నైనన్**

### 12. అధికార మున్నదని మిడిసిపడరాదు

పూర్వము నహుషుఁడను గొప్ప రాజుండెను. అతఁడు నూఱు యజ్ఞములు మహాతపస్సుచేసి గొప్పమహిమ సంపాదించెను. దానిచే ఆయనకు ఇంద్రపదవి లభించెను. గొప్పపదవి లభించుటచే నాయన మదముపట్ట తెలివి పోగొట్టుకొని ఇది న్యాయము. ఇది యన్యాయమనునది మఱచెను. కావున పూర్వముండిన ఇంద్రుని భార్యలు దన్ను బెండ్లాడుదని నిర్బంధించెను. అంతియకాక తాను పల్లకిలో కూర్చుండి ఋషులను మోయుఁడని యాజ్ఞాపించెను. అట్లు వారు మోయుచుండినను సంతోషపడక వారిని తొందరగా నడువుఁడని తీవరించి కొట్టెను. ఇతరుని భార్యను బెండ్లాడఁ గోరుటచేత పొగరుచేతను వెంటనే సర్పమయి తలక్రిందుగ నేలమీఁదఁ బడి పెక్కు సంవత్సరములు దుఃఖపడుచుండెను.

**కం. తన కెంత మహిమ యుండినఁ**
**దన కెంతటి భాగ్యమున్న దర్పంబున్నన్**
**వినయము దగు; గర్వించినఁ**
**గను నాశము, నాశ చిహ్న గర్వంబ చుమీ**

### 13. గొప్పవాఁడు పరుల నవమానింపరాదు

యయాతి యను రాజు మిక్కిలి ధర్మమార్గమున ప్రజలను పాలించెను. అంతియకాక ఋషులకంటె నెక్కువగ తపస్సుచేసెను. ఆ పుణ్యఫలముచేత దేహము విడిచిన పిమ్మట అతనిని దేవతలు స్వర్గమునకుఁ

బిలిచికొని పోయిరి. అక్కడ ఇంద్రుఁడాయనను చూచి రాజా! ఇంతటి గొప్ప పదవి లభించుటకు నీవేమి పుణ్యము చేసితి వని అడిగెను. నేననేక ధర్మములు చేసితిని. పెక్కు యాగములు చేసితిని. కోట్లకొలది దానము లిచ్చితిని. ఋషీశ్వరులకంటె నెక్కువ తపము చేసితిని. నాతోపాటు తపస్సు చేసిన ఋషి ఒకఁడైన లేఁడని యయాతి చెప్పెను. ఆ మాటలువిని యింద్రుఁడు నీవు జేసిన వన్ని చెప్పితివి. నిజమే. అయినను నీవు గర్వము గలవాఁడవుగా నున్నావు. అంతేకాక ఇతరుల నవమానించి పలికితివి. ఇట్టి పొగరుపోతులు, డంబములు పలుకువారు స్వర్గముననుండ నర్హులు కారు పొమ్మని మెడబట్టి క్రిందఁబడునట్లు తలక్రిందుగ త్రోసెను.

**కం. తా నెంత యధికుఁడైనను**
**మానితుఁ డగుఁ జుమ్మి వినయ మండన యుక్తిన్**
**గానక కన్నులు నొరు నవ**
**మానించెడి పొగరుఁబోతు మానక చెడెడిన్**

### 14. మనుష్యుఁడుచేయు పనులను దేవుఁడు చూచుచుండును

దుష్యంతుఁడను రాజు వేటకుఁపోయి యచ్చట శకుంతలయను నొక కన్యకను రహస్యముగ పెండ్లాడెను. నిన్ను తరువాత పిలిపించుకొందునని యతఁ డూరికి పోయెను. పిమ్మట శకుంతల కొక కొడుకు పుట్టెను. ఈ కొడుకుపేరు భరతుఁడు. ఆవల నయిదాఱేండ్లకు కొడుకును బిలుచుకొని శకుంతల తానే దుష్యంతుని చూడఁబోయెను. అతఁడప్పుడు సభలోనుండెను. ఈమె సభకుపోయి యీ పిల్లవాఁడు నీ కొడుకు నేను నీ భార్యను. ఆనాఁడు వనములో నీవు నన్ను వివాహము చేసికొంటివి. కావున మమ్ము భరింపుమని యణఁకువతో చెప్పుకొనెను. నీ వసత్యమాడుచున్నావు. నిన్ను నేను పెండ్లి చేసికొనలేదు. పో పొమ్మని రాజు చెప్పెను. శకుంతల యెంత చెప్పినను దుష్యంతుడు వినలేదు.

అప్పుడు శకుంతల దైవమా! మా యిరువురిలో నెవరు సత్యము పలుకుచున్నారో నీకును తెలియదా? యని దేవుని వేఁడుకొనెను. "దుష్యంతా! శకుంతల సత్యము చెప్పుచున్నది. వీఁడు నీకొడుకే" యని యాకాశము నుండి మాట వినవచ్చెను.

**ఆ. కాన రెవ్వ రనుచుఁ గడు రహస్యంబుగఁ**
**జెనఁటిసేఁత నరుఁడు చేయుఁగాని**
**సర్వసాక్షి యగుచు సకలం బెఱుంగుచు**
**నెల్లవేళ నుండు నీశ్వరుండు**

## 15. స్వామి కార్యము శ్రద్ధతోఁ జేయవలెను

హనుమంతుడు సుగ్రీవుని నమ్మినబంటు. తన ప్రభువునకు కష్టకాలము వచ్చి కొండలలో, గుహలలో దాఁగి యున్నప్పుడు ఆయన వెంటనే యుండి కాపాడెను. ఆయన కెట్లు మేలు చేయవచ్చునా యని ఆలోచించుచుండఁగ, రాముఁడు తన భార్యను సీతాదేవిని పోఁగొట్టుకొని వారుండు కొండదగ్గఱకు వచ్చెను. అప్పుడు హనుమంతుఁడు, సుగ్రీవునకు రామలక్ష్మణులకు స్నేహము కుదిర్చెను. రాముఁడు వాలిని చంపివాని రాజ్యము సుగ్రీవునికిచ్చెను. సుగ్రీవుఁడు "హనుమంతా! నాకు మేలుచేసినవారికి నేను మాఱుమేలు చేయవలెను. రామునిభార్య యెచ్చట నున్నదో చూచిర" మ్మనెను. ఆంజనేయుఁడు సముద్రముదాటి లంకకుపోయి సీతను చూచి మాటలాడి యామెకు ధైర్యము చెప్పెను. మరలివచ్చి యా సమాచారము రామునితో చెప్పి ఆయనకు సంతోషము గలిగించెను. యుద్ధములో లక్ష్మణుఁడు మూర్ఛపోఁగా సంజీవిని తెచ్చి యిచ్చి ఆయనను బ్రతికించెను. రాముఁడు సంజీవిని తెచ్చి యిచ్చి ఆయనను బ్రతికించెను రాముఁడు రాకపోయెనను దుఃఖముతో చచ్చుటకు సిద్ధముగా నుండిన భరతునికి రాముఁడు వచ్చుచున్న వార్త చెప్పి ఆయనను బ్రతికించెను. కావున హనుమంతుఁడు చిరంజీవి యయ్యెను.

**ఆ. పనులు పడినవేళ ప్రాలుమాలక యెన్ని**
**శ్రమములైన నోర్చి చతురుఁ డగుచు**
**దనదు ప్రభుని కార్యతంత్రంబుఁ దీర్చెడి**
**ప్రాజ్ఞుఁ డొందు మేలి పదవు లెల్ల**

## 16. స్వామి ద్రోహము చేయరాదు

కుంతిదేవికి కర్ణుఁడు పెద్దకొడుకు ధర్మరాజు, భీముఁడు, అర్జునుఁడు తరువాతి కొడుకులు, కర్ణుఁడు చిన్నప్పుడే పోయి ధర్మరాజునకు విరోధియయిన దుర్యోధనునియొద్దఁ గొలువులోనుండెను. కర్ణుఁడు తమ కన్నయని ధర్మరాజునకుఁ దెలియదు గాని, కర్ణునకు ధర్మరాజు మొదలైనవారు తన తమ్ములని తెలియును. ఎట్టెట్టి సమయములందును కర్ణుఁడు దుర్యోధను పక్షముననే యుండెను. తుదకు ధర్మరాజునకు యుద్ధము తటస్థించెను. అప్పుడు కృష్ణుఁడు కర్ణునితో ధర్మరాజు మొదలైనవారు నీ తమ్ములుగదా నీవు వారితో యుద్ధముచేసి వారిని చంప యత్నించుట న్యాయమా? కనుక వారిపక్షమున నుందువు రమ్మనెను. అప్పుడు కర్ణుఁడు కృష్ణునితో నిట్లు చెప్పెను. "నన్నుఁ జిన్నప్పటినుండి దుర్యోధనుఁడు సాఁకినాడు. నాదేహము వాని సొత్తు తిని పెరిఁగినది. ఇప్పుడు నాతో వానికి పనిపడినది. అక్కఱవేళ వానిని నే నెట్లు విడువ వచ్చును? ఇన్ని దినములు వాని యుప్పుదిని కార్యము వచ్చినపుడు తోడుపడకపోవుట స్వామిద్రోహము కాదా. నేను రాను" అనెను. తరువాత యుద్ధములోఁ దన ప్రాణము పోవువఱకు దుర్యోధనుని కర్ణుఁడు వదలలేదు.

**ఆ. తెలిపి కలియరాదు, కలిసి తెలియరాదు,**
**పరులసొమ్ముఁ దినుచు వారి కెదరు**
**కలుగ నెపము చెప్పి కడకుఁ దొలంగుట**
**ద్రోహమగును మిగుల దోష మగును**

## 17. దొంగతనము చేయరాదు

వసిష్ఠుఁడను మహాఋషి యొక యడవిలో తపస్సు చేయుచుండెను. ఆయనయొద్ద నందినియను కామధేనువుండెను. ఏది కోరినను దాని నిచ్చు శక్తి యా యావునకుఁ గలదు. పసువు లనువారొక్కజాతి దేవతలు. వారొకనాఁడు భార్యలతోడ నా ఋషి యుండు చోటికి పోయిరి. అప్పుడొక స్త్రీ ఆ యావు తనకు కావలయునని పెనిమిటి నడిగెను. వాఁడును భార్యకు సంతోషము కలిగించుటకై దానిని దొంగతనముగా పట్టుకొనిపోయెను. తక్కినవారట్లు చేయఁగూడదని చెప్పక చూచుచుండిరి. వసిష్ఠుఁడది తెలిసికొని "మీరు భూలోకమున మనుష్యులుగా పుట్టుఁడు" అని శపించెను. వారు స్వర్గమును విడిచి మనుష్యులుగా పుట్టిరి.

**కం. తన ప్రియురాలికిఁ బ్రియమని**
**దనకుఁ బ్రియంబనుచుఁ బరుల ద్రవ్యముఁ గొనినన్**
**దన పదవిఁ బాసి యెంతటి**
**ఘనుఁ డేనియు నొందగల్గు గష్టము లెల్లన్**

## 18. చెఱపకురా చెడెదవు

దుర్యోధనుఁడను నొకరాజు కలఁడు. అతని పిన్నతండ్రి కొడుకులు ధర్మరాజు. భీముఁడు, అర్జునుఁడు, నకులుఁడు, సహదేవుఁడు అనువారు. వీరిని చంపి వీరి రాజ్యము తానేల వలయునని దుర్యోధనుఁడు తలఁచెను. దుర్యోధనుఁడు చెడ్డ మనస్సు కలవాఁడు. కావున భీమునికి అన్నములో విషము కలిపి పెట్టెను. ఆయనను పాములచేత కఱపించెను. నిద్రపోవుచుండ నీటిలో త్రోయించెను. వారందఱు నిద్దురపోవుచుండ వారు కాపురముండు ఇంటికి నిప్పుపెట్టించెను. ధర్మరాజు మొదలయినవారు ధర్మము తప్పనివారు. కావున వారి కేకీడు కలుగలేదు. తుదకు దుర్యోధనుఁడే నూర్గురు తమ్ములతోను, చుట్టములతోను, స్నేహితులతోను చచ్చెను. పరుల ధనమున కాశపడరాదు.

ఆ. పరులధనముఁ జూచి పరుల విద్యనుజూచి
పరుల పదవిఁ జూచి వ్యసనపడఁగఁ
దగదు, వారికాపదలఁ గూర్పఁ దలఁచినఁ
దనకె కీడు గూర్చు దైవమెపుడు

## 19. శ్రద్ధకొలది విద్య

ఏకలవ్యుఁ డనువాఁ డొక యెఱుకవాఁడు. ఆతఁడు తనకు విలువిద్య నేర్పుమని ద్రోణాచార్యు నడిగెను. "నీ కీ విద్య నేర్పిన జంతువులను చంపుదువు. ఆ పాపము నాకు వచ్చును గనుక నేను నీకు నేర్పను" అని ద్రోణాచార్యుఁడు చెప్పెను. ఏకలవ్యుఁ డింటికిపోయి మట్టితో ద్రోణాచార్యులవలె ప్రతిమనుచేసి యుంచుకొని ప్రతిదినము దానిని పూజించుచుండెను. ఆ ద్రోణుఁడే తనకు విద్యనేర్పుచున్నట్లెంచుకొని విద్యను శ్రద్ధతో నలవాటు చేసికొనెను. ఈ యభ్యాసము చేతను ద్రోణునియందుఁగల భక్తిచేతను ఏకలవ్యుఁడు ద్రోణాచార్యునికి ముఖ్యశిష్యుఁడగు నర్జునునికంటె విలువిద్యయందు నేర్పరి యయ్యెను.

ఆ. శ్రద్ధలేక యున్న జదువేమియు రాదు :
శ్రద్ధయున్న వచ్చు జదువులెల్ల,
మట్టి బొమ్మనైన మంచి భక్తి భజింప
నందు దేవు డుండి యన్ని యిచ్చు

## 20. చదువునప్పుడు దిక్కులు చూడరాదు

తాను నేర్పిన విలువిద్యయందు తనశిష్యులలో ఎవఁడు నేర్పరియో తెలియఁగోరి ద్రోణుఁడు వారిని అందఱను ఒక చెట్టుదగ్గఱకు పిలుచుకొని పోయెను. ఆ చెట్టు కొనకొమ్మకొక బచ్చెన చిలుకను కట్టెను. ఒక్కొక్క శిష్యుని పిలిచి "ఆ చిలుక తల తెగవ్రేయవలయును. గుఱిచూడుము" అనెను. శిష్యుఁడు చూచితినని చెప్పెను. గురువు "నన్ను చూడుము"

అనెను. చూచితినని శిష్యుఁడు పలికెను. "చెట్టు మొదలు చూడుము. తరువాత నీ తోడివారిని చూడు" మని ద్రోణుఁడు చెప్పెను. "చూచితి" నని శిష్యుఁడు బదులు చెప్పెను. "నీవు గుఱికొట్టలేవు. నీ దృష్టి చెదిరినది పో" అని గురువు అతనిఁ బంపెను. అందరు శిష్యులు ఇట్టులే చెప్పిరి. కడపట అర్జునుని బిలిచి అందరకు చెప్పినట్టే చెప్పెను. అర్జునుఁడు "నాకు చిలుక తల తప్ప మఱియేదియు కనఁబడలే" దనెను. సరి కొట్టుము అని ద్రోణుఁడు అనఁగా చిలుక తలను అర్జునుఁడు తెగవ్రేసెను.

**తే. చేయుపనియందు దృష్టియుఁ జిత్తముంచి**
**చేసిననె యది సఫలమై సిద్ధిఁ బొందుఁ**
**జేయి యొకచోట నొకచోటఁ జిత్తముంప**
**ఫలము కలుగదు గాసియుఁ దొలఁగిపోదు**

## 21. నమ్మినవారిని చెఱుపరాదు

శిబిచక్రవర్తి యొకనాఁడు ఉద్యానవనములోఁ గూర్చుండి యుండెను. అప్పుడు ఒక పావురము తటాలున వచ్చి యతనిఒడిలోఁ బడి "కాపాడుము కాపాడుము" అనెను. ఇంతలో ఒక డేగ దానిని తఱుముకొని వచ్చి "అయ్యా! యది నాకాహారము. దీనిని నాకి"మ్మనెను. "ఇది నా శరణుజొచ్చినది. ఈయను" అని రాజు చెప్పెను. "నేను ఆఁకలిచే చచ్చుచున్నాను. నేను జచ్చితినా జీవహింస చేసిన పాపము నీకుఁ గలుగును" అని డేగ చెప్పెను. నీ యాకలిదీఱ నీకు వేఱు మాంసమిచ్చెదని రాజు చెప్పెను. "ఆ పావురము నెత్తుగల నీ మాంసమును ఇమ్ము" అని డేగ యడిగెను. అట్టులే ఇచ్చెదనని జెప్పి రాజు పావురమును తక్కెడలో నొక ప్రక్కనుంచి తన తొడకోసి మాంసమును దీసి మఱియొక ప్రక్కనుంచెను. ఎంతకోసి పెట్టినను పావురము తూనికకు సరిగాలేదు. అప్పుడు నన్నే భక్షింపుమని రాజు చెప్పెను. దేవతలు సంతోషించి శిబికి పుణ్యలోకముల నిచ్చిరి.

తే. తన్ను నమ్మినవానిని దనను ప్రాణ
మిచ్చియైనను గాచుటే కృత్య మెపుడు;
కానకుండినఁ దన పుణ్యకాండ మెల్ల
వాఁడు కొని యిచ్చుఁ దనపాప వారమెల్ల

### 22. నెపములేని సత్యము జెప్పవలయును

భారతయుద్ధమున ద్రోణాచార్యుఁడు దుర్యోధను పక్షమున యుద్ధము చేయుచుండెను. ధర్మరాజు తాను యుద్ధమున ఓడిపోవుదునని తలఁచి ద్రోణాచార్యుని చంపుట కొక యుపాయము వెదకెను. పట్టరాని దుఃఖము కలిగించు వార్త వినినతోడనే ద్రోణుఁడు యుద్ధముచేయక చచ్చునని ఆయన యెఱుఁగును. ద్రోణుని కొడుకు అశ్వత్థామ. ఆ యుద్ధములో అశ్వత్థామ యను ఏనుఁగొకటి చచ్చెను. ఆ నెపము చేత నశ్వత్థామ చచ్చెనని ద్రోణుడు తలఁచి తానుకూడ వెంటనే మరణించెను. అంతవఱకు ధర్మరాజు తేరు నేలతగులక తిరుగుచుండెను. అసత్యము పలికిన వెంటనే తేరు నేలమీద బడెను. ఈ యొక అబద్ధమాడుట చేతనే ధర్మరాజు నరకమును చూడఁబోయెను.

ఆ. నెపము లేక యుండు నిజ మాడ వలయును
నెపముతోడి నిజము నిజముకాదు,
కల్లకంటె నిదియు కావించుఁగీడును
గాన సత్యనియతి కరము శుభము

### 23. తండ్రిమాట మీఱువాఁడు చెడును

యయాతి యను రాజునకు దేవయాని, శర్మిష్ఠ యని యిద్దరు భార్యలు కలరు. యయాతికి శర్మిష్ఠపై ప్రీతిమెండు కావున దేవయానితండ్రి శుక్రాచార్యుఁడు కోపించి “నీవు ముసలివాఁడవు కమ్ము” అన యల్లుని శపించెను. క్షమింపుమని యయాతి మామగారిని వేఁడుకొనెను. “యయాతి! నీ ముసలి తనము నీ కొడుకులలో నొకనికిమ్ము. అట్లు నీ

ముసలితనము తీసికొన్న కొడుకే నీ వెనుక నీ రాజ్యము పాలింప నర్హుఁడు" అని శుక్రుఁడు చెప్పెను. యయాతి ముందుగ దేవయాని కొడుకుల నడిగెను. నీ ముసలితనము మాకు వలదని వారు చెప్పిరి. తరువాత శర్మిష్ఠకొడుకుల నడిగెను. వారిలోఁ జిన్నవాఁడు పురువనువాఁడు "తండ్రీ! నాకు నష్టమైనను, కష్టమైనను మీ ఆజ్ఞ మీఱను. నన్నడుగ నేల? పుత్రా! నీ విట్లు చేయుమనినఁ జేయుటకు సిద్ధముగ నున్నాను" అని తండ్రి ముసలితనము తీసికొని తన వయస్సు నాయన కిచ్చెను. దాని వలన పురువునకు రాజ్యము, పుణ్యలోకమును కలిగెను. తండ్రిమాట విననివారు రెండులోకముల భ్రష్టులైరి.

**ఆ. తన కనిష్టమైనపని చెప్పె నేనియుఁ**
**దగదు ధిక్కరింపఁ దండ్రి నెపుడు**
**దైవవాక్య మనుచుఁ దలఁచి కావించిన**
**నుభయలోకసుఖము లొందు నరుఁడు**

## 24. రుక్మాంగదుఁడు

రుక్మాంగదుఁ డను రాజు ఏకాదశీ వ్రతము తాను చేయుచు జనులచేతఁ జేయించుచు నుండెను. ఆ పుణ్యముచేత నందఱు స్వర్గమునకుఁ బోవుచుండిరి. యమధర్మరాజునకు పనిలేకుండెను. అప్పుడు బ్రహ్మదేవుఁడు మోహిని యను దానిని పుట్టించి ఆ రాజుదగ్గఱకుఁ బంపెను. ఆ రాజు దానిని బెండ్లి చేసికొనెను. తరువాత ఒక యేకాదశి రాఁగా నా దినము మోహినియింటికి రాజు పోలేదు. దేవుని ధ్యానించుచు భజన చేయుచుండెను. అది రాజును ఏకాదశీ వ్రతము విడిచి తన యింటికి రమ్మని బలవంత పెట్టెను. నీ వేమడిగినను ఇచ్చెదను కాని నే నేకాదశీవ్రతము మానను అని రాజు మోహినితోఁ జెప్పెను. అటులైన నీకొడుకుతల యిమ్మని మోహిని అడిగెను రాజు సత్యముదప్ప నిష్టములేక కొడుకుతల తెగఁగొట్ట యత్నించెను. అప్పుడు విష్ణువు ప్రత్యక్షమై యాయనకు మోక్షమిచ్చెను.

**ఆ. తెలివిలేని వారి పలుకుల బేల్పోక**
**భాగ్యభోగములను బాసియైన**
**సత్యమందు నిలిచి చంపి పుత్రుని నైన**
**బుద్ధిశాలి చేయుఁ బుణ్యములను**

## 25. మద్యపానము మహాపాతకము

శుక్రాచార్యుఁడు రాక్షసుల కులగురువు. చచ్చిన వారిని బ్రతికించు మంత్ర మాయనకుఁ దెలిసియుండెను. దాని నేర్చుకొనవలయునని కచుఁడనువాఁడు ఆయనయొద్ద శుశ్రూష చేయుచుండెను. ఈతని యభిప్రాయము రాక్షసులకుఁ దెలిసి ఒకనాఁడు కచుని వారు చంపిరి. శుక్రాచార్యుడు కచుని బ్రతికించెను. వారు ఎన్నిమార్లు చంపినను ఆయన బ్రతికించుచుండెను. ఈ శుక్రాచార్యులకు సారాయము త్రాగు చెడ్డ యలవాటుండెను. అది తెలిసి రాక్షసులు కచుని చంపి కాల్చి బూడిదను శుక్రుఁడు త్రాగు సారాయములో కలిపి యిచ్చిరి. ఆయన తెలియక త్రాగెను. తరువాత ఎక్కడ వెదకినను కచుఁడు కనఁబడలేదు. శుక్రుఁడు జ్ఞానదృష్టిచేత రాక్షసులు చేసిన మోసము, కచుని బూడిద తన కడుపులోనే యుండుట తెలిసికొని విచారపడి యా కచుని తన కడుపులోనే బ్రతికించెను. కచుఁడు బ్రతికి "అయ్యా! నేను బ్రతికితిని. నేను వెలుపలి కెట్లు రావలయును?" యని యడిగెను. అప్పుడు వేఱుపాయములేక వానికి మృతసంజీవియను చచ్చినవాని బ్రతికించు మంత్రము నేర్పి నా యుదరము పగులఁ దీసికొని రమ్ము. వెలికివచ్చి నన్ను మఱల బ్రతికింపు మనెను. కచుఁడట్టులే చేసెను. అప్పుడు శుక్రుఁడు సారాయమువలనిదోషము తెలిసికొని దానిని ఎవ్వరును త్రాగరాదని కట్టడిచేసెను.

**ఆ. ధనము నాశపఱుచు తనువును జెఱుచును**
**బుద్ధి విభ్రమంబుఁ బుట్టఁజేయుఁ,**

**చులకఁ జూతు రెల్ల సుజనులు, గావున**
**మదిరఁ గ్రోలఁదగదు మనుజుఁడెపుడు**

## 26. ఆలుమగల ప్రేమ

రురుఁడను బ్రాహ్మణునకు ప్రమద్వరయను భార్య కలదు. ఆమె వయస్సున చిన్నదయినను సుగుణలములయందుఁ బెద్దదై యుండెను. ఆ యిరువురకు దేహములే భేదముగాని ప్రాణ మొకటిగానే ఉండెను. ఒకరిని విడిచి ఒకరు నిమిషమైన ఉండఁజాలకుండిరి. ఇట్లుండ ఒకనాఁడు ఆమె బయట తిరుగుచుండఁగా తటాలున నొక పాము వచ్చి ఆమెను కఱచెను. ఆ విషముచే ఆ చిన్నది మృతిచెందెను. మరణించిన యిల్లాలిని జూచి రురుఁడు హాయని ఏడ్చి పిచ్చిపట్టిన వానివలెనయ్యెను. “ఓ దేవతలారా! నేను అసత్య మాడనేని దేవునియందు భక్తిగలవాఁడ నైతినేని నా భార్యను బ్రతికింపరే” యని యేడ్చెను. అప్పుడు దేవదూత యిట్లు చెప్పెను. “రురూ! నీ యాయుస్సులో సగము నీ భార్యకిచ్చిన బ్రతుకును” ఆ మాటవిని రురుఁ డట్లే చేసి భార్యను బ్రతికించుకొనెను.

**ఆ. భార్యమీఁదఁ బతికిఁ బతిమీఁద భార్యకుఁ**
**గొఱఁతలేని ప్రేమ కుదురవలయు;**
**ఆలు మగఁడు తగవు లాడుచుండిన నది**
**వల్లకాడు గాని యిల్లు గాదు**

## 27. దమయంతి

నలచక్రవర్తి భార్యపేరు దమయంతి. ఆమె పెనిమిటి పుష్కరుఁడను వానితో జూదమాడి తన రాజ్యము ధనమునంతయు ఓడిపోయెను. పుష్కరుఁడు నలచక్రవర్తిని కట్టువస్త్రముతో ఊరు వెడలఁ గొట్టెను. పతియే దైవమని యెంచినట్టి పతివ్రత కావున దమయంతి మగనితోడ వనములకుఁ బోయెను. తన మగని కట్టువస్త్రము పక్షులెత్తుకొని పోఁగా తన చీరయందు

సగము చించి ఆయన కిచ్చెను. ఆమె నిద్రపోవుచుండఁగా నామె నొంటిగ విడిచి నలుఁడు వెడలిపోయెను. ఆమెను ఒక యెఱుకువాఁడు పట్టుకొన రాఁగా ఆమె వానిని శపించెను. వెంటనే ఆ యెఱుకువాఁడు భస్మమైపోయెను. ఆమె మగనియందు భక్తి గలది గనుక మనుష్యుల జంపు పులులు, సింహములు, ఏనుఁగులు కూడ నామెను జూచి తొలఁగిపోయెను. ఆమె పెనిమిటిని గానక ఏడ్చి యేడ్చి పుట్టి నిల్లుచేరి ఉపాయముచేత నలుని తెలుసుకొని రప్పించెను. తరువాత వారు సుఖముగ నుండిరి.

**కం. పతి తన్నవమానించిన**
**గతిమాలిన మతియుఁ జెడినఁ గష్టుండైనన్**
**సతి తనశీలము విడువక**
**యతనిన్ రక్షింపవలయు ననవరతంబున్**

### 28. సావిత్రి

ద్యుమత్సేనుఁ డను రాజుకొడుకు సత్యవంతుఁడు. రాజ్యమును పోఁగొట్టుకొని గ్రుడ్డివారై అడవిలో నుండు తల్లిదండ్రులయొద్ద అతఁడు ఉండెను. అతఁడు సత్యము తప్పనివాఁడు. ఆయన మంచిగుణములకు మెచ్చుకొని సావిత్రి అను కన్యక ఆయనను బెండ్లాడెను. పెండ్లికి మునుపే "సావిత్రీ! పెండ్లియయిన సంవత్సరమునకు సరిగా సత్యవంతుఁడు మరణించును" అని నారదుడు ఆమెతో చెప్పెను. ఆమె నవ్వుచు పతివ్రతలకు వైధవ్యము గలదాయని యడిగెను. లేదని నారదుఁడు చెప్పిపోయెను. సావిత్రి దినము లెంచుకొనుచుండెను. మరణము కలుగవలసిననాఁడు సత్యవంతుఁ డడవికిపోయెను. సావిత్రికూడఁ బోయెను. సత్యవంతుఁడు అలసి పండుకొని ఉండఁగా యముఁడు వచ్చి ఆయన ప్రాణములను దీసికొనిపోయెను. సావిత్రికూడఁ బోయి ఆయనను స్తోత్రము చేసెను. మగనియందు ఆమెకుగల భక్తికి యముఁడు మెచ్చుకొని సత్యవంతుని బ్రతికించెను.

కం. సతి చేసిన పాపంబునఁ
బతి తొలుతం జచ్చుఁ; బుణ్యవతియగు సతికిన్
బతి నెడఁబాయుట కలుగదు;
క్షితియందును బరమునందుఁ జెందుసుఖముల్

## 29. గాంధారి

గాంధారి సుబలరాజు కూతురు. అల్లుఁడు భాగ్యవంతుఁడుగాను మహారాజుగాను ఉండవలయునని సుబలరాజు ధృతరాష్ట్రునికి గాంధారినిచ్చి వివాహము చేసెను. ధృతరాష్ట్రుఁడు పుట్టుగ్రుడ్డి. తండ్రిమాట మీఱక గాంధారి గ్రుడ్డి రాజునే పెండ్లిచేసుకొనెను. కాని పతివ్రత కావునఁ దనమగఁడు లోకమునుజూచి సంతోషపడకుండఁగా తనకుమాత్ర మట్టి సంతోష మేలయని కన్నులకు వస్త్రము కట్టుకొనెను. ఆమె కొడుకు దుర్యోధనుఁడు. వాడు మిక్కిలి దుష్టుఁడు. వాఁడు ధర్మరాజుతో నన్యాయ యుద్ధముచేసెను. నాతల్లి పతివ్రతగదా ఆమె దీవించిన నాకు గెలుపు వచ్చును" అని దుర్యోధనుఁడు తలఁచి యుద్ధమునకుఁ బోవుటకు ముందు ఆమెకు నమస్కరించి జయము గలుగ దీవింపుమనెను. అన్నిటికంటె ధర్మము శ్రేష్ఠమని తెలిసి ధర్మమున్నచోట జయముండును అని ఆమె దీవించెను. గాని అధర్మమం దున్నను కొడుకే జయింపవలెనని దీవింపలేదు.

కం. పతిసుఖమే తనసుఖ మని
పతి దుఃఖమె తనకు దుఃఖభరమని మదిలో
సతతముఁ దలఁచుచుఁ బతికిని
హితగతి వర్తించు సతియె కృతకృత్య సుమీ

## 30. సీత

సీతాదేవి జనకరాజు కూఁతురు. శ్రీరామచంద్రుని భార్య. తండ్రి యాజ్ఞప్రకారము శ్రీరాముఁడు అడవికిఁబోవునపుడు పతివ్రతకు భర్తను

విడిచియుండుట ప్రాణము విడుచుటే అని తలఁచి తానును కూడఁ బోయెను. అడవులయందెన్నికష్టములు వచ్చినను మనస్సున నొచ్చుకొన్నదిగాదు. రావణాసురుఁడు ఆమెను బలవంతముగ నెత్తుకొనిపోయెను. తన్ను పెండ్లి చేసుకొమ్మని వాఁడు ఆమెను ఎంతెంతో వేఁడుకొనెను. బెదరించెను. ఆశ కొలిపెను. ఏమి చెప్పినను సీత లోపడలేదు. దమయంతి యెఱుకువానిని జంపినట్టు చంపఁగలిగియు రావణుని ఆమె చంపలేదు. తాను రావణుని జంపిన తన భర్తకు అపకీర్తి వచ్చునని ఆమె తలంపు. రావణుఁడొక్కఁడేగాక వానివారందఱు నట్టి దుష్టులే; వారి నందఱను భర్తచేఁ జంపించినఁగాని లోకములోని కులస్త్రీలకు బాధతొలఁగదు. అని ఆమె తలఁచెను. లోకములోని పతివ్రతలకు భయము తొలగించుటకై యామె పదినెలలు నిర్బంధములోనుండెను. రాక్షసుల బాధనుండి తప్పించెదను రమ్మని హనుమంతుఁడు పిలిచినను పోలేదు. పరపురుషుని తాఁకనని చెప్పెను. తన్ను బాధపెట్టిన రాక్షస స్త్రీలను హనుమంతుఁడు చంపెద ననగా వలదని వారిని కాపాడెను. భర్తచేత దుష్టులనందఱఁ జంపించెను.

**కం. పతిని విడనాడకుండుట**
**పతిధర్మమునందు నుంట, పతి కెల్లపుడున్**
**హితమే కూర్చుట. దయయును,**
**బతిపైఁ గినియమియును, సాధ్వి వరలక్షణముల్**

## 31. చంద్రమతి

చంద్రమతి హరిశ్చంద్రుఁ డను చక్రవర్తి భార్య. విశ్వామిత్రుడు హరిశ్చంద్రుని మోసగించి యడవులపాలు చేసినపుడు తానును బిడ్డ నెత్తుకొనిపోయి యెన్ని కష్టములో యనుభవించెను. కారుచిచ్చు తమ్ముఁ జంపుటకు రాఁగాఁదన పాతివ్రత్యముచే దాని నార్పెను. తన మగని అప్పుబాధ దీర్చుటకుఁగాను దానొక నీచునకు దాసిగా నమ్ముడుపోయెను.

వాఁడు పెట్టిన బాధలన్నిటి నోర్చుకొనెను. అన్యాయముగా విశ్వామిత్రుఁడు ఆమె బిడ్డను జంపి రాచబిడ్డను ఆమె చంపినట్టు ఆమెపై నేరము పెట్టించెను. దానికి హరిశ్చంద్రుఁడే ఆమె తల దెగఁగొట్టవలసినట్టు రాజాజ్ఞ చేసెను. హరిశ్చంద్రుఁడనుమానించుచుండగాఁ సత్యము తప్ప రాదుసుమా యని యాయనకు ఆమె బోధించెను. హరిశ్చఁద్రునకు వచ్చిన గండములు చంద్రమతి మహిమ వలననే తొలఁగిపోయెను.

**తే. సుఖము లిడువేళఁ శుశ్రూషచేసి**
**యడుగులకు మడుఁగుల నిడి యాపదలను**
**వీడి చనునది చెడిపెయౌ; వెలఁది పుణ్య**
**వంతురాలయి కష్టముల్ పాపుఁ బతికి**

## 32. సుకన్య

సుకన్య శర్యాతి రాజుపుత్రిక. ఒకనాఁడామె తండ్రి తోడవనమునకుఁ బోయెను. అచ్చట నొక పుట్టలో చ్యవనుఁడను ముని తపస్సు చేయుచుండెను. ఆమె ఆడుకొనుచుఁ బోయి ఆ పుట్టలో తొంగిచూచెను. చీకటిపుట్టలో ముని కన్నులు మెఱయుచుండెను. అవి మిణుఁగురు బూచులనుకొని పిల్లతనముచేత పుల్లతో ఆమె వానిని పొడిచెను. మునికి కన్నులుపోయెను. ఈ సమాచారము ఆయనకుఁ దెలిసి ముని శపింపకుండుటకై రాజు చ్యవనునకు సుకన్య నిచ్చి పెండ్లి చేసెను. ఆమె తండ్రి చెప్పినట్లు నడచుకొనెను. వివాహమైన తరువాత పెనిమిటియే దైవమని అన్నివిధములు సేవలు ఆయనకు ఆమె చేయుచుండెను. అశ్విని దేవతలు ఆమె మనస్సు పరీక్షించి మెచ్చుకొని నీ భర్తకు కన్నులువచ్చునట్లు చేసెదము. నీకు సంతోషమా? అని అడిగిరి. నా పతినడుగుఁడు. ఆయన కేది సంతోషమో నా కదియే సంతోషమనెను. అప్పుడు వారు మెచ్చుకొని చ్యవనునకు కన్నులు వయస్సునిచ్చిరి. ఆమె దివ్యభోగముల నెల్లననుభవించి సుఖించెను.

కం. తనకంటెఁ దల్లిదండ్రులు
తన పతియున్ విజ్ఞులనుచుఁ దలఁచుచు వారల్
వొనరింపు మనిన కార్యము
మనసార నొనర్పవలయు మానిని ప్రీతిన్

## 33. భక్తిలేని పూజ పత్రిచేటు

సత్యభామ నారదునిచూచి "మునీశ్వరా! మఱుసటి జన్మమున నాకు శ్రీకృష్ణుఁడే పతికావలయును. ఉపాయము చెప్పుమా" అని అడిగెను. ఇప్పుడు ఏది దానము చేసెదవో అదే మఱుజన్మమున నీకుఁగలుగును. కావున నీ మగనిని దాన మిమ్మని నారదుఁడు చెప్పెను. ఆమె సవతులతో అందఱతోఁ జెప్పి శ్రీకృష్ణునినారదునికే శాస్త్రప్రకారము దానము చేసెను. ఒకరికి దానమిచ్చినది మరల మేము వాడుకొనరాదు గదా? మా గతియేమి? అని సత్యభామ నారదు నడిగెను. కృష్ణునియెత్తు ధనముతూఁచి నాకిచ్చి కృష్ణుని తీసుకొనుమని నారదుఁడు చెప్పెను. అట్టులే కానిమ్మని కృష్ణుని త్రాసులో ఒక ప్రక్కనుంచి సత్యభామ మొదలైన కృష్ణుని భార్యలందరు రుక్మిణిదేవి తప్పఁ దమసొమ్ములు వస్త్రములు లోనైన వన్నియు మఱియొక ప్రక్కనుంచి తూఁచినను సరిపోలేదు. ఏమిరా గతి దైవమా యని వారాలోచించుచుండిరి. పెద్ద భార్య రుక్మిణి స్నానముచేసి మడుఁగుచీర కట్టుకొని మగనిని ధ్యానము చేయుచు త్రాసులోని సొమ్ములన్ని తీసివేయించి వాని బదులు ఒక తులసీదళ ముంచెను. వెంటనే ముల్లు తులసీదళము ప్రక్కకు వ్రాలెను. స్త్రీలు తులసీదళము నారదునకిచ్చి కృష్ణుని గ్రహించిరి.

ఆ. భక్తిలేక వేయి వరహాల నిచ్చినఁ
దృప్తిపడఁడు సుమ్ము దేవుఁ డెపుడు
భక్తితోడ నిచ్చు ఫలమొ పువ్వొ నీరొ
దళమొ యారగించుఁ దనివిదీర

## 34. సతాద్రౌపదీ సంవాదము

ఒకనాఁడు సత్యభామ ద్రౌపదిని జూచి యిట్లడిగెను. ద్రౌపదీ! నీకు ఏవురు మగలు. అందఱు నీమీఁద నెంతో ప్రేమతోనున్నారు. నాకు శ్రీకృష్ణుఁడొకడే భర్త. అయినను ఆయన నాకు వశుఁడు కాడు. నీ మగలకు నీవేదైన మందు పెట్టితివా? మంత్రము వేసితివా? మాయ చేసితివా? అనెను. ఆ మాటలకు ద్రౌపది అసహ్యించుకొని యిట్లుచెప్పెను. నీ మందులు, మంత్రములు, మాయలు నే నెఱుఁగను. నా మగలకంటె నేనే ముందుగ నిద్రలేతును. నేను పాదుమొగముతో నా భర్తలయెదుటికి పోను. వారికి కావలసిన సుఖములనన్నిటిని నేనే కూర్తును. వారికి వంట నేనే చేయుదును. నేనే వడ్డింతును. వారికి తాంబూలము నేనే యిచ్చెదను. వారికి పఱుపులు నేనే పరుతును. ఈ పనులకు నేను దాసిని పంపను, వారి వస్త్రములు శుభ్రముగ నుంచి సమయ మెఱిఁగి యిచ్చుచుందును. వారు నాతో చెప్పిన రహస్యము నేనెవరికిని చెప్పను. వారు నామీఁద కోపించినను నేను బదులు పలుకను. కోపింపను. పొరుగిండ్లు తిరుగఁబోను. చెడ్డస్త్రీల సహవాసము చేయను. వారే పని చెప్పిన నేనే చేయుదును. వారు నాచేతి కిచ్చిన ధనము గవ్వయైన పనికిమాలిన వెచ్చముచేయను. వారికిచెప్పక యేమాత్రమైన నేను వాడుకొనను. లెక్క సరిగా చెప్పుదును. మందులు పెట్టితివా మగనికి రోగమువచ్చి చచ్చును. మంత్రతంత్రములు చేసితివా పిచ్చిపట్టును. నీకే కష్టము, నష్టము. నీ నడవడి తెలిసెనా నీ భర్త నిన్ను త్రాఁచుపామువలెఁ జూచును. పదిమందిలో పరువు పోవును.

**ఆ. సాధుగుణముచేత సద్వినయముచేతఁ**
**బ్రీతిచేత మంచి రీతిచేత**
**మగఁడు వశ్యుఁడగుచు మక్కువగూర్చును**
**సాధ్వియైన యట్టి చంద్రముఖికి**

*శ్రీరామార్పణమస్తు*

* * *

# రెండవ భాగము

## 1. భగవంతుఁడు సర్వవ్యాపి

పూర్వము హిరణ్యకశిపుఁడను రాక్షసుఁడు ఒకఁ డుండెను. వాఁడు తపస్సుచేసి లోకములో ప్రాణము గలదానిచేతఁ గాని లేనిదాని చేతఁ గాని ఇంటిలోఁ గాని బయలఁ గాని ఆకాశమందుఁ గాని భూమిమీఁదఁగాని మనుష్యులచేతఁ గాని మృగములచేతఁ గాని దేవతలచేతఁ గాని చావు లేకుండ బ్రహ్మచేత వరము తీసికొని గర్వించి అందఱను బాధించుచు లోకములన్ని తానే యేలుచుండెను. వాని కుమారుఁడు ప్రహ్లాదుఁడు వాఁడు చిన్నప్పటినుండి విష్ణుదేవుని యందు మిక్కిలి భక్తికలవాఁడు. “నీవు దేవుని స్మరింపవలదు. లోకమున దేవుఁడు లేఁడు. లోకములను అన్నిటిని నేనే పాలించుచున్నాను. నాకంటె గొప్పవాఁ డెవ్వఁడు లేఁడు. విష్ణుదేవుని స్మరించితివా నిన్ను చంపెదను” అని అనేక విధముల ఆ ఐదేండ్ల బాలుని హిరణ్యకశిపుఁడు బాధించెను. ఎంత బాధించినను ప్రహ్లాదుఁడు విష్ణుదేవునే స్మరించుచుండెను. ఒకనాఁడు హిరణ్యకశిపుఁడు సభయందు కూర్చుండి తమ కుమారుని పిలిచి “ఓరి! దేవుఁ డున్నాఁడనెదవే ఎందున్నాఁడురా!” అని అడిగెను. తండ్రీ! దేవుఁడు లేని స్థలమే లేదు. అన్నిటియందు దేవుఁడున్నాఁడు.

**కం.** **“ఇందుఁ గలఁ డందులేఁడని**
**సందేహము వలదు; చక్రి సర్వోపగతుం;**
**డెందెందు వెదకి చూచిన**
**నందందే కలఁడు దానవాగ్రణి వింటే”**

అని బాలుఁడు చెప్పెను. నీ మాట నిజమైన యెడల ఈ స్తంభమున చూపుమని ఆ సభయందలి స్తంభమును ఒక దానిని హిరణ్యకశిపుఁడు విఱుగఁదన్నెను. వెంటనే స్తంభము నందుండి విష్ణువు నరసింహావతారమూర్తిగ పుట్టి హిరణ్యకశిపుని చంపి బాలుని రక్షించెను.

## 2. ఈశ్వరుని దూషింపరాదు

దక్షుఁడు ఈశ్వరునితో విరోధించి అతని నిందించి ఒక యజ్ఞమును చేయ ప్రారంభించెను. తన శక్తిచేత దేవతలు లోనగు వారినెల్ల ఆ యజ్ఞమునకై పిలిపించెను. ఈశ్వరుని మాత్రము పిలువలేదు. అప్పుడు పార్వతి నేనును యజ్ఞము చూడఁ బోయెదనని శివుని అడిగెను. "దక్షుఁడు మనయందు ప్రీతిలేనివాఁడు. నీవు పోవలదు. నిన్ను అవమానించును" అని శివుఁడు చెప్పినను ఆమె వినక "నాతండ్రిచేయు యజ్ఞము నేను చూడఁబోవలదా" యని పోయెను. పార్వతి తన కూఁతురైనను దక్షుఁడు శివుని మీఁది కోపముచే మాట్లాడింపక యాదరింపక యవమానపఱచెను. ఆ యవమానము సహింపలేక పార్వతి దేహమును విడిచెను. అప్పుడు ఈశ్వరునికి కోపము వచ్చి వీరభద్రుని పంపి దక్షుని చంపించి యజ్ఞము పాడు చేయించెను.

**ఆ. భేదబుద్ధిలేక విశ్వంబు సకలంబు**
**దైవమయమటంచుఁ దలఁచి భక్తి**
**యీశ్వరార్పణముగఁ గృతు లొనర్పక యున్న**
**జయము లేదు మఱియు లయముగలుగు**

## 3. సాధువులను బాధింపరాదు

తొల్లి అంబరీషుఁ డను ఒక రాజుండెను. ఆయన ద్వాదశీ వ్రతము నియమము ప్రకారము చేయువాఁడు. ఇట్లుండ ఒక ద్వాదశినాఁడు ఉదయముననే దుర్వాసుఁడు అను ఋషి నేను భోజనమునకు వచ్చెదను అని చెప్పి యేటికి స్నానము చేయఁబోయెను. "ఎంతసేపైనను దుర్వాసుఁడు రాలేదు. తక్కిన అందఱు కాచియున్నారు. భోజనమునకు వచ్చెద నన్న వానిని విడిచి యెట్లు భుజింపవచ్చును? ద్వాదశి గడియలు మించి పోవుచున్నవి. భుజింపక యెట్లుండవచ్చును? ఏమి చేయుదును?" అని ఆలోచించి రాజు జలపారణముచేసి యూరకుండెను. దుర్వాసుఁడు

మఱికొంత సేపటికి వచ్చి రాజు చేసిన దెఱిఁగి "నేను రాకముందే నీవు జలపారణము జేసితివా" యని కోపించి యతని చంపుటకై శక్తిని ప్రయోగించెను. అంబరీషుఁడు "భగవంతుఁడాఁ నే నీ మునికి ఎట్టి అపరాధమును చేసినవాఁడనుగాను నన్నుఁ గాపాడుమా" అని ధ్యానించెను. వెంటనే విష్ణుచక్రము వచ్చి ఆ శక్తిని ఖండించి దుర్వాసుని చంపుటకు పోయెను. దానిని చూచి భయపడి దుర్వాసుఁడు పరువెత్తెను. మూఁడులోకములు సంచరించి ఎవ్వరు కాపాడువారు లేక ఆ ముని తుదకు విష్ణుదేవుని యొద్దకుఁ బోయి ఆయన పాదముల మీఁదఁ బడి శరణువేఁడెను. అప్పుడు విష్ణువు ఇట్లనియెను.

"ఓయి వెఱ్ఱిమునీ! క్షుద్రమంత్రములును తంత్రములును ఆచారము దైవభక్తి లేనివారిని బాధించును గాని భక్తులను బాధింపవు. బ్రదుకఁ గోరుదువేని నీవు పోయి అంబరీషు వేఁడుకొనుము. అతఁడే నిన్ను మన్నించును. నా కపరాధము చేసినను క్షమింతునుగాని నా భక్తులకుఁ జేయు నపరాధము సహింపను" అని చెప్పఁగా దుర్వాసుఁడు పరువునఁ బోయి అంబరీషుని శరణుఁజొచ్చి ప్రాణములు కాపాడుకొనెను.

**కం. తన కపరాధము చేసినఁ**
**గని సైరణసేయుఁ, గాని కండపావరునన్**
**దనభక్తునిఁ బీడించిన**
**జనమును భగవంతుఁ డెపుడు సైఁపఁడు పుత్రా!**

## 4. దిక్కులేని వారికి దేవుఁడే దిక్కు

హస్తినాపురరాజులైన ధృతరాష్ట్రుఁడు పాండురాజు అనువారు అన్నదమ్ములు. ధృతరాష్ట్రునకు దుర్యోధనుఁడు మొదలైనవారు నూర్వురు కొడుకులు. పాండురాజును ధర్మరాజు మొదలైనవారు ఏవురు కొడుకులు. జ్ఞాతి మచ్చరము చేత దుర్యోధనుఁడు ధర్మరాజును అవమాన పఱుప వలయునని ఆలోచించుచుండి ఒకనాఁడు ధర్మరాజును జూదమాడఁ

బిలిచి మోసముచేత ఆయన రాజ్యమును, సంపదను, తమ్ములతో సర్వమును పందెమున గెలిచెను. ఈ విధముగ తన దాసులుగఁ జేసికొని పాండవులను అవమాన పఱుప వలయునని వారి భార్యయైన ద్రౌపదిని సభలోనికి ఈడ్చి తెప్పించి తన తమ్ముఁడగు దుశ్శాసనుచేత ఆమె కట్టుకొన్న చీర ఒలిపించెను. దాసులగుటచేత పాండవులు ఏమి చేయలేక తలలు వంచుకొని కూర్చుండి యుండిరి. దుర్యోధనునకు భయపడి బంధువులందఱు ఊరకుండిరి. అప్పుడు ద్రౌపది దిక్కులేనిదై శ్రీకృష్ణుని ప్రార్థించెను. భగవంతుఁడు శరణాగత వత్సలుఁడు. ఆయన ఆమె స్తోత్రమునకు సంతోషించి చీరలు అక్షయ్యము లగునట్లు చేసి ఆమె మానమును కాపాడెను. ఎన్నిచీరలు ఒలిచినను తఱుగక యింకను వచ్చుచుండుటచే చేతులు నొప్పిపుట్ట దుశ్శాసనుఁడు సిగ్గుపడి చాలించుకొనెను.

**ఆ. నీవె దిక్కటంచు నిశ్చంచలుండయి**
**యాత్మశక్తి గర్వ మణఁచి కొలుచు**
**భక్తుఁ బ్రోచుఁరక్తి భగవంతుఁ డెప్పుడు**
**చెనఁటివారుచేయు చేఁత లణఁచి**

## 5. దుష్టులకు మేలు చేయరాదు

వృకుఁ డను నొక రాక్షసుఁడు శివునిఁ గూర్చి తపస్సు చేసెను. శివుఁడు ప్రత్యక్షమై నీ కేమి వరము కావలయునని అడిగెను. నే నెవరినెత్తిమీఁద చేయి పెట్టుదునో వాఁడు భస్మమై పోవలయునని వాఁడు కోరెను. అట్టులే యగునని శివుఁడు వరమిచ్చెను. నీమాట సత్యమో యసత్యమో పరీక్ష చేసెదను అని శివుని నెత్తిమీఁదనే వాఁడు చేయి పెట్టఁబోయెను. శివుఁడు పరువెత్తెను. వృకుఁడు తఱుముకొనిపోయెను. అప్పుడు విష్ణువు బ్రహ్మచారివలె రాక్షసున కెదురుగా వచ్చి "ఏల రాక్షసేంద్రా! ఇట్లు పరుగెత్తు చున్నావు" అని యడిగెను. అతండు జరిగిన వృత్తాంతము చెప్పెను. "నీవు మైలపడి పోవుచున్నావు కావున నీకు శివుఁడు చిక్కఁడు.

సంధ్యవార్చి శుచివై పోయెదవేని చిక్కును" అని బ్రహ్మచారి చెప్పెను. వృకుఁడు ఆమాట నిజమనితలఁచి సంధ్యవార్చునపుడు తన చేతిని తన తలయందే యుంచుకొని వెంటనే భస్మమైపోయెను. ఈ వృకాసురుని భస్మాసురుఁడనియు అందురు.

**కం. పామునకుఁ బాలు పోసిన**
**భీమంబుగ మీఁదదూఁకి పెరికెడు రీతిన్**
**ప్రేమంబున దుష్టునకుం**
**దా మేలొనరింపఁ దన్నె దప్పక చెఱుచున్**

## 6. దత్తాపహారము మహాపాపము

పూర్వకాలమున నృగుఁడను రాజుండెను. అతఁడు మహాదాత. అనేకములైన ధర్మకార్యములు చేసి న్యాయముగ రాజ్యమేలెను. ఒక పుణ్యకాలమున అతఁడు గోవులను మందలు మందలుగ దానము చేయుచుండెను. అట్లు చేయునపుడు ఒక ఆవు ముందొక బ్రాహ్మణునికి దానము చేసిన మందనుండి తప్పించుకొని మరియొక మందలో ప్రవేశించెను. అది రాజు తెలిసికొనలేక ఆ మందను మఱియొక బ్రాహ్మణునికి దానమిచ్చెను. మొదటి బ్రాహ్మణుఁడు తన ఆవు తప్పించుకొని పోయినదని దేశదేశము వెదకి రెండవ బ్రాహ్మణుని యింటియందు కనుఁగొనెను. ఈ ఆవును రాజు తనకు దానముచేసినాఁడని మొదటి బ్రాహ్మణుఁడును, నాకు దానము చేసినాఁడని రెండవ బ్రాహ్మణుఁడును కలహించి రాజునొద్దకు వచ్చిరి. రాజు తన పొరపాటు తెలిసికొని దోషము తనదే యని యొప్పుకొని క్షమింపుఁడని వారిని ప్రార్థించెను. వారు "రాజా నీవు ఒకనికి దానము చేసిన దానిని మరల గ్రహించితివి. కావున నీకు పాపము తప్పదు. నీవు ఊసరవెల్లివై పుట్టుము. నీవు మహాధర్మాత్ముఁడవు కావున నీకు శ్రీకృష్ణుఁడు దర్శనమిచ్చి నీ పాపము పోఁగొట్టును" అని శపించిరి.

కం. ఇచ్చిన దానిని గ్రమ్మఱ
నిచ్చ నెఱిగియుండె నెఱుఁగ కేనియు మరలన్
బుచ్చుకొనరాదు; నరకము
వచ్చును దప్పక యదెట్టివారికి నైనన్

## 7. నీచులఁ జేరఁదీయరాదు

ఒక అడవిలో ఒక ఋషి తపస్సు చేయుచుండెను. ఎక్కడ నుండియో ఒక కుక్కవచ్చి ఆయన ఆకుటింటి దగ్గర చేరెను. ఇట్లుండ ఒకనాఁడు ఆ కుక్కను సివంగి చంపుటకై తఱుముకొని వచ్చెను. అది భయపడి ఋషియొద్దకు పరువెత్తి వచ్చెను. ఆ ఋషి మిక్కిలి దయగలవాఁడు గావున ప్రాణభయము అందఱకు ఒక్కటియే గదా యనియు తనయొద్దఁ జేరినదిగదా యనియు ఎంచి యిట్టులే మఱిమఱి దానిని సివంగులు బెదరింపకుండునట్లు చేయవలయునని తలఁచి ఆ కుక్కను సివంగిగ మార్చెను. ఈ సివంగిని చూచి ప్రాఁత సివంగి భయపడి పరువెత్తెను. ఇట్లు కొన్నాళ్ళు కాఁగా క్రొత్త సివంగిని ఒక పులి చంపవచ్చెను. అప్పుడు ఋషి సివంగిగ నున్న కుక్కను పులిగా మార్చి గెలిపించెను. తరువాత అడవియేనుఁగు ఈ క్రొత్తపులిని తఱుముకొని రాఁగా దానిని ఋషి ఏనుఁగుగ మార్చెను. అట్టులే దానిని సింహము చంపవచ్చినప్పుడు కుక్కను గూడ సింహముగ మార్చెను. ఈ విధముగ కుక్క సింహమై యిష్టము వచ్చినట్లు సంచరించుచు ఋషిని చూచి యిట్లు తలఁచెను. ఈ ఋషి మిక్కిలి దయగలవాఁడు. మహాతపశ్శక్తి గలవాఁడు. నేనిప్పుడు విచ్చలవిడి మృగములఁ జంపుచున్నాను. ఏదైన మృగము నావలెనే వచ్చి యీయన శరణు జొచ్చెనా దానిని సింహముగఁ జేయును. తరువాత నా గతియేమి? కావున ఈ ఋషిని జంపి నేను సర్వదా సింహమై భయములేక చరించెదనని యాలోచించు చుండెను. ఈ ఋషీశ్వరుఁడు దాని యాలోచన యెఱిఁగి "ఓసి నీచ శునకమా! నీ యల్పబుద్ధి విడువవైతివి. నీవు యథాప్రకారము కుక్కవు కమ్ము" అని దానిని కుక్కగా మార్చెను.

కం. కనికరమును ననురాగముఁ
జనువునుఁ గనఁబఱిచి మేలి సంపదఁ గూర్పన్
దన నీచగుణమె చూపుచుఁ
దన కెగ్గొనరింప నీచు తలఁచుచునుండున్

## 8. రాజు దేవాంశమునఁ బుట్టినవాఁడు

అత్రియను ఒకానొక బ్రాహ్మణుఁడు తన భార్యను చూచి "నేను తపముచేయ వనమునకుఁ బోవుచున్నాను. నీవు నాతో వచ్చెదవా? ఇంట నుండెదవా?" యని యడిగెను. "నేను మీ వెంట వచ్చుదాననే దానికి సందేహము లేదు. కాని సంపాదించుకొని బ్రతుకు వయస్సురాని బిడ్డలకు బ్రతుకుమార్గము కల్పింపక మీరు అరణ్యమునకుఁ బోవుట ధర్మము కాదు. మన మిట్లు విడిచిపోయిన బిడ్డలగతి యేమి? దానిని మీ రాలోచింప వలదా" యని ఆమె చెప్పెను. అవును నీవు చెప్పినది ధర్మయుక్తమని చెప్పి అత్రి వైన్యుఁడను రాజు యజ్ఞము చేయుచుండ అచ్చటికిఁ బోయి 'రాజా! నీవే విధాతవు. నీవే యింద్రుఁడవు. నీవే సమస్తధనేశ్వరుఁడవు. అన్ని ధర్మములు తెలిసినవాఁడవు నీవు. కాలమునకు నీవే కారణము. నీవే లోకములకు ఆధారము' అని స్తోత్రము చేయఁగా అందున్న గౌతముఁడను ముని ఆయనను చూచి యాచనకై యితని యొద్దకు వచ్చినంత మాత్రముననే నీవే యింద్రుఁడవు నీవే చంద్రుఁడవని యిచ్చకపు మాటలు పలుకవలయునా అని ఆక్షేపించెను. ఆ మాటలు విని అత్రి యిట్లనియె. అయ్యా! నీవు యుక్తాయుక్తము లాలోచింపక మాటలాడుచున్నావు. నేను అసత్యముగాని యిచ్చకపు మాటలుగాని పలికినవాఁడఁగాను. కాలమునకు రాజే కారణ మనఁగా నీవు వినలేదా. అష్టదిక్పాలకుల అంశములచే రాజు సృష్టింపఁబడు ననుట మఱచితివా? లోకమును పాలించుట యెవని కృత్యము? శత్రువుల దండించుట యెవని కార్యము? ధర్మపరిపాలన మెవని పని? ధనాది దానకార్యములు సేయువాఁడెవఁడు? ఎవని

యీశత్వము లోక మంగీకరించి లోబడి యుండును? లోకులకెల్ల ప్రాణమై యుండువాఁ డెవఁడు? చారులచేతను విచారముచేతను లోకమంతయు చూచువాఁడెవఁడు? లోకమును సంతోషపెట్టువాఁ డెవఁడు? ఇవన్నియు దేవతల కార్యములుగావా? అనిన గౌతముఁడు రాజే యిన్నియు నైన, దేవతలతోడ నింకేమి పని? రాజును గూర్చియే యాగాదులు చేయరాదా యనెను. అప్పుడు వారిరువురు సనత్కుమారు నొద్దకుపోయి తమ వివాదమును ఎఱిఁగించిరి. సనత్కుమారుఁడు అత్రి నిజము చెప్పెనని పరిష్కరించెను.

గీ. **విష్ణు నంశముననె పృథివీశుఁ డుదయించు**
**రాజె సలుపు లోక రక్షణంబు**
**కాన భక్తిగలిగి క్ష్మానాథుఁ గొలువంగ**
**వలయు నెపుడు దేవుఁ గొలుచునట్లు**

### 9. రాజద్రోహము మహాపాతకము

పరీక్షితుఁ డను రాజు వేఁటాడఁబోయి దప్పిగొని శమీకుఁడను ఋషీశ్వరుని మంచినీళ్ళు కావలయునని యడిగెను. ఆయన తపస్సు చేయుచు మాటలాడలేదు. దానికి రాజు కోపించి చచ్చిన పామును ఆ ముని మెడలో వేసిపోయెను. ఆ మునికొడుకు శృంగి అనువాఁడు



శృంగి పరీక్షితుని శపించుట

వచ్చిచూచి "నా తండ్రి మెడలో పామువైచిన రాజు ఏడు దినములలో పాము కఱచి చచ్చునుగాక" అని శపించెను. తపము చాలించిన పిమ్మట, ఆ వృత్తాంతము తెలిసి శమీకుఁడు కొడుకుతో నిట్లనియె. "ఓరి బుద్ధిలేని పిల్లవాఁడా! రాజు నేలరా శపించితివి? ఇది రాజద్రోహము కాదా! ఆయన దుర్మార్గులను దండించుటచే కదా మనము భయములేక యున్నాము. రాజులేకుండిన మన సొత్తులు మనకు దక్కునా? బలవంతులు బలహీనులను గొట్టినను చంపినను వారి సొత్తులను భార్యలను ఆఁడు పిల్లలను ఎత్తుకొని పోయినను కాపాడువాఁడు రాజుగాక మఱి యెవఁరు? రాజు లేకున్న వ్యాపారము నడచునా? భూములందు పండిన పంటలు సొంతగాండ్రకు దక్కునా? లోకులు కంటినిండ నిద్రపోదురా? ఇది నా యిల్లు నాసొత్తు అని చెప్పుకొనుటకు ఎవరికిని ధైర్యముండునా? రాజు లేకుండిన ధర్మకార్యములు, తపస్సులు, విద్యాభ్యాసములు, ఆటలు, పాటలు, నడచునా? నీవు రాజద్రోహము చేసి లోకమున కెంత కష్టము కలిగించి నీ పుణ్యమునకు నెంత నష్టిని తెచ్చుకొంటివో చూచితివా? రాజును దూషింపరాదు. రాజునకుఁ గీడు కావించుట మహాపాతకము కదా. రాజు ప్రజలకు తండ్రి, రాజద్రోహము పితృద్రోహము సమానములు. రాజద్రోహమును జేసిన వారు అరాజకత్వము వలనఁ గలుగు పాపములకు కారణ భూతులై నరకమునకు పోదురు" అని కోపించెను.

**కం. రాజే తల్లియుఁ దండ్రియు**
**రాజే రక్షకుఁడు ప్రజలకు రాజ ద్రోహం**
**బోజచెడి చేసి నారక**
**భాజియగును నదియు ఘోరపాతక మగుటన్**

### 10. పెద్దల ధిక్కరింపరాదు

చిత్రకేతుఁడు విద్యాధరులలో శ్రేష్ఠుఁడు. అతఁడు మిక్కిలి దైవభక్తి గలవాఁడు. ఒకనాఁడు అతఁడు విమాన మెక్కి ఆకాశమున పోవుచు

కైలాసమున నిండు సభలో శివుఁడు పార్వతిని తన తొడమీఁద కూర్చుండబెట్టుకొని యుండఁ జూచి జగుప్సపడి శివునితో నిట్లనియె. “ఎంతటి పామరులైనను జనములులేని స్థలమునందు స్త్రీలను సిగ్గు విడిచి ఇట్లు స్త్రీని గౌఁగిలించుకొని కూర్చుందురా?” యని తాను భక్తుఁడు ఇంద్రియముల జయించినవాఁడు అను గర్వముతోఁ బలికెను. ఆయన గొప్పతనము తెలిసి శివుఁ దూరక యుండెను. గాని పార్వతి కోపించి యిట్లనియెను. “ఓరీ! మావంటి సిగ్గులేని కుమతుల దండింప నీవు యముడవా? నీ వేమి యెఱిఁగి మమ్ము ఆక్షేపించితివి? అజ్ఞానము చేతను అహంకారము చేతను నీకంటెఁ బెద్దలగువారి నాక్షేపించితివి గావున రాక్షసుడవై పుట్టుము” అని శపించెను. వాఁడు వృత్రాసురుఁడై పుట్టెను.

**కం. ధన విద్యా బల మదములు**
**కనులం గప్పంగఁ దనకు ఘనులగు వారిన్**
**గని ధిక్కార మొనర్చిన**
**మనుజాధముఁ దుద్భవించు మనుజాశనుఁడై**

## 11. నవ్వుచుఁ జేసిన ఏడ్చుచు అనుభవింపవలయును

ఒక గంధర్వుడు బ్రహ్మనుగూర్చి తపస్సుచేసి తుదకు దీర్ఘాయువు కలుగ వరము పొందెను. ఆ గర్వము చేతను, తాను మిక్కిలి చక్కఁదనము గలవాఁడనను పొగరుచేతను వికారపు వేషము వేసికొని లోకులను బెదరించు చుండెను. స్థూలశిరుఁడను ఒక ఋషి వాని చెడు నడవడి యెఱిఁగి నీ కీరూపమే శాశ్వతమగుఁగాక యని శపించెను. అప్పటికిని వాఁడు పొగరు మానక ఇంద్రుని యుద్ధమునకుఁ బిలిచెను. వీఁడు తనకు చావులేదని పొగరుచున్నాఁడని యింద్రుఁడు తెలిసికొని తల బొమ్మ లోపలికిని కాళ్ళు కడుపులోనికి గుదివడి పోవునట్లు వజ్రాయుధముతోఁ గొట్టెను. వీనిపేరు కబంధుఁడు. వీఁడనేక సంవత్సరము లీ రూపముతో

దుఃఖమనుభవించిన తరువాత శ్రీరాముcడు వీనిని జంపి వీని కష్టమును దీర్చెను.

**కం. క్రొవ్వునc బరులకు నెగ్గను**
**నవ్వుచు వేడుకకుc జేయు నరుc డావలc దా**
**నెవ్వగc గన్నీ రురలcగ**
**గవ్వకుc గొఅగాక మిగులc గాఱియపడెడిన్**

## 12. పెద్దలను పరిహసింపరాదు

నారదుcడు కణ్వుcడు విశ్వామిత్రుడు అను మునులు కృష్ణుని దర్శింపవలయునని ద్వారకకు పోయిరి. అప్పుడు కొందఱు యదుకుమారులు సాంబుcడను మగవానికి గర్భిణివేషము వేసి ఆ మునీశ్వరుల యొద్దకుc దీసికొనిపోయి 'మునీశ్వరులారా! ఈ స్త్రీ గర్భమున ఏ శిశువు పుట్టును' అని అడిగిరి. వారు నిజమెఱిcగినవారై "యాదవ వంశము నిర్మూలము చేయు రోcకలి యీ పురుషుని గర్భమునc బుట్టును" అని చెప్పిరి. ఆ మాట యదుబాలకులు విని భయపడిపోయి కృష్ణునితో చెప్పిరి. వెంటనే సాంబుని కడుపు నుండి యినుపరోcకలి యొకటి పుట్టెను. దానిని వారు పొడిగొట్టి సముద్రములో పోసిరి కాని అది తుంగగా మొలిచియుండెను. యాదవులా సముద్రతీరమున త్రాగి ఒడలెఱుంగక యా తుంగతోనే ఒకరి నొకరు కొట్టుకొని చచ్చిరి.

**గీ. చెనcటి తెన్నునc బోవక యనవరతము**
**భూతహితులయి దైవంబుc బ్రీతిc దలcచు**
**సాధువులc బరిహాసంబు సలిపిరేని**
**మూల మయ్యది వంశ నిర్మూలతకును**

## 13. పాపఫలము శిక్షచేc బోవును

శంఖుcడు లిఖితుcడు అను ఇద్దఅన్నదమ్ములు వేఱు వేఱు ఆశ్రమములు కల్పించుకొని తపస్సు చేయుచుండిరి. ఒకనాcడు లిఖితుcడు

అన్నను చూచుటకై ఆయన ఆశ్రమమునకు పోయెను. శంఖుఁ డప్పుడచ్చట లేఁడు. అచ్చటి వృక్షములందు మంచి మామిడిపండ్లుండగా కోసి తమ్ముఁడు తినుచుండెను. ఆ సమయమున శంఖుఁ డచ్చటికి వచ్చి తమ్మునితో మాట్లాడి "తమ్ముడా! ఈ పండ్లెక్కడివి? అని యడిగెను. "ఇచ్చటివే బాగుగ నుండుటచే తినుచున్నాను" అని తమ్ముడు చెప్పెను. "అయ్యో నాయనా? ఎంత పొరపడితివి. ఇవి నీవి కావుకదా. ఇతరులసొత్తు వారి నడుగక యనుభవించుట దొంగతనము చేయుటగదా. అయినదానికి వగచి ప్రయోజనము లేదు. సుద్యుమ్నుఁడను మనదేశపు రాజునొద్దకుపోయి దొంగతనమునకుఁ దగిన శిక్ష పొంది రమ్ము. లేకున్న నీపాప మతనిని నిన్నుఁ గొట్టునని చెప్పెను. అన్న చెప్పిన ప్రకారము రాజునొద్దకు పోయి తాను దొంగిలించిన వృత్తాంతము చెప్పెను. రాజు లిఖితుని రెండు హస్తములు నఱికించె. ఆ నెత్తురు కాఱు చేతులతోనే అన్న యొద్దకుపోయి "అన్నా! రాజదండము పొందివచ్చితిని" అని లిఖితుఁడు మొండి చేతులను చూపెను. అప్పుడు అన్న సంతోషించి "అదో మన ఆశ్రమము పొంతనుండు ఏటిలో స్నానము చేసిరమ్ము" అనెను. అతఁడు ఆ ప్రకారము చేయఁగా నెప్పటియట్ల హస్తములు రెండును మొలచెను. ఇదియేమి ఆశ్చర్యమని లిఖితుఁ డన్న నడిగెను.

"నీయం దీయొక్క పాపము తప్ప మఱి యే పాపము లేదు. ఈ పాపము రాజదండముచే పోయెనుగనుక నీ చేతులు నీకు వచ్చెను" అని అన్న చెప్పెను. ఆ మునికి బాహువు లిచ్చినది గనుక ఆ యేటికి బాహుద (చెయ్యేరు) యను పేరు ప్రసిద్ధమయ్యెను.

క. **తనచేసిన పాపంబును**
**జనముల కెఱిఁగించి రాజశాసితుఁడైనం**
**జను నయ్యది; పరితాపం**
**బును వలయున్ మరల నద్ది పొందమి కెదలోన్**

## 14. ప్రభుభక్తి

అంబరీషుఁడను రాజు అనేక పుణ్యకార్యములు చేసి స్వర్గమునకు పోయి అచ్చట దివ్యభోగము లనేకము లనుభవించుచుండెను. ఆయన ఒకనాఁడు తన విమానమున కంటె గొప్పదియగు విమానమున తనకంటె నెక్కువ భోగము లనుభవించుచు తన పదవికంటె గొప్ప పదవియందున్న యొకనిఁ జూచి వీఁడేమి పుణ్యము చేసెనని ఇంద్రుని అడిగెను. ఆ యింద్రుఁడిట్లు చెప్పెను. వీఁడు నీ సేనానాయకుఁడుగ నుండిన సుదేవుఁడు. వీనిని నీవు కొందరు దుష్టరాక్షసులఁ జంపి రమ్మని పంపితివి. ఆ రాక్షసు లెట్టివారికిని గెల్వరానివారు. వారి నెట్లు జయించి నీకు క్షేమము గలుగఁ జేయవచ్చునా యని యాలోచించి శివునిఁగూర్చి యితఁడు తపస్సు చేసెను. శివుఁడీయన కొక తేరిచ్చి దీనియందుండి యుద్ధము చేసితివేని రాక్షసులను జయించెదవని చెప్పెను. ఇతఁడట్టులే ఆ రాక్షసుల నందఱ జయించెను గాని కడపట వారిలో నొక ప్రముఖునితోఁ బోరుచు రోషముచేఁ దటాలున తేరు డిగ్గి వానిని జంపి వాని దెబ్బచేఁ దానును జచ్చెను. ఈ విధముగ నీ క్షేమమునకై నీమీఁది భక్తిచే ప్రాణముల కాశింపక వెనుకంజ పెట్టక యుద్ధముచేసి యితఁడు దేహము కోలుపోయెను. నీయందుఁగల భక్తిచే నిట్టి యుత్తమ సుఖములు పొందెను.

**గీ. తన్ను నేలినయట్టి యా ధన్యచరితు**
**భక్తి సేవించుచును వాఁడు పనిచినట్టి**
**ప్రాణగొడ్డంపుఁ బనిఁ దన ప్రాణమిచ్చి**
**యైన నొనరింప స్వర్గసౌఖ్యంబుఁ గాంచు**

## 15. వినయము గలవానికి విపత్తులేదు

సముద్రుఁ డొకనాఁడు తనలోఁ గలియుచుండు నదుల నన్నిటిని జూచి యిట్లడిగెను. “మీ బలముచేత పెద్ద పెద్ద మ్రాకులను వేళ్ళతో

పెకలించి తెచ్చెదరే, తుంగ నేల తీసి కొనిరారు. వానియందు మీరు దయదలఁచితిరా? లేక వానిని పెకలించుటకు మీకు శక్తి చాలదా?" ఆ మాటలు విని నదులిట్లనియె. "తమకు వేళ్ళబలము కలదుగదా యని పెద్దపెద్ద మ్రాకులు మమ్ము లక్ష్యపెట్టక మా ప్రవాహమునకు అడ్డముగ నిలుచుచుండును. వాని గర్వము సహింపక గడ్డ లురలఁ ద్రోచి వానిని వేళ్ళతో పెల్లగించి తెచ్చెదము. తుంగ అట్టులుగాదు. మేము రాఁగానే మాకు అణఁగి తలలువ్రాల్చి యుండును. మా పరోక్షమునందు తల లెత్తుకొని యుండును. ఆ విధముగ మాకు వినయముతో అణఁగియుండువానిమీఁద మా బలముచూప మాకు మనసురాదు. ఆ నిమిత్తముగ ఒక జంబుకాఁడ అయినను నీయొద్దకు రాదు."

**కం. వినయముగల గుణవంతున**
**కనయము మేలొదవు నెట్టి యాపదలందున్;**
**వినయవిహీనుం డగు న**
**మ్మనుజుండు సమూలముగను మడియును బుత్రా**

## 16. దీర్ఘసూత్రుఁడు చెడిపోవును

ఒక తటాకమందు దీర్ఘదర్శి, ప్రాప్తకాలజ్ఞుఁడు, దీర్ఘసూత్రుఁడు అను పేర్లుగల మూఁడు చేఁపలుండెను. దీర్ఘదర్శి కొంతకాలమునకు రాఁబోవుదాని నిప్పుడే ఆలోచించి తెలుసుకొనువాఁడు. ప్రాప్తకాలజ్ఞుఁడు ముందుగ ఆలోచింపకుండినను సమయము వచ్చినపుడు దానికి తగిన యుపాయ మాలోచించువాఁడు. దీర్ఘసూత్రుఁడు ముందుగఁగాని అప్పుడుగాని అలోచింపక కానీ కానీ అని కాలము త్రోయుచుండు సోమరి. ఈపేర్లు గల చేపలుండు మడుఁగులోని నీరు ఒకప్పుడు ఎండ వేఁడిమికి ఇగురఁజొచ్చెను. అప్పుడు దీర్ఘదర్శి యిట్టు లాలోచించెను. ఎండలా మండుచున్నవి. మడుఁగులోని నీరా యింకుచున్నది. దీనిలోనుండి పాఱు వంకయు ఎండుచున్నది. ఈ వంక పూర్ణముగ నెండెనా దీనిలోనే చిక్కుకొని

జాలరులచేఁ జావవలసి యుండును. ఇప్పుడే యీ మడుఁగులోనుండి కాలువ వెంటఁబోయి మఱియొక పెద్దమడుఁగు చేరుట బాగు అని యెంచి తన స్నేహితుల నిద్దఱను పిలిచెను. కాలువ యెండిన మడఁగెండునా? అంతకాలము వచ్చినప్పటికి చూతమని వారిద్దఱు పోకయుండిరి. దీర్ఘదర్శి మాత్రము వెడలిపోయెను. తరువాత వంక పూర్ణముగ నెండిపోయెను. మడుఁగు ఇగురు చుండెను. అప్పుడు బెస్తలు తటాలునవచ్చి వలలు మొదలైనవి వేసి చేఁపలను పట్టసాగిరి. ప్రాప్తకాలజ్ఞుఁడు అపాయము వచ్చినదని తెలిసికొని వలలోనే యొక ప్రక్కన త్రాడు గట్టిగ కఱచుకొని చచ్చినట్టు వ్రేలాఁడుచుండెను. అది చచ్చినదని యెంచి బెస్తలు దానిని దీసి మరల నీటిలోనే పాఱవైచిరి. అది తప్పించుకొనిపోయి బురదలో దాఁగుకొనెను. దీర్ఘసూత్రుఁడేమి చేయుటకు తెలియక యిక్కడ కక్కడకు పరుగెత్తుచుండెను. జాలరులు దానిని బట్టి చంపిరి.

గీ. **భావి యాలోచనముఁసేత పరమశుభము;**
**ఒదవ నాపద యపుడైన నుపమసేఁత**
**మధ్యమం, బలసుం డయి మత్తుఁ డగుచు**
**రెండు లేనట్టి దీర్ఘ సూత్రుండు చెడును**

## 17. దధీచి

వృత్రుఁడను నొక రాక్షసుఁడు మహా బలిష్ఠుఁడై దేవతలను లోకములను మిక్కిలి బాధించుచు నుండెను వాని వలన రాయిడికి తాళలేక దేవతలు విష్ణువునొద్దకు పోయి తమ కష్టములెల్లఁ జెప్పుకొనిరి. అప్పుడు విష్ణు విటుల చెప్పెను. మీరు దధీచియను బ్రాహ్మణుని యెముకలు ఆయుధములుగా చేసికొని వృత్రునితో యుద్ధము చేసిన జయింపగలరు. ఆయన వెన్నెముకతో ఇంద్రుఁడు వృత్రుని కొట్టినఁ జచ్చునుగాని మఱి యేవిధముగ వాఁడు చావఁడు. అనఁగా ఆ మాటలువిని అందఱు దధీచి యొద్దకుపోయి అనేక విధముల స్తోత్రముచేసి నీవు లోకమునకును మాకును

రాక్షసులవలన బాధ తప్పింపవలయునని ప్రార్థించిరి. నేను తపస్సుచేయు బీదబాఁపఁడను నేనేమి చేయఁగలనని దధీచి యనెను. నీయెముకలు మాకిచ్చిన యెడల మేము వానిని ఆయుధములు చేసికొని శత్రువును గెలిచెదమని దేవతలు చెప్పిరి. దేవతలను లోకమును రక్షించుటకంటె నా ప్రాణము రక్షించుకొనుట శ్రేష్ఠమైనది కాదు. తీసికొనుఁడని యోగాగ్నిచే శరీరము విడిచెను. దేవతలు ఆ యెముకలు గొని విశ్వకర్మచే వానిని ఆయుధములుగాఁ జేయించి వానితో వృత్రాసురుని చంపిరి. ఆతని వెన్నెముకే వజ్రాయుధము.

**కం. నష్టంబులకున్ జంకరు;**
**కష్టంబని కొంక రెపుడు కార్యములందున్;**
**శిష్టులు జగదుపకృతికై**
**యిష్టంబుగ దేహమైన నిత్తురు పుత్రా**

**18. ఒకఁడు పాపముచేయును, పలువురు దానిఫల మనుభవింతురు**

జమదగ్నియను మునియొద్ద కామధేను వుండెను. దానిని తనకిమ్మని కార్తవీర్యార్జునుఁడు అను రాజడిగెను. ఇయ్యనని జమదగ్ని చెప్పెను. నీ వీయకున్న నేను విడుతునా యని రాజు బలవంతముగా ఆవును పట్టుకొనిపోయెను. ఈ వృత్తాంతమును జమదగ్ని కొడుకగు పరశురాముఁడు విని కార్తవీర్యార్జునుని జంపి ఆవును మరలఁ దెచ్చెను. ఆ పగ మనస్సులో పెట్టుకొని కార్తవీర్యార్జునుని కొడుకులు పరశురాముఁడు లేనప్పుడు జమదగ్నిని జంపిరి. తన తల్లి రేణుకయేడుపువిని పరశురాముఁడు త్వరగావచ్చి సమాచారము తెలిసికొని కార్తవీర్యార్జునుని కొడుకుల నందఱ చంపెను. అంతేగాక తాను వినఁగా తనతల్లి రామా రామా యని ఇరువదియొక్క మాఱటిచెను గావున ఇరువదియొక్క మాఱు దేశములో క్షత్రియుఁ డనువాఁడు లేకుండునట్లు వెదకి వెదకి చంపెను.

కం. ఒక్కఁడు పాపము చేసినఁ
బెక్కురు నిర్దోషులకును వెత గలుగుఁజుమీ
యక్కట సర్పముచేరిన
యక్కొలనం గలుగు మీల కాపదరాదే

### 19. దైవమునునమ్మి చేసిన కార్యము చెడదు

పూర్వమొకప్పుడు రాక్షసులు బలవంతులై దేవతలకు స్వర్గమునుండి వెడలఁగొట్టి వారి రాజ్యమునుఁ దామాక్రమించుకొనిరి. అప్పుడు దేవతలందఱు విష్ణుదేవుని గుఱించి తపస్సు చేసిరి. విష్ణువు వారికి ప్రత్యక్షమై “మీరు మందర పర్వతము కవ్వముగాను, వాసుకి యను మహా సర్పమును త్రాడుగను జేసి పాలసముద్రమును జిలికినయెడల అమృతము పుట్టును. దానిని మీరు త్రావిన మీకు మరణ భయము గలుగదు. అప్పుడు మీరు రాక్షసులను జయింపఁగలుగుదురు. మీరు రాక్షసులతో సంధి చేసికొని వారును మీరును కలసి చేసిననే యీ కార్యము మీకు సాధ్యమగు గాని లేకున్న కాదు” అని చెప్పెను. వారు విష్ణుదేవుని నమ్మి ఆయన చెప్పినట్లు రాక్షసులతో స్నేహము చేసికొని వారును తామును గలసి మందరమును మోచి తెచ్చునపుడు అది బరువెక్కువయై క్రిందఁబడెను. అప్పుడు మరల విష్ణువును ప్రార్థింప గరుడవాహనారూఢుఁడయి ఆయనయే వచ్చి పర్వతమును మోసికొనిపోయి పాలసముద్రము నొద్ద దించెను. అప్పుడు రాక్షసులు దేవతలు వాసుకిని ఆ పర్వతమునకుఁ జుట్టి పాలసముద్రమును చిలుకఁగా బరువై మందరము సముద్రములో బుడబుడ మునుగఁ జొచ్చెను. అప్పుడు దేవతలు మరల ప్రార్థింపఁగా విష్ణువు కూర్మమై అమృతము జనించు వఱకు కొండను మోచియుండెను.

కం. పురుషుఁడు తాఁ గార్యధురం
ధరుఁడ ననెడు గర్వమెడలి తతభక్తిఁ గ్రియా

**భరమున్ దేవునిపై నిడి**
**కరణీయముఁ జేసె నేని కాంచు జయంబున్**

## 20. శబరి గురుసేవ శ్రేయస్కరము

శబరి యనునది బోయది కావున దానికి నిష్ఠ తపము జపము మొదలయినవి తెలియక యుండినను పంపాతీరమున వనములో తపస్సు చేసుకొను ఋషులకు పరిచర్య చేయుచు వారు చెప్పిన పని భక్తితోను శ్రద్ధతోను చేయుచుండెను. దేవపూజకు వారి కావలసిన మంచి పూలు పత్తిరి, దేవునికి నివేదించి వారు భక్షించుటకుఁగాను మంచి ఫలములు,



శబరి శ్రీరామునకు ఫలము లిచ్చుట

అగ్నిహెూత్రము లొనర్చుటకుఁగాను కావలసిన సమిధలు, దర్భలు మఱి వారికేమి కావలసియున్నను ఆమెయే తెచ్చి యిచ్చుచుండెను. ఇట్లు భక్తితో శుశ్రూష చేయుటచేతను వారు మాటలాడుకొను భగవంతుని విషయము

వినుచుండుటచేతను ఆమెను మిక్కిలి దైవభక్తి జ్ఞానము కలిగెను. దేహములు విడిచి స్వర్గమునకు పోవునపుడు ఆ మునులు ఆమెతో నిట్లు చెప్పిరి. నీ భక్తికి శ్రద్ధకు సంతోషించితిమి. నీకు మేలు చేయఁగోరెదము. నీ విందే తపము చేయుచుండుము. కొన్నాళ్ళకు ఇచ్చటికి రామలక్ష్మణులు వత్తురు. వారిని పూజింపుము. వారిని దర్శించుటచే నీకు మోక్షము కలుగును" అని చెప్పి వారు పోఁగా ఆమె అట్టులే అక్కడనే కాచుకొని యుండెను. సీతను వెదకుచు రామలక్ష్మణులు అచ్చటికి వచ్చిరి. ఆమె భగవంతునికి మంచి ఫలముల నియ్యవలయునుగాని ఎండినవి, పండినవి రుచిలేనివి పనికిమాలిన వియ్యరాదని ఒక్కొక్క పండు కొంచెము రుచిచూచి బాగున్న వన్నియు ప్రోగుచేసి వారికి సమర్పించెను. భగవంతుఁడగు రాముఁడామె నిర్మలమైన భక్తికి సంతోషించినవాఁడై ఆ భుక్తశేషఫలముల నారగించి ఆమెకు మోక్షమిచ్చెను.

**ఆ. తపముఁ జేయుటకంటె జపముఁ జేయుటకంటె**
**వ్రతముఁ జేయుటకంటె వఱలుభక్తి**
**గురుల పాదసేవ నిరతంబు సేయుట**
**భద్రగతికి సులభ పథము పుత్ర**

## 21. హానికరమగు సత్యము పలుకరాదు

ఒక బ్రాహ్మణకుమారుఁడు అడవిలో ఆశ్రమము కుదుర్చుకొని తపస్సు చేయుచుండెను. ఒకనాఁడు ఆ త్రోవ కొందఱు బాటసారులు స్త్రీలు పురుషులు పోవుచుండఁగా దొంగలు తఱుముకొని వచ్చిరి. వారు పరువెత్తిపోయి బ్రాహ్మణ కుమారుని ఆశ్రమములోని పొదలలో దాఁగుకొనిరి. బ్రాహ్మణకుమారుఁడు అది చూచుచుండెను. తఱుముకొని వచ్చిన దొంగలు బాటసారు లెచ్చటికి పోయిరో తెలిసికొన లేక బ్రాహ్మణకుమారుని చూచి "అయ్యా, కొందఱు బాటసారు లీ ప్రక్క వచ్చిరే

వారెందుపోయిరి?" అని అడిగిరి. తెలిసియుండి తనకు తెలియదని చెప్పిన అసత్యమాడిన పాపము వచ్చునని తలఁచి తన్ను అడుగువారు దొంగలు అని తెలిసియును ఆ పొదలో దాఁగియున్నారని వాఁడు చెప్పెను. ఆ దొంగలు ఆ బాటసారులను పట్టుకొని మగవారిని జంపి ఆఁడువారిని చెఱచి వారి సొత్తంతయు దోఁచుకొనిరి. ఈ పాపకార్యమునకు బ్రాహ్మణకుమారుఁడు కారణముగాన అతఁడు నరకమునకు పోయెను.

**కం. భూతహితంబుగ బొంకిన**
**నాతతపుణ్యంబు నిచ్చునది సత్యంబై;**
**భూతహితమగు సత్యం**
**బేతఱి పాపంబె కూర్చుఁ గృతపుణ్యులకేన్**

## 22. చెడువానికి చెడుగుణము మంచివానికి మంచిగుణమే యెదుటివారియందుఁ గనఁబడును

ధర్మరాజు దుర్యోధనుఁడు దాయాదులు. వారికి ఇరువురకు రాజ్యము నిమిత్తమై యుద్ధము కానున్నప్పుడు వారిరువురును శ్రీకృష్ణునొద్దకు పోయిరి. నాకు జయము గలుగు ఉపాయము చెప్పుమని ధర్మరాజును, నాకు జయముగలుగు ఉపాయము చెప్పుమని దుర్యోధనుఁడును శ్రీకృష్ణు నడిగిరి. ఒక యుద్ధములో రెండు పక్షములవారికి జయమెట్లు గలుగును? అప్పుడు శ్రీకృష్ణుఁడొక యుపాయము చేసెను. ధర్మరాజును జూచి "ధర్మరాజా! నీవు లోకమునం దెచ్చటనైన నొక దుష్టుని కనిపట్టి తెచ్చితివేని నీకు జయము కలుగునట్లు చేసెదను" అని చెప్పెను. దుర్యోధనుని జూచి "దుర్యోధనా! నీవు లోకమునందు ఒక మంచివానిని కనిపట్టి తెచ్చెదవేని నీకు జయము కలుగఁ జేసెదను" అని చెప్పెను. అట్టులే తెచ్చెదమని వారిరువురు బయలు వెడలిపోయిరి. ధర్మరాజు ఊరు నాడు రోసినట్టియు దుష్టులని పేరుపోయినట్టియు మనుష్యులను కనిపెట్టివారి వృత్తాంత మంతయు విచారించి యిట్టులనుకొనెను. వీరిని లోకులు

దుష్టులనుకొనుచున్నారు. కాన వీరియందొక్క సద్గుణమైన లేదా యని తలంచి విచారించి వారియందేదైన నొక మంచిగుణము కనఁబడి “అయ్యో! వీరియందీమంచి గుణము కలదే. వీరి నెట్లు దుష్టులని కృష్ణునితో చెప్పుదును” అని తలఁచి యొక దుష్టునైన కనుఁగొనలేక మరలివచ్చెను. దుర్యోధనుఁ డొక్కఁడును మంచివాఁడు లేఁడని వచ్చెను.

**కం. కేవల పాపియె కానీ**
**కేవల పుణ్యుండె కాని క్షితి దొరకఁడయా;**
**పాపియని పుణ్యుఁడని తన**
**భావంబుకొలందిఁ దోఁచువారలు పరులున్**

## 23. కులమునకు గుణము కారణము

ఒక ఆశ్రమమునందు హారిద్రుమతగౌతముఁడను ఋషి శిష్యులకు బ్రహ్మవిద్య నేర్పుచుండెను. ఆ సమయంబున నొకబాలుఁడు కొన్ని ఫలములను, చిన్నకట్టెల మోపును తెచ్చి ఆయనకు సమర్పించి నమస్కరించి నిలువఁబడెను. “నాయనా! నీవెవ్వఁడవు? ఏల వచ్చితివి? నీపేరేమి” అని గౌతముఁ డతని నడిగెను. “స్వామీ నా పేరు జాబాల సత్య కాముండందురు. బ్రహ్మచారినై మీయొద్ద నుండఁ గోరి వచ్చితిని” అని అతఁడు చెప్పెను. “వత్సా! నీకులమేది?” అని యా ముని యనెను. “స్వామీ! నా కులమేదియో నాకు తెలియదు. నాతల్లిని అడిగివచ్చి చెప్పెదను” అని సత్యకాముఁడు నమస్కరించి సెలవు తీసికొనిపోయి తన రాకకై మక్కువతోఁ గాచియున్న తల్లినిజూచి “తల్లీ! నా కులమేది చెప్పుము. బ్రాహ్మణుఁడు కాని వానికి బ్రహ్మవిద్య నేర్పరాదని గౌతములవారు చెప్పిరి” అనెను ఆమాటవిని ఆమె యిట్లనియె. కుమారా? నీది యే కులమో నాకు తెలియదు నేను యౌవనమునఁ బెక్కురకడఁ బరిచారికనై యుంటిని. అప్పుడు నీవు నాకు లభించితివి అని చెప్పెను. ఆ మాటలు విని సత్యకాముఁడు గౌతము నొద్దకు పోయి నమ్కరించి “స్వామీ! నాకులమేదని

నాతల్లి జాబాల నడిగితిని తాను యౌవనమున పరిచారిణినై యుంటిననియు తనకు నేను లభించితి" ననియు నా తల్లి చెప్పెను. అని చేతులు కట్టుకొని నిలఁబడెను. వానినిజూచి శిష్యులందఱు కోపోద్రేకముచేత నెఱ్ఱనైన కన్నులతో వాని చుఱచుఱ చూచుచు "భ్రష్టా! దూరముపొమ్ము" అని గద్దించిరి. ఆ ముని తటాలునలేచి వాని కౌఁగిలించి "కుమారా! నీవు ఆ బ్రాహ్మణజాతుఁడవు కావు సందేహము లేదు" అని చెప్పి శిష్యులతో నిట్లనియె. "శిష్యులారా! వాఁడు చేయు పుణ్యాపాపముల వలన గుణము కలుగదు. గొప్పగుణము కలవాఁడే గొప్ప కులమును కలవాఁడని చెప్పవలయును. గుణములేని కులమేల? అవమానమును దాఁచిపెట్టవలసి యుండఁగా అసత్యమాడుటకు భయపడి వీఁడు సత్యమునే చెప్పినపుడు వీఁడు హీనకులునకు హీనగుణునకు పుట్టియుండునా! గుణహీనుఁడును అసత్యమాడువాఁడును నగు బ్రాహ్మణునకంటె గుణవంతుఁడు సత్యమాడువాఁడు నగు కులహీనుఁడే శ్రేష్ఠుఁడు. నీచ కులుఁ డిట్లు సత్యమాడఁడు" అని చెప్పి సత్యకాముని తన శిష్యులతోఁ జేర్చుకొనెను.

**తే.** **క్రోధమును గామలోభాది గుణములెల్ల**
**విడిచి సత్యముఁ దప్పక, వేదవిహిత**
**కర్మములఁ జేయుచుండినఁ గలుగుఁగాక**
**కలదె యూరక బ్రాహ్మణ గౌరవంబు**

## 24. ఆత్రగానికి బుద్ధిమట్టు

ఒకఁడొక ముంగిసను అతి ప్రీతితో సాఁకుచుండెను. ఒకనాఁడు వాఁడు వాని బిడ్డను తొట్టెలో పండఁబెట్టి యెచ్చటికో బయటకుపోయెను. ఒక సర్పము ఆ తొట్టెత్రాడుల వెంబడి దిగి తొట్టిలోనికి వచ్చుచుండుటను ముంగిస చూచి పాముమీఁది కెగిరి దానిని జంపి ఆ నెత్తుటితోనే తన యజమానున కెదురుగ వాకిటికి పోయెను. ఆ మూఢుఁడు అది తన బిడ్డను జంపి వచ్చుచున్నదని తలఁచి చేతిదుడ్డుకఱ్ఱతో దానిని జంపెను.

ఇంటిలోపలికి వచ్చి చూడcగా బిడ్డ ఆడుకొనుచుండెను. ప్రక్కన సర్పము తుండెములు పడియుండెను. "అయ్యో! నా బిడ్డను కాపాడుటకై పామును జంపి యుపకారము చేసిన ముంగిసను నిష్కారణముగ తొందరపడి చంపితినిగదా" యని యతc డేడ్చెను.

**కం. ముందుగ నాలోచింపక**
**తొందరపడి పనులుచేసి తోరపుదుఃఖం**
**బొందు నసమీక్ష్యకారి; య**
**మందమతి విమర్శసలుపు మతి పనిచేయున్**

## 25. తక్కువ వారిని అవమానించరాదు

పాండవులు జూదమాడి ఓడిపోయి రాజ్యము పోcగొట్టుకొని యరణ్యములలో వాసము చేయుచుండిరి. వారికి తన యైశ్వర్యము చూపి వారు దుఃఖించునట్టు చేయవలయునని దురుద్దేశము కలవాcడై దుర్యోధనుcడు తన భార్యలతోను పరిజనముల తోడను సేనల తోడను వాహనముల తోడను సమస్తవిభవముల తోడను వారు నివసించు అరణ్యమునకుపోయెను. పాండవు లున్నచోటికి సమీపమున నొక పెద్ద మడుcగు ఉండcగా నచ్చట వారు దిగుటకు ఏర్పాటు చేసుకొని డేరాలు గొట్టుచుండిరి. దుర్యోధనుని కుత్సితాభిప్రాయము దేవతలకు రాజైన దేవేంద్రుcడు తెలిసికొని దుర్యోధనుని తమ్ములతోను, భార్యతోను పట్టుకొని రమ్మని గంధర్వరాజగు చిత్రసేనుని పంపెను. వాcడు గంధర్వసేనతోవచ్చి దుర్యోధనుని ఓడించి అతనిని అతని తమ్ములను భార్యలతో బిడ్డలతో రథమునకు కట్టి తీసికొని పోవుచుండెను. అప్పుడు దుర్యోధనుని మంత్రులువచ్చి ధర్మరాజునకు మొరలు వెట్టిరి. ధర్మరాజు చిత్రసేనుడు ధర్మరాజునుచూచి "ఈ దుర్యోధనుcడు మిమ్ము అవమానింప వచ్చినాcడు. వానికి మేము శిక్షచేయుచుండ నీవేల మా మీదికి యుద్ధమునకు వచ్చితి"వని అడిగెను. ధర్మరాజు "పరులచే మా వంశమువారి కవమానము

గలుగునపుడు మేము నూటయేవురము. మాలో మేము కలహించినపుడు వారు నూర్వురే. మేము ఏవురమే. మాలో మాకు విరోధ ముండినను వంశమునకు పరులచే అవమానము కలుగనీయరాదు" అని సమాధానము చెప్పెను.

**కం. దైవాయత్తంబగుఁజు**
**మ్మా విభవము; దాని కలిమి మనుజుఁడు పరీ**
**భావింపరాదు పేదల**
**నేవేళకు నెట్టిదశ వహించునొ తానున్**

## 26. ఐశ్వర్యమదము

ఇంద్రుఁ డొకనాఁడు ఐరావతమునెక్కి సమస్తదేవతలు కొలుచుచుండ అప్సరసలు వింజామరలు వీచుచుండ మహావైభవముతో వయ్యాళి వెడలెను. అట్లు పోవుసమయంబున దుర్వాసుఁ డెదురుపడి ఇదియొక దివ్యమైన సరమని మందారదామ మొకటి యిచ్చెను. ఇంద్రుఁడు దానిని గైకొని తన యేనుఁగు కుంభస్థలమునకుఁ జుట్టెను. అది తొండముతో దానిని తీసి నేలఁబెట్టి కాల రాచెను. తానిచ్చిన మాలికకు వచ్చిన గతిచూచి దుర్వాసుఁడు మిక్కిలి కోపించినవాఁడై యిట్లనియె. "ఇంద్రా! ఎదురుగ వచ్చిన నన్ను ఐశ్వర్య మదమున నమస్కరింపవైతివి. వాహనము దిగవైతివి. గౌరవింపవైతివి. పిన్న పెద్ద యను మర్యాద మఱచితివి. అంతియగాక నేను దివ్యమని యిచ్చిన మహామహిమగల మాలికను నీవు ధరింపక ఏనుఁగునకుఁ జుట్టితివి. అది దాని నేలఁబెట్టి కాల రాచెను. ఇది నీవు నాకు చేసిన పరిభవముగదా! ఇది యంతయు నీ సంపద మత్తువలనఁ గదా చేసితివి. నీ యైశ్వర్యమంతయు సముద్రముపాలై పోవునుగాక" అని శపించెను. అట్టులే యింద్రుని యైశ్వర్య మంతయు పాడైపోవ నతఁడు శత్రులగు రాక్షసులఁ గొలిచి బ్రతికెను.

కం. కనియుం గానఁడు, వినియున్
వినఁడున్, శ్రీయనెడు వ్యాధిఁబీడితుఁ; డతనిన్
మనుజులఁ గలుపం గోరినఁ
జను లేమిడి యనెడిమందు సమకూర్పంగన్

## 27. దయావంతులు దీనుల కష్టము చూడలేరు

దేవతలు రాక్షసులు అమృతము పడయఁగోరి పాలసముద్రమును చిలికిరి. బావి త్రవ్వఁబోయిన భూతములు వెడలునట్లు తొలుత ఆ సముద్రములో హాలాహలమనువిషము పుట్టెను. దాని వేఁడిమికి దేవతలు రాక్షసులు తాళఁజాలకపోయిరి. ఆ విషమువ్యాపింపఁగా లోకములు నాశమగుచుండెను. ప్రజలు చచ్చిరి. దేశములు కాలిపోయెను. అదిచూచి భయపడి దేవతలందరు పోయి శివుని పాదములమీఁద పడి "దేవా! శరణుశరణు రక్షింపుము" అని వేఁడుకొనిరి. అప్పుడు శివుఁడు పార్వతినిజూచి "దేవీ! ఏమిచేయు మనెదవు. లోకము నాశమగుచున్నది. దేవతలు శరణుజొచ్చిరి. విషమును నాయందుఁ దప్ప నింకెక్కడ నుంచుటకు సాధ్యపడదు. విషము మ్రింగుమనెదవా" యనెను. వలదు అనిన లోకము పాడగును. శరణాగతుల రక్షింపనట్టగును. మ్రింగుమనిన మగఁ డేమగునో యని యాలోచించి నేను పతివ్రతను. నామంగళసూత్రమున కేమిహాని? యని ధైర్యము వహించి "దేవా! మీరు దానిని త్రాగి జగము రక్షింపుఁడీ" యని పార్వతి యనెను. శివుఁడును వెంటనే ఆ విషము నంతయు మ్రింగి కంఠమునందే నిలిపి లోకములను రక్షించెను.

కం. శరణన్నవారిఁ బ్రోవఁగఁ
గర మనురాగంబు దోఁపఁ గాకోలంబున్
హరుఁ డొడిసి పట్టి మ్రింగెను
గరుణాత్ములు చేయలేని కార్యము గలదే

## 28. ఊరివారి బిడ్డను రాచవారిబిడ్డ కొట్టిన రాచవారిబిడ్డను దేవుఁడు కొట్టును

దేవతలు రాక్షసులు పాలసముద్రమును చిలికిరి. దానియందు అమృతము పుట్టెను. వెంటనే రాక్షసులు బలవంతులై దేవతలను తఱిమి ఆ యమృత కలశమునంతయు వారే అపహరించిరి. దిక్కులేనివారికి దేవుఁడే దిక్కు అని దేవతలు విష్ణుదేవుని గూర్చి ప్రార్థించిరి. అప్పుడు విష్ణువు మోహిని వేషము వేసికొని తళుకు బెళుకు చూపులచేత మంచి మాటలచేత రాక్షసులను వంచించి నే నీ యమృతము పంచెదనని ఆ యమృతకలశము తాను తీసికొని దేవతలకే యమృతము నంతయు పంచిపెట్టి రాక్షసుల కేమియు లేకుండఁ జేసెను. రాక్షసులు యుద్ధమునకు రాఁగా వారి నందఱఁ జంపెను.

**కం. బలవంతుఁడ నే ననుచును**
**బలహీనుల నొంపరాదు, బాధించినచో**
**బలియురకు నెల్ల బలియుఁడు**
**జలజాక్షుఁడె వారి పొగరు సమయఁగఁజేయున్**

## 29. పరుల యున్నతికి అసూయపడరాదు

సూర్యచంద్రులు గ్రహములును మేరుపర్వతముచుట్టు తిరుగుచుండుట చూచి వింధ్యపర్వతము అసూయ కలిగినదై మేరుపర్వతమున కీ గౌరవము కలుగనేల? నాకు లేకపోనేల యని తలఁచి ఆకాశము నెత్తుపెరిఁగెను. తమత్రోవ కదియడ్డముగ వచ్చుటచే సూర్యచంద్రులు సంచారము చేయ సాధ్యపడకుండెను. రాత్రియని పగలని భేదము లేకపోయెను. లోకమల్లాడెను. దానిని చూచి దేవతలు కాశిలోనుండు అగస్త్యుఁడను మహాముని యొద్దకుపోయి లోకమునకు వింధ్యపర్వతము కలిగించిన యుపద్రవము చెప్పి దీని నెట్టులయిన అణపుమని ప్రార్థించిరి. అగస్త్యుఁడు భార్యాసహితుఁడై వచ్చి ఆ పర్వతమును జూచి "పర్వతోత్తమా! నేను దక్షిణమునకు పోవలయును. నేను ముసలివాడను. నిన్ను దాఁటలేను. నేల మట్టముగ కమ్మా" యనెను.

కాకుండిన ఆ ముని శపించునని భయపడి వింధ్యము నేలమట్ట మయ్యెను. అగస్త్యుఁడు దాఁటి దక్షిణపు వైపునకు వచ్చి "నేను మరల వచ్చువరకు నీవిట్టులే యుండుము" అని చెప్పెను. అగస్త్యుఁడు మరల ఉత్తరము పోనేలేదు. మునుపటి యున్నతిపోయి వింధ్యపర్వత మిప్పటికి మనుష్యులు దాఁటఁగూడిన స్థితిలోనేయున్నది.

**ఆ. పరుల గొప్పఁదనముఁ బరికించి చూపోక**
**కట్టి వేషమూను నల్పబుద్ధి**
**పరిభవంబు నొందుఁ బండితునట్టులు**
**పలుకు గ్రామ్యవాది భంగి దోఁప**

## 30. చేసిన ఋణము చెల్లింపక తీఱదు

ఒకనాఁడొక కాఁపు నాఁగటికి బలిసిన రెండెద్దులను గట్టి పొలము దున్నుచుండెను. ఆనాఁడది యేమియో కాని ఏనుఁగులవలె నుండు ఆ యెద్దులు మొండికిబడి లంకెవేసికొని అడుగెత్తి పెట్టక దుక్కిలోనే పండుకొనెను. కాఁపు వాఁడును వానిని ముల్లుకోలతోఁ బొడిచియు. తోఁకలు విఱిచియు, ముక్కరములు బిగించియు, మేడితోఁకతో బాఁదియు మోఁజేతఁ గ్రుమ్మియు వాఁతవేసియు నానావిధముల బాధించియు అవి లేవకున్న విసిఁగి "మిమ్ము మాదిగవాఁడు కోయ! మీకేమి పోఁగాలమే నేఁడు ఇట్లయినారు" అని వానిని దిట్టెను. ఓయిరైతా! నీకుఁగాను దేహకష్టముజేసి తీర్పవలసిన అప్పు నంతయుఁ దీర్చితిమి. నీకు ఇఁక రెండునూఱులు రూపాయలు ఇచ్చి మేము నీ ఋణము పూర్ణముగ దీర్చుకొనవలసి యున్నది. ఇఁక అరగంటకు నీత్రోవనొక సెట్టివచ్చును. వాఁడు మము రెండువందల కిమ్మని బేరమాడును. నీవు కాదు కూడదనక వానికి మమ్మిచ్చి ఆ రూపాయలు తీసికొనుము. వాఁడు మా కా మొత్తము ఋణపడి యున్నాఁడు" అని చెప్పెను. రైతు ఆ మాటలు విని ఆశ్చర్యపడి వానియొద్ద మీ రెన్నాళ్ళుండెదరని అడిగెను. వాఁడు మాకు అప్పుపడి నాఁడు గాని వానికి మేము అప్పుపడలేదు. నీవు రూపాయలిచ్చుటనే

తీసికొని మావెంట వచ్చి జరుగు వృత్తాంతము చూడుమని చెప్పి చివాలున లేచి అట్లు లక్ష్యములేక దెబ్బతినక అడుగు నిలుపక రెండెద్దులు దున్నుచుండెను. ఇంతలోనే ఒక భాగ్యవంతుఁడు సెట్టి ఆత్రోవ పోవుచు వానిని జూచి ఆహా యివి మన సవారిబండికి బాగున్నవని తలఁచి వానిని విక్రయింపుమని బేరమాడెను. పరీక్షకై కాఁపువాఁడొక్క రూపాయయైన యెక్కువ యిమ్మనెను. గాని సెట్టి ఇన్నూటికి పైన ఒక దమ్మిడియైన నియ్యనని చెప్పెను. కాఁపు వాఁడును పైకము తీసికొని కాఁడి యెద్దులను వానికిఁ బట్టి యిచ్చెను. సెట్టియును అవి దున్ని అలసియున్నవి. బండికి నేఁడు కట్టరాదు. మీరు దోలుకొని రండని వానిని సేవకుల కప్పగించెను. ఆ సెట్టియును ఇంటికిపోయి గాఁట వానిని కట్టి వేయించి స్నానము చేసి భోజనము చేయఁ బోయెను. ఇంతలో నీ రెండెద్దులు క్రుమ్ములాడి గాఁటిలోనే పడి చచ్చెను. ఇదంతయు చూచుచున్న కాఁపువాఁడు ఋణానుబంధము చెడ్డది కదా యనుకొనుచుఁ బోయెను.

**గీ. అల్పమైనఁ గాని యప్పుదీయఁగరాదు**
**తీసిరేని మరలఁ గాసునైన**
**విడక యీయ వలయుఁ, బెండ్లాలు బిడ్డలు**
**పశువులను ఋణానుబంధగతులు**

### 31. ఆశ్రితుని విడువరాదు

పాండవులు, ద్రౌపది, మహాప్రస్థానము పోవునపుడు వారిని ఒక కుక్క వెంబడించెను. అట్లు వారు పోవునపుడు ద్రౌపది, సహదేవుఁడు, నకులుఁడు, అర్జునుఁడు, భీముఁడు మరణించిరిగాని కుక్క మాత్రము ధర్మరాజు వెంటఁ బోవుచునేయుండెను. తరువాత ఇంద్రుఁడు వచ్చి "ధర్మనందనా! నీ వీ తేరెక్కి స్వర్గమునకు రమ్ము. నీవు చేసిన ధర్మములు ఫలించినవి అనెను. "అయ్యా యీ కుక్కను ముందు తేరెక్కింపుము. తరువాత నేనెక్కెదను" అని ధర్మరాజు చెప్పెను. ఆ మాటలు విని యింద్రుఁడునవ్వి "కుక్కయేమి! దేవతా విమానము నెక్కుటయేమి?

స్వర్గమునకు పోవుటయేమి! ఏమి వింతలు మాటలాడుచున్నావు. కుక్కలకు దేవత్వము కలుగునా" యని యింద్రుఁడు పలుకఁగా ధర్మరాజిట్లనియె. "సురలోకనాథా! మీరు మహాత్ములరు. నేను మీ సంశ్రితుండను. నాకై మీరిది దుష్కరమైనను చేయవలదా? ఈ శునకంబు నేనూరు విడిచినది మొదలు నావెంటనే వచ్చుచున్నది. అట్టిదాని నెందువిడిచి నేను వత్తును? దానిని విడువ నా మనసొప్పదు" అనెను. ఆ పలుకుల నాలించి యింద్రుఁడు "సత్పురుషులు వేఁటసమయమునందు తప్ప కుక్కలను తాఁకరు. కుక్కలను తాఁకువారికి తేజము నశించును. వారి పుణ్యములను క్రోధవశులను దేవతలు హరింతురు. అటులుండ నీవు కుక్కను స్వర్గమునకుఁ బిలుచుకొని పొమ్మని కోరెదవు. కోరికలు కోరినపుడు సాధ్యము అసాధ్యము ఆలోచింపవలదా" యనిన ధర్మరాజిట్లనియె. "మీవంటివారు నన్నాకార్యము చేయుమనుట న్యాయమా? ఆశ్రితులను భక్తులను వదలినఁగాని స్వర్గము లభింపదేని నాకాస్వర్గముతో బనిలేదు. ఆశ్రితులను వదలుట బ్రహ్మహత్య సమానములని పెద్దలు చెప్పుదురే" అనిన ఇంద్రుఁడు "రాజేంద్రా! స్వర్గమునైన విడిచెదఁగాని కుక్కను విడువను అను వెట్టివాఁడెందైనఁ గలఁడా? తమ్ములను భార్యలను వదలియు కుక్కను వదలననుట ఏమి వివేకము?" అనిన కుంతీనందనుఁడు "లోకపాలకా! నీకంటె నేను ధర్మజ్ఞుఁడను గాను. అదియునుగాక తెలిసిన పెద్దవారితో వాదింపరాదు. అయినను ఒక విన్నపము. నా తమ్ములను భార్యను నేను వదలుట అననేమి? వారి ఆయువు తీఱి వారు పోయిరి. ఆయువుతోనుండి ఆశ్రయించిన కుర్కురము నేనెట్లు వదలుదును? భయపడినవాని, భక్తుని, ప్రాణాపాయమున నొద్దఁజేరినవాని, దిక్కులేనివాని విడవరాదను శాస్త్రవాక్యము మీఱి నే నడువఁజాల. నీ యిష్టము వచ్చినయెడ కుక్కను నన్నుఁగూడఁ బిలుచుకొనిపొమ్ము. లేకున్న నూరక పొమ్ము. నేను రాను" అనుటయు ఆమాట లాలించి కుక్కరూపముతో నున్న యమధర్మరాజు ప్రత్యక్షమై నీ ధర్మమునకు మెచ్చితినని వరములిచ్చి ధర్మరాజును స్వర్గమునకుఁ బిలుచుకొని పోయెను.

కం. కష్టంబుల నష్టంబుల
నిష్టంబుగఁదన్నుఁ గొలిచి యేతెంచినచో
శిష్టుఁడు విడరా దెట్టి ని
కృష్టునినేన్ దనకు శ్రేయ మెసఁగెడి వేళన్

## 32. వంచకులు తమ మేలుకొరకే యితరులకు హితముపదేశింతురు

నైమిశమను పట్టణమున నొక బాలుఁడు మృతుఁడయ్యెను. ఆ బాలుని మిక్కిలి గారాబముతో పెంచుచున్న తల్లిదండ్రులు బంధువులు స్మశానమునకు ఆ శవమును దీసికొనిపోయి అనేక విధముల నేర్చుచుండిరి. అప్పుడొక గ్రద్దవారిని చూచి యిట్లనియె. "అయ్యలారా! లోకములో పుట్టినవారు చచ్చుటయొక వింతా? మీమీతల్లిదండ్రులు తాతలుఏరీ? మహారాజులందఱు ఏరీ? అట్టి వారందఱు పోఁగా జేనెఁడు పిల్లవానికై యేడ్చెదరా? ఏడ్చినంత చచ్చినవాఁడు లేచి వచ్చునా? సాయంకాల మగుచున్నది. ఇఁక స్మశానమున మీరుండరాదు. రాక్షసులు భూతములు పిశాచములు సంచారములు చేయు సమయమైనది. మీ ప్రాణము మీఁదికి వచ్చును. పీనుఁగును పాఱవైచి పొండు" అని చెప్పెను, వారు అట్టులే పీనుఁగును విడిచిపోవ లేచిరి. అప్పుడొక నక్క వచ్చి "మీరు మనుషులు గారా? దయాదాక్షిణ్యములు లేవా? చంద్రబింబమువలె నుండు కూనను విడిచిపోవ మీకు కాలెట్లాడెను! మనస్సు ఎట్లు ఒప్పెను? మీవి బిడ్డలఁగన్న కడుపులు కావా? బిడ్డను చూచి కడుపు దుఃఖముపోవ నోరార నేడ్చుటకును మీకు కష్టముకదా? ఈ బిడ్డ మీకింత బరువుగా నుండెనా? ఇంటిలోని కుప్ప పాఱవేసినట్లు పాఱవేసి పోవుచున్నారే. సూర్యుఁ డిప్పుఁడే కదా అస్తమింపఁ బోవుచున్నాఁడు?" అనెను. ఆమాటలు విని మరల వారు కూర్చుండి యేడువసాగిరి. అప్పుడు గ్రద్ద వారలతో నిట్లనియె. "నక్కమాటలు విని చచ్చినవారి కేడ్చెదువారిని నే నెచ్చట చూడలేదు. యముఁ డెవ్వరికైనఁ దయ తలఁచినమాట యెన్నఁడైన వింటిరా? చచ్చినవాఁడు మరల బ్రతుకునా? చీఁకటి పడువఱకు మీరుంటిరేని రాత్రియందు వీనికి

ఉదక దానముకూడ లేకుండఁ జేసి వానిని నరకమునకుఁ బంపెదరు. అంతియకాని మఱి యేలాభము లేదు" అనిన జంబుకము వారలఁ జూచి "గ్రద్దకు దయయును గలదా? నిద్రపోవుచున్నట్టులుండు ఈ బాలుని చూచిన మాయట్టి మృగములకును కన్నీరు కాఱుచున్నదే! ఇఁక కన్న తల్లిదండ్రుల కడుపులోని చిచ్చెట్టులుండునో! చచ్చినవారు బ్రతుకరని యేమి నిశ్చయము? లోకమున చచ్చి బ్రతికినవా రెందఱు లేరు?" అనెను. అప్పుడు గ్రద్ద "నేను పుట్టి వేయి సంవత్సరములు అయినవి. స్మశానమునకు వచ్చినవారు మరల పోలేదు. ఈ దేహమునఁగాదు గాని మఱియొక దేహముతో వీఁడు మరల బ్రతుకవచ్చును. అంతియకాని ఈ దేహముతో వీఁడు బ్రతుకుట కల్ల" యనెను. ఆ మాటలు విని వఱదు "అయ్యలారా! అల్లరి గ్రద్దమాటలు నమ్మకుఁడు. చచ్చిన బిడ్డను శ్రీరాముఁడు నారదుఁడు లోనైనవారు బ్రతికించరా; స్మశానమున శంకరుఁడుండును గదా. సంచారమునకు వచ్చి మీ దుఃఖమును ఆయన చూచి కరుణింపఁ గూడదా. అంతవఱకు ఉండుఁడు. అప్పటికి బ్రతుకకున్న ఆవల పొందు. ఇంతలో చెడినదేమి" యనెను. వారట్టులే యేడ్చుచుండిరి. రాత్రులయందు గ్రద్ద సంచరింపదు. రాత్రికాఁగానే అది వెడలిపోవును గనుక పగలుండఁగానే పీనుఁగును వారువిడిచిపోయినఁ దాను దినవచ్చునని గ్రద్దయును, పగలైన యెడల గ్రద్ద తన్ను ఆ పీనుఁగును తాఁకనీయదు. రాత్రియైన తానే తినవచ్చునని నక్కయు వారి కిట్లు బోధించెనుగాని పిల్లవానిపైఁ బ్రేమ రెంటికిని లేదు.

**తే.** **ఆత్మలాభంబు కోరి మమాప్తులట్లు**
**మాయలాఁడులు కొందఱు మధ్యవర్తు**
**లగుచుఁ దగవులు వచియింతు రల్లవాని**
**బుద్ధిమంతుఁడు నమ్మఁగబోల దెపుడు**

## 33. సత్కీర్తి స్వర్గము కలిగించును

ఇంద్రద్యుమ్నుఁడను రాజు స్వర్గమున నుండఁగా దేవతలతనిని జూచి "రాజా! నీవు సంపాదించిన పుణ్యము సమసిపోయినది. నీకీర్తి లోకమున

నశించినది. కావున మరల భూలోకమునకు పొమ్ము. ఇందుండ నర్హుఁడవు కావు" అనిరి. ఆ మాటలు విని ఆ రాజు మార్కండేయు నొద్దకు పోయి "మునీంద్రా! నేను ఇంద్రద్యుమ్నుండను వాఁడను. నన్ను నీ వెఱుఁగుదువా?" యనెను. అయ్యా! నిన్ననే నెఱుఁగను. హిమవంతము శిఖరమున ప్రావార కర్ణుఁడను ఘూకము కలదు. అది నిన్ను ఎఱిఁగి యుండవచ్చును దాని నడుగుము" అనెను. నీవు నాతోడరమ్మని యింద్రద్యుమ్నుండు మార్కండేయుని బిలిచెను. నేను రసాయన ఘుటిక తీసుకొని బడలియున్నాను. నేను రాఁజాలనని మార్కండేయుండు చెప్పెను. నేను మోసికొని పోయెద రమ్మని యింద్రద్యుమ్నుఁడు గుఱ్ఱమై మార్కండేయుని ప్రావార కర్ణునొద్దకు మోసికొనిపోయి మార్కండేయు నడిగినట్లు ఆ గూబను అడిగెను. అదియును నిన్ను నేను ఎఱుఁగను. ఇంద్రద్యుమ్నమను కొలనియందు నాళీకజంఘుఁడను కొంగగలదు. అది నాకంటె వయస్సు చెల్లినది. దానికి తెలిసియుండవచ్చును పొమ్మనెను. నీవును రమ్మని మునీంద్రునితో గూబను మోసికొని నాళీజంఘునొద్దకు పోయి "బకరాజా! ఇంద్రద్యుమ్ను నీ వెఱుఁగుదువా" యనెను. అదియును "అయ్యా! నిన్ననే నెఱుఁగను. ఈ కొలనియందు నాకంటె వృద్ధు అయిన కచ్ఛపము కలదు. దాని పేరు అకూపారము. అది నిన్నెఱిఁగియుండు నేమో అడుగుదము" అని తాను అకూపారుని తోడితెచ్చెను. అప్పుడింద్రద్యుమ్నుఁడు "తాఁబేఁటిఱేఁడా! ఇంద్రద్యుమున్న నెఱుఁగుదువా" యనెను. ఆ మాట వినిన తోడనే అది కదలమెదలక కొంత సేపుండి కన్నులనీరుగాఱ నిట్లనియె. "అయ్యో! ఇంద్రద్యుమ్న మహారాజును నేనే యెఱుఁగక పోవలయునా? ఆ పుణ్యాత్ముఁడు ఎన్నిమాఱులో నన్నిచ్చట కాపాడెనే. ఆయనను స్మరింపనిచో నాకు పుట్టు గతులు కలవా? ఆయన దానము చేయ ఆవుల మందల నిలుపఁగా వాని గొరిసెల రాపిడిచేతనైన గుంతయే యీ కొలను. ఇది ఆయన పేరనే ప్రసిద్ధికెక్కి యున్నది. ఎన్నాళ్ళకు ఆయనపేరు వింటిని. ఎన్నాళ్ళకు ఆయనను మరల కంటిని" అని డగ్గుత్తికతోఁ బలికెను. అప్పుడు దేవతలు "ఇంద్రద్యుమ్నా! నీ కీర్తి లోకమున శాశ్వతమయ్యెను. రమ్ము పోదము" అనిరి. వీరి నందఱ నెక్కడివారి నక్కడ

విడిచి వచ్చెదనని వారివారి నెలవులందు వారివారిని విడిచి రాజు విమానమెక్కి స్వర్గమునకుఁ బోయెను.

**కం. తన కీర్తి యెంతకాలము**
**వినఁబడు నిజ్జగమునందు వెలయఁగ నందాఁ**
**కను బుణ్యలోక సౌఖ్యం**
**బున నెంతయు నుల్లసిల్లుఁ బురుషుం డనఘా**

## 34. అపకారికి ఉపకారమే చేయవలెను

ఒక బాటసారి అడవిలో పోవుచుండఁగా పులియొకటి వానిని దఱుముకొని వచ్చెను. వాఁడు తటాలున సమీపమందున్న చెట్టెక్కెను. ఆ చెట్టుమీఁదనే ఎలుఁగు గొడ్డొక్కటి యుండెను. బాటసారి అయ్యో! చెట్టుక్రింద పులి చెట్టుమీఁద ఎలుఁగు. ఏమిగతి యని భయపడుచుండ ఎలుఁగు వానితో "నీకు నేను హానిచేయను, భయపడకుము" అనెను. అప్పుడు పులి ఎలుఁగు బంటిని చూచి యిట్లనియె. "ఓ మిత్రమా! ఈ మనుష్యుఁడు నీకును నాకును అడవిమృగముల కెల్ల శత్రువు. మనల నెక్కడజూచిన నక్కడ చంపనైనఁ జంపును లేక బంధమునైన నుంచును. ఇట్టివాఁడు చిక్కినపుడు విడువరాదు. కావున క్రింద త్రోయుము" అనెను. ఆ మాటలు విని భల్లూకము "వ్యాఘ్రమా! నీ మాట సరికాదు. మనకు శత్రువైనను మన యింటికి వచ్చినవానిని భయముగొన్న వానిని జంపరాదు. కావున భయపడి నన్నాశ్రయించి నాశరణము నొందిన వానిని నేనెట్లు చంపుదును? నేను చంపను, నిన్నుఁ జంపనీయను పోపొ"మ్మనెను. వ్యాఘ్ర మెంత చెప్పినను భల్లూకము వినలేదు. ఎంతసేపు వీఁడు చెట్టుమీఁదనే యుండునో చూతమని పులి చెట్టుక్రిందనే కాచియుండెను. కొంతసేపటికి ఎలుగు నిద్రించెను. అప్పుడు పులి మనుష్యుని జూచి యిట్లనియె "ఓరీ! నీవు బుద్ధిమంతుఁడవేని నామాట వినుము. ఎలుఁగు నిన్ను క్రిందఁ ద్రోయమికిఁ గారణము నీమీఁది ప్రీతిచేతకాదు. నేను వెడలిపోయిన తరువాత నిన్ను జంపి తానే భక్షింపవచ్చునని దాని

యభిప్రాయము. అది నీవు తెలిసికొనలేక యున్నావు. నీ మేలునకై చెప్పెదను వినుము నీవు చెట్టుమీఁద నున్నావుగనుక నీవు నాకు దొరకవు. కాఁబట్టి ఆశలేనికూటికి ఆకలిలేదన్నట్టు నీ యాశ మానుకొన్నాను. నీవు సుఖపడు మార్గము చెప్పెదను. తేరకు దాని వాతనేలపడెదవు? దానిని గ్రిందఁ ద్రోయుము" అని చెప్పెను. మూఢుఁడగు మనుష్యుఁడు దానిమాటలు నమ్మి నిద్రపోవు ఎలుఁగును క్రిందఁ ద్రోసెను. ఎలుఁగును నిద్ర మేల్కొని తటాలున కిమ్మలను బట్టుకొని నేలఁబడక మరల చెట్టుపైకి నెక్కెను. అప్పుడు పులి ఎలుఁగుతో నిట్లనియె "మిత్రమా! నామాట నీవు నమ్మవైతివికదా? మనుష్యులెట్టి ద్రోహులో తెలిసినదికదా? మేలుచేయువారికిని కీడు చేయువారు మనుష్యులే యనుట నీకు దృఢపడినది కదా. యిప్పుడైన నా మాటవిని యీ మిత్రద్రోహిని కృతఘ్నుని క్రిందఁ ద్రోయుము అనెను. ఎలుఁగు ఇట్లనియె. "శార్దూలమా! ఏల యీ పనికిమాలిన మాటలు? వాఁడు నాకు కీడుచేసిన నేను మరల కీడుచేయవలయునని సిద్ధాంతమా? మేలు చేసినవానికి మేలు చేయుటయందేమి విశేషము? కీడు చేసినవానికి మేలుచేయుటే యుత్తమ గుణలక్షణము. కావున ఈ బాటసారిని నీకు సమర్పింపను. పొమ్ము" అనెను. పులి ఆశ మానుకొనిపోయెను. తరువాత మనుష్యుఁడు చెట్టుదిగి తాను అడవి మృగమునకంటెను నీచుఁడ నైతిఁగదా యని సిగ్గుపడిపోయెను.

**కం. ఉపకారికి నుపకారము**
**విపరీతము గాదుసేయ వివరింపంగా**
**నపకారికి నుపకారము**
**నెపమెన్నక సేయువాఁడు నేర్పరి సుమతీ**

*శ్రీరామార్పణమస్తు*

* * *

# మూడవ భాగము

## 1. ఆచారము మొదటి ధర్మము

నలచక్రవర్తి మిక్కిలి ధర్మాత్ముఁడు. సదాచార సంపన్నుఁడు. అట్లుండియు ఒకనాడు మూత్రవిసర్జనము చేసిన పిమ్మట కాళ్లు కడుగుకొన మఱచెను. ఆ దోషముచేత కలిపురుషుఁడు ఆయనయందు ప్రవేశించి ఆయన మనస్సున వైకల్యము పుట్టించెను. ఆ కలిపురుషుఁడే నలరాజు విరోధియగు పుష్కరుఁడనువాని యొద్దకుపోయి నలునితో జూదమాడుమని చెప్పి ఆ జూదమునందు నలుని ఐశ్వర్యమంతయు పుష్కరునకు పోవునట్లు చేసెను. సంపద యంతయు పోగొట్టుకొని నలుఁడు తన భార్యయగు దమయంతితో అడవులపాలైపోయెను. అచ్చట కలిపురుషుఁడు పక్షియైవచ్చి నలుఁడు కట్టుకొన్న వస్త్రము నెత్తికొని పోయెను. తన పెండ్లాము చీరలో సగము చీర చించి తాను కట్టుకొని నలుఁడు నిద్రపోవుదమయంతిని విడిచిపోయెను. పోవుచుండ త్రోవలో ఆయనను పాము కఱచుటచేత దేహమంతయు వికారమయ్యెను. ఋతుపర్ణుఁడను రాజునొద్ద బాహుకుఁడను పేరు పెట్టుకొని వంటలవాఁడై నలుఁడు జీవించుచుండి తరువాత దమయంతి చేసిన యుక్తివలన ఆమెతో కలిసికొని మరల రాజ్యమును సంపాదించుకొనెను.

**కం. ఆచారమె తొలిధర్మం**
**బాచారమె సెలవు సిరికి, నఘనాశక మా**
**యాచారమె యది విడిచిన**
**నీచుఁ డిచటఁగుందు, మీఁద నిరయమునొందున్**

## 2. అల్పున కధికారము వచ్చిన అయినవారిని మఱచిపోవును

ద్రుపదరాజు ద్రోణాచార్యుఁ డనువారిరువురు బాల్యమునకొక గురువునొద్దనే విద్య నేర్చుచుండిరి. అప్పుడు వారు పరస్పరము మిక్కిలి స్నేహముగలిగి అన్నదమ్ములవలె మెలఁగుచుండిరి. ద్రోణాచార్యుఁడు బీదబ్రాహ్మణుఁడు. ద్రుపదుఁడు మహారాజకుమారుడు. కావున ఒకనాడు

ద్రుపదుఁడు మిత్రమా! నేను రాజనయిన తరువాత నీవు నాయొద్దకు రమ్ము. నీకు కావలసినంత ధనము రాజ్యముకూడ నిచ్చెదనని ద్రోణునితో చెప్పెను. తరువాత కొన్ని దినములకు ద్రుపదుఁడు పాంచాలదేశమునకే రాజయ్యెను. ద్రోణాచార్యునకు అశ్వత్థామయను కుమారుఁడు పుట్టి పాలకు ఏడువగా ద్రుపదుఁడు చెప్పిన వాక్యములు స్మరించి "పిల్లవానికి పాలకుఁగా నొక ఆవునైన నియ్యఁడా"యని తలఁచి ద్రుపదుపురికి పోయి అతనికి వార్త చెప్పి పంపెను. "బీద బ్రాహ్మణుఁడు వాఁడెక్కడ? మహారాజను నే నెక్కడ? వానికి నాకు స్నేహమఁట! వానిని రమ్మంటినఁట! వానికి నేనేమో వాగ్దానము చేసితినఁట. ఇవి యన్నియు తిరిపెగాని కూఁతలు. ఛీ! పొమ్మను" మని ద్రుపదుఁడు అవమాన పఱిచెను.

**తే.** **అల్పుఁ డధికారియైనఁ దా నర్థరాత్ర**
**మందు ఛత్రంబు పట్టుమం చనును గాదె?**
**కనులు గనరావు వీనులు వినఁగరావు**
**తనదుమిత్రుల మఱచు సజ్జనులఁ బఱచు**

### 3. అన్యాయమందుండు వానినితోడఁబుట్టువులును విడుతురు.

రావణాసురుఁడు సీతను దొంగిలించుకొని తెచ్చి లంకలో తన యంతఃపురమునం దుంచెను. ఇది యన్యాయ కార్యము. సీతను మరల రామునకిచ్చివేయుము అని తమ్ముఁడైన విభీషణుఁడు రావణునకు ఎన్నివిధములుగానో చెప్పెను. ఆమాటలు వినక రావణుఁడు విభీషణుని అవమాన పఱిచెను. గనుక విభీషణుఁడు అన్నను వదలిపెట్టి శ్రీరాముని యొద్దఁ జేరెను. విడిచిపోవుటకు వల్లలేనివారు అచ్చటనే యుండి విధిలేక యుద్ధముచేసి చచ్చిరి. సీతను కావ రావణాసురుఁడు కావలియుంచిన రాక్షసస్త్రీలే తుదకు ఆమెయందు పక్షపాతము వహించియుండిరి.

కం. ధర్మేతరవృత్తిని దు
ష్కర్మంబుల నాచరించు సహజన్మునకున్
నిర్మలమతి యెవఁడే స
త్కర్ముఁడు శత్రుఁడు మేలు తాఁగొలువంగన్

## 4. న్యాయమందుండువానికి పశుపక్షులును సాహాయ్యము చేయును.

శ్రీరాముఁడు న్యాయము తప్పనివాఁడు. శత్రువులందును దయకలవాఁడు. లోకమునకు మేలే కోరువాఁడు. ఎట్టివారి మనస్సును నొప్పింపనివాఁడు. పెద్దలయందు భక్తిగలవాఁడు! ఇన్ని సద్గుణము లాయనయందు స్థిరముగ నెలకొనియుండెను. అట్టివాఁడు భార్యయగు సీతతోడను, తమ్ముఁడగు లక్ష్మణుని తోడను పితృవాక్యమును పాలించుటకై యరణ్యములందు సంచరించుచుండెను. అట్లుండునపుడు రావణుఁడను రాక్షసుఁడు సీతాదేవిని దొంగిలించుకొనిపోయెను. ఆ సమయమున రామలక్ష్మణు లిరువురును సీతయొద్ద లేరు. రావణాసురుఁడు సీత నెత్తికొని ఆకాశమున పోవుటజూచి జటాయువను ముసలి గ్రద్ద అయ్యో! రామునివంటి ధర్మాత్ముని భార్యకా ఆపదయని ఱివ్వున నెగిరిపోయి అడ్డముదాఁకి యుద్ధముచేసి అతనిచే ఱెక్కలు కాళ్ళు నఱకఁబడి నేలకొఱిగి కొనయూపిరితో పడియుండి రామలక్ష్మణులు సీతను వెదకుచు రాఁగా వారికి రావణాసురుఁడు సీత నెత్తికొని పోయెనని మాత్రము చెప్పి ప్రాణము విడిచెను. ఆ పోబడి తెలిసికొని మఱియు పోఁగా కోఁతులకు రాజగు సుగ్రీవుఁడు రామునితో సహవాసముచేసి సీతాదేవిని వెదకివచ్చుటకై కోఁతులను నానాదిక్కులకుఁ బంపెను. అట్లు కొన్నికోఁతులు దక్షిణదిక్కున వెదకుచుండఁగా సంపాతియను గ్రద్ద రాముకథ విని జాలిఁజెంది రావణాసురుని అంతఃపురములో సీత యున్నదని చెప్పెను. అప్పుడు హనుమంతుఁడు లంకకు పోవ సముద్రము దాఁటుచుండఁగా

రాముకార్యమునకై పోవుచున్నాఁడు కావున మన మవశ్యము సాహాయ్యము చేయవలయునని మైనాకుఁడను పర్వతము తోడ్పడ వచ్చెను. రావణాసురుఁడు హనుమంతుని తోఁకను గాల్చినపుడు ఈయన రాముకార్యమునకై వచ్చినవాఁడు ఈయనకు కీడు కలిగింపరాదని అగ్నిహోత్రుఁడు హనుమంతునికి చల్లగ నుండెను.

**కం. ధర్మాన్వితవృత్తిని స**
**త్కర్మంబులఁ జేయువానిఁ గష్టము ముంపన్**
**అర్మిలి మృగఖగతతులున్**
**శర్మము ఘటియింపఁ జూచు శక్తికొలందిన్**

## 5. ఇరువురు కలహించిన మూఁడవవానికి లాభము

ఒక అరణ్యమున నొక పెద్ద మడుగుండెను. ఆ యరణ్యములో నొక మదించిన యేనుగుండెను. అది ఆ మడుగులోని నీళ్లు త్రాగను బోయినప్పు డంతయు అందున్న పెద్ద తాఁబేలు దానిని నీళ్ళు త్రాగనీయక పోరు పెట్టుకొనుచుండెను. ఈ విధముగ గజకచ్ఛపములకు విడువని పోరాటము కలుగుచుండెను. ఈ వృత్తాంతము గరుత్మంతునకుఁ దెలిసెను. ఆయన అమృతము తెచ్చుకొఱకు స్వర్గమునకుపోవ యత్నించినపుడు ఈ మడుఁగు సమీపమునకుఁ బోయెను. ఆ సమయమున నేనుఁగు తాఁబేలు హోరాహోరి యుద్ధము చేయుచుండెను. ఇదే సమయమున ఱివ్వున వాని రెంటిపై వ్రాలి కాళ్ళతో నొకదానిని తన్నుకొని ముక్కుతో నొకదానిని కఱచుకొని ఎగిరిపోయి ఆ రెంటిని భక్షించెను.

**ఆ. పోరు నష్ట మిడును; పొందు లాభం బిడుఁ;**
**బిట్ట పిట్ట పోరు పిల్లి తీర్చె**
**ననిన రీతి నిరువు రనిమొనఁ గలహింప**
**నన్యుఁ డొకఁడు లాభ మందుచుండు**

## 6. దైవసంకల్పము తప్పింప సాధ్యపడదు.

ఒకనాఁడు నారదమహాముని శంబరాసురుని చూచి "కృష్ణునకు రుక్మిణీదేవియందు జన్మించు కుమారుఁడు నిన్ను చంపును" అని చెప్పెను. శంబరుఁడు దీని నెటులయిన తప్పింప వలయునని యెంచి మాయా రూపముతో ఎవరికి తెలియకుండునట్లు కాచుకొని యుండి రుక్మిణీదేవి ప్రసవింపగానే ఆ కుమారుని ఎత్తికొనిపోయి సముద్రములో పాఱవేసి వాఁడు చచ్చెనని నమ్మి యూరికిపోయి ఆ విషయమే మఱచి సుఖము నుండెను. ఆ శిశువును ఒక పెద్ద చేఁప మ్రింగెను. అంతట శంబరాసురుని పట్టణపు బెస్తలు కొందఱు పడవలో వలలు మొదలైన సాధనములతోడ పోయి సముద్రములో చేఁపలు పట్టునపుడు వారి యదృష్టవశమున రుక్మిణీదేవి కుమారుని మ్రింగినచేఁపయే వారి వలలో చిక్కుకొనెను. ఆ చేపను వారు పట్టితెచ్చి అద్భుతరూపమైన చేఁప కావున కెవ్వరికిని నియ్యక తమ రాజైన శంబరునకే కానుకగ నిచ్చిరి. శంబరుఁడు దానిని తఱిగి కూరచేయుఁడని వంటవారికి అప్పటించెను. వారు చేఁప గడుపుకోఁగా అందు ప్రాణముతో నుండిన శిశు వొకటి వారి కనఁబడెను. వారా వృత్తాంతము శంబరునకు చెప్పఁగా అచ్చటనుండిన మాయావతియను స్త్రీ నేను సాఁకుకొనెదను. నాకిమ్మని అడిగెను. ఆ రాక్షసుఁడు తాను సముద్రములో పాఱవేసిన పిల్లవాఁడే వీఁడని గుర్తింపలేక మాయాపతికి ఆ పిల్లవానిని ఇచ్చెను. ఆ పిల్లవాఁడు క్రమముగ పెరిఁగి పెద్దయై యుద్ధమునందు శంబరాసురుని జంపెను. ఆ పిల్లవాని పేరు ప్రద్యుమ్నుఁడు.

**తే.** **"పౌరుషమును దైవంబు తోడ్పాటు లేక**
**ఫలము గాంచఁగ నేరదు పార్థివేంద్ర!**
**విత్తు సహకారి గాకున్న రిత్తనేల**
**వంధ్య యగుఁగాక తా ఫలవంత మగునె"**

## 7. తన పరువుకొలఁది ప్రవర్తింప వలయును.

ద్రుపదరాజునకు కృష్ణయని యొక కూతురుగలదు. ఈమెనే ద్రౌపదియని పిలుతురు. ఈమెను అర్జునునకు ఇచ్చి వివాహము చేయ ద్రుపదుఁడు తలఁచెనుగాని పాండవులు లక్కయింటిలో కాలిపోయిరని విని మిక్కిలి పరితపించెను. తరువాత తన కొమార్తెకు స్వయంవరము చాటించి ఆకాశమున నొక మత్స్యయంత్రము వ్రేలునట్లుచేసి దానిని వేయుటకు విల్లు బాణములు సిద్ధముచేసియుంచి ఈ వింటితో ఈ యయిదు బాణములతో నెవడు మత్స్యయంత్రము తెగవ్రేయునో వానికి తన కూఁతునిచ్చెదనని అందఱు రాజులకు తెలియఁ జెప్పెను. అప్పుడచ్చటికి వచ్చిన రాజులు ఒకరివెంట నొకరు వచ్చి ఆ వింటిని ఎక్కుపెట్టుటకైనను చాలక మరలి పోవుచుండిరి. అప్పుడు కర్ణుఁడు ఆ వింటియొద్దకు వచ్చి విల్లెక్కుపెట్టెను. అది చూచి ద్రౌపది వీఁడు శూద్రుఁడు. "వీఁడు యంత్రమును దెగ వ్రేసినను నేను వీనిని వివాహమాడను" అని చెప్పెను. ఆ మాటలు విని కర్ణుఁడు సిగ్గుపడి విల్లు క్రిందఁబెట్టి తలవంచుకొనిపోయెను.

**కం. పరువును మించిన కార్యము**
**దొరకొనఁగా రాదు దొడ్డదొర కొడుకైనన్**
**బరిహాసభాజనంబై**
**పరిభవముం గాంచుఁ జుమ్ము ప్రాజ్ఞులచేతన్**

## 8. చేయగూడని పనిని గురువు చెప్పినను చేయరాదు

కాశిరాజునకు అంబ, అంబిక, అంబాలిక యని ముప్వురు పుత్రికలుగలరు. అంబిక స్వయంవర కాలమందువ వారిని దనతమ్ములకిచ్చి వివాహము చేయవలయునని భీష్ముఁడు ఎత్తుకొని వచ్చెను. వారిలో అంబ తనకు సాల్వరాజుపై ప్రేమ యున్నదని ఆయనకిచ్చి వివాహము చేయునట్లు తనతండ్రి యిదివఱకే నిశ్చయించినాఁడని భీష్మునితో చెప్పెను. అట్లయిన

పొమ్మని భీష్ముఁడు ఆమెను సాల్వరాజునొద్దకు పంపెను మఱియొక మగవాఁడు తాఁకిన ఆఁడుది నాకేల! నాకు నీవు వలదు పొమ్మని సాల్వుఁడు ఆమెను మరల పంపెను. అంబ రెంటను చెడి తన తాతకు మిత్రుఁడైన పరశురాముని శరణుచొచ్చి తన కష్టము నెఱిఁగించెను. అప్పుడు పరశురాముఁడు చిన్నదానా! నీ యవస్థ సంతాపకరముగా నున్నది. “నీకు ద్రోహము చేసినవారెవరు? భీష్ముఁడా? సాల్వుఁడా? ఎవనిని ఏమిచేయుమనిన అది చేసెదను చెప్పుము” అనెను. “నాకీ కష్టదశకు భీష్ముఁడు కారణము గనుక ఆయన నన్ను పెండ్లిచేసికొనునట్లు చేయుము” అనెను. పరశురాముఁ డామాట నంగీకరించి భీష్ముఁడుండు హస్తినాపురికి అంబతోడ వచ్చి భీష్ముని పిలిపించి “నీవు ఈ అంబను వివాహమాడుము” అనెను. భీష్మునకు పరశురాముఁడు గురువుగనుక తనమాట మీఱఁడని పరశురాముఁడు తలఁచెను. భీష్ముఁడిట్లు చెప్పెను. “గురువర్యా! మా తండ్రి నిమిత్తమై నేను బ్రహ్మచర్యమును పూనియుండుట తెలిసి మీరట్లు చెప్పవచ్చునా? ఈ చిన్నది స్వయంవర మంటపములో తన చెల్లెంద్రతోపాటు స్వయంవర కన్యకల వేషము వేసికొని యుండెను. అందు నేను మనఃపూర్వకముగ చేసిన దోషమేదియు లేదు. కావున నేను బ్రహ్మచర్య వ్రతము విడువను” అనఁగానే కోపించి “దీనిని వివాహమాడెదవా? యుద్ధమునకు వచ్చెదవా?” అని పరశురాముఁడనెను. “మీరు నా గురువులు. మీతో నేను యుద్ధము చేయరాదు. అయినను మీరు అన్యాయముగ నన్ను అకార్యము చేయుమనుచున్నారు. నేను చేయనొల్లను. కావున యుద్ధమునకే వచ్చెదను” అని చెప్పి ఆయనతో యుద్ధము చేసి భీష్ముఁడు ఆయనను ఓడించెను.

**తే.** **కార్యమియ్యది యిదియు నకార్యమనుచుఁ**
**దెలియ కైనను గర్వంబు బలిమినైనఁ**
**గాని తెరువునఁ జనియెడి వాని గురువు**
**నైన దండింపవలయు ధర్మైకరతులు**

## 9. లోభము మహాపాపము

పూర్వకాలమున శ్వేతుఁడను రాజు కలఁడు. అతఁడు న్యాయముగ భూమిని పాలించినను దానమన నెట్టిదో యెఱుఁగఁడు. పుట్టి బుద్ధియెఱిఁగి లవమైనను సజ్జనులకు దానము చేసినవాఁడు కాఁడు. తనదేహమును మాత్రము చక్కఁగ పోషించుకొనుచుండెను. తనతోడ పంక్తిలోఁ గూర్చుండిన వారికైనను తనతోపాటు వడ్డింప నిచ్చినవాఁడు కాఁడు. తరువాత ఇతఁడు కొన్నాళ్ళు తపస్సుచేసి ఆ పుణ్యఫలము చేత బ్రహ్మలోకమునకు పోయెను. అక్కడికి పోయినను వానికి ఆఁకలి దప్పి వదలలేదు. ఆ బాధపడలేక బ్రహ్మదేవునిఁ జూచి “దేవా! సత్యలోకమునకు వచ్చినను నన్ను ఆఁకలిదప్పులు ‘బాధించుచున్నవి. ఇదియేమి ఆశ్చర్యము” అని శ్వేతుఁడడిగెను. ‘నీవు తపస్సుచేత, న్యాయ్యపరిపాలనము చేత పుణ్యము విస్తారముగ సంపాదించితివి కాని భూతతృప్తిగ కొంచెమైనను అన్నదానము చేసినవాఁడవు కావు. నీ దేహమె నీవు ముఖ్యముగ నెంచి దానిని కాపాడితివి. నీ పీనుఁగు భూలోకమున నొక యరణ్యములోని కొలనిలో తేలాడుచున్నది. ప్రతిదినము నీవు అచ్చటికి పోయి ఆ పీనుఁగును దిని ఆ నీళ్ళు త్రాగుము. నీ యాకలి దప్పులు చల్లారుచుండును. నీవు తినుచుండినను అది సమసిపోదు. మరల పెరుఁగుచునే యుండును” అని బ్రహ్మ చెప్పెను. అయ్యా! నా శవమును నేను దినుచు ఎన్నాళ్ళుండ వలయును అని శ్వేతుఁ డడుగఁగా బ్రహ్మ “అగస్త్యమహర్షి అచ్చటికి వచ్చును. ఆయన గ్రహించెనేని నీ పాపము సమయును” అని చెప్పెను. శ్వేతుఁడు దీర్ఘకాలము తన పీనుఁగును తానే తినుచుండి తుదకు అగస్త్యునకు దివ్యాభరణము దానముచేసి పాపముక్తుఁడయ్యెను.

**కం. కలదానిలోనఁ బ్రీతిని**
**సలుపం చేనిడక పరుల కతిలుబ్ధుండై**
**యెలమిని దానె భుజించినఁ**
**గలఁడు భుజింపంగఁ దనదు కాయము పుత్రా!**

## 10. పుణ్యపాపములు సమ భాగములు

ఒక లావుకపక్షి తనకు దేహముదురద యెత్తినప్పుడంతయు వాడుకగ నొక యరణ్యములో నొకచోట వెల్లకిల పండుకొని రాచుకొనుచుండెను. కొన్నాళ్ళకక్కడ ఒకచిన్న గుంత యేర్పడెను. ఆ తరువాత ఆ గుంతలో నొక అడవిపంది పొరలాడుచుండెను. ఆ గుంత మఱింత పెద్దదికాఁగా వానవచ్చినపుడు దానిలో కొంచెము నీళ్ళు నిలిచెను. ఆ బురదలో పొర్లుటకుఁగాను నొకదున్నపోతు వచ్చి దానిని మఱింత బెద్దదిగ చేసెను. ఇట్లుండ నొకనాఁడు ఒక రాజు వేటకై యా యడవికివచ్చి దప్పిగొని ఆ మరుభూమియం దెక్కడ జలముగానక తపించెను. అప్పుడాయన యొద్దనుండిన మంత్రి "రాజా! మనవలె ఈ యరణ్యమున బోవువారెందఱు నీటికై బాధపడుచున్నారో; మీరొక కొలను త్రవ్వించిన బాగుండు" నని చెప్పెను. కావలసిన ధనమిచ్చెదను, అట్టులే తగినచోట త్రవ్వింపుమని రాజు చెప్పెను. మంత్రా ఆ యడవియందుదిరిగి గుంతగానున్న యీ స్థలమే బాగని దానిని పెద్ద కొలనిగా త్రవ్వించెను. అనేక జీవజంతువుల కది యాధారముగనుండెను. తరువాత కొన్నాళ్ళకు ఆ రాజువచ్చి స్వర్గమునకు పోయెను. అచ్చట లావుకపక్షి, పంది, దున్నపోతు, తనమంత్రి తనతోపాటు సుఖమనుభవించుట చూచి ఆశ్చర్యపడి యీ పక్షి పశువులు ఏ పుణ్యముచేసి నాతో సమానముగా సుఖ మనుభవించుచున్నవి. ఈ మంత్రి నావలె ఏపుణ్యము చేసినాఁడు? అని రాజు ఇంద్రుని అడిగెను. నీవు మరుభూమియందు గొప్ప సరస్సు త్రవ్వించితివి కదా. అందు ఇవి నీకు సాహాయ్యము చేసి యున్నవి. అవి చేసిన దానినే నీవు వృద్ధిచేసితివి. అచ్చట కొలను త్రవ్వుమని నిన్ను ప్రేరించినవాఁడు ఈ మంత్రి. ధనము వెచ్చించివాఁడవు నీవు. కావున ఆ పుణ్యమునకు మీరందఱు సమభాగములుగ అనుభవించుచున్నారు అని చెప్పెను.

కం. పనిచేసినఁ జేయించినఁ
బనిచేయు మటంచుఁ జెప్ప బాగని మెచ్చన్

**ఘన దుష్కృత సుకృతంబులఁ**
**దును నాలవభాగ మొందుఁ దప్పక పుత్రా!**

## 11. ఉడుతకు ఉడుతభక్తి

శ్రీరాముఁడు లంకకు పోవుటకై వానరులచేత సముద్రమునకు సేతువు కట్టించుచుండెను. వానరులు మహాబలవంతులు గనుక కొండలు గుట్టలు చెట్లు తెచ్చి సేతువు కట్టుచుండిరి. శ్రీరాముఁడు దానిని పరీక్షించుచుండెను. అప్పుడొకచోట ఒక ఉడుత సముద్రపు నీళ్ళలో తడిసి యిసుకలో పొరలాడివచ్చి రాతికి రాతికి సందున యిసుక రాలునట్లు దేహమును విదిర్చి మరలపోయి తడిసి యిసుకలో పొరలాడి మరల ఱాలసందున ఆ యిసుకను విదలించుచుండెను. అప్పుడు రాముఁడు ఆశ్చర్యపడి దానినిపట్టి తెప్పించి యెత్తుకొని చేతులలో నుంచుకొని దేహమును నిమురుచు ఏల నీవిట్లు చేయుచున్నావని అడిగెను. అదియును "దేవా! నీవు మహానుభావుఁడవు. లోకకంటకుఁడైన రావణాసురుని చంపి లోకమునకు క్షేమము గలిగింపఁబోవుచున్నావు. నీ వింత గొప్ప కార్యము చేయనున్నప్పుడు నా శక్తికొలఁది నేనును తోడ్పడఁ దలంచితిని. నేను చేయుకార్యము మిక్కిలి అల్పమని నేనెఱుఁగుదును. నీవు గాని నేను చేయు కార్యము గొప్పతనముఁబట్టి కాదు అని నాకు తెలియును" అనెను, ఆ మాటలకు శ్రీరాముఁడు చాల సంతోషించి దానికి పుణ్యలోకము లిచ్చెను. ఆయనచేతితో నిమిరినందునకు గుర్తుగా ఉడుతల మీఁద మూఁడుచారలు నేటికి కనబడుచుండును.

**ఆ. కులము లేదనందు, గుణము లేదనఁదును**
**ధనము లేదనందు, దాతఁ గావు**
**పొమ్మనందు, భక్తిపూర్ణుఁడౌ నాతనిఁ**
**జేరదీయుఁగాని శ్రీవిభుండు**

### 12. శరణాగత రక్షణము

ఒక అడవిలో ఒక పెద్ద మఱ్ఱిచెట్టుమీఁద రెండు పావురములు గూఁడు కట్టుకొని వసించుచుండెను. ఒకనాఁడు ఆ రెండు పక్షులు ఆహారము సంపాదించుకొని వచ్చుటకై గూడు విడిచి బోయియుండు సమయములో ఒక వేఁటగాఁడు ఆ చెట్టు క్రింద నూఁకలు చల్లి ఉరిపన్ని యుండెను. పెంటిపక్షి తటాలున వచ్చి ఆ యురిలో చిక్కుకొనెను. బోయవాఁడు దాని ఱెక్కలు పీఁకి సంచిలో దానిని వేసికొనెను. తరువాత మగపక్షి వచ్చి గూఁటిలో నెంతసేపు కాచుకొనినను ఆఁడుపక్షి రాకుండుట జూచి దానిని తలఁచుకొని యేడువసాగెను. ఆ యేడుపువిని సంచిలోనున్న ఆఁడుపావురము తానున్న స్థితి దెలిపి మగపక్షిని ఊరార్చెను. ఇట్లు అవి మాటలాడు సమయంబున జడివాన గురియసాగెను. హెూరుమని గాలి వీవసాగెను. చీఁకట్లు క్రమ్మెను. బోయవాఁడు ఆఁకలికి మలమల మాఁడుచు చలికి గజగజ వణఁకుచు పరితపించెను. అప్పుడు ఆఁడుపక్షి మగపక్షితో నాకై యింక మీరు పరితపింపవలదు. నే నినందున్నాను. మనకు ఋణానుబంధము తీఱినది. వీఁడు మన చెట్టుక్రిందికి వచ్చినాఁడు. కావున మన కతిథి యయ్యెను. వీఁడు చలిచేత జావనున్నాడు. వీనికి చలి పాపుఁడు అని చెప్పెను. మగపక్షి ఆ మాటలు విని యెగిరి యెక్కడికోపోయి కొఱవితెచ్చి పుల్లలలోనుంచి మంటచేసెను. బోయవాఁడు చలికాఁచుకొని మగపక్షితో నా కాఁకలి యగుచున్నది యనెను. వేఱె ఆహారము లేనందున నన్నే తినుమని పక్షియు సంచిలోనుండి మెల్లగవచ్చి ఆయగ్నిలోనే దుమికెను. ఆ రెండుపక్షులను దేవతలు విమానముపై కూర్చుండఁబెట్టి స్వర్గమునకు గొంపోయిరి.

**కం. తమ కపకారము చేసిన**
**విమతులకేన్ గీడుతలఁప వెఱతురు తమ ప్రా**
**ణములన్ విడనాడియు శ్రే**
**యమె కూర్తురు సాదుబుద్ధు లవ్వారలకున్**

## 13. బలవంతులతో విరోధింపరాదు

ఒక పెద్ద యరణ్యమున నొక గొప్ప బూరుగువృక్షము గలదు. అది చాలకాలముగ నున్నదగుటచే మిక్కిలి లావగు బోదె గలదియై యుండెను. కొమ్మలు ఆకాశమును దగులుచుండెను. తనలావు ఎత్తు చూచుకొని మహాబలము కలదానని గర్వించి ఒకనాఁడు సామాన్యమైన గాలి వీవఁగా ఆ చెట్టు గాలిని చూచి మహాబలుఁడవని ఖ్యాతి చెందిన నీ బల మింత మాత్రమా నన్ను మించి బోఁజాలకున్నావే యని నవ్వెను. దానికి వాయుదేవుఁడు లావుగ నున్నంత మాత్రముననే బలము గలదానని గర్వింపకుము. నాకు కోపము వచ్చిన నీ వేమగుదువో యాలోచించుకొను మనియెను. ఆ మాటలు విని బూరుగుచెట్టు ఊహ్వానిన పోవువాఁడవు నీ బలమెంతయని పరిహసించెను. అట్లైన రేపు నా బలము చూపెదను. జాగ్రత్తతో నుండుమని చెప్పిపోయెను. అప్పుడు బూరుగుచెట్టు ఇట్టు లాలోచించెను. నిష్కారణముగ బలవంతునితో విరోధము కల్పించు కొంటిని. మేరుశిరము చిమ్మిన వాయుదేవుఁడెక్కడ? నేనెక్కడ? తేపు ఆయన వచ్చెనా వేళ్ళతోకూడ నన్ను ముక్కలుచేసి యెత్తుకొనిపోయి సముద్రములో పాఱవేయును. కాఁబట్టి ఆయన రాకముందు నేనే విఱిగి పడియుండెదను. వేళ్ళయిన నుండిన మరల వెరుఁగవచ్చునని కొమ్మలన్నియు విఱుగఁ జేసికొని మొద్దు మాత్రము నిలిచియుండెను. మఱుసటినాఁడు వాయుదేవుఁడు ఱివ్వునవచ్చి మున్నే విఱుగఁబడియున్న చెట్టునుజూచి నవ్వి ఇంతమాత్రమునకా అన్ని వీరోక్తులు పలికితివని పరహసించి పోయెను.

**కం. బలవంతునితో నెప్పుడు**
**కలహమునకుఁ జొరఁగరాదు; కలహించినచోఁ**
**దొలుతటి పదవియుఁ బోవును;**
**బలుపు బలంబనుచు నమ్ము బాలిశుఁ డాత్మన్**

## 14. అడుగని భక్తునికి దైవమన్ని యిచ్చును

ఉత్తానపాదుఁడను రాజునకు సునీతి పెద్దభార్య. సురుచి చిన్నభార్య. ఒకనాఁడు సునీతి కొడుకు ధ్రువుఁడను ఐదేండ్లు బాలుఁడు తండ్రితొడమీఁద కూర్చుండియుండగా సురుచిచూచి సవతికొడుకను మచ్చరముతో వానిని దిట్టి యీడ్చి క్రిందఁ ద్రోసెను. వాడు ఏడ్చుచు పోయి తల్లితో జరిగిన వృత్తాంతము దెలిపెను. ఆమె దుఃఖించి నాయనా! భర్తకు తనయందుఁగల ప్రీతిచే నీ సవతితల్లి యట్టులు చేసెను. తండ్రి రాజ్యమును నీవు ఆశింతువని ఆమెకు కోపము. నీకీ రాజ్యమేల? భగవంతుని గూర్చి తపస్సు చేయుము. ఇంతటి ఐశ్వర్యము నీకుఁగూడఁ గలుగునని బోధించెను. ఆ బాలుఁడు తల్లి చెప్పినట్టు అడవికిపోయి నారాయణమూర్తిని గుఱించి తపస్సు చేయఁగా ఆయన ప్రత్యక్షమై "బాలకా! నీ కేమి కావలయును; అడుగుము" అనెను. ఆయన దివ్య తేజముచూచి విభ్రమముచెంది "ఛీ భగవంతుఁడు ప్రత్యక్షమై నీ కేమీ కావలయుననిన తుచ్ఛమైన రాజ్యమా కోరుదును" అని తలఁచి నాపై నీ కృప యుండనిమ్ము. నా కేమి వలదు అనెను. నీవు రాజ్యము ఐశ్వర్యము కోరి తపస్సు చేసితివే ఏల యిప్పుడవి కోరవని నారాయణమూర్తి అడిగెను. రాజ్యమువలన పాపముతప్పదు. ఎన్ని దానధర్మములు చేసినను కనఁబడని నీవు కనఁబడగా నీయందలి భక్తికంటె నాకింకేమి కావలయును? తక్కినవి అన్నియు బందాలేకాని మోక్షము నియ్యవు అని చెప్పఁగా నీ మాటకు సంతోషించితిని నీవు ఐశ్వర్యముకోరి తపస్సు చేసితివి గనుక కొన్నాళ్ళు మీతండ్రి యనంతరము రాజ్యము, చేసి పిదప జ్యోతిశ్చక్రమున కంతయు ముఖ్యమైన ధ్రువమండలమునం దాధిపత్యము వహించి తర్వాత నా లోకమునకు రమ్ము అని వరమిచ్చి విష్ణువు మాయయైపోయెను.

**తే. భక్తియొక్కటె ముఖ్యంబు వయసు గాదు.**
**వసుధ భగవంతు సేవించు వారలకును;**

**బాలుఁడైనను వృద్ధయిన భక్తిఁగొలువ**
**నుభయలోకసుఖంబుల నొసఁగు విభుఁడు**

## 15. జూద మాడరాదు

ఆటలన్నిటిలో జూదము మిక్కిలి చెడ్డది. జూదరి యెట్టి యకార్యమైనఁ జేయును. జూదమందు న్యాయము కలుగదు. జూదమందు గెలిచినవానికి ఆశ యెక్కువగుచుండును. ఓడినవానికి చల మెక్కుచుండును. పాండురాజు కుమారులలో పెద్దవాఁడైన ధర్మరాజు దుర్యోధనునితో జూదమాడెను. ధర్మరాజు తన సంపదను రాష్ట్రమును వస్తువాహనములను ఓడి తుదకు తన నలువురు తమ్ములను ఓడి తననుకూడ ఓడిపోయి తరువాత తమభార్యయైన ద్రౌపదినిగూడ ఓడిపోయెను. అందఱు దుర్యోధనునకు దాసులైరి. ధర్మారాజునందు దుర్యోధనునకు ద్వేషముకలదు. కావున ద్రౌపదిని సభలోనికీడ్చి తెప్పించి చీర ఒలిపించెను. పదమూఁడు సంవత్సరము లరణ్యములలో పాండవులను వనవాసము చేయించి కష్టపెట్టెను.

**కం. జూదంబునఁ గల్లరి యగు**
**జూదంబున భ్రష్టుఁడగుచు జోరుండు నగున్**
**జూదంబున ద్రోహియు నగు**
**జూదంబున నష్టకష్టశోకము లొదవున్**

## 16. వేఁట లాడరాదు

జీవహింస మహాపాపము గనుక వేఁటలాడరాదు. వేఁటవలన పాపమెకాక యితరములైన యాపదలను కలుగుచుండును. దశరథుఁడు ఒకరాత్రి సరయూతీరంబున వేఁటలాడపోయెను. అప్పుడు ఒక బాలకుఁడు ఆ నదికినీటినిమిత్తమై వచ్చి కుండ ముంచెను. అది బుడబుడ చప్పుడు కాఁగానే అడవిఏనుఁగు నీరు త్రాగవచ్చెనని భ్రమించి దశరథుఁడు చప్పుడైనచోటికి సరిగా బాణము విడిచెను. ఆ బాణము తగిలి బాలుఁడు

అఱచి చచ్చెను. ఇదియేమి మనుష్యధ్వనియని సమీపించి ఋషి బాలకుఁడు తన బాణము తగిలి నెత్తురుకాఱు మేనితో నేలమీఁద బొరలుచుండుట చూచి రాజు చాలదుఃఖించెను. ఆ బాలకుఁడు రాజా? "అడవిలో తపస్సుచేయు నేను నీకేమి అపరాధము చేసితిని. నన్నేల చంపితివి? నా తల్లిదండ్రులు గ్రుడ్డివారు వారికి నేనుదప్ప నిఁక నెవ్వరులేరు. వారు దప్పిగొని నీరు దెమ్మనిన వచ్చితిని. నీ చేతఁ జచ్చితిని. వారి గతియేమి? ఈ మార్గమునఁ బొమ్ము. అచ్చట నొక గుడిసెలో వారుందురు. వారికీ వృత్తాంతము తెలుపుము. వారికిఁ దెలుపక పోయితివా వారు శపించిన వంశనాశమై పోదువు" అని చెప్పఁగా భయపడుచుపోయి ఆముసలివారికిఁ దాను దెలియక చేసిన పని యంతయుఁ దెలిపెను. వారును మావలె నీవు పుత్రశోకముతో మరణింపుమని శాపముపెట్టి అగ్నిహోత్రములో ప్రవేశించి ప్రాణములు విడిచిరి.

**కం.** **ఆకులొ యలములొ మేయుచు**
**నేకీడు నొనర్ప కెవరి కేనియు మేనిన్**
**సాఁకుకొను వన్యమృగముల**
**నీకట వధియిం పఁబాపమబ్బుట యరుదే**

### 17. నీచులు తమ మేలునకై సాధువులకు కీడు చేయుదురు

దశరథమహారాజు పెద్దభార్య కౌసల్య. రెండవ భార్య సుమిత్ర, మూఁడవ భార్య కైకేయి. కౌసల్య కొడుకైన శ్రీరాముని యువరాజు చేయఁగోరి దశరథుఁడు పట్టాభిషేక ప్రయత్నము చేయుచుండెను. అది తెలిసికొని కైకేయి దాసియగు మంథర యను కుబ్జ యిట్లు లాలోచించెను. రాజు శ్రీరామునకు పట్టాభిషేకము చేసెనా నా సుఖము సమసిపోవును. రాముని తల్లియైన కౌసల్యయు నా యేలికసానియగు కైకేయియు సవతులగుటచేత మచ్చరము వహించియున్నారు. కైక చిన్నభార్య యగుటచేత రాజు ప్రీతిని సంపాదించుకొని గర్వించి సవతుల మనస్సులు

నొప్పించి యున్నది. తనకొడుకు యువరాజు కాఁగానే కౌసల్య అధికారము హెచ్చును. కైక అధికారము తగ్గును. కావున కైకేయిని ఎట్టులైన కష్టపెట్టవలయునని కౌసల్య యేమేమో చేయును. కైకేయికే సుఖము తగ్గినపుడు దాసీజనుల సుఖమును గుఱించి చెప్పనేల? అందునడ్డి గూని గలిగి వికారరూపముగల నాగతి చెప్పనేల? కావున నెట్టులైన ఈ పట్టాభిషేకము చెఱుపవలయునని తలఁచి మంథర చక్కఁగ కైకేయి యొద్దకు పోయి యిట్లు చెప్పెను. "రాముడు నీ సవతికొడుకు. రామునికి పట్టాభిషేక మయ్యెనా నీ సవతుల యధికారము హెచ్చును. తరువాత నీమాట సాగదు. రాజునకు నా మీఁద ప్రీతి కలదుగదా యనెదవేమో రాజునకు నీమీఁద నిజమైన ప్రీతిలేదు. అట్లు ప్రీతియుండిన నీకొడుకునకు పట్టాభిషేకము చేయును. రాముఁడు రాజయ్యెనా తల్లిమాట విని నిన్ను అడవులకు వెడలఁగొట్టును. జ్ఞాతిగావున భరతుని జంపించును; లేక చెఱయందుంచును. నీ మేలుకోరి చెప్పుచున్నాను" అని లేనిపోని మాటలు చెప్పి కైకమనస్సు. చెఱిచెను రాజు తనయింటికి వచ్చినపుడు కైక మోసముచేసి రెండువరములు కోరెను. అందొకటి రాముఁడు పదునాలుగు సంవత్సరము లరణ్యమునకుపోవుట. రెండవది భరతునకు పట్టాభిషేకము చేయుట. సత్యమునకు లోబడి దశరథుఁడు శ్రీరాముని దండకారణ్యమునకు పంపెను.

**కం. ఘాతుక మృగములు తమకై**
**హేతువు లే కన్యజీవి హింసయొనర్చున్**
**బ్రీతిచెడి యట్లె సాధు**
**వ్రాతమునకుఁ గీడు దుష్టవర్గము చేయున్**

### 18. తానొక్కటి తలఁచిన దైవమొకటి తలఁచును

తండ్రివాక్యము సత్యము చేయుటకును, సవతితల్లి కోరిక తీర్చుటకును శ్రీరాముఁడు తమ్మునితోడను భార్యతోడను దండకారణ్యమునకు పోయెను. అప్పుడు కైక యిట్లనుకొనెను. "ఆహా నేనెంత అదృష్టవంతురాలను. నా

సవతికి మేలుచేయవలయుననియుండు నా మగనిని మోసముచేసి నా కొడుకునకే పట్టాభిషేకము అగునట్లు, నా సవతి కొడుకు అరణ్యముల పాలగునట్లు చేసితిని. శ్రీరాముఁడు అడవికి పోయెను. నా కొడుకింక రాజగును. అప్పుడు నామాట కెదురుండదు. నేను అవునన్నది కాదన్న వారిని చంపించెదను. నేను కాదన్నదానిని అవునన్న వారిని నఱికించెదను. నా సవతుల నందఱ నేలఁబెట్టి కాల రాచెదను. ఇదివఱకే వారు నా పేరనిన భయపడుచున్నారు. వారి నీ దేశములో నుండనీయను. అప్పుడు రాజ్యము నేనే హాయిగ నేలఁగలను. పరిచారిక లందఱు నా యొద్దనే కొలువుచేయవలయును. నేను పాన్పు దిగనే దిగను. పదునాలుగేండ్లు దండకలో తిరిగి రాముఁడు మరలి వచ్చునా? రాఁడు. నిశ్చయము. కడుపునిండ కూడేలేక ఆఁకలితో గాలివానలకో కారుచిచ్చులకో చిక్కి చచ్చును, లేక రాక్షసులవాతఁ బడియైన పోవును. సీత మిక్కిలి యందగత్తె. దానిని రాక్షసులెవరైన ఎత్తుకొనిపోయిరా రాముఁడు మరల బ్రతుకఁడు రామునితోపాటు లక్ష్మణుఁడు, వారితోపాటు వారి తల్లులు పోదురు. ఆహా మంథర యెంత యుపకారము చేసినది. రాజ్యమంతయు సులభముగా మనకే దక్కె"నని యుప్పొంగి పోవుచుండెను. ఇంతలో పుత్రశోకము పట్టలేక దశరథుఁడు చచ్చెను. భరతుఁడయోధ్యకు వచ్చెను. కొడుకు రాఁగానే తాను ఘనకార్యము చేసితినని పొంగుచు కొడుకా! నీ కింత కార్యము చేసితినని సంతోషముతో చెప్పి ఇఁక నీవే రాజవు పట్టాభిషేకము చేసికొమ్మనెను. ఆ మాటలు వినగానే భరతునకు పట్టరాని దుఃఖము కోపమువచ్చి "ఓసి రాక్షసీ! రాజ్యము నిమిత్తమైనా తండ్రిని చంపి నా అన్నను అడవులకు పంపితివా? వారు నీ కేమి ద్రోహము చేసిరే పాపినీ? అన్న అనుభవింపవలసిన రాజ్యము నధర్మముగ గ్రహించు నీచుఁడనని తలఁచితివా దుష్టురాలా! అని కన్న తిట్లు తిట్టెను. అన్న మరల ఊరికి వచ్చువఱకు సుఖమక్కరలేదని సన్యాసివేషము వేసికొని నగరములో వసింపక నందిగ్రామములో నుండి నియతవ్రతమును పూనియుండెను.

కైకకు పూర్వముండిన సుఖము కూడ పోవుటే కాక దుఃఖము అవమానము గలిగి నేఁటికిని లోకముచేత తిట్టఁబడుచున్నది.

**ఆ. తానొకండు తలఁప దైవ మొండు తలంచు**
**ననెడు సూక్తి గర్వమునను మఱచి**
**తా స్వతంత్రుఁడనుచుఁ దలపోసి పనిచేసి**
**దైవహతుఁడు దుఃఖతప్తుఁ డగును**

## 19. దేవునిసొత్తు నపహరింపరాదు

శ్రీరాములవారు రాజ్యపరిపాలనము చేయుచుండ నొకనాఁడు ఒక కుక్క ఆయన నగరు ముంగల నిలబడి యేడ్చెను. ఆ ధ్వని విని శ్రీరాముఁడు వెలుపల వచ్చి యేల యేడ్చుచున్నావని యడిగెను. 'మహారాజా! నేను వీధిలో పండుకొనియుంటిని. నిష్కారణముగా నొక భిక్షుకుఁడు నా తలమీఁద గాయము పడునట్లు కట్టెతో కొట్టెను. నేనతనిని కఱవలేదు. ఆయననుచూచి మొఱఁగగూడ లేదు.' అని కుక్క చెప్పెను. వెంటనే ఆయన ఆ భిక్షుకుని పట్టి తెప్పించి యీ కుక్క నేల కొట్టితివి? నిన్ను కఱచెనా? అని యడిగెను. నన్ను కఱవ లేదు. నా త్రోవకు అడ్డము పండుకొని యుండెను. కావున వీఁడు నిష్కారణముగ కుక్కను గాయపరచెను. వీని కేమి? శ్రీరాములను జూచి మహారాజా! వీనికి దేవాలయమున పారుపత్తె మిప్పింపుము అని చెప్పెను. నేరముచేసినవానికి అది శిక్షయగునా యని శ్రీరాముఁడడుగ కుక్కయిట్లు వచించెను. "పూర్వజన్మమున నేను ఉత్తమకులమునఁ బుట్టిన బ్రాహ్మణుఁడను. దేవాలయమున పారుపత్తెదారుగ నుంటిని. ఒకనాఁడు పొరబాటున దేవునిసొమ్ము నా సొమ్ములోఁ గలసెను.

ఆ కారణముచే నాకీ జన్మము కలిగెను. ఆ యొక దోషము తప్ప నితరదోష మేదియు లేక పవిత్రుఁడనై యుండుటచే నాకు పూర్వజన్మ జ్ఞానము కలిగెను. తామసుడగు ఈ భిక్షకుఁడు ఆ యుద్యోగమునందుండిన నేగతిఁ బట్టునో యెవఁడెఱుఁగును" ఆ మాటలు విని రాముఁడు ఆ భిక్షుకు నట్టులే దేవాలయమున కధికారిగఁ బంపెను.

కం. నైవేద్య మొకటి తక్కఁగ
దేవస్వము తెలిసియైనఁ దెలియకయైనన్
దా వినియోగించుకొనం
గా వచ్చెడి మేనఁ గుక్కకడుపునఁ బుట్టున్

## 20. ఆశ్రయమును విడువరాదు

ఒక అడవిలో నొక మంచి మామిడి చెట్టుండెను. దానిని ఆశ్రయించుకొని అనేక జీవజంతువులు వసించు చుండెను. ఒకనాఁడు వేఁటకాఁ డొకఁడు వేఁటలాడు సమయమున విషముపూసిన ఆ బాణము గుఱితప్పి ఆ చెట్టు మొదట తగిలెను. ఆ విషముచేత ఆ చెట్టు ఎండిపోవఁ బ్రారంభించెను. చెట్టు ఎండుకొలది దాని నాశ్రయించిన మృగములు పక్షులులోనగునవి ఆ చెట్టును విడిచిపోయెను. ఒక చిలుక మాత్రము చెట్టంతయు తుదముట్టు ఎండినను విడువక యుండెను. ఇంద్రుఁడొకనాఁడు ఆ చిలుకను చూచి "కీరమా! యీ యెండినచెట్టు నిన్ను ఎండనుండి వాననుండి రక్షింపఁగలదా? చిగురులు, కాయలు, పండ్లు ఇచ్చి పోషింపఁగలదా? ఏల దీనిని విడువకయున్నా" వనెను. చిలుక యిట్లు చెప్పెను. ఈ వృక్షము బాగుగ బ్రతికిన కాలములో నాకు అన్నివిధముల సౌఖ్యములు గలిగించుచుండెను. నా దౌర్భాగ్యము కొలఁది దానికి కష్టకాలము వచ్చినది. తినువారి దురదృష్టముచేతనే పోషకులకు కీడువచ్చును. నా పాపముచేత దానికి కీడు గలిగించుటగాక నేను విడిచియు పోవలయునా! సంపదగలవేళ త్రోవను పోవువాఁడును నేను బంధువునని వచ్చును. కష్టవేళల అన్నదమ్ములును దగ్గఱ చేరరు. ఇట్టివారు ద్రోహులు. పెట్టినన్ని దినములు తిని కష్టకాలమున పోషకుని విడిచిపోవువాఁడెట్టి నీచుఁడు. తనకు లేకున్న తాను పెట్టకున్న మానెనుగాని మంచిమాటలకును కూడనుండుటకు నేమి కష్టము? కావున మునుపు నా కిది చేసిన యుపకారము స్మరించి నేను దీనిని విడువఁజాలకున్నాను" అని చెప్పెను. ఇంద్రుఁడు దాని కృతజ్ఞతకు మెచ్చుకొని చెట్టునకు ప్రాణమిచ్చెను.

కం. పెట్టిన పోసిన దినములc
గట్టు కదలకుండc దినుచుc గష్టపుదశ రా
నెట్టన రక్షకు విడిచెడి
కట్టిcడికంటెను ఖలుండు కనరాcడెందున్

## 21. అనసూయ

అత్రిమహామునిభార్య అనసూయాదేవి. ఆమె మహాపతివ్రత. ఆమె పాతివ్రత్యమును పరీక్షింపవలయునని బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుcడు బ్రాహ్మణవేషములు వేసికొని యతిథులవలె ఆమె యింటికిc బోయిరి. ఆమె వారిని గౌరవించి ఆకులో అన్నముపెట్టు సమయములో వారు ముగ్గురు "నీవు దిసమొలతో వడ్డించినcగాని మేము భోజనము చేయము" అనిరి. ఆమె తన తపస్సుచేత వారెవ్వరైనది యెరిcగి కానిండని మంత్రించి అక్షతలు నీళ్ళు వారిపై జల్లెను. వారు వెంటనే కావు కావుమని యేడ్చుచు చంటిబిడ్డలైరి. వారికి తానే పాలిచ్చి రక్షించుచుండెను. ఈ సమాచారము తెలిసి సరస్వతీదేవి, లక్ష్మీదేవి, పార్వతీదేవి అనసూయాదేవి యొద్దకు వచ్చి పతిభిక్ష పెట్టుమని వేcడుకొనిరి. అప్పుడు వారిని ఆమె యథాప్రకారముగc జేసెను. త్రిమూర్తులు మెచ్చుకొని నీ కేమివరము కావలయునని యామెను అడిగిరి. మీరు మువ్వురు నా కడుపున కుమారులుగc బుట్టుcడని గోరెను. అట్టులే బ్రహ్మదేవుడు చంద్రుcడుగను, విష్ణువు దత్తాత్రేయుcడుగను, శివుcడు దూర్వాసుcడుగను యామెకు కొడుకులుగc బుట్టిరి.

గీ. వార్ధిలోన మునిcగి బ్రతుకcగవచ్చును
మంటలోన దుమికి మనcగవచ్చు
శీలవతిని జెనకసిద్ధంబు తప్పదు
ప్రాణహాని మానహానియైన

## 22. తల్లివలెఁ గూతురు

కేకయరాజు ఒక ఋషీశ్వరునివలన చీమలభాష నేర్చుకొనెను. ఆ భాష నేర్చునపుడా ఋషీశ్వరుఁడు నీ వీ విద్యనుగాని, చీమలవలన విన్న వృత్తాంతముగాని ఎవరికైన చెప్పితివా నీ తలపగిలి చత్తువని చెప్పెను. ఒకనాఁడు కేకయరాజు భార్యతోడ అంతఃపురమున నుండు సమయమున రెండుకొరవి చీమలు మాటలాడుకొనిన వార్తవిని ఆయన నవ్వెను. ఆయన భార్య నిష్కారణముగా ఏల నవ్వితివి? చెప్పుమనెను. నేనా చీమలు మాటలాడుకొన్నది విని నవ్వితి ననెను. ఏమి మాటలాడెనని ఆమె యడిగెను. అది చెప్పిన యెడల నేను చత్తును చెప్పరాదు అని రాజు అనెను. తన్ను ఆయన అవమానించెనని కోపించి నీవు చచ్చిన చావుము నాకు నీవు విన్నది చెప్పక తప్పదు అని నిర్బంధపెట్టెను. మగఁడు అసత్యమాడడని తెలిసియు ఆ యిల్లాలు అతని చావునుకూడ సహించి ఆ వృత్తాంతము చెప్ప బలాత్కరించెను. ఆ రాజు తనకు భాషనేర్పిన మునియొద్దకు పోయి జరిగిన విషయము చెప్పెను. అతఁడు నీవు విన్నది చెప్పితివా చచ్చెదవు. పతిభక్తిలేని దుష్టస్త్రీ నిమిత్తము నీవు చావరాదు. అట్టిస్త్రీ దేశమందు నుండరాదు. కావున ఊరు వెడలఁగొట్టుమనెను. రాజు అట్టులే చేసి సుఖించెను. ఆమె కూఁతురు కైకేయి. ఆమెను వివాహమాడి ఆమె వలలోఁ జిక్కుకొని దశరథుఁడు చావనే చచ్చెను.

**ఆ. తల్లిగుణముఁబోలుఁ దనయ గుణంబును**
**గాన నొక్క కన్యకను వరింపఁ**
**దలఁచువాఁడు దాని తల్లిశీల మెఱుంగ**
**వలయు సుఖపడంగఁ దలఁచునేని**

## 23. చండి

దుర్వాసునకు చండి యను భార్యయుండెను. అది దుర్వాసునకున్న కోపగుణము గలది. అతఁడు చేయుమనిన పనినిచేయదు. వలదనిన పనిని

చేయును. ఈ దిన ముపవాస ముందును అని మగఁడనిన ఉదయముననే వంటచేసి బలాత్కారముగ ఆయన నోట అన్నము పెట్టును. ఈ దినము ఉదయముననే వంటచేయుము అనిన ఆ దినమందు వంటయే చేయదు. ఈ దినము నేను స్నానముచేయకయే భుజింతును అనిన ఆ దినము బిందెడు నీళ్ళుతెచ్చి ఆయన నెత్తిమీఁదపోసి దేహమంతయు తోమును. రేపు మనయింటికి అతిథులు వత్తురు. శుచిగా రుచిగా వంటచేయుమనిన మైలచీరతోనే వంటచేసి మాడిన అన్నము, ఉడుకని కూరలు తెచ్చి వడ్డించును. ఇట్లు వితండవాదము చేయుచుండుటచూచి దుర్వాసుఁడు తనకేది యక్కఱలేదో యది చేయుమని చెప్పును. ఏది కావలయునో అది వలదని చెప్పును. ఇట్లుండ ఆయన యింట పితృకార్య మొకటి వచ్చెను. ముందటినాఁటి రాత్రి దుర్వాసుఁడు రేపు పితృకార్యము నేను జరపువాఁడనుగాను. ఇంటికి కూరగాయలైనను తేను. నీవు ఏపని చేయవలదని చెప్పెను. చండి ఉదయమునకు ముందే లేచి గృహకృత్యము లెల్లఁ దీర్చి ఎచ్చటనో కూరగాయలు ధాన్యములు సంపాదించి తెచ్చి శుచిగా పాకము దీర్చి బ్రాహ్మణులకు నిమంత్రణము చెప్పి సర్వము సిద్ధముచేసి మగని బలాత్కరించి కర్మమంతయు జరగఁజేసెను. బ్రాహ్మణులును భుజించి లేచిరి. దుర్వాసుఁడు యథావిధి కార్యము జరిగెఁగదాయని పొంగి, ఓసీ! ఈ పిండములను ఆవునకు పెట్టుమనెను. ఆ యిల్లాలు వెంటనేపోయి కుక్కలకు పెట్టెను. శ్రాద్ధకార్య మంతయుఁ జెడిపోయెఁగదా యని దుర్వాసుఁడు కోపించి చండి దగ్ధయైపోవునట్లు శపించి తరువాత సుఖముండెను.

**ఆ. అలవి కాని యట్టి యాలి దాపురమైనఁ**
**గాఁపురంబుకంటెఁ గానమేలు**
**బాధ యొందు లేక పరమాత్మ ధ్యానించి**
**ముక్తిఁబడయవచ్చు మోహ మెడలి**

## 24. గురుభక్తి

ధౌమ్యుఁడను మునికి ఉపమన్యువు అని యొక శిష్యుఁడుండెను. శిష్యునకు తనయందు భక్తి గలదో లేదో యని తెలిసికొనుటకై “ఉపమన్యూ!

నీవు నేటినుండి నా యావులను మేపుచుండుము" అని చెప్పెను. ఆ ప్రకారమే యతcడు మేపుచుండెను. కొన్ని దినములయినతరువాత గురువు శిష్యుని జూచి "నీకు నేను నాయింట అన్నము పెట్టుటలేదుగదా నీ వెట్లు బలిసి యున్నావు" అని యడిగెను. "అయ్యా నేను మాధుకరమెత్తి జీవించుచున్నాను" అని శిష్యుడు చెప్పెను. "నీవు సంపాదించిన భిక్షము గురువున కర్పింపక నీవు తినవచ్చునా" యని ధౌమ్యుcడడిగెను. మఱునాcటినుండి బిచ్చమెత్తి తెచ్చినయన్నము గురువునకు నర్పించెను! అన్నమంతయు గురువే గైకొనెను గాని శిష్యున కేమియు నీయలేదు. ఇట్టుల కొన్నిదినములు జరుగ నొకనాcడు మరల శిష్యునిcజూచి "నాయనా! నీవు బిచ్చమెత్తి తెచ్చిన యన్నమంతయు నేనే తీసికొనుచున్నాను గదా నీవెట్లు దేహమును పోషించుచున్నా"వని గురువడిగెను. "అయ్యో రెండవసారి బిచ్చమెత్తుచున్నా"నని ఉపమన్యువు చెప్పెను. అప్పుడు గురువు "శిష్యా! బ్రహ్మచారి అయిదు ఇండ్లలోనే కదా బిచ్చమెత్తవలయును. మరల నీవు బిచ్చమెత్తినగృహస్థులను బాధించినట్టును ఇతర బ్రహ్మచారులకుc బోవలసిన యన్నము నీవు హరించినట్టును కాలేదా? రెండుమార్లు భిక్షమెత్తుము" అని చెప్పెను. ఇట్టు కొన్నాళ్ళుజరుగ గురువు "శిష్యా! ఇప్పుడెట్లు జీవించుచున్నావు" అని యడిగెను. "మీ యావుల పాలుద్రావి బ్రతుకుచున్నాను" అని శిష్యుcడు చెప్పెను. "నాయనా! నా యాజ్ఞలేక నా యావులపాలు ద్రావుట దొంగతనము చేయుటగదా" యనెను. మరలc గొన్నినాళ్ళకు అట్లే గురువు ప్రశ్నింపcగా శిష్యుcడు "దూడలు పాలు ద్రావునపుడు విడుచు నురుగుద్రావి జీవించుచున్నాను" అని చెప్పెను. ఆ మాటవిని "నీవు తమ్ము మేపుచున్నావను ప్రీతిచే దూడలు ఎక్కువగ నీకై నురుగు విడుచుచున్నవి. దానిచే వానికి పాలు తక్కువ పడుచున్నవి. నోరులేని దూడలకు పాలుతక్కువ యగునట్లు నీవు చేయవచ్చునా" యని గురువడిగెను. ఆ మాటలు సత్యమని ఉపమన్యువు ఆలోచించి ఆనాcటినుండి నురుగుద్రాగుట గూడ విడిచి జిల్లేడాకులు దినుచుండెను. ఆకారణముచే అతనికి కన్నులు పోయెను. ఒకనాcడు మెల్లగ తడవాడుచు

ఇంటికి వచ్చునపుడు వాఁడు కన్నులు తెలియక ఒక పాడుబావిలో పడె. ఆవులు మాత్రమింటికి వచ్చెనుగాని ఉపమన్యువు రాఁడయ్యెను. కొంతవఱకుఁ జూచి ధౌమ్యుఁడు తక్కిన శిష్యులతోఁడ నడవికి వెదకుకొనుచుఁ బోయి ఉపమన్యూ! ఉపమన్యూ! యని యఱచెను. అయ్యా! నేనిచట బావిలోఁ బడియున్నాను" అని ఉపమన్యువు గట్టిగా నఱచి చెప్పెను. గురువుపోయి బావిలో నుండినవానిని ఒడ్డునకుఁదీసి యేల దీనిలోఁ బడితివని యడుగ జరిగిన వృత్తాంత మంతయు నతఁడు చెప్పెను. గురువు సంతోషించి అశ్వనీ దేవతలఁ బ్రార్థింపుమని చెప్పిపోఁగా వేద ఋక్కులచే ఉపమన్యువు అశ్వినీ దేవతల బ్రార్థింపఁగా వారు ప్రత్యక్షమై ఉపమన్యూ! నీవీ భక్ష్యమును భక్షింపుము. నీకు కన్నులు వచ్చు" నని చెప్పిరి. "దేవతలారా! దీని నా గురువు ఆజ్ఞలేక నేను దినఁజాలను. దీనిని ముందుగ వారికి నర్పింపవలయును" అని ఉపమన్యువు చెప్పెను. "నీ గురువున కిట్టిస్థితి వచ్చియుండినపుడు మే మీ భక్ష్యమీయగా గురువున కొసంగకయే భక్షించెను. నీవును భక్షింపుము" అని దేవతలు చెప్పఁగా 'నేనట్లు చేయఁజాలను' అని యతఁడు చెప్పెను. ఆ మాటలకు వారు మిగుల సంతోషించి కన్నులిచ్చుటయేగాక వేదములు శాస్త్రమును ఆయన మనస్సునందే ప్రకాశించుచుండునట్లు వరమిచ్చి పోయిరి.

**తే. గురువు జ్ఞానదాత గురువు వేదుగడయును**
**గురువుకంటె నధికుఁ డొరుఁడు లేఁడు**
**గురువుకంటె మేలి పరతత్త్వమును లేదు**
**గురువు భజింప వలయు నరుఁడు సతము**

## 25. అప్పుదీసి ముంచరాదు

ఒక బ్రాహ్మణుఁడు తన భార్య ప్రసవించిన వెంటనే యా బిడ్డను ఎత్తికొని స్మశానమునకు పోయి అక్కడ గుంతలో దానినుంచి అక్షతలు నీళ్ళు మంత్రించి దానిపై దల్లి నీ వెవ్వరవు? నా కేల పుట్టితివి? అని యడిగెను.

అది "అయ్యా! నేను పోయిన జన్మమున కట్టెలమ్ముకొని బ్రతుకువాఁడను. నా మోపు ఒకటి నీవు వేయించుకొని దాని వెల యియ్యక పోయితివి. అది రాబట్టుకొనుటకై నీకు పుట్టితిని" అనెను? నీకు నేనెంత యియ్యవలెను? అని బ్రాహ్మణుఁడు అడిగెను. రెండణాలని శిశువు చెప్పెను. రెండణాల నిచ్చిన నీవు పోయెదవా అని బ్రాహ్మణుఁడడిగెను. పోయెదనని శిశువు చెప్పెను. వెంటనే ఆ బ్రాహ్మణుఁడు రెండణాలు దానిమీఁద నుంచగాయది చచ్చెను. దానిమీఁద మన్ను వేసి పూడ్చి బ్రాహ్మణుఁడు ఇంటికి వచ్చెను. ఇట్టులే ముగ్గురు నలువురు బిడ్డలను చేసెను. ఈయన బ్రతికిన బిడ్డలను పూడ్చినవచ్చుచున్నాఁడని ఆయన భార్య యెంచి యిదియేమి యన్యాయమని మగనితో మొఱపెట్టుకొనెను. ఈసారి బిడ్డను ఇమ్ము మరల నీ బిడ్డను నీకు తెచ్చి యిచ్చెదనని బ్రాహ్మణుఁడు చెప్పి ఆ సారి కనిన బిడ్డను మొదటిబిడ్డకు చేసినట్టే చేయఁగా నది "అయ్యా నేను పోయిన జన్మమున గాండ్లవాఁడను. ఒక మణువు ఆముదమునకు నీవు నాకు వెల యియ్యవలెను" అని చెప్పెను. మణువు ఆముదమిచ్చెదను పోయెదవా? అని బ్రాహ్మణుఁడడిగెను. పోయెదనని బిడ్డ చెప్పెను. అయిన నిచ్చెద రమ్మని మరల ఎత్తికొనిపోయి భార్యచేతికిచ్చి ఒక మణుగు ఆముదమును దెచ్చి యిచ్చి యీ ఆముద మయిపోవువరకు ఈ బిడ్డఁడు నీ బిడ్డఁడు అని చెప్పెను. ఆ ఆముదమునే యిల్లాలు బిడ్డకు పూయుచుండెను. ఇఁక కొంచెము ఆముదము నిలువ యున్నదనఁగానే బిడ్డకు రోగము ప్రారంభించెను. ఆ వ్యాధి క్రమక్రమముగా వృద్ధిచెంది బిడ్డఁడు బ్రతుకఁడని వాకిటవేసి తల్లి యేడ్చుచుండెను. బిడ్డ ప్రాణముపోక మిగుల మరణబాధ అనుభవించుచుండెను. అప్పుడు తల్లి పెనిమిటియొద్దకువచ్చి పిల్లవాని బాధ చూడలేను. వీఁడు పోయినను బాగుండునని తోఁచుచున్నది. మణుఁగు ఆముద మైపోయినదే యేల బాధపడుదున్నాఁడని యడిగెను. కుండలో నిలవయున్నదేమో చూడుము. చేతితో కుండలోపల నంతయు బాగుగ తుడిచి పిల్లవానికి పూయుము అని బ్రాహ్మణుఁడు చెప్పెను. ఆమె అట్టులే చేయఁగా పిల్లవాఁడు మరణించెను.

ఆతరువాత ఆమె పెనిమిటి ఏమిచేసినను అడ్డము చెప్పకుండెను. మరల నొకసారి ఆమె ప్రసవించెను. అప్పుడు ఆ బిడ్డను బ్రాహ్మణుఁడడుగ అది 'అయ్యా మీ యొద్ద నేను పోయిన జన్మమున రెండువేల రూపాయలు తీసికొని, యెగవేసితిని. అది చెల్లించుటకై వచ్చితిని అనెను. సరికానిమ్మని ఆ బిడ్డను ఎత్తుకొనివచ్చి భార్యచేతికిచ్చి "ఒసీ! వీఁడు నీ కొడుకు. వీనిని జాగ్రత్తగ కాపాడుకొనుము. వీనిచేత నీవు తమలపాకు తొడిమయైనను తీసికొనకుము. ఆ విధముగ నీవుండువఱకు వీఁడు నీ బిడ్డఁడు. వానిచేతినుండి ఏమైన తీసి కొంటివా వీఁడు నీ బిడ్డఁడు కాఁడు" అని చెప్పెను. ఆమెయును అట్టులే చేయుచుండెను. ఆ పిల్లవాడు పెద్దవాఁడై విద్యలునేర్చి ధనము సంపాదించు చుండెను. అట్లున్నను ఒక్క గవ్వయైనను తల్లిదండ్రులు వాని చేతినుండి తీసికొనినవారు కారు. ఇట్లుండ నొకనాఁడు నాఁ డేయూరికో కార్యార్థమై పోవఁదలఁచి ఉడుపులు వేసికొని చేత నొక చిన్న మూట తీసికొని వాకిటనున్న తన గుఱ్ఱము నెక్కపోయెను. అది మకురుతనముచేత తన్ను ఎక్కనీయక పోఁగా దగ్గిరనుండి చూచుచున్న తల్లినిచూచి 'అమ్మా! యీమూట పట్టుకొనుము నేను గుఱ్ఱమెక్కి తీసికొనెద' నని చెప్పిమూట తల్లి చేతికివచ్చి గుఱ్ఱమెక్కెను. ఎక్కి యెక్కకముందే వాఁడెగిరి క్రిందఁబడునట్లు గుఱ్ఱము ఎడమకాళ్ళతోఁ దన్నెను. వాఁడు తలక్రిందుగఁ బడి చచ్చెను. తల్లి హోయని యేడ్చుచుండెను. ఎచ్చటకో పోయియుండిన తండ్రివచ్చి జరిగినదంతయు విచారించి మూటయందేమున్నదో చూడుమనెను. అందు సరిగా రెండువేలరూపాయలుండెను. నా మాటవినిక నీ బిడ్డను నీవే చంపుకొంటివి. ఏల యేడ్చెదనని బ్రాహ్మణుఁడు భార్యను సమాధానపఱచెను.

**తే.** **వినుమీ ఋణానుబంధం**
**బున భార్యయు సుతులు గేహములు పశ్వాదుల్**
**తనకబ్బు, ఋణముతీఱినఁ**
**జనుఁగావున నేల సంతసము దుఃఖంబున్**

## 26. శీలము సర్వసంపదలకు గారణము

ప్రహ్లాదుఁడు మూఁడులోకములు జయించి మహావైభవముతో ప్రభుత్వము చేయుచుండెను. అది చూపోపక ఇంద్రుఁడు బ్రాహ్మణవేషము వేసికొని ప్రహ్లాదునొద్దకు పోయి యతని ననేక విధముల సేవించి యతఁడు ప్రసన్నుఁడై యున్న సమయంబున నిట్లనియె. రాక్షసేశ్వరా! నీవు మూడులోకము లేమి బలమున జయించితిని చెప్పుమా? యని యడిగెను. అయ్యా! శీలమహాత్మ్యముచే నిట్టి శక్తి కలిగెనని చెప్పెను. అయ్యా! శీలమన నెట్టిదని బ్రాహ్మణుఁ డడిగెను. సర్వప్రాణులయందు దయ, మనస్సు, వాక్కు, కాయములం దొకటిగ నుండుట సత్కీర్తి సంపాదింప యత్నించుట, పరులకు మేలుచేయుట, ఈ గుణములకు శీలమని పేరు అని ప్రహ్లాదుఁడు చెప్పెను. ఆ మాటవిని అయ్యా నిన్ను యిన్ని దినములుగ ఆశ్రయించి యున్నాను. ఆశ్రితులకు మేలుచేయుట గొప్పవారిని సహజము గదా. బీదబ్రాహ్మణుఁడను నీపుణ్యమున బ్రదికెదను నీ శీలము నాకిమ్మాయని వేడుకొనెను. ఆయన మహాదాత గావున తన శీలము దానము చేసెను. ఇంద్రుఁడు సంతోషించిపోయెను. తరువాత కొంతసేపటికి ప్రహ్లాదుని దేహమునుండి తేజోవంతుఁడగు పురుషుఁడు వెడలివచ్చెను. నీ వెవ్వఁడవని ప్రహ్లాదుఁడడుగ నేను నీయందున్న శీలమును. నీవు నన్ను దానముపోసిన బ్రాహ్మణునొద్దకు పోయెదనని వెడలిపోయెను. తరువాత మఱియొక తేజోరూపము దేహమునుండి వెలువడెను దానిని నీ వెవ్వరవని ప్రహ్లాదుఁడడుగ నేను ధర్మమును శీలముపోయిన చోటికి పోయెదను అని చెప్పిపోయెను. ఆ విధముగానే సత్యము, వృత్తము, ధనముకూడ నొకటివెంట నొకటి వెడలిపోయెను. తరువాత నతని దేహమునుండి దిక్కులునిండు కాంతిగల యొక స్త్రీ వెలువడెను. అమ్మా నీ నెవ్వతెవు? అని ప్రహ్లాదుఁడడుగ నేను లక్ష్మిని. బలము పోయినచోటికి పోయెదనని చెప్పెను. తల్లీ నీవేల పోయెదవు? నీకు నే నే యపరాధము చేసితి ననెను.

"ప్రహ్లాదా నిన్ను శీలము యాచించిన బ్రాహ్మణుఁడు ఇంద్రుఁడు. అతనికి నీ శీలమును దానము చేసితివి. శీలమున్నచోట ధర్మముండును. ధర్మమున్నచోట సత్యముండును. సత్యమున్నచోట వృత్తముండును. వృత్తమున్నచోట బలముండును. బలమున్నచోట నేనుందును. శీలము నిన్ను విడుచుటతో నన్నియు నిన్ను వదిలెను" అని మాయమయ్యెను.

**కం. శీలంబె కుదురు ధర్మ**
**శ్రీలకు వృత్తంబునకును స్థిరబలమునకున్**
**శీలమె నిలయము కావున**
**శీలంబును విడుచువాఁడు చెడు నన్నింటన్**

## 27. అపనిందలాడరాదు

ఒకఁడు తన స్నేహితునకు తాంబూల మిచ్చుచు పరిహాసమునకై వక్కలకు మాఱుగ మేఁక పెంటికలు ఆకులోపెట్టి ఉండచుట్టి యిచ్చెను. ఆ స్నేహితుఁడు దానిలో నిజముగ పోఁకపొడి యున్నదనుకొని నమలి మ్రింగెను. మ్రింగిన పిమ్మట మేఁకపెంటికలు తింటివని వాఁడు ఎగతాళి చేసెను. తరువాత కొన్ని దినములకు తటాలున నేదో రోగమువచ్చి మేఁకపెంటిక లిచ్చినవాఁడు చచ్చి యమలోకమునకు పోయెను. అక్కడ చిత్రగుప్తుఁడు వీనిని చూచి వీని కింకను ఆయువున్నది. వీని నేల తెచ్చితిరి? వీని దేహములో వీనిని విడిచి వీని పొరుగింటివానిని తెండని కింకరులతో చెప్పెను! ఆ కింకరులతో వాఁడు మరలి వచ్చునపుడు ఒకచోట మేఁకపెంటికల కొండనుచూచి యీ కొండ యెక్కడిది? యని యడిగెను. నీవు నీ మిత్రునకు మేఁకపెంటికలు తాంబూలములో పెట్టి యిచ్చితివి కదా. ఆ పాపముచే నిది యేర్పడెను. నీ వచ్చిటికి వచ్చినపుడు దీనిని తినవలయును. నీవు వచ్చువఱకు నిది పెరుగుచుండును అని చెప్పఁగా దానిని చూచి దిగులుపడి కొండెడు మేఁకపెంటిక లెక్కడ! నేను తినుట యెక్కడ! ఎన్ని యుగములు పట్టును. అంతవఱకు నేను ఈ మహానరకమున నుండవలయునా? అని వారితో

దీనస్వరముతో వాఁడుచెప్పెను. అది సమసిపోవువఱకు నీ విచ్చట నుండవలసిన వాఁడవే యని వారు చెప్పిరి. దయామయులారా! ఇది సమసిపోవు నుపాయముండిన చెప్పుఁడీయని వాఁడు ప్రార్థించెను. నీమీఁద నెవరైన నిష్కారణముగ నిందమోపిరేని అట్టివారికెల్ల నీ పాపమున కొంతపోవుచుండును. అట్టు లేదైన నుపాయముచేసి దీనిని లోకులకు పంచిపెట్టితివా నీవు సుఖపడుదువు అని చెప్పి వానిని వాని శరీరములోఁ బ్రవేశపెట్టి వారు పోయిరి. వాఁడు బ్రదికి తానుచూచినది కింకరులు చెప్పినది కలవలె మనస్సునకు తోఁపఁగా నొకయుక్తి చేసెను. వానికి వయసువచ్చిన ఒక కూఁతురు కలదు. దాని పెనిమిటి మరణించుటచేత నది పుట్టినింట నుండెను. దానిని ఒంటరిగా ఆ యూరియందే మఱియొక చోట కాఁపురముంచి వాఁడు ప్రతిదినము సాయంకాలము కాఁగానే చలువవస్త్రములు కట్టుకొని విలాసముగ ఆ యింటికి పోయి రాత్రియంతయు అచ్చటనే పండుకొని సూర్యోదయమైన తరువాత తనయింటికి వచ్చుచుండెను. చూచినవారందఱువాని మీఁద అనుమానపడి వాఁడు తన కుమార్తెనే పెండ్లాముగా జేసికొన్నాఁడని చెప్పుకొనసాగిరి. అన్యాయముగ వానిని నిందలాడిన వారి కందఱకు కొంచెము కొంచెముగ మేఁక పెంటికలు యమకింకరులు పంచిపెట్టిరి. ఒక సంవత్సరము అగుసరికి మేఁక పెంటికల కొండ అంతయు సమసిపోయెను.

**అ. తెలిసియైనఁగాని తెలియకయేగాని**
**పరుల నిందలాడఁ బాడి గాదు**
**పరుల మెచ్చువాఁడు వాని పుణ్యముఁగొను**
**దూఱువాఁడు పొందు దోషములను**

## 28. గొల్ల కృష్ణన్న

ఒక గ్రామంబున నొక నిరుపేదరాలగు బ్రాహ్మణస్త్రీ గలదు. ఆమె కొక కుమారుఁడు కలఁడు. వాఁడు పుట్టిన కొన్ని దినములకే వాని తండ్రి

మరణించెను. ఆ యిల్లాలు ఎంతెంత కష్టమో పడి ఆ బాలుని సాఁకెను. వానికి ఐదవ యేఁడు రాగానే అక్షరాభ్యాసము చేయించెనుగాని బడికిపంపుటకు ఆ పల్లెలో బడియే లేకుండెను. కావున కొంచెము దూరములోనుండు పల్లెలోని బడికి పిల్లవానిని ఆమె పంపుచుండెను. జీతము తీసికొని చదువు చెప్పుట దోషము గనుక వీనియొద్ద జీతము పుచ్చుకొనకయే గురువు చదువు చెప్పుచుండెనుగాని ప్రతిదినము ప్రొద్దున సాయంకాలమున వాఁడు ఆ పల్లెకు నడిచి పోయిరావలసియుండెను. ఆ పల్లెనుండి పోవువాఁడు వాఁడొక్కఁడే. రెండు పల్లెలకు నడుమ ఒక అడవి యుండెను. ఉదయమున చీఁకటిలోనేపోయి రాత్రి చీఁకటిలోనే రావలసియుండెను. ఆ పిల్లవాఁడు చీఁకటిలో ఒంటిగ రానుపోను భయపడి తల్లితో ఒకనాఁడు "అమ్మా దినదినము చీఁకటిలో పోవునపుడు వచ్చునపుడు అడవిలో భయము తోఁచుచుండును. ఎవ్వరినైన తోడు పంపవే" అని అడిగెను. తల్లి కన్నులనీరు తుడిచికొనుచు నిర్భాగ్యురాలనగు నాకు పుట్టిన నీకు తోడెవ్వరు వత్తురు. దేవుఁడు ఒక్కఁడే తోఁడు. అని మనస్సులో నేమో ఆలోచించి "నాయనా! నేను భాగ్యవంతురాలనా? ఎవరిని పంపుదును? ఆ అడవియందు ఒక గొల్లవాఁడు కృష్ణుఁడనువాఁడున్నాఁడు. వాఁడు మనలను గుర్తెఱిఁగినవాఁడు. మంచిపిల్లవాఁడు. వాఁడు మనలను గుర్తెఱిఁగినవాఁడు. మంచిపిల్లవాఁడు. నీవు పోవునపుడు గొల్ల కృష్ణన్నా అని పిలువుము. నీకు తోడుగ వచ్చి అడవి దాఁటించును" అని చెప్పెను. మఱునాఁడు ఆ బాలుఁడు అడవిలో ప్రవేశించి "గొల్లకృష్ణన్నా! నాకు తోడుగ రా" అని పిలిచెను. వెంటనే చెట్టుచాటునుండి ఒక గొల్లపిల్లవాఁడు పిల్లంగ్రోవి ఊఁదుచు వచ్చెను. అట్టులే ప్రతిదినము ఆ పిల్లవాఁడు అడవిలో వచ్చునపుడు పోవునపుడు గొల్లకృష్ణన్నా అని పలుచును. ఇద్దరు కొంతసేపు ఆడుకొందురు. తరువాత బ్రాహ్మణబాలుఁడు ఇంటికి పోవును. ఇట్లు కొన్నాళ్ళు కాఁగా ఉపాధ్యాయుని తండ్రి చచ్చెను. అప్పుడు పిల్లవాండ్రందఱు వారికి వారికిఁగల మంచిపదార్థములు కానుకలు తీసికొని పోయిరి. బీదపిల్లవాఁడును తల్లియొద్దకుపోయి అమ్మా! మా అయ్యవారి

కిచ్చుటకు ఏదైన తీసియిమ్ము అని అడిగెను. ఆమె 'నాయనా నీకు కడుపునిండ కూడే పెట్టలేకున్నానే నేను కానుక ఏమి తీసి యియ్యఁగలనురా? నీతో అడవిలో ఆడుకొను గొల్లకృష్ణన్నను అడిగి వాఁడు యిచ్చునది తీసుకొనిరమ్ము' అని చెప్పెను. అట్టులేపోయి గొల్లకృష్ణన్నా అని పిలిచి మా అయ్యవారి కిచ్చుటకు ఏదైన యిమ్మా అని అడిగెను. ఒక పిడుతలో పాలుపోసి గొల్లకృష్ణన్న యిచ్చెను. దానిని తీసికొని బాలుఁడు ఉపాధ్యాయుని యింటికిపోయెను. భాగ్యవంతుల బిడ్డలు వెలగల వస్త్రములు సొమ్ములు అన్ని తెచ్చియుండిరి. ఈ పిల్లవానికి నిలువను కూడ ఎడము లేకుండెను. ఎట్టులో సందు చేసికొని దూరమున నిలుచుండెను గాని ఎంతసేపటికి ఎవరును వీఁడు తెచ్చినది తీసుకొనకపోయిరి. అప్పుడు వాఁడే అయ్యా నేను తెచ్చినది తీసికొని పొందు అని అఱచెను. ఎవ్వరు చెవిని పెట్టిన వారు కారు. ఇట్లు పలుమాఱు అఱవఁగా ఆ అయ్యవారు వాఁడూరకే గొంతు చించుకొనుచున్నాఁడు, వాఁడు తెచ్చిన పాలను గిన్నెలో క్రుమ్మరించుకొని వాని పిడుత వానికి ఇచ్చి పొమ్మని చెప్పుమని దగ్గర నున్నవానితో చెప్పెను. ఒకఁడు వచ్చి ఆ పిడుత తీసికొనిపోయి పాలు క్రుమ్మరించి చూడఁగా మరల పిడుతనిండ పాలుండెను. ఎంత క్రుమ్మరించినను పిడుత ఉత్తది కాలేదు. అయ్యవారు అది చూచి యీ పాలపిడుత నీ కెక్కడిది యని యడిగెను. అడవిలోనుండు గొల్లకృష్ణన్న యిచ్చినాఁడని బాలుఁడు చెప్పెను. అడవిలో మనుష్యులే లేరే గొల్లకృష్ణుఁడెవఁడని యతఁ డడిగెను. అప్పుడు ప్రతిదినము జరుగు చర్య అంతయు బాలుఁడు తెలిపెను. అప్పుడు భగవంతుఁడే వీనికి దర్శన మిచ్చుచున్నాఁడని ఉపాధ్యాయుఁడెఱిఁగి నాకా గొల్లపిల్లవానిని చూపెదవా అని యడిగెను. చూపెద రండని పిలుచుకొని అడవికిపోయి గొల్లకృష్ణన్నా అని ఎన్నిమార్లు పిలిచినను గొల్లపిల్లవాఁడు రాలేదు. అప్పుడు పిల్లవాఁడు ఏడ్చుచు గొల్లకృష్ణన్నా! ప్రతిదినము నేను పిలువఁగానే వచ్చువాఁడవు. నేఁడేలరావు. నిన్ను చూడవలయునని మా అయ్యవారు వచ్చినారు. నీవు రాకపోతివా నేను అబద్ధము చెప్పితిని అని నన్నుఁగొట్టుదురు. "నా

స్నేహితుఁడవుగా నుండి నన్ను నీవు కొట్టింపవచ్చునా” అని అనెను. అప్పుడు దూరమునందుండి “అబ్బాయీ నీ మనస్సు నిర్మలము గనుక నీకు కనిపించితిని. నీ అయ్యవారు నీవలె అయినప్పుడు ఆయనకు కనిపించెదను. నీవు ఒంటరిగావచ్చి పిలువుము వచ్చెదను” అను మాటలు స్పష్టముగా వినవచ్చెను.

**కం. ధన ముండిన బల ముండిన**
**ఘన పాండితియున్నఁ జివుకు కాయంబున్నన్**
**మనమున మెచ్చఁడు నిర్మల**
**మనముం గలవాని మెచ్చు మాధవుఁ డెపుడున్**

## 29. బాలరాజు కథ

ఒకానొక రాజ్యమునకు ఒక బాలుఁడు రాజయ్యెను. వాఁడు బాలుఁడేకాక మూర్ఖుఁడును అయియుండెను. ఇట్లుండ ఒకనాఁడు కొందఱు దొమ్మరవాండ్రు రాజునొద్ద సెలవుతీసికొని త్రాటిమీఁద నడచుట బండలు ఱొమ్ముమీఁద పగులఁ గొట్టుట లోనగు అనేక విధములైన సాముగరడీల చేసిరి. అప్పుడు రాజు వారినిచూచి “ఆహా యింత దేహలాఘవము గలవారు యుద్ధభటులైనచో ఎవరు మనల నెదిరింపఁగలరు? ఇప్పుడుండువారు బొమ్మలవలె నిలఁబడువారు కుడి తిరుగు ఎడమ తిరుగు అను సంజ్ఞల ప్రకారము కీలుబొమ్మలవలె తిరుగువారు. దూరమునుండి టుప్పని కాల్చువారే యైయున్నారు. వీరితోపాటు యుద్ధభటుల మల్లయుద్ధము చేయఁగలరా” అని తలఁచి వృద్ధమంత్రి చెప్పినను వినక తనయట్టి వారి మాటవిని దొమ్మరుల నందఱను దండులో చేర్చుకొని చిరకాలముగనున్న భటుల నందఱను కొలువులోనుండి తీసివేసెను. ఈ నూతన శూరులకుఁదగిన ఆయుధము లేవియని వెదుకఁగా ఒకనాఁడు క్షౌరము చేసికొనునపుడు మంగలకత్తి వెండ్రుకలు గొరుగుటయు తక్కిన ఎట్టికత్తులును దానివలె ఆ పని చేయలేకుండుటయుఁ జూచి రాజు దొమ్మరుల కందఱకు ఆయుధములుగా

ఆ మంగలకత్తుల నిప్పించెను. రాజభక్తిగల మంత్రి చక్కఁబెట్టవలయునని యొక యుక్తి చేసెను. త్రోసి వేయఁబడిన యుద్ధ భటులను నాయకులను అందఱను బిలిచి ఆర్యులారా! మన మీ రాజు తాతతండ్రుల తరమునుండి వారి యుప్పుదిని బ్రదికిన వారము. ఇప్పుడు ఇతఁడు తెలివిలేనివాఁడై వ్యవహరించుచున్నాఁడని మనము విడిచిపోరాదు. మీ రెందును పోవలదు. ఆఱునెలల జీతము మీకు నేనిచ్చెదను. మీరందఱు తగిన యేర్పాటులు చేసికొని ఉన్నట్టుగనుండి కోట ముట్టడింపుఁడు. అప్పుడు రాజు తన బలముతో యుద్ధమునకు వచ్చును. నేను సైఁగచేసినప్పుడు యుద్ధము చాలింపుఁడని చెప్పెను. వారును ఒకనాఁడు ఉదయమునకు ముందే కోట ముట్టడించిరి. రాజు తన మంగలకత్తుల దొమ్మరిదండుతో యుద్ధమునకు బయలుదేరెను. దొమ్మరులందఱు కోటగోడల మీఁద నిలఁబడి మహారాజా చూడుమని లాఁగులు వేయువారును బాహువు లప్పళించువారును వేడుక చూడుమనువారును కత్తులు త్రిప్పువారును నై పలుపోకులు పోవుచు ఎదుటివారు డాండాం అని వేయు గుండుదెబ్బలకు క్రిందఁ బడుచుండిరి. రాజు భయపడి ఇఁక నేమి గతియని మంత్రి నడిగెను. అప్పుడు మంత్రి మహారాజా! మీరు కొలువులోనుండి తీసివేయఁగా మనభటులు శత్రువులలో కలిసి యుద్ధమునకు వచ్చినారు. వారికి ఆరునెలల జీతము బహుమానములిచ్చి కొలువులోఁ జేర్చుకొందురేని సంధిచేసెదనని చెప్పి యుద్ధము చాలించునటులు చేసి మరల వారి కందఱకు కొలువు లిప్పించి దొమ్మరుల నందఱ వెడలఁ గొట్టెను.

**ఆ. పెద్దవారి మాటఁ బెడచెవిఁ జెక్కుచుఁ దననుబోలు తుచ్ఛజనముఁ జేర్చి**
**కీడు దొడరు వేళ నేడుచుచుండును బ్రాజ్ఞమానియైన బాలరాజు**

*శ్రీరామార్పణమస్తు*

* * *

## నాలుగవ భాగము

### 1. ఏ దానము మేలనిన నిదానమే మేలు

గౌతముఁడని ప్రసిద్ధికెక్కిన యొకమునిగలఁడు. అతని భార్య అహల్య. చిరకారి యనువాఁడు వారల కడగొట్టు కొడుకు. అతని కేపని చెప్పినను చక్కఁగ ఆలోచించి నిదానముగ చేయునుగాని తొందరపడి చేయఁడు. అటులని నిష్కారణముగఁ గాని సోమరితనముచేతఁ గాని అతఁడు కాలహరణము చేయువాఁడు కాఁడు. ఆ కారణముచే నతఁడు చిరకారియని పిలువఁబడుచుండెను.

ఇట్లుండ నొకనాఁడు అహల్య యొకానొక చేయరాని పని చేయఁగా కోపించి మేలు గీళ్ళు విమర్శించిన గౌతముఁడు చిరకారిని పిలిచి దీనితల తెగగొట్టుమని అహల్యను జూపి యేదియో పనిమీఁద అరణ్యమునకు పోయెను.

అహల్యయును తాను జేసిన యకార్యమునకు దుఃఖము లజ్జ తన్ను బాధింప నెదురుగ నిలిచి "నాయనా! నీ తండ్రి యాజ్ఞ నీవు నెరవేర్పుము. శిక్షచేత నేను పవిత్రురాల నయ్యెదను. అపకీర్తిని సంపాదించి అవమానపడి భూమిమీఁద బ్రతుకుటకంటె మరణము నొందుటే మేలు. తండ్రియాజ్ఞ నీవు నెఱవేర్చితివేని నాకు మేలుచేసినవాఁడ వగుదువు" అనెను. చిరకారియుఁ దండ్రియాజ్ఞ నెఱవేర్ప చేతఁగత్తి నెత్తుకొని యిట్టు లాలోచించెను. అయ్యో! నా తండ్రి నా కెట్టికార్యము చేయ విధించెను. తండ్రియాజ్ఞను నేనెట్లుచేయుదును. కన్నతల్లిని వధించి యధర్మమను సముద్రమున నెట్లు మునుఁగకుందును?

పితృవాక్యపరిపాలనము పరమధర్మమే. అయినను మాతృరక్షణము సమస్తజీవులకు స్వధర్మముకదా. పుత్రత్వము అస్వతంత్రము. స్త్రీవధయే మహాపాతకమన నిఁక మాతృవధను చేసినవాఁడెట్లు ఉభయలోకముల సుఖింపఁగలఁడు? తండ్రి మాట చొప్పున నడవనివాఁడు మాత్ర మెట్లు

ప్రతిష్ఠ కాంచగలఁడు? తల్లిదండ్రు నొకరికి కీడుచేసి యెట్లు ధర్మము నతిక్రమింపకుండఁ గలఁడు? స్వశీలము చారిత్రము, గోత్రము, కులము వృద్ధిపఱుపఁగోరి తానేకదా తన భార్యయందు మరల జన్మించును. జాతకర్మమందును సమావర్తన మందును తండ్రి వచించు వాక్యములు తండ్రి గౌరవమును స్థిరీకరించుచున్నవికదా. పోషణముచేతను, విద్య నేర్పుటచేతను తండ్రియే గురువులందు శ్రేష్ఠుడనియుఁ దద్వాక్య పరిపాలనంబు పరమ ధర్మమనియు వేదములు వచించుచున్నవి. పుత్రుఁడు తండ్రికి ప్రీతిమాత్రమే కలిగించును. తండ్రి పుత్రునకు సర్వమునై యున్నవాఁడు. శరీరము మొదలుకొని సమస్తము పుత్రునకు తండ్రి యిచ్చినవేకదా కావున లేశమైన అట్టిట్టాడక తండ్రియాజ్ఞ నొనర్పఁదగు. అట్టు లొనర్చువాఁడు సర్వపాప విముక్తుఁడగును. భూమిపై శిశువు జన్మింపకముందు దాని మేలునకై సీమంతోన్నయనాదు లొనర్చువాఁడు తండ్రియేకదా. భూమిపై జన్మించిన యనంతరము ఆహారాదులును, భోగ్యపదార్థములును, విద్యయు, జ్ఞాన, విజ్ఞానము లొసఁగువాఁడు తండ్రియేకదా. తండ్రియే ధర్మము, తండ్రియే స్వర్గము, తండ్రియే పరమతపము. తండ్రి సంతోషించిన సమస్త దేవతలు సంతోషింతురు. జనకువాక్యంబులన్నియు దీవనలై పుత్రునికి మేలు చేయుచుండును. కావుననే కదా ప్రతిదినము నుదయమున తండ్రికి నమస్కరించి దీవనలు పొందుమని వేదములు ఘోషించుచున్నవి. తొడిమె పుష్పమును, చెట్టు ఫలమును విడుచుట కలదుగాని ఎట్టి కష్టదశయందును తండ్రిపుత్రుని విడువఁడు. ఎచ్చుటనోతప్ప తండ్రిపై ద్వేషించువాఁడా తండ్రికి జనించువాఁడు కాఁడు. ఇన్ని కారణములచే తండ్రి గౌరవింప నర్హుఁడు కావున తండ్రియాజ్ఞ నెఱవేర్తునా యనఁ దల్లిమాత్రము తండ్రికంటె నేమిట తక్కువ? అగ్నికి అరణివలె నా పుట్టువునకుఁ దల్లియేకదా. కారణము. అన్ని యార్తులకు నిర్వృతి తల్లియేకదా. తల్లి కలవాఁడే దిక్కు గలవాఁడు. తల్లిలేనివాఁడు దిక్కు లేనివాఁడు. ఎంతటి దరిద్రుఁడైనను అమ్మాయని

పిలుచుచు యింటిలోనికి వచ్చువాఁడు దుఃఖితుఁడుకాఁడు. వాఁడు ముదుకయైనను ముదుక గాఁడు. పుత్రపౌత్రవంతుఁ డైనను నూఱుసంవత్సరముల ప్రాయము గలవాఁడైనను తల్లిగలవాఁడు రెండేండ్ల బాలుఁడే. సమర్థుఁడైనను అసమర్థుఁడైనను కృశుఁడైనను కాకున్నను పుత్రుని రక్షించునది తల్లియే. తల్లినిమించిన పోషకులు లోకంబునలేరు. ఎప్పుడు తల్లి మరణించునో అప్పుడే పురుషుఁడు వృద్ధుఁడు దుఃఖితుఁడు నగును. అప్పుడే వానికి సర్వప్రపంచము శూన్యము. తల్లికంటె నిలువ నీడగాని గతిగాని రక్షణముగాని ప్రియ పదార్థముగాని లోకంబున లేదు. గర్భమున ధరించుటఁజేసి ధాత్రియనియు, జనము కలిగించుటచేసి జనని అనియు, అంగము వర్థిలఁ జేయుటఁజేసి అంబ యనియు, వీరుఁడగు పుత్రుఁగాంచుటఁ జేసి వీరసువు అనియు, శిశువునకు శుశ్రూషచేయుట శుశ్రువనియుఁ దల్లికి నామంబులు. తల్లియన తన మఱియొక దేహమేకదా. ఏమె కరుణచే తాను వీధి పెంటలోని పెంట గాకున్నాఁడో అట్టి తల్లికి అప్రియము చేయువాఁ డెట్టివాఁడు? దంపతు లిరువురును మనకు పుట్టెడు బిడ్డఁడు సుందరుఁడుగా నుండవలెను, అని కోరువారేకాని అందు తల్లికోరికయె ఫలవంత మగును. నేను జెడుకోరికలు గలదాన నగుదునేని నా గర్భమున శిశువు దురాలోచనము కలవాఁడగును. నేను దుష్టపదార్థము తింటినేని నా శిశువునకు దేహారోగ్యము చెడును. నేను గుడిప్రక్కఁ బరుండితినేని శిశువునకు రాపిడిచే నంగవైకల్యము గలుగును. నేను బీభత్సపుఁ బదార్థము చూచిన బిడ్డనికి హానికలుగును. అని యడుగడుగునకు తన లోపమువలన బిడ్డ కేమగునో యని గట్టిగ నడచుటకును జంకునది తల్లి మఱియెవరు? గర్భధారణము నిశ్చయమైనది మొదలు తన కత్యంత ప్రియమైన పతి సాంగత్యమును వదలి భిన్నశయ్యఁ బరుండునది తల్లిగాక మఱెవ్వరు? పుత్రుఁ డుదయించిన పిమ్మట వానికి నీతిమతి కులహీనయగు దానిచే స్తన్య మిప్పించిన యెడల దాని గుణములు బుద్ధి పట్టువడునని వెఱచి తనకుఁ బ్రియతరమైన యౌవన సౌందర్యము

దగ్గుటకును జంకక తన ఱొమ్ముల మీదనే పెంచునది తల్లిగాక మాత్రమే తెలియును. కావునేకదా సన్న్యాసికిఁ దండ్రి వందనీయుదు కాకున్నను తల్లి వందనీయ యగుచున్నది. ప్రమాణపూర్వకముగ గ్రహించిన తన తల్లిని విడిచి పరస్త్రీ సాంగత్యము చేసెనేని తండ్రి తండ్రియను గౌరవమునకు దగినవాఁడుకాఁడు. అట్టివానిమాట పుత్రుఁడు బాటింపఁ బనిలేదు. పురుషుఁడు భార్యను భరించుటచే భర్తయు, పాలించుటచే బతియు నగుచున్నాఁడు. ఈ గుణములను వదలినవాఁడు భర్తయును గాఁడు. పతియును గాఁడు. ఆ గౌరవము వానినంటదు. ఎప్పటికిని అపరాధులు పురుషులేకాని స్త్రీలుగారు. పురుషుల వివేకహీనతచేతనే స్త్రీలు సాపరాధులగుచున్నారు. పాపకార్యము చేయువాఁడును, చేయించువాఁడును, ప్రేరకుఁడు నగుటచేత సమస్తదోషములు పురుషులను బాధించునేకాని స్త్రీలను బాధింపవు. అబలులగుటచేతను, వారింప సాధ్యపడువా రగుటచేతను, పురుషుల వశమున నుండువా రగుటచేతను, స్త్రీల నేదోషము లంటవు. స్వభావ దుర్బలలనియు, ప్రార్థనాసులభలనియు నెఱిఁగి వారిని వంచించి యకార్యములకు లోపఱుచు పురుషులే సర్వదా పాపులుగాని స్త్రీలుగారు. పుత్రులవలన తల్లి కేమి సుఖమో నేనూహింపఁజాలను. గర్భము నిలిచినది మొదలు వేవిళ్ళు లోనగు సంకటములచే బాధపడును. ప్రాణగొడ్డమైన ప్రసూతికష్టము చెప్పనలవిగాదు. తదనంతరమైనను సుఖమాయన నదియును లేదు. శిశువులకై నిద్రయు ఆహారము వదలి మనస్సు నెమ్మదిలేక వారి కేవేళకు నేమివచ్చునో యని భయపడుచు వారు నవ్వినఁ దాను నవ్వుదు వారిమోమువాడిన తామేడ్చుచు తమ నోటిదైన వారికిపెట్టి తమకడుపు కట్టియైన వారికిచ్చి తా మేది భుజింపరానిది భుజించిన శిశువునకు రోగము వచ్చునోయని భయపడుచు రక్షించు తల్లి ఋణం బెన్నఁడు తీర్చుకొనఁ గలఁడు? భగవంతుఁడును శిశురక్షణభారము తల్లియందుంచిన వాఁడే గాని తండ్రియందుంచినవాఁడు గాఁడు. గర్భము భరించు భారము తల్లియందే కదా భగవంతుఁడుంచెను. నేలమీఁదఁబడి కావుకావని యేడ్చు శిశువున కాహారము తల్లియందేగదా భగవంతుఁడు కల్పించెను. చంపుమని

తండ్రి నా కాజ్ఞాపించిన దెవరిని? స్త్రీని, ఆ స్త్రీ యెవతె? నా తల్లి. అట్లు స్త్రీయు, తల్లియు, దండ్రికంటె గౌరవంబున నధికురాలు నగుదాని నేను తండ్రి మాటవిని యెట్లు హింసింతును? పశువులుకూడ తమ తల్లిని బరులనుండి రక్షించుచుండ మనుష్యుఁడనై నే నెట్లు మాతృవధ మొనర్తును? దేవతాసమూహమే తండ్రియనియు తండ్రి సంతసించిన దేవతలందఱు సంతసింతురనియుఁ జెప్పుదురు. తల్లియో, మర్త్యులయు అమర్త్యులయు సమూహముకదా? తల్లి సంతసించిన దేవతలు మనుష్యులుకూడ సంతసింతురు. అని దీర్ఘకాల మాలోచించుచు తల్లియెదుట నిలువఁబడి యుండెను.

చిరకారి యివ్విధముగ నాలోచించుచుండ నడవికిపోయిన గౌతముఁడు కోపము చల్లార శాంతము నడవికి యిట్టు లాలోచించెను. ఆహో! తొందరపడి నేనెంతటి పాపమున కొడిగట్టితిని. కార్యాకార్యములు చక్కఁగ విమర్శింపనైతిని.

స్త్రీయును అందు భార్యయునై సుఖాసుఖములు పంచుకొనుటచే వాసితయునై భర్తవ్యయగు నిల్లాలిని చంపనుద్యమించితిని. ఇంతకన్న ఘోరపాతక మింకెద్ది కలదు? దీనినుండి విడివడుటెట్లు? ఇంతకు చిరకారి తనకు చెప్పినపని చేసియుండునేమో? చిరకారి యనుపేరు సార్థకముగా నీ విషయమున వర్తించిన నేనెంత ధన్యుఁడ నగుదును. చిరకారీ! నీ వీ సమయంబున చిరకారివై నిన్ను, నన్ను, నీ తల్లిని రక్షింపుమా అని యనుకొనుచు శీఘ్రముగ నింటికి వచ్చి చేతఁ జూచెను. చిరకారియు తత్క్షణము కత్తిని నేలపై జాఱవైచి తండ్రి పాదములపైఁ బడి యనుగ్రహింపుమా యని వేఁడుకొనెను. దుఃఖితప్తుఁడై వేఁడుకొను పుత్రుని, లజ్జచే నిరాకారయై నిలబడిన భార్యనుజూచి సంతసించి పుత్రుని గౌఁగిలించుకొని యిట్లనియె. చిరకారీ! నీ చిరకారితనమువలన నన్ను ఘోరపాపమునుండియు, దీర్ఘశోకము నుండియుఁ దప్పించితివి. చిరకారీ! నీవు చిరంజీవివగుము. అని దీవించి భార్య చేసిన దోషమునకై యామెను శపించెను.

కం. చిరముగ మిత్రునిఁ గూర్పుము;
చిరముగ యోజించి విడువు చేసెడిపనులన్;
చిరముగ సాగును స్నేహము
చిర మాలోచించి పిదపఁ జేసినయేనిన్

కం. చిరముగ నాలోచింపక
సరిగా దప్రియము కిల్బిష[1]ద్రోహరుషా
గురుదర్ప రాగములకుం
బరవశుఁడయి యాచరింపఁ బరులకు నెపుడున్

కం. హితులకు భృత్యులకును స్త్రీ
తతికిని బాంధవులకుఁ గీడు తలఁచెడిపట్లన్
మతిమంతులు చిరకారిత
స్తుతియింతురు వ్యక్తపడని దోషములందున్

## 2. ప్రీతితో నిచ్చినది పిడికెఁడేచాలు

ధర్మరాజు కౌరవరాజ్యమునకుపట్టాభిషిక్తుఁడైన పిమ్మట బంధువులఁ జంపిన పాపము తొలగించుకొన నశ్వమేధయాగ మొనర్చెను. దానియందుఁ జేయవలసిన షోడశమహాదానములు లోనైనవి యథావిధి యేలోపము లేకుండున ట్టోనర్చెను. యజ్ఞము ముగియవచ్చిన దినమున నొకముంగిస సభా మధ్యమున నిలిచి యందఱు వినుచుండ నిట్లనెను. ధర్మరాజా! సభాసదులారా! నా వాక్యమును గోపింపక యాలకింపుఁడు. నేను సత్యము పలుకుచున్నాను. ఈ యాగమున నీ పాండవాగ్రజుం డొనర్చిన దానము సక్తుప్రస్థుఁ డొనర్చిన దానములోని రేణువునకును సరిపోలదు. అనిన ఆ వాక్యములు విని సభ్యులు "ఓ నకులమా! యీ రాజు చేసిన దానమునం దేలోపము గంటివి? సక్తుప్రస్థుఁ డెవఁడు? అతఁడు చేసిన దానమునం దేమి విశేషము? చెప్పుము. కారణము చెప్పక గొప్పవారినిగాని గొప్పకార్యములనుగాని దూషింపరాదుగదా" అనిన ముగింస అటులైన సక్తుప్రస్థ చరిత్రమును అతని దానము మహిమయుఁ జెప్పెద వినుఁడు.

"మహాపురుషులు చేసిన కార్యములందు దోషము లారోపించి ప్రసిద్ధికి రాఁదలఁచిన పురోభాగిని నేనుగాను" అని యిట్లు చెప్పఁ దొడఁగె.

కొంతకాలముక్రింద కురుక్షేత్రమందు సక్తుప్రస్థుఁడను నొక బ్రాహ్మణుఁడును అతని భార్యయుఁగొడుకును కోడలును వసించుచుండిరి. అన్నిటిలోను యాచన కడునీచము. యాచన గౌరవనాశన మొనర్చును. స్నేహితులను బంధువులను చిన్న చూపున చూడఁజేయును. ఇంతయేల? యాచనకంటె లఘుపదార్థము మఱియొకటిలేదు. యాచన కందఱు కనబడుచుందురుగాని అతఁడుమాత్ర మొకరికినిఁ గానరాఁడు. సమీపించిన తన్నేమి యాచించునో యని గాలియు దూరమంద తొలఁగిపోవుచుండును.

**కం. తల లెత్తి చూడ వెఱతురు**
**వెలవెలనై మాఱుపలుక వెఱతురు భీతిన్**
**జలియించి పఱతు రిస్సీ!**
**కొలపగతురు కారె యాచకులు² లోభులకున్.**

దాతలనే యాచింతమా యనిన

**కం. దాతలు దాతలంద్రది యతథ్యము, లోకమునందు లేదుపో**
**దాత, యతండు గల్గినను దాతృతఁదా సకలార్థులందు నే**
**లా తులతూగకుండు? నచలస్థితి నింతదలంచి యే సహో**
**దాతలు ఋణానుబంధము గదా యని చిత్తమునం దలంచెదన్.**

అని యాలోచించి యుత్తమ విప్రునకు పరిగ్రహము నిషిద్ధమనుట స్మరించి తిరిపెమెత్తక కోసివిడిచిన చేలలోను మదులలోను పడియుండు గింజలను గడ్డిగింజలను పావురము వలె నొక్కక్కటి యేఱియు, చెట్లనుండి రాలిన ఫలముల నేకరించియుఁ దెచ్చి వానిని పాకముచేయించి భగవంతునకు నివేదించి దినమునం దాఱవభాగమువేళఁ దక్కిన ముప్వర తోడ భుజించుచుఁ గాలము గడుపుచుండును. ఇట్లుండ పెద్దవఱపువచ్చెను. వానచినుకు

భూమిమీఁదఁ బడదయ్యెను. కారుచిచ్చులు ప్రబలి యడవుల దహించెను. తోమిన రాగి చెంబులవలె కొండలు కనవట్టుచుండెను. దోకిస పెట్టినట్లు పొలము లుండుటచే మేయఁబోయిన పశువులు రెండుజాములకే యిల్లు చేరుచుండెను. నీటికై పోయినవారు మూఁడు జాములైనను గృహములు చేరకుండిరి. ఇట్టి దుర్భిక్ష[3] సమయమున వారికి కొన్ని దినములవఱకు కందమూలములుగాని కాయగసులుగాని ధాన్యపు గింజలుగాని యేవియు దొరక లేదు. కొన్నిదినముల నందఱు నుపవాసముండిరి. అందఱు కొంచెము కొంచెముగఁ జేర్పఁగాఁ గొన్నాళ్ళకు ఒక కుంచెఁడయ్యెను. ఈ దినమైన కడుపుచిచ్చు కొంచెమైన నార్తమని దానిని పిండిగొట్టి భగవంతునకు నివేదించి నలుగురు నాలుగు తూనికలుగఁ బంచుకొని ఆఱవభాగమువేళ విస్తళ్ళలో నుంచి భుజింపఁబోవు సమయమున వెన్నంటు డొక్కతో, దివ్వెదీసిన గూళ్ళవంటి కన్నులతో, నెంచగూడిన బట్టెముకలతో, నొండొంటి ముద్దిడ నుంకించు లోదవడలతో నొక యతిథి వృద్ధబ్రాహ్మణుఁడు "అయ్యా! ఆఁకలి యగుచున్నది. ప్రాణములు పోవునట్లున్నవి. చెవులు గడియలు పడినవి. కొంచెమాహార మిచ్చెదరా" యని వచ్చెను. ఆయనను వెంటనే గారవించి యర్ఘ్యపాద్యములిచ్చి సక్తుప్రస్థుఁడు తన మానెఁడు పిండిని సంతోషముతో ఆయన కిచ్చెను. దానితో ఆయనకు ఆఁకలి సమయలేదు. అది తెలిసికొన్న సక్తుప్రస్థుఁడు "అయ్యో! బ్రాహ్మణునకు కొఱకడుపునకు పెట్టవలసి వచ్చెనుగదా? ఈ జన్మమేల కాల్పనా? ఏమిచేయుదును." అని యాలోచించుచు తలవ్రాల్చి యుండెను. అతిథియాఁకలియుఁ బెనిమిటి చింతయు నుపలక్షించి యతనిభార్య తనపాలి పిండిని భర్తముందరనుంచి దీనిని అతిథికిండని వేఁడుకొనెను. సక్తుప్రస్థుఁ డది చూచి భార్యతో నిట్లనియె.

లోకములో పశువులు పక్షులుకూడ తమకు దొరికిన యాహారమును దాము తినక భార్యలకు బిడ్డలకు నిచ్చుచుండెను. అది జీవి స్వభావము. తన కున్నను లేకున్నను తన్నాశ్రయించి యుండువారిని బోషింపవలసినది గృహస్థు విధి. న్యాయమిట్లుండ నేను నీ భాగము నెట్లు గ్రహింతును?

నీవు అబలవు. ఎక్కువ దేహకష్టము చేయుదానవు. కావున నీకు నాకంటె నెక్కువ యాహార మియ్యవలసి యుండఁగా నటులిచ్చుటకు లేకపోయెగదా యని నేను పరితపించుచుండ నీ పాలి పిండియు నాకిచ్చిన నా మనస్సునం దెట్లుండునో నీ వూహింపవదలదా? నాయాఁకలికంటె నీ యాఁకలి గొప్పదనియు నాకంటె మిక్కిలి డస్సియున్న దానవనియు నేనెఱుఁగుదు. లేకలేక యెన్నాళ్ళకో ఆహారము దొరక దానిని నీవు దానముచేసిన బ్రతుకుతెరువేది? నీబాగేగదా నాబాగు నీవు బాగుండినఁ గదా నాకు అన్ని వ్రతములు తపములు జపములు సాగును. భార్యయేకదా భర్తకు ఆహారమిడి యతని పోషింపవలసినది. భర్తను దయతో గారవించునది భార్యయేకదా? "లేబరముగాదె యిల్లాలు లేని బ్రదుకు" అన్నట్లు భార్యలేని వానిబ్రదుకు శూన్యమేకదా. భార్యలేని వాఁడన్నివిధముల పరాధీనుఁడేకదా. భార్యవలననే కదా పురుషుఁడు ధర్మము, అర్థము, కామము సాధింపఁ గలిగియుండును. భార్యవలననేకదా పురుషుఁడు తన్నుఁ దన పూర్వులను నరకమునుండి తప్పించు సంతానము గలవాఁడగుచున్నాఁడు. అట్టి భార్యను రక్షింపనివానికి నిహముగాని పరముగాని గలదా?" భార్యవలన సమస్త సౌఖ్యములు పడయుచు ఆమెను సుఖముగ రక్షింపక యుపేక్షించువాఁడు మనుష్యుఁడగునా? యనెను.

ఆ పలుకులువిని భార్య యిట్లనియె. ప్రాణేశ్వరా! మీరు చెప్పినది నేను కాదననుగాని మఱి యించుక నా విన్నపమాలకింపఁ గోరెదను. సతిని పాలించువాఁడు కావున పురుషుఁడు పతియయ్యె. భరించువాఁడు కావున భర్తయయ్యె. అట్టి పతిని విడిచి పత్ని ధర్మార్థకామము లెట్లు సంపాదింపఁ గదలు? భర్తలేకుండిన భార్యగతియేమి? పతి బాగుండిననే భార్యకు అన్నివిధముల బాగు. కావున మగనిని చక్కఁగ విచారించుటే భార్యకు ప్రథమ కర్తవ్యము. భార్యకు భర్తకన్న దైవములేదు కావున దేవతా నివేదనముగాక ముందు భుజించుట యెట్లు దూష్యమో యట్లే భర్త భుజించుటకు ముందు సతి భుజించుటయు దూష్యము. కావున మీరు

భుజింపకుండిన నేనుమాత్రము భుజింతునని తలంచితిరా? మీ రుపవాసములచే శుష్కించియు మీ భాగము నతిథికీయఁగా నేనుమాత్ర మీయరాదా నాకు బతివై భర్తవై యెన్నివిధములనో యుపకారము చేయుచుండ నా వలన మీరు పిడికెడు పిండి గ్రహింపరాదా? భార్య యెప్పటికి భర్తకు సహధర్మచారిణియై యుండవలయును. మీ రేధర్మమందు వర్తింతురో ఆ ధర్మమందు వర్తింపవలసినది నాకును విధి. ఇందు నాకు స్వాతంత్ర్యము లేదు. నన్నాధర్మమందుఁ బ్రవర్తింపఁ జేయనీయకుండుట మీకును ధర్మము గాదు" అనిన సక్తుప్రస్థుఁడామె భాగము పిండిని అతిథి కిచ్చెను గాని దానిచేతను ఆయన యాఁకలి యణఁగలేదు. అది యెఱిఁగి కుమారుఁడు తనభాగము పిండితెచ్చి తండ్రిముందిడి యతిథికిమ్మని వేఁడు కొనెను. దానినిజూచి తండ్రి కొడుకున కిట్లనియె.

"పుత్రకా! నీకు నూఱుసంవత్సరముల ప్రాయమైనను నీవు నాకు పసిపిల్లవాఁడవే. బిడ్డలను రక్షింపవలసిన విధి తల్లిదండ్రులది. తమకు లేకుండినను తల్లితండ్రులు బిడ్డలకు ఆహారము కల్పింపవలయును. బిడ్డలసంతోషమే తల్లిదండ్రుల సంతోషము. బిడ్డలు దుఃఖింపఁగాఁ తల్లిదండ్రులు సుఖింపరు. నీవు బాగుండిననే మా బాగు నీవలననే మేము ఊర్ధ్వలోకములను పొందవలసినవారము. నీవలననే మేమిందును సుఖింపవలసినవారము. ఎన్ని దినములకో నీకింత యాహార మీయఁగలిగితిని. మరల నీకిఁక నెన్నాళ్ళకు ఆహార మీయఁగలనో తెలియదు. ఈ కొంచెము నీకు లేకుండఁ జేసిన నీవు ప్రాణమెట్లు భరింతువు? మేము ముసలివారము. ఆఁకలిని సహింపఁగలము. బాలుర కాఁకలి మెండు. సహింపలేరు. బాలురనోటి కడిని దీయు తల్లిదండ్రులు రాక్షసులుగాని మనుష్యులుగారు ఆఁకలి కోపక నేనొకవేళ నీకన్నులయెదుట మరణించినను వ్యసనము లేదు. నాయనా! తలఁదడుపు కోడలు నీళ్ళువిడుచు కొడుకు కావలయునని తల్లిదండ్రులు దైవములను బ్రార్థించుచుందురు మీరిరువురు క్షేమముగ నుండుటే మాకు పదివేలు. కావున నీ యాహారము నీవు భుజింపుము" అనిన కొడుకిట్లనియె.

"తండ్రీ! మీరిటులనరాదు. బాలురకు యుక్తవయస్సు వచ్చువఱకు వారిని తల్లిదండ్రులు భరింపవలయుననుట న్యాయ్యమే కానిశక్తియుండినను లేకుండినను కలకాలము భరింపవలయు నను ధర్మముకాదు. యుక్తవయస్సు వచ్చి నదిమొదలు కుమారుఁడు తల్లిదండ్రులను తప్పక భరింపవలయును. అట్లు భరింపని కృతఘ్నుఁడు పితృద్రోహి యుభయలోక భ్రష్టుఁడై రౌరవాది నరకముల పాలగును. తల్లిదండ్రులు బిడ్డలను ప్రతిఫల మపేక్షింపక పోషింతురు. అట్టివారిని మరల భరించుట తనవిధి. తానుచేసి ఋణవిముక్తుఁ డగుటకే కాని వారి నుద్ధరింపఁగాదు. వృద్ధులుగ నుండు మీ రుపవాసము చేయ నేనా భుజింతును? చేతికెదిగిన కొడుకు కోడలు ప్రాప్తించిన పిమ్మట కుటుంబరక్షణ విచారణ భారమంతయు వారియందున్నది. అతిథి నభ్యాగతిని గౌరవింపవలసినవారు వారే. వారికిఁ దెలియని విషయము చెప్పుచు వారిచే సత్కరింపఁబడుచుఁ బుణ్యకార్యము లొనర్చుచు తల్లిదండ్రులు భగవంతుని ధ్యానించుచు సుఖముగ కాలము గడుపుచుండవలయును. అట్టి భారము నా యందుండ ముందు నాహార మీ యతిథికీయవలసి యుండఁగ మీరిచ్చుచుండ నూరక చూచుచుంటిని. ఆ పాపమునుండి నేనెట్లు విడువడుదునో తెలియదు. ఈ బ్రాహ్మణుఁ డరకడుపుతో లేచిపోయెనేని నీవా దుఃఖము తోనే మరణింతువు. నేను నీ మృతికి కారణమగుదునుగదా. ఈ పితృద్రోహ మహాపాతకము నేను దప్పించుకొను టెట్లు? తండ్రియేకదా కొడుకు. కొడుకు తండ్రిసొత్తయినప్పుడు కొడుకుసొత్తు తండ్రిదికదా? కావున దీనిని నీ సొత్తుగనే గ్రహించి యీ యతిథి[4] కిడుము" అనిన దానిని గ్రహించి యతిథి కిచ్చెను గాని దానిచేతను ఆయన సంతుష్టుఁడు కాఁడయ్యె. అదిచూచి కోడలు తన భాగము మామగారి ముందటనుంచి నాయందనుగ్రహించి దీనిని అతిథి కీయుఁడని వేఁడుకొనెను. అప్పుడు సక్తుప్రవస్థుఁ డామెతో నిట్లనియె.

"పుత్రీ! నీవిట్లు చేయ సాహసింపరాదు. నీవు బాలికవు. ఆఁకలిదప్పుల కోర్వఁజాలవు. అదియునుగాక మాకందఱ కుపచరించుటచేతను,

గృహకృత్యములనెల్ల నిర్వహించుటచేతను నీకు కాయకష్టము మెందు. న్యాయ్యముగ విచారించిన మా కందఱకన్న నీకు ఎక్కువ యాహారమిచ్చి నిన్ను చక్కఁగ పోషింపవలయును. నా దారిద్ర్యదేవత నా కట్టి పుణ్యము కలిగింపకున్నది. ఆహారము కొంచెమగుటచే నీకు ఆఁకలివలన కన్నులలో ప్రాణములున్నవి. మూర్ఛపోవుదానివలె నున్నదానవు. నీవు బాగుండిననే మేమందఱము బాగుండువారము. నీవలననే మా వంశము వృద్ధికావలసి యున్నది. నీ వలననే మాకు కీర్తిప్రతిష్ఠలు రావలసియున్నది. మగఁడెంత సమర్థుఁడైనను మగువ గుణవతి కాదేని వాఁడుభయలోకభ్రష్టుఁడగును. అంతటి భారమును వహించు కోడలిని చక్కఁగఁ బోషింపని పెద్దలు గ్రద్దలుకాని వేఱుగారు. ఏ యింట కోడలు ఆహారములేక దుఃఖించునో యా యిల్లు శీఘ్రకాలమందే నిర్మూలమగును. నిష్కారణముగఁ దర్జనభర్జనాదులచే కోడలికంట నీరు గాఁజేయు వానియింట జ్యేష్ఠాదేవి తాండవ మాడుచుండును. కావున నీ యాహారము నీకు లేకుండఁ జేయుట నాకు నీతిగాదు. నీకుఁగల శ్రద్ధాభక్తులు నే నెఱుఁగనివాఁడఁగాను. నీ యాహారము నీవు భుజింపుము" అనిన ఆ బాలిక యిట్లనియె.

"తండ్రీ! నేను పుట్టినింటనున్నప్పుడు నా తల్లి పుత్రీ! భగవంతుఁడు మనకీ కరణకళేబరమును తరణ సాధనముగా ననుగ్రహించి యున్నాఁడు. గాని యాత్మైకభోగార్థమునకుఁ గాదు. కావున నీ సమయమును సద్వినియోగ పరుపుము. నీగురువుల సుఖదుఃఖములే నీ సుఖదుఃఖములని భావింపుము. వారినివిడిచి సుఖమునకై యాశపడకుము. వారిమార్గమునే యనుసరింపుము" అని బోధించెను. మీరు నా గురువునకు గురువులు. దైవమునకు దైవము. నా దేహము ప్రాణము గురుపూజార్థమే కాని ఆత్మసుఖార్థము గాదు. ఇది నా నిశ్చయము. మీ మార్గము నా కనుసరణీయము కావున నా శుశ్రూష మీ రంగీకరించుటచే నాకు పుణ్యలాభము కలిగించినవా రగుదురు. దాని నిరాకరించితిరా నాకు రాగలపుణ్యమునకు విఘ్నము గలిగించినవారగుదురు. అల్లుచేయుట నాయందుఁ బ్రీతిగల మీకు ధర్మమా?" ఆ మాటలువిని

సక్తుప్రస్థుఁడు "అమ్మా! నీవు చెప్పినది సత్యము. నీకు రాఁగల పుణ్యమునకు నేనడ్డపడరాదు. నిన్ను వంచించుట నాకు ధర్మముగాదు" అని యామె భాగము పిండి యతిథికిచ్చెను. దాని నారగించి యా బ్రాహ్మణుఁడు మిగుల సంతోషించి యిట్లనెను. "ఓయి బ్రాహ్మణా! మీరు నలువురు మిక్కిలి సంతోషముతోను భక్తిశ్రద్ధలతోను ఇచ్చిన యాహారముచే మిక్కిలి తుష్టుఁడనైతిని. నేను మీ మనస్సులు పరిశోధింపవచ్చిన ధర్మదేవతను. ధర్మరక్షణమందు శరీరపోషణము ముఖ్యము. దేహాభిమానము వదలుట దుష్కరము. అట్టులుండియు మీరు దేహము నొకపోకకైనఁ గైకొనక ధర్మమే ప్రధానముగఁ గొని పరప్రాణరక్షణమునకై మీరు నలువురు ప్రాణములు విడుచుటకై సిద్ధపడితిరి. ధనము సంపాదించుట సుకరముగాని పాత్రమెఱిఁగి యిచ్చుట శ్రేష్ఠము. కాల మెఱిఁగి యిచ్చుట శ్రేష్ఠతరము. భక్తితోనిచ్చుట శ్రేష్ఠతమము. దానమిచ్చుటయందు శ్రద్ధాభక్తులు ప్రధానములు. వేయిగలవాఁడు నూఱిచ్చుటయు, నూఱు గలవాఁడు పదిచ్చుటయు, దరిద్రుఁడు దోసెఁడు నీళ్ళు శ్రద్ధతో దానముచేయుటయు సమానములు. కావున న్యాయార్జితము కొంచెమైనను దానముచేసినఁ గలుగు ఫలము యజ్ఞాదు లెన్ని చేసినను గలుగదు. మీ పుణ్యముచే మీరు బ్రహ్మలోకము నార్జించితిరి. అదిగో బ్రహ్మలోకమునుండి విమానము వచ్చుచున్నది. మీపై దేవతలు పుష్పవృష్టి గురియించుచున్నారు. మీరు నలువురు బ్రహ్మలోకమునకు పొందు" అని తన స్వరూపము వారికిఁ గనఁలోకమునకు పొందు" అని తన స్వరూపము వారికిఁ గనఁబఱిచి యదృశ్యుఁడయ్యెను. వారును బ్రహ్మలోకమునకుఁ బోయిరి. ఆ సక్తుప్రస్థుఁడు బ్రాహ్మణునిచేత విడిచిన నీటి బురదలో పొరలాడుటచేతను, ఆ పేలపిండి వాసనచేతను నా శిరస్సు బంగారమయ్యెను. తక్కిన దేహమెందైన నటులే యగునాయని యెందఱెందరో బ్రాహ్మణులు తపస్సుచేయు చోటికిని రాజులు యజ్ఞముచేయు చోటికిని బోయితినిగాని నాకోరిక ఫలింపలేదు. ధర్మరాజుచేయు యాగమునందైనఁ గాకుండు నాయని కొండంత యాశతోవచ్చితిని. ఇక్కడకూడ నాకోరిక నెరవేఱలేదు అని ముంగిస వెడలిపోయెను.

**కం. దానమునయందు భక్తిప్రధాన మగును**
**శ్రద్ధతోడుత నిచ్చెనేన్ శక్తికొలఁది**
**పిడికెఁడైనను, నది పదివేలు సుమ్ము**
**ప్రీతిలే కిడు నీవులు[5] వితలు వితలు**

## 3. నాడీజంఘుని చరిత్రము

భరతఖండమున మధ్యరాష్ట్రమున గౌతముఁడను నొక బ్రాహ్మణుఁ డుండెను. వాని తల్లిదండ్రులు విద్యయు, ఆచారము, జ్ఞానము కలవారైనను గౌతముఁడు దుండగీఁడై వేదము లభ్యసింపక తుచ్ఛుల సహవాసముచేసి స్వేచ్ఛగాఁ దిరుగుచుండెను. విద్యరాని కారణముచేత గౌరవహీనుఁడై యీ దేశమున ధనము సంపాదించుకొనలేక మన భరతఖండమున కుత్తరమున నున్న మ్లేచ్ఛదేశమునకుఁ బోయి యందొక రమ్యమైయున్న బోయపల్లెఁ జొచ్చి యాపల్లెకు నధికారియగు చోరనాయకుని యింటికిపోయి నేను మధ్యరాష్ట్ర బ్రాహ్మణుఁడను నీయూర నివసింప మనసుగలదు. అని చెప్పఁగా నతఁడు బ్రాహ్మణుఁడుగదా యని సంతోషించి యతనికొక యిల్లు కొంతధనమిచ్చి శూద్రవిధవను పరిచారికగ నిచ్చెను.

అతఁడు వేదాధ్యయనముగాని శాస్త్రజ్ఞానముగాని వృద్ధసేవగాని సత్సహవాసముగాని లేనివాఁడగుటచే ఇప్పటి కొందఱు దుర్మతులవలె ఆర్యాచారములెల్ల నిష్ప్రయోజనములని తలఁచుచు మూఢుఁడై క్రమక్రమముగ వానిని వదలి మ్లేచ్ఛులతో కలసిమెలసి యుండుటచే వారి నడవడులే పట్టుపడ వారివృత్తి నవలంబించి వారితో సముఁడై వేఁటలమరగి జీవహింస చేయుచు, మాంసభక్షకుఁడై మాంసము జీర్ణమగుటకై కల్లుసారాయముద్రావుచు, వానిచే కామము వృద్ధి కాఁగా పరిచారికగ నుండు శూద్రవిధవను భార్యగాఁ జేసికొని కాలము గడుపుచుండెను. పరిచారిక భార్యకాఁగానే దాని బంధువులందరు ఒకరివెంట నొకరు వానియిల్లు చేరిరి. వారి నందఱ రక్షించుభారము వానిపైఁ బడెను. దారులుదోఁచి దొంగతనములుచేసి సంపాదించి యెంత

ధనమిచ్చినను భార్యకును బంధువులకు సంతుష్టి లేకుండెను. విశేషధనము నెట్లు సంపాదింతునా యని యాలోచించుచు వాఁడు కొన్ని సంవత్సరములు గడపెను.

అంత నొకనాఁడు ఒక బ్రాహ్మణుఁడు వేదాధ్యయనసంపన్నుఁడు, సదాచార నిష్ఠుఁడు మార్గవశమున నాయూరికి వచ్చి యా చోరనాయకుఁడగు గ్రామాధికారి యింటికిపోయి యిందెందైన బ్రాహ్మణుని యిల్లు కలదా యని విచారించెను. ఆ చోరుడును బ్రాహ్మణభక్తి గలవాఁడగుటచే ఆయన కేవేవియో యియ్యఁబూనెనుగాని యా బ్రాహ్మణుడు "అయ్యా! శూద్ర ద్రవ్యము నేను పరిగ్రహింపను. నన్ను బాధింపక బ్రాహ్మణుని యిల్లుండిన జూపుము" అని యడిగెను. అతుడును గౌతముడున్న వీధి మార్గము దెల్పి పంపెను.

ఆ బ్రాహ్మణుడు గౌతమునింటికి వచ్చు సమయమునకు సరిగ గౌతముడును తాను చంపిన కొంగలనెల్ల కావడిగట్టి నెత్తురు బొట్టులు నిండిన మేనితో ధృతాయుధుఁడై వచ్చెను. అతిధిగా వచ్చిన బ్రాహ్మణుఁడును గౌతముడును ఒక యూరివారే. పూర్వమిత్రులే కావున ఆసద్బ్రాహ్మణుఁడు మనుష్యాద ప్రాయుఁడగు గౌతముని గుర్తించి "గౌతమా! నీవా యీ వృత్తికి వచ్చితివి? నీ కులగౌరవము మహిమము దలఁపవైతివి గదా, నీ తల్లిదండ్రులు ఎంతటి సదాచార సంపన్నులో ఎట్టి శీలముగల వారో మఱచితివి గదా. భూతదయ ప్రధానముగాఁగల బ్రాహ్మణకులమునుబుట్టి యీ జీవహింస చేయుట యేమి? ఈ మాంసభక్షణ మేమి? ఈ శూద్రవిధవా సంగమమేమి? మూఁడు దినములు సంధ్యవారువని వాఁడు శూద్ర ప్రాయుడని ప్రమాణము లుండ నీవు సంధ్యవార్చి గాయత్రి జపించి యెన్ని సంవత్సరములాయెనో కదా? నిత్యకర్మానుష్ఠానము నీటు గలిపితివి, బ్రాహ్మణవృత్తి పదటు గలిపితివి. భూతదయ బూదిచేసితివి. ఎన్నిజన్మములు జేసిన సుకృతముచేతనో బ్రాహ్మణజన్మము గలుగునని తలంపక బంగారువంటి కులమును పాడుచేసి పాపార్జనము యథేచ్ఛముగాఁ

జేసితివిగదా. మిత్రమా! నిన్నుఁ జూచిన నాకు పట్టరాని దుఃఖము కలుగుచున్నది. ఇప్పుడైనను కులము శీలముదలంచి దయవహించి యీ వాసము వర్జింపుము అని చెప్ప నతుడు దుఃఖితునట్టులై "మిత్రమా! వేదము లభ్యసింపక పోయితిని. ధనమైన సంపాదింతును గాక యని యిటకు వచ్చితిని. నీవు నాకు బుద్ధిచెప్పితివి. నీతోపాటు నేను వచ్చెదను. రేపు ఈ గ్రామము వదలిపోదము. ఈ రాత్రి నాయిచ్చు పదార్థము పండో కాయో యేదైన గ్రహించి యాఁకలి దీర్చుకొని నిద్రింపుము, అని యెంత మేదుకొన్నను క్షుధచే ప్రాణము పోవునట్లుండినను వానిచేత నీరైన వ్రేలువేసి యంటక యా రాత్రి యెట్లో గడపి జాతిచండాలు నమ్మవచ్చునుగాని కర్మ చండలు నమ్మరాదు. వీనితోడు బోరాదని తలుచి యుదయమునకు ముందే యూరువిడిచి యాయనత్రోవన ఆయనపోయెను.

భార్యను సంతోషపెట్టుటకై ధనము సంపాదింప గౌతముఁడు బయలుదేరి కొంతదూరము పోయి వాణిజ్యము నిమిత్తము సముద్రతీరమునకుఁ బోవుచున్న బిడారు[6]వారితోఁ గలిసి కొంతదూరము పయనించెను. ఇటుపోవుచు ఆ బిడారు ఒకనాఁడడవిలో దిగెను. ఆ రాత్రి యడవియేనుగు ఆ గుంపుపై పడి నాశము చేయుచుండ గౌతముడు భయపడి దిక్కు తెలియక పోయినదే త్రోవగా నుత్తరదిశగాఁ బరువెత్తెను. ఇట్లు పరువెత్తి యాత్రోవన మఱియు గొంతదూరముపోవ పూచిన కాచిన చెట్లచే నిండి సువాసన గమాయించు తరువులు గలిగిన బయలొకటి యతనికి గోచరించెను. దాని నడుమ దిక్కుల నందుకొను బోవుచున్న కొమ్మలతో నిండి గొడుగువలెనై మిక్కిలి రమ్యమైన యొక మఱ్ఱిచెట్టుండ బడలిన వాఁడు కావున దానిక్రింద చల్లని గాలి వీచుచుండ నిద్రపోయెను. సూర్యుఁడును అస్తమించెను.

అప్పుడు కశ్యపముని మిత్రుఁడును బ్రహ్మమిత్రుఁడును మహా ప్రాజ్ఞుఁడును శ్రీమంతుఁడును రాజధర్ముఁడని ప్రఖ్యాతి వహించినవాఁడు

నగు నాడీజంఘుఁడను గృధ్రరాజు బ్రహ్మలోకమునుండి తన యునికి పట్టునకువచ్చి యా వృక్షముక్రింద నిదురించు బ్రాహ్మణుని జూచి యతిథి లభించెనని సంతసించి వేచి యుండగా నతడును నిద్రలేచి పొంత గూర్చుండియుండిన గ్రద్దఱేనిఁ జూచి యాశ్చర్యపడి యాహారార్థమై దానిని జంపఁదలంచెను.

బ్రాహ్మణుఁడు నిద్దురలేయగానే రాజధరుఁ డతనితో నిట్లనియె. నీ జందెమునుబట్టి నీవు బ్రాహ్మణుఁడవని తలుచుచున్నాను. సత్యమేని నీ వెవరు ఎందుండి యిటకు వచ్చితివి? చెప్పుమనిన అతడును అచ్చెరువుపడి నేను గౌతముఁడను బ్రాహ్మణుఁడను. మధ్యరాష్ట్రవాసిని. ఆహారముచేత డస్సియున్నాను. అనినమాటలు వినినతోడనే రాజధర్ముఁడును గంగానది యందలి బలిసిన చేపలను దెచ్చి యతనికిచ్చెను. వాఁడు దానిని భుజించిన యనంతరము పూలతోను లేఁత యాకులతోను నిండిన కొమ్మలను రెమ్మలను దెచ్చి యతనికి శయ్యగుదిర్చి యిచ్చి యిందు సుఖముగ నిద్రింపుమనిచెప్పి పరుండిన యతనితో నిట్లనియె. "అయ్యా! నేను కశ్యపునకు దాక్షాయణియందుఁ బుట్టినవాఁడను. నీ వేమికార్యమునకై ఎచ్చటికిఁ బోవుచున్నావు? తెలియ జెప్పితివేని నా చేనైన సహాయ్యము చేసెదను" అనిన ఆ గౌతము డిట్లనియె. "బకోట వల్లభా! నేను దరిద్రుఁడను. ధనార్థినై "గౌతమా! వంశపారంపర్యము వలనను, దైవకృపవలనను, కష్టించుటవలనను, మిత్రుల వలనను, విద్యవలనను, బుద్ధివలనను, అర్థసిద్ధియగును. నేను నీకు మిత్రుఁడనైతిని. నీవిక విచారపడకుము. నీకు ధనములభించు సదుపాయము నేను జెప్పెదను. సుఖముగ నిశ్చింతముగ నిద్రపొమ్మనిన నతఁడును నిదురించి యుదయమున లేచి ప్రయాణమునకు సిద్ధపడియుండ నాడీజంఘుఁ డతనితో నిట్లు వచించెను.

"మిత్రుఁడా! చక్కఁగ నీ తెరువున మూఁడుయోజనములు పోయితివేని యందు మేరువ్రజమను పురముగలదు. దానినే కొందఱు మను వ్రజమనియు నందురు. ఆ పురివిభుఁడు విరూపాక్షుఁడును రాక్షసుఁడు నా

హితుఁడు. అతనియొద్దకుఁ బోయి నేను బంప వచ్చినవాఁడ నని చెప్పుము. నీ కోరిక యతుడు నెఱవేర్చును.” అనిన నతఁడును దక్షాయ్యపతి చూపిన బాటనబోవుచు త్రోవయందుఁగల ఫలముల నారగించుచు సంతుష్టుఁడై విరూపాక్షుపురముఁ జేరి తనరాక యతనికిఁ జెప్పిపుచ్చెను. ఆ రాక్షసరాజు వెంటనే సేవకులు బంపి గృహములోనికి తోడి తెప్పించి మిత్రుని మిత్రుఁడు గదాయని బహూకరించి యాసనమిడి మిత్రమా! నీదే యూరు? ఏది కులము? ఎంతవఱకధ్యయన మొనర్చితివి? నీవు బ్రహ్మచారివా యనిన ఎట్టి పాపమునకు భయపడని యా భ్రష్టబ్రాహ్మణుఁ డసత్యమాడ భయపడి “నేను మధ్యదేశమున జనించిన వాఁడను. శబరాలయము నా నివాసగ్రామము. పునర్భువగు శూద్రస్త్రీ నా భార్య. నేను సత్యము వచించితిని” అని చెప్పెను. ఆ మాటలు విని విరూపాక్షుఁడిట్లు తలఁచెను. “వీఁడు బ్రాహ్మణుఁడ ననుచున్నాఁడు. ముఖమున బ్రాహ్మణవర్చస్సు గానరాదు. అధ్యయనము చేసిన వాఁడును గాఁడు. శూద్రస్త్రీ అందు విధవ వీనికి భార్యయఁట. పరమపవిత్రుఁడగు నా మిత్రున కీదుష్టచరిత్రుఁ డెచ్చట లభించెను. ఇప్పుడు నేనది విచారింపరాదు. నా మిత్రుని మిత్రుఁడు నా మిత్రుఁడే కదా. ఈతనిని సత్కరింపవలసినది నాకు విధి. ఈ దినము కార్తికపూర్ణిమ. వేయిమంది బ్రాహ్మణులకు సమారాధనము చేయుచున్నాను. వారితోపాటు వీనిని గౌరవించెద”వని తలఁచి యందఱకు బంగరు పళ్లెరములలో షడ్రసోపేతముగ భోజన మిడి వారు మోయుగలంత ధనమిచ్చి బ్రాహ్మణులారా! ఈ దినము మాత్రము మీకు నా రాక్షసుల వలన మేర దాఁటి పొందు. అనిన వారందఱు ధనము మోసినంత గొని శీఘ్రముగ ఆ యూరువిడిచి పోయిరి.

గౌతముఁడును ఆశ దీర తాను మోయఁగలంత ధనము గైకొని మరల నాడీజంఘుఁడుండు వృక్షము నొద్దకు వచ్చెను. రాజధర్ముఁడును అతనికోరిక నెఱవేఱుటకై తానును తుష్టుఁడై బడలిన యతని శ్రమము

పాయ ఱెక్కలచే విసరి కడుపునిండ నాహారమిడి యడవిమృగముల బాధ లేకుండ నెగడువేసి యా రాత్రి యతని యొద్దనె పరుండెను.

అప్పుడు గౌతము డిట్టు లాలోచించెను. లోభమోహములచే నేను మూటకట్టుకొనిన ధనమో మోయరానిదై యున్నది. నేను పయనింపవలసిన దూరమా విశేషించి యున్నది. త్రోవయం దాహారము దుర్లభము. దీనిని బాట నొక చోటనుంచి యాహారము వెదుక బోవుద మనిన దీని నెవ్వ రపహరింతురో. దీనిని మోసికొని యాహారాన్వేషణము చేయుట సుకరముగాదు. దీనికి సులభోపాయ మేమని చాలసేపాలోచించి యా పాపపు బ్రాహ్మణుఁడు "ఈ కొంగ చక్కఁగ బలిసి చియ్యపట్టియున్నది. దీనిని జంపితినా రెండు మూఁడు దినముల కాహారమగును. దీని నిక్కడనే పక్వము చేసికొని పోవచ్చును." అని తీర్మానించుకొని నిద్రించుచున్న యా బకమునుజంపి ఱెక్కలు పీఁకివైచి మంటయందుఁ బక్వము చేసి మాంసమును సంచిలో పెట్టుకొని శీఘ్రముగ పయనించెను.

అక్కడ విరూపాక్షుఁడు రెండుదినములైనను తన యొద్దకు నాడీజంఘుఁడు రాకుండుట చూచి చాల విచారగ్రస్తుఁడై తనకొడుకును బిలిచి యిట్లనియె. పుత్రా! నా మిత్రుడు రాజధర్ముఁడు నా యొద్దకువచ్చి రెండుదినములయ్యెను. ఇంతవఱకొకనాఁడైన నతుడు నా యొద్దకు రాని దినము లేదు. అతఁడు రామిని నా మనస్సు శోకపీడితమై యున్నది. నీవుపోయి యతని క్షేమ మరసిరమ్ము. అతనినూతన మిత్రునందు నాకు సందేహము కలుగుచున్నది. గౌతముఁడు క్షుద్రబ్రాహ్మణుఁడు. కులభ్రష్టుఁడు. అతని ముఖమున బ్రాహ్మణవర్చస్సు లేదు. ఇఁక గుణము శూద్రవిధవను మరగిన వాఁడు. ఇట్టివాని నెట్లు నమ్మవచ్చును. నీవుపోయి సర్వము తెలిసి వేగిరము రమ్ము." అనిన నతఁడు శీఘ్రగమనమున మఱ్ఱి చేరుబోయి యచటఁ బడియుండిన ఱెక్కలను జూచి నాడీజంఘుని వని గుర్తించి తండ్రిమాటలు స్మరించి వృత్తాంతమంతయు మనస్సునకు గోచరింపఁగా విలపించి గౌతమునిఁ బట్టితెండని తన భటులను నానాదిక్కుల కంపెను.

వారును పరువుపాటి మోయలేని బరువుచే మెల్లగఁ బయనించుచున్న గౌతముని పట్టుకొని యతని సంచి శోధింపనందు మాంసమగపడ వాఁడే ద్రోహియని నిశ్చయించి పెడకేలుగట్టి తెచ్చి యందఱు కలసి యతని విరూపాక్షునొద్దకుఁ గొనిపోయి జరిగిన వృత్తాంతమంతయుఁ దెలిపిరి. మిత్రుని మృతికి విరూపాక్షుఁడు నంతఃపురమువారును అందఱు హోయని యేడ్చిరి. తరువాత విరూపాక్షుడు రాక్షసులఁబిలిచి యీ మిత్రద్రోహిని, కృతఘ్నుని, పాపాత్ముని నాయెదుర నుండ నీయకుఁడు. వీనిని ముక్కలు ముక్కలుగఁ నఱికి మీరెల్లఁ బంచుకొని తినుఁడనిన వారందఱొక్కమాటగా అయ్యయ్యో! రాజా కృతఘ్నునిఁ దినుఁడనియా మాకాజ్ఞాపించెదరు? మేము మాంస భక్షకులమైనను భోజ్యాభోజ్య విచారము లేని వారమా? కృతఘ్నుని మాంసము దినునంతటి పాపము మేమేమి చేసితిమి? కావున మాయందు దయయుంచి వీనిమాంసమును మఱియెవ్వనికైన నిండు" అనిన నటులైన వీని ఖండించి ధన్యుల కండని రాజుచెప్ప రాక్షసులు వానిని తునకలు తునకలుగ నఱికి చోరులకీయ వారును ఈ పాపపు బ్రాహ్మణుని మాంసము మాకేల? వలదనిరి. అట్లైన వీని మాంసమును కాకులకు గ్రద్దలకు వేయుఁడని రాజు ఎప్ప రాక్షసులట్లే చేసిరి గాని కాకులు గ్రద్దలు దూరమును జూచి తొలఁగి పోయెనేకాని దాని నొకటియైన ముట్టలేదు. తుదకు చీమలు పురుగులు తీఁగలైన నంటలేదు.

విరూపాక్షుఁడు తన మిత్రునకు సంస్కారము చేయుగోరి ఆ మాంసమును ఱెక్కలను ఎముకలను చితిపై పేర్చెను. అప్పు డింద్రునాజ్ఞ కామధేనువు దానిపై పాలుగార్పఁగా నాడీజంఘుఁడు మరల బ్రతికి తన్నుఁ జూడవచ్చిన యింద్రునిఁ జూచి తన మిత్రుని గౌతముని బ్రతికింపఁ గోరెను. ఇంద్రుఁడతని నట్లే బ్రతికించి పోయెను. తమకుఁ గీడుచేసిన వారికిని సాధువులు మేలే చేయుదురు.

ఈ భ్రష్టబ్రాహ్మణుఁడు శూద్రవిధవయందు సంతానముగాంచి దీర్ఘకాలము నరకముపాలగుఁ గాక యని దేవతలు గౌతముని శపించిరి. పాపమును దేవతలు సహింతురా!

గౌతముఁడును మరల ధనమును గొని తన యూరికిఁ బోయి శూద్రరండ యందు బిడ్డలు గనుచు నుండి చచ్చి దీర్ఘకాలము నరకము పాలాయెను. శూద్రాసంగమము చేయు బ్రాహ్మణుని గతి యిది.

### 4. అంబరీష చరిత్రము

అంబరీషుఁడను రాజు పరమ పుణ్యాత్ముఁడు. భగవంతునియందు మిక్కిలి భక్తిగలవాఁడు. వ్రతములను నిష్ఠతో సలుపువాఁడు, సదాచార సంపన్నుఁడు. ప్రజలయం దత్యంతానురాగము కలవాఁడు. లోకులందఱు నతనిని తండ్రివలెనే కొలుచుచుండిరి. ఆయన సర్వకాల సర్వావస్థలయందు నారాయణ నారాయణ యని ధ్యానము చేయుచుఁ బ్రపంచమంతయు విష్ణుమయముగఁ జూచుచుండుటచే విష్ణు వాయన భక్తికి సంతోషించి యాయన రక్షణార్థము తన చక్రము నిచ్చెను. అది యెవ్వరు పాపములు చేసినను వెంటనే దండించుచు రాజ్యమున ధర్మహాని లేక యుండునట్లు కనిపెట్టి వర్తించుచుండెను.

తన గుణములకు సరిపోవు గుణములు గల భార్యతోడ నా మహారాజు ద్వాదశీ వ్రతము నొక సంవత్సరము జరపెను. ఆ వ్రతాంతమునఁ గార్తిక మాసమున మూఁడు రాత్రులుపవసించి యమునానది యందు స్నానముచేసి మధువనమున మహాభిషేకముచే హరిపూజ గావించెను. మందలకొలఁది గోవులను బ్రాహ్మణులకు దానముచేసి యనేక భూసురులకు భోజనమిడి తాను పారణముచేయ యత్నించెను. ఆ సమయమున దుర్వాసుఁడను మహాముని యతిథియైవచ్చెను. రాజును దుర్వాసునిఁ దగువిధమునఁ బూజించి భోజనమునకుఁ బిలిచిన నతఁడంగీకరించి యిదో స్నానము చేసి వచ్చెదనని చెప్పిపోయి యేటిలో జపము జేయుచుఁ గూర్చుండెను. ఎంత సేపైనను ఆయన రాడాయెను. ద్వాదవి యర్ధముహూర్తము నిలువయున్నదనఁగా బారణము సేయవలయును. ఆ సమయము మించిపోవు నట్లుండెను. సమయమున పారణము చేయని యెడ వ్రతభంగ మగును. దైవమా! యేమిగతియని చింతాక్రాంతుఁడై బ్రాహ్మణులను జూచి రాజిట్లనియె.

మహాత్ములారా! బ్రాహ్మణుఁ డతిథియై వచ్చిన భోజనమునకుఁ బిలిచితిని. ఆయన వచ్చెదనని స్నానమునకుఁబోయి యింతమట్టునకు రాఁడయ్యెను. ద్వాదశి మీఱిపోవుచున్నది. భుజింపరాదు. భుజింపకుండ రాదు. ఏది కర్తవ్యము? అనిన వారిట్లనిరి.

రాజా! నీవు జలపారణముచేసి యూరకుండుము. దానివలన వ్రతహాని భయములేదు. అతిథి వచ్చిన పిమ్మట ఆయనతో నారగింపుము. అతిథి నవమానించిన దోషము రాదు. అనిన రాజు నట్లె గావించెను.

తరువాత నెంత సేపటికో దుర్వాసుఁడువచ్చి యంబరీషుఁడు జలపారణము చేసెనని తెలిసికొని కోపముచే మండిపడుచు గ్రుడ్లెఱ్ఱచేసి పండ్లుకొఱుకుచు నిట్లనియె.

ఓరి రాజాధమా! నన్ను నీవు భోజనమునకుఁ బిలిచి నీ వెట్లు ముందు గతికితివి? అతిథిని భోజనమునకుఁ బలిచి ముందుగ భుజించు నీచుని నిన్నుఁ దక్క లోకమెఱుఁగునా? నేను వచ్చులోపల నీ కాఁకలిచేఁ బ్రాణము పోవునేని నన్నేల పిలిచితివి? నీ భుక్తశేషమా నేను దినవలయును? నేనన నీ కింత యలక్ష్యమేలయ్యె? రాజనని నీ కింత గర్వమా? చూడుము. నిన్నిప్పుడు భస్మము చేసెదనని యతుడెంత ప్రార్థించినను వినక యొకజడ పెఱికి మంత్రించి యతనిపైఁ బ్రయోగించెను. అదియును మహాశక్తియై యంబరీషుని జంపఁ బైపడి వచ్చెను.

దుర్వాసుఁడు పోవుపోకలుచూచి నారాయణమూర్తి యాయనపైఁ దన చక్రమునంపెను. అది శతకోటిసూర్యరశ్ములచే వెలుఁగుచు గ్రక్కున వచ్చి దుర్వాసుఁడు ప్రయోగించిన శక్తిని నఱకి యతనినే చంపఁ మీఁదికి వచ్చెను. దానిని గని దుర్వాసుఁడు వెఱచి పరువెత్తసాగెను. చక్రమతని వెన్నంటెను.

అతుడు స్వర్గమునకుఁబోయిన స్వర్గమునకుఁ, గైలాసమునకుఁ బోయిన స్వర్గమునకుఁ, గైలాసమునకుఁ బోయిను గైలాసమునకు, సత్య

లోకమునకుఁ బాతాళమునకు వెనుకొని పోయెను. అతుడు సముద్రములోఁ దూఱ నదియును సముద్రములోఁ దూఱెను. ఆకాశమున కెగుబ్రాఁక నదియును బ్రాఁకెను. ఏమి చేసినను విష్ణుచక్రము వదలక తన్నుఁ జంపుటకై రాఁగా శివుని శరణముచొచ్చెను. బ్రహ్మ పాదములపైఁ బడెను. వారు విష్ణుచక్రమునకు మేమడ్డము కాఁజాలము బొమ్మనిరి. ఇంతదూరము పరువెత్త నీయక యెప్పుడో చక్రమతనిఁ జంపియుండునుగాని రాముని బాణమువలెనే విష్ణుచక్రము పరువెత్తు వారిని వెనుక నుండి చంపదు. ఎదురుగా నుండియే చంపవలయును. కావున నతఁడు నిలుచువఱకు వెంటనంటి పోవుచుండెను. దిక్కులు గానక దుర్వాసుఁడు కడపట వైకుంఠలోకమునకుఁ బోయి పాహిపాహి ప్రభో! యని యఱచుచు శ్రీమన్నారాయణు పాదములపైఁ బడెను. భగవంతు డతని లెమ్మని యాజ్ఞాపించి యిట్లనియె.

ఓరి గర్విష్ఠుఁడా! నీ యోగగర్వము నిన్నిట్టి దుస్థితికిఁ దెచ్చెను. మూఢుఁడా! యోగవిద్యను గారడివిద్యఁగాఁ జేసి నీచకార్యములకై వినియోగింప నెంచితివా? నీవిద్యలు భక్తుల యందుఁ బనిచేయఁగలవా? నా భక్తులిట్టి క్షుద్ర విద్యలచేఁ జెడువారని తలఁచితివా? అతని వ్రతముఁ జెఱుపఁ దలపెట్టుట గాక యతనిని జంపనెంచితివా? సత్కార్యమునకు భగవత్కైంకర్యమునకు విఘ్నము చేయువానిని వానిపాపమే చంపక విడుచునా? కామక్రోధముల జయింపలేని నీ తపమేల కాల్పనా? నీవు మరల నంబరీషు నొద్దకుఁబోయి యతని శరణువేడుము. అతడు నిన్నుగాపాడును. నాకపరాధముచేసిన నేను సహింతును గాని నా భక్తుల కపకారము తలపెట్టువారిని నేను సహింపఁజాలను. నేనెందో యెవ్వరికిఁ గానరాక యుందునని తలఁచువారు మూఢులు. ఐహికవాంఛ లన్నిటిని వదలి నేనే పరమదిక్కని నన్నేభజించు నాభక్తుని వెనువెంట గోవువెంట పోవు కోడెవలెనుందును. నా తేజమే భక్తులయందు నావేశించియుండి వారికపకారము గావించు వారికిఁ గీడు గలించుచుండును. నా

భక్తులపరాధుల పట్లను గరుణయే తలంతురు. కావున నీవు శీఘ్రమునఁ బోయి యంబరీషు శరణు చొరుము. అమ్మహాభాగుఁడు నిన్ను రక్షించునన నతుడు పరువునఁబోయి యంబరీషుఁ జేరి యభిమానము వదలి యతని చరణములు పట్టుకొని ప్రాణభిక్ష యిమ్మని వేఁడుచు లేవకున్న నమ్మహానుభావుఁడు బ్రాహ్మణుఁడు తన పదములు స్పృశించెనని భయపడుచు విష్ణుచక్రము ననేక విధములు బ్రార్థించి యిట్లనియె.

**ఆ. "ఏ నమస్కరింతు నింద్ర శాత్రవ ధూమ**
**కేతువునకు ధర్మసేతువునకు**
**విమల రూపమునకు విశ్వగోపమునకుఁ**
**జక్రమునకు గుప్తశక్రమునకు**

**ఆ. విహితధర్మమందు విహరింతు నేనియు**
**నిష్టమైన ద్రవ్యమిత్తునేని**
**ధరణి సురుఁడు[7] మాకు దైవతం బగునేని**
**విప్రునకు శుభంబు వెలయుఁ గాక."**

అని వేఁడినఁ జక్రము మునిని బాధింపక చనియెను. అంత దుర్వాసుఁడును అంబరీషుఁ బెక్కు తెఱఁగులఁ గొనియాడి భక్తుల నిఁక నేఁపరాదని బుద్ధితెచ్చుకొనిపోయెను. అంబరీషుఁడును

దుర్వాసుఁడు భుజించిన తరువాతఁ దాను భుజించి వ్రతము సాంతముఁ జేసెను.

### 5. హరిభక్తులకుఁ బరాభవము లేదు

దుర్వాసుఁ డొకనాఁడు దుర్యోధను నింటికి అతిథియై వచ్చెను. దుర్వాసుఁ డతికోపనుఁడనియు, కోపించెనా శపించి నిర్మూలించుననియు, అనుగ్రహించెనా యెంతటి మేలైనఁ జేయు మహా తపస్సంపన్నుఁడనియు దుర్యోధనుఁ డెఱుఁగును. ఆ సమయమున పాండవు లరణ్యవాసము

చేయుచుండిరి. దుర్వాసుని దయ సంపాదించుకొని యతనిచే శపింపఁ జేసి పాండవుల నిర్మూలింపఁ దలఁచి దుర్యోధనుఁడు మునీంద్రుననేక విధముల సేవించు చుండెను.

దుర్వాసుఁడో "నేను గ్రామంతరము పోయి పది దినములకు వచ్చెదను" అని చెప్పిపోయి మఱుసటివాఁ డుదయముననే వచ్చి "నా కాఁకలి యగుచున్నది. నాకీక్షణమున షడ్రసోపేతముగ నాహార మిడుము" అని కోరును. సర్వకాల సర్వావస్థలందును సర్వము సిద్ధముగ నుంచుకొని యుండు దుర్యోధనుఁడు అడిగిన వేళకు నడిగినట్లు సర్వ మతనికిఁ దృప్తిగ నొనరించుచుండెను. ఒకనాఁడు తేపు వచ్చెదనని మాపువచ్చును. మాపుపచ్చెదనని తేవు వచ్చును. ఒకనాఁడర్ధరాత్రమున వచ్చును. ఒకనాఁడు చేసి యుంచిన శాకపాకాదు లొకటియు బాగుగ లేదు. నాకిప్పుడు వేఱుగ పండి పెట్టు మనును. వేఁడి యన్నము పెట్టినఁ జల్లారిన యన్నము కావలయు ననును. ఈ ప్రకారముగ నన్నిపనులలో ననేక విధముల దుర్వాసుఁడు దుర్యోధనుని పరీక్షించి చూచెను. ఎందును మోసపోక దుర్యోధనుఁడు సర్వవిధముల నతనికి పరితుష్టి యగునటుల పరిచరించెను. ఇట్లు కొంత కాలము గడవఁగా దుర్వాసుఁడు దుర్యోధనునిపట్ల సంతసించినవాఁడై యతనిని జూచి "దుర్యోధనునిపట్ల సంతసించినవాఁడై యతనిని జూచి "దుర్యోధనా! నీ సేవకు సంతోషించితిని. నీవు కోరిన వరమిచ్చెదను కోరుము" అనెను. దుర్యోధనుఁడంతకు ముందే యాలోచించుకొని యున్నవాఁడు గావున నమ్మునీంద్రుని పాదములంటి మ్రొక్కి సవినయముగ "మునీంద్రా! మీరు సంతోషించుట కంటె నాకేమి కావలయును. నేను మీ కృపవలన సమస్తైశ్వర్యము లనుభవించుచున్నాను. మీ యట్టి మహాత్ముఁడు వరము కోరు మనిన వలదనుట బాగుగాదు. కావున నాయందు దయగలదేని మీరు మీశిష్య సహస్రముతోఁ బాండవుల యొద్దకుఁబోయి కొన్ని దినము లతిథులై యుండవలయునని వేఁడెద. ఇదియే నా కోరువరము" అని ముకుళితహస్తుఁడై నిలువఁ బడుటయు దుర్వాసుఁడట్టులే కానిమ్మని యతని నాశీర్వదించి వేయిమంది శిష్యులతో

కానిమ్మని యతని నాశీర్వదించి వేయిమంది శిష్యులతో ధర్మరాజున్న యరణ్యమునకుఁ బోయి "ధర్మనందనా! నేను నా వేవురు శిష్యులు ఆఁకలిగొని యున్నారము. భిక్ష యొసఁగెదవా?" యనెను కుంతీనంద నాగ్రజుండును అమ్మహామునీశ్వరుని చరణములపై వ్రాలి "లోకోత్తరుఁడగు మీవంటి యతిథి వచ్చి భిక్షవేఁడిన లేదను నంతటి పాపాత్ముఁడనా? ఈ దినము సుదినము, నా జన్మము పావనమయ్యెను." అని యనేక విధముల నుతించెను. దుర్వాసుఁడును సహస్రశిష్యులతో స్నానార్థము నదికిఁ బోయెను.

అప్పుడు మట్టమధ్యాహ్న మయ్యెను. అంతకు ముందే వేయి బ్రాహ్మణులకు నన్నదానమొనర్చి ధర్మరాజు నిశ్చింతముగఁ గూర్చుండి యుండినవాఁడు. ద్రౌపదియు సూర్యుఁడిచ్చిన పాత్రమును గడిగి శుద్ధిచేసి యుంచెను. ఆ పాత్రము సూర్యుని కరణచే లభించినది. ఎందఱకైన నొకసారి వలసిన పదార్థములన్ని యిచ్చునే గాని రెండవమాఱిచ్చునది కాదు. ఇదంతయుఁ దెలిసియు ధర్మరాజు ద్రౌపదిని బిలిచి జరిగిన వృత్తాంతముఁ దెలిపి యేమిచేసెదవనెను. పాపము! ఆమె యేమి చేయును. పిడికెఁడు గింజలైన నుండినఁగదా వండును. అటని యా మహాపతివ్రత భయపడక పతికి ధైర్యముచెప్పి వంటయింటిలోనికిఁ బోయి శ్రీకృష్ణ భగవానుని దలఁచి చేతులు మోడ్చి యిట్లు ధ్యానించెను. "కృష్ణా! నా పాలికిఁ దండ్రివైనను, దల్లివైనను, దోడుబట్టువైనను, దైవమైనను నీవే. సర్వమునకు నీవే కలవని నమ్మియున్న దానను. ఆ నాఁడు నేయని వస్త్రములిచ్చి నా మానము కాపాడితివి. నేఁడు వండని యన్న మిచ్చి నన్నును నా పతులను రక్షింపవలయును. సత్పాత్రమగు బ్రాహ్మణుఁడాఁకలిగొని యన్నమడిగిన లేదను వారికంటె నిర్భాగ్యులెవరు? ఈ భారము గృహిణిదైయున్నది. ఇప్పుడు నేను శాకపాకము లమరింపక పోయితినా యాపరమకోపనుఁడు నా భర్తల శపించును. ఆపదుద్ధారకా! దీనజనరక్షకా! నన్నీ యాపదనుండి రక్షింపుము" అని యనేక విధముల నిశ్చంచలమైన మనస్సుతో భక్తితోఁ బ్రార్థించెను.

భక్తులకు ప్రార్థనల నెప్పుడును భగవంతుఁడు నిరాకరింపఁడు. కావున వెంటనే యావంటయింటిలోఁ గృష్ణుడామెకుఁ బ్రత్యక్షమై "అక్కా! అక్కా! నేను మిక్కిలి యాఁకలిగొని ద్వారకనుండి వచ్చితిని. ఆఁకలికిఁ దాళజాలక బావలతోఁ కూడ మాటలాడక చక్కనిక్కడకు వచ్చితిని. నా ప్రాణము రక్షించు భారమునీది" యని యాఁకలిచేఁ దల్లడిల్లువానివలెఁ జెవులలోఁ బ్రాణము లున్నవానివలెఁ నీరెలుగుతో నెండిన పెదవుల నాలికతోఁ దడుపుచు మాటలాడెను. ద్రౌపదియు "అన్నా! పాత్రములన్నియును గడిగి వైచితినే. ఒక మెతుకైన లేదే. నేనేమిచ్చి నీ యాఁకలిదీర్తు" ననెను. కృష్ణుఁడును "అక్కా! నీటికడ్డముగ నొక మెదుకైన జాలును. ఒక కూరబ్రద్దయైను జాలును. నీవు కడిగియుంచిన పాత్రములందు వెదకుము. ఏదైన పొరపాటుననైన నంటుకొని యుండదా. అదియే చాలును" అనెను. ద్రౌపది తానెంతో యాచారమతి ననియు గృహపాత్రము లన్నియు శుచిగ మైల యేమాత్రము లేకయుండునట్లుంచుకొని యుండు దానననియు గర్వముకలది. ఆ గర్వముతో "అన్నా! నేను కడిగియుంచిన పాత్రములందు అంట్ల మెదుకులు కూరలునుండునా? వెండి పాత్రములవలె నేను త్రోమి యుంచిన దాననే" యనెను. కృష్ణుఁడు తేలగన్నులతో "అక్కా! ఎట్టివారికి పొరపాటుండును, చూచిన దోషమా! లేకపోయెనా నా యదృష్టమింతె యనుకొనెదను. నీకు చూచుట కిష్టము లేకున్న నేను చూచెదను. ఆ పాత్రమిటు తెమ్మనెను. ద్రౌపదియు "నామాట యసత్యమేమో నీవే చూడుము" అని పాత్రమందిచ్చెను. కృష్ణుఁడు దాని నటులిటులు ద్రిప్పి "సోదరీ! ఇదో యీ యాకుకూర యంచున నంటుకొన్నది. నాపుణ్యము నేఁడు మంచిది. బ్రతికితిని. అది నాచేతిలోఁ బెట్టి యిన్ని నీళ్ళుపోసి నా ప్రాణము నిలుపుము" అనెను. ద్రౌపదికి గర్వభంగ మాయెను. ఆమెయు జిన్నపోయి యాయాకు కూర కృష్ణార్పణమని కృష్ణుని చేతిలోనుండి నీళ్ళుపోసెను. ఆ భగవంతుడు ఆ నీళ్ళుద్రావి త్రేఁపి "అక్కా! నీ బుణ్యమున బ్రతికితి" ననిచెప్పి పాండవుల యొద్దకుఁ బోయెను. ద్రౌపదియుఁ దనకుఁ గలిగిన యవమానము దలుచి విషణ్ణురాలై

యుండెను. దుర్వాసుని వృత్తాంతము ధర్మరాజు కృష్ణునితో జెప్పెను. కృష్ణుఁడును అట్టి మహాయోగికి నీవు భిక్షచేయవలసినదే. వారేఁటికిఁ బోయి చాల దడవయ్యెను. నకులా! నీవు పోయి సశిష్యుఁడగు దుర్వాసుని తోడి తెమ్మనెను.

సర్వభూతమయుఁడగు వాసుదేవుఁ డెప్పుడు సంతుష్టి చెందెనో యప్పుడే దుర్వాసునకును అతని శిష్యులకును గడుపులు నిండి కుత్తుక బంటులై త్రేఁపులు వెలువడి యూపిరి తిరుగకుండునట్టు లాయెను. ఏటిలో స్నానము చేయుచు దుర్వాసుఁ డిట్టులాలోచించెను. ఏమి యీ చిత్రము! ఆఁకలి యణఁగెను. రుచిమంతములైన పదార్థములు భుజించి నటులు త్రేఁపులు వచ్చుచున్నవి. ఇప్పుడు ధర్మరాజునొద్ద కేమనిపోదును? ఒకరికి కాదు ఇద్దఱకుఁగాదు. వేయిమందికి వంట సిద్ధముచేయఁ జెప్పివచ్చితిని. పోయి భుజింపకుంటినా ఇంతపదార్థము వ్యర్థపఱిచితినని యతఁడేమి కోపించునో. అతఁడు మహాభక్తుఁడు. అంబరీషునకంటెఁ దక్కువయైన వాఁడుకాఁడు పోయి పరాభవ పడుటకన్న నచటికిఁ బోకుండుట మేలు. ఈ శిష్యుల కెవరికైన నాఁకలి లేదా యడిగెదనని వారి నందఱ వరుసగ నడుగఁగా వారును బొట్టలు దడువుకొనుచు నాఁకలి లేదని చెప్పిరి. ఇట్లు వారాలోచించు సమయముననే నకులుఁడు వారిని బిలువ వచ్చెను. అతనిని దూరమందే జూచి దుర్వాసుఁడు పరువెత్త సాగెను. శిష్యులును అతనికంటె ముందే పరువెత్తసాగిరి. నకులుఁ డదిచూచి యేమిదియని యాశ్చర్యపడి ''మునీంద్రా! సర్వము సిద్ధము, భోజనమునకు దయచేయుఁ"డని యఱచెను. ఆయనమాట విని మఱింత భయపడి కడుపు కుట్టుకూడ లక్ష్యపెట్టక యందఱు పరువెత్త సాగిరి. "దుర్వాసా! మునీంద్రా! కృష్ణుఁడును వచ్చియున్నాఁడు. మీరు దయచేసి మా యాతిథ్యము గ్రహించి మమ్ముఁ గృథార్థులఁ జేయవలయును." అని నకులుఁ డఱచెను. కృష్ణుఁడు అనుమాట వినఁగానే దుర్వాసుఁడు "ఇఁకఁజచ్చితిని" అని శిష్యులతో నిక జాగుజేసితిమా వారు వచ్చి మనలను

బట్టుకొని దండింతురు. చెట్టున కొకఁడు గుట్ట కొకఁడుగ పరువెత్తుఁడని చెప్పెను. అందఱు మృత్యువునకు వెఱచి పరువిడు పామరలోకమువలె విచ్చలవిడి పరువెత్తిరి. నకులుఁ డంతయు కృష్ణయుధిష్ఠురులకుఁ దెలిపెను. కృష్ణుఁడును దుర్యోధనుని కుట్రయు దుర్వాసుని రాకయుఁ దాను జేసిన ప్రతిక్రియయుఁ దెలిపెను. అందఱు కడుపుబ్బ నవ్వి కృష్ణు ననేక విధముల స్తుతించిరి.

నకులుఁడు మరలిపోయిన తరువాత దుర్వాసుఁడు పోఁక నిలిచి శిష్యుల నందఱ గుమిగూర్చికొని దుర్యోధనుని కుట్ర తన దివ్య జ్ఞానముచేఁ దెలిసికొని దుష్టుఁడా! యెంత కార్యము చేసితివిరా యని యతనినే శపించెను. పరులఁ జెఱుపఁ దలఁచు వాఁడు తానే చెడిపోవును.

*శ్రీరామార్పణమస్తు*

1. కిల్బిషము = పాపము
2. యాచకులు = అడుక్కొనేవారు
3. దుర్భిక్షము = కరువుకాటకాలు
4. అతిథి = తిథినియమాలు లేక ఇంటికి వచ్చేవాడు
5. ఈవి = దానము ఇవ్వబడేది
6. బిడారు = సంచార వ్యాపారులు
7. ధరణీసురుడు = భూమిపై తిరుగాడే దేవత
8. షడ్రుచులు = ఆరు రుచులు.

* * *


# ఐదవ భాగము

## 1. ధర్మవ్యాధ చరిత్రము

కౌశికుఁడను నొక బ్రాహ్మణ కుమారుఁడు వేదములఁ బఠించి ధర్మశీలియై యుపనిషత్తు లెఱింగి తప మొనర్పవలయు నని వనమునకుఁ బోవ నిశ్చయించుకొనెను. వృద్ధులైన తల్లిదండ్రులతని యెడఁబాటు నోర్వక శోకంబున నతనిఁ జేరఁదీసి యిట్లనిరి.

తండ్రీ! నీ వొకఁడవే మాకు కుమారుఁడవు. దీర్ఘకాలము బిడ్డలులేక తపసులు ధారవోసి వంశాంకురంబుగ నిన్నుఁ గంటిమి. మాకు వార్ధకదశలో నీవు దిక్కగుదు వని మా వియోగానంతరము నీళ్ళు విడుతువని కొండంత యాశయుంచుకొని యున్నాము. ఇంతటి యాశతోఁ గడుపుకట్టి కాలుగట్టి నిన్నుఁ బెంచి పెద్దచేసినందుకు నార్జించు శక్తిలేక నేత్రపాటవమును లేక మూడుకాళ్ళ ముసలివారమై పరుల తోడ్పాటు కోరు కాలములో మమ్ము నీవు విడిచి పోవుట పాడిగాదు. అన్ని యాశ్రమములలోను గృహస్థాశ్రమము మిగుల మేలైనది. తక్కిన మూఁడాశ్రమముల వారును గృహస్థు వలననే సుఖజీవనము చేయుచున్నారు. గ్రుడ్డి కుంటి చెవిటివారును వికలాంగులును గృహమేధి యావి వలననే బ్రదుకుచున్నారు. అతిథులు అభ్యాగతులు[1] నీ గృహస్థు నుపచారము వలననే యాత్రచేయు గలిగియున్నారు. ఇందఱ రక్షించిన పుణ్యము గృహస్థుని చెందుచున్నది. ఇంతయేల? పిపీలికాది జంతువులకును గృహస్థు గృహమే జీవనాధారమై యున్నది. అట్టి గృహస్థ ధర్మమునుమాని కాననమున నొంటి తపస్సు చేయుట తగవుగాదు. ఆశ్రమధర్మము వరుసగ నాచరించుట శ్రేయస్కరము. తల్లిదండ్రు లింట నవయుచుండ దపస్సుచేసి నీవే పుణ్యలోకముల సాధింపగలవు? తల్లిదండ్రులను దాతముత్తాతలను బూర్వులను బూర్వతరులను నివాసములకుఁ బాపి దుర్గతులపా లొనర్చి నీవే సుగతి నందగలవు? గృహస్థధర్మమందుఁ గడతేఱ లేనివాఁడవు నీ వితరమార్గంబుల నేమి

కడతేఱc గలవు? తపముచేత దేహమును మనస్సును గాసిపెట్టినcగాని యవి నీవు చెప్పినట్లు వినవని తలcపవలదు. గృహస్థధర్మము నడపుట సుకరముగాదు. పుత్రులకుc బితృశుశ్రూషయు స్త్రీలకుc బతిసేవయుc దపములలో నుత్తమ తపములని మిక్కిలి కష్టసాధ్యములని శాస్త్రములు ఘోషించుచున్నవి. దీనివలననే యభ్యాసశక్తి బలిమి నింద్రియ జయము సులభ మగుచున్నది. ఇంట గెలువలేని వాcడవు రచ్చ కెక్కి యేమి గెలువcగలవు? అని యెంత చెప్పినను వినక యమ్మూఢ బాలుcడడవికిcబోయి యొక చెట్టుక్రింద కూర్చుండి తపస్సు చేయుంచుండెను. ఇట్లు కొన్ని దినములరుగ నొకనాcడు మధ్యాహ్న సమయంబునc దపస్సుచేయు నతనిపై



కౌశికుcడు కొంగను జంపుట

నొకయాడు కొంగ రెట్ట వైచెను. దానివలన వాని ధ్యానము చెడుటయు వాcడు దానిc జంపనెంచి కోపమునc గ్రూరదృష్టిని ఆయాcడు కొంగను జూడcగా నది గిరగిర తిరిగి చచ్చి నేలcబడెను.

అంత మధ్యాహ్నభిక్షకై యా బ్రాహ్మణ కుమారుండు సమీపమున నున్న యొక గ్రామమునకుఁ బోయి పరిశుద్ధముగ నున్న యొక గృహమునఁ జొచ్చి "భవతి భిక్షాం దేహి" యని యఱచెను. ఆ యిల్లాలును "ఉండుము వచ్చెద"నని చెప్పి లోపలికిఁబోయి పాత్రమును శుద్ధిచేసి యన్నము తెచ్చు సమయమునకు సరిగ నామె పెనిమిటి మిక్కిలి యాఁకట డస్సి సొటసొట లాడుచు వచ్చెను.

ఆ యిల్లాలు చేతితట్ట నేలఁబెట్టి యాయనకు స్నానమునకు నీళ్ళిచ్చి మడుఁగు వస్త్రము నిచ్చి యర్చక్రియలు తీరిన తరువాత నాయనకుఁ దుష్టిగ భోజనమిడి ప్రక్షాళనమునకు నీళ్ళిచ్చి యాయన భుజించిన పాత్రమంద భుక్తశేషంబు దాను భుజించి శయ్యపఱిచి మధురవాక్యంబుల నతని లాలించి పరుండి యతనికి పాదసేవ సేయుచుండు సమయంబున బ్రాహ్మణుని దానుండుమని చెప్పుట స్మరించి లజ్జపడి భర్త యనుజ్ఞగైకొని పోయి పాత్రమున అన్నమును తీసికొని బ్రాహ్మణు నొద్దకు వచ్చెను.

ఆ యిల్లాలు మిక్కిలి పుణ్యచరిత్ర. ఆమెకు పతియె దైవము. పతిహితమునే కోరుచు నతని చిత్తానుసారము వర్తించుచు నత్తమామలకుఁ బరిచర్య సేయుచు వయస్సున చిన్నదయ్యు గుణములఁ బెద్దదై సాధువర్తనము, శుచిత్వము గలిగి కుటుంబహితముఁ గోరుచు, దేవతాతిథిపూజలు గావించుచు, భృత్యులను దన పుత్రులవలె నాదరించుచు, గర్వములేక యింద్రియముల జయించి వర్తించుచుండును. ఇట్లు భిక్షదెచ్చిన యీ గృహిణిని జూచి విప్రకుమారుఁ డిట్లనియె.

ఏమమ్మా! నేను భిక్షయడుగ నుండుమని చెప్పి యింటిలోనికిఁబోయి యింత జాగుచేసితివి. లేకుండిన నప్పుడే లేదు పొమ్మనరాదా? అనినఁ గోపముచే మండుహృదయము గల యాతనితో నా పతివ్రత యిట్లనియె.

బ్రాహ్మణా! క్షమింపుము. నాభర్తయే నాకు దైవము. వారప్పుడే యాఁకట నలఁగి వచ్చిరి. వారి శుశ్రూషయందుండుటచే నింత

తడవాయెను. అనిన బ్రాహ్మణుఁ డిట్లనియె. ఏమీ! నీమగఁ డంత యెక్కువ, బ్రాహ్మణుఁడంత తక్కువయ్యెనుగదా? గృహస్థ ధర్మమందుండియు బ్రాహ్మణుల నవమానించెదవు. ఇంద్రాది దేవతలును బ్రాహ్మణులకు నమస్కరించుట యెఱుఁగవా అట్లుండ మానవు లేమిలెక్క? ఓసి పొగరుబోతా! నీవు తెలిసినదానవు గావు. పెద్దలవలన విన్నదానవు గాదు. కాకుండిన విప్రులు[2] క్రుద్ధులైన లోకమునంతయు దహింపఁ గలరని యెఱుంగకుందువా? అనిన ఆ స్త్రీ యిట్లనియె.

ఓ బ్రాహ్మణుఁడా! నేను నీచే చచ్చుటకు ఆడు కొంగనుగాను. కోపమును విడువుము. నీ కోపము నన్నేమి చేయఁగలదు? నేను బుద్ధిపూర్వకముగ నిన్నవమానించిన దాననుగాను. బ్రాహ్మణులు దేవతుల్యులని యెఱుంగుదును. కావున నా యపరాధంబు క్షమింపుము. బ్రాహ్మణ కోపంబు విధంబు నే నెఱుంగనిదానను గాను. ఒకఁడు సముద్రజలము ద్రాగరాకుండునట్లుగా శపించెను. ఒకఁడు వాతాపియను మహాసురుని తిని జీర్ణించుకొనెను. ఒక బ్రాహ్మణుని క్రోధాగ్ని దండమం దిప్పటికి నాఱకున్నది. వారెంత కోపగుణము గలవారో యంత దయాగుణము కలవారు.

బ్రాహ్మణా! ఇఁక నాచరిత్రంబు విని నన్ను క్షమింపుము. పతి శుశ్రూషయందుండి నిన్ను మఱచుట సత్యము. నా పతియే నాకు పరమ దైవతము. దేవతలకంటెను నాకు నాభర్తయే పూజ్యుఁడు. కావున కొఱంత లేకుండునట్లు సర్వదా నాపతి శుశ్రూషయే సలుపుచుందును. పతిసేవ వలని ఫలము నీకుఁ దెలియఁ జెప్పెద వినుము. నీవడవిలోఁ దపమొనర్చుచుండ నొక యాఁడుకొంగ నీపై రెట్టవైచెను. దానిపై నీ క్రోధాగ్నిని బఱపి దాని వధించితివి. క్రోధమునే గొప్పగ కొనియాడెదవుగాని దానివలని కీడాలోచింపవైతివి. కోపమువచ్చి విడిచిన వెంటనే నీ మనస్థితి దేహస్థితి యెట్టులుండునో నీలో నీవే చూచుకొనుము. ఏనుగు కలచిన కమలాకరము

నీరమంతయు గలుషమై తామరతూఁడులు తెగి పుష్పములు నలఁగి కొన్ని సమయముల నొద్దులుగూడ నురులునట్లు కోపముచే మనస్సు ప్రసన్నత చెడి నరములు సడలి మెదడు కలఁకపడి దేహసౌష్ఠవమే చెడును. కోపము దీర్ఘము నతిశయమగు కొలఁది దేహమునకుఁ గలుగు హానియు నతిశయించి యుండును. కోపాతిశయము చేత రోగులైన వారును మతిచెడిన వారును గలరు గదా? వేదాధ్యయన మొనర్చియు శాస్త్రములు వల్లించియు అహింస పరమధర్మ మను వాక్యమును పెడచెవిని చెక్కితివి. నీ వేటి బ్రాహ్మణుఁడవు? ఆ కొంగ యీ జన్మమున ననుభవింపవలసిన ప్రారబ్ధకర్మ మంతయు ననుభవింపనీయక దానిని హింసించుటచే దానికిఁ గలిగించిన కీడు నిన్నూరక విడుచునా? అది నీ తపమునకు విఘ్నము కావింపవలయునని యుద్దేశించెనా? అది నీకుఁ జేసిన యపకారము ఘోరమో, మనుష్యుఁడవు అందు బ్రాహ్మణుఁడ వయ్యు నీవు దాని కుద్దేశించి చేసిన కీడు ఘోరమో యాలోచింపుము. ఏ జాతి యందును స్త్రీలవధ్యలనుట మఱచితివి. దానికిఁ గారణమైన నూహింపవైతివి. మనుష్యులకు క్రోధమును మించిన శత్రువు లేఁదు. నేను బ్రాహ్మణుఁడ నేను బ్రాహ్మణుఁడ నని చెప్పుకొనుట చేతనే బ్రాహ్మణగౌరవము రాదు. ఆ యోగ్యత సంపాదించుట దుష్కరము. క్రోధమోహముల విడిచి సర్వ భూతంబులందు దయగలిగి సత్యము తప్పక వేదాధ్యయన మొనర్చి యింద్రియముల గెలిచిన బ్రాహ్మణుఁడుగాని జాతి పేరు చెప్పి జీవించువాఁడును బ్రాహ్మణుఁడా? నీవు చదివిన చదువునకు శ్రమము మాత్రమే ఫలమైయున్నది. బాగుపడఁగోరెద వేని మిథిలా నగరమున ధర్మవ్యాధుఁడను కటికవాని యొద్దకుఁ బొమ్ము. నీకు మేలగును. స్త్రీనగు నేను చాపల్యమున వదరిన మాటలకు కోపింపకుము. స్త్రీలవధ్యలనుట స్మరింపుము. అనిన భూసురుం డిట్లనియె.

తల్లీ! నీ యెడ చాల సంతోషించితిని. క్రోధము వదలితిని. నీవు నన్ను పలికిన నిష్ఠురములు గురూపదేశ వాక్యములుగ గ్రహించితిని. కల్యాణీ![3] నీకు మేలగుఁగాక పోయి వచ్చెద నని యామె యెఱుక

కాశ్చర్యపడుచు వనదుర్గంబులు దాఁటి జనకుఁడు పాలించు మిథిలా నగరంబు సొచ్చి ధర్మవ్యాధు నునికి యెఱింగి యత దంగడియందు మృగమహిషాదుల మాంసము నఱికి యమ్ముచుండఁ జూచి యేవగించి డాయ నొల్లక దూరంబునంద నిలువఁబడి యుండెను.

ధర్మవ్యాధుఁడును బ్రాహ్మణురాక యెఱింగి తటుకున నంగడిమూసి కాలుసేతులు కడిగికొని యతఁడుండు చోటికి వచ్చి నమస్కరించి వినయముతో నిట్లనియె. బ్రాహ్మణా! మిథిలకుఁ బొమ్మని నిన్నొక స్త్రీ బోధింప వచ్చితివని యెఱుఁగుదును. నావలన నీకుఁ గాఁగల కార్యమేది? ఇది నీకు నిలువ నర్హస్థలము గాదు. నా యింటికిఁ బోవుదము రమ్మని బ్రాహ్మణుఁడు ముందుపోవ ధర్మవ్యాధుఁడు వెన్నంటి తనయింటికిఁ బిలుచుకొనిపోయి పాద్యమిచ్చి పీఠంబు సమర్పింప నతఁడు సుఖముగ గూర్చుండి యిది రెండవ యాశ్చర్యమని యతని యెరుకకు మెచ్చుచు నా కటికవానితో నిట్లనియె.

ఓయీ! నీవు సుగుణసంపత్తి కలవాఁడవు. ధర్మమెఱిఁగినవాఁడవయ్యు జీవహింస చేయుటయు నిట్టి యసహ్యవ్యాపారమున నుండుటయుఁ దగ దనిన ధర్మవ్యాధుఁ డిట్లనియె.

అయ్యా బ్రాహ్మణా! అట్టు లనకుము. నా తండ్రియుఁ దాతముత్తాత లనర్చుచుండి నట్టియు వంశపారంపర్యముగ వచ్చినట్టియు స్వకుల వృత్తియం దున్నాఁడను. బ్రహ్మ నాకు స్వభావముగ నేవృత్తి నియమించెనో దానిని నేను విడువ రాదు. మఱియొక శ్రేష్ఠ వృత్తియందుఁ జొరరాకుండ బ్రహ్మ నీ కాలుసేతులు కట్టివైచెనా యందువేమో వినుము. కట్టివైచె ననుట యసత్యము గాదు.

**ద్వి. తగ స్వనుష్ఠిత పరధర్మంబుకంటె**
**విగుణమైనను మేలు స్వీయధర్మంబు**
**మరణమైనను స్వధర్మంబున మేలు**
**పరధర్మ మొప్పుడు భయకారణంబు**

అని భగవంతుఁడే సెలవిచ్చి యున్నవాఁడు, సత్కులమందు జన్మించుట దైవాధీనము. దైవమునకు నాయందు నిష్కారణ కోపముగాని నీయం దనుగ్రహముగాని లేదు. వీథివెంటఁ బోవుగాలి సువాసనను దుర్వాసనను గొనిపోవుచుండు రీతి జీవుఁడును ఆయా జన్మమున చేసిన పుణ్యపాపములను గొనియే యా దేహమును విడిచిపోవుచుండును. అతని మనస్సున నుండిన కోరికలను వాఁడొనర్చిన పుణ్యపాపములను వాఁడనుభవించుటకు ననువైన కులమునందు, దేశమునందు, వంశమునందు మఱుసటి జన్మమందు వాఁడు పుట్టుచుండును. కావున నొకఁడు పురుషుఁ డగుటకు, స్త్రీయగుటకు, మనుష్యుఁడగుటకు, పశు వగుటకు, భాగ్యవంతుఁడగుటకుఁ, దరిద్రుఁడగుటకు, రోగియగుటకు, ఆరోగ్యవంతుఁ డగుటకు, బ్రాహ్మణుఁ డగుటకు చండాలుఁ డగుటకు వాఁడు వాఁడు కారణమగును గాని మఱి యెవ్వఁడునుగాడు. ఒక శ్రుతి గూడిన వీణె మఱియొక శ్రుతియందలి పాట కనువుపడదు. కడతరగతియందుఁ బఠించు బాలుఁడు మేలి తరగతి పాఠములు చదువ యొగ్యుఁడు కాఁడు. జోగాడు బాలుఁడు పెద్దవారివలెఁ బరుగెత్త నర్హుడు కాడు. అట్టులే కొలది జాతియందుఁ బుట్టినవాఁడు మఱి గొప్పజాతి క్రియల సలుప నర్హుఁడు కాడు. వానికి స్వాభావికమైన లోపము గలదు. ఆ తత్త్వ మెఱుఁగక మోహియై యేకారణము చేతనైన నుత్తమజాతి క్రియల నొనరింపఁబూను హీనజాతివాఁడు రెంటను జెడును. ఒక తరగతియం దారితేఱి మఱియొక తరగతికిఁ బోవుటయు, ఒక మెట్టెక్కిన తరువాత మఱియొక మెట్టెక్కుటయు సుఖకరము నిరపాయముగాని మొదటి తరగతియందుఁ బూర్ణుఁడు గానివాడు మొదటిమెట్టు నెక్కని వాఁడు తటాలున పైతరగతికి పై మెట్టున కెగరుబూనుట యున్నస్థితినిగూడు జెఱచుకొనుటకే. బాలుడు వృద్ధుడైనట్లు, మొగ్గ వికసించి పుష్పమైనట్టు మొలక చెట్టయినట్టు జాతియందును అభివృద్ధి క్రమక్రమముగ రావలయునుగాని తటాలున రాదు. మొగ్గలోని ఱేకులు బలాత్కారముగ

మనము విచ్చిన నది పుష్పమగునా? పరిమళించునా? మొలకను దినదినము కొంచెము పైకి లాగుచుండిన వృక్షమగునా? ఫలముల నిచ్చునా? తొలుత తానున్న స్థితియందు చక్కఁగ దృఢపడి తరువాత పైదశకు ప్రయత్నింపవలయును. ఉన్న స్థితియందు మనము పూర్ణుల మైతిమేని పైస్థితి మనయత్నము లేకయే కలుగును. స్వభావముగ వచ్చిన దానియందే చక్కఁగ నడుపలేనివాఁడు క్రొత్త దానియందు నెట్లు దోషము లేకుండ నడుమ గలడు? జన్మము దైవాధీనము గాని పౌరుషము తన యధీనమే కావున నేను నీచజాతియందుఁ బుట్టితినని కాని నీచకర్మ నొనరింపవలసి వచ్చెనని కాని దుఃఖపడను. పౌరుషమున యథాశక్తి పొరపడను. ఎన్నివిధములు గష్టించియైన నా తల్లిదండ్రులను నేను దైవమువలెఁ బూజించి వారిసుఖమే నా సుఖముగు దలంతును. సత్యము తప్పను. తక్కువవారిని బరిహసింపను. ఎక్కువవారిపట్ల అసూయ వహింపను. యథాశక్తి దాన మాచరింతును. యథాశక్తి పరోపకార మొనర్తును. దేవతలకు అతిథులకు భృత్యులకు నీయఁగా మిగిలినది భుజింతును, ఎవ్వరిని ఎగ్గులాడను. నేను మాంసమును భుజింపను. జీవహింస చేయను. పరులు చంపి తెచ్చిన దానిని వెలకుఁగొని విక్రయింతును. పరిశుద్ధమైన యాహారము భుజించుటచే చిత్తశుద్ధి కలుగునని యెఱిఁగి దుర్వాసన గల పదార్థములను, మత్తునిచ్చు పదార్థములను, సత్వము క్షీణింపఁ జేయు పదార్థములను భుజింపను. ఉపవాసమునందును మితభోజనము నందును గల గొప్పగుణమెఱిఁగి వ్రత దినముల నుపవాస ముందును. తక్కినదినముల మితముగనే భుజింతును. కడుపునకు నేను బానిస వాఁడను గాను. నా మనస్సు నా దేహము నేను జెప్పినట్టు నడవఁ జేయుదును. అసత్య మాడను. ప్రార్థింపఁబడకయే యుపకార మొనర్తును. కష్టము వచ్చెనని దుఃఖింపను. సుఖము వచ్చెనని యుప్పొంగను. అన్నిటికి భగవంతుఁడే కలఁడని నమ్మి నిర్భయముగ నిశ్చింతముగ నుందును. తెలిసియో తెలికయో పొరపాటున సదాటున నొకయకార్యము చేసితినేని దానికై చాలఁ బశ్చాత్తాప

పడుదును. అట్టి కార్యము మరల చేయనే చేయను. ఈ రెండుమార్గములను జేసినపాపము క్షయమగును. ఆత్మస్తుతిచే ప్రసిద్ధికి రాఁగోరువాఁడు బుద్ధిహీనుఁడని యెఱుఁగుదును.

కార్యాకార్యముల ఫలముల నెఱుగుదును మనము చేయు కార్యములను అంతరాత్మయగు భగవంతుఁడు చూచుచున్నాఁడనుట మఱువను. ఈ విధముగఁ బురుషకారమం దేలోపము రాకుండునట్లు యథాశక్తి ప్రవర్తింతును. ఇట్టి చర్యకు జాతి యడ్డుపడదు.

ప్రతివర్ణమునం దుండువాఁడును జేయవలసిన యీ సామాన్య ధర్మములు తప్పక చేయువాఁ డేజాతియందుండిన నేమి? ఇవి చక్కఁగఁ జేయనివాఁడేజాతియందుండిన నేమి? బ్రాహ్మణులవలె వేదాధ్యయనము నేను జేయరాకుండుటకై వగవను. ఆ నిషేధము నా మేలునకేయని యెఱుంగుదును వీణానాదము శంఖమును బుట్టునా? వీణెయందైన నొకతంతె వలె మఱియొక తంతె ధ్వనించునా? రాజుల యధికారము నాకు రాకపోయెఁ గదా యని దుఃఖింపను. ఆఁబోతులు మోయవలసిన భారము మేఁక పిల్లలు మోవఁగలవా? ఇట్టులే తక్కిన వర్ణములవారికి, ఆహారము, ఆచారము, దేహతత్త్వము మనస్తత్వము స్వభావగుణములను బట్టి విధించిన విశేషధర్మములు నాకు లేవని చింతింపను. నాకు స్వభావముగ వచ్చిన దానిని జక్కఁగ నెఱవేర్చుటకే నాశక్తినంతయు వినియోగింతును.

మఱియు వినుము. భగవంతుఁడు సర్వసముఁడు. ఆయనకుఁ బ్రాణికోటులన్నియు సమానములు. ఉత్తమకులమునఁ బుట్టిన వారికి మాత్రమే పుణ్యలోకమిచ్చి తక్కిన వారిని నరకమునకు పంపడు. భక్తి ప్రధానముగాని జాతి ప్రధానము గాదు. పుష్పమునకు, సువాసన ప్రధానముగాని రూపము గాదు. రూపము పరిమళము రెండు నుండిన విశేషమే కదా. భక్తిచేత నెవరు పండో కాయో పువ్వో నీళ్ళో దేనినిచ్చినను భగవంతుఁడు గ్రహించును. కావుననే కదా తనకై ప్రాణము నిచ్చిన

జటాయువునకు శ్రీరాముఁడు మోక్షమిచ్చెను. పిడికెఁడటుకు లిచ్చిన కుచేలునకు శ్రీకృష్ణుఁ డిహపర సౌఖ్యము లొసుగెను. గురువులకుఁ బరిచర్య సలుపుచుండి తనకు ఫలముల నిచ్చిన శబరికి శ్రీరాముఁడు పుణ్యలోకముల నిచ్చెను. పాహి పాహి యనినంతనే భగవంతుఁడు కరిరాజును రక్షింప లేదా? ధ్రువుఁడు, ప్రహ్లాదుఁడు భగవంతుని దర్శించినప్పుడు బాలురుకారా? భక్తిగలిగినవారు స్త్రీలైనను బాలురైనను శూద్రులైనను మఱి యెవ్వరైనను భగవదనుగ్రహమునకు పాత్రులగుదురు. కావున జాతి తక్కువగుటచేఁ గలుగునష్టమేమి?

లోకములోని మనుజు లంద ఱొకవిధమైన గుణమును ఒక విధమైన కర్మమును గలవారు కారు. కావున నొక్కక్క విధమైన గుణకర్మములు గలవారందఱొక్కొక్క జాతివారుగ విభజింపఁబడిరి. ఈ గుణకర్మలు మనుష్యులకు స్వభావముచేఁ గలుగునవి. బ్రహ్మచర్య తపస్సు మంత్రపఠనము సత్యము ఇవి బ్రాహ్మణునకు స్వభావకర్మములు. 'ధర్మము' తప్పక ప్రజలను పాలించుట శిష్టులను రక్షించుట, దుష్టులను శిక్షించుట, రాజులకు స్వభావ కర్మములు. కృషియు, గోరక్షణము, వాణిజ్యము[4] వైశ్యులకు స్వభావకర్మములు. పరిచర్య శూద్రులకు స్వభావకర్మము. ఈ దేశమునకు రాజు జనకుఁడు. ఆయన ధర్మము తప్పక తప్పి చరించువారిని చారులచే నెఱిఁగి దండించును. ఈ దేశమందు నాలుగు వర్ణములవారును వారి వారి వర్ణార్హములైన కర్మములే చేయుచుందురు. గాన వర్ణక్రమముతప్పి నడువరు. దేహమునకు శిరస్సు, చేతులు, తొడలు, పాదము లెట్టివో దేశమునకు బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు నట్టివారు. కాళ్ళుసేయు పనులు చేతులును జేతులు సేయుపనులు కాళ్ళును జేయఁబూనిన నెట్లగునో యట్లె యొక వర్ణమువారు మఱియొక వర్ణమువారి కార్యములు చేసిననగును. దేహమున కన్ని యంగములు ముఖ్యము లయినట్టు లన్ని వర్ణములు ముఖ్యములే. అన్నియు సమానములే. తమ తమ కులధర్మమందుండువారు బుద్ధివంతులు. పూజ్యులు తెలిసినవారు తమకులధర్మము కష్టమనిగాని నీచమనిగాని తలఁపరు. దానిని

విడిచి మఱియొకరి ధర్మము నవలంబించువాఁడుభయ భ్రష్టుఁడు. అట్టి భ్రష్టులు దేశమునం దెక్కువ యెప్పుడగుదురో యప్పుడే దేశము హీనస్థితికి వచ్చును. కావున మారాజు వర్ణాశ్రమాచారము లెట్టివారును దప్పకుండునట్లు మిక్కిలి హెచ్చరికతో కనిపెట్టి యుండును. కులము నీచమైనను గులధర్మములు నీచములు గావు. కావున నాది నీచ కులమైనను నేను వర్తించు ధర్మములు నీచములు గావు. రాజు లధర్మప్రవర్తకులయిరేని లోకమున ధర్మము నశించును. అధర్మ మెక్కుడగును. అధర్మ మెక్కుడగు కొలఁది నానా వ్యాధులు, కఱవులు, పీడలు లోనగునవి ప్రజలను బీడించును. అప్పుడే గూనివాండ్రు, కుంటివాండ్రు మఱుగుజ్జులు, పొట్టివాండ్రు, పెద్దతలలవారు, గ్రుడ్డివారు, నపుంసకులు లోనగు వికారస్వరూపులు పుట్టుదురు. ప్రజల యందు దయయు ఋజుప్రవర్తనము గలిగి యింద్రియముల జయించి ధర్మము తప్పని రాజునకు మఱి యేసాహాయ్య మక్కఱలేదు. అని యనేక ధర్మము లుపదేశించును.

అన్నియు విని కౌశికుఁడు నీ కిట్టిజ్ఞానము మాహాత్మ్యమెట్లు కలిగెనని యాబోయవాని నడిగెను. ఆ వ్యాధుఁడిట్లనియె.

నీ ప్రశ్నమునకుఁ బ్రత్యుత్తరము తెలిపెదను. నావెంట రమ్మని యతని మఱియొక గదిలోనికిఁ దోడ్కొని పోయి యందు నిర్విచారముగ సుఖముగ సుఖశయ్యలపై నానందముతోఁ గూర్చుండి యుండిన నిరువురు ముసలి వాండ్రను దన తల్లిదండ్రులను జూపి వారికిఁ దాను నమస్కరించెను. ఆవృద్ధులిరువురు పుత్రునిఁజూచి యిట్లనిరి.

'నాయనా! లేలెమ్ము. దీర్ఘాయుష్మంతుఁడవు కమ్ము. ఆరోగ్యవంతుఁడవు కమ్ము. నీవంటి సుపుత్రుని కని మేము ధన్యులమైతిమి. నీవు ధర్మమందుండుటచే మా పెద్ద లెల్లరును కృతకృత్యులై తరించిరి. పితృపూజయందు నీవు పరశురామునితో సమానుఁడవు.' అని యనేక విధములఁ గొడుకును గొనియాడి యీయన యెవరని యడిగిరి.

ధర్మవ్యాధుఁడు "ఈయన బ్రాహ్మణుఁడు. మనయం దనుగ్రహించి మనకు దర్శన మిచ్చెను" అని చెప్పి కౌశికునితో నిట్లనియె.

బ్రాహ్మణా! వీరు నాపాలి దైవతములు. దైవమునకుఁ జేయవలసిన పూజలు ఉపచారములు నేను వీరికే గావింతును. వీరు నాకుఁ బ్రత్యక్ష దైవతములు. వీరే నేను పూజించు విగ్రహములు. ఇంద్రుఁడు లోనగు ముప్పదిమువ్వురు దేవతలు లోకమునకెట్లు పూజ్యులో వీరు నాకట్లు పూజ్యులు. వీరినే నేను బుష్పములచేతను ఫలములచేతను పూజించి సంతుష్టి పఱుతును. నాప్రాణములను నా భర్యను బిడ్డలను మిత్రులను వీరి పూజార్థమే వినియోగింతును. నేనే వీరికి స్నానము చేయించి తడియొత్తి పాదములను ప్రక్షాళించి నేనేయాహార మిత్తును. వీరి మనస్సునకు సంతోషకరమగు పలుకు పలుకుదునే కాని యప్రియమెన్నడును బలుకను. వీరధర్మకార్యము చెప్పినను బదులాడక యొనర్తును. తల్లియుఁదండ్రియు అగ్నియు ఆత్మయు గురువును పురుషునకు గురువులు. వీరందఱుఁ జక్కఁగఁ బూజార్హులు. ఈ విధముగ వర్తించు గృహస్థు సర్వదా యన్ని సత్కారములు జేసినవాఁడే యనిన బ్రాహ్మణుఁడు. అయ్యా! గురువన నెట్టివాఁడో తెలుపుమని యడిగిన ధర్మవ్యాధుఁ డిట్లనియె.

నీ మతాచార ప్రకారము నీకు పరలోక సాధకమైన ఆత్మజ్ఞాన మెవరు బోధింతురో వారు గురువులు. అజ్ఞాన మనెడి చీకటిని పోఁగొట్టువాఁడు గురువు. గురువగువాఁడు నీయందలి ప్రీతిచే నిన్నుద్ధరింపవలయునను నభిప్రాయముతో నీకు జ్ఞానము నుపదేశించును. గురువగువాఁడు తాను జ్ఞానము గలవాఁడుగ నుండవలయును. అట్టి గురువును ఆపరదైవమని భావింపుము. దాసునివలె సేవింపుము. పూజలు గావింపుము. ప్రతిదిన మతని గోత్రము సూత్రము పేరుచెప్పి ధ్యానింపుము. దనయొద్ద ధనములేనివాఁడు తానితరుల కేమి దానమీయు గలఁడు? అట్టులే ఆత్మజ్ఞానము లేనివాఁడు నీ కేమి జ్ఞానముపదేశించును? మా సమాజములోఁ

జేరుము. మాకు ధనమిమ్ము అని ధనాశచేతనో తమ ప్రతిష్ఠకొరకో నీకు జ్ఞానముపదేశింతునని వచ్చువారు పగటి దొంగలని తలంపుము. జ్ఞానము కొనిన రాదు. జ్ఞాను లెన్నఁడును జ్ఞానమును విక్రయింపరు. ధనమిచ్చి కొను జ్ఞానము పరలోక సాధకము కానేరదు. నిజమైన జ్ఞాని యెన్నఁడును నీమతము తప్పనఁడు నీ దేవుఁడు నిజమైన దేవుఁడు కాఁడు. మా దేవుడే నిజమైన దేవుఁడని యనఁడు మా మతములోఁ గలిసినఁగాని నన్ను సేవించినఁగాని నీకు ముక్తిలేదనఁడు. ఇట్లు చెప్పువారు మూఢులు. మోసగాండ్రని తలంపుము. నిజమైన గురువు నీ శక్తియెఱిఁగి నీ మతాచారములకు విరోధము లేకుండునట్లు నీకుఁ దగిన విధముగు బూజింపనో ధ్యానింపనో బోధించును. భగవంతుఁ డన్నిటియందును గలుడు. ప్రహ్లాదుఁడు ప్రార్థింపఁగా భగవంతుఁడు స్తంభమున నుదయింపలేదా? మార్కండేయుని రక్షింప లింగమునుండి శివుఁ డుదయింపలేదా? భరతుని హింసింపనెంచిన రాజున విగ్రహముననుండి బయలువెడలి కాళికాదేవి వధింపలేదా? తులసీ వృక్షము లక్ష్మీ దేవియేకదా. ధ్రువుఁడు విగ్రహమును బూజించుటచేతనే కదా భగవంతుని దర్శింపగలిగెను. కావున నీవు భక్తితో దైవమని భావించి యేపదార్థమును బూజించినను నీ కోరికలు దాని వలననే సఫలమగును. కావున విగ్రహములను, పటములను, వృక్షములను, భక్తితోఁ బూజించిన ఫలములేదని నీకు కలవరము పుట్టించి నీ భక్తిని చెఱుపఁ జూచువారు పూర్ణజ్ఞానము లేనివారని తలంపుము. అనిన ఆత్మజ్ఞానమన నేమియో బోధింపుమనిన ధర్మవ్యాధుఁ డిట్లనియె.

అయ్యా! నేను శూద్రుఁడను. నీవు బ్రాహ్మణుఁడవు. నేను నీకు బోధింపరాదు. బోధించుగురువు పాత్రమనియు జ్ఞానము ఆవుపాలనియుఁ దలంపుము. వెండిబంగారు పాత్రములలోన నిర్మలమైన గోక్షీరమును ద్రావిన దేహమునకు నెక్కువ బలము, పుష్టి, దీర్ఘాయువు కలుగునట్లు ఉత్తమజాతి పురుషుల వలన నుపదేశింపఁబడిన జ్ఞానము మనస్సును

నిర్మలముచేసి పాపములనుంచి రక్షించును. రాగిపాత్రమునందును సీసపాత్రమునందును నుండిన పాలు విషమగునట్లు అధమజాతులనుండి గ్రహింపఁబడిన జ్ఞాన మనర్థక మగును. శంఖములోని పాలు గ్రహింపవచ్చునుగాని పుఱ్ఱెలోని పాలు తాఁకనైన తాకవచ్చునా? ఇట్లే వస్తువు తారతమ్యము తెలిసికొని వర్తింపుము. కావున నీ కంటెను తక్కువకులము వారివలనఁ గాని యెక్కువకులము వారైనను జ్ఞానము లేనివారివలనఁగాని జ్ఞానము సంపాదింపఁ బ్రయత్నింపకుము. తగిన గురువు దొరకినపుడు నమస్కారములచేతను చక్కని ప్రశ్నలచేతను సేవచేతను నతని సంతుష్టుని జేసి జ్ఞానము సంపాదింపుము.

విప్రా! యింతవఱకు నీ వడిగిన ప్రశ్నలకు బ్రత్యుత్తరము లిచ్చుచుంటిని. ఇఁక నీకు హితమైనదానిని బోధించెదను. నా మాటనమ్మి నేను జెప్పినట్లు చేయుము. నీవు సుఖపడెదవు. జ్ఞాని వయ్యెదవు. నీవు తల్లిదండ్రుల నిరాకరించివచ్చితివి. నీకై యేడ్చియేడ్చి వారు గ్రుడ్డివారై కష్టపడుచున్నారు. నీవు చక్కఁగ నింటికిఁబోయి వారికిఁ బరిచర్య సేయుము. అంతకంటె నీకు వ్రతము తపము దానము అక్కఱలేదు. అది విడిచి నీ వెన్ని చేసినను నిష్ఫలములు. అది యొక్కటి చేసితివా అన్నియు తమంతట తామే నీకుఁ గలుగును. నా మాటనమ్ము మనిననతని యెఱుకకు ఆశ్చర్యపడి బ్రాహ్మణుఁ డిట్లనియె. అయ్యా! నా పుణ్యము కొలఁది నీ స్నేహము నాకు లభించెను. మనలో నిప్పుడు వేయింట నొకఁడైన సరియైన ధర్మమును బోధించువాఁడు కలఁడో లేఁడో. శాస్త్రములు చదువనివారు, చదివినను అర్థము చేసికొననేరనివారు, వాని యందుఁ బ్రమాణబుద్ధి లేనివారును ధర్మమును బోధించెద మని దురాచారముల నెల్ల గొంతెత్తి విచ్చలవిడి వదరుచున్నారు. తెలియనివారు మోసపోవుచున్నారు. తపస్సుచేసి నరకమునకుఁ బోవనున్న నన్ను నుద్ధరించితివి. చాల సంతోషించితిని. నీవు చెప్పినట్లు వర్తించెదను. నీ జ్ఞానమును బట్టి చూడ నీవు శూద్రుఁడవుగాఁ బుట్టఁ గారణము లేదు.

ఏ కారణముచే నీవు శూద్రకులమునఁ బుట్టితివి? లోకమున నీవెఱుఁగ నిది యుండదు. కావున నా కెఱిఁగింపుము. నీవు బ్రాహ్మణ తుల్యుఁడ వననేల? ఈ జన్మమునే నీవు బ్రాహ్మణుఁడవు. అనిన ధర్మవ్యాధుఁ డిట్లనియె.

అయ్యా! పూర్వజన్మమున నేను సత్కులమందుఁ బుట్టి వేదాధ్యయన మొనర్చిన బ్రాహ్మణుఁడను. నాకు క్షత్రియుఁ డొకఁడు మిత్రుఁడుగా నుండెను. అతఁడు వేటకు బోవుచు వేడుకకని నన్నుఁ దోడ్కొని పోయెను. అతనితోడి సహవాసము బలముచే నేనును ధనుర్విద్య నేర్చి యుండితిని. ఆ వేఁటయందు బుద్ధిమాలి నేనొక బాణమును నొక మృగముపై విడిచితిని. అది గుఱితప్పి యొక పొదలో దపస్సు చేయుచున్న మునికిఁ దగిలెను. ఆయన గాయపడి యఱచెను. నేనును తటాలున పోయి నా యపరాధము క్షమింప వేఁడితిని. ఆయన చురచుర చూడ్కులతో ననుఁ జూచి నీవు బ్రాహ్మణుడివయ్యు జీవహింస యందలి కోర్కి మానవైతివి. గావున బోయవాఁడవై పుట్టుమని శపించెను. నేనతని నెన్ని విధములనో ప్రసన్నునిఁజేసి ప్రార్థింప నాయన యిట్లనియె.

ఓరీ! నా శాపము తప్పదు. సత్యము. నీవు బోయవాడవై పుట్టి తల్లిదండ్రుల సేవచేసి కడతేరుము. నా యనుగ్రహమువలన నీకు పూర్వజన్మస్మృతి గలిగి మరల హింస చేయకుందువు. ఆ మఱుజన్మమున నీవు మరల బ్రాహ్మణ జన్మ నందెదవు అని ప్రసాదించెను. నీవు సద్బ్రాహ్మణుఁడవు. తపస్వివి. కావున నీకిది చెప్పితిని. అని ధర్మవ్యాధుఁడు చెప్పెను. బ్రాహ్మణుఁడును బోయవాని వీడుకోలువడసి తన యింటికిఁబోయి పితృశుశ్రూషచే ధన్యుఁడయ్యెను.

## 2. శైబ్య చరిత్రము

పూర్వకాలమున శతధనుఁడను నొక రాజుగలఁడు. ఆయన భార్యపేరు శైబ్య. ఆమె పరమ పతివ్రత. సత్యము శౌచము దయగల మహానుభావ. ఆమె వినయము, వివేకము లోనగు సర్వలక్షణములచేత

నొప్పుచుండెను. ఆ శతధనుడు భార్యతోడ నియమము వహించి జగన్నాయకుఁడును భక్తజనరక్షకుఁడును నగు శ్రీమన్నారాయణుని బూజించుచు ననేక వ్రతములు నిష్ఠతోడను, భక్తితోడను సలుపుచుండెను. ఇట్లు చేయుచు కార్తికమాసమున నేకాదశి యుపవాసముండి మఱుసటినాఁటి యుదయమున భార్యాభర్త లిరువురు గంగానది పుణ్యతోయముల స్నానముచేసి మరలి యింటికి వచ్చు చుండిరి. ఇట్లు వచ్చునపుడు త్రోవలో ఆ రాజునకు ధనుర్విద్య నేర్పిన గురువు పాషండుఁ డొకఁడెదురై పలుకరించెను. అతఁడు పాషండుం డని యెఱిఁగియు గురువుగదా యను దాక్షిణ్యముతో రాజతనితోఁ గొంతకాలము సంభాషించు చుండెను. శైబ్య అతనితో బలుకనొల్లక యుపవాసముండి యతనిని జూచిన దోషము పోవ సూర్యునిఁ జూచి మ్రొక్కెను. తదనంతరము దంపతులిరువురు గృహమునకేగి కార్యములెల్ల దీర్చిరి. అంతు గొంతకాలమునకు శతధనుఁడు మరణించెను. శైబ్యయు సహగమనము గావించెను.

ఆ రాజు ఉపవాసముండి పాషండుని[5]తో సంభాషించిన పాపముచే మఱుజన్మమున కుక్కయై పుట్టెను. ఆ శుభాచారయు కాశీరాజు కూతురై పుట్టెను. ఆమెకు కన్యాత్వము రాఁగనే తండ్రి యామెకు వివాహయత్నము గావించెను. గాని ఆ పుణ్యశీల తండ్రిని వారించి నేను గోరువఱకు నాకు వివాహముఁ కావింపవదలనెను. పుత్రిక మాట త్రోసివేయ నొల్లక తండ్రియు నూరకుండెను. పూర్వజన్మమునఁ జేసిన విష్ణుపూజ వ్రతములు లోనగు పుణ్యకర్మముల ఫలముచే నామెకు పూర్వజన్మ జ్ఞానముండెను. తన పతియైన శతధనుఁడెచ్చట నున్నాఁడా యని యాలోచించి జ్ఞానదృష్టిచే నతఁడు విదిశాపురమునఁ గుక్కయై పుట్టి యుండుట చూచి దుఃఖించి తండ్రియాజ్ఞగొని వలసినధనము గైకొని విదిశాపురమునకుఁ బోయి యాకుక్కను గుర్తించి సమీపించెను. అదియును భౌ భౌ యని పైపడి కఱవవచ్చెను గాని యామె భయపడక దానికి వలసిన యాహారమిచ్చి శాంతపరచి దానికి నమస్కరించి ప్రాణేశ్వరా! నీవు కుక్కవుగావు.

పూర్వజన్మమున నీవు శతధనుఁడను రాజవు. నేను నీ భార్యను. పాషాండసంభాషణముచే నీకిట్టి కుక్క దేహము లభ్యపడెను. ఆలోచించి చూడుమా యనిన అదియును పుణ్యస్త్రీ సంభాషణముచేఁ గలిగిన జాతిస్మరత్వమున కన్నీరుమున్నీరుగాఁ గార్చి యది మొదలాహారము ముట్టక కొండపేటునుండి దుమికి దేహము విడిచెను.

అంతట శైబ్యయుఁ దనమగఁడు మరల నెచటఁ బుట్టెనో యని చింతించి, జ్ఞానదృష్టిచే కోలాహల పర్వతమందు సృగాలరూపము ధరించి యుండుట యెఱిఁగి యచ్చటికిఁ బోయి దానికి తగిన యాహార మిచ్చి ప్రదక్షిణము చేసి నమస్కరించి వల్లభా! నీవు నక్కవుగావు. శతధనుఁడను రాజుగా నుండి పాషండునితో సంభాషించుటయే శునకమై జనించి యిప్పుడీ రూపము వహించితివి. నీ చరిత్రము తలుచు కొమ్మనిన నది మిగుల విషాదపడి యాహారము ముట్టక దేహము విడిచెను. తరువాత శైబ్యయు శతధనుఁ డొక కాననంబును దోడేలై జనించుట జ్ఞానదృష్టి నెఱింగి యచ్చోటికిఁబోయి మునుపటివలెనే యతని పూర్వజన్మము స్మరింపఁ జేసెను. ఆ వృకము శోకమున మేను వదలి మఱియొకచో గ్రద్దయై పుట్టెను. అది యెఱిఁగి శైబ్యయు నచటికి పోయి పూర్వవృత్తము స్మరింపఁజేసి నాథా! నీవు గ్రద్దవుకావు. శతధనుఁడను రాజుగా నుండి పాషండునితో సంభాషించిన పాపమున తొలుత కుక్కవై మరల నక్కవై తరువాత తోడేలై యిప్పుడు గ్రద్దదేహమును ధరించితి వనిన నది శోకమును దపించి యీ తనువును వదలి కాకియై పుట్టెను. శైబ్యయు నవ్విధ మెఱిఁగి దానికి పూర్వవృత్తము తలపించెను. ఆవల నది యా దేహము విడచి కొంగయై పుట్టెను. శైబ్యము దానియొద్దకుఁ బోయి పురాతన వృత్తాంతమంతయు దానికి వినిపించిన నది చచ్చి నెమలియై పుట్టెను. శైబ్యయు ఆ మయూరము నొద్దకుఁబోయి దానికిఁ దగిన యాహారమిచ్చిన దాని వెంటనంటి తిరుగుచుండెను. అప్పుడు మిథిలానగరము రాజగు జనకుఁడు అశ్వమేధయాగము చేయుచుండెను. శైబ్యము ఆ నెమలి

నెత్తికొనిపోయి యశ్వమేధమందలి అవబృథము[6] నీట స్నానము చేయించి పిమ్మట యిట్లనియె.

ప్రాణేశ్వరా! నీవు నెమలివికావు. శతధనుఁ డను రాజుగానుండి పాషండ సల్లాపముచే కుక్కవై పుట్టితివి. నేను బోధింపఁగా ఆ దేహమును విడిచి సృగాలవై మరల తోడేలవై పదపడి గ్రద్దవై తరువాత కాకివై మఱికొంగవై యిప్పుడు నెమలివై యున్నావు. స్మరింపుమనిన నదియును ఆలోచించి తానుజేసిన పాపమునకు తనకుఁ గలిగిన జన్మములకు మిక్కిలి విషాదపడి యా దేహమును విడిచి జనకమహారాజునకు కొడుకై పుట్టెను. కాశీరాజకన్యయు ఆ వృత్తాంత మెరింగి యతుడు యుక్తవయస్కుఁడు కాఁగా తండ్రితో తన స్వయంవరము చాటింపుమని చెప్పి ఆ స్వయంవరమునకు జనకరాజకుమారుఁడు రాఁగా నతని వరించి యనేక సంవత్సరములు సుఖించి పుత్రవతియై హాయిగ నుండెను. పాషండునితో సంభాషించిన పాపము అశ్వమేధమునందు అవబృథస్నానము చేసినఁగాని పోదయ్యెను. కావున శ్రేయస్సు కోరువారు పాపాత్మునితో చెలిమి చేయరాదు. వారితో సంభాషింపరాదు. వారిని తాఁకరాదు. ఇవి ముఖ్యముగ దేవపితృకార్యము లొనర్చువేళ కూడనే కూడదు. ఎవనియింట నొకమాసము దేవపూజ జరగదో యట్టివానిని జూచినవాఁడు వెంటనే సూర్యునిజూచి నమస్కరింపవలయును. అటుండ పాషండుల యన్నము తినువారిగతి యేమి చెప్పవలయును. అట్టివానికి నింట నన్నము పెట్టుటయు వానితోడ మాటలాడుటయు వానితోడు గూడి చరించుటయు పాపకార్యములే. నిత్య నైమిత్తిక కర్మములు చేయనివాఁడును పాపముచేసి దానిచ్చువాఁడును, ఎదుట భూషించుచు వెనుక దూషించు వాఁడును. సత్కర్మములందు సందేహములు పలుకువాఁడును, తన కార్యమునకై పరుల కార్యము చెఱుచు వంచకుఁడును, దొంగ వినయములు గలవాఁడును, సేవదూషకుఁడును, సద్గ్రంథ దూషకుఁడును పాషండు లనంబడుదురు. ఇట్టివారిని మాటలచేనైన

గౌరవింపరాదు. ఇట్టివారిని జూచిన దూరమునంత తొలగ వలయును. వారితో మాటలాడినవాఁడు ఆ దినమునందు చేసిన పుణ్యమంతయు వ్యర్థపఱుచుకొనును. అట్టివారితో దేవ పితృకార్యముల వేళ సంభాషించువారు నరకమునకుఁ బోవుదురు.

**తే. వసుధ బాషండుతోడి సంభాషణమున**
**నరులు దుర్గతిపాలయి యరుగుచుండ**
**నఘము లొనరించు పాషండుఁడైన పురుషుఁ**
**డెట్టి నరకాన కేగునో యెవ్వఁడెఱుఁగు**

**ఆ. మగడు పతితుఁడైన మగువ పాతివ్రత్య**
**మహిమఁజేసి ధవుని మనుపఁగలుగు**
**నెన్నిజన్మములను నెత్తిననైన న**
**టగుట సతులు పూజ్యలగుదు రెపుడు**

## 3. జడ భరతోపాఖ్యానము

ప్రత్యక్ష విష్ణువని ప్రసిద్ధికెక్కిన ఋషభునకు భరతుఁడను కుమారుఁడు గలుడు. ఆయన రాజై యీ భూమిని పాలించెను. అతఁడు మిక్కిలి ధర్మాత్ముఁడు. ప్రజల సంతోషమే తన సంతోషముగ నెంచుచు ప్రతికార్యము భగవంతుని కైంకర్యముగు దలంచుచు శుద్ధమైన మనస్సుతో రాజ్యతంత్రములు దీర్ఘకాలము నడిపి బ్రదుకు శాశ్వతము గాదనియు సంసారము లెండమావుల వంటివనియు నెఱిగి వైరాగ్యంబు వహించి రాజ్యము కొడుకులకు పంచియిచ్చి సాలగ్రామములు పుట్టు గండకీనదీ తీరమున పులహాశ్రమమునకుఁ బోయి శ్రీమన్నారాయణమూర్తిని ప్రతిదినము తులసీదళముల చేతను పూలచేతను బూజించుచు నీటిచేతను కందమూలాదులచేతను దేహము రక్షించుకొనుచు ఆశలన్ని వదలి కోరిక కోపము నొందక మూఁడుకాలముల స్నానము చేయుచు గాలము గడుపుచుండెను.

ఒకనాఁడు భరతుఁ డేటిలో నీళ్ళలోనుండి బ్రహ్మమంత్రము జపముచేయుచుండఁ సమయంబున నొక్క నిండు గర్భిణియైన ఆఁడుజింక ఆ యేటికి నీరుద్రావ వచ్చెను. అది నీరు ద్రాగుచుండు సమయంబున సింహము కర్ణకఠోరముగ గర్జించెను. ఆ ధ్వని విని హరిణి భయపడి చివాలున నదిని దాటుటకై యెగిరెను. భయముచేతను ఎగిరిన వేగము చేతను గర్భమునందున్న శిశువు కడుపులోనుండి దూసి నీటిలోఁ బడెను. ఆడుజింక ఆవలియొడ్డునపడి మరణించెను. అంతయుఁ జూచుచుండ భరతునకు నీటిపై దేలుచున్న దాని నెత్తుకొని యొడ్డునకు వచ్చి తల్లిలేని యా పిల్లను అత్యంత ప్రీతితో బహువిధముల కాపాడుచుండెను. ఇట్లు దానికి వేళ కాహారమిచ్చుచు, దేహమునకు దుమ్మైన తుడుచుచు, దాని నెత్తి లాలించుచు, దాని దిక్కు లేనిస్థితికి వగచుచు, ఒంటిగ విడిచిన ఏపులి చంపునో ఏ తోడేలెత్తికొనిపోవునో ఎక్కడ పీఁకితినునో యని భయపడి దానిని విడువక కూడనే యుంచుకొనుచు, శరణని వచ్చినదానిని నెట్లు విడుతునని యనుమానించుచు, తనపై నదిచూపు మక్కువకు సంతోషించుచు, ఫలములు, పూలు, సమిధలు లోనైనవి తేఁబోవు సమయంబునను దోడ్కొనిపోవుచు, వేడుకకై దానిని మూఁపులపై నుంచుకొని మోసికొనిపోవుచు, దానిని చిటికెలువేసి ఆడించుచు, తొడపై నుంచుకొని యేనెల్ల నిమురుచు, నా సామి నా అన్న నా ముద్దు బంగారుకొండ అని ముద్దులు పెట్టుచు జపముచేయు సమయమున నది మేనుగోకిన మెల్లన నదలించుచు, కనులుమూసికొని జపము చేయుచుండియు చీమచిటుకుమనిన చిమట బుఱ్ఱనిన దాని కేమి యపాయము వచ్చునో యని కన్నులువిచ్చి చూచుచు దానిమీఁద చేయివైచి నిద్రించుచు నీ విధముగ ప్రీతిచెంది సర్వకాల సర్వావస్థల దానినే స్మరించుచు జపము మఱచి తపము విడిచి దేవపూజ మాని మోహముపూని భరతుఁ డుండు సమయంబున ఒక్కనాఁడది యున్నట్టుండి తప్పించుకొని యుఱికెను.

అంతట భరతుఁడు జింకపిల్ల తప్పించుకొని యెందు చనెనో యే మృగము వాతుబడెనో యే వేటకాడు చంపెనో యని దుఃఖించుచు చెట్టుచెట్టు పొదపొద గుట్టగుట్ట తిరిగి యీ వేళకు దానికి మేపు నిచ్చుచుండితిని గదా. ఈ వేళకు నాడించుచుంటిని గదా, ఈ వేళకు నేను జపముచేయునపుడు నాతోడమీద నుండును గదా, అయ్యో కన్నబిడ్డవలె తల్లి లేని పిల్లను సాఁకితినే. ఏమి చేయుదును? ఎందని వెదకుదును? చంద్రునిలో నుండునది నా జింకయేమో. శివుని చేతిలో నుండునది నా జింకయేమో. వాయుదేవుఁడు నా జింకపిల్లపై నెక్కి తిరుగుచున్నాడేమో అని యీ విధముగ దానినే తలుచుచు దానికై దుఃఖించుచు దాని గుణములు వర్ణించుచు దాని రూపము మెచ్చుకొనుచు యోగాభ్యాసము వదలి వృథాకాలము ద్రోయుచుండెను. యోగము పూని భగవంతుని ధ్యానము చేయవలయునని పెండ్లాము బిడ్డలను రాజ్యమును భోగమును సర్వము మాని వైరాగ్యముఁబూని యడవి చేరినవాని కిట్టి జంజాటము కలిగెను. కాలబలము కర్మబలము మీఱరానివి గదా. ఇట్లు కొన్నినాళ్ళు తపించిన వెనుక మరల నా జింకపిల్ల తనంత దానే భరతునొద్దకు వచ్చెను. దానిని జూచి చచ్చిన బిడ్డఁడు బ్రతికి వచ్చినట్లు భరతుఁడు సంతోషించెను. ఈ విధముగ దానితోఁ బ్రొద్దులు పుచ్చుచుండ నతనికి నవసానకాలము ప్రాప్తించెను. అయ్యో! నాకు మరణ మాసన్నమైనదే. ఇఁక నీ జింకపిల్ల నెవరు రక్షింతురు? ఇది యే మృగము వాతఁబడునో ఏ గతి పట్టిపోవునో యని దానినే స్మరించుచు ప్రాణములు విడిచెను.

బ్రతికియున్న కాలమున మనస్సును దానియందే విశేషకాలము గాఢముగ నుంచిన కారణముచే నతఁడు మఱు జన్మమున జింకయై పుట్టెను. వైరాగ్యము వహించి యోగమభ్యసించి భగవంతుని భక్తితోఁ బూజించియుండిన కారణముచే జాతి స్మరణము గలిగి జింకయందలి తగులముచేఁ దనకిట్టి మృగత్వము గలిగెఁ గదాయని తెలిసి మిక్కిలి తపించి తల్లిని బాసి పూర్వజన్మమును దానుండిన పులహాశ్రమమునకుఁ బోయి యెండిన ఆకులు పచ్చిక తినుచు నేటి నీరు త్రాగుచు నీ దేహావసాన మెప్పుడు గలుగునా యని దేవుని ధ్యానించుచుండెను.


మనుష్యులు జీవితకాలమందు నెక్కువ మక్కువచేతఁ గాని భయముచేతఁగాని దేనిని స్మరించుచుందురో ఆ రూపమునే మఱుజన్మమును బొందుదురు. పచ్చపురువును దెచ్చి తుమ్మెద గూటు నుంచుగా నది తుమ్మెదగానే మాఱును గదా. అట్లే మనుష్యులును కుక్కలపై ప్రీతినుంచిన కుక్కలు గాను, జింకలపై ప్రీతినుంచిన జింకలుగాను, మనుష్యులపై ప్రీతినుంచిన మనుష్యులుగాను, ఆర్జించి పాతిపెట్టిన ధనముపై మనసుంచిన దానిని రక్షించు సర్పముగానో దయ్యముగానో పుట్టుదురు. కావున మనుష్యులందఱు భగవంతునినే స్మరించుచుండవలయును. భగవంతుని చరిత్రములుగాని పుణ్యాత్ముల చరిత్రలుగాని చదువవలయును. సత్పురుషుల తోడనే సహవాసము చేయవలయును. క్షుద్రులతో మైత్రి చేయరాదు. క్షుద్ర గ్రంథములు చదువరాదు. క్షుద్రపదార్థములపై మనసును బోనీయరాదు, ఇది మనుష్యులుగా నుండి బాగుపడఁ గోరువారందఱు మనస్సున దృఢముగా నుంచుకొనవలయును.

## 4. ధ్రువ చరిత్రము

లోకమునకు మొదటిరాజైన మనువునకు శతరూప యను భార్యకలదు. వారికి ప్రియవ్రతుఁడనియు ఉత్తానపాదుఁడనియు నిరువురు కొడుకులు. అందు ఉత్తానపాదునకు సునీతి సురుచి యను యిరువురు భార్యలు. సౌందర్యవతియైన సురుచిని మరగి యామె బోధలు తలకెక్క నీతిమంతురాలైన పెద్ద భార్యను గౌరవింపక యామె యింటికిని బోక యామెను పలుకరింపక రాజు బోనకత్తెలకు బత్తెమిచ్చునట్టు ఆమెకును దినదినము బత్తెము కొలిచియిచ్చి పంపుచుండెను.

ఇట్లుండ నొకనాఁడు సురుచి కొడుకు ఉత్తముఁడను వాఁడు తండ్రి యెడమ తొడమీఁద కూర్చుంచి లాలింపఁబడుచుండెను. సునీతికొడుకు ధ్రువుఁడనువాఁడును బాలుఁడగుటచే తండ్రి కుడితొడ యెక్కఁబోయెను. అప్పుడు అందున్న సురుచి కోపముచే నెఱ్ఱనైన కన్నులతో బొమముడి

యాడించుచు మేఁకపిల్లపై దుముకు ఆఁడుపులివలె తటాలున వానిపైకుఱికి వానిని రెట్టిపట్టి లాగి యీలవకీడ్చి "ఓరీ ఆగర్భదరిద్రుఁడా! దాసికొడుకా! నీవటరా నా కొడుకుతో సమానముగ నా భర్తతొడ నెక్కఁ దలంచితివి. నీ బ్రతుకు నీ యోగ్యత ఆలోచింపక నా కొడుకు ఎడమ తొడపైనుండ నీవు కుడితొడ నెక్కఁగోరెదవా? నీకెంత పోతరమురా? నా కొడుకుతో రాజ్యసుఖములు పంచుకొనుటకు వచ్చితివటరా దాయాదుఁడా? నిర్భాగ్యురాలి కడుపునఁ బుట్టిన నీకును రాజు తొడ నెక్క యొగ్యతకలదా? నీ ముఖాన నటువంటి వ్రాతయే యుండిన నా కడుపుననే పుట్టియుందువుగాని దాసి కడుపున నేల పుట్టుదువురా? నీవు చేసిన పూజకొలది నీకు జన్మముకలిగెను. నా కొడుకు భగవంతుని బంగారు పూలతోఁ బూజించెను. కావున నా కడుపున పుట్టెను. నీవు మట్టిపూలతో బూజించితివి కావున నా దాసికిఁ బుట్టితివి. నీ పుట్టువైన నీవు ఆలోచింపక కోరరాని కోరికలు కోరెదవా? నీకంతకావరమా తారతమ్యజ్ఞాన మక్కరలేదా నీకు తండ్రితొడ యెక్కవలయునని కోరికయుండెనా దేవుడా నన్ను సురుచికడుపును బుట్టుజేయుమని ప్రార్థించి యెక్కడనైను బోయి చచ్చి నా కడుపున బుట్టుము. నీ తల్లి నాకు దాసి. నీవు నా కొడుకునకు దాసుఁడవు. మఱియొకసారి యిట్లు చేయుదలచెదవా నిన్ను రెండుగఁజీల్చి నుప్పులో నూరవేయుదును. జాగ్రత్త ఛీ ఆవలపొమ్ము అని వాని బుగ్గలు నులిమి దెబ్బలుకొట్టి మెడఁబట్టి దూరముగ నెట్టెను. ఈ రీతిగ కర్ణకఠోరములైన వాక్యములు పిన్నతల్లి తన్నుఁ బలుకుటయు తండ్రి యేమియుఁజెప్పక యుపేక్షించి యుండుటయుఁజూచి ధ్రువుఁడు కన్నులు పులుముకొనుచు వెక్కి వెక్కి యేడ్చుచు కన్నతల్లియొద్దకుఁ బోయెను. ఆమెయును కొడుకును జేరఁదీసి నాయనా! యేల యేడ్చెదవు? తండ్రీ! నీతోడి యాటబాలకులు నిన్నుఁ గొట్టిరా? తిట్టిరా లేక నీ వస్తువులు తీసికొనిరా? లేక యెండైను బరువిడుచుఁ బడితివా? ఎవరైన బెదరించిరా?



ధ్రువుఁ డేడ్చుచుఁ దల్లి యొద్దకుఁ బోవుట

పసర మేదైనఁ బొడువ వచ్చెనా? నాయనా! యేల యింతగ నేడ్చెదవు? తండ్రీ! చెప్పుమని తొడలపై కూర్చుండఁ బెట్టుకొని కన్నీరు తుడిచి సమాధాన పఱచి యడిగెను. ధ్రువుఁడును ఏడ్చుచునే తన్ను సవతితల్లి యన్నమాటలను తండ్రితొడ నెక్కనీయకుండ బఱబఱలాగుటయుఁ జెప్పెను. అప్పుడు సునీతి మిగుల దుఃఖించుచు కొడుకుతో నిట్లనియె.

తండ్రీ! నీ వేల దుఃఖపడియెదవు? పూర్వ జన్మమున మేలు చేసినవారు మేలును, కీడుచేసినవారు కీడును ఈ జన్మమునందు అనుభవింప వలయును గదా. అది తప్పదు. అట్లుండ మన మేపాపము చేసితిమో మనకిట్టి దురవస్థ కలిగెను. గొప్ప వంశమును బుట్టిన నేను దాసియని యనిపించుకొనుటకు మహారాజునకుఁ బుట్టిన నీవు దాసికొడు కనిపించుకొనుటకు నెంతపాపము చేసితిమో? ఎవరి మేలుచూచి

యోర్వలేక పోయితిమో ఏ భార్యాభర్తలను తండ్రిగొడుకులను నెడలు బాపితిమో ఆ పాపమిప్పుడు అనుభవించుచున్నాము. ఎంత గొప్ప కులమును బుట్టినను ఎన్ని విద్యలు నేర్చినను ఎంత జ్ఞానవంతుఁడైనను తాను చేసిన కర్మముల ఫలమనుభవింపక తప్పించు కొనలేఁడు గదా. నాయనా! అగ్నిసాక్షిగ పెండ్లిచేసికొని ధర్మమందు, అర్థమందు, కామమందు నిన్ను వదలనని ప్రమాణము చేసిన మగఁడు నన్ను దాసికంటెను నికృష్టురాలిఁగజూచుచున్నాఁడు. అట్టి నిర్భాగ్యురాలనగు నా కడుపున నీ వేల పుట్టితివి? పుత్రా! నీ సవతితల్లి నిజమే చెప్పెను. భగవంతుని ఆశ్రయించితివేని నీ కోరిక లన్నియు నెఱవేఱును. దిక్కులేనివారికెల్ల దేవుఁడొక్కఁడే దిక్కు. అనాథులకు దేవుఁడొక్కఁడే దిక్కు. రక్షకుఁడు ఆయనకు బాలుఁడని వృద్ధుఁడని స్త్రీయని పురుషుఁడని భాగ్యవంతుఁడని దరిద్రుఁడని తారతమ్యము లేదు. ఎట్టివాఁడైనను తన్ను భక్తితో సేవించెనేని తప్పక రక్షించును. కోరిన కోరికలన్నియు నిచ్చును. కావున నీవును బాగుపడవలయునని నీ సవతితల్లి చెప్పినట్లు భగవంతుని ఆరాధించి మఱుజన్మమున నామె కడుపునఁబుట్టుము. నీ కన్ని సుఖములు రాజ్యము గలుగును. నాయనా! నేనేమి నీకు మేలుచేయఁగలను. నేనా యాఁడుదానను. దిక్కులేనిదానను. నా సవతికి దాసివలెనే యున్నదానను. ఇట్టి నేను నీ దుఃఖ మెట్లాఁపుదును? నీ కోరికలు దీర్పగలవాఁడు దేవుఁడొక్కఁడే యనిన ధ్రువుఁడు తటాలున లేచి తల్లియెదుట నిలుబడి అమ్మా! నేను సవతితల్లి కడుపునఁ బుట్టనే పుట్టను. నీకడుపుననే పుట్టితిని. నీకేకీర్తి తెచ్చెదను. నాశక్తిచూడుము దేవుఁడనువాఁడెచ్చటనున్నాఁడు? నేనేమి చేసిన నా కోరికలను దీర్చును? అనిన తల్లి యిట్లనియె. తండ్రి! దేవుఁడు అన్ని చోటుల నున్నాఁడు. ఒకచోట నున్నాఁడు ఒక చోట లేడని చెప్పరాదు.

ధ్రువుఁడు : ఆయన కేమి పేరు?

సునీతి : అన్ని పేర్లు ఆయన పేరులే. నీ వాయనను ఉద్దేశించి యే పేరుతోc బిలిచినను ఆయన నీకుc బలుకును. అందులో ముఖ్యమైనపేరు శ్రీమన్నారాయణుcడు.

ధ్రువుcడు : ఆయన యెవరివలె నుండును? రూప మెట్టిది?

సునీతి : నీవేరూపము గలవానిcగ ధ్యానింతువో ఆరూపముతోనే నీకు కనcబడును. తానేదో యొక రూపమును మాత్రము పూనియుండిన ఆ రూపమును ధ్యానించుటకు అందఱకు శక్తికలుగునో కలుగదో ఒక పేరుమాత్రమే పెట్టుకొని యుండిన ఆ పేరందఱకు తెలియునో తెలియదోయని లోకులయందు మిక్కలి దయగలవాడై వారి వారి యిష్టము వచ్చినట్లు వారువారు ధ్యానింప నిమ్మని అందఱకు సులభుడై యున్నాడు.

ధ్రువుcడు : అమ్మా! దేవుడెంత దయగలవాcడే, అట్లైన దేవుని ధ్యానించుట సుళువే.

సునీతి : మనస్సు నిలకడ గలవారికి సుళువు గాక కష్ట మేలయగును? ఇదివఱకు ఆడుకొను వస్తువులమీద నీ వెంత ప్రేమయుంచి అన్నమునకు నీళ్ళకు నేను బిలిచినను రాక యుంటివో అట్టి ప్రేమను భగవంతుని యందుంచుము.

ధ్రువుcడు : అమ్మా! అట్టులే చేసెదను గాని నేనెట్లు ధ్యానింప వలయునో ఎట్లైన నాకు సులభముగా నారాయణమూర్తిc కనcబడి నాకోరికలు దీర్చునో ఆ విధమును దెలుపుము.

ధ్రువుడు : అమ్మా! అట్టులే చేసెదను గాని నేనెట్లు ధ్యానింప వలయునో ఎట్లైన నాకు సులభముగా నారాయణమూర్తిc కనcబడి నాకోరికలు దీర్చునో ఆ విధమును దెలుపుము.

సునీతి : నాయనా! దెలిపెద వినుము. భగవంతుఁడు తానే యాకారము గలవాఁడో యట్టి యాకారము గలవారిని గానే మనుష్యులను సృజించెను. కావున నీవును అట్టి యాకారము గలవానినిగా దేవుని ధ్యానింపుము.

అని యవమానము సహింపనోపక చిన్న బాలున కిది సాధ్యమా యని యైనఁ దలఁపక భగవంతుఁడు భక్తపరాధీనుఁడుగదా యని నమ్మి ఆమె కొడుకును బోధించి పంపెను. ధ్రువుఁడును రోషంబున నెట్టులైన నారాయణుని దర్శించి తన కోరిక నెఱవేర్చుకొని తండ్రి ప్రభుత్వమునకంటె గొప్ప ప్రభుత్వమును ఐశ్వర్యమును సంపాదింపవలయునని నిశ్చయించుకొని మనస్సంతయు భగవంతుని ధ్యానింపవలయునని యా విషయమందే తగిలియుండుటచేఁ దానేత్రోవ నెచ్చటికిఁ బోవు నదికూడ నెఱుఁగక చక్కఁగ నరణ్యమధ్యమును బోవుచుండెను. జంకుకొంకులేని మనస్సుచే నెవ్వఁడు భగవంతుని సేవ చేయవలయునని నిశ్చయించు కొనునో యట్టివానికిఁ నతనికిఁ దెలియవలసిన విషయములు చేయవలసిన కార్యమును పోవవలసిన త్రోవలు భగవంతుడే యోగ్యులవలనఁగాని మఱి యే మూలమునుగాని తెలుపును. కావున భగవంతునిగూర్చి తపస్సు చేయవలయునని దృఢనిశ్చయముతోఁ బోవు నతనికి నారదుఁ డెదురై బాలకా! నీ వెవ్వఁడవు? ఈ యరణ్యమునందు ఒంటిగ నేలపోవుచున్నావు ఎక్కడకు పోవుచున్నావు! అని యడిగెను. ధ్రువుఁడును సాష్టాంగ నమస్కారము గావించి తన పేరు చెప్పి తన్ను సవతితల్లి తిట్టుటయు తండ్రి యుపేక్షించుటయు తల్లి బోధమును దెలిపెను. నారదుఁడును క్షత్రియజాతి యెంతపౌరుషము గలదియని యాశ్చర్యపడుచు నిట్లనియె.

నార : బాలకా! తపస్సు చేయ బోయెదనంటివే తపస్సనగా నేమో తెలియునా?

ధ్రువుడు : నేనాడుకొను వస్తువులం దెంత ప్రీతి నెల్లప్పుడుంచియుంటినో యట్టి ప్రీతిని భగవంతునియం దుంచి ఆయననే స్మరించుట తపస్సని మా తల్లి చెప్పెను.

నార : భగవంతుఁ డెక్కడ నున్నాఁడని ఆయనను నీవు ధ్యానించెదవు?

ధ్రు : నే నెక్కడ నున్నాఁడని తలచిన నక్కడనే యున్నాఁడని మా అమ్మ చెప్పెను.

నార : మీయమ్మ సత్యమే చెప్పెనుగాని నీవు పిల్లవాఁడవు నీకు నాలుగైదు సంవత్సరముల వయస్సైన నున్నదో లేదో. కావున నీవు చేయు కార్యమునందలి కష్టసుఖము లెఱుంగవు. నీవా ఆడుకొను బాలుఁడవు. ఈ ప్రాయమందు నీకు మానమన నేమి అవమానమన నేమి? అదియునుగాక నిద్రాహారములు వదలి యెన్నియో జన్మములు యోగమునను జ్ఞానమునను గడుపు మహాయోగులకును భగవంతుఁడు కానరాఁడు. బాలుఁడవైన నీ కెట్లు కానవచ్చును? అతడు మెచ్చునట్లుగ నారాధింప నీకు సాధ్యమా? కాఁబట్టి నీకు నసాధ్యమైన పనికిఁబూనక యింటికిఁబొమ్ము. ప్రతి మనుష్యునకు సుఖములు దుఃఖములు ఆయా కాలమున పూర్వమున వాఁడువాఁడు చేసిన పుణ్యపాపముల కొలఁది కలుగుచుండును. దానిని సహించుకొనినవాఁడే జ్ఞాని.

ధ్రు : అయ్యా! దేవుఁడు మిక్కిలి దయగలవాఁడని పిల్లవాఁడు పెద్దవాఁడు అని మనుష్యులకుండు తారతమ్యబుద్ధి ఆయనకు లేదని, దానివలన నెవరు పూజించినను సంతోషించి వారివారి కోరికలు కొనసాగించునని, మా

అమ్మ చెప్పెను. కావున నేను ధ్యానించినను దేవుఁడు సంతోషించి నాకు కనుబడి నా కోరికలు దీర్చును.

నార : నా వెంట రమ్ము. నీ తండ్రితోఁజెప్పి నిన్ను చక్కఁగ లాలింపఁ జేసెదను.

ధ్రు : నేను రాను. ఒకసారి యవమానించిన తరువాత మరల నచ్చటికి పోవుటకు నేను మానహీనుఁడనా? తండ్రిగదా యను ప్రీతిచేత నేను తొడనెక్కపోఁగా రాజ్యభాగము నాశించి వచ్చితినని సవతితల్లి తిట్టెను. ఇట్టి క్షుద్రరాజ్యమెవరికిఁ గావలయును? నేను దేవుని సేవించితినా లోకమునంతయు మించినవాఁడ నగుదునని మా తల్లి చెప్పెను. మా తల్లి అసత్యము చెప్పదు. ఒకరిచ్చు రాజ్యము నా కక్కఱలేదు.

నార : 'బాలకా! నిన్నిట్టి కార్యమునకు ప్రేరించినవాఁడు భగవంతుఁడే. నిన్నడ్డగింపరాదు. మీ తల్లి చెప్పిన వాక్యములు సత్యములు. అయినను నీకు భగవంతుఁడు సుళువుగా కనుబడు నుపాయము చెప్పెదను. దేవుఁడా దేవుఁడా యని యూరకె తలుచుటకంటె నర్థవంతమై మహిమగల మంత్రముచే ధ్యానించుట యుత్తమము. ఆ మంత్రము నుపదేశించెదను.' అని యతనికి నారదుఁడు పండ్రెండక్షరములు గల మంత్రము నుపదేశించెను.

ధ్రు : ఈ మంత్రమును ఎట్లు జపింప వలయును? భగవంతుని ఎట్లు ధ్యానింప వలయును? దయయుంచి చెప్పుఁడు.

నార : కార్యసిద్ధినొందు గోరువారు శుచియైన స్థలమునందు జపము సేయవలయును. కావున నీవు యమునాతీరమున నుండు

మధువనమునకుఁ బొమ్ము. అచ్చటనుండి ప్రతిదినము వేకువజామునే యా యేటినీటిలో స్నానము చేయుము. స్నానము చేయునపుడు మనస్సెచ్చటికో పోనీయరాదు. ఆ నీరము లోకులకు భగవంతుఁడు దీర్ఘాయువు ఆరోగ్యము కలిగించుటకై సృజించెననియు దానివలన నీకును ఆరోగ్యము ఆయువు చిత్తశాంతి కలుగుననియు తలంచుచు ఆ నీటినికూడ భగవంతుని స్వరూపముగానే తలంచు చుండుము. ఆ ధ్యానమునే వదలక యెవ్వరితోడను విశేషము మాటలాడక భగవంతుని తలంచుచు పరిశుద్ధమైన మట్టితోఁగాని రాతిచేఁగాని లోహముచేఁగాని చూచుటకు నింపైన విగ్రహమును శుచియైన స్థలమందుఁగాని నీటియందుఁగాని నిలుపుము. భగవంతుడు లేనిస్థలము పరమాణువుకూడ లేదని మీతల్లి చెప్పినమాట మఱవక ఆ విగ్రహమునే భగవంతుఁడని తలంచి కాలివ్రేలు మొదలు శిరమువఱకు ఆ విగ్రహమునే చూచుచు ఇతర చింతలన్ని మాని భగవంతుఁ డే యే అవతారములో నేయే కార్యములు చేసెనో ఏయే భక్తుల నెట్లెట్లు రక్షించెనో ఆ చరిత్రము లన్నియు మీ అమ్మ నీకు చెప్పుచుండును గదా. అవన్ని ధ్యానించుచు కోమలములైన పాదకమలములు గలవాఁడనియు ఆ పాదములయందుఁ బుట్టిన గంగాదేవియే లోకపాపముల హరించుచున్నదనియు అట్టులే చేతులయందు శంఖ చక్రములు, కంఠమున వనమాలికయును, వక్షస్థలమున లక్ష్మీదేవియు, పీతాంబరము, పుండరీకములవంటి కన్నులు, రత్నమయమైన కిరీటము లోనైన యాభరణములు కలవాఁడనియు, సుందరాకారము గలవాఁడనియు ధ్యానింపుము. ఆ విగ్రహమును పూలచేతనో తులసిచేతనో

పత్తిరిచేతనో గడ్డిపోచలచేతనో భక్తిచేఁ బూజింపుము. నీకు దొరకిన ఆహారము భగవంతునికి నివేదింపుము. ఇట్లు కొన్ని దినములు ధ్యానించితివేని తరువాత నీ మనస్సును భగవంతుఁడే తన వంకకు లాగుకొనును. కావున మఱియొక విషయముపై పొమ్మన్నను పోదు. నీ కాఁకలి యైనప్పుడు పండో కాయో కందమూలములో ఏది లభించిన నది భక్షింపుము. భక్షించు పదార్థమును చూచి యిట్లు తలుపుము. నేను తన సేవచేసి కృతార్థుఁడ కావలయునని నాకీ దేహము నిచ్చి దీర్ఘకాలము రోగము నొప్పులు లేకుండునట్లు తానే యాహారమై యీ దేహమును రక్షించునుగదా ఈ యాహారమున కాకు బలము తేజము గలుగునుగాక! అని యీ విధముగు దలుచుచు భగవంతుఁనకు నివేదించి తరువాత భుజింపుము. నీవు భుజించు పదార్థము భగవత్స్వరూపమనియే తలంపుము. నీవు దీర్ఘాయువు కోరుట భగవంతుని సేవించుటకే కాని తుచ్ఛకార్యములు చేయుటకుఁ గాదు. ఈ విధముగ నీవు ధ్యానించితివేని మీ తల్లి చెప్పినట్లు నారాయణమూర్తి నీ వేవిధముగ ధ్యానించితివో యట్టి యాకారమునే వహించి నీకు ప్రత్యక్షమగును. నీ కోరికలు నెఱవేర్చును. శుభమగును. పొమ్మని నారదుఁడు మాయమై పోయెను. ధ్రువుఁడును అమ్మునిని దలచి నమస్కరించి మధువనమునకు బోయెను.

నారదుఁడు ధ్రువునకు భక్తిమార్గ ముపదేశించి యుత్తానపాదునిఁ జూడుబోయెను. ఉత్తానపాదుఁడును నారదునిఁ గని లేచి నమస్కరించి తగిన యాసనము సమర్పించి తానుగ నేమియు బలుకక ముఖము వ్రేలవైచికొని కూర్చుండి యుండెను. నారదుఁడారాజును జూచి యిట్లనియె.

మహారాజా! యేల దుఃఖముచేఁ బీడింపఁబడినవానివలె ముఖమున వికాసము లేక యున్నావు? నీ ప్రియభార్య సురుచి సుఖముగ నున్నది కదా? నీ ప్రియపుత్రుఁడు ఉత్తము డారోగ్యవంతుఁడా? నీ పెద్దభార్య యింకను జీవించి యున్నదా? అనిన ఉత్తానపాదుఁ డిట్లనియె.

మునీంద్రా! నా దుఃఖము నేనేమని చెప్పుకొందును. కడుపులోని దుఃఖమును తనమేలు కోరువారితోఁ జెప్పిన తగ్గునని విందును. కావున విన్నవించు కొనెదను. కొన్ని దినముల క్రిందట నేనిచట గూర్చుండియుండ నా చిన్న భార్య కొడుకు ఉత్తముఁడు నా తొడపై కూర్చుండెను. అప్పుడే నా పెద్దభార్య కొడుకు ధ్రువుఁడును మఱియొక తొడ నెక్కవచ్చెను. బాలుఁడు వానికేమి తెలియుననియైను దలుపక నా చిన్న భార్య వానిని నోటికి వచ్చినట్టు నా యెదుటనే తిట్టి రెట్టపట్టిలాగి యిల్లు వెడలు గొట్టెను. మోహపాశములకుఁ జిక్కి యని భయపడి తేరకానివలెఁ జూచుచుండితిని గాని దానిని ధిక్కరింప నైతిని. బాలుని సమాధానపఱుప నైతిని. అతుడు కేవలము బాలుడయ్యును వినయము సద్గుణము పితృభక్తి శ్రద్ధగలవాఁడు. నా పెద్దకొడుకు, పెద్దభార్యయందుఁ బుట్టినవాఁడు. వెక్కి వెక్కి యేడ్చుచు నింటికిఁబోయి తల్లితోఁ దనకు మేముచేసిన పరాభవము చెప్పుకొనెను. ఆమె నీకు దేవుఁడే దిక్కు పొమ్మని యడవికిఁ బంపెనని వింటిని. అట్టి గుణధన్యుని నా యాజ్ఞానముచే స్త్రీమోహముచేఁ బోఁగొట్టుకొంటిని. కన్నతల్లియైనను కొడుకున కేదో సమాధానము చెప్పక తీవ్రరోషము వహించి యడవులకుఁ బంపెను. కులాలంకారు కుమారుఁ బోఁగొట్టుకొని యిట్టులేడ్చుచున్నాఁడను. స్త్రీకి లోబడి యిట్టి కార్యమును జేయు నావంటి మనుష్య పశువు లోకమున నున్న నేమి లేకున్న నేమి? మునివరా! లోకమున నన్నుఁ దిట్టనివారులేరు. నలువురిని జూచుటకు పురమున వీథులవెంటఁ బోవుటకు మొగము చెల్లకున్నది. అయ్యో! నా కొడుకును తరువాత


వెదకించితినిగాని యెందును గానరాఁడయ్యె. ఏ పులి మ్రింగిపోయెనో, ఏ తోడేలు వాతవేసి కొనెనో నేనిఁక నేమిచేయుదు మునీంద్రా! నీవే దిక్కు. నన్ను రక్షించు భారము నీది యని మిక్కిలి విషాదపడి కన్నీరుగార్ప నతనిఁ జూచి నారదుఁ డిట్లనియె.

రాజా! స్త్రీలోలురై కన్నులు గానక మతిమాలి ముందకార్యములుచేసి వెనుకనేడ్చు వారందఱు నీయట్టివారే. అగ్నిసాక్షిగ వివాహము చేసికొనిన పత్నిని గౌరవింపకపోయితివి. నీవు సౌందర్యమును ముఖ్యముగఁ జూచి చిన్నభార్య వలలకుఁ జిక్కితివి కాని గుణవతియైన పెద్దభార్యను ఆదరింపవైతివి. ఎప్పుడిట్టి యకార్యము చేసితివో ఆనాఁడే నీ బుద్ధి పుర్వు మేసెనని తలఁచి మాబోఁటివారము నీముఖము చూడ రోసి నీ యొద్దకు వచ్చుటయు, నిన్నుఁ జూచుటయు, నీతో సంభాషించుటయు పాపమునకు హేతువగునని రాక మానితిమి. తొండ ముదిరి ఊసరవెల్లి యయ్యెను. దానిఫల మిప్పుడనుభవించుచున్నావు. కావున నీ పాపము సమయుచున్నది. ఆ కారణముచే నిన్నుఁజూడ వచ్చితిని. మహాపతివ్రతయైన నీ పెద్దభార్య కొడుకున కెట్టి యాపదలు రాఁజాలవు. ఆమె యతనికి కట్టిన రక్షయే యతని సర్వభయములనుండి పాపును. నీ కొడుకు శ్రీమన్నారాయణుని ప్రత్యక్షముచేసికొని యితరులకు దుర్లభమైన వరమును పదవిని బొంది వచ్చును. అతనికై నీవు విచారపడకుము. అవి యూరార్చి నారదుఁడు హరినామస్మరణ చేయుచు ఆకాశమార్గమునఁ బోయెను. ఉత్తాన పాదుఁడును నారదు వాక్యములనమ్మి సంతుష్టుఁడై రాజ్యము నందును భార్యయందును బ్రీతిఁ బాసి చరించుచుండెను. అక్కడ ధ్రువుఁడు మధువనముఁ జేరి యమునయందు స్నానమొనర్చి శుచియై యెవ్వరితోడను బలుకక మనస్సు స్థిరపఱుచుకొని చలింపనీక నారదుఁడు చెప్పినట్టు నారాయణ విగ్రహంబును బూజించుచు నదియె నారాయణుఁడని

ధ్యానించుచు, తన దేహస్థితి ననుసరించి రెండు మూఁడు దినముల కొకసారి వెలగపండ్లు రేఁగుపండ్లు ఆహారముగాఁ గొనుచు నొకమాసము హరినిపూజించి, రెండవ నెలయందు విష్ణునారాధించి తొమ్మిది దినముల కొకసారి జలముమాత్రము త్రావుచు, మూఁడవ నెలయందు భగవంతుని బూజించి పండ్రెండు దినంబుల కొకసారి వాయు నాహారముగాఁగొనుచు, నాల్గవమాసంబున ఆహారమే వదలి ఊర్పు బిగియించి హరి విగ్రహంబును దలంచుచు, నొంటిపాదంబున నిలువంబడి, ఐదవ మాసంబును జరిపెను. ఇట్లు మనస్సంతయు నేకాగ్రముగ విష్ణునియందే నిలిపి ధ్యానము చేయుచుండ నతని భక్తికిమెచ్చి గరుడవాహనారూఢుఁడయి మహాలక్ష్మితోడ శ్రీమన్నారాయణుఁ డతనికిఁ బ్రత్యక్షమై యెదుట నిలిచి బాలకా! అన్ని పదంబులకంటె నుత్తమపదంబుఁ గోరి నీవు తపంబుచేయుట యెఱుంగుదు. నీ విషయంబున నీ పూర్వజన్మమందే సంతుష్టుఁడ నైతిని. అప్పుడు నీవు విప్రుఁడవై నన్ననేకభక్తిచే నారాధించితివి. తల్లిదండ్రుల శుశ్రూషచేసి సదాచారమున వర్తిల్లుచుంటివి. అట్టి సమయంబున నీకొక గొప్ప రాజకుమారుఁడు మిత్రుఁడయ్యెను. వాని యైశ్వర్యముఁజూచి నేను ఇట్టి రాజపుత్రుఁడుగాఁ బుట్టియుండరాదా యని తలంచితివి. ఆ కారణముచే నీవిప్పుడు రాజపుత్రుఁడ వైతివి. నన్ను భజించువారి కోరికలు దీర్చుభారము నాది. ఆ ఫల మనుభవించుభారము వారిది. మోక్షముగోరిన భక్తులకు మోక్షము నీయ సంసిద్ధుఁడనై యుండ నైశ్వర్య మిచ్చుట చెప్పనేల? ఇతరులకు దుర్లభమైనదియు, ప్రళయకాలమందును నశింపనిది యగు ధ్రువనక్షత్రపదంబు నీ కొసంగితి. నీవు నీ నగరంబునకు బోయి నీ తండ్రి యరణ్యమునకుఁ బోయిన పదపడి నీవా రాజ్యము కొన్నివేల సంవత్సరములు పాలించి నన్నుఁగూర్చి యజ్ఞము లొనర్చి పిదప సప్తర్షి మండలమునకంటె నున్నతమైన పదంబు నొందఁగలవు. నీ తల్లియగుటచే

సునీతియు నీ సమీపమందు నక్షత్రమై నీతోపాటుండఁగలదు, అని యనుగ్రహించి తిరోహితుఁడయ్యె.


ధ్రువుఁడును మరలి నగరమునకు వచ్చెను. అతఁడు వచ్చువార్త చారులచే నెఱిఁగి ఏనుఁగులు గుఱ్ఱములు లోనైనవానితో నెదురుగఁబోయి పట్టపు టేనుగుపై నతనిఁ గూర్చుండఁబెట్టి మహావైభవముతో నగరునకుఁ దెచ్చెను. సునీతియు నతనిఁ గౌగలించుకొని చచ్చినవాఁడు మరల బ్రతికినట్లు సంతోషించెను. భగవద్భక్తులందు నెవ్వరు ద్వేషము వహింపనొల్లరు. కావున సురుచి పూర్వము తానుజేసిన దుష్టకార్యము మఱచి ప్రేమతో గౌరవించి కౌఁగిలించుకొనెను. ఉత్తముఁడు ధ్రువుఁడును సరస్పరము ప్రీతిగలిగి మెలగుచుండిరి.



ధ్రువుఁడు మరల నగరమునకు వచ్చుట

తరువాత కొన్ని దినంబులకు ఉత్తానపాదుండు రాజ్యము ధ్రువునకిచ్చి తపముచేయ నరణ్యమునకుఁ బోయెను. ఆవలఁ గొన్ని దినములకు

ఉత్తముఁడు వేఁటకైపోయి యొక యక్షునిచేఁ జంపఁబడియెను. ఆ దుఃఖముచే నతని తల్లియు నడవులఁబడి పోవుచు కారుచిచ్చులోఁ దగులుకొని మరణించెను. ధ్రువుఁడావార్తవిని యక్షులతోఁ బోరి వారలనెల్ల జయించి మరలి పురమునకు వచ్చి న్యాయము తప్పక ప్రజాపాలనంబు చేయుచు అనేక యజ్ఞములు గావించుచు హరినామస్మరణ చేయుచుండెను. అంతఁ గొన్నినాళ్ళ కొకనాఁడు పదిదిక్కులు వెలుగఁజేయు విమానంబును గైకొని చతుర్భుజులును చామని చాయ మేనివారును కమలములవంటి కన్నులుగల వారును గదాధరులును సుందరులు నగు నిద్దఱు దివ్యపురుషు లరుదెంచి ధ్రువునిలో నిట్లనిరి. రాజా! నీకు శుభమగుఁగాక. ఐదు సంవత్సరముల ప్రాయమునాఁడు నీవు విష్ణుదేవుని భక్తితోఁ బూజించితివి గదా. ఆ భగవంతుఁడు నిన్నుఁ దోడుకొనిరమ్మని విమాన మంపెను. దయసేయుము అని సందుఁడు సునందుఁడు అనువారలు చెప్పిన సంతోషించి స్నానమాచరించి హరిని ధ్యానించి మునీంద్రులచే ననుజ్ఞవడసి నందసునందులకు నమస్కరించి విమానమునకుఁ బ్రదక్షిణమాచరించి ఏమియో యాలోచించుచు విమాన మెక్కక నిలఁబడిన ధ్రువుని తలంపెఱిఁగి హరిదూత లిట్లనిరి. రాజేంద్రా! తల్లిని విడిచి యెట్లు పొదునని నీవుచేయు నాలోచన నెఱిఁగితిమి. నీ వంటి విష్ణుభక్తుని గన్నతల్లికి నుత్తమలోకములు ప్రాప్తించుట యేమి యాశ్చర్యము? పుత్రులు దైవభక్తి గలవారై పాపులయిన తల్లిదండ్రులను తరింపఁజేయుదురన మహాపతివ్రతయైన నీతల్లి నీచే ఉత్తమపుణ్యలోకములు పడయుట చెప్పవలయునా? ఒక వంశమునకెల్ల నొక యోగి పుట్టినను ఆ వంశము వారెల్లఁ దరింతురు. అదె ముందున్న విమానమున నున్నది మీతల్లియే కదా చూడుము. అనిన ధ్రువుఁడు సంతసించి విమానమెక్కి తల్లితోడ నాకాశమార్గమునఁ బోయెను. ఈ ధ్రువనక్షత్రము నేఁటికి ఉత్తరపు దిక్కునఁ



ధ్రువుఁడు తల్లితో వైకుంఠమునకుఁ బోవుట

గానవచ్చును. దీనిని చుట్టిసప్తర్షులును సమస్త గ్రహనక్షత్రములు తిరుగుచుండును. కావున భక్తుల నెట్టివారు నవమానింపరాదు. వారి కెందును కీడులేదు. అట్టివారిని గన్న తల్లుల భాగ్యమే భాగ్యము. పుత్రునకు హరిభక్తి నుపదేశించి సునీతియు శాశ్వతలోకముఁ గాంచెను.

## 5. విక్రమార్కుని పూర్వజన్మ కథ

ఉజ్జయనీ నగరమును బరిపాలించుచుండిన విక్రమార్క మహారాజొకనాఁడు "నేనేమి పుణ్యమును పూర్వజన్మమున చేసియుండుటచే నాకిట్టి గొప్పపదవి లభించెను" అని యాలోచించి సత్యము తెలియు నుపాయము గానక మంత్రుల నందఱఁ బిలిపించి తన యభిప్రాయమును దెలిపెను. అప్పుడతని మంత్రియు నుపాయపరుఁడు నగు భట్టి యిట్లనియె.

మహారాజా! మీకోరిక మావలన నెఱవేఱునది కాదు. యోగులుకాని మీ ప్రశ్నమున కుత్తరము చెప్పఁజాలరు. నేనొక యుపాయము చెప్పెదను. దేశమం దంతటను ప్రతి గ్రామమందును మీ ప్రశ్నకుఁ బ్రత్యుత్తరము ఆఱునెలలో చెప్పువానికి బంగారు గుమ్మడికాయ వెయ్యి యెకరముల గ్రామము నిచ్చెదననియు, చెప్పెదనని వచ్చి చెప్పకుండినను అసత్యము చెప్పినను తల తీయింతు ననియుఁ జాటింపఁబంపుఁడు. అనిన నది మంచియుపాయమని రాజట్లే కావించెను.

ఒక పల్లెయందు బహుకుటుంబి యగు బ్రాహ్మణుఁడు కలఁడు. అతఁడు కేవలము దరిద్రుఁడు. పెక్కువమంది బిడ్డలు కలవాఁడు. దినమున కొకపూటనో రెండు దినముల కొక పూఁటనో పొలములలో నేఱఁగా జిక్కిన గింజలను తేఁగా ఆ కొంచెమును వారందఱు తినుచుండిరి. ఇంత కష్టపడుచున్నను దేహియని యెవ్వరిని యాచింపఁడు. దరిద్రుఁడైన యీ బ్రాహ్మణుఁడు రాజు చాటింపఁ జేసిన వార్తవిని యిట్లు తలఁచెను. ఏ దుఃఖమైన ననుభవింపవచ్చును గాని దారిద్ర్య దుఃఖమనుభవింపరాదు. అందు కుటుంబ పోషణము దుష్కర కార్యము. కానీ నేనొక యుపాయము చేసెదను. రాజనకుఁ బూర్వజన్మవృత్తాంతము చెప్పుటకై పోయెదను. చెప్పఁగలిగిన యైశ్వర్యము వచ్చును. చెప్పకపోయితినా మృతి తప్పదు. ఫలమెట్టు లుండినను ఆఱునెలలు రాజునింట కడుపునిండ ఆహారమైన దొరకును. పేలపిండి విసిరినమ్మకు బొక్కినదే ఆదాయ మనుకొనెదను. అని భార్యనుజూచి నేను రాజునకు పూర్వజన్మవృత్తాంతము చెప్పఁ బోవుచున్నాను. అని చెప్పి బిడ్డల నందఱ నాశీర్వదించి యిటైన బిడ్డలకు పాలు అటైన వైతరణీ గోదాన మనుకొనుచు ప్రయాణమైపోయెను.

ఇట్లు పోవుచు రాత్రులందు అడవిలో చెట్లపై పరుండుచు పగటిపూఁట నడచుచు కొన్ని దినములుపోయి యొకనాఁడు బిల్వవనము ప్రవేశించి యా రాత్రియొక పెద్ద చెట్టు మీఁదఁ బండకొనెను.

అర్ధరాత్రము కాఁగానే చెవులు పగిలిపోవు భయంకరమైన ధ్వనులు వినవచ్చెను. వెయ్యికాగడాలు వేసినంత వెలుతురు కానవచ్చెను. దాఁగపోయినచోట దయ్యాలపోరన్నట్టు లీయడవిలో నిదియేమి అంపని చూచుచుండ ప్రమథులతోడ పార్వతీ పరమేశ్వరులు అచ్చటికి వచ్చిరి. ఆ వనములందలి ఋషీశ్వరు లందఱు గౌరీశంకరులను బూజించు చుండిరి. బ్రాహ్మణుఁడు పుణ్యాత్ముఁడు కావున నిది యంతయు ఆయనకు కనఁబడెను. బ్రాహ్మణుఁడును గొప్ప భక్తుఁడు గనుక మ్రొక్కఁబోయిన దేవర యెదురుగ వచ్చెనని తలఁచి వెంటనే చెట్టు దిగివచ్చి పరమేశ్వరుని పాదముల పైఁబడి దేవా! యిన్ని దినములునిన్ను భజించుచుండినను నాదారిద్ర్యము తీర్పవైతివి. నిన్ను నమ్మినవారు చెడిపోయిరనిన అపకీర్తి నీకేకదా వచ్చును!

నరులను నమ్మిన చెడిపోదురుగాని దైవమును నమ్మియుఁ జెడినవాఁడు కలఁడా! నేను నీ కేమి ద్రోహము చేసితిని? నాపై నీ కేమి ద్రోహము చేసితివి? నాపై నీకేల దయరాదు? నేను నీ బిడ్డను గానా? బిడ్డపైఁ గోపింతురా యని యనేక విధములఁ బ్రార్థించెను. పరమేశ్వరుఁ డాయనయందు కరుణించి యిట్లనియె. బ్రాహ్మణుఁడా! నీవు నా భక్తుఁడవని నేనెఱుఁగుదును. నీకు ప్రారబ్ధమైన పాపము బలవంతమై దాని నీ వనుభవింపవలసి యుండుటచే నిన్ను నుపేక్షించితిని. నాదర్శనమున నీ పాపములన్నియు నశించెను. నీ యభిప్రాయము నేనెఱుఁగుదును. నీవు రాజు నొద్దకు బొమ్ము. నీవతని పూర్వజన్మ వృత్తాంత మిట్టిదని చెప్పిన నమ్మఁడు. దాని నతఁ డెఱుఁగ నుపాయము చెప్పెదను. అతనియొద్దకు నీవుపోయి "రాజా నీ పూర్వజన్మవృత్తాంతము నేను జెప్పిన నీవు నమ్మవు. ఋజువు పఱుపుమనెదవు. కావున నీకు నమ్మకముగ

నిజము తెలియఁ బఱిచెదను నీ నగరమునకుఁ దూర్పున రెండుక్రోసుల దూరములో నొక గాండ్ల వానియిల్లు కలదు. ఆ యింట నొక గ్రుడ్డియెద్దున్నది. అమావాస్యనాఁటి రాత్రి నీవు శివపూజచేసి యచటికిఁబోయి రహస్యముగ దాని నడుగుము. మీఁద జరుగవలసిన వృత్తాంతము నీకే తెలియును" అని చెప్పుము. నీకు శుభమగును. పొమ్మని యందఱతో మాయమై పోయెను. బ్రాహ్మణుఁడు సంతోషముతో నారాత్రి యచ్చటనే యుండి తిన్నగ ప్రయాణము చేసి యుజ్జయినికిఁ బోయి రాజునుజూచి శివుఁడుతనతో చెప్పినట్టు విక్రమార్కునకు చెప్పెను.

ఆ మాటలువిని రాజు సంతోషించియు బ్రాహ్మణునిఁ జూచి యిట్లనియె. అయ్యా నీమాట సత్యమో యసత్యమో నేను బరీక్షించి చెప్పువరకు నీ వెచ్చటికిఁ బోరాదు. ఇచ్చటనే యుండి కడుపారభుజించుచు నీకుఁగావలసిన వస్తువులు గైకొనుచుండుము అని చెప్పి అమావాస్యనాఁడు శివపూజ గావించి అక్షతలు పూలుకత్తి కేలఁబూని నీళ్లుతీసికొనిచక్కగా గాండ్లవాని యింటికిఁబోయి అందఱను దూరముగఁ బొమ్మని ఆ గ్రుడ్డియెద్దుపై అక్షతలు పూలు నీళ్లు చల్లి వృషభరాజా! నా పూర్వజన్మ వృత్తాంతము చెప్పుమనెను. అది రాజును జూచి కన్నీరు గార్చుచు "రాజా! నినుఁ జూడఁగనే నాకేదో వింతజ్ఞాన ముదయించినది. అది మరలఁ బోవునట్లున్నది. నీపూర్వ వృత్తాంతము నేనెఱుఁగుదును. అయినను దాని నీకు చెప్పవలదని దేవతలయాజ్ఞ. నీనగరమునకు ఆఱామడ దూరమున నొక పిశాచి యున్నది. నీవచటికి అమావాస్యనాఁటి రాత్రి పోయి నన్నడిగినట్లే దాని నడుగుము భయపడకుము. అది నీకు ప్రత్యుత్తర మిచ్చును. అని చెప్పి యథాప్రకారము ఎద్దు మొద్దుస్వరూపముగా నుండెను.

రాజీ మాటలు విని యాశ్చర్యపడి తన నగరికివచ్చి మఱుసటి యమావాస్యనాఁడు ఎద్దు చెప్పినట్లు శివపూజ చేసి అక్షతలు పూలు నీళ్లు

తీసికొని యా యడవికి పోయి ఎద్దు చెప్పిన మఱ్ఱిచెట్టును గుర్తించి దానిని జేరఁబోయెను. అచ్చటికిఁబోవఁగానే హాహాయని భైరవ రవముతో దిక్కులుపగుల నార్చుచు భయంకరమైన వేషముతో నొక పిశాచి రాజుపై పడవచ్చెను. విక్రమార్కుఁడును భయపడక తాను దెచ్చిన అక్షతలు నీళ్లు పూలు దానిపైఁ జల్లి పిశాచీ! నా పూర్వజన్మవృత్తాంతము చెప్పుమని యడిగెను. అక్షతలు మీఁదపడఁగానే యాపిశాచి దుశ్చేష్టలుమాని గోలుగోలున నేడువ నారంభించి కొంతసేపటికి నిట్లనియె. రాజా! దేవతలకరుణచే నీ పూర్వజన్మ వృత్తాంతము నా వృత్తాంతముకూడ జ్ఞప్తికి వచ్చినది. అయినను దానిని నీకుఁ జెప్పునట్లు దేవతల యాజ్ఞలేదు. నీ పెద్దమంత్రికి తొమ్మిది సంవత్సరముల వయస్సుగల యొక కూఁతురున్నది. దానిని నీ వేకాంతమున నన్నడిగినట్లే యడుగుము. అది నీక తెలియఁజెప్పును. ఇఁక నీవిక్కడనుండ రాదు. దేవతలిచ్చిన తెలివి తప్పుచున్నది. ఈ తెలివి తప్పెనా నేను నీకు కీడుగావింతును. శీఘ్రముగఁ బొమ్ము అని చెప్పెను. రాజా మాటలువిని అతి త్వరితముగవచ్చి యిల్లుచేరి యేమిది యాశ్చర్యమని తలఁచుచుండెను.

మఱునాఁ డుదయమున విక్రమార్కుఁడు తన పెద్ద మంత్రిని బిలిచి యతనితో నేవృత్తాంతము జెప్పక రేపటి యమావాస్యనాఁటిరాత్రి నేను యింటికివచ్చి శివపూజచేసి తొమ్మిది సంవత్సరముల ప్రాయముగల నీ పుత్రికను ఏకాంతమునఁ జూడవలసియున్నది. దానికి దగిన యేర్పాటు చేయుమని చెప్పెను. మంత్రి యట్టులే కానిండని చెప్పెనుగాని తన బిడ్డను శివునకు కాళికి రాజు బలియిచ్చునేమో యని మిక్కిలి దుఃఖపడుచుండెను. అమావాస్య రానేవచ్చెను. అనాఁడా యింటిలో నొకరికిని కాటుప్రేసినను మొగమున నెత్తురులేదు. ఒకరైనను మెతుకు ముట్టలేదు. అందఱు శోకాంధకారమున మునిఁగియుండిరి. చీఁకటిపడఁగానే రాజు చంద్రహాసము ధరించి చక్కగ మంత్రియింటికి వచ్చి తనకుఁగా నేర్పాటు

చేసియుంచిన గదిలోనికి ఆ బిడ్డను తోడ్కొనిపోయి శివపూజ గావించి యక్షతలు నీళ్ళు పూలు ఆ బిడ్డపై జల్లి అమ్మాయీ! నా పూర్వజన్మవృత్తాంతము చెప్పుమా యని యడిగెను. ఆ బిడ్డయు సిగ్గున తలవంచుకొని యిట్లనియె. రాజా! నా కేది యో యొకవింతజ్ఞాన ముదయించి చెప్పుచున్నాను. నీ పూర్వవృత్తాంతము నా పూర్వవృత్తాంతము నాటకమాడినట్లు నాకు కనులకు గోచరించుచున్నది. దానిని జూచి చెప్పుచున్నాను వినుము.

ఇప్పటికి నూఱుసంవత్సరములకు ముందు గోదావరీతీరమున నొక్క గ్రామమందు రామశాస్త్రియను నొక బ్రాహ్మణుఁడుండెను. అతని కొకభార్యయు కొడుకు కోడలు కలరు. ఆయన మిక్కిలి దరిద్రుడు. భిక్షాటనముచే జీవించుచుండెను. ఇట్లుండ ఒకసారి అహోరాత్రములు విడువక జడివాన గాలిపట్టి యింటిలోనివారు బయట తల చూపకుండునట్లు కుండలతో క్రుమ్మరించినట్లు వర్షించెను పాములను వ్రేలఁదీసినట్లు జలధారలు పడుచుండెను. ఆమూఁడు దినములయిన తరువాత ఆ బ్రాహ్మణుఁడు బిచ్చమునకై బయలుదేఱి పోయెను. ఇండ్లుగోడలు చక్క చేసికొనువారును, పొలములు చూడఁబోవువారునై జనులందఱు వారివారి కార్యములు వారు చేసికొనుచుండుటచే నీయనకు కావలసినంత బిచ్చము పుట్టదయ్యెను. ఏదో తగుమాత్రము దొరకఁగా దానిని తెచ్చి భార్యయొద్ద నిచ్చెను. ఆమెయును అన్నము సిద్ధముచేసి దేవతార్చన కాఁగానే నలువురకు నాలుగు విస్తళ్ళలో సమభాగములుగా వడ్డించెను. ఆ సమయమునకు సరిగ నిద్దఱు బ్రాహ్మణులు ఆకలిచే సోలిపోవుచువచ్చి అయ్యా! ఆఁకలిచే ప్రాణములు పోవుచున్నవి. కొంచెము అన్నముండిన పెట్టెదరా యని యడిగిరి. ఆ మాటలు వినినతోడనే పెనిమిటి గుణమెఱిఁగిన దగుటచేత ఆ యిల్లాలు ఱేఁచుకుక్కవలె రేఁగిమగనిని దిట్టి మెటికలు విఱిచి తన విస్తరి తన కొడుకువిస్తరి యెత్తికొనిపోయి

లోపలఁ గూర్చుండి కొడుకుతోఁ గూడ భుజింప మొదలుపెట్టెను. కూడులేక చావనీ అని కోడలిమీఁద కోపముచే నామెవిస్తరి యెత్తుకొని పోలేదు. రామశాస్త్రియు కోడలినిచూచి అమ్మా! నీ వేమనెదవు? అనెను నేను మీతోపాటిదాననే యని యామె చెప్పెను. అప్పుడా గృహస్థు వచ్చినవారి నాదరించి తమ రెండు విస్తళ్ళు వారి ముందుంచెను. ఇంటిలోని కల్లోలము విన్నవారగుటచే ఆ యిద్దఱు బ్రాహ్మణులు అయ్యా మా యాఁకలివంటిదే మీయాఁకలి. నీవు పెద్దవాఁడవు. నీ కోడలు చిన్నపడుచు. మీకు లేకుండ మేము భుజింపరాదు. అని బలాత్కరించి కోడలిచేత ఆ యన్నమును నాలుగాకులలో వడ్డింపఁజేసి నలువురు భుజించిరి. రాజేంద్రా! ఆ రామశాస్త్రియే నీవు అని చెప్పెను.

ఆ మాటలు విని ఆ రామశాస్త్రి భార్య కొడుకు లెక్కడ పుట్టినారని రాజడిగిన ఆ చిన్నది యిట్లనియె. గయ్యాళిగంగయై యొకరి సుఖ దుఃఖములతో నక్కఱలేక తనకడుపే హెచ్చుగఁ జూచుచుండుటచే ఆమె పిశాచియై పుట్టెను. తనకు దేవుఁడు కన్నులు బుద్ధి యిచ్చియు వానిని చక్కఁగ నుపయోగింపక దుష్టురాలగు తల్లి యెట్లీడ్చిన నట్లు పోవుటచే ఆయనకొడుకు గానుగెద్దుగాఁ బుట్టెను. నీవు చూచిన యెద్దు, పిశాచి వారిరువురే. చేసికొన్నవారికి చేసికొన్నంత యని కలదు కదా యనిన ఆ కోడ లెచ్చట నున్నదని విక్రమార్కుఁడడిగెను. దాని కామె ప్రత్యుత్తరము చెప్పక తలవంచుకొని నిలఁబడి యుండెను. నీవేకదా యా కోడలనిన అవునని తలయూఁచెను.

రాజా మాటలకు సంతోషించి ఆ పిల్లతో వెలుపలకు వచ్చి మంత్రీ! నీ కూతురు చాల బుద్ధిమంతురాలు. ఆమె బుద్ధికి నేను మెచ్చితిని. నా కోడలుగ దీనిని బరిగ్రహించితిని. నీ యభిప్రాయ మేమనెను. చచ్చినబిడ్డ బ్రతికివచ్చినట్లు సంతోష పడుచుండినవాఁడు కావున రాజు ననుగ్రహమునకు

మతీంత సంతోషించి ప్రభువు లెట్లుచెప్పిన నట్లేయని మంత్రి ప్రత్యుత్తర మిచ్చెను. సుదినము సుముహూర్తము చూచి రాజు వివాహము జరిపి బ్రాహ్మణునకుఁ దాను చెప్పినట్లు బంగారు గుమ్మడికాయయు వెయ్యి ఎకరముల గ్రామము మాన్యము నిచ్చెను.

*శ్రీరామార్పణమస్తు*

1. అభ్యాగతుడు = ఆహ్వానింపబడకనే గృహస్థుని ఇంటికి వచ్చేవాడు.
2. విప్రులు = బ్రాహ్మణులు
3. కల్యాణీ = కల్యాణగుణాలు కలది
4. వాణిజ్యము = వ్యాపారము
5. పాషండులు = వేదబాహ్యులయిన బౌద్ధకాపాలికాదులు
6. అవబృథము = యాగ పరిసమాప్తిలో చేయు పవిత్రస్నానము.

* * *

# ఆఱవ భాగము

## 1. మార్కండేయ చరిత్రము

మృకండుఁ డనుమహర్షి యొక యడవిలో [1]నాశ్రమమును కల్పించుకొని యందుఁ దాను తన భార్య వసించి యుండెను. ఆయన మహాతపస్సంపన్నుఁడు. కాలమంతయు భగవంతుని ధ్యానించుటయందుఁ బూజించుటయందు భగవత్కథలు వినుటయందుఁ గడపుచుండెను. ఆయన భార్యయు మహాపతివ్రత.

ఇట్లు కొన్ని సంవత్సరములు జరిగిన పదపడి మృకండుఁడింట లేని సమయమున నొక మట్టమధ్యాహ్నమున నెండలు మండుచుండ పదములు మిడిమిడి కాలుచుండ నిద్దఱు ఋషులు వారి పర్ణశాలలోనికి వచ్చిరి. మృకండుని భార్యయు వారు మిక్కిలి యెండకు డస్సియుండుట చూసి యర్ఘ్యము పాద్యము నిచ్చి యర్హాసనమునఁ గూర్చుండుఁ డనికోరెను. వారట్లే కూర్చుండి కొంత సేదదేర్చుకొని “అమ్మా! నిప్పులు కురియుచున్న యీయెండలో చాలదూరమున పయనించుటచే మిక్కిలి డప్పిగొని యున్నారము. చల్లని పానీయము తెమ్ము” అని కోరిరి. ఆమెయును శ్రద్ధాభక్తులు కలది కావున వెంటనే లోపలికిం బోయి నిర్మలముగ లోపల వెలుపల తోమిన చెంబులో చల్లని నీరు తెచ్చి యిచ్చెను. వారా చెంబును తీసికొని చేతనుంచుకొని కుశల ప్రశ్నము గావించుచు “అమ్మా నీ కెందఱు బిడ్డలు? వారేరీ? ఆడుకొనఁబోయిరా? లేక వనమూల ఫలములకుఁ బోయిరా ఏల యిట్టి యెండలో వారిని వెలుపలఁ బంపితి” వని ప్రశ్నించిరి.

ఆ యిల్లాలు తలవంచుకొని “యయ్యలారా! భగవంతుఁడింకను నన్ను కడుపు చల్లని కాంతులలోఁ గలుప నను గ్రహింపలేదు” అని మెల్లగఁ జెప్పెను. వారులికిపడినట్లై “యేమీ! యింకను నీకుఁ బుత్రుఁడే జన్మింపలేదా” యనిరి. లేదని యామె బదులిడెను.

"హరి హరీ! యెంత ప్రమాదము! ఎంత ప్రమాదము" అనుకొనుచు వారా నీళ్ళచెంబును నేలఁబేట్టి దిగ్గన లేచిరి.

మహర్షు లిరువురు నీరు త్రాగక చెంబు నేలఁబెట్టి లేచుట చూచి ఖిన్నయై యా గృహిణి[2] "తండ్రులారా! నీళ్ళు త్రాగకయే లేచిరి. నాయందనుగ్రహించి జలపానము గావింపుఁడు" అని వేఁడుకొనెను.

అమ్మా! నీ వపవిత్రురాలవని కాని జలమపరిశుద్ధమని కాని మేము జలపానము మానినవారము కాము. నీవు గొడ్రాలవు. గొడ్రాలి చేతికూడు తినకూడదు. తినరాదు. నీరు త్రాగరాదు. ఆశాస్త్రీయమైన కార్యము చేసి మా తపస్సులకు హాని కలిగించుకొన నొల్లము. నీవు భర్తృఋణమునుండి విడివడినదానవుగావు. పురుషుఁడు భార్యను గ్రహించుట ధర్మమార్గమున సంతానము వడసి రెండు లోకముల సుఖించుటకే గాని స్వర్గజంతు సామాన్యమైన తుచ్ఛవిషయ సుఖమునకుఁ గాదు. విషయసుఖమే ముఖ్య ప్రయోజనముగ నెంచు దంపతులు పశుసమానులు. ఏ యుద్దేశముతో నీ వావును సంపాదింతువు? అది గొడ్డుపోయిన నీ కెట్లుండును? అట్టి గొడ్డుటావు గౌరవింపదగినదా? క్షేత్రమును సంపాదించుకొనుట దేనికి? అది ముండ్లతోను ఊలతోను నిండిన చవుటభూమియగునేని యది యుండియు నేల? అట్టులే భార్యయును. భర్తయనుజ్ఞ వడసి తపములు వ్రతములు సలుపుచుఁ బ్రతిబంధములఁ దొలఁగించుకొని ధర్మమార్గమునఁ బతివలనఁ గొంత సంతానము వడయవలయును. నీ వట్లుచేయక దేహపోషణమే ప్రధానముగ నెంచికొని యున్నదానవు. కావున నీ చేతి నీళ్ళు త్రాగరాదు" అని చెప్పివారు వెడలిపోయిరి.

అంతటి దప్పిచేఁ బెదవులు తడుపుకొనుచు సొటసొటలాడుచు వచ్చియు మహర్షులు తన చేతినీరు త్రావక పోవుట చూచి యా మునిపత్ని మిక్కిలి శోకింప సాగెను. అట్టి మహాత్ములకు దాహశాంతి గావింపఁ జాలని నా జన్మమేల కాల్పనా? వారు చెప్పినట్టు గొడ్డుటావు ఊసర

క్షేత్రము పోలికి నేనుండియు నాభర్త కేమిలాభము? అని నానావిధములఁ బరితపించుచుండ నింతలో మృకండుఁ డింటికి వచ్చి మొగము వ్రేలాడవేసికొని కన్నీరు గాఱ దుఃఖించు భార్యను జూచి కారణ మేమని యడిగెను. ఆమెయును జరగినదంతయుఁ దెలిపి తన నిర్భాగ్యదశకుఁ బలవించెను. అప్పుడు మృకండుఁ డిట్లనియె. 'ప్రియా! నీ విట్లు దుఃఖింపనేల? ఆ మహాత్ములు చెప్పినట్లు తపస్సు చేయుదము. దేవతలలో శివుఁడే శీఘ్రముగ ననుగ్రహించి వరము లిచ్చువాఁడు. ఆయనను గూర్చి మనము తపస్సు చేసితిమా మనకుఁ బుత్రసంతానము కలుఁగును' అనిన నామె యియ్యకొనెను. అంత భార్యభర్త లిరువురు శివునిఁ గూర్చి ఘోరముగఁ దపస్సు గావించిరి. శివుఁడు వారికిఁ బ్రత్యక్షమై పుణ్య దంపతులారా! మీ యుద్దేశము నే నెఱుఁగుదును. సుగుణవంతుఁడును, గీర్తిశాలియునగు కుమారుఁడు పదునాఱేండ్లు మాత్ర మాయుస్సు కలవాఁడు కావలయునా? గుణహీనుఁడు, మూఢుఁడు నగువాఁడు శతవత్సరము లాయుస్సు కలవాఁడు కావలయునా? యని యడిగెను. వారిరువు రాలోచించి మహేశ్వరున కిట్లు విన్నవించిరి.

"దేవా! గుణహీనుఁడు జ్ఞానహీనుఁడునగు కొడుకు నూఱుకాదు వేయిసంవత్సరములు బ్రతికినను భూమికి భారమే కాని వానివలనఁ గన్నవారికిఁ గాని లోకమునకుఁగాని లాభము లేదు. అట్టివాఁడు తల్లిదండ్రులకు దుఃఖముమాత్రము గలిగింపం జాలియుండును. అట్టి పుత్రునిగన్న తల్లికంటె గొడ్రాలు శ్రేష్ఠురాలు. కావున నల్పాయువైనను గుణియు, జ్ఞానియు భక్తుఁడునగు పుత్రుని ననుగ్రహింపుము.

అట్ల యగుఁగాకయని ప్రసాదించి పరమేశ్వరుఁడు కానరాకపోయెను. తరువాతఁ గొన్నిదినములకే యామెకు గర్భము నిలిచి సకాలమున నామె కుమారుఁ బ్రసవించెను. ఆ కుమారుఁడే మార్కండేయుఁడు. ఆయన నానాఁటికిఁ బెరిఁగి యుపనీతుఁడై సమస్త విద్యల గ్రహించి పితృభక్తి, గురుభక్తి, దైవభక్తి కలిగి బుద్ధిమంతుఁడని పేరు వహించెను.

ఇట్లుండఁ దల్లి కడుపులో చిచ్చిడుచు నాయనకుఁ బదునాఱవ యేండు ప్రాప్తించెను. పుత్రున కావిషయ మేమియుఁ జెప్పక తల్లి తనలోనే దుఃఖించుచుండెను. పదునాఱవయేఁడు ముగియుటకు నొకదినము కొఱఁతయుండెను. ఆనాఁడు తల్లి కుమారునకుఁ దలంటుచుండ నామె కంటినీళ్ళు బాలుని కాళ్ళపైబడెను ఆయన యెగఁజూడఁదల్లి కంటినీళ్ళు వఱదలై కాఱుచుండెను. ఏమియు నెఱుఁగని కుమారుఁడు దిగ్భ్రమగొని "తల్లీ యేల యేడ్చెదవు? నన్ను మునుపటివలె నాదరింపవు. నావంక సరిగాఁ జూడనొల్లవు. చూచినప్పుడు అంతయు నేదో యొక తీరుగ నుంటున్నదానవు. ఇప్పుడేల యిట్లు శోకించుచున్నదానవు? నీవు చెప్పకుండిన నామీఁద నొట్టుసుమీ" యనెను.

తల్లియు దుఃఖమాఁపఁజాలక శివుఁడిచ్చిన వరమును, బదునాఱేఁడులు నాఁటితో నిండుటయుఁ జెప్పెను. "ఆమాటలు విని యీమాత్రమునకా తల్లీ నీవు వగచెదవు? పదునాఱేడుల యాయుస్సు నిచ్చిన శివుఁడు వేయేఁడు లేల యీయఁడు? ఆ శక్తి యున్నప్పు డీశక్తియు నుండును. దీనికి నీవు విచారపడకుము" అని చెప్పి స్నానమొనర్చి శుచియై యొక శుచి ప్రదేశమున శివలింగమును బ్రతిష్ఠించి మనస్సు చలింపనీక తదేకనిష్ఠచే శివుని ధ్యానించుచుండెను.

ఇట్లాయన శివపూజ చేయు సమయమునందే యుదయమయ్యెను. మార్కండేయునకుఁ బదునేడవయేఁడు బ్రాప్తించెను. యమకింకరు లాయనయొద్దకు వచ్చిరి. మీరెవ్వరు? ఏల వచ్చితిరి? అని మార్కండేయుఁ డడిగెను. మేము యమకింకరులము. నిన్నుఁ గొనిపోవచ్చితిమి రారమ్ము అని పాశముల మీఁదవైవ యత్నించిరి. ఇంతలో మార్కండేయుఁ డచ్చటనుండిన విభూతికేలఁ గొని రుద్రమంత్రమున నభిమంత్రించి యుహ్వాని వారిమీఁద నూదెను. దానిచే వారి దేహములు మండఁజొచ్చెను. ఒడలి మంటలకుఁ దాళజాలక కింకరులు పరువిడుచుఁ బోయి యమున కావార్తఁ దెలిపిరి.

వారిని ఛీకొట్టి ధర్మరాజు మఱికొందఱ భటులను మిక్కిలి క్రూరులను బంపెను. వారిమీఁదను మార్కండేయుఁడు బూది మంత్రించి వైచెను. వారును లబలబ మొత్తుకొనుచు మొఱ్ఱోయని పోయి వృత్తాంతమంతయు దండధరునకుఁ దెలిపిరి.

వారి మాటలు విని కాలుఁడు కోపముచే మండిపడుచు నెవ్వఁడురా యా బాలుఁడని కేకలువైచుచు దున్నపోతునెక్కి మార్కండేయుఁడు శివపూజ చేయుచోటికి వచ్చెను.

మార్కండేయుఁడును జడియక "అయ్యా! నీవెవడవు? ఏల వచ్చితివి?" అని యడిగెను. నేను యముఁడను. నీయాయువు నిండినది. నిన్నుఁ గొనిపోవ వచ్చితిని. నాకింకరులఁ బరిభవించితివఁట. నీకంత పోతర మేల?[3] యని బొబ్బలిడుచు పాశమును బాలకునిపై వైచెను. మార్కండేయుఁడును హరహర మహాదేవ! శంభో శంకర? శరణు శరణు" అని లింగమును గట్టిగఁ గౌఁగలించెను.



ఈశ్వరుఁడు యమునిఁ దన్నుట

యముఁడును "ఓరి మూఢుఁడా! నిన్నీ చిదిపి ఱాయియా రక్షించును? నిన్ను నీ లింగమును గూడఁ బెకలించెదఁ జూడుము. నేనెవ్వఁడనో యెఱుఁగవా" యని గర్వోక్తులాడుచు లింగముమీఁదను బాలునిమీఁదను గూడ పాశము వైచెను.

భక్తత్రాణ పరాయణుఁడును బరమదయాళువు నగు పరమేశ్వరుఁడు యముని గర్వోక్తులు సహింపక భక్తుని గాపాడఁ గోరి ఫెళఫెళమను ధ్వని దిక్కులనిండ దివ్య తేజము చూపఱునకు మిఱుమిట్లు కొలుపుచుండ లింగము నుండి శూలహస్తుఁడై యుదయించి కోపోద్రేకమున నెగసి యెడమకాల యముని యురమున బిట్టు దన్నెను. ఆ వ్రేటుపడి యముఁడు నేలఁ ద్రెళ్ళెను. మార్కండేయుఁ డాయనను బెక్కువిధముల స్తుతింపఁగాఁ జిరంజీవివి కమ్మని వరమిచ్చి దేవతలు ప్రార్థింప యముని మరల బ్రతికించి నందివాహనారూఢుఁడై కైలాసమునకుఁ బోయెను. ఈ వార్త మార్కండేయుఁడు తల్లిదండ్రుల కెఱిగింప వారపరిమితానందము నొందిరి.

## 2. అన్నదానమహిమ

ఒకానొక గ్రామమున నొక నిఱుపేద బ్రాహ్మణుఁడు గలఁడు. ఆయన నానాఁటికి భిక్షాటనమున దొరకిన ధాన్యముతో దాను దన భార్య జీవించుచుండెను. ఒకనాఁడొక గృహస్థునింటికిఁ బోయి భిక్షమడిగెను. గోడ మఱుఁగున సంధ్యవార్చుచున్న యీ యింటి యజమానుఁడు భార్యతో "మూఁడు జన్మముల దరిద్రుఁడు వచ్చినాఁడు. వాని కింత భిక్షము" పెట్టుము అనెను. పేదబ్రాహ్మణుఁడీ మాటలు విని "అయ్యో దైవమా! యీయన నన్ను మూఁడుజన్మముల దరిద్రుఁ డనుచున్నాఁడు. ఒక జన్మముననే దారిద్రుఁడనుచున్నాఁడు. ఒక జన్మముననే దారిద్ర్యదుఃఖ మనుభవింపలేక చచ్చుచున్నాను. మూఁడుజన్మముల దారిద్ర్య మెట్లు సహింపఁగలను? దారిద్ర్య దుఃఖమునకు మించినదుఃఖము లోకమున లేదు. అన్నిటికంటె గడ్డిపోఁచ లాఘవము దానికంటె గాలి లాఘవము.

దానికంటెను దరిద్రుఁడు. అని చాల విచారపడుచుఁ జేతి చెంబచ్చటనుంచి గృహస్థును సమీపించి నమస్కరించి యయ్యా! నన్ను మూఁడుజన్మముల దరిద్రుఁడంటిరి. అది మీకెట్లు తెలిసెను?" అని ప్రశ్నించెను.

ఆ గృహమేధి[4] యతనిని జూచి నవ్వుచు నిట్లనియె. "బ్రాహ్మణుఁడా! నీవు పోయినజన్మమున దరిద్రుఁడవగుట నన్నదాన మేమియుఁ జేయవైతివి. కావున నీ జన్మమున నీకు పేదతనము గలిగెను. ఈ జన్మమున దానము చేయుటకు నీ కేమియు లేదు. నీకే లేనప్పుడొకరి కేమి దానము చేసెదవు? కావున మఱుజన్మమునందును నీవు పేదవాఁడవే యగుదువు. అనిన నాబ్రాహ్మణుఁడు దీనుఁడై యిట్లనియె "అయ్యో! యిటుచూచిన మూఁడుజన్మములేల? మూఁడువేల జన్మములైనను నాగతి యింతేకదా? ఇది తప్పించుకొను మార్గమేది?

అనిన గృహస్థుఁడు ''బ్రాహ్మణా! నీకు దొరకిన దానిలోఁ గొంచెమైనను మఱియొక పేదవాని కింత యన్నము పెట్టుము దానివలన నీకుఁ గ్రమక్రమముగ దారిద్ర్యము తొలఁగిపోవును" అని చెప్పెను.

అట్లే కావించెదనని యాపేద బాఁపఁడు నాఁడు మొదలు తనకు దొరకినదానిలో నొక్కనికైన నింత యన్నము పెట్టియే తాను భుజించు చుండెను. ఎవరికిఁ బెట్టక యతఁడు తినుటే మానెను. అతని నియమము తెలిసికొని యా వీధివారతఁడు భిక్షానికి వచ్చిన లేదనువారు పిడికెఁడైన వేయఁజొచ్చిరి. పిడికెఁడు వేయుచుండిన వారు దోసెఁడు వేసిరి. ఇట్లెక్కువగ దొరకినదానిలో మిగల యన్నము నతిథుల కభ్యాగతులకుఁ బెట్టుచు తాను దనభార్య తినుచుండెను గాని మఱునాఁటికని కొంచెమైన దాఁచినవాఁడు గాఁడు.

ఈ వార్త యూరివారి కందఱకుఁ దెలిసి యందఱు వారి వారి శక్తికొలఁది బిచ్చము వేయుచుండిరి. ఎంత వచ్చిన నంతయు నతఁడు

దానము చేయుచుండెను. దీనివలన నితని పేరు చుట్టుపట్టు పల్లెలయం దంతట వ్యాపింప బాటసారులందఱు నాయన యింటికే రాఁజొచ్చిరి. ఒక్కొక్కనాఁడు డెబ్బది యెనుబదిమంది పేదవారాయన యింట భుజించిపోవుచుండిరి. అన్న పూర్ణకు సమానురాలైన యాయన భార్యయు నడిరేయి యతిథులువచ్చినను లేదు కాదనక వండిపెట్టుచుండెను. పురుషుల గౌరవము కాపాడువారు గుణవతులైన సతులేకదా!

ఇట్లు కొన్నిమాసములు జరగ నొకనాఁడీ బ్రాహ్మణుఁడు తన కీయుపాయ ముపదేశించిన గృహస్థునింటికిఁబోయి "యయ్యా! మీరు చెప్పినట్లు చేయుచున్నాను. అన్నదానము చేయని దోషమున నాకు దారిద్ర్యము వచ్చెనని ముందు మీరు చెప్పితిరి. ఇప్పుడన్నదానము చేయుచున్నాను. దీని వలనఁ గలుగు ఫలమేమో చెప్పుఁడు" అని వేఁడెను.

ఆయన యట్టె యాకాశ మెగయజూచి "అయ్యా యన్న దానమహిమ నాకుఁ దెలియదు. దానిని జెప్ప బరమేశ్వరుఁ డొక్కఁడే సమర్థుఁడు. కావున నీవు కాశికిఁబోయి విశ్వనాథు నారాధింపుము. ఆయన నీకుఁ దెలియఁజెప్పును" అని చెప్పెను. బ్రాహ్మణుఁడు నట్లే కావించెద నని యింటకిఁ బోయి తన ప్రయాణవార్త యెఱిఁగించి నీవిప్పుడు జరుపునట్లే మరల నేను వచ్చువఱకు జరుపుచుండు మని భార్యకుఁ జెప్పి బయలుదేఱెను.

ఇట్లు పోవునెడ నాకనాఁ డొక యరణ్యమధ్యమునఁ జను సమయమునఁ బ్రొద్దుగ్రుంకెను. సంజకెంజాయలు వ్యాపించెను. పక్షులు గూండ్లు చేర నాకసమున బారులుదీరి పాఱెను. అరచేతి గీఁతలు కానరాక వచ్చెను. అట్టియెడ నాయనకొక గుడిసె కనిపించెను. దానిం జేరఁబోయి చూడనందొక బోయవాఁడు వాని భార్యయు నుండిరి. ఆబోయవాఁడీ బ్రాహ్మణు వృత్తాంతమంతయు విని యాయన యాకట దస్సి యుండుట కని "వేళ గాని వేళ వచ్చితివి అయ్యా! నీకు నేనేమి యియ్యఁగలను. ఇది ఘోరారణ్యము. ఇఁక సంచారమునకు నదనుగాదు నీ వెట్లు వంట

చేసికొనెదవు? మా కుండలు నీకుఁ బనికిరావు కదా. అయినను నేనొక యుపాయము చేసెదను. మా యింట సారపప్పు ముంతమామిడి పప్పు గలవు. వాని నిచ్చెదను తినుము త్రాగుటకుఁ దేనె నిచ్చెదను. ఉదయమైన వెనుక నీ కన్నము దొరకు నుపాయము చేసెదను." అని చెప్పి యవి యన్నియు బ్రాహ్మణున కిచ్చెను. ఆఁకలి గొని యున్నవాఁడగుట బ్రాహ్మణుఁడవి యన్నియు భక్షించి శ్రమము దీర్చుకొనెను.

ఇట్లు బడలిక దీర్చుకొనిన బ్రాహ్మణుఁ జూచి బోయవాఁడు "అయ్యా రాత్రులందుఁ గ్రింద నుండరాదు. అడవి జంతువులు చంపును. ఇదిగో నేను నా భార్యయుఁ బరుండు మంచె. దానిపై నీవును నాభార్యయుఁ బరుండుఁడు. దాని యం దిరువురకు మించి యెడములేదు. నేను విల్లునమ్ములు పూని తిరుగుచు నన్ను, మిమ్ములను రక్షించెదను." అనిన బ్రాహ్మణుఁడు "హరిహరీ! నీ భార్య ప్రక్కన నేనెట్లు పరుండుదును. నేను బండుకొనను. నేనే క్రింద నుండెదను. లేక మన మిరువురము క్రింద నుందము" అనిన నతఁడిట్లనియె.

"బ్రాహ్మణా! నీ విట్లు చెప్పరాదు. నీ వతిథివి. నిన్ను రక్షింపవలసిన భారమునాది. నీవు క్రిందనుండి నిన్ను నీవు రక్షించుకొనినఁ జాలవు.



బోయను బులి చంపుట

నేనైన రక్షించుకొనఁగలను. నీవు దుష్టుఁడవని తోఁచిన నాభార్య ప్రక్కలోఁ బండుకొనుమని చెప్పుదునా? కావున నిర్భయుఁడవై శంక[5]మాని పరుండుము" అని యొప్పించి యాయనను దన భార్యతోడ మంచెపైఁ బరుండఁజేసి తాను విల్లు నమ్ములు ధరించి క్రింద మంచెచుట్టు తిరుగుచుండెను. ఇట్లు తిరుగుచు నర్ధరాత్రమున నిద్రనాఁపఁజాలక కొంచెము తూఁగి హెచ్చరిక తప్పియుండు సమయమునఁ దటాలునఁ బులి వచ్చి వాని నీడ్చుకొనిపోయెను.

ఉదయమున బోయతయు బ్రాహ్మణుఁడు నిద్దుర లేచి చూడ బోయవాఁడు గాన రాఁడయ్యెను. నెత్తురు బొట్టులు నేలంబడి యుండెను. వెదకుచుఁబోవ శవము గానవచ్చెను. వారిరువురు చాల దుఃఖించిరి.

తరువాత బ్రాహ్మణుఁడు చక్కఁగఁ బయనించి కాశిఁజేరి విశ్వనాథు దర్శించి "దేవా! నా కన్నదాన మహిమ చెప్పువఱకు నేను నిన్ను విడిచిపోవ" నని యందె నిలిచి తపస్సు చేసెను. అప్పుడు శివుఁడాయన శ్రద్ధా భక్తులకు మెచ్చి యనుగ్రహించి "విప్రుఁడా! నీ వీ పండుకొనిపోయి యీ యూరిరాజున కిమ్ము. ఆయన బిడ్డలు లేక యనేక దానధర్మములు చేయుచున్నాఁడు. ఈ పండాయన కిచ్చి రాజా! ఫలమును నీ భార్యకిచ్చి శుచివై భుజింపు'' మని చెప్పుము. ''నీకుఁ జక్కనికుమారుఁడ దుదయించును. ఆ జన్మించిన కుమారుని నొక బంగారు పళ్ళెరమునఁ బట్టుకొని యట్లె నాయొద్దకుఁ దేవలయును. నేనాశిశువుతో గొన్ని మాటలు మాటలాడి పిదప మీ శిశువును మీకిచ్చెదను" అని చెప్పుము. ఆ పుట్టిన శిశువును నీయొద్దకుఁ దెచ్చినపుడు "కుమారా! నా కన్నదాన మహిమ చెప్పుము" అని యడుగుము. "ఆ శిశువు నీకుఁ జెప్పును" అని ఫలమిచ్చి తిరోహితుఁడయ్యెను.

బ్రాహ్మణుఁడు మిగుల సంతోషించి యా ఫలమును గ్రహించి రాజును దర్శించి పరమేశ్వరుఁడు తనకు జెప్పిన విధముగ రాజుతోఁ జెప్పెను. రాజును మిక్కిలి యానందించి బ్రాహ్మణుని కోరిక తప్పక

నెఱవేర్చెదనని చెప్పి యా ఫలమును దనభార్య కిచ్చి కుమారుఁ డుదయించువఱకు నీవిందే యుండుమని యాయనకుఁ దగిన విడిదిని బరిచారకుల నేర్పరచి యాయనకుఁ గావలసిన సామగ్రియంతయుఁ బంపుచుండెను. బ్రాహ్మణుఁ డవారిగ నన్నదానము చేయుచుఁ బదిమాసములు కాశియందే యుండెను.



బ్రాహ్మణుఁడు శిశువును అన్నదానమహిమ నడుగుట

పదియవమాసమున రాజుభార్య ప్రసవించెను. నీళ్ళాడు సమయమునకు ముందే రాజు బ్రాహ్మణునితోడఁ బురుటింటి కడనుండెను. శిశువు ప్రభవింపఁగనే దాదులు బంగరు పళ్లెరములో శిశువు నుంచుకొని వచ్చి బ్రాహ్మణుచేత నిడిరి. బ్రాహ్మణుఁ డందఱ నావలఁ బొమ్మని యా శిశువుపై శివుడు చెప్పినట్లు మంత్రజలములు చల్లి రాజకుమారా! అన్నదాన మహిమఁ జెప్పుమా" యని యడిగెను.

ఆ మాటలు విని శిశువు పకపక నవ్వి బ్రాహ్మణోత్తమా! యన్నదాన మహిమ చెప్ప నా తరముగాదు. అయిన నొకటి చెప్పెదను. నన్నెవ్వనిఁగా తలఁచితివో కాని యానాఁడు నడవిలో రాత్రిసమయమున నాఁకలిగొన్న నీకు పప్పులు తేనె యిచ్చిన బోయవాఁడను నేనే. ఆ పుణ్యముచే నిప్పుడు

రాజకుమారుఁడనై పుట్టి రాజ భోగము లనుభవించుచున్నాను. ఒకపూఁట దానమునకే యింత మహిమ యుండిన బ్రతిదిన మనేకుల కన్నదానము చేయువారి పుణ్యమెట్టిదో నీవే యూహింపుము. నేను జెప్పఁజాలను" అని మరల కావుకావని యేడువ నారంభించెను. బ్రాహ్మణుఁడా శిశువును గొనివచ్చి రాజునకిచ్చెను. రాజు బ్రాహ్మణునిపట్ల నత్యంత ప్రీతి విశ్వాసములు కలవాఁడై కావలసినంత ధనమిచ్చి తగిన పరివారముతో నాయన స్వగ్రామమునకుఁ బంపెను.

బ్రాహ్మణుఁడు తొలుతటి గృహస్థున కీ వృత్తాంతమంతయుఁ దెలిపి నీవలన బాగుపడితి నని శ్లాఘించెను.

### 3. తోడవచ్చునవి పుణ్యపాపములు రెండే

ఒకానొక పట్టణమున నొక ధనికుఁడగు కుటుంబి గలఁడు. అతనికి నొక్కతెయే కూఁతురు. దానికి వివాహ యోగ్యకాలము వచ్చినందున మఱియొక గొప్పకుటుంబము వారి పిల్లవానికిచ్చిచ వివాహము కావింపఁబడెను. పెండ్లియందు పెండ్లికూఁతురు తన మగఁడు రూపరిగా నుండఁగోరును. మామగా రల్లుఁడు చదువరిగా నుండఁగోరును. అత్తగా రల్లుఁడు ధనవంతుఁడైన తన బిడ్డకు విశేష మాభరణము లిచ్చువాఁడుగా నుండఁగోరును. బంధువులు పెండ్లికొడుకు నడవడి చక్కఁగా నుండఁ గోరుదురు. తక్కినవారు పప్పన్నము గోరుదురన్నట్టు లీవివాహమునఁ బెండ్లికొడుకు ధనవంతుఁడు రూపసి, విద్యావంతుఁడు, యౌవనపురుషుఁడు శీలముగలవాఁడు గావున రెండువంకలవారి బంధువులనేకు లీ వివాహము చూడఁగోరి వచ్చిరి. పూర్వుల యభిప్రాయమింతయే. గాడిదవలెఁ బిల్లను బెంచి సంవత్సరమునకు నూఱు, ఇన్నూఱు రూపాయలవంతున వెల తీసికొని విక్రయింతమని కాని వరదక్షిణయని మామగారిని బికారిని చేయవలయునని కాని తలఁచు చండాలురు పూర్వము ఆర్యులందు లేరు.

నాలుగవనాఁడు నాగవల్లి జరుగుచుండెను. పెండ్లికొడుకు పెండ్లికూఁతురు పీఁటలపై గూర్చుండిరి. పురోహితుఁ డూపిరి త్రిప్పుకొనక మంత్రములు పాడుచుండెను. పెండ్లి పెద్దలు ముత్తైదువలు వేఱు వేఱు చాఁపలపై విలువగల వలువలు ఆభరణములు ధరించి ప్రత్యేకస్థలములఁ గూర్చుండి యుండిరి. అప్పుడా దొడ్డిలో గాఁటఁ గట్టియుంచిన యావొకటి తలుగు తప్పించుకొని రేఁగి చిఱ్ఱుముఱ్ఱాడుచు వెనుకఁ కాళ్ళ జాడించి తన్నుచు ముందువచ్చు వారిని హుమ్మని క్రుమ్మఁ బోవుచు నింటఁదూఱి కలవరము పుట్టించి పెండ్లి మంటపములోఁ జొరఁబడెను. అందుఁ గూర్చున్న వారందఱు మూలమూల దాఁగువారును వాకిటికిఁ బరువెత్తువారు నైరి. అల్లకల్లోలమయ్యెను. వధూవరులు పీఁటలమీఁదనుండి లేచి పరువెత్తిరి. ఆసందడిలో నా యావు పెండ్లికొడుకును బొడిచి చంపి వీథిలోనికిఁ బరువెత్తెను.

అప్పుడా పెండ్లియింటి వార్త యేమని చెప్పను? అందున్నవారందఱు గొల్లున నొక్కసారిగ నెలుఁగెత్తి యేడ్చిరి. ఏమేమని వీథిలో నున్నవారందఱు నింటిలోనికి వచ్చి పీనుఁగైపడిన పెండ్లికొడుకు కళేబరమును జూచిరి. ఆఁడువారందఱు దాని చుట్టుచేరి గీబాయని యేడువసాగిరి. చూచిన యమ్మలక్కలు "ఈ పుట్టుకుంకది యెంత నిర్భాగ్య జాతకమమ్మా" యని కొందఱు "ఔరా దీని ముత్తైదువ పోఁడిమి నిశ్చితార్థమునాఁడే నీల్గవలసిన మగఁడు త్రాటిబలముచేఁ దలంబ్రాలదాఁక నుండినాఁ"డని కొందఱు "బంగారు బొమ్మవంటి పిల్లకీ పాడువ్రాఁత యెక్కడ వ్రాసెనే పాపి బ్రహ్మదేవుఁడు" అని కొందఱు "అయిన నేమాయెలే. అత్తగారింటఁ గావలసినంత మఱుగుచున్నది తినుటకు" అని కొందఱు "అంతయు దీని కిత్తురా దత్తుని దీసికొనక?" అని కొందఱు "ఆ సొత్తేటికే? పుట్టినింటనే యున్నదే తాను దిన్నంత యొకరికిఁ బెట్టినంత. ఇక్కడమాత్రము వేయిమంది వ్రేలాడుచున్నారా" అని నానా విధములఁ బలుకుచుండిరి.

తాము బదులు తిట్టుపడక తమకు సరిపడనివారిని దిట్టుటకు స్త్రీలకిదే సమయము గావున నీ పనిని కొందఱు చేయుచుండిరి. పెండ్లికూఁతుతల్లి బిడ్డను తనయొద్దఁ గూర్చుండఁ బెట్టుకొని "యీ యర్థాయుస్సువాఁడు నీ కెక్కడ దాపరించెనే తల్లీ! ఈ పాడు సంబంధము మనకు వలదో యని నెత్తిన నోరుపెట్టుకొని కొట్టుకొంటిని. ఆయిన నా మాట సాగనిచ్చినవాఁడు కాఁడు ఇప్పుడు నిన్నుఁ గలకాల మెదాన వేసికొని యేడువవలసినదానను నేనా తానా. మగవాండ్రకు నాఁడుదానిమాట సాగింపవచ్చునా యని యొక పట్టుదలే కాని ముందు వెనుక యాలోచన లేదు. మంగళసూత్రము ముట్టఁ బోవునపుడే యెవరో తసక్కున తుమ్మిరి. అప్పుడే నా కడుపులో రాయిపడెను. చిలుకవంటిదానిని గొంతు కోయలేక యాయన యీ పనిచేసెను. నిన్ను నేనెట్లు భరింతును? నిన్ను నేనెట్లు భరింతును? నిన్ను బావిలోఁ ద్రోసి నేను బడెదను పదమని పిల్లచేతిని బట్టుకొని బఱబఱ కొన్ని యడుగులు లీడ్చెను. ఇవన్ని వేషములని తెలిసియు నడ్డము పోకుండిన బాగుగాదని కొందఱు ఆఁ ఆఁయని యామె కడ్డము వచ్చిరి. పీనుఁగునకు మఱియొక వైపు పెండ్లికొడుకు తల్లిగూర్చుండి "అయ్యో కొడుకా! యెక్కడఁ బోయితివిరా కొడుకా! నా కడుపులోఁ జిచ్చు పెట్టితివే కొడుకా! ఇఁక నాగతి యేమిరా నాయనా! యీ వివాహశ్రాద్ధ మేల వచ్చెరా తండ్రీ! యీ పుట్టుకుంక నీ కెక్కడ మృత్యువై కాచుకొని యుండెరా బిడ్డా! కలసికొనిన కనుబొమలు, మేనినిండ వెంట్రుకలు, నేల తగులని చిటికెన వ్రేలు చూచినపుడే యీ పిల్ల మనకు వలదంటినే. నేను బెండ్లికి రానని బావిలోఁ గాళ్ళు వ్రేలాడ వేసికొని కూర్చుండ వలసియుండెను. నలుగురిలో నగడే యని భయపడితిని. దాని ఫలమనుభవించుచున్నాను. ఇది పిల్లకాదురా నాయనా నీ పాలి పిడుగురా" యని యేడ్చుచుండెను. ఉపచరింపవచ్చిన యాఁడువారు తమ మగలను, కొడుకులను మొదలయినవారిని దలఁచుకొని దుఃఖపడుచుండిరి. దుఃఖము తక్కువఁగా గల వారు

తక్కినవారికంటె గొంతెత్తి యెక్కువగా నేడ్చుచు, నడివీధి నుండియే ఱొమ్ములు బాదుకొనుచు వచ్చిరి. దుఃఖమెంత తక్కువో యార్భాట మంత యెక్కువ. శోకాగ్ని దుస్సహమైనచో నోట మాటరాదు. కంట నీరు కాఱదు.

కొంతసేపటికిఁ జూడవచ్చిన వరందఱొకరి వెంకనొకరు కడప దాఁటునఱకు మొగములు వ్రేలవైచుకొని దుఃఖము నటించుచుఁ బోయిరి. ఇక్కడ నుండినఁ బీనుఁగును మోయుమందురేమో యని బంధువులలో మగవారందఱు వారివారి మూట లెత్తుకొని చాటు చాటుగ ముఖము తప్పించి పోయిరిగాని తాము తమవారు చచ్చినపుడు తమ గతియేమోయను జ్ఞానముగాని ధర్మార్థముగఁ బీనుఁగును మోసిన నెంతో పుణ్యమని గాని యా నీచులకుఁ దోఁచినదిగాదు. ఈ నరపశువులకుఁ దాము శిలాశాత్వతముగ నుందుమని యభిప్రాయమేమో!

పెండ్లికొడుకు దేహమునుండి వెడలిపోయిన జీవుని యమకింకరులు యమునిముందల నిలిపిరి. అప్పుడా జీవుఁడు యమునిఁజూచి "ధర్మరాజా! నేను పిన్నవయస్సువాఁడను. ఒక్క సుఖమైన ననుభవించినవాఁడను గాను. అది యెట్లుండినను మంచి వివాహసమయమున నన్ను వీరు కొనివచ్చిరి. నేను దేహమునుండి వెడలి వచ్చినతరువాత నా తల్లిదండ్రులు నత్తమామలు భార్య బంధువులు అందఱు నాకై వారు సహింపరాని దుఃఖముచే నిప్పుడ చచ్చునట్టున్నవారు. కావునఁ గరుణించి నన్ను మరలఁ బంపుము. వారి కందఱకు నేనే ప్రాణమనై యున్నాను." అని దీనుఁడై చెప్పుకొనెను.

ఆ మాటలు విని ధర్మరాజు పకపక నవ్వి "మూఢుఁడా! నీకై వారు ప్రాణము విడుచునట్లున్నారా?" అనెను. అవునని జీవుఁడు చెప్పెను. అట్లైన, నీవారిలో నెవరినైన సరే, ఒక స్త్రీనిగాని పురుషునిగాని నీకు మాఱుగఁ బంపుము ఒక దినము గడువు, నిన్ను క్షమించి యిఁకఁ గొన్ని సంవత్సరములు భూమిపై బ్రదుకఁ జేసెదను. "కింకరులారా![6] యితని మరలఁ గొనిపోయి వీని దేహమున జేర్పుఁడు" అని చెప్పెను. వారట్లే కావించిరి.

ఇంతలోఁ బురోహితుఁడు నలుగురు వాహకులను నొక కూలి బ్రాహ్మణుని బిలిచికొని వచ్చి బ్రాహ్మణుని స్నానముచేసి రమ్మని దర్భయొకటి వధువుచేతికిచ్చి దాని నా కూలివానిచేతి కిప్పించి హరిః ఓం అని కర్మము ప్రారంభము చేసెను. బిందెతో నీళ్ళుదెచ్చి కూలిబ్రాహ్మణుఁడు శవము మీఁదఁ బోయ యత్నించుచుండ నది కన్నులు తెఱచి కాలుసేతులు కదలించెను. అల్లుఁడు బ్రదికె బ్రదికెనని యందఱు సంతోషించిరి. అట్లు విడిచిపోయిన బంధువులందఱు మరలి వచ్చి చూచి రహస్యముగా నెత్తికొనిపోయిన తమ మూటల నెల్ల రహస్యముగానే యొక టొకటిగఁ దెచ్చి యెప్పటిచోటుల నుంచి యా పెండ్లికొడుకును జుట్టుకొనిరి. ఇంతలో నొకఁడు వచ్చి కాలివ్రేళ్ళు చేతివ్రేళ్ళు కదియఁగట్టిన కట్లు విప్పివైచెను. పెండ్లికొడుకు లేచి కూర్చుండి కొంతసేపు తన్ను మాటలాడింపవలదని సైగచేసి బడలిక తీర్చుకొనుచు నూరకుండెను. అందఱు నేమియదృష్టము చచ్చినవాఁడు బ్రదికెనని ముచ్చట లాడుచుండిరి. పెండ్లికూఁతు తల్లి మాబిడ్డత్రాడు బంగారు త్రాడు గనుకనే చచ్చినవాఁడు బ్రదికెను. మాపిల్ల నిర్భాగ్యురాలని యన్ననోళ్ళ నిప్పు దేమిచేయవలయును? అని యఱచు చుండెను. పెండ్లికొడుకు తల్లి నా కడుపు చలువకొలఁది మరల నా కొడుకు బ్రదికెను. నేనెన్నఁడైన నొకరి నేడిపించి యుండినఁ గదా నాకు కడుపుదుఃఖము వచ్చును. నేను బుద్ధియెఱిఁగి యొక పాపము చేసినదానను గాను అని చేతులు త్రిప్పుచుండెను. బంధువు లందఱు తమతమ యదృష్టమును మెచ్చుకొనుచు విందున కెదురుచూచుచుండిరి.

అంతటఁ గొంతసేపటికిఁ బెండ్లికుమారుఁడు తన తల్లిదండ్రులను అత్తమామలను బంధువులను అందఱను బిలిచి కూర్చుండుఁడని చెప్పెను. అత్తగారు దగ్గఱ కూర్చుండి నాయనా నీకుఁ గలిగిన కష్టదశకు మేమిందరము చావనుంటిమి. మా యదృష్టము నిన్ను మరల బ్రతికించెను అని యూరార్చెను. తక్కినవారు నట్లే పలికిరి. వారి నెల్ల నూరకుండుఁ డని చెప్పి యావరుఁడు యమునకుఁ దనకు జరగిన భాషణము,

యముఁడు చెప్పిన మాట తనకొక దినము గడువు నొసంగుట తెలయఁబఱిచి యిట్లనియె. నామీఁదఁ బ్రీతిగల యిందఱలో నొకరు నాకై యమలోకమునకుఁ బోవ నియ్యకొంటిరేని బ్రతికియుందును అని చెప్పఁగానే యచ్చట గుంపు గూడిన యందఱు నొకరి మొగ మొకరు చూడనారంభించిరి.

అంతగా నేడ్చుచున్న వారిలో నొక యాఁడుదిగాని యొక మగవాఁడుగాని నీ మాఱు నేను బోయెదనని పలుకలేదు. అందఱు బెల్లముగొట్టిన ఱాలవలెఁ కూర్చుండియుండుట చూచి పెండ్లికూఁతురు అమ్మా నేను బోయెదనే యనెను. దాని తల్లి యామాటవిని "సరేలే బాగుగఁ జెప్పితివి. నీకోసరమై నేను జేసినవి యెన్నినోములో యెన్ని వ్రతాలో యెన్ని యుపవాసములో తుదకు నేల యులుకుకొని కూడుతింటిని నీవు పోయిన మాగతి యేమి? కూఁతురు లేకపోయిన నల్లుఁ డేమి యల్లుఁడే. నీయత్తగారిని పొమ్మను. అని చెప్పి యా పిల్లను దూరముగ జేయిపట్టి లాగుకొనిపోయెను. ఎటులే మఱియని యాపిల్ల దుఃఖించెను. తల్లి "యిదేమో యిట్లు పిల్లచేష్టలు చేసెదవు? ఉండి సుఖపడవలయునా? పోవలయునా? నీకై నేను బోవుటకు సిద్ధముగానేయున్నాను. నాకేమి భయము లేదు. నేనుపోయిన నీకుఁ గడుపుచూచి కూడుపెట్టి తలచూచి నీళ్ళుపోయు వారెవ్వరే? నేనత్తగారింటికిఁ బోయెదనందువేమో. మీ తండ్రికి మరలఁ బెండ్లిచేసికొను ప్రాయము కాదు. ఊరకుండు ప్రాయముగాదు. ఆయన గతి యేమే? అదే నాకు విచారము. డబ్బుకలదు కావున నెవ్వరైనఁ బిల్లనిచ్చెదరనుకో, నీ సవతితల్లి నిన్నింటిలో నుండనిచ్చునా? తల్లి చచ్చినఁ గడుపు పెద్ద తలమాసినఁ గొప్పు పెద్ద"యను సామెత యెఱుఁగవా? తండ్రి లేఁడా యందువేమో? తల్లి చచ్చినఁ దండ్రి పిన్నతండ్రి యనుకో. తల్లితోఁ బుట్టినిల్లుసరి. కాఁబట్టి నేను బోవ సందేహించుచున్నాను. ఆయనను బొమ్మన వచ్చును. తరువాత నాగతి? పసుపు కుంకుమునకు గూడ నోమకుందునే. ఇంతసేపు నా కొడుకా నా కొడుకా యని వగలేడ్పు

లేద్చుచుండెనే నీ యత్త. ఆమె పోవునులే. ఇప్పుడామె యుండి యెవ్వరి నుద్ధరింపవలె. నీ మామగారి కింత కాఁచిపోయుటకు నీవున్నావు చాలును" అని మరల నల్లుని వంకఁ దిరిగి వంగి చూచినది కాదు.

మామ యిట్లు లాలోచించెను. "నేను నూర్లకొలఁది వడ్డికిచ్చి యున్నాను. వానిలోఁ గొన్ని రేపోనేఁడో గడువు మీఱునవి. వెంటనే రాఁబట్టక పోయినవి మునిగిపోవును. పెండ్లాము బిడ్డ కష్టపడవలసి వచ్చును. నేను తటాలున నిప్పుడు కన్నులు మూసికొంటినా కాఁపులు భూములు మావేయని యందురు. వారితో వ్యవహార మాడుశక్తి యాఁడు వారి కున్నదా? నేనీయవలసిన వారేమో యందఱొక సారిగ వచ్చి మాపైకము పెట్టుమందురు. కొందఱు లేని బాకీలు చెప్పుదురు. కొందఱు తప్పుపత్రముల సృజింతురు. ఇందఱు వచ్చి యేక కాలమునఁ బట్టుకొనిన నది యొక్కతె చిన్నది ముగ్ధ యేమిచేయఁగలదు? ఎవరి కేమి సమాధానము చెప్పఁగలదు? ఎవని తొందర వానిది. నాకేమి చెప్పెదవు నాకేమి చెప్పెదవు అని ప్రతి మనుష్యుఁడు నడుగును. ఇదే సమయమని దాని తల్లి తోడు లింటఁజేరి యచ్చిక బుచ్చిక లాడి నచ్చిక మచ్చికలతో నిల్లుపునాదితోఁ గూడ లేవఁదీసి "అస్మద్గురుభ్యోనమః యని గురుఁడు అటుక చేతికిచ్చెన్" అని నా భార్యను వీధివెంటఁ బంపుదురు. అటుగాక నా పెండ్లాము చిన్నవయస్సుది. ఇంత డబ్బు చేతికి రాఁగానే దాని కేమి దుర్బుద్ధి పుట్టి యంతయుఁ బాడుచేయునో. అయినను నది బుద్ధిమంతురాలు. అట్లు చేయదుగాని కల్ల కపటము తెలియని యంబేద ముందువెనుక తెలియని ముగుద. నోరులేని గోల మగఁడు గదా యను మచ్చికచే నామీఁద సవారితీయును గాని బయట రాగి దమ్మిడికిఁ గొఱగాదు. కావునఁ గ్రింద మీఁదు దెలియక ప్రవర్తించు నేమో యని సందేహము. ఈ యసందర్భములు లేకుండిన నేను మహారాజువలెఁ బోయి యుందును. నాకింకేమి కావలసియున్నది.

అత్తమామల మాటలు విని పెండ్లికొడుకు తల్లిదండ్రులను జూచి మీ రేమనెదరనెను. అప్పుడు తల్లి యిట్లనియె. "నాయనా! నీ ప్రాణముకంటె నా ప్రాణ మెక్కువకాదు. కొడుకును గోడలిని పెట్టుకొని సుఖముగ సంసారము నడపుచుండవలయునని నేను వెయ్యి దేవతలకు మ్రొక్కుచుంటిని. నా పాపముకొలఁది సెలవుగా నెలమీఁద ప్రొద్దు గడచెను. ఆడంగులంద ఱేమేమో యనుకొనుచున్నారు. చచ్చుటకు సిద్ధముగా నున్నాను గాని భ్రూణహత్య వచ్చునని వీరందఱు చెప్పుచున్నారు. నేను బోయిన పిమ్మట మీరు భార్యాభర్తలు విచారించి వేళకింత యన్నము పెట్టువారెవరు? పుట్టుకోడలని పేరుతెచ్చుకొని నీ పెండ్లామేకదా యింత సంసారము నిర్వహింపవలయును, పాపము! అది చిన్నది. పుట్టినింట గోముగఁ బెరిఁగినది పనిపాట తెలిసినదికాదు. సంసారమేమి నిర్వహింపఁగలదు? నీకు నీ తండ్రికేమి యుపచారము చేయగలదు? ఒకవేళ నీ తండ్రి వేఱు పెండ్లి చేసికొనెనా యప్పుడు సవతి తల్లి పోరాటము నీవెట్లు పడఁగలవు? నిన్నది యిల్లు వెడలఁ గొట్టునో విషమే పెట్టునో? ఈ చీరలు ఈ సొమ్ములు దాని పాలుచేసి యెట్లు పోదును? నీకే యాగతి వచ్చినపుడు నీ పెండ్లాము గతి యేమి?

తండ్రి యిట్లనుకొనెను. "ఏమిది చిత్రము! యమలోకమునకుఁ బోవుట గడువుతీసికొని వచ్చుట యిది నమ్మఁదగినదా? వాని వాని కర్మముకొలఁది వాని వాని యాయుస్సు తీఱినపుడు వాఁడు వాఁడు మరణించును గాని తనకై మఱియొకఁడు చచ్చినఁ దాను బ్రదుకుదు నను మాట పిచ్చిమాట! ఇంకను ఆయుస్సుండి భూమిమీఁద ప్రారబ్ధ మనుభవింపవలసిన వారిని యముఁడెట్లు చంపఁగలఁడు? ఒకవేళ యముఁడు తానై కొనిపోయినఁ బోనీ, తానై ప్రాణమిచ్చుట కంగీకరించుట యాత్మహత్య కంగీకరించుట గదా! అది మహాపాపకార్యము. చచ్చినవారి దేహములో భూతములు చొరఁబడి పలుకుచుండు నందురు. ఇది యట్టిదేమో? ఒకవేళ యీ పసివానిమాట నిజమే యయిన వాని మా

లెవ్వరు చావకుండిన వాఁడే చచ్చునేమో. అంతకు వచ్చిన మనయత్న మేమున్నది? నేనుండిన ఱేపీ వేళకు మఱియొక కొడుకును బుట్టింపఁ గలను. నేను బోయినఁ దరువాత గతియేమి? యని వేదాంత విచారము చేయుచు నేమియుఁ జెప్పక యూరకుండెను. అప్పుడందఱుచేరి యింటిలోనున్న ముసలవ్వ యొద్దకేగి యవ్వా! నీ మనుమనికై నీవు ప్రాణమిచ్చెదవా? అన్ని సుఖములు దుఃఖములు నీ వనుభవించితివి గదా? ఇఁక నీకేమి కావలసియున్నది? అనిరి.

ఆమె మొగమంతయుఁ గన్నులు చేసికొని "బళబళాబాగున్నది. నా బ్రదుకు మీకంత బరువుగా నున్నదికదా. నాకుఁ బెట్టెడు పిడికెఁడు మెతుకులకే మీకు దారిద్ర్యము వచ్చెనా? నన్నుఁ జావుమనకుండిన మీరే చావరాదా? వెయ్యినెలలు బ్రతికిన మరల జన్మము లేదందురు అది మొన్ననే కదా గడచెను. నాకుఁ దెలియును. నన్నుఁ జూచిన మీకందఱకుఁ గన్నులు మెఱమెఱె. ఈ నెపముపెట్టియైన నన్ను గొంతుపిసికి చంపఁ జూచెదరు? అయ్యో! ముసలిముండ గదా యాదరింతమని లేక చావు మనెదరా? ఛీ! మీ ముఖములు చూడరాదు. నేను మీకంత బరువైన బిచ్చమెత్తుకొని బ్రతికెదలెండు" అని లేచి కట్టెయూఁత పొడుచుకొనుచుఁ బడుచు లేచుచు వీథిలోనికిఁ బోయి యఱచుచుండును.

తక్కిన బంధువులందఱు "ఇదేమి చిత్రము. చచ్చిన వారివెంట నెవరు చచ్చెదరు? కృష్ణుఁడు కాళియుని మడుఁగులోఁ బడి చచ్చినట్లున్నప్పుడు యశోదానందులు గోపికలు నొడ్డునుండి యేడ్చుచుండిరిగాని యెవరైన మడుఁగులోఁ దూఁకిరా? మన కేల యీ పీడ. మనంతట మనముపోయిన తరువాత వారి యిష్టము. అని యందఱు వెడలిపోయిరి. ఈ సజగుజలలో గడువు దాఁటిపోయెను. పెండ్లికొడుకు మరలఁ జచ్చిపడెను. అప్పుడు మరల నందఱు చేరి అయ్యో! హాస్యముగఁ జెప్పెనని యనుకొంటిమని కొందఱు భూతావేశమని కొందఱు యథాప్రకార మేడ్చుచుండిరి.

జీవుఁడు మరల యమునియొద్దకుఁ గొనిపోఁబడెను. యముఁడతనిఁ జూచి నవ్వుచు నేమయ్యా! నీవే మరల వచ్చితివి నీవే ప్రాణమని చెప్పుచుండిన వారిలో నొకరైనవచ్చుట కంగీకరింపలేదా" యనెను. లేదని జీవుఁడు చెప్పెను.

"బంధువుల ప్రీతి యెట్టిదో నీకుఁ దెలియుటకై నిన్ను మరలఁ బంపితిని. వరునకై యేడ్చువారు లోకమున లేరు. ఒకఁడు మరణించిన యెడలఁ దమకుఁ గలిగిన నష్టమునకై యందఱు నేడ్చువారే. కొందఱకు ధననష్టము. కొందఱకు సంతోషనష్టము. కొందఱకు సుఖనష్టము. ఇట్టులే యందఱు కన్న తల్లిదండ్రులే ఇట్టివారై యుండఁ దక్కినవారిమాట చెప్పనేల? చుట్టాలందఱు దొంగలని నమ్ముము. తమ లాభమునకై నీ యొద్దఁ జేరుదురు గాని కేవలము నీ నిమిత్తమై కాదు. ఇంటఁ జేరి యడిగి కొంత, యడుగక



ముసలవ్వ కోపించి పోవుట

కొంత, దొంగ తనముగాఁ గొంత, దొరతనముగాఁ గొంత, యిచ్చకాలచేఁ గొంత నానావిధముల హరించుచుందురు. కావునఁ బ్రీతిగలిగినట్టు మాటలు చెప్పినంత మాత్రముచేతనే వారి మాటలు నమ్మిన నీకు జ్ఞానము కలుగుటకై యిటు చేసితిని. ఇఁకనైన దెలివిగలిగి పుణ్యపాపములు రెండే నీ వెంట వచ్చునని యెఱిఁగి పుణ్యకార్యములు చేయుచుండుము. ఋణానుబంధము కొలఁది దాపరించినవారు నిన్నుద్ధరించునని విశ్వసించి యాయనను ధ్యానించుచుండుము. నీవు చేసిన పుణ్యపాపముల ఫలమనుభవింపఁ బొమ్ము" అని పంపెను.

### 4. భక్తుల యోగక్షేమములు భగవంతుఁడే వహించును

ఒకానొక బ్రాహ్మణమిథునము వానప్రస్థాశ్రమమునఁ జరించుచు మహారణ్యమున వసించుచుండెను. ఆ దంపతులకొక కుమారుఁ డుదయించెను. ఆ శిశువు పుట్టిన కొన్ని మాసములకే తల్లి మరణించెను. తండ్రియే యా శిశువును బోషించి పెంచి పెద్దవానిఁ జేసెను. వారందు నేకాంతముగ నుండి తపస్సు చేయుచుండుట చేతను నా ప్రాంతమందలి ఋషులందఱు బ్రహ్మచారులు సన్యాసులుగా నుండుటచేతను ఆ బాలుఁడు ఋశ్యశృంగునివలె స్త్రీలన నెట్టివారో యెఱుఁగఁడు, కొంతకాలమునకుఁ దండ్రియు మరణించెను. జనకుఁడు మరణించిన యనంతరము కాంతారమున[7] నొంటిగనుండ వెఱచి యా బాలుఁ దరణ్యము విడిచి వచ్చెను. అడవి విడిచి కొంత దూరము రాఁగానే బ్రాహ్మణాగ్రహార మొకటి యాతనికిఁ గానవచ్చెను. ఆ యూరికి వెలుపల నొక దేవళము దాని సమీపమున పుష్కరిణి తోఁపు గోచరించెను. జనసమ్మర్దము లేక నిశ్శబ్దమై రమ్యమై జనశూన్యమును గాని యా ప్రదేశము తనకుఁ దపస్సు చేసికొనఁ దగిన నెలవని తలఁచి యా బ్రాహ్మణ కుమారుఁడు దేవాలయమున నెలకొనెను.

ఉదయముననే పుష్కరిణిలోని నిర్మలజలముల స్నానమొనర్చి సంధ్యాది కృత్యములు దీర్చుకొని కోవెలలో నొకమూలఁ గూర్చుండి యోగాభ్యాసము

గావించుచు భగవద్ధ్యానము చేయుచునుండి మధ్యాహ్నము పది పదునొకొండు గంటలకు నగ్రహారమున నైదిండ్లఁ బంచభిక్ష యెత్తి తెచ్చికొని తిని జీవించుచు మరలఁ దపోనియమము జరుపుచుండెను. ఐదిండ్లు వంతు పెట్టుకొని పోయినయింటికి మరల వంతువచ్చు వఱకుఁబోక "భవతి భిక్షాం దేహి" యని రెండుమార్లు మాత్ర మఱచుచుఁ బ్రత్యుత్తరము లేకున్న వెడలిపోవుచునుండెను.

ఇట్లు కొన్నివాళ్ళు జరగెను. అంత నొకనాఁడొక బ్రాహ్మణు నింటికిఁ బోయి "భవతి భిక్షాం దేహి" అమ్మా! భిక్ష నిమ్ము అని యఱచెను. ఆయింట భార్యాభర్తలిరువురే యుండువారు.

అందు భర్తయప్పుడే భుజించి కార్యవశమున వెలువలఁ బోయెను. భార్య పదునెనిమిదేఁడుల పడుచు. సన్నని చిన్నవస్త్రము కట్టుకొని స్నానము చేయుచుండెను. ఆసమయమున నాయన భిక్ష మడిగిన ధ్వని యామెకు వినఁబడెను. ఆమె స్నానము సగము చేసి చేయక యుండెను. వేఱుచీర కట్టుకొను నవకాశము లేదు. వల్లయును లేదు ఏమిచేయుదునని యాలోచించులోపల రెండవసారి "భవతి భిక్షాం దేహి" యను ధ్వని వినవచ్చెను. ఇఁక నాలసించిన నాయన వెడలిపోవునని తలఁచి యా పడుచు "అయ్యా! వచ్చితిని" అని యఱచి శీఘ్రముగ నట్లె తడివస్త్రముతో వంటయింటిలోనికిఁ బోయి పళ్ళెరములో నన్న ముంచుకొని యాయనకు వేయవచ్చెను. తడిసిన వస్త్రము అందు సన్ననిది కావున నది దేహమున కంటుకొని యుండెను. ఆమె నెగాదిగ చూచి యా బ్రాహ్మణ కుమారుఁడు. "అమ్మాయీ! నీకు దేహమున వ్యాధిబాధగలదా?" యని యడిగెను. లేదని యా బాలిక చెప్పెను. అటైన నీ ఱొమ్మున నంతంత బొబ్బ లెట్లు వచ్చెను? నానిమిత్తమె త్వరపడి వచ్చుచో కాల్చుకొంటివా? యని యా కుమారుఁ డడిగెను. "అవి బొబ్బలుకావు" అని యా పిల్ల చెప్పెను. అటైన నింకేమి?" యని యతఁ డడిగెను. అయ్యా! నాకు బిడ్డలు పుట్టినప్పుడు వాని కాహారము

నిమిత్తమై భగవంతుఁ డేర్పఱిచిన పాలగిండీలు" అని యా ప్రజ్ఞావతి ప్రత్యుత్తరమిచ్చెను, "ఏమీ! నీకు బిడ్డలు లేరా?" అని యాయన యడిగెను. "లే"రని యా సుచరిత్ర చెప్పెను. "అటైన నెప్పుడో పుట్టఁబోవు బిడ్డలకా భగవంతుఁ డిప్పుడే యాహారమునకు సదుపాయము కల్పించియున్నాఁడు?" అని యాయన యడిగెను. 'అవును' అని యా సుశీల చెప్పెను. అటైన నీ ఱొమ్మున నంతంత బొబ్బలెట్లు వచ్చెను? నా నిమిత్తమె త్వరపడి వచ్చుచో కాల్చుకొంటివా? యని యా కుమారుఁ డడిగెను. "అవి బొబ్బలుకావు" అని యా పిల్ల చెప్పెను. అటైన నింకేమి?" యని యతఁడడిగెను. అయ్యా! నాకు బిడ్డలు పుట్టినపుడు వాని కాహారము నిమిత్తమై భగవంతుఁ డేర్పఱిచిన పాలగిండీలు" అని యా ప్రజ్ఞావతి ప్రత్యుత్తర మిచ్చెను, "ఏమీ! నీకు బిడ్డలులేరా?" అని యాయన యడిగెను. "లే"రని యా సుచరిత్ర చెప్పెను. "అటైన నెప్పుడో పుట్టఁబోవు బిడ్డలకా భగవంతుఁ డిప్పుడే యాహారమునకు సదుపాయము కల్పించియున్నాఁడు?" అని యాయన యడిగెను. 'అవును' అని యా సుశీల చెప్పెను.

అంతట నా బ్రాహ్మణుఁ డాయమ్మ పెట్టిన యన్నము జోలెలో వేయించుకొని తక్కిన నాలుగిండ్లకుఁ బోక చక్కకోయిలకుఁబోయి యందా యన్నము భుజించి తపస్సు చేసి కొనుచుండెను. అది మొదలగ్రహారము లోనికి భిక్షకైపోయిన వాఁడుకాఁడు.

మొదటియింటి కాయన రాఁగానే తమయిండ్లకు వచ్చునని తక్కిన నాలుగిండ్లు యిల్లాండ్రెదురు చూచుచుండిరి. తమ యిండ్లకు రాక క్రమ్మఱి పోవుటయు వారు చూచిరి. ఆనాఁటి కేమో యనుకొనిరి. తరువాత మూఁడు నాలుగు దినములైనను బ్రాహ్మణకుమారుఁడు రాకపోవుటచే నా నాలుగిండ్ల యిల్లాండ్రు వారి మగవారితో "బ్రాహ్మణకుమారుఁడు నాలుగు దినములనాఁడు మన పొరుగింటికి వచ్చి యన్నమడిగెను. ఆయింటిపడు చేమి యనెనో వయసుపొగరున నేమి చేసెనో యానాఁడు

మొదలగ్రహారమునకు భిక్షకు వచ్చుటే యాయన చాలించెను" అని చెప్పిరి. ఆ పిల్ల భర్తకు నీవార్త తెలిసెను. ఆయన యా బాలికను నయభయముల నీ వేమి చేసితివి చెప్పుమని యడిగెను. ఆమె వాస్తవము చెప్పెనుగాని పాప మా పిల్లమాట నెవ్వరు నమ్మినవారు కారు. అందఱు దానిని నిందింపఁ బ్రారంభించిరి.

అంతటఁ దపస్వి తమ గ్రామములో నాలుగు దినములుగాఁ బస్తుండుట తమకు శ్రేయస్కరము కాదని యోజించియు నా పిల్లదాని దోష మెట్టిదో తెలిసికొని దండింపఁ దలఁచియు దానిని దోడుకొని యూరిలోని స్త్రీపురుషులందఱు గుడిలోనికిఁ బొయి దాని నాయనయెదుట నిలువఁబెట్టి "యయ్యా! యిది మీ కేయపచారముఁ గావించెను? ఏల మీరు భిక్షకు వచ్చుట మానితిరి? అని ప్రశ్నించిరి.

ఆ కుమారుఁ డాబాలికను జూడఁగానే తటాలున లేచి యామెకుఁ బ్రదక్షిణము చేసి యామె పాదములపైఁ బడి తల్లీ! యని సాష్టాంగ నమస్కారము గావించెను.

ఆ పిల్ల భయముచే గడ గడ లాడఁ జొచ్చెను. తక్కిన వారు దిక్కుదోఁపక భ్రమగొని నిలిచి కొంతసేపటికి నయ్యా! మీరు తపస్వులు. ఇది స్త్రీ. అందు బాలిక. దానికి మీరు నమస్కరింపవచ్చునా?" అని యడిగిరి.

ఆయన యిట్లనియె. "అయ్యాలారా! యీమె నాకుఁ దత్త్వజ్ఞాన ముపదేశించిన గురువు. కావున గురునమస్కారము దోషముగాదు. గుణము జ్ఞానము ప్రధానములు గాని వయస్సు గాదు. నాలుగుదినములు నాఁడు నేనీ పుణ్యాత్మురాలి యింటికిఁ బోయితిని. అప్పుడీమె ఱొమ్మున రెండు పెద్దబొబ్బలు గానవచ్చెను. అవి యేమని యడిగితిని. అవి తన కుదయింపఁబోవు బిడ్డలకై భగవంతుఁడు సృష్టించిన పాలగిండీలు" అని

చెప్పెను. ఇక నేనాఁడో పుట్టఁబోవు బిడ్డల కాహారమునకు సదుపాయ మీనాఁడే కల్పించిన భగవంతుఁడు పుట్టి పెరుఁగుచుండు నా కాహార కల్పనము చేయకుండునా? నాకేల యీ వెతలు? ఆహారము వెదకు భారము నానెత్తిపైఁ బెట్టుకొననేల యనుకొని యానాటినుండి భిక్షాటనము మానితిని. కావున మీరీమెను నొవ్వనాడితిరేని మిమ్ము నందఱ శపింతును. ఇప్పుడు భగవంతుఁడే నా కాహారముఁ బంపుచున్నాడు. ప్రతిదిన మెవరో యొక పుణ్యాత్ముఁ డాహారముఁ దెచ్చి యిచ్చుచున్నాఁడు.

అని యాయన చెప్పునంతలో నొక బ్రాహ్మణుఁడు తలమీఁద నొక పళ్ళెరములో నన్నాదుల నెల్ల నుంచుకొని తెచ్చి యా తపస్వియుం దుంచి యందు మూఁగినవారినెల్లఁ జూఱచుఱ చూచి యిట్లనియె.

బ్రాహ్మణ వేషధారులారా! మీరా యీ యగ్రహారమున నుండువారు? ఎంత పుణ్యాత్ము లెంత పుణ్యాత్ములు! మీగ్రామములో నొక బ్రాహ్మణ కుమారుఁడు తపస్వి తపస్సు చేసికొనుచు నుపవాసములుండ మీరు పొట్టలకు గట్టింప నెట్లు మనస్సు వచ్చెనో? “అతిథి దేవోభవ” “అభ్యాగత[8] స్స్వయంవిష్ణు” వనునవి మీరు చదివిన వేదశాస్త్రపురాణాదుల లేవు గాఁబోలు. బ్రాహ్మణున కింత యన్నము పెట్టని మీరేనాఁటి బాఁపలయ్యా? ఆఁకలి గొన్నవాఁడు కాచియుండ వానికిఁ బెట్టక భుజించు నన్నము గోమాంసముతో సమానమని మీ రెఱుఁగరా? ఈ వార్తవిని యెందో యుండువాఁడను నేను దలమీఁదఁ బెట్టుకొని మోసికొని వచ్చి యాయన కన్నము పెట్టవలసి వచ్చెను గదా? ఈ బ్రాహ్మణ కుమారునకు నందుఁ దపస్వికిఁ బట్టెఁడన్నము పెట్టిన మీయింట దారిద్ర్యము తట్టుముట్టాడునా? లోభము నరకద్వార మని “దాన మేకం కలౌయుగే” యని యన్నదానము స్వర్గద్వారమని వినరా?

ఆ మాటలు విని వారు లజ్జచేఁ దలలువంచి “అయ్యా మీరు చెప్పినది సత్యము. ఈయన మా యిండ్లకు వచ్చుచుండిన నన్నము పెట్టుచుంటిమి.

నాలుగు దినములుగా రాకుండుటచేఁ గారణమేమో తెలిసికొన నిందు వచ్చితిమి." అని వారు చెప్పిరి.

"అవురా! మీ యైశ్వర్యమదము. తపస్సు చేసికొనువాఁడు దానినైనఁ జాలించి జిట్టెఁడు పొట్టకై పట్టెఁడు కూటికై మీయైదిండ్లు తిరగవలయును గాఁబోలు ఆయన యడుగక పెట్టిన మీ పరువునకు లోటువచ్చును గాఁబోలు. ఇప్పుడీయనకు నేను బెట్టుటచే నాకు మానహాని సంభవించెనా? మీరింటి కొకనాఁడు వంతుపెట్టుకొని యిక్కడికిఁ దెచ్చి యీయనకు నన్నముపెట్టిన మీ పరువు చెడునా? కండలు కరఁగునా? ఛీ ఛీ మీది బ్రాహ్మణచర్య గాదు." అని యన్నము తెచ్చిన బ్రాహ్మణుఁడు వారిని ఛీకొట్టెను.

అప్పుడందఱు "నయ్యా యిదివఱకు మే మీయనను నుపచరింప కుండుట యపచారమే. మీరు చెప్పిన ట్లికమీఁద నింటికొకనాఁడు వంతుప్రకార మీయన కన్న మిచ్చుటికే తెచ్చి పెట్టెదము" అని చెప్పిరి. ఆ మాట వారు చెప్పఁగానే యన్నము తెచ్చిన బ్రాహ్మణుఁడు మాయమై పోయెను. అప్పుడంద ఱిన్నినాళ్ళీ బ్రాహ్మణకుమారున కన్నము తెచ్చి పెట్టినవాఁడు భగవంతుఁడే తెలిసికొని యానాఁడు మొదలిలువరుస తప్పక ఆ తపస్వికి నన్నముఁ దెచ్చి పెట్టుచుండిరి. మఱియొక తెలివిమాలినదైనచో నాయనను రచ్చకీడ్చియుండుఁగదా యని యా బాలిక ప్రజ్ఞకు నంద ఱామెను శ్లాఘించిరి.

### 5. నిజమైన చండాలుఁ డెవఁడు?

గోదావరీ తీరమునఁ బలువిధము లయిన ఫలవృక్షములచే దట్టముగ నిండిన యొక తోఁపు గలదు. అందొక బ్రాహ్మణుఁడు పర్ణకుటీరము కల్పించుకొని వాసము చేయుచుండెను. అతఁడు సన్న్యాసి. వేదములు, శాస్త్రములు, పురాణములు, ఇతిహాసములు లోనైన వెల్లఁ జదివినవాఁడు. పెద్ద వేదాంతి. తక్కిన లోకులందఱు నీచులని యజ్ఞానులని వారితోఁ

గలసి మెలసి యుండుట తనయట్టివానికిఁ దగదని వారిని సమీపించినను దాను మైలపడుదునని తలంచి యుండు దురభిమాని, త్రిషవణ స్నానము, ఏకభుక్తి, స్వయంపాకము, వేదములు, శాస్త్రములు వల్లెవేయుట, ఏకాంతవాసము, వీనివలననే తాను ముక్తి సంపాదింపఁ గలనని తలఁచిన మూఢుఁడు. అంతియకాని యతని హృదయమున దయా దాక్షిణ్యములు కాని, పరోపకార బుద్ధిగాని యితరుల యజ్ఞానము తొలఁగింప యత్నము చేయవలయు నను వివేకము గాని లేనివాఁడు. కావున నాతని హృదయము సూర్యరశ్మి నిర్మలవాయువు చొరని యంధకార బంధురమైన గుహను బోలియుండెను. ఎవరైనను భగవద్విషయము తెలిసికొనఁ గోరి వచ్చినను వారి పదస్పర్శ యైనంత మాత్రమునఁ దన యాశ్రమ మపవిత్రమగునని వారిని జేరనిచ్చువాఁడు కాఁడు. దండము కమండలువు కావివస్త్రము బోడితల ధరించినను శాంతమనునది యెట్టిదో యతఁ డెఱుఁగఁడు. కోపమువచ్చెనా నిబ్బరించుకొను శక్తిలేని క్రోధదాసుఁడు. ఆ కారణముచే నాచోటికి యెవ్వరు పోకయుండిరి. ఇట్లుండ నొకనాఁడు వేఱూరి చాకలి యొకఁ డీ విషయ మేమియు నెఱుఁగనివాఁ డగుటచే నాతోపునొద్దకుఁ బోయి యచ్చటనున్న బండమీఁద నొక వస్త్రము దబాదబా యని యుదుకుచుండెను. అప్పుడా సన్న్యాసి యా సమీపమున నుండు పొదయొద్ద జపము చేసికొనుచుండెను. కొన్ని నీటి తుంపురులు గాలికిఁ గొట్టుకొనివచ్చి యాయనమీఁదఁ బడెను. చప్పుడునకే మనస్సు చెదరిన సన్న్యాసి నీటితుంపరలు మీఁదఁ బడగానే నేయిపోసిన యగ్నివలె మండిపడి చేతి జపమాల నేల బాఁది దండముతీసికొని యచ్చటికిఁ బోయి యతఁడు చాకలివాఁడగుట యెఱిఁగి మఱింత మండుచు వానిని నోట పట్టరాని కన్నతిట్టులు తిట్టివానిఁ బైపడి కొట్టెను.

ఈ సన్న్యాసిచేష్ట లేమియు బోధపడక యా చాకలి దిగ్భ్రమగొని యాయన తిట్టినను, గొట్టినను బదులాడక యూరక స్తంభమువలె నిలుచుండెను. సన్న్యాసి నోరు చేతులు నొప్పులెత్తి యూరకున్న తరువాత

నా మడివా[9] డిట్లనియె. "అయ్యా నేను మీ కేయెగ్గు గావించితిని. నన్నేల తిట్టి కొట్టితిరి? నా దోషము చెప్పక మీరు నన్ను దండింపవచ్చునా? యని యడిగెను.

అప్పుడా సన్న్యాసి "యోరి చండాలుఁడా! నాపుణ్యాశ్రమమునకు వచ్చి ధ్వనిచేసి నాధ్యానము చెఱుచుట గాక నీచుఁడవైన నీ ముఱికివస్త్రము నీళ్ళు నా గాత్రముపైఁ బోసితివి. నీ వెంతటి పాపివి? నీకింత పోతరమా" యని దూషించెను.

రజకుఁడును "అయ్యా మీరిందుండుట నేనెఱుఁగను. నేను గ్రామాంతర వాసిని. అజ్ఞానమునఁ జేసిన యపరాధమును క్షమింపుము" అని చెప్పి యుదుకుచుండు వస్త్రమును దీసికొనిపోవ సిద్ధపడెను.

అంతట సన్న్యాసి "చూడుము చండాలుఁడవైన నీ ముఱికినీరు నాపైఁ బడుటచే మరల శుచిస్నానము చేయవలసి వచ్చెను" అని పోయి నదిలో స్నానము చేసెను. చాకలవాఁడును సన్న్యాసివలెనే యేటిలో దిగి స్నానము చేసెను.

అప్పుడు సన్న్యాసి చాకలివానితో "నీవేల స్నానము చేసితివి" అనెను. చాకలివాఁడును "అయ్యా శూద్రునకు బ్రాహ్మణ స్త్రీయందుఁ బుట్టినవాఁడు చండాలుఁడు. వాని వంశమువారును జండాలురే. నీవు బ్రాహ్మణుఁడవు. నీది బ్రాహ్మణబుద్ధి. అట్టిదానికి నీచజాతి క్రోధగుణమునకు సంపర్కము గలిగెను. ఆ రెంటివలన నైనది నీ దేహము. కావున నీది చండాల దేహమే. జాతిచండాలునకన్నఁ గర్మచండాలుఁడు నీచుఁడు. కావున నతి నీచస్పర్శచే నైన నాదేహదోషము పోవ స్నానము చేసితిని" అని చెప్పెను.

సన్న్యాసి సిగ్గుచేఁ దలవంచుకొని తపస్వికిఁ గ్రోధము కారాదనియు దాను జేయు వేదాధ్యయనము జపము, తపము లోనైన వన్నియుఁ జాకలి శాంతగుణముతో సరి రావనియు నెఱిఁగి యదిమొదలు క్రోధమును జయింప యత్నించెను.

## 6. నిజమైన పాపియెవఁడు?

ఒకానొక నగరమున నొక మఠముండెను. అందొక సన్న్యాసి వాసముచేయుచుండెను. ఈ కాలపు సన్న్యాసులు కొందఱవలె నాయన యాలిపై నలిగిన సన్న్యాసియు గాఁడు. పొట్టకూటి సన్న్యాసియుఁ గాఁడు. పూర్వకాలమున వాస్తవముగ వైరాగ్యము కుదిరి మూఁడాశ్రమములు దాఁటినవారే సన్న్యాసము స్వీకరించుచుండిరి గాని రావణ సన్న్యాసము అర్జున సన్న్యాసము వారెఱుఁగరు. ఆకారణముచేత నా సన్న్యాసి తన యాశ్రమధర్మమును జక్కఁగ నిర్వర్తించుచు నుపదేశఁముగోరి వచ్చినవారికి జ్ఞానముపదేశించుచు సత్ప్రవర్తనము కలవాఁడై బూజ్యుఁడై యుండెను.

ఆయన మఠమున కెదురుగ నుండు నింటియందు వేశ్యయొకతె కాఁపురముండి దాని కులవృత్తిచే జీవించుచుండెను. ధనాశచేఁ గన్నవారికిఁ గొంగుపఱచు వేశ్యావృత్తి కేవల నీచమైనను జారిణీవృత్తికంటెను శ్రేష్ఠమైనది. కుటుంబినులు జారిణు లగుటచేఁ గదా యుత్తమ వంశములందును జండాలు రుద్భవించి కులద్రోహము గురుద్రోహము లోనగుననేక పాపములాచరించి కర్కోటకులై యెట్టి క్రూరకార్యములకైనను వెనుదీయుక యున్నారు. జారిణులు ప్రచ్ఛన్నకూపములు. వేశ్యలు బహిరంగ కూపములు. స్పష్టముగఁ దెలియవచ్చు బావులందుఁ జావఁగోరువాఁడే దుముకును. ప్రచ్ఛన్న కూపములందు మీఁద మొలచిన గడ్డికైకదాపోయి భ్రమగొని యేనుఁగులు పడి నశించును. ఆ వేశ్య యింటికి రేపగ లెందఱో విటులు వచ్చుచుఁ బోవుచుండిరి. వారి రాకపోకల నా సన్న్యాసి చూచుచుండెను.

ఒకనాఁ డా సన్న్యాసియా వెలయాలిని జేరఁబిలిచి యిట్లనియె. ఓసీ! నీకొక హిత ముపదేశించెదను. నాపైఁ గోపింపకుము. నీవు స్త్రీవి. స్త్రీకి మానమే భూషణము. అట్టి నీ మానమును దేహమును నాలుగు కాసులకై నమ్ముచున్నావు. ఆత్మగౌరవము నీకు రవంతయు లేదాయెఁ

గదా? అంతియకాదు. భార్యభర్తలుగా నుండువారే నెలకుఁ బదిదినములకు మించి కలసిన దేహారోగ్యము చెడునుగదా. అట్లుండ దినదినము నీవు విధినిషేధములు లేక పురుషసాంగత్యము చేయుటచే నీయం దెన్నిరోగములున్నవో నీ వెఱుఁగవా? ఈ రోగములు నీతోఁ గలియు పురుషులకుఁ దగులుటచే వారు కొఱగానివారగుట యటుండ నేపాప మెఱుఁగని వారి భార్యల కెంత యుపకార మొనర్చి వారిని సంసారసుఖహీనులుగఁ జేయుచున్నావో యాలోచింపలేదా? ఆ రోగములచే వారి సంతాన మెట్టులు రోగపీడిత మగునో యెట్లు కొన్నితరములలో వారి వంశమే నిర్మూలమై నశించునో యెఱుఁగవా? జీవించి యుండువారును నడపీనుఁగులై యుండుట నీకుఁ దెలియదా? విష మొకనినే చంపును. నీ విషము వంశములనే నిర్మూలించును. నీవలన నెన్ని మంచి సంసారములు భిక్షాటమునకుఁ బాలుపడెనో యెందఱు జీవచ్ఛవములై యున్నారో యోజింపలేవా? ఇది నాకుఁ గులవృత్తికదా. కులవృత్తి యెంతటి నీచమైనను విడువరాదుగదా యందువేయో. ఇతరులను బాధింపక తన వృత్తియందుఁ దానుండవలెను. ధర్మవ్యాధుఁడు జీవహింసచేయ కులధర్మమం దుండలేదా? తులాధారుఁడు మోసములేక వాణిజ్యము వృత్తిగా నడపలేదా? నీకు భగవంతుఁడు దేహమును దేనికై యిచ్చెనో దేనికై నీవుపయోగించుచున్నావో యాలోచింపుము. ఇటు చేయుట భగవదాజ్ఞమీఱుటకదా? పరులను దన్ను రక్షించుకొనుటకై యీయఁబడిన కత్తితోఁ దన తల తెగ నఱకుకొనుట యేమి వివేకము? దుష్కామమున నెప్పటికైన మేలు గలదా? పురుషులను నేను నా యింటికి రమ్మని ప్రార్థించితినా? వారేకదా వచ్చుచున్నారని యందువేమో. సంసారులలో కామమును జయించినవాఁడు కోటి కొకఁడైన లేఁడు. అందు విజ్ఞులైనవారు తమ భార్యలతోనే రమింతురు. ఇది ధర్మవిరుద్ధము. మెఱయునది యంతయు బంగారమని తలఁచు బాలురవంటి మూఢులు, పశువులవలెఁ గ్రామమునకు నిగ్రహించుకొన నేరనివారు, పరస్త్రీలను దేవులాడుదురు.

ఇది ధర్మవిరుద్ధము. అందుజారిణీ సాంగత్య మపాయకరము గావునఁ గొందఱు మీ సాంగత్య మభిలషింతురు. పురుషుల నాకర్షించు కోరిక లేదేని తళుకులు బెళుకులు, కులుకులు సిగ్గుమాలిన చేష్టలు మీకేల? తేనె పాత్రమందుంచి నేనీఁగల రమ్మంటినా యనిన నేమియర్థము? నీ యుద్దేశము చెడ్డదికాదని నీవు చెప్పఁగలవా? నీవు చదువరివి. విజ్ఞురాలవు. గుణవతివి. నీయందీ మహాకళంకము సంకమించుట కోర్వక హితముపదేశించితిని. ఇఁకనైన నీవు బాగుపడుదువనియు నీ కులవృత్తియిందే యుండఁ గోరుదువేని గండకివలె వర్తింతు వనియుఁ గోరుచున్నాను.

ఈ పలుకులు విని హిత ముపదేశించిన యా సన్న్యాసికి నమస్కరించి యది యింటికిఁబోయి యాయన చెప్పిన విషయముల నెల్ల విపులముగ నాలోచించెను. ఆలోచించు కొలఁది తన వృత్తి మిగులఁ బాపావహమని దానికి తోఁచెను. తనవలనఁ జెడిన పురుషులయు వారి భార్యలయు బిడ్డలయు శాపోక్తులు తన్నెన్ని కల్పములైన నరకములఁ ద్రోయఁజాలునని భయపడియెను.

అంతట నా వేశ్య దన యభిప్రాయము తల్లికి నెఱిఁగించెను గాని యది దానిని దిట్టి దాని యిష్టప్రకారము వర్తింపఁ జేసినదిగాదు. ఇట్లు వ్యర్థసంకల్పయై కులవృత్తిరోసియు వేఱు మార్గము లేక దానియందే యుండియు మనమున భగవంతుని ధ్యానించుచు నన్నీ పాపమునుండి విముక్తను జేయుమని ప్రార్థించుచుండెను. ఒక్కొక్క విటుఁడు వచ్చినపు డంతయు భగవంతుఁడా నన్నీ కసుమాలపుఁ గూటికి లోనుచేసితివి గదా. నను రక్షించు భారము నీదియని మనస్సున భగవంతునే ధ్యాన మొనర్చుచుండెను.

తానుపదేశించినను వేశ్య దానివృత్తి మానకుండుటచే సన్న్యాసి మిగుల పరితపించుచు దాని యింటికి వచ్చిన విటున కొక్కక్క చిన్నరాయివంతున నొకచోటఁ గుప్ప వేయఁజొచ్చెను మూఁడు నాలుగు

సంవత్సరములలో నా కుప్ప యొక తిప్పయాయెను. అప్పుడా సన్న్యాసి వేశ్యను మరలఁ బిలిచి యిట్లనియె.

ఓసీ! నా హితబోధను నీకు రుచించినది కాదుకదా. ఈ తిప్పయందలి ఱా లెంచితివేని నీ వీ మూఁడు సంవత్సరములుగ నెందఱు విటులతోఁ గలసితివో తెలియును. ఈ పాపమునుండి యెట్లు విడివడెదవో యాలోచింపుము.

ఆ మాటలువిని వేశ్య మఱింత భయపడి మునుపటికంటె నెక్కువగ భగవంతుని మనస్సున నిలిపి సర్వదా ధ్యానించుచుండెను. సర్వకాల సర్వావస్థల నది భగవంతునికి ధ్యానించుటచేఁ దుదకుఁ దానికి జ్ఞానము భక్తి కుదిరెను. సన్న్యాసి మాత్రము దానికింకను బుద్ధిరాదయ్యెనని విచారపడుచుండెను. ఇట్లు కొంతకాల మరుగ దైవతంత్రముచే నా వేశ్యము సన్న్యాసియు నొకనాఁడే మరణించిరి. సన్న్యాసిని గొనిపోవుటకు యమకింకరులు వచ్చిరి. వేశ్యను గొనిపోవుటకు విష్ణుదూతలు విమానముఁ దెచ్చిరి. అప్పుడు సన్న్యాసి మిగుల దుఃఖించి సన్న్యాసమునకు యమలోకము, వేశ్యావృత్తికి వైకుంఠము, గమ్యస్థానములా యని వారి నడిగెను. అప్పుడా దూత లిట్లనిరి.

ఓయీ! నీవు నిష్కారణముగఁ బరితాపపడుచున్నావు. నీవు నరకమునకుఁ బోవుటయందు వేశ్య పుణ్యలోకములకుఁ బోవుటయందు వైపరీత్య మేమియు లేదు. మనుష్యుల బంధమోక్షములకు మనస్సు కారణము. సన్న్యాసాశ్రమమున నుండు నీకు విహితకార్య మెయ్యది? సమస్తములైన కోరికలు వదలి యాత్మ సాక్షాత్కారము నొంది సర్వము బ్రహ్మమయమని యనుభవమునకుఁ దెచ్చికొనుటా లేక యే వేశ్యయెందఱు విటులతోఁ గూడుచున్నది? ఎప్పుడెప్పుడేయే కార్యముల నెట్లెట్లు చేయుచున్నది అని యాలోచించుటయా? దాని కృత్యము వలనఁ గలుగు ఫలము పుణ్యమో పాపమో యది యనుభవించును. దాని విచారము

నీకేల? హితముపదేశించితి వంటివా యొకసారి రెండుమార్లు చెప్పితివి. చాలును. సర్వదా నీ మనస్సు దాని కృత్యములపై నుండనేల? నీ మనస్సు దేనియందు వర్తించుచుండెనో యా ఫలము నీ వనుభవింపవలదా? కావున నీకు నరకప్రాప్తి. ఆ వేశ్యయో నీవు చేసిన హితబోధమువలన దాని వృత్తియందు రోఁత పుట్టియుఁ తల్లి బలత్కారము వలన నందే చరించుచుండెను. గాని మనస్సున నేనిట్టి కార్యము చేయుచున్న దాననే. నారాయణమూర్తీ భగవంతుఁడా! నాగతియేమి? నీవే నాకు శరణము అని విటులతోఁ గలిసినపుడును భగవంతుని యందే మనస్సుంచెను. అంతియగాక యా సన్న్యాసి యెంత పుణ్యాత్ముఁడు! సర్వదా భగవంతునినే స్మరించుచుండును" అని నీవు చేయు కార్యము నది స్మరించుచుండెను. దాని పాపకార్యమునే నీవు స్మరించుటచే దాని నరకము నీకు లభించునట్లు నీ పుణ్యకార్యము నది స్మరించుటచే నీ పుణ్యలోకము దానికి లభించెను. ప్రతిమనుష్యుఁడు తాను దాను గడతేఱు సదుపాయ మాలోచింపక మఱియొకరిని జక్క దిద్దెదనని వాని మతమునో యాచారమునో యాక్షేపించుచుండుట సరియైన కార్యము గాదు. తాను దరించిన వాఁడు పరులను దరింపఁ జేయవలయును పెద్ద ప్రవాహములోఁ దాను గొట్టుకొని పోవుచుఁ దనవలెనో నితరుల నాక్షేపించుట తెలివిమాలినపని" అని యతనిని నరకమున కీడ్చుకొని పోయిరి.

## 7. గృహస్థుఁడుత్తముఁడా? సన్న్యాసియుత్తముఁడా?

ఒకానొక రాజునకు సన్న్యాసము శ్రేష్ఠమా గార్హస్థ్యము శ్రేష్ఠమా యను సందేహము కలిగెను. పురాణేతిహాసముల శోధింపఁ గొన్ని చోటుల గృహస్థాశ్రమమే శ్రేష్ఠమనియుఁ గొన్ని చోటుల సన్న్యాసమే శ్రేష్ఠమనియుఁ గానవచ్చెను. సన్న్యాసులను విచారింప సన్న్యాసమే శ్రేష్ఠమను చుండిరి. గృహస్థులు గార్హస్థ్యమే శ్రేష్ఠమనిరి. రెంటికిని సామరస్య మెటులు చేయవలయునో యాయనకు దోఁచినది కాదు. ఈ సందేహము

వివర్తించుకొనవలయునని యా రాజు నిశ్చయించుకొని యొక యుపాయము చేసెను.

సన్న్యాసి యెవఁడైనఁ దన దర్శనమునకు వచ్చినపుడు సన్న్యాస మెక్కువా? గార్హస్థ్య మెక్కువా? యని ప్రశ్నించి సన్న్యాస మెక్కువ యని చెప్పిన దానిని సిద్ధాంతీకరింపుమని కోరుచుండెను. వాఁడు దానికి సమర్థుఁడు గానియెడల బలాత్కారముగ వానికి వివాహముచేసి సంసారులలోఁ గలుపుచుండెను. అట్టులే గృహస్థాశ్రమమే శ్రేష్ఠమని చెప్పిన గృహస్థుఁడు వాని మాట స్థాపింపఁడేని వానిని సన్న్యాసిని జేయుచుండెను.

ఇట్లుండ నొక చిన్నవయస్సుగల యొక సన్న్యాసి రాజదర్శనమునకై వచ్చెను. అందఱను బ్రశ్నించినట్టె రాజాయనను బ్రశ్నించెను. ఆయన "రాజా! దేనిమట్టున కదే శ్రేష్ఠము. ఒకటి యెక్కువయని మఱియొకటి తక్కువయని చెప్పరాదు. దేనియం దెవఁ డుండునో దాని యందు వాఁడు చక్కఁగఁ బ్రవర్తించెనేని యదియే తక్కినదానికంటె శ్రేష్ఠము" అని చెప్పెను. "అది యెట్లో నాకు నమ్మకము గలుగఁ జెప్పుము" అని రాజడిగెను. "నావెంట వచ్చితివేని నామాట నిజమని నీకు నమ్మకము గలుగఁ జేసెదను" అని సన్న్యాసి చెప్పెను. వచ్చెదను అని చెప్పి రాజా సన్న్యాసి వెంటఁ బోయెను.

ఇట్టు వారిరువురు కొంతకాలము భూసంచారము చేయుచు నొకనాఁడొక పట్టణమున బ్రవేశించిరి. ఆ సమయమున నా నగరమున రాజకుమారి స్వయంవరోత్సవము జరుగుచుండెను. దానిఁజూడ ననేకులు రాజుల రాజకుమారులు వచ్చిరి. రాజతనయను నొకయంబారి యేనుఁగుపై గూర్చుండఁ బెట్టి యూరి వీథుల వెంటఁ ద్రిప్పుచుండిరి. వీథుల రెండు ప్రక్కలఁ జూడవచ్చిన వారెల్లఁ దమ తమ యైశ్వర్యము బలము మెఱయునట్లు సింగారించుకొని నిలిచి యుండిరి. రాజపుత్రి యేనుఁగుపై గూర్చుండి రెండువంకలఁ బాఱఁజూచుచుఁ బోయి పోయి గుంపు నడుమ నిలుచుండిన యొక సన్న్యాసిని నూత్న యౌవనమున

నలరారు నందరినిఁ జూచి యేనుఁగు నుండి దిగి యాయన యొద్దకుఁ బోయి చేతనున్న పుష్పమాలిక యాయన కంఠమునవైచి యతని వరించెను.

ఆ సన్న్యాసి యాకన్యను జుఱ చుఱ చూచి ఛీయేమిపని చేసితివి? సన్న్యాసికి వివాహమేల? యని యామాలికను దీసి పాఱవైచెను. ఇంతలో రాజును వచ్చి "అయ్యా! నీవు పేదవాఁడవని తలంపకుము. ఇప్పుడు నా రాజ్యములో సగము నీకిచ్చెదను. నా యనంతరము రాజ్యమంతయు నీదే. కావున నా కన్యను బరిగ్రహింపుము" అని వేడుకొనెను.

సన్న్యాసియు రాజును జూచి "రాజా! నీకు మతిలేదా యేమి? సన్న్యాసులు వివాహమాడుదురా? నీ రాజ్యము నాకు వలదు. పో పొమ్ము" అని నిరాకరించెను. నేను వీనిని దప్ప మఱియొకని వరింపనని రాచకూఁతురు పట్టుపట్టెను.

ఇది యెక్కడిపీడ నాకు దాపరించెను. ఇక్కడ నుండిన బలవంతము పెట్టుదురేమో యని యా బాల సన్న్యాసి యందు నిలువక పరువిడఁ జొచ్చెను. నీవేనాకుఁ బతివి. నీ వెందుబోయిన నేనందులకే వచ్చెదనని రాజుకూఁతురు వాని వెంట బరువెత్తెను. రాజా! వీని వెంట మనము పోదము రమ్మనిమన సన్న్యాసి రాజును దోడుకొనిపోయెను. ఆ సన్న్యాసి పోయి పోయి యొక కాఱడవి ప్రవేశించెను. రాజకన్యయు వెంటనంటెను. వారి వెంట నీ రాజును సన్న్యాసియుఁబోయిరి.

ఆ సన్న్యాసికి నడవిలోని మఱుఁగుత్రోవ లన్నియుఁ దెలియుటచేఁ దటాలున నొక పొదలోఁ దూఱి యావల నెందో కానరాకపోయెను. రాచకుమారిక దిక్కు తెలియక నేలఁగూలఁబడి హెూయని యేడువసాగెను. అప్పుడు రాజును సన్న్యాసియుఁ జేరఁబోయి "అమ్మా! యేడువకుము. సంజ చీఁకట్లు వ్యాపించుచున్నవి. ఇప్పుడీ యడవి వెడలిపోవ సాధ్యపడదు. ఱేపటివేళ నిన్ను మీయూరు చేర్చెద" మని సమాధానపఱిచి యామెను దోడ్కొని, యొక పెద్ద మఱ్ఱిచెట్టు క్రిందికివచ్చి యచ్చట నా రాత్రి విశ్రమించిరి.

అది హేమంతఋతు వగుటచేతను వారు మువ్వురు కట్టువస్త్రములతో నుండుటచేతను జలికి వడవడ వడఁకుచుండిరి. దినమంతయు దారి నడచిన బడలికచేతను నాఁకటను సొటసొట లాడుచుండిరి.

ఆ చెట్టుమీఁద గూడుకట్టుకొని కాఁపురమున్న పావురములలో నాఁడుపావురము మగపావురమును జూచి "నాథా! వీరెవ్వరో మువ్వురు లేఁబ్రాయమువారు, ఆఁకలికిఁ జలికి బాధపడుచున్నారు. వీరు మన యింటికి నతిథులై వచ్చిరి. వీరి నాదరింపవలసిన భారము మనయం దున్నది. కావున వీరికేదైన సాహాయ్యము చేయుట మనకు విధి సుమీ" యనెను.

"మేలు మేలు నీవు మంచిమాట చెప్పితివి" అని మగపక్షి యెగిరిపోయి పుడక లేఱి తెచ్చి వారిముందు ప్రోవుగ వైచి కొఱచినొకటి తెచ్చి దానియందుంచి ఱెక్కలచే విసరెను. దానిచేవారు శీతలబాధవలన విడివడిరి గాని క్షుత్తుచేఁ దపించుచుండిరి.

వారి స్థితిఁ జూచి పావురము "వీరికి నీ రాత్రివేళ నెట్లాహారము సమకూర్తును. అతిథు లాఁకటఁ దపించుచుండ వారి యాఁకలిదీర్పని గృమస్థునకంటెఁ బాపాత్ముఁ డెవఁడు? అట్టి వాఁడు కుటుంబియై యిల్లుకట్టుకొని కాఁపురము చేయనేల? ప్రియురాలా! నేను వీరి కాహార మయ్యెద" నని చెప్పి యది ప్రత్యుత్తర మీయకముందే యామంటలో దుమికెను. మగపక్షి యతిథుల రక్షింపఁ దన మేనిచ్చుట చూచియాఁడు పక్షి యిట్టు లాలోచించెను. "అతిథుల రక్షింపఁగదా నా పతి తన దేహ మొసఁగెను? ఈ మువ్వుర కొక పక్షిమాంసమెట్లు తృప్తి గలిగించును? పతి నడచు ధర్మమందు నడచునదే సతి. కావున నాపతిధర్మమును నేను రక్షించెదను. కాదేని సహధర్మచారిణి యను పేరు వ్యర్థముకదా." అని బిడ్డలకుఁ జెప్పి యాఁడుపక్షి మంటలో దుమికెను.

అప్పు డాపక్షిపిల్ల లిట్టులాలోచించెను. "ఇటువంటి ధర్మాత్ముల యుదరమునఁ బుట్టిన మనము వారి ధర్మము నిర్వహింపకుండితిమేని వారి కడుపులోనుండి మలము వెంట వచ్చు పరుగులకు మనకు భేదమేమి?

తల్లిదండ్రుల ధర్మము నిర్వహించువారే పుత్రులు. ముప్వురు మనుష్యులకు రెండుపిట్టలమాంస మెట్లు సరిపోవును?" అని యవియును మంటలో దుమికెను. అప్పుడవి యన్నియు దేవతలు దెచ్చిన విమానములపై స్వర్గలోకమునకుఁ బోయెను.

ఈ ముప్వురు జరిగినదంతయు వినుచుఁ గనుచునుండిరి.

అప్పుడు సన్న్యాసి రాజుతో నిట్లనియె "నృపాలా! కంటివిగదా గృహస్థాశ్రమ ధర్మమెట్టులు నిర్వహింపఁబడెనో, సన్న్యాసాశ్రమధర్మ మెట్టులు నిర్వహింపఁబడెనో, ఈ రాచకన్నియ తానై వలచినను విస్తార రాజ్యమంతయు లభించినను బాలసన్న్యాసి తృణముగఁ జూచెను గదా. అది నిక్కమైన సన్న్యాసము. ఇప్పుడు పక్షులు గృహస్థాశ్రమ ధర్మమున వర్తించుటఁ జేసి యతిథులమైన మనకు మనము ప్రార్థింపకున్నను బ్రాణములే యొసఁగెను. ఇప్పుడే ధర్మ మెక్కుడో నీవు చెప్పుము. సన్న్యాసాశ్రమమున నుండువాఁడు కేవల విరక్తుఁడై కాంచనము మట్టిపెళ్ళ సమానముగఁ జూచుచుఁ గామినులవంక కామముతో నెప్పుయెత్తియైనఁ జూడకుండ వలయును. గృహస్థాశ్రమమందుండువాఁ డతిథుల నభ్యాగతుల దైవస్వరూపములుగ నెంచుచు మాతా పితృభక్తి గలిగి శక్తికొలది భృత్యాదులఁ బోషించుచు లోకోపకార పారీణుఁడై యుండవలయును. చక్కని నడవడి గలిగి గృహకృత్యములు నిర్వహించుటవలన నేఫలము గలుగునో సన్న్యాసము వలన నదేఫలము గలుగునని నమ్ముము'' అని చెప్పెను. రాజు నంగీకరించెను. ఉదయము కాఁగానే వారా బాలికను దాని యూరఁజేర్చి తమ త్రోవఁదాము పోయిరి.

చక్కని నడవడిగల సుశీలుఁ డేకులమందుఁ బుట్టినను ఏయాశ్రమమం దుండినను గడతేఱును. జ్ఞానహీను లొకటి యెక్కువయని యొకటి తక్కువయని కలహించుచుందురు. గుణహీను లెందును గడతేఱలేరు.

## 8. గండకీ చరిత్రము

ఒకనాఁ డింద్రలోకమున నొక మహాసభ కూడెను. సమస్త కిన్నరులు, కింపురుషులు, సిద్ధులు, సాధ్యులు, గంధర్వులు, విద్యాధరులు, అప్సరసలు, మహర్షులే గాక త్రిమూర్తులును, నా సభ నలంకరించిరి. అప్పుడు అచ్చరలాడిరి. గంధర్వులు పాడిరి.

వివిధ ప్రసంగములు జరుగుచుండ నింద్రుఁడు కలకలము వారింపఁజేసి వేశ్యలయందుఁ బతివ్రతలు గలరాయని ప్రశ్నించెను. సభవారందఱు నవ్విరి. ఊర్వశి, రంభ లోనగువారే దీనికిఁ బ్రత్యుత్తర మీయఁదగువారని కొందఱనిరి. అప్సరసలందఱు తలలు వంచిరి. అప్పుడు నారదుఁడు లేచి "కలరు" అని యుత్తరమిచ్చెను. ఎందు? ఎవ్వతె? అని యింద్రుఁ డడిగెను. నేపాలదేశమున గండకియను వేశ్య పతివ్రత యని నారదుఁడు చెప్పెను. అదెట్లని త్రిమూర్తులు మరల నడిగిరి. గండకి యొకనాఁటికి నొక పురుషునితోఁ దప్ప మఱియొకనితోఁ గలియదు. ఆనాఁ డాపురుషునిదప్ప మఱొకడెట్టివాఁడైనను ఎంత ధనికుఁడు సుందరుఁడు బలవంతుఁడైనను వానిని మనస్సునఁగూడ స్మరింపదు పతివ్రత తన పతికిజేయు శుశ్రూషలన్నియు నది వానికే నిజమైన భక్తితోఁ జేయును. ఇంతయేల యానాఁటికి వాఁడే దాని పాలికి దైవము.

ఇంద్రుఁడు : ఇది నమ్మరానిమాట. తగిన పురుషుఁడు లభించువఱకే స్త్రీల పాతివ్రత్యము. ఎట్టి స్త్రీయైనను ధనమునకో సౌందర్యమునకో బలపరాక్రమములతో, మఱియే కారణమునకో, పరపురుషునికి సాధ్యపడునని నా నమ్మకము.

శివుఁడు : ఇంద్రుఁడు చెప్పినది వాస్తవమే.

నారదుఁడు : తుచ్ఛస్త్రీలను మనస్సులో నుంచుకొని స్త్రీలంద ఱట్టివా రనుట సరిగాదు. స్త్రీలంద ఱట్టివారైనచో మీ భార్యలగతి

యేమి? వారితోడ మీరెట్లు సంసారము చేయుచున్నారు? లోకమునఁ బతివ్రతలు లేరనుట కేవలసాహసము. మీ తల్లు లెట్టివారు? తమ చర్యలను బట్టి లోకమంతయు నట్లే యనుకొనుట సాహస కార్యము.

బ్రహ్మ : కులస్త్రీల శీలమే కొన్ని సందర్భముల సందేహింపఁ దగియుండ వేశ్య శీలవతి యనుట సంశయింపఁ దగినదే కాని యందఱు స్త్రీలు దుశ్శీల లనుట సరిగాదు. లోకమున దుష్టపురుషులు కొంద ఱుండుటచేఁ బురుషు లందఱు దుష్టులగుదురా? నాణెము వాయించి మంచి చెడ్డ తెలిసి కొనునట్లు స్త్రీనిగాని పురుషునిగాని పరీక్షించి శీలము నిర్ణయింపవలెను.

విష్ణువు : బ్రహ్మ చక్కఁగఁ జెప్పెను. నారదుని వాక్యము నిజమో యబద్ధమో తెలిసికొనవలసి యుండినయెడల గండకిని బరీక్షింపవలయును. నా యభిప్రాయమున నారదుఁడ సత్యమాడి యుండఁడు.

ఇంద్రుఁడు : అటైనచో (విష్ణువువంకఁజూచి) నీవు ముందు పోయి గండకియొద్ద నుండుము. నేను, బ్రహ్మరుద్రులు దాని మనస్సు పరీక్షింప వచ్చెదము.

ఈ మాట కందఱు నియ్యకొనిరి. అంతతో సభ ముగిసెను. ఇంద్రుఁడు త్రిమూర్తులు భూలోకమునకు వచ్చిరి. అందు విష్ణువు దివ్యసుందరవిగ్రహము ధరించి చలువవలువలు గట్టి యొకనాఁటి యుదయముననే గండకియింటికి జగన్మోహన రూపమున వచ్చి వాకిటి దాసీజనముచే లోనికి వార్తనంపెను. వేశ్యమాత యరుదెంచి యాయనను లోపలికిఁ బిలుచుకొని పోయి యేమికార్యమని యడుగ "ఈదినము నీపుత్రితోడ నుండఁ గోరి వచ్చితిని. పణ మేమి కోరెదవు?" అని

యావిటపురుషుఁ డడిగెను. ఒకనాఁటికి వేయిరూప్యములని యది చెప్పెను. వెంటనే యతఁడు మొల నున్న సంచినుండి వేయిరూప్యము లెంచి యిచ్చెను. అది మహాసంతోషముతో నా యల్లుని దోడ్కొనిపోయి కొమార్తకు వీఁడు నీ విభుఁడని యప్పగించెను.

గండకియు నతనిఁ జూడఁగానే పీఠమునుండి లేచి పాదములకు నమస్కరించి యున్నతాసనమునఁ గూర్చుండఁ బెట్టి కులప్రశ్నము లడిగి బంగారు చెంబుతో దంతధావనమునకు నీళ్ళు తెచ్చి యిచ్చెను. ఆవల నతనికిఁ గమ్మనినూనె తలంటనెంచి తెచ్చియుంచి ధరించిన యంగరేకు నుత్తరీయముఁ దీయఁ గోరెను. ఆ విటుఁడును వానిని దీసి యావలనుంచెను.

వెంటనే ఝుమ్మని యీఁగెలు వాని దేహమునిండ ముసురుకొనెను. ఇదియేమని చూడ దేహ మంతయుఁ గుష్ఠువ్యాధిచే నీళ్ళు కారుచుండెను. ఎట్టివారికి సమీపమునకు రాకుండునట్లు గౌలు కొట్టుచుండెను. అది చూచియు గండికి మనస్సు చలించినదికాదు. దాసీజనమును విసనకఱ్ఱలచే నీగలు ముసురకుండ విసరుఁడని చెప్పి యెట్టెట్లో స్నానము చేయించి మరల వస్త్రములు ధరింపఁజేసి పంచభక్ష్యపరమాన్నములతోఁ బాకము సిద్ధము చేయించి బంగారు పళ్ళెరముల వడ్డించెను. ఆ విటుఁడు "ప్రియురాలా! నేనన్నమెత్తి నోటిలోఁ బెట్టుకొనుటకు వ్రేళ్ళు వంగవు నేనెట్లు భుజింతును?" అనెను.

గండకియు "నాథా! యా విషయమై నీవు విచారపడనేల" యని తానొక్కొక్క ముద్దయెత్తి యతని నోటిలోఁబెట్టుచుండెను. ఇట్లు సగమన్నముతిని దగ్గితినిన యన్నమంతయుఁ గఫముతోడ దాని పైటమీఁదనే బొళబొళ గ్రక్కెను. అదియు నేమాత్రము మనస్సున నేవగింపక యావిలువగల వలువ విడిచి వేఱొక పట్టుచీర కట్టుకొని మరలఁ గొంత

యన్నము తినిపించెను. అప్పుడతని క్రుళ్ళిన వ్రేలు లుక లుక లాడు పురుగులతో తునిసి కూటిలోఁ బడెను. ఇంక నాకీ యన్న మక్కఱలేదు. నీవు భుజించి నన్నుఁ బదుకటింటికిఁ దోడ్కొనిపొమ్ము. నిద్దురవచ్చుచున్నదని యా విటుఁడు చెప్పెను. అదియును నసహ్యపడక తునిసిన వ్రేలావలఁ బెట్టి యా భక్తశేషము తోడఁ దనకుఁ గావలసినవి భుజించి లేచి మెల్లగ నతనిని బట్టుకొని లెమ్ము పోదమనెను.

అతఁడును లేవఁబోయి తటాలునఁ గ్రిందఁబడి యయ్యో! నేను నడువఁజాలను. నన్నెత్తికొని పొమ్ము అనెను. గండకియు వల్లెయని యంగీకరించి మెల్లన చంకకెత్తుకొనిపోయి పదుకటింటఁ దన పానుపుపైఁ బరుండబెట్టి వీవనతో విసరుచుండెను. ఆ విటుఁడు కొంతసేపు దొంగనిద్ర పోవుచుండెను.

ఈ విటుఁడు కుష్ఠురోగియని తెలిసినది మొదలు గండకి తల్లి "నేడీ నిర్భాగ్యుఁ డెక్కడనుండి దాపరించెను. కుష్ఠురోగి నింటఁ జేర్చిన వార్త పురమునఁ దెలిసిన మరలఁ నెవ్వడు మన యింటికివచ్చును. వీని నింట నుండనిచ్చిన నేటితో మన పరువు ప్రతిష్ఠ యార్జనము సరి. కావున వీని నిల్లు వెడలఁ గొట్టుము. ఈ పాడురోగము మనకెక్కడ సంభవించునో. వీనిని దాఁకకుము వీనికిఁ బరిచర్య సేయకుము. దాసికలారా! వీనిని గాలుపట్టి యింటి వెలుపలికి నీడ్వుఁడు" అని కొమార్త కేమేమో చెప్పును గాని గండకి యా మాటలన్నియుఁ బెడచెవిని బెట్టి తల్లితో నిట్లనియె.

అమ్మా! నీ వేల యాక్రోశ పడెదవు? వీడెట్టివాఁడైనఁ గానిమ్ము. రేపటివఱకు వీఁడే నాకుఁ బతి. వీఁడే నాకుఁ బ్రాణనాథుఁడు. వీఁడే నాకు దైవము. నీకు వేమి చెప్పినను నేను వినుదానను గాను. వీనిపై మీ రెవ్వరైనఁ జేతులు వేసితిరేని మీ జేతులు తుండించెదను. మీ కిష్టముండిన సేవచేయుఁడు. ఇష్టము లేదేని దూరముపొందు. ఈయన నిద్రపోవు

చున్నాఁడు. మీరిచ్చట నఱచి యీయన నిద్రకు భంగము కలిగింపకుఁడు" అని వారిని గసరి దూరముగఁ బంపెను.

ఇంతలో వాకిటి కావలిదూతికలు వచ్చి యవ్వా! నేపాళరాష్ట్ర సేనానాయకుఁడు వచ్చియున్నాఁడని చెప్పిరి. లంజెతల్లి యాదర బాదరపోయి యాయనను గూర్చుండుఁడని గౌరవించెను. ఆతఁడును "అవ్వా! యివో వేయి బంగారు మొహరీలు. నీకొమార్తెకిమ్ము. నేఁటిరాత్రికి నేను వచ్చెదను" అని చెప్పను. అది యా వేయి మొహరీ లెత్తుకొని పోయి పుత్రికముందటఁ బెట్టి వీని నిరాకరింపకుము. నిరాకరించితివా చెడుదుము. ఈ రోగిముండ కొడుకువలన మనకుఁ గావలసిన దేమి! వీథిలోని కీడువుము. సేనాపతివలన మనకెంతయో లాభముండును. కీర్తిప్రతిష్ఠలుండును" అని యెం తెంతో చెప్పెను గాని గండకి వినక యాపైకము మరల వానికిమ్మని గట్టిగఁ జెప్పెను. ముసలిముండయు నేడ్చుచుఁ బోయి "యయ్యా! యీ దినము నా కూఁతు రారోగ్యము చెడియున్నది. రేపు రమ్మని కోరుచున్నది." అనెను. "రేపురాను" అని యతఁ డెంతెంతో చెప్పెను గాని ప్రయోజనము మాత్రము లేదు.

వాఁడు పోయిన యొక గంటకు నేపాళరాజు ముఖ్యమంత్రి వచ్చి యదేప్రకారము నాలుగువేల మొహరీ లిచ్చెదనని చెప్పెను గాని గండకి యంగీకరింపలేదు.

తరువాతఁ గొంతసేపటికి నేపాళరాజు వచ్చి పదివేల మొహరీ లిచ్చెదనని చెప్పెను. దానికిని గండకి యంగీకరింపలేదు. ఇవన్నియుఁ బోయెనని ముసలి తొత్తుముండ తన్నుఁ దిట్టుకొనుచుఁ గొమార్తెను దిట్టుచు నేడ్చుచు ఱొమ్ము బాఁదుకొనుచు తల మోఁదుకొనుచు నేలఁబొరలుచు నేమేమోపాట్లు పడెను గాని యన్ని వ్యర్థము లయ్యెను. గావున నా విటులపాలి యమదూత యగు వేశ్యమాత యొక మూలఁబడి యేడ్చుచుండెను.

హంసతూలికాతల్పమునఁ బరుండిన విటునకుఁ గుష్ఠరోగము క్షయరోగమే గాక యతిమూత్రము గ్రహిణియుఁగలవు. కావున గడియకొకసారి తట్టలోనే వాఁడు మలమూత్రములు విడుచుచుండెను. గడియ గడియ కది యెత్తి గండకి వెలుపలఁ బాఱఁబోసి తట్టలు కడిగి తెచ్చుచుండెను. తట్టను బట్టుటలోఁ గొంచెము జాగయిన యెడల పఱుపుమీఁదనే వాఁడు మలమూత్రములు విడుచుచుండెను. ఆ దుప్పటులు పఱుపు లెత్తివైచి క్రొత్తపఱుపులు దుప్పటులు పఱచి వానిపై నది పరుండఁ బెట్టుచుండెను. ఇంతయేల? మనస్సునకు రోఁత కలిగింప నేయ కార్యములు చేయసాధ్యమో యన్నియు నా విటరత్నము చేయుచుండెను.

ఆనాఁడు దాని చీరలు పన్నీరు అత్తరు వాసనలు పోయి మల మూత్రముల కంపుతో నిండియుండెను. ఎట్లున్నను నది మనసున జుగుప్స కలది కాలేదు. రాత్రియయ్యెను. భోజనవేళ నుదయమున చేసినట్టులే వాఁడు చేసెను. అదియునట్లే చేసెను.

మరల విటుఁడు శయ్యపైఁ బండుకొని గండకిని "జూచి ప్రేయసీ! నన్నుఁ గౌఁగిలించుకొని పండుకొనుము. నీతో సంభోగింప మనస్సగు చున్నది" అనెను. అట్లే కానిమ్మని యదివానిని గౌఁగిలించి పండుకొనెను. అర్ధరాత్ర సమయమున నా విటుఁడు సుచరితా! నా కాయాసముగ నున్నది. నన్ను లేవఁ దీసి కూర్చుండఁ బెట్టుమనెను. అది యట్టులే చేసెను. కొంతసేపటి కతఁడు "నేను గూర్చుండలేను. నీ తొడలపైఁ బండఁబెట్టుకొ" మ్మనెను. అది యట్టులే యొడిలోఁ బరుండఁ బెట్టుకొను సమయమున దాని చేతులందే గ్రుడ్లు గిరగిర ద్రిప్పి వాఁడు ప్రాణములు విడిచెను.

గండకి నిర్విణ్ణురాలై "యయ్యో! నావలన వీఁ డెట్టి సుఖ మనుభవింపకయే మరణించెఁ గదా? వీని సొమ్ము నేను దేరకుఁ దినినట్లయ్యెను" అని చాల విచారపడుచుండెను.

ఇంతలో నుదయ మయ్యెను. గండకి దాసికలను బిలిచి పురోహితుని బ్రాహ్మణులను బిలిచి రండని చెప్పి పంపెను. వారును వచ్చిరి. అప్పుడు వారితో నది యిట్లనియె. "అయ్యలారా! యీ మరణించిన పురుషుఁడు నా భర్త. వీనికి శాస్త్రీయమైన సంస్కారము లన్నియు జరుపుఁడు వీనితోడ నేను సహగమనము కావించెదను నా ధనమంతయు నేను దానముచేయఁ దలఁచితిని. దానము గొన యోగ్యులైన బ్రాహ్మణుల రప్పింపుఁడు" అని చెప్పి దాసికల కందఱకు వారి వారికిఁ దగినట్లు ద్రవ్యము మఱి యితర పదార్థము లిచ్చెను. తల్లికి జీవనార్థము వలసిన ధనముంచెను.

గండకితల్లి యిదంతయుఁ జూచి లబ లబ మొత్తికొనుచుఁ గొమార్తె కెన్నో బుద్ధులు చెప్పెను. అది వినినది కాదు. అప్పుడా ముసలిది కులబంధువుల నెల్ల రప్పించి వారిచే బుద్ధి చెప్పించెను. తన కేమేమో కుబుద్ధుల బోధించు వారి నెల్లరఁ జూచి గండకి యిట్లనియె.

"మీరు చెప్పునట్టి వార్త స్త్రీ ధర్మము పశుధర్మము కూడఁ గాకుండఁగా నిఁక మనుష్య స్త్రీ ధర్మమని చెప్ప నాలుకెట్లాడును? పెంటిపశువులును మీరు చెప్పినట్టు లిచ్చవచ్చినట్టు విచ్చలవిడి పోతులతోఁ గలియవు.

కామమునే దైవముగఁ జేసికొని వర్తించు మీ వంటి వారిని మనుష్యులని యెట్లు చెప్పవచ్చును? కామమునకు మితి మేర యక్కఱలేదా? ఒక స్త్రీతోఁ దప్పఁ బెక్కురు స్త్రీలతో రమింపఁగోరు పురుషునందుఁగాని యొకనికంటె నెక్కువ పురుషులతో రమింపఁగోరు స్త్రీయందుఁ గాని నిజమైన ప్రేమ యున్నదని చెప్పువాఁడు దబ్బఱలాడు వాఁడు. అట్టివారి యందుండునది దుష్కామము. ఒక జన్మమున నొక స్త్రీకంటె నెక్కువ స్త్రీలఁ గోరు పురుషుఁడు కామదాసుఁడు. అట్లె యెక్కువమంది పురుషులఁ గోరునది కామదాసి. ఇట్టి యింద్రియదాసులు సంసారసాగరమును దరింపలేరు. ఏకపత్నీవ్రతులకుఁ బతివ్రతలకుఁ గల గౌరవము పుణ్యలోకములు గామదాసుల కెన్నికోట్ల జన్మంబులకైన లభించునా?

బహుపురుష సాంగత్యము మన కులధర్మమనియు దోష యుక్తమైనను గులధర్మము వదలరాదనియుఁ జెప్పితిరి. అంగీకరించితిని. నా తల్లి పడుపుఁగూటిచే జీవించినది. దాని కడుపున నేను బుట్టితిని. నేను దాని కడుపునఁ బుట్టుటయందు నాకు స్వాతంత్ర్యము లేదు. అది దైవతంత్రము సౌశీల్యము మదాయత్తము. లోకులందఱు సత్ప్రవర్తనము కలవారై యుండవలయునని భగవదిచ్ఛగాని యందుఁ గొందఱు చెడునడవడి గలవారై యుండవలయునని యాయన కోరిక గాదు. కావున మన చెడునడవడికి మనమే యుత్తరవాదినులము.

వృత్తులన్నియు మంచివే కాని యందుఁ జెడ్డ దొక్కటియు లేదు ఆ వీత్తులయందుండువారి చెడునడవడివలన నవి చెడ్డ వగుచున్నవి.

అట్టులే మన కులవృత్తి దుష్టముకాదు. కామదానులైన దుష్టపురుషులవలనఁ గులస్త్రీలు చెడకుండుటకై మనకుల మేర్పడినది. భగవంతుని గీతములు పాడి మన మనస్సును శ్రోతలమనస్సును ఆయనయందు లయింపఁజేయ మనము గాంధర్వవిద్య నేర్చుచున్నాము. ధనాశచే మనము దుష్టవర్తనముగలవారమైన యెడల నాదోషము మనదా వృత్తిదా? దుర్వృత్తిచే మీరు చెడి పరులను జెఱుచుచున్నారు. అట్టి కార్యము నేను జేయఁజాలను. బ్రాహ్మణులు కొందఱు త్రాగుఁబోతులు దొంగలైనయెడల బ్రాహ్మణవృత్తి చెడ్డదగునా? రాజులు దుష్టబుద్ధులై ప్రజలను బీడించిన క్షత్రియవృత్తి చెడ్డదా! అట్టులే యన్ని వృత్తు లాలోచింపుఁడు కులములవలనను గులవృత్తులవలనను మేలెంత గలదో యాలోచింపలేక వానిపై దోషములు చెప్పు ఖరబుద్ధుల మిమ్మేమన వచ్చును?

కులధర్మము మానరాదు గనుకనే నేను నా తల్లివృత్తి నంగీకరించితి గాని యందు మీవలె దుష్కార్యములు చేయుటకు మాత్ర మంగీకరింపనైతిని. ఒక స్త్రీ యొక పురుషుని భర్తగఁ గోరెనేని యది వాని భార్యయె కదా.

అట్లైనచో వాని విషయమున నా స్త్రీ పతివ్రతయగు భార్యవలెనే కదా నడచుకొనవలయును? ఈ విషయమున అంకుటాంద్రు మనకంటె నీచులు. వారివలెఁ జోరవ్యాపారములు మనకు లేవు. మనము మనుష్యులకు భయపడవలసిన యక్కఱయు లేదు. కావున మనవలన సుఖముగోరి మన యింటికివచ్చిన పురుషుని భర్తవలె మన మేల యాదరింపరాదు? ఈ విధముగ మనము సాధ్వీవృత్తమును రక్షించుకొనవచ్చును. దినమున కొక్కఁడని నియతి యుంచుకొనుటచేఁ గులధర్మము రక్షించుకొనవచ్చును. నేనీ విధమున నుభయధర్మరక్షణ మాదినుండి కావించుచున్నాను. కావున నీ చచ్చినవాఁడే నా భర్త. వీనితో సహగమనము చేయుటే నా నిశ్చయము" అని తెగనాడి వారి నందఱఁ బంపి పీనుఁగుతోడ స్మశానమునకుఁ బోయెను.

స్నానముచేసి విలువగల వలువ కట్టుకొని సమస్తాభరణములు ధరించి పుష్పమాలాలంకృతయై యా మరణించిన పురుషునినే దైవముగ ధ్యానించుచు బతివ్రతల పుణ్యలోకము నాకు లభించునుగాక యని మండెడు చితియందు 'జయ జయ లక్ష్మీపతే'యని దుమికెను.

చూడవచ్చిన వేలకొలఁది జనులందు హాహా కారములు చెలఁగెను. అది మంటయందు దూఁకిన తత్క్షణమా పీనుఁగు మాయమయ్యెను. మంట చల్లారెను. ఇంద్రబ్రహ్మరుద్రులతోడ విష్ణువు గండకికిఁ బ్రత్యక్షమై "సుశీలా! యేమివరము కోరెదవు? కోరు మొసఁగెదను. రోగిగానుండిన విటుఁడను నేనే. నిన్నుఁ బరీక్షింప నీ ముప్వురు మాఱువేషముల నీ యింటికి వచ్చిరి. నీ నియతికి మేమందఱము మెచ్చితిమి" అని చెప్పిన గండకి వారికెల్ల నమస్కరించి నారాయణునితో నిట్లనియె.

"దేవా! నాకుఁ బుత్రవాంఛ గలదు. నీవు నా కడుపునఁ బుట్టవలయును. అటైన నేనుభయలోకములఁ దరింతును" అనిన నారాయణమూర్తి యిట్లనియె.

“ఈ జన్మమున నీకడుపున నేను బుట్టరాదు. మఱుజన్మమునఁ బుట్టెదను” అని చెప్పి దేవతలతోడ నంతర్థానమయ్యెను.

ఆ గండకియే గండకీనదియై మఱుజన్మమున జన్మించెను. దానియందే సాలగ్రామములు పుట్టుచున్నవి.

### 9. వాల్మీకి చరిత్రము

భార్గవవంశమునఁ బ్రచేతసుఁడను నాయనకుఁ బదుగురు కుమారులు గలరు. అందుఁ గడగొట్టు కొమరుఁడు ఋక్షుఁడు. ఈతఁ డందఱకంటెను జిన్నవాఁ డగుటచే నీతని తల్లిదండ్రులుఁ గారాబమునఁ బెంచిరి. అట్లుండియు నతఁడు కులాచార ప్రకారము గురులయాజ్ఞఁ బూని గురుకులవాసమొనర్చి వేదములను సాంగోపాంగము నధ్యయన మొనర్చి నిత్యనైమిత్తికకర్మముల నెల్లఁ దీర్చుచుఁ బెద్దలసేవ చేయుచు సత్యవాచాధురీణుఁడై పెరుఁగుచుండెను.

ఇట్లుండ నాయనకు మతికపాయంబైన ప్రాయంబుదాపరించెను.

**సీ.** **నిగనిగ మనుకురుల్ నిడుదలై పెంపారె**
**నురము విశాలమై యొప్పుఁ గూరె**
**నడక నొయ్యారంపుఁగడఁక యొక్కటి హత్తెఁ**
**జిరునవ్వు నెలవులఁ జిగురులెత్తెఁ**
**గన్నుఁ దమ్ముల గర్వమున్నతిఁ జెలువారెఁ**
**బొదలె సంతుష్టి మైపుష్టి చేరె**
**నూనూఁగు మీసముల్ జానుగాఁ బొడసూపె**
**బాహువుల్ దృఢదీర్ఘపటిమ రేఁపె**

**తే.** **మోము వికసించె నభిమాన మాముకొనియె**
**శాస్త్రమందలి శ్రద్ధయు సన్నమయ్యె**
**సొగసులను గోరెఁ జిత్తంబు సొబగు మీఱె**
**నింబుమీఱిన నవ యౌవనంబునందు.**

సీ. తొమ్ము విఱిచి వీధి నెమ్మిగాఁ బోవుచుఁ
దన భుజయుగ్మంబుఁ దానె చూచు
మెడ నిట్టబిగిసిన పడువున నిజశీర్ష
మును పంపకయ మిన్ను గనుచు నరుగు
నడుము పంగదొ యేమొ గడుసున నన్నట్లు
బిఱ్ఱనీల్గుచు విఱ్ఱవీఁగు చేగు
ద్విరదంబు తొండంబు వెక్కిరించిన యట్లు
చేయూఁగులాటలఁ జెలువు చూపు

తే. దంటవాల్గంటికములఁ గ్రేఁగంటఁ జూచు
వెలఁదిసల్లాపములకును వీను లిచ్చుఁ
జదువు సంధ్యల నొక్కింత సడలఁ బుచ్చు
భాసురంబగు వయసున భూసురుండు.

తే. సాటిమీఱిన యౌవనపాటవమున
దీటులేని యొయారంపు నీటు మెఱసి
యోట గానక మీఁదటిచేటు గనక
నేటకొనియెను బొఱుగుల మేటియగుచు.

ఇట్లతఁడు క్రమక్రమంబుగ కులోచిన కృత్యములు మానుచు విటోచిత కృత్యముల మరగుచు నుండి తుదకు దుష్టస్త్రీ లోలుండయ్యె.

సీ. వామాక్షితోడి దుర్వాదంబు వేదంబు
చపలనేత్రానామ జపమె జపము
భోగినీకేళి సంయోగంబె యోగంబు
రమణ ద్యూతక్రియా వ్రతమె వ్రతము
అంబుజాక్షీరతాధ్యానంబె ధ్యానంబు
దోచేడె చేయు దుర్బోధ బోధ

సారసాక్షీ హితాచరణ మాచరణంబు
చెలితోడి రతిశాస్త్ర శిక్ష శిక్ష

తే. పాపినీజన పదయుగ్మసేవ సేవ
చంచలాక్షి మణీకృత చర్చ చర్చ
గాఁగ నోరంతప్రొద్దు దుష్కామి యగుచు
గట్టివయసున నాతండు రట్టువడియె.

ఇట్లతఁడు కులము కులమర్యాద లెల్ల మఱచి విటుఁడై విటీ రత లంపటుఁడై తిరుగుచుండెను.

తండ్రి యెందో వనాంతరములఁ దపస్సు చేసికొనుచుండెను. తల్లి కుమారుని చేష్టలేటిఁగియుఁ గొన్ని నాళ్ళు బాలుఁడని, కొన్నాళ్ళు గారాబముచేతను బరులు చెప్పినను నమ్మక తన కన్నులను మనస్సును నమ్మక వర్తించెను. మతి మాలిన తల్లిదండ్రుల మితిమీఱిన గారాబముచేఁ గదా బిడ్డలు చెడిపోవుట. అయినను నానాఁటి కతని దౌష్ట్యము ప్రబలమగుటచే నొకనాఁడు కుమారునిఁ జేరఁదీసి తల్లి యిట్లనియె.

కం. వారును వీరును నీపయిఁ
గారానివి నవియు నివియుఁ గడఁగిరి చెప్పన్
బోరానిచోట్ల కేగిన
రారానిది మాట వచ్చురా నా తనయా!

సీ. జూద గాండ్రను గూడి జూదమాడెదవంట
వాడవదినెల జోదు వీడ వంట
త్రాగుఁబోతులగుంపుఁ బ్రోగుచేసెదవంట
వారితో నేస్తంబు వదలవంట
లంజెలవాకిండ్ల సంజిఁ గాచెదవంట
పుంజులకొట్లాట కొంజవంట

మక్కువ పెద్దలఁ గొక్కిరించెదవంట
యాఁడువారలవెంట నరిగెదంట
తే. యేలరా నాయనా నీకు నిట్టి రట్టు?
కుడిచి కూర్చుండి యొకచోట గుట్టుగాను
గొంపలో నున్న వ్రేలఁజూపింపఁగలరె
యెవ్వరేనియు నాపుత్ర! హితచరిత్ర?

సీ. బ్రహ్మవేళను లేచి వారి నాడఁగరాదె?
వఱువాతఁ దొలిసంధ్య వార్వరాదె?
జలజాక్షుపూజకుఁ దులసిని దేరాదె?
పూలచెట్లకు నీళ్ళు పోయరాదె?
కుశసమిధుల నేరి కూర్చి పెట్టఁగరాదె?
యింపుగా శ్రుతు లభ్యసింపరాదె?
బ్రహ్మయజ్ఞాదికర్మములఁ జల్పఁగ రాదె?
యన్నల కాపయి యలరరాదె?

తే. చలుపఁ గారాదె త్రిషవణ స్నానములను
దలఁపఁ[10]గారాదె తిరుమంత్ర తంత్రములను
దెలుపఁగారాదె పుణ్యకథలను నాకు
నగునె నాతండ్రి నీకిట్టి యవగుణంబు.

సీ. బ్రహ్మచారికి నేల పరిమళ ద్రవ్యముల్?
వటునకేటికి దుష్ట విటులపొత్తు?
వర్ణికేటికి గీతవర్ణంబులను నేరు?
వుర్వీసురున కేల ద్యూతకేళి?
జన్నిగట్టున కేల సన్నగాంధ్రురచెల్మి?
బొమ్మచారికి నేల యెమ్మెసేఁత?

తడపదాల్చున కేల పడుపుఁజేడెలగోష్ఠి?
    గోఁచిబాఁపని కేల కొమరుహొయలు?

తే. కఱుకుదనమేలరా నన్నుఁ గన్నతండ్రి?
మొఱకుఁదనమేలరా నాదు ముద్దుఁబట్టి?
యపయశంబేల యార్జింప నయ్యనీకు?
నాదమఱచితె కులముమర్యాద పుత్ర?

కం. సారాయంబును యువతులు
నారాయ సుస్వాదువిషము లనఁగా వినవే
కారాదుర నాతనయా!
జారత్వము పాపశీలచారిత్ర మెటున్.

తే. తండ్రి కోపిష్ఠుఁ డాలించి దుండగముల
దుండిపడి నిన్నుఁ దండించుమాట నిజము
కన్నకడు పౌటఁ జెప్పెద నన్న! నీకు
వలదురా యిట్టిచేఁత నాపాదమాన.

అని తల్లి యెన్నెన్నియో నీతులు చెప్పెను. గాని యామెమాట లతనిచెవులఁ దూఱినవి గావు. ఇంక నింటిలోని పోరు సహింప దుస్సహమని తన వలపు లంజెను బోయతను దోడ్కొని యరణ్యమధ్యముం జేరి యందు మాంసాశనుండై జీవహింస గావించుచు ప్రియురాలికిఁ బ్రీతిగూర్ప విత్తమ్మునకై చౌర్యము గావించుచుండె.

తే. దండధరుఁడన నుద్దండ దండమూని
గండుమీఱుచుఁ బాంథుల గుండె లగల
దండిబాటల సందుపొం చుండి జనుల
దుండగించుచు విత్తముల్ దోచుకొనియె

తే. మంచి బ్రాహ్మణుఁ డగుచు జన్మించియేల?
నిఖిలవేదాదివిద్యల నేర్చియేల?

**కనికరంబన నెట్టిదో కాని మదిని**
**దలఁపలేఁడయ్యె గ్రహచారబలముపేర్మి**

**తే. ప్రాయమెల్లను బోయత పాలుచేసి**
**కులము కులవిద్య లంజెకుఁ గుదువ కిచ్చి**
**శీల మెల్లను దొత్తుల సేవ కునిచి**
**కాల మరుగంగఁ బెద్దకై వ్రాలె వయసు**

ప్రాయ ముడిపోవుచున్నను విషయ వ్యాయామంబు వదలక యతండు నిషాది మాయకు లోనై దానికిఁ బరిచర్య చేయుటచే దేవసపర్యగా నెంచుచు

**తే. జీవహింసల నెన్నియో చేసి చేసి**
**సాధువుల నెందఱనొ పట్టి చదిపి చదిపి**
**బాటసారుల తల లెగమీటి మీటి**
**ధనము గడియించుచుండె నవ్వనమునందు**

ఇట్లు దీర్ఘకాల మరుగఁ దనకు బాంధవుండైన యా బుక్షుండిట్లు దారుణసంసార బంధమునఁ జిక్కుపడి యుండుట చూచి పరితాపపడి సార్థకనామధేయుండైన నారదుండొక్కనాఁడతఁడు దోఁపిడికై కాచియుండు తెరువునఁ బోవుచుండ నా బ్రాహ్మణ బ్రువుండు తటాలున నడ్డమైనిల్చి యదల్చి దండమెత్తి మొత్తఁబోయి మెత్తపడిన యత్తపస్వితోనిట్లనియె

ఓయీ! నీ కాసత్తువ లేదు రిత్తవాదులాడక నీ యొద్దఁగల విత్త మిచ్చెదవా లేక ముడ్డిపూస మూతికి వచ్చునట్లు మొత్తుదునా?

**కం. వేసంబు వేసి యిట్టులు**
**దాసరివలె వగలుపడినఁ దప్పించుకొనం**
**గా సాధ్యమె? తడ వేలా?**
**రోసము రాకుండమున్నె రొక్కములిమ్మా**

**తే. దండధరు చేతిదండంబు తప్పఁ దప్పు**
**నాదుదండంబు దప్ప దేనాఁటికైన**
**బోడిబాఁపఁడ! నీ వెడబుద్ధి మాని**
**బ్రతుకవలతేని ధనముల బయల నిడుము**

అనిన నారదుం డోరి నిషాదా! నేను ఋషిని. నా యొద్ద ధనములేదు. నాకుఁగల ధనము పెట్టిన పుట్టిగోఁచియు గట్టిన జింకతోలును బట్టిన వీణె యింతమాత్రంబ. వీనిలో నీ కేది వలసిన నది కొనుము. అనిన నతం "డోరి మొండిబాఁపఁడా! నీవు రిసివో గిసివో నా బారిన బడినవాఁడు నా కేదైన నీయక దాఁటి పోరాడు. ఇది నా నియమము. నీ గోఁచియు జింకచర్మము నాకేల? నీతంబుర యిచ్చుటఁ బెట్టిపొమ్ము."

అనిన నారదుఁడు బోయా! నేను దీనిని వాయించి తిరిపె మెత్తవలయును. దీనిని నీవు హరించిన నా జీవనోపాయము పోవును. కావున క్షమించి పోనిమ్మనిన నతఁడు కోపించి,

**కం. ఇచ్చెదవా? చచ్చెదవా? పెక్కులు మాకడను నీవు ప్రేలెద వేరా**
**వచ్చె నిదో దండము తల పుచ్చెయెగురు తడవుచేయఁ బూనెదవేనిన్**

అనిన నారదుండును మెత్తఁబడినట్లు నటించుచు నోయీ యిదిగో నా వీణాదండము తీసికొనుము. ఇది నేను తిరిపెమెత్తువేళఁ బలుకుఁదోడై యుండెను. దీనితోడ నా బ్రతుకును బోయెను.

**తే. వెండి గాదిది బంగారు గిండిగాదు**
**సొమ్ములా కాదు మగరాల సెమ్మె గాదు**
**పట్టి యమ్మిన రూకయుఁ బుట్ట దేల**
**యంగుమాలిన యట్టి యీ టింగుబుఱ్ఱ?**

అనిన నా భ్రష్టబ్రాహ్మణుఁడు "అయ్యవారా! నీ వేమి యాగడములు పలుకుచున్నావు. నీ జోగిపెత్తనము మానవైతివి. దీనిని విక్రయించి రూకలు సంపాదించి జీవింపవలసిన కష్టదశ నాకు రాలేదు.

**కం. ఈ టింగుబుఱ్ఱ నిచ్చిన**
**మీటును నా బోటి వేడ్క మిగులఁగ నాకున్**
**ఆటల నాడుదుఁ బాడుదుఁ**
**బాటల నది సంతసిల్ల పరువుగఁ జూడన్**

**కం. గోఁచిబాఁపఁడ నాకేమి కొఱఁత ధనము**
**వలసినంతయు నున్న దవ్వారిగాఁగ**
**నెంచఁగా రాదె యీ యావరించియున్న**
**కోట్లకొలఁదుల పుట్టెల కుప్ప లెందు**

అదిగో నల్ల కానవచ్చునదే నా గుడిసె. అందు నా ప్రియురాలు నేను బిడ్డలతోఁ గాఁపుర ముందుము.

అనిన నారదుండు

**ఆ. టింగుబుఱ్ఱ నీవు సంగ్రహించుటఁ జేసి**
**తిరిపెమెత్తు పనియుఁ దీఱిపోయె**
**నిండ్లవెంటఁ బోవ నింకేమి లాభమో**
**యుండుమన్న నిచట నుండువాఁడ**

**తే. దొడ్డవాఁడవుగా మదిఁ దోచె నీవు**
**చిన్నవిన్నప మొక్కటి సేయువాఁడ**
**గోఁచిబాఁపని మీఁదను గోపపడక**
**యానతీయుము నీపద మాన యింక**

**కం. నీ వెవరికొఱకుఁగా నా**
**నావిత్తములం గడించినాఁడవొ చెపుమా**
**నీవు సుఖించుటకా? మఱి**
**నీవారలకొఱకొ? కాక నీ ప్రియకొఱకో?**

అనిన నతండు నగుచు

కం. అలరిబాఁపఁడ నను నిటు
లాలిగొనుదె? నాకు నేటికయ్యా ధనముల్
ఆలికిఁగా నొడఁగూర్చితి
నాలియె నాకిహము పరమునైన కతమునన్

చం. వలసినయంత కల్లును నవారిగఁ ద్రావి పొగాకు గొంటుపోఁ
కలు పొడిసున్నమున్ గలుగుకమ్మని తమ్ములముబ్బుచూప బు
గ్గల, మెయిఁ దెల్విలేక యెసకంబున నిట్టటు సోలి వ్రాలి పే
రెలమి నొసంగుముద్దునకు నేమి యొసంగఁగనేర్తు బాఁపఁడా?

ఉ. అన్నవలాకు సాటియగు నయ్యేలనాఁగను జూడలేదు ము
న్నెన్నఁడు నేని, పేరెలుఁగు లేర్పడఁ బాటలు పాడుకొంచుఁదా
సన్నని వ్రేళ్ళ గోళ్ళ హవుసారఁగ తింగని చిందు ద్రొక్కుచున్
గిన్నర మీటునీటు గని కిన్నరకన్యలు చిన్నపోవరే

కం. పాటలు పాడెడి వేళను
వాటముగా నోరుతెరిచి వర్తిల్లు తతిన్
గాటపు టెఱ్ఱని పల్లుల
నీటున కేనేమి యియ్య నేర్తును జెపుమా!

కం. మానము ప్రాణంబయ్యేదె
మానుదుఁ బ్రాణంబునైన మతి తొయ్యలికై
మానవె తల్లిని దండ్రిని
మానవె నా కులము? దేనిమానను జెలికై?

అనిన విని నారదుండు నెఱకుతేఁడా? నీకుల మెయ్యది? నీ తల్లిదండ్రు లెవ్వరు? నీ వంశ నామధేయం బెద్ది? ఇన్నియు విడువ నేమికారణ మొదవె? కోపములేక దయయుంచి చెప్పుము. నేనును నీవాఁడ ననుకొమ్ము. అనిన నతఁడిట్లనియె.

తే. ఎఱుక వాఁడంచుఁ బలికితి వెఱుక లేక
కింకలును బొంకులును నాదు వంకరావు
భృగుకులంబునఁ బుట్టితి ఋక్షదంద్రు
క్షితిని నాపేరు, నేను బ్రాచేతసుండ

కం. కులమేటికి? ధనమేటికి?
నిలువడి యేమిటికి? దల్లియేటికి? నన్నున్
వలచిన కొమరుం బ్రాయపుఁ
గులుకుం గుబ్బెతలపొందు గూడకయున్ననన్

కం. నా దేహము దానిదియే
నా ద్రవ్యము దానియదియె నాయది యనఁగా
లే దిల నొక్కటియైనను
మీఁదిడితిని నాదునుసురు మెలఁతకుఁ గాఁగన్

అనినవిని నారదుండు వాని పాతిత్యమునకుఁ గామాంధతకు మనస్సున మిగులఁ బరితాపపడుచు వాని నెటులైనఁ గావఁ బూనిన తన సంకల్పంబు కొనసాగింప నెంచి వానితో మెల్లన నిచ్చకంబులాడుచు నిట్లనియె.

కం. తెలివి యొకింతయు లేమిని
దెలియక యడిగెద నొకండు తెలుపంగదె నా
వలనను నేరము లెంచక
చెలికాఁడవు కావె యిన్ని చెప్పుట చేతన్

కం. వాసిగ నీవు పల్కినది వాస్తవ మింతయుఁ గల్లగాదు, నీ
కోసరమై ధనంబులను గూర్చిన వాఁడవుకావ యైననున్
జేసితి గాదె పెక్కులగు జీవవధనంబులు చేతులార? నా
దోసము నీదొ నీవలచు తొయ్యలిదో యెఱింగింపుమీ దయన్

అనిన నతండు నారదుమొగ మట్టెచూచి యోరి దాసరీ తెలియక యడిగితి నటంచుఁ బలికితివి గాన బ్రతికితివి. నీకు మతిపోయినదా యేమి? నా ధనమంతయు నా యాలికి తనయాలికిఁగా సేకరించితినని చెప్పలేదా? ధన మనుభవించువారు దానివలనఁ గలుగు ఫల మనుభవింప వలదా? ఇందేమి వింతయున్నది. కొనిపోయిన ద్రవ్య మంతయు దాని చేతనే యిడితిని. అదియేదాఁచి పదిలపఱికొనియున్నది. నేనేమైన గంటుగట్టితినా? పాపము నా కెట్లువచ్చును? ఇంక నిట్టి తెలివిమాలిన మాటలు పలుకక వీణియ నిచ్చి పొమ్ము. మాటలాడితివేని నీ తల పగులఁగొట్టుదును.

నారదుడు : అయ్యా! నీకంతటి ప్రాణపదమైన ప్రియురాలి మెడనింతటి ఘోరపాపములను వేయుట నీకు ధర్మమా? ఈ పాపములు చేసినవాఁడవు నీవు కాని యదిగాదు. అది యంగీకరింప నీ పాపము దానిని జెందదని తోఁచెడిని. నీ ప్రాణదయిత నీ ధనమును దీసికొనునే కాని నీ పాపమును దీసికొన సమ్మతింపదు.

**కం. పాపము నీదో నాదో**
**దాఁపక వచియింపు మనుచుఁ దటకునఁ జని నీ**
**పూపవయస్సు మీటారిన్**
**గోపింపక యడిగి యవలఁ గొట్టము నన్నున్**

వలయు నేని నీ వీ వీణయ కొనిపొమ్ము. నీవు వచ్చువఱకు నేనింద యుండెద.

బుక్షుఁడు : నా భార్య గుణ మెఱుఁగక నీవు భ్రాంతిపడుచున్నావు. కార్యము చేయుటచే నాకుఁ గొంతపాపము లభించు నట్లుండినను నా ప్రాణమే తన ప్రాణముగను నా సౌఖ్యమే తన సౌఖ్యముగ నెంచుకొనుచు నాకై యెన్నెన్ని కష్టములో పడుచుఁ దనవారినెల్ల విడిచి నాకైవచ్చి యిచ్చటనుండు

నా యండజాక్షి నా పాపమును దనది గానే యెంచుకొని ఫలమనుభవించును కాని నన్నుఁ బాపముల పాలుసేయదు. ఇది నిక్కము. దాని నోరనే యిదిచెప్పించి నీకుఁ దలవంపు చేసెదఁ జూడుము. నా భార్య లోకములోని యందఱ స్త్రీలవంటిదని తలంచితివి. దాని గుణమెక్కడ! దాని యౌదార్యమెక్కడ! దాని ప్రీతియెక్కడ! నేనొక నిమిష మాలసించినఁ బ్రాణాపాయదశ వచ్చినట్టు తకతక లాడునే. వాకిట నెదురు చూచునే. నా సుఖమునకై తన ప్రాణమైన నిచ్చును. గాని వెనుదీయునా? నీవు నాతోడ రమ్ము. నీ యెదురనే పలికించెద.

నా : నేనురానేల? నీ వెన్ని పాపములు చేసినను ససత్య మాడినవాఁడవు కావని యెఱుఁగుదును. నీ వడిగి వచ్చి జరిగిన వృత్తాంతము చెప్పుము. చాలును.

అనిన బుక్షుఁడు వీణెం గైకొని చక్కఁదన మక్కువ చెలిం జేరఁబోయి తనకు నారదునకైన సంవాదంబు తెలియఁ జెప్పి నేనుజేసిన జీవహింసాదులవలని పాపంబు నీదో నాదో చెప్పుము. అని యడిగిన బోయ దిట్లనియె.

**చ.** **విన విన వింతలాడెదవు వెంగలి! ధర్మము దిద్దవచ్చితే?**
**పని వడి నన్ను బంధులకుఁ బాపుచు నీవయితోడితేవొ? గు**
**డ్డను మతి కూడు నెప్పుడు కడంగి యొసంగుచు నుండి సాఁకతం**
**బును బొనరింతు నంచనవె? మోసము వచ్చెనె నీదుబుద్ధికిన్**

**తే.** **లంజెలకుఁ గూడు గుడ్డయు లంజెకాఁడు**
**గాక మతియెవ్వఁ డిచ్చునో లోకమునను**
**అబ్బురంబుగ నేఁటికి నబ్బినాఁడ**
**వాలికిని గూడు పెట్టెడి నాలుమగఁడు**

కం. అన్నా నా ౘ్రముచ్చిలు మని?
యన్నా నాహింసచేయు మంచున్ నిన్నున్?
మన్నీఁడవు కారాదా?
మున్నన బ్రతుకంగరాద మతి నీకున్నన్

కం. కాపాడెదు భారం బది
నీపైఁ బడె నేటిజోలి నీ పోకలతోఁ?
బాపంబే చేసితివో
యేపున్నెము చేసినావొ యెటు తెచ్చితివో

కం. అదియంతయు నాకేటికి?
వదలక నీ తెచ్చుచున్న వస్తువులను నే
ముదమున వండితిఁ బెట్టితిఁ
గొదమాటలు నావి కావు కుదుచుట దక్కన్

ఆ. సింగి బిడ్డఁగన్న సింగఁడు కారంబుఁ
దిన్న యట్లు తీర్పు దిద్దవచ్చి
నాఁడ వేర యిచట నానాఁ డెఱుంగను
నేఁడు తెలిసె నీదు నీచ బుద్ధి

తే. భార్య నేనైతి నీవు నాభర్త వైతి
రక్షణీయను నీవు నా రక్షకుఁడవు
కాన నన్నెట్లు చెందు నీ కలుష మోరి
మగఁడ! చెప్పుము శాస్త్రప్రమాణ సరణి

తే. రాష్ట్రపాపం బదెట్టులు రాజునొందు
రాదఘంబు పురోహితుఁ గూడు నెట్లు
ధర్మసూక్ష్మంబు దలపోయఁ దద్విధమున
భార్య యొనరించు పాపంబు భర్తనొందు

ఉ. కావున నాదుపాపము ప్రకాశముగా నినుఁ బొందుఁ గాని నీ
భవనరీతి నీ సలుపు పాపమునన్ జెనకంగ నోపునే
కావున నీవు సల్పిన యఘంబులఁ గల్గు ఫలంబుఁ బొందఁగా
నీవొకరుండె పాత్రుఁడవు, నిక్కమెఱుంగుము సత్యమాడితిన్

ఓరీ! బాలుర పాపంబు వారి తల్లిదండ్రుల నొందునను మాండవ్య వాక్యంబు వినలేదా? భార్యచేసిన పాపమున భర్త యర్థాయువై దానికి ముందే మరణించునను వాక్యము వినలేదా? భర్తచేసిన పాపము భార్య నొందినట్లు ప్రమాణమో దృష్టాంతమో చెప్పఁగలవా? జగద్విదితమైన యీ విషయమున నీ వింత మూఢుఁడవైతివేల? అని యళుకు కొంచమైన లేక తెగనాడిన యా బోయచేడియ మాటలు విని ఋక్షుండు వెలవెలఁబోయి యుస్సని వేఁడి యూర్పులు పుచ్చుచు హానీ వింతటి దానవని తెలియక పోయితిని గదే యోసి తొత్తాపాపముల దుత్తా దీనికా నిన్నుఁ గుత్తగఁ గొంటిని? అయ్యయ్యో!

సీ. బంగారువంటి నా బ్రాహ్మణకులమును
వెడఁగనై నీవాత నిడితిఁ గదవె
కన్నతల్లియు నింటఁ గంటికిఁ గడవెఁడు
నేడువఁగా వీడినాఁడఁ గదవె
యెన్నెన్ని పుట్టువు లెత్తిన నబ్బని
శీలంబు ధారవోసితిని గదవె
యంబుజాక్షుని తిరువారాధనము మాని
చెడిపె! నీ సేవ చేసితిని గదవె

తే. తొత్త నీపొత్తెముత్తినాఁ దోఁచెఁ గదవె
జొల్లెసుధ యని తలఁపు రాజిల్లెఁ గదవె
యోసి నీ వాక్కె వేదమం చుంటిఁ గదవె
నాతి నినుఁగూడి భ్రష్టుఁడ నైతిఁ గదవె

ఉ. నమ్మితి నీవె వేల్పవని నమ్మితి నా సుఖదాత్రి వంచు నే
నమ్మితి నీవె ప్రాణమని నమ్మితి సర్వము నీవ యంచునే
నమ్మినదానికా యిటుల నారక బాధకుఁ బోరయంచు నీ
వెమ్మెలు నాదఁజొచ్చి తిఁక నెమ్మెయినే నిరయంబు సైఁచెదన్

అని యట నిలువనొల్లక దాని మొగమైనఁ జూడ నొల్లక నిప్పులం బొరలినట్లు తాపంబుగాని పరువున వచ్చి నారదు పాదంబులం బడి మహాత్మా! నీ శరణుఁ జొచ్చితిని. నీవే నాకు దిక్కు. నన్ను రక్షింపవచ్చిన దేవతవు. నన్ను రక్షించుభారము నీది. అజ్ఞానాంధుఁనై సంసార కూపంబునఁబడి మునిఁగిన నాకుఁ గన్నులిచ్చిన పరదేవతవు. మునీంద్రా! యధముఁడను మూర్ఖుఁడను క్రూరుఁడను.

ఉ. సన్నుతశీల! నింద్య మగుచర్యలు లోకమునందు నెన్నియో
యన్నియు నొక్కటొక్కటి శతాయుతవారము లేనొనర్చితిన్
అన్నిరయంబునం గలుగు యాతనలందును నొక్కటొక్కటే
యెన్ని మహాయుగావళుల నేఁబడియుండినఁ దీఱిపోవునో

కం. అయ్యాయను నేఁజేసిన
యయ్యఘములఁ దలఁప గుండె లవిసెడి నవె నా
యయ్యయి కృత్యంబులు థా
మొయ్యన నాకనులు కెదుర నుగ్రతఁ దోఁచెన్

ఉ. ఘట్టని యొక్క పెట్టుఁ దలపై నిటఁ బెట్టిన మిట్టిపాటుతో
నట్టె చివుక్కనన్ నెగసి యౌదలమోమున నెత్తురుట్టుచున్
గట్టఁ గరుళ్ళు తన్నుకొని కాలులు చేతులు చచ్చువారిదే
యెట్టెదుటన్ నిలంబడి రిఁ కేదియొ నాగతి యానతీయవే

కం. తల వ్రక్కలైన నెత్తురు
నిలువునఁ గాఱుచుచు మోము నిండం గన్నుల్

తల తేలఁవేలవైచుచు
విలవిల తన్నుకొనువారి విధముల్ దోఁచెన్

కం. విత్తముల నీక దాఁచిన
యత్తన్వులచీర లొలిచి యంగ మొలలఁ బో
మొత్తితి; మానము దీసిన
చిత్తల బిత్తరులు నెదుట వ్రేలెద రయయో

కం. అబ్బా చెడితిం బడితిన్
నిబ్బర మెద లేదు తలఁప నేరంబు లయో
ప్రబ్బికొనివచ్చి యల్లదె
యబ్బూతము లెల్లఁ జొచ్చె నదలింపంగన్

తే. ఎన్ని నరకంబు లున్నవో యన్ని యవిగొ
నెదుర నున్నవి యయ్యయో యెవరు దిక్కు?
కింకరులు వచ్చి యీడ్చుచుఁ గింకిరి గొని
కొట్టునట్టులు దోఁచెనో కోవిదేంద్ర!

కం. ఆడితిఁ గల్లలు, గురు విడ
నాడితి, శీలంబుఁ దూల నాడితి, నసతిన్
గూడితిఁ, జౌర్యంబును గొం
దాడితి, మదిరకును ద్రోపు లాడితి నయ్యో

కం. మఱచితిఁ గులమర్యాదలఁ
జెఱిచితిఁ బరసతులఁ జౌర్యచేష్టలకును మున్
బఱచితి నెఱచి భుజింపం
గఱచితి దుష్కృతుల కౌదు గఱచితి నకటా

ఉ. చేసిన యన్ని పాపములఁ జెప్పఁగఁ బట్టెడు నేండ్లు పూండ్లు నేఁ
జేసిన పుణ్యకార్యములఁ జెప్పఁగ వ్రేలును వంచి యెన్నఁగా

**వాసిగ నొక్కటేన్ మదికి వచ్చుటలే దిఁక నేమి చేయుదున్**
**బాసె మదాంధకార మెదఁ బాప భయంబు కదున్ వధించెడిన్**

**ఆ. కావవయ్య నన్నుఁ గరుణామయాత్మక!**
**బ్రోవవయ్య నన్నుఁ బుణ్యపురుష!**
**యేలవయ్య నన్ను హితలోక నుతశీల!**
**మనుపవయ్య నన్ను మౌనివర్య!**

అని మునివరు చరణంబుల వ్రాలి పాపభయమునఁ గన్నీరు మున్నీరుగా నేడ్చుచుఁ దన పూర్వజన్మ సుకృతవశంబున నుత్తమజ్ఞాన మొదవ శరణాగతుండైన యతనిఁజూచి కరుణానిధియగు నారదుం డిట్లనియె.

ఓయీ! నాకు బంధుండవైన నీవిట్లు సంసారాంధవునఁ బడి కన్ను మిన్ను తెలియక వర్తించుట గని సంతాపంబుగొని నినుఁ జక్కదిద్దఁ జనుదెంచితిని. దుఃఖమయ సంసారమును సుఖాస్పదంబని తలఁచువారి నేమనవచ్చును?

**తే. రొక్కములఁ దెచ్చి మక్కువ యెక్క నిచ్చి**
**దాని యిచ్చాను వృత్తిని దవులువఱకు**
**నాలి యాలియె పిదప గయ్యాళి గాదె**
**కలదె సౌఖ్యంబు సంసార గహనమందు?**

**తే. చచ్చియైనను బరులను జంపియైనఁ**
**జుట్టలకు భయభక్తులు చూపి ధనము**
**పెట్టినను బెండ్లి, శ్రాద్ధంబు, పెట్టకున్నఁ**
**గలదె సౌఖ్యంబు సంసార గహనమందు?**

**తే. విత్తములఁ దెచ్చి యిచ్చుచు మెత్తనగను**
**భయము మైఁగొల్చి సేవించి వఱలువఱకు**

నన్న యన్నయె మఱి జము దున్నగాఁడె?
కలదె సౌఖ్యంబు సంసార గహనమందు?

తే. రిత్త దశవచ్చి పెట్టుట యుత్తదైన
మాలపోలిక ననుకంప మాని కంద్రు
కల్లదోషంబులను మెడఁ గట్టుచుంద్రు
కలదె సౌఖ్యంబు సంసార గహన[12]మందు?

తే. అర్థ మెందాఁక నదుగఁడో యంతవఱకు
నేస్తమంతయుఁ జక్కఁగ విస్తరిల్లు
ధనముతోడన స్నేహంబు తఱిగి పోవు
కలదె సౌఖ్యంబు సంసార గహనమందు?

తే. ఒడల బల ముండి చేయుచు నుండెనేని
యిచ్చకంబుల మిక్కిలి మెచ్చుచుంద్రు
విత్తముడిపోవ మెటికెలు విఱుచుచుంద్రు
కలదె సౌఖ్యంబు సాంసార గహనమందు?

తే. ఆర్జనము సేయువఱ కెట్టి యవగుణంబు
మంచిగుణ మనుచును విన్నవించుచుందు
రవల సుగుణమె దుర్గుణ మంచునంద్రు
కలదె సౌఖ్యంబు సంసార గహనమందు?

తే. కాసు వీసంబు చేతిలోఁ గలుగనున్న
నాలి యా చోళదేశపు గాలిగాదె
దాని స్నేహంబు బీదఁగాఁ గానవచ్చు
కలదె సౌఖ్యంబు సంసార గహనమందు?

తే. పేదయయి కష్టములు పదువేళయందు
గృతము మఱతురు గవ్వైనఁ నీయఁబోరు

పిదప నాతఁడు బాగున్న వేళఁ దమకుఁ
బెట్టలేదంద్రు వీఱిడి చుట్టములును

తే. ఎట్టి కడుఁ బరమార్థ మైనట్టిదైన
దోషమంచును దూషింత్రు దుష్టమతులు
రిక్తదశనున్నవాఁ డాచరించె నేని
కలదె సౌఖ్యంబు సంసార గహనమందు?[11]

కం. నెట్టన కుణపము నక్కలు
పట్టుగ గ్రసియింపఁ బీఁకువడువునఁ బురుషున్
జుట్టలు పరిపీడింతురు
కట్టా సంసారమందుఁ గలదే సుఖమున్

చం. ముదిముదితల్లి, సాధ్వియును ముగ్ధయనుం జవరాలు నాలు, ము
ద్దొదవఁగఁ జేయు లేఁజిఱుతలొక్క టెఱుంగ, రటంచు నిచ్చలున్
వదలక యున్నఁ గాలుఁడు కృపాళుఁడొ? వీరలు కూడవత్తురో?
వదలఁగ జేయువారొ సమవర్తిభటుల్ వెతపెట్టువేళలన్

తే. ఎసగు సంసార సాగరం బీఁదువాఁడు
మెడను దాల్చిన బండలు పడఁతులెల్లఁ
గాళ్ళ బందాలు చుట్టాలు కందులెల్లఁ,
గటిక చీఁకటి యగు మోహగరిమ వత్స!

తే. పూర్వజన్మ సమార్జిత భూరిపాప
గాఢ పైత్యజ్వరంబు పైఁగాయుచుండ
నాలుకకు రుచియించునే నవ్య రామ
నామ మధురౌషధంబు నిర్ణయముగాను?

చం. వెఱువకు మయ్య యింకయిన వెంగలివౌచును ఘోరకృత్యముల్
బిఱుసనఁ చేయఁబోవకుము వీడుము మున్నటిత్రోవ లన్నియున్

**మఱువక యాత్మలోఁ దలఁపు మాధవునిన్ నతలోకరక్షకున్**
**మఱువక వాయు నీకు ననుమానము మానుము మానసంబునన్**

అనిన బుక్షుండును వెల వెలఁ బాఱు మొగంబున నమ్మునివరుఁ జూచి మహానుభావా!

**తే. పాపములు పెక్కులౌటను బాల్యమందు**
**నేర్చినది యంతయును నేఁడు నేలఁ గలిసెఁ**
**దోఁప దొక్కండుఁ బుణ్యంపుఁ ద్రోవయైన**
**నేమి రితి నేఁ దరియించువాఁడ?**

అయ్యా! నీవు చెప్పివాఁ డెవఁవు? ఎట్టివాఁడు? ఏమని ధ్యానింప వలయును? ఒక్క మంత్ర తంత్రమైన నా నోర రాకున్నది. చిటికెవ్రేయు కాలమైన మనసు నిలువకున్నది. నా గతి యేమియని యేడ్చిన దయాళుండైన నారదుండు.

**కం. పాపము జేసినఁ బశ్చా**
**త్తాపంబున సగము పోవుఁ దదనంతర మా**
**పాపముఁ జేయమిఁ గొఱయఱ**
**బ్రాపింపక నరునిఁ బుణ్యవంతునిఁ జేయున్**

కావున నిట్టి ఘోరకార్యముల మనసున నైనఁ దలపెట్టకుము. సర్వకాల సర్వావస్థల రామ రామ యనుచు నుండుము. నీ పాపము లన్నియు నడఁగును. అనిన నతఁడెంత ప్రయత్నించియు రామయని పలుకలేఁ డయ్యె. అతని దురవస్థఁగాంచి వేల్పుమౌని యిట్టులైన నతనిచే రామనామంబుచ్చరింపఁ జేయఁదలఁచి యోయీ! 'రాఠి' అనుమనిన 'రాఠి' అని యతఁడు పలికె ఇట్టులే.

**తే. రాజటన్నను రాజను రాక్షసుఁ దన**
**రాక్షసుండను రాణ నారాణ యనును**

రాయి యనినను రాయను; రాక యనఁగ
రాక యనుఁగాని యనలేఁడు రామ యనుచు

కం. కామ యనం గామ యనున్
జీమయనం జీమ యనును జేమ యనంగాఁ
జేమ యనుఁ గాని యకటా
రామా యనలేఁ డదేమి వ్రాఁత బలంబో


సీ. ఆ రామ మని యన్న నారా యనుం గాని
యారామ మని యెల్ల ననఁగ లేఁడు
గారామ టన్నను గారా యనుం గాని
గారామ టంచుఁ బల్కంగ లేఁడు
సంగ్రామ మన్నను సంగ్రా యనుం గాని
సంగ్రామమనుచు ననంగ లేఁడు
పోరాము లన్నను బోరా యనుం గాని
పోరాము లని నోరఁ బూన్ప లేఁడు

తే. ఔర యెంతటి పాపమో యనఁగ లేఁడు
రామ యనునట్టి రెండక్కరంబు లొకటి
గాఁగ స్వార్జిత భీకర కలుషచయము[12]
లడ్డ గడియయై నోటికి నడ్డపడఁగ

అప్పుడా బ్రహ్మపుత్రుఁ డాలోచించి యోయీ 'మ' యనుమనిన 'మ' యని యతఁడు పల్కె. రా యను మన 'రా' యనియుఁ బల్కె. ఇటు లొకటి రెండుమార్లు మ–రా యని వేఱు వేఱుగఁ బలికించి పదపడి 'మరా' యనుమనిన నతండు 'మరా' యనియె అట్టులె వెంట వెంట మరా–మరా–మరా యను మనిన నాయన యట్టులే యనెను. ఇట్లాయన మరా మరా మరా యనఁగ రామ రామ యని యేర్పడెను.

అప్పుడు నారదుండు సంతోషించి యోయీ నీవుతక్కిన చింతలన్నియు విడిచి యొక వృక్షమూలమునఁ గూర్చుండి మరా మరా మరా యనుచు

నుండుము. నీ పాపములన్నియు నశించును. పుణ్యలోకములు సమకూరును. అని యుపదేశించి యథేచ్ఛమరిగె. ఆయనయు నొక వృక్షమూలమునఁ గూర్చుండి కన్నులుమోడ్చి యితర చింతలన్ని మాని మరా మరా మరా యనుచు నుండె. కొంతకాలమిట్లు జపంబుచేయ రామ రామయని పలుక సాధ్యపడియె. ఆయన యట్టులే కదలక మెదలక తదేక ధ్యాననిష్ఠుఁడై రామనామంబు జపించుచుండఁ గొన్నియేండ్లరిగె. ఆయనమీఁద నొక పుట్ట పెరిఁగె. సమాధియందుండుటచే నాయన యదియు నెఱుంగఁడు. ఇట్లనేక శతవర్షంబులు గడచె. ఆయన యందుండుటయు లోక మెఱుంగదు. ఒకానొక సమయంబున జడివాన



వాల్మీకి సమాధినుండ నాయనపై పుట్టపెరుఁగుట

ఘోరంబుగఁ గురిసెను. ఆ వాన వడికిఁ బుట్టయంతయుఁ గరిగిపోయెను. సమాధి నిష్ఠుఁడైన యా మహర్షి గోచరించెను. వల్మీక మందుఁ బుట్టినాఁడని యాయనను వాల్మీకి యని లోకము పిలువసాగెను. పుట్టకు సంస్కృతమున వల్మీక మని పేరు. ఈ మహానుభావుఁడే కదా శ్రీమద్రామాయణము రచించిన మహర్షి అదియేకదా యాదికావ్యము. అదియే బ్రహ్మసమ్మతము. అదియే వేదము. ఆ గ్రంథమును జదివియేకదా లోకము తరించుచున్నది. ఆ కావ్యమే కదా లోకమున నద్వితీయమని ఖ్యాతి పడసినది. అది

కావ్యములలో నుత్తమ కావ్యము. ఆ పవిత్ర చరిత్రమును జదువని బ్రదుకే వ్యర్థము. అట్టివాని గన్నతల్లి గొడ్డురాలు కాకపోదు. ప్రతి మనుష్యుఁడా పుణ్య గ్రంథమును బఠించుచు రామనామమును జపించుచు సర్వపాపముక్తుఁడై ముందువెనుకఁ బదునాలుగు తరములవారితో శాశ్వతసుఖము ననుభవించునుగాత.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు.

శ్రీరామ రామ రామేతి
రమే రామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం
రామనామ వరాననే.

శ్రీమదొంటిమిట్ట కోదండరామార్పణమస్తు.

స్వస్త్యస్తు.

1. ఆశ్రమము= అడవులయందున్న పర్ణశాల
2. గృహిణి= ఇల్లాలు
3. పోతరము= గర్వాదులతో నిర్లక్ష్యము
4. గృహమధి= అతిథిమర్యాదలు చేసు గృహస్థుడు
5. శంక= సందేహము
6. కింకరులు= భటులు, సేవకులు
7. కాంతారము= అడవి
8. అభ్యాగతుడు= పిలువకయే యజమాని ఇంటికి వచ్చేవాడు
9. మడివాడు= చాకలి
10. తల్పము= పడక
11. గహనము= అడవి
12. కలుషచయము= పాపసమూహము

* * *

# ఏడవ భాగము

## 1. సంతృప్తియే పరమసుఖము

కొంత కాలముక్రింద గోపాలశర్మయను నొక బ్రాహ్మణుఁడుండెను. ఇతఁడు విద్యావంతుఁడు – బుద్ధిమంతుఁడు. సదాచార సంపన్నుఁడు – నయజ్ఞుఁడు[1] – పెద్దలయందు వినయభయభక్తులు గలవాఁడై స్వకులాచారవర్తనము దప్పక, యభోజ్యములఁ దినక, యపేయంబులఁ ద్రాగక, యకార్యంబులఁ జేయక సజ్జనుల శ్లాఘకుఁ బాత్రుఁడై జీవించుచుండెను. ఈయన యొకానొకనాఁ డిట్టులాలోచింపఁదొడంగెను. “లోకంబునఁ బుట్టిన ప్రతిజీవియు సుఖమునే కోరుచున్నది. సుఖము పొందుటకే సమస్తకార్యములు చేయుచున్నది. ఏది సుఖమిచ్చునని తోఁచునో యా కార్యమే దేహి చేయునుగాని దుఃఖమిచ్చునని తోఁచిన కార్యము చేయదు. అయినను బెక్కురుమనుష్యులు సుఖమును గోరుచు దుఃఖకరములైన జారత్వము, చోరత్వము, దుఃఖకరములైన జారత్వము, చోరత్వము, ద్రోహము లోనగు పాపకార్యములు చేయుదురు. పూర్వజన్మముల వారు చేసిన పాపములచేఁ బ్రేరింపఁబడిన బుద్ధియే దానికిఁ గారణము. కొందఱు లక్షల కొలఁది ధన మార్జించుటయే సంతోషింతురు. కొందఱు స్త్రీ సంభోగముచే సంతసింతురు. కొందఱు రమ్యహర్మ్య[2]ముల వసించుటచే సంతసిల్లుదురు. కొందఱు బిడ్డలఁగని యామోదింతురు. యామోదింతురు. కొందఱారోగ్యమున నుల్లసిల్లుదురు. కొందఱు ప్రాజ్యరాజ్యభోగంబులఁ బ్రమోదింతురు. ఇట్లొక్కొక రొక్కొక విధమైన సంపదనొంది సంతోషించుచున్నారు గాని యిన్ని సుఖములు దుఃఖరహితములుగ ననుభవించువారు లేరు. ఐశ్వర్య ముండెనా యనుభవించుటకు దేహారోగ్యము లేక వేడి నీళ్ళు మిరయములపొళ్ళతోఁ గాలముఁ ద్రోయుదురు. సంధానముండెనా దారిద్ర్యము వెంటనంటియే యుండును. విత్తముండెనా చోరులవలనను యాచకులవలనను భీతి.

రూపవతి భార్యయుండెనా జారులభయము. కావున భయరహితమైన సౌఖ్యము నీ లోకములో నుత్తమమైనదానిని సంపాదించ యత్నించెదను. ఇట్టి సౌఖ్యమును సర్వఫలప్రదాతయు, సర్వశక్తుఁడు, భక్తజన కల్పకమైన శ్రీమన్నారాయణుండు తప్ప మఱియెవ్వరు నొసంగఁజాలరని నిశ్చయించుకొని యొక దివ్య తీర్థంబునొద్దున ఘోరతపంబుఁ గావించె. అతని నిష్ఠకు మెచ్చి భగవంతుఁడు ప్రత్యక్షమై నీ కేమి వరము గావలయునని యడిగెను. అతఁడిట్లనియె. "దేవా! నీ దర్శనము రిత్తవోదు. దాని వలననే నాకు ముక్తిగలదని యెఱుంగుదును. అయినను నీ లోకంబున నిప్పుడుండు పురుషులలోనెల్ల నెల్లవిధముల సుఖపురుషుఁడెవఁడో వానియట్టి సౌఖ్యమును నాకనుగ్రహింపవలయును. ఏ విషయములందును లోపముండరాదు." అనిన భగవంతుఁ డిట్లనియె.

"నాయనా! నీవిట్టి వరముకోరిన ప్రయోజనము లేదు. నీకొక సంవత్సరము గడువిచ్చితిని. ఈ లోపల భూసంచారము గావింపుము. నీవు మెచ్చిన సుఖపురుషుఁ డెవడో వాని నేఱి యట్టి సుఖపురుషునిగ నిన్నుఁ గావింపుమని కోరుము. ఈ నిమిత్తము నీ వెందుఁబోయినను నిన్నెల్ల వారాదరింతురు గాని నిరాకరింపరు" అని చెప్పి అదృశ్యుండయ్యెను. గోపాలశర్మయు నేకోద్దేశముతో దేశాటనము గావించుచు నెందు సుఖపురుషులున్నవారని వినికిడిగలదో యందెల్లఁబోయి వారి సౌఖ్యము దుఃఖమిశ్రితమై యుండుట గాంచి నిరాకరించుచుఁ దిరుగుచుఁ దుదకు నొక సామంతప్రభువువార్త విని యచటకిఁ బోయెను. ఆయన యుండు పట్టనమునకుఁబోయి విచారింపఁగా నతనికే సౌఖ్యమందును గొఱంత కానరాదయ్యె. రాజ్యలక్ష్మి – ధనలక్ష్మి – ధాన్యలక్ష్మి – సంతానలక్ష్మి సంపూర్ణమై యుండెను. సౌధమా వైజయంతము. పురమా స్వర్గపురము. భృత్యులా విధేయులు. ప్రజలా యనురక్తులు. ఇల్లాలా సాక్షాద్రతీదేవి. బిడ్డలా యిందుకూనలు. రూపమునా మన్మథుఁడే. విద్య – బుద్ధి –

దానము – ధర్మము సమస్త సద్గుణములు గలిగి కీర్తివంతుఁడై చూచువారి కితఁ డద్వితీయుఁడని పేరెన్నిక గలవాఁడైయుండెను.

ఈ ప్రభువును గని యతని వృత్తాంతమువిని యపరిమితానంద భరితుఁడై యా బ్రాహ్మణుఁడు ఫలించెరా నేఁటికి మన యిష్టార్థమని మూఁపులు యూఁడుగాఁ బొంగి యితనివలె నుండ భగవంతుఁ గోరెదనని నిశ్చయించుకొని మఱియు నా మనీషి యిట్టులాలోచించెను. “ఇప్పుడు మనకు గోచరించిన వన్నియు వెలుపలి విషయములే. లోగుట్టు మనకేదియుఁ దెలియరాదయ్యెను. ఇది యాయనకుఁదప్ప మఱెవ్వరికిఁ దెలియరాక యుండవచ్చును. మేడిపండు మెఱయుచుండును. పాము విషము తళతళ లాడుచుండును. కుచ్చితుల మాటలు తియ్యగనుండును. చెఱుపఁదలఁచిన ప్రభువు నవ్వుచు మాటలాడును. మిణుఁగురుపురుగు వెలుఁగు నిప్పుకాదు. కావునఁ బూర్ణముగఁ విచారింపక తొందరపడి కార్యము చేయరాదని యాలోచించి యా ప్రభువును దర్శింపఁ బోయెను.

సుశీలుఁడైన యా ప్రభు వావిప్రుని నాదరించి కుశల ప్రశ్నమడిగి రాక హేతువును బ్రశ్నించెను. ఆ బ్రాహ్మణుఁడును దాను భగవంతునిచే వరముఁ బొందిన విధమును జెప్పి నీ యట్టి సుఖపురుషుఁడు లోకంబున నెందును నాకుఁ గాన రాఁడయ్యె. నన్ను నీ వంటి వానిఁగఁ జేయ భగవంతుఁ బ్రార్థింపఁ నిశ్చయించుకొనియు నీ వలననే యది దృఢపఱచు కొనఁగోరి నీ కెందును సుఖహాని లేదుకదా” యని యడిగెను.

ఈ మాటలు వినినతోడనే యా ప్రభువు కన్నులనుండి జలజల వేఁడినీరు గాఱ నిట్టూర్పులు పుచ్చుచు కించిత్కాల మూరకుండి యా భూమీసురునితో నిట్లనియె.

“అయ్యా లోకములో నిరుపమాన సుఖపురుషుఁడను నేనా నీకుఁ గనఁబడితిని. ప్రపంచమున నాకంటె దుఃఖజీవి వేఱొక్కరుఁడు లేఁడని

నా యభిప్రాయము. పై వేషములఁ జూచి ప్రమాదపడక నీవు నన్నడుగుటచే మేలుపడితివి. నీమేలు కోరి కలది కలట్టు చెప్పెదను. వినుము. అని తాను దొడిగియుండిన చొక్కా తీసివేసెను. నాభినుండి మోఁకాటివఱకుఁ గుష్ఠరోగముచేఁ గ్రుళ్ళి నీచునీరు గాఱుచుండెను. వస్త్రము దొలఁగించెనో లేదో జుమ్మని యీఁగలు గ్రమ్ముకొనెను. గపులు సహింపరానిదయ్యెను.

అది చూడఁగానే బ్రాహ్మణునకు దేహమునఁ గంపము పుట్టెను. గుండెలు తటతట కొట్టుకొనసాగెను. ఆ ప్రభువు మరల వస్త్రము ధరించి యిట్లనెను.

అయ్యా! యిది నా దేహస్థితి. నా భార్య యందగత్తెయే కాని యిట్టి రోగముతో నేను దానితో నేమి సంభోగింపఁ గలను? యౌవనబలమద మత్తయయిన యా కాముకి పురుషునితో భోగింపక యెట్లుండగలదు? మానవజాతి పురుషులతో భోగించిన గౌరవహాని కావున నా పరిచారకునితోనే నా పఱుపుల మీఁదనే నా కన్నులయెదుటనే పడి పొరలాడుచుండును. కూఁతలు రోఁతలని నేనూరకున్నవాఁడను. నా బిడ్డలలో నాకుఁ బుట్టినవాఁడొకఁడును లేఁడు. అందఱు ధర్మపుత్రులే. ఇది యెఱిఁగి యెఱిఁగియు నీళ్ళవానికిఁ బుట్టినవానిని వంటవానికిఁ బుట్టినవానిని నా బిడ్డలని నేనాదరింపక నలువురితోఁ జెప్పుకొనక విధిలేక యున్నది. నా బిడ్డలని యన్నప్పుడంతయు నాభార్య నన్నుఁగని లోలోన నవ్వుచుండును. నా భూమి యనువానిని జూచి భూమియు, నా ధన మనువానిని జూచి ధనమును, తనకొడుకుల నుపలాలించువానిఁగని జారిణియు, యుద్ధభూమి విడిచి పరువెత్తు రాజును గని మృత్యువు హసించుట స్వభావమేకదా; వీరు నా సింహాసన మెక్కఁగలవారు. వీరు నాకు శ్రద్ధాదులు జరుపువారు. వీరిచేతినీళ్ళతో నాకే లోకము ప్రాప్తించునో? ఈ మాత్రమున నా మనస్సెంత యానంద పరిపూర్ణమో నీవే యూహించి యావల నీకుఁ దోఁచినట్లు చేయుము" అని యూరకుండెను.

"అయ్యా నీవు నాకు సత్యముఁజెప్పి మేలుచేసితివి. సెలవు తీసికొనెద" నని చెప్పి వెడలివచ్చి యిట్లు వితర్కించెను. ఆహా! భగవంతుఁడు నన్నెంతటి ప్రమాదమునుండి రక్షించెను. ఈ లోకములో దుఃఖమిశ్రమముగాని సుఖము లేదని తెలుపఁగాఁబోలు భగవంతుఁడ ట్లాదేశించెను. అట్టి సుఖము ముక్తునికి దప్పఁ బ్రకృతిబద్ధున కెట్టు లభించును? నడచునపుడు ఱాలుముండ్లు కాళ్ళలోఁ గ్రుచ్చుకొనకుండుటకై ప్రపంచమంతయుఁ జర్మముచేఁ గప్పు యత్నించుటకంటె మన కాళ్ళఁ బాదరక్షలు తొడిగికొని పోవుట మేలుకదా. మనకు భగవంతుఁడిచ్చిన దానితో సంతుష్టిపడక పేరాస వహించితిమేని దుఃఖములు తప్పవు అని తలపోయుచు నిల్చుచేరును.

సంవత్సరము కాఁగానే మరల భగవంతుఁడు ప్రత్యక్షమై యెవనివలె నుండఁగోరెదవో చెప్పుము. వరమిచ్చెద నని నా బ్రాహ్మణుఁడు నమస్కరించి యిట్లనియె.

"దేవా! నేనెవరివలె నుండఁ గోరను. నీవు నాకిచ్చిన దానితో సంతుష్టిపడి యుండెదను. నాకేది శ్రేయస్కరమో సర్వజ్ఞుడవు సర్వలోక జనకుండవగు నీకుఁ దెలియును గాని యల్పజ్ఞుడనగు నేనేమి యెరుగుదును? లోకములో సర్వము భయముతోఁ గూడినదే. వైరాగ్యమే నిర్భయము. నిరుపమానందము. కావున నీ పదభక్తియు వైరాగ్యము ననుగ్రహింపుమని ప్రార్థించెను. శ్రీమన్నారాయణుఁ డట్లే యగుఁగాకయని వరమిచ్చి పోయెను.

**కం. "వ్యాప్తిం బొందక వగవక**
**ప్రాప్తంబును లేశమైనఁ బదివేలనుచున్**
**దృప్తిం జెందని మనుజుఁడు**
**సప్తద్వీపములనైనఁ జక్కంబడునే"**

**కం. తనకుఁ గలదానితోడం**
**దనివిగొనెడివాఁడు పూజ్యతముఁడును సుఖియున్**

**దనివెఱుఁగని శక్రుండును[4]**

**వనటలపాలగుచు దుఃఖవారిధి మునుఁగున్.**

## 2. ఇంద్రియజయము దుష్కరము

వేదవ్యాసమహర్షి శ్రీభాగవతము వ్రాయుచుండు సమయంబున నొకచోట,

**కం. అక్క తల్లి చెల్లి లాత్మజ[5] లెక్కిన**

**పశుపులెక్కఁ జనదు; పరమయోగి**

**నేని బలితమైన యింద్రియ గ్రామంబు**

**పట్టి లాగుచుండు ప్రసభమునను**

అని వ్రాసి యా పుస్తకము నొకచోనుంచి స్నానార్థమైపోయెను. అప్పుడాయన శిష్యులలో నొకఁడు దానినిజూచి గురువుగారు ప్రమాదపడి ఈ పద్యము వ్రాసిరి. అని తర్కించి "పట్టి లాగుచుండు" అను పద్యములను "పట్టిలాగలేదు" అని సవరించెను.

తరువాత వ్యాసులువచ్చి సవరింపఁబడిన పాఠమును జూచి యచ్చెరువుపడి యెవరు దీనిని సవరించినవారని శిష్యుల నడిగెను. నేను సవరించితినని సవరించిన శిష్యుఁడు చెప్పెను. ఏల సవరించితివని గురువడిగెను.

ఇంద్రియములు యోగిని నేమి చేయగలవు?

ఇంద్రియజయము లేనివాఁడు యోగి యెట్లగును?

కావునఁ దమరు ప్రమాదవశమున వ్రాసితిరని తలఁచి సంస్కరించితినని బదులు చెప్పెను.

అప్పుడు వ్యాసు లిట్లు తలఁచెను. వాదముచేత నితనికి సత్యము బోధపఱచుట శక్యముగాదు. అనుభవము చేతనే వీనికి వివేకము గలుగఁ

జేయవలయును. విశ్వామిత్ర పరాశరాదులు యోగబలహీనులయి యా స్త్రీలకు వశులైరి? యోగము వేఱు. జితేంద్రియత్వము వేఱు, యోగము గారడి విద్య. వేయి సంవత్సరములు సమాధియందుండినను, సాంగోపాంగముగ వేదములు వల్లించినను వాలుఁగంటల చూపుటంపఱచే గంటులు పడనీక యెట్టి దంటయు హృదయమును గాపాడుకొనఁ జాలఁడు. ఎంతవఱకుఁ గామవికారము మనస్సునఁ బొడమదో యంతవఱకుం బురుషుఁడుఁ తాను జితేంద్రియుండనని గర్వింపవచ్చును. నిజమైన భక్తితోడి వైరాగ్యము గలవాఁడై జిహ్వను జయించి సర్వ బ్రహ్మత్వకోపాసకుఁడై సర్వము హరిమయమని కాని పురుషులందఱు విష్ణుస్వరూపులనియు స్త్రీలందఱు లక్ష్మీస్వరూపలనికాని భావనగలవాఁడు జితేంద్రియుఁడగును గాని తక్కినవారు తాము జితేంద్రియుల మనిరేని లోకవంచకులుగ నెంచవలయు. వీని కెట్టీతత్త్వము బోధపఱుతునా యని యోజించి యొకనాఁడీ శిష్యునిఁ జూచి "నీవుమాత్ర మీ యాశ్రమమును గనిపెట్టి యుండుము. నేను గార్యార్థమైపోయి పక్షమువఱకు రాను." అని చెప్పి తక్కిన శిష్యులనెల్ల వేఱువేఱు పనులకు దూరమంపి తానును బ్రయాణమై పోయెను. శ్లోకమును సంస్కరించిన శిష్యుఁడు మాత్ర మొంటిగ నాశ్రమమం దుండెను.

వ్యాసులు వెడలిపోయిన మూఁడవనాఁడొక వృద్ధబ్రాహ్మణుఁడా యాశ్రమమునకు వచ్చి యా శిష్యునిఁగని వ్యాసమహర్షులు లేరా యని యడిగెను. "వారు లేరు. అతిథుల నభ్యాగతుల నాదరింపను సమస్త కార్యములు దీర్పను నన్ను నియమించి వారు కార్యాంతరవశులై దేశాంతరమేగిరి. మీ కెట్టి కార్యము కావలసియున్నను జేయుటకు నేను బద్ధుఁడనై యున్నాను. సందేహింపఁ బనిలేదు." అని యా శిష్యుఁడు చెప్పెను.

"నాకు నీవలనఁ గావలసిన కార్యము మఱేదియు లేదు. ఈ చిన్నది నాకూఁతురు. దీని నత్తగారింట విడుచుటకై తోడుకొని పోవుచున్నాను.

ఈ యువతి నెందును నొంటరిగ విడుచుటకు నొల్లక యిందు వ్యాసులున్నవారు కదా వారి యొద్ద నమ్మి విడువవచ్చునని తలంచి వచ్చితిని. ఇచ్చటికిఁ గొంతదూరమున నొక పుణ్యతీర్థ మున్నది. మార్గము దుర్గమము. ముండ్లు గండ్లు ఊలలో నీ బాలికను నడిపింపనొల్లక నమ్మఁదగిన చోట విడిచిపోవఁ దలంపుగలిగి వచ్చితిని. వ్యాసులు లేరైరి. ఏమి చేయుదును?” అని యా ముసలిబ్రాహ్మణుఁడు చెప్పెను. “అయ్యా! బ్రాహ్మణోత్తమా! నీవు సంకల్పించిన ప్రకారము నీ పుత్రిక నింద విడిచి నిర్భయముగ నిశ్శంకముగ బోయిరమ్ము. సందేహింపవలదు. ఇంతమాత్రము సహాయము చేయనైతినేని మా గురువులు నన్నేమందురు? అవిశ్వాసపాత్రుఁడనని నిందింపరా?” యని యా శిష్యుఁడు పెక్కువిధముల నా విప్రునిఁ బ్రార్థింప నతఁడును నెట్టకేల కియ్యకొని యా పడుచు నందవిడిచిపోయెను. ఆ చిన్నది సుందరి. లావణ్యవతి. మధురభాషిణి. చిఱునవ్వుమోముగలది.

ఆ శిష్యుఁడును గొంతసేపు కన్నులు మూసికొని నిష్ఠాపరుఁడై బిఱ్ఱబిగిసికొని యుండెనుగాని మఱింతసేపటికి వానిలో చూపునకు నా యొయ్యారిరూపమే కానఁబడఁ జొచ్చెను. హృదయమందే సంచారముఁ జేయఁజొచ్చెను. మనస్సు సంకల్పితరూపమును ధ్యానింపఁ జొచ్చెను. ఆ కన్నియ వన్నెలు చిన్నెలు, కన్నుల సోయగము, జడపెంపు, నడసొంపు, కేలిమురువు, కాలి హరువు లోనైనవి స్ఫుటముగ నచ్చొత్తినట్లు మనస్సున నిలిచెను. ఇది హృదయమున నెడము చాలక మనస్సున నిలువఁజాలక కనుమూఁతల నూడఁ దన్నుకొని వెలికి వచ్చెనో యన్నట్లా యోగి కనుమూఁతలు చాలించి విచ్చి యా మచ్చకంటింగాంచెను. అంతట నంతవఱ కెన్నఁడనుభవింపని యిట్టిదని చెప్పరాని యొక వేదన లోనఁ బ్రవేశింప నతఁ డారటపడఁ జొచ్చెను. ఆసనము చాలించి చివాలునలేచి పరవశుడై పచారింప నారంభించెను. చూపులకు స్వాతంత్ర్యముపోవ నా చిన్నదాని నూతగాఁగొని యదిపోయినట్లు వెంటనంటి పోవుచుండెను. యోగము సిద్ధించెనో యన నా బాలచేల మఱుంగున నున్న యవ

యవములును నతనిదృష్టికి గోచరించుచుండెను. ఆపైదలి పైఁట సవరించునెడ నతనిచూపులు కోపులవలె నీ బాహుమూలంబునఁ దూఱి యా బాహుమూలంబున వెడలిపోవ యత్నించి పోలేక చిక్కువడి నడుమంతరంబున నిలcబడును. ఇంతియేల మరణావస్థ ప్రాప్తించినట్లు కొంతసేపు నిలువుచూపులఁ జూచును. కొంతసేపప్రస్తుతముగ నేమో భాషించును. కొంతసేపు నిశ్చేష్టుఁడగును. కొంతసేపు పరవశునట్లగును. ఇట్లు మరునిశరములను పాములచేఁ బీcకcబడిన యతనికి నుపాదానము మధ్యస్థమయ్యె. ఇజ్య పూజ్యమయ్యె. స్వాధ్యాయమున నధ్యాయ సమాప్తియయ్యె. యోగము సంయోగమునకై యేcకారుచుండె. ఇంతలో సాయంకాలమయ్యె. సూర్యుఁడస్తమించె. అతండును సంధ్యావందనాది కృత్యంబు లందదుకులుగఁ దీర్చి యాయలి వేణితో నిట్లనియె.

"సుందరీ! నీ వెందుఁ బరుండెదవు? నీ కొంటిగఁ బండుకొన భయమేనితోడు నేను బండుకొనెద? అదిగో మా గురువుల మంచము ఇదిగో నాకృష్ణాజినము, మంచముపైఁ బఱిచెద నీ యిచ్చవచ్చినచోట శయనింపుము" అనిన నా మందహాసిని యిట్లనియె.

"బ్రహ్మచారీ! యింటనా పెద్దలులేరు. నేనా తరుణిని. నీవా వయస్కుఁడవు. ఒంటరివాఁడవు. అంధకారమా వ్యాపించుచున్నది. చీఁకటి తప్పుకార్యములకుఁ దల్లిగదా. నేను శీలవతిని. కావున నీతోడు నాకుcబనిలేదు. నేనీ గదియందుఁ బరుండెదను. నీవు వెలుపలఁ బండుకొనుము" అని చెప్పెను.

బదులాడ వెఱచి యా విప్రకుమారుఁడట్లే కానిమ్మని తానాకుటిల్లు వెలుపలఁ బరుండెను. ఆ యింతియు గదిలోఁ బరుండి లోగడియ వైచెను. ఆ బ్రహ్మచారికిఁ గనుమూఁత పడలేదు. ఆ చిన్నది చెప్పిన మాటలకు విపరీతార్థము చేసికొని తన యిష్టము దీర్చునను తలంపుతోఁ బోయి యాతొయ్యలి పరుండిన గదితలుపును నర్ధరాత్రమున మెల్లగ నొక వ్రేలితోఁ

దట్టెను. ప్రత్యుత్తరము గానక రెండుప్రేళ్ళతోను నావల నఱచేతితోను దట్టెను. ఎవరు వారని యా రమణి హెచ్చరించెను, "నేను, తలుపుతీయు" మని బ్రహ్మచారి పలికెను. ఇపుడు తలుపుతీయను. పొమ్మని యాగద్దఱి పలికెను. తరువాత నతఁడు చనవు నెయ్యము వియ్యము నిచ్చకోలు వేఁడికోలు నానలు బాసలు మెఱయు నేమేమో వదరుచుండెను. గాని యాయండజయాన వాకిలి తెఱచినది కాదు. కామబాణవశుఁడైన యాధారుణీసుర కుమారుఁ డిది తలుపు దీయకున్న నేమి? నేను లోపలఁ బ్రవేశింపఁ జాలనా? ఈ యాకుటింటి మీఁది యాకులుపెఱికి సొరంగము చేసికొని లోపలఁ ప్రవేశించెను. అవల నీయబల నాకోర్కె నెఱవేర్పక యెట్లు తప్పించుకొనఁగలదు? దాని తండ్రితోఁ జెప్పునా? ఆ ముసలి బడుగు నన్నేమి చేయఁగలడు? అని యిట్లు వితర్కించుకొని యాసాహసికుఁ డింటికప్పుపైకెక్కి యాకులు పెఱికి రంధ్రము చేసికొని దబాలున లోన దుమికెను. ఇట్లు దుమికి చూడలోపల స్త్రీ లేదుకదా అతని గురువు వ్యాసులే ధ్యాననిష్ఠుండై కూర్చుండి యుండుట పొడగాంచెను. వ్యాసులా శబ్దమున కులికిపడినట్లై యేమిరా! యేల యిట్లు కొంపచించి లోపల దుమికితి వని యడిగెను. శిష్యునకు నోటఁ దడిలేదు వణఁకుచేఁ గాళ్ళునిలువలేదు. మాటరాదు. ఏమియుఁ దోఁపక క్షమద్భమ్మని కాళ్ళమీఁదఁ బడెను. వ్యాసులును నవ్వుచు నింద్రియములు బలిష్ఠములో యోగము జ్ఞానము బలిష్ఠములో తెలిసినదా యని యడిగెను. చెంపలు పెళపెళ వేసికొనుచుఁ దెలిసినది తెలిసినదని వ్యాసులు వ్రాసిన పద్యములోఁ దాను "పట్టిలాగలేదు ప్రసభమునను" అని సవరించిన దానిని "లాగు లాగు కట్టి లాగులాగు" అని మరల సవరించెను.

### 3. ఇల్ల నారాయణమ్మ

పూర్వకాలంబున నొక బ్రాహ్మణ దంపతులకు నొక కూఁతురు జనించెను. వారికి నిది యొక్కతెయే బిడ్డ గావున ముద్దుముద్దుగ నెంతో

ప్రేమను గారాబంబునఁ బెంచిరి. వివాహయోగ్యకాలము రాఁగనే సిరి-కులము-విద్య- రూపము-ప్రాయము గల వానిగఁజూచి యతనికిచ్చి పరిణయము గావించిరి. శుక్రోదయమున వివాహమయ్యెను. సూర్యోదయమునఁ బాముగఱచి యా పెండ్లికొడుకు మరణించెను. నిశ్చితార్థమునాఁడు నీల్గవలసిన మగఁడు త్రాటిబలిమిచేతఁ దలఁబ్రాల దాఁక నుండినాఁ డనుట సత్యమయ్యెను. విధి కెవ్వరడ్డుపడఁ గలరు? నోటితాళములు ఔమ్ముతప్పెటలతో వివాహము ముగిసెను. ఎక్కడవా రక్కడికిఁ బోయిరి. ఆ పాపాత్మురాలి పాపవృక్షము ఫలించినదో యన్నట్టు లల్పకాలముననే శోకముచే దాని తల్లిదండ్రులు మరణించిరి.

ఇంటికంతయు నది యొక్కతెయే దిక్కయ్యెను. మగని ద్రోహమెంచిన వారు పుట్టుకుంక లగుదురని తెలియును గావున స్వైరిణియై చరింపక రెండ వివాహమను నెపమున వ్యభిచరింపక శీలవతియై యిల్లు కనిపెట్టుకొని తనకు దేవుఁడిచ్చినది తినుచుఁ గాలక్షేపము చేయుచుండెను. కాని దానమన నెట్టిదో ధర్మమన నెట్టిదో యా యాఁడుది యెఱుఁగదు. అప్పుగానైన నౌకరికేదైన నిచ్చి యుపకారము చేసినదిగాదు. ఎవ్వరేమి యడిగినను "ఇల్ల[6]- నారాయణా-యిల్ల" యనుచుండును. తుదకుఁ జీమలకు నీఁగలకైన నిన్నినూకలు చల్లినదికాదు. తిండి వస్తువులపై వానిని వ్రాలనిచ్చినదికాదు. ఈ కారణము దానికి యిల్లనారాయణమ్మ యని పేరు ప్రసిద్ధికెక్కెను.

ఆ కలుషాత్మురాలికి నీ విధముగ నేండ్లు పూండ్లు గడచెను. ఆ ముసలిముండకుఁ దల సెరిసెను. కన్నులు గూండ్లవలెనయ్యెను. పండ్లురాలెను. దవడలు లోపలి కీడ్చుకొనిపోయెను. ఔమ్ములెండి జిల్లేడుకాయలయ్యెను. తోలు ముడుతలు వ్రేలాడఁజొచ్చెను. చేతికిఁ గఱ్ఱ వచ్చెను. వీడు పొమ్మనుచుండెను. కాడు రమ్మనుచుండెను. నిర్దయులెవ్వరు? స్త్రీలు.

అంతకంటె నిర్దయులెవ్వరు? పేదస్త్రీలు

అంతకంటె నిర్దయులెవ్వరు? బిడ్డలులేని పేదస్త్రీలు.

అంతకంటె నిర్దయులెవ్వరు? మగఁడు బిడ్డలులేని పేదస్త్రీలు.

అను సామాన్య నీతి వాక్కున కది గుఱియై కాటికిఁ గాలుజాఁచికొని యుండియుఁ దన లోభగుణమును మాత్రము వదలినది గాదు.

ఇట్లుండ నొకనాఁటి యుదయమున నొక ముసలి బ్రాహ్మణుఁడు కట్టెయూఁత పొడుచుకొనుచు నా పిసినిగొట్టు వాకిట నిలఁబడి "అమ్మా ధర్మభిక్ష" యని యఱచెను. 'ఇల్లనారాయణా యిల్ల పోపొమ్మని' లోపలనుండి యిది యఱచి చెప్పెను. అంతతోఁ బోక యాముసలివాఁడు లోపలికిఁబోయి "తల్లీ ముసలివాఁడను. నిన్నంతయుఁబస్తు; చెవులలో ప్రాణములున్నవి. పిడికె డన్నముపెట్టి యిన్ని నీళ్ళుపోయుము" అని మాట తడబడఁ బలికెను. మ్రొక్కుబడియే లేదనిన ఒక్క దాసరికిఁ బెట్టుమన్నట్టు బిచ్చెము లేదనిన నన్నము కావలయునా! నీవు వచ్చెదవని సిద్ధముగ వండి వార్చి యుంచితి ననుకొంటివా? ఇల్ల నారాయణా-యిల్ల పో పొమ్మనెను.

ముసలి బ్రాహ్మణ-ఇంత చలిదియైనఁ బెట్టుము.

ము బ్రా-ఇంత యంబలియైనఁ బోయుము.

ము ముం-ఇల్ల నారాయణా యిల్ల.

ము బ్రా-ఇంత గంజియైనఁ బోయుము.

ము ముం-ఇల్ల నారాయణా యిల్ల.

ము బ్రా-ఇంత కుడితినీళ్లైనఁ బోయుము.

ము ముం-ఇల్ల నారాయణా యిల్ల.

ము బ్రా-ఇంత బియ్యమైన రాగులైనఁ బెట్టుము.

ము ముం-ఇల్ల నారాయణా యిల్ల.

ము బ్రా-ఇన్ని నూకలైనఁ బెట్టుము.

ము ముం-ఇల్ల నారాయణా యిల్ల.

ము బ్రా-ఇన్ని మంచినీళ్లైనఁ బోయుము.

ము ముం-ఇల్ల నారాయణా యిల్ల.

ము బ్రా-ఏనీళ్ళో యొకనీళ్ళు నాలుక యెండినది. ఉప్పునీళ్లైనఁ బోయుము

ము ముం-ఇల్ల నారాయణా యిల్ల.

ము బ్రా-నాకుఁ జెవులు గడియలు పడుచున్నవి. కన్నులు తిరుగుచున్నవి. నేనెక్కడకుఁ బోఁజాలను. నీవేమైనఁ బెట్టితివా సరి. లేదా యిందే ప్రాణము విడచెదను. అని వాకిటి కడ్డముగ శవమువలెఁ బరుండెను.

ఆ ముసలిముండయు వీఁడు చచ్చెనా నేను వెచ్చింపవలసి వచ్చునేమో యని భయపడి యేమీ యేదియుఁ బెట్టకున్నఁబోవా. నీవు బ్రాహ్మణుఁడవు. కావు మొండివో? బండవో? శిఖండివో. అట్లైన నిదిగోఁ దీసికొమ్మని చేతనున్న యలుకు చుట్ట విసరి యా ముసలివాని ముఖమునఁ గొట్టెను. అతఁడును గృష్ణార్పణమని దానిని గ్రహించుకొని పోయెను.

ఆవలఁ గొన్నినాళ్ళ కాముదుసలి చచ్చెను. కామము, క్రోధము, లోభము, నరకద్వారములు గావున నది నరకమునకుఁ బోయి నానావిధ యాతన లనుభవించెను. పాపానుభవమంతయు ముగిసిన పిమ్మటఁ గింకరులు దానిని ధర్మరాజు నొద్ద నిలిపి యిట్లనిరి.

"మహాప్రభూ! యీ జీవి నరక యాతన లన్నిటిని ననుభవించెను. స్వర్గమున దీని కెడములేదు. మరల భూలోకమున ననుభవింపవలసిన దుఃఖము లున్నవని చిత్రగుప్తులు చెప్పిరి. వదలుఁడనిన విడిచెదము. ఆజ్ఞ పాలింపఁ గర్తలు" అని విన్నవింపఁగానే యాజీవి యమునిఁజూచి

"యయ్యా! యింకను నేననుభవింప వలసిన కష్టములున్నవా? కాలిన యుక్కుబొమ్మలఁ గౌఁగిలింపఁ జేసిరి. కత్తులపై నీడ్చిరి. నిప్పులలోఁ ద్రోచిరి. కుక్కలచేఁ గఱపించిరి. ఆఁకలిచే మలమలమాడఁ జేసిరి. ఇంకను దయరాదా" యని దీనయై విన్నవించెను. అప్పుడు యముఁడిట్లనియె.

"ఓసి పాపినీ! నవ్వుచుఁ జేసిన పాపము నేడ్చుచు ననుభవింప వలయునని యెఱుంగవా? నీవు మగనికి ద్రోహము చేసితివి. వంచించితివి. పలుబాధలు పెట్టితివి. అంకుముండవు నైతివి. ఈ పాపములకుఁ గొంత పరిహారముగా బాలరండవైతివి. తక్కిన పాపఫలము లిందనుభవించితివి. పోయిన జన్మంబున దానధర్మము లెట్టివో నీ వెఱుఁగవు. ఎవరేమి యడిగిన నిల్లనారాయణా యనుచుంటివి. ఈ విధముగ బలుమాఱు నారాయణ శబ్ద ముచ్చరించుటచే శ్రీమన్నా రాయణుఁడు నీ కేదియో యొక గతికల్పింపఁ దలఁచి ముసలి బ్రాహ్మణుఁడై నీ యింటికి వచ్చిన నలుకు చుట్టతో నాయనను గొట్టితివి. ఆయన దానిని గొనిపోయి పరీక్షింప నందొక కందిగింజయుఁ జేరెఁడు నీళ్ళుండెను. దండకారణ్యమున నొక నిర్జనప్రదేశమున నా కందిగింజ చెట్టై మొలచియున్నది. దాని క్రిందనే చిన్న గుంతలోఁ జేరెఁడు మురికి నీళ్ళున్నవి. నీవు భూమిమీఁద బుట్టి యాకందిగింజలు దిని యా మురికి నీళ్ళు ద్రావి జీవింపుము. ఈ విధముగ నీ పాపము క్షయింపఁగా నారాయణ శబ్దోచ్చారణచేఁ బుణ్యము ఫలింప నారంభించును అప్పుడు భగవంతుఁడు నీకుఁ బ్రత్యక్షమయి తరుణోపాయముపదేశించును. పొమ్మని చెప్పి పంపెను.

అది దండకారణ్యములోఁ బ్రయాణముసేయు బాటసారులలో నొకతెకుఁ గూతురై పుట్టెను. పుట్టిన శిశు వేడ్చుటగాని పాలు ద్రాగుటగాని కన్నులు తెఱచుటగాని లేకుండుటచేఁ జచ్చినదని తలఁచి తల్లిదండ్రులు దాని నందే పాఱవైచిపోయిరి. ఆవలఁ గావు కావురని యేడ్చుచుండఁగా నడవిలోని మనుష్యులు దానిని పాఁకిరి. కొంచె మీఁదు రాఁగానే సాఁకినవారు చచ్చిరి. అది దిక్కులేక యల్లాడుచు పచ్చి కందిచెట్టు క్రిందఁ

జేరి యా కాయలుదిని యా మురికినీళ్ళు ద్రావి కాలము గడుపుచుండెను. ఇట్లనేక సంవత్సరములు గడచెను. దాని పాపమంతయు క్షయింపcగా నొకనాcడు శ్రీకృష్ణమూర్తి దానికిc బ్రత్యక్షమై యోసీ నీ పాపము క్షయించినది. నా నామమును స్మరించుచుండిన ఫలమిcక నీ వనుభవింప వలసియున్నది. ఇcక నొక గంటలో నిచ్చటికి రుక్మిణీసత్యభామలు పల్లకులు దీసికొనివచ్చి నిన్ను రమ్మని ప్రార్థింతురు. తేపు మధనద్వాదశి. బిందుఫల మిచ్చిన వచ్చెదను. లేకున్న రానసుము. వారట్టులే బాసచేసి నిన్నుc ద్వారకకుc దోడుకొని వత్తురు. ఆవల నీవు సుఖముగా నుండcగలవు. అని చెప్పి మాయమయ్యెను. ఆయన చెప్పినట్టులే యాయన యాజ్ఞమేరకు రుక్మిణీసత్యభామలు వచ్చి యది కోరిన వరమిచ్చి తోడుకొనిపోయి బిందుఫలమిచ్చిరి. అదిమొదలది సుఖముగ నందే స్వామిసేవ చేయుచుండెను.

**4. జితక్రోధుcడు, శిబి**

విశ్వామిత్ర వంశమున జనించిన యష్టకుcడను రాజశ్వమేధ యాగము చేయcగా నానిమిత్తమున నతని తమ్ములు ప్రతర్దనుcడు – వసుమనస్సు – శిబి యనువారును వచ్చియుండిరి. యజ్ఞాంతమునం దష్టకుcడు తన సోదరులతో రథారూఢుcడై పోవుచుండి తన కభిముఖుcడై వచ్చు నారదమహర్షిని దర్శించి రథంబు డిగి సత్కరించి "మహాత్మా[7] నాతోడరండు. ఈరథముపై నెక్కిపోదము" అని వేcడుకొనెను. ఆయనయు వల్లెయని వారి తోడ నారథముపైc గూర్చుండి పయనించు సమయంబున నందొకరు నారదునిc జూచి త్రిలోకజ్ఞా! యిందుండు మన మందఱము ధర్మాత్ములమే కదా! మనకు స్వర్గావాసము నియతమై యున్నది. పుణ్యఫలానుభవాంతమున నెప్పటికైన స్వర్గమునుండి భ్రష్టులమై నేలcబడవలసిన వారమేకదా. ఇందఱిలో ముందు స్వర్గభ్రష్టులగువారెవరు? అని యడిగెను. అష్టకుcడని నారదుcడు చెప్పెను. ఏలయని యా రా జడిగిన నారదుc డిట్లనియె.

ఈ యష్టకుని మందిరమున నతిథినై కొన్నదినము లుంటిని. ఒకనాఁడు నన్నుఁ దన రథముపై నెక్కించుకొని యీ యష్టకుఁ డూరి వెలుపలికిఁ దోడ్కొనిపోయెను. ఊరివెలుపల నొక గొప్ప యావుల మందఁగని రాజా యివి యెవరి యావులని ప్రశ్నించితిని. "ఇవి నేనొక బ్రాహ్మణునికి దానమిచ్చిన యావు" లని యితఁడు చెప్పెను. ఈ యహంకార లేశముచే నితఁడు తొలుత స్వర్గమునుండి పడిపోవును.

తక్కినవారిలో యుందెవ్వరికి స్వర్గచ్యుతి కలుగునని మఱియొక రడిగినఁ బ్రతర్దనుఁడని దానికిఁ గారణమిట్లు నారదుఁడు చెప్పెను.

ఈ ప్రతర్దు నింటను గొన్నినాళ్ళు నేను వసించితిని. ఒకనాఁడు నాలుగు గుఱ్ఱములఁ గట్టిన తేరిపై నన్నెక్కించుకొని వాహ్యాళి పోవుచుండ నొక బ్రాహ్మణుఁ డెదురై "రాజా నాకొక యశ్వమిమ్ము." అని యడిగెను. "మార్గమధ్యమున నడిగిన నెట్లిత్తును? నేనింటికి వచ్చిన తరువాత నడుగుము. ఇచ్చెదను" అనెను.

"అట్లుకాదు. రాజా! నాకత్యంతావశ్యక కార్యము గలదు. జాగుచేయరాదు. ఇప్పుడేయిమ్ము" అని యా బ్రాహ్మణుఁడనెను. అట్లైనఁ దీసికొని పొమ్మని యొక గుఱ్ఱము నిచ్చెను.

ఆవల కొంతదూరము పోఁగా మఱియొక బ్రాహ్మణుఁడు వచ్చి యట్లే యడిగెను. ఇంటికిరమ్మని రాజు సమాధానము చెప్పెను. గాని యతఁడు విననందున విధిలేక మఱియొక గుఱ్ఱము నిచ్చెను. ఇట్లులే మఱి యిద్దఱు బ్రాహ్మణులు వచ్చి తక్కిన రెండు గుఱ్ఱములను యాచించి తీసికొనిపోయిరి. అప్పుడీ ప్రతర్దనుఁడు రథము డిగి యీ బ్రాహ్మణు లిఁకేమి తీసి కొందురనుచుఁ దానే కాఁడిమోచి తేరులాగికొని పోయెను. కొఱమనస్సుతో దానము చేయుటచే నితఁడు పడిపోవునని చెప్పఁగాఁ దక్కినవారిలో ముందెవ్వరు స్వర్గభ్రష్టు లగుదురని యడుగ నారదుఁ డిట్లనియె.

"తక్కినవారిలో వసుమనస్సు ముందు పడిపోవును. నేను లోకసంచారము గావించుచు నొకనాఁ డీయన యింటికి వచ్చితిని. దేవదత్తమైన పుష్పరథమునకు స్వస్తివాచనము గావింపబడుచుండెను. ఆవల నారద మందఱకు దృగ్గోచరము కాఁగానే నా తేరి మహిమను సౌందర్యమును విశేషముగఁ బొగడితిని. ఆ పొగడ్త పలుకులు విని "నారదా! దీనిని నీ వింతగ మెచ్చుచున్నావు కావున దీనిని నీవే తీసికొమ్ము" అని చెప్పెను. కావలసినపుడు తీసికొనెదను. నీ యొద్దనే యుండనిమ్మని చెప్పి వెడలిపోయితిని. మఱియొకసారి వచ్చి దాని సత్యద్భుతముగఁ బొగడితిని అప్పుడు దానిని నీవే తీసికొమ్మని చెప్పెను. పదపడి యొకసారి వచ్చి "యోహెూ రాజా! యేమి నీ పుష్పరథము సౌందర్యము. ఇంద్రవరుణ కుబేరుల విమానములును నీ పుష్పరథము సాటిరాదు" అని యీ విధముగఁ బెక్కురీతుల నుతులు గావింపఁగా నా మాటలు విని యితఁ డిట్లనియె.

"మునీంద్రా! నీ శ్లాఘావాక్యములు పుష్పరథము యోగ్యతకుఁ దగియున్నవి. ఉచితరీతిఁ బ్రశంసించితివి" అని యనెనేకాని నీకిచ్చితిని గదా. నీది నీవు తీసికొని పొమ్మని చెప్పఁడయ్యెను. ఈ హేతువుచే నితఁడు పడునని చెప్పెను.

"మిగిలిన మీ యిరువురిలో నెవరికి ముందు పతనము కలుగు"నని యొక రడిగిరి. నేనే ముందుపడుదునని నారదుఁడు చెప్పి వెండియు నిట్లనియె.

"నేను శిబి సమానుఁడ నెన్నఁటికిఁ గానేరను నేనొకనాడీయనతోడ నుండునెడ నొక బ్రాహ్మణుఁడువచ్చి "రాజేంద్రా క్షుధార్తుఁడను. నాకింత యాహారము పెట్టెదవా" యని యడిగెను. "అవశ్యము పెట్టెదను అని శిబి చెప్పెను. "అటేని నీ పుత్రుని నీవే చంపి యా మాంసముతో నాకాహారము కల్పింపుమని యా యతిథి పలికెను. అట్లే కానిమ్మని పోయి బ్రహ్మార్పణమని కన్నకొడుకును జేతులారఁ జంపి వండి తట్టలో నుంచి శిరస్సుపై ధరించి తెచ్చెనుగాని యా బ్రాహ్మణుడందు లేఁడయ్యె. ఆ పళ్ళెరమును దన శిరస్సుపై

నుంచుకొని యా బ్రాహ్మణుని వెదకుచుఁ బోయెను. ఏమి జరుగునో చూతమని నేను వెంటనంటితిని. ఇట్లు వెదకుచుఁ బోవుచుండఁ గొందఱు పౌరులు వచ్చి రాజా! నీవు వెదకు బ్రాహ్మణుఁడు నీ సౌధమునకు నాయుధశాలకు గుఱ్ఱపుశాలకు నంతఃపురమునకు నిప్పంటించి వేడుక చూచుచున్నాఁడు. నీ భార్యయు నంతఃపురస్త్రీలు వీథుల నల్లాడుచున్నారు. నీ నగళ్ళల్లకల్లోలముగ నున్నవి" అని చెప్పిరి.

ఈ రాజు కొంచెమైన మనోవికారము లేనివాఁడై యా బ్రాహ్మణుఁడున్న చోటికిఁ బోయి "విప్రోత్తమా! యాఁకటి బడలిక తోడీ కార్యములచే మిగుల డస్సితిని. నీవు కోరిన యాహారముఁ దెచ్చితివి గైకొమ్మని హస్తములు మోడ్చి ప్రార్థించెను.

"నా మీఁది కోపముచే నీవిందేమి విషపదార్థము కలిపితివో ఎట్లెఱుఁగనగు? నీవు ముందు తిందువేని నేను బిదపఁ దినెదను" అని యా బ్రాహ్మణుఁడు పలికెను. కానిమ్మని యీ శిబి యొక కబళమెత్తుకొని నోర నుంచుకొనఁబోఁగా నా బ్రాహ్మణుఁడు తటాలునఁ జేయిపట్టుకొని "రాజా! నీ వతిథి ప్రియుఁడవని జితక్రోధుఁడవని యెఱింగితిని" అనుచుండు నంతలో మృతపుత్రుఁడు సర్వాభరణ భూషితుఁడై పరిమళించు మేనితో గంతులు వేయుచు నచ్చటికి వచ్చెను. దగ్ధగృహంబులు పూర్వముకన్న శోభాయమానములై కానవచ్చెను. ఆ బ్రాహ్మణుఁ డచ్చటనే యదృశ్యుఁ డయ్యెను. ఆ బ్రాహ్మణుఁడు యెవ్వఁడో కాఁడు. బ్రహ్మదేవుఁడే. ఉత్తమ లోకములఁ గాంక్షసేయువారిని దేవతలిట పరీక్షింతురు. పరీక్షలందుఁ గృతార్థులయిరా యుత్తమ పదవు లొసగుదురు" అని చెప్పెను.

## 5. శ్రద్ధానుసారము ఫలము

ఒక నగరము వెలుపల నొక సన్న్యాసి వసించుచుండెను. అనేక చాతుర్మాస్యములు ముగించి భూప్రదక్షిణము ముమ్మాఱు గావించి గుర్వాజ్ఞగొని వృద్ధుఁడగుటచే నియతి తప్పక యదృచ్ఛాలాభసంతుష్టుఁడై

జపతప స్వాధ్యాయాదులఁ గాలము గడుపుచు సర్వజనవంద్యుఁడై యుండెను. ఇతఁడు నిజమైన వైరాగ్యము కలవాఁడై సన్న్యసించెనుగాని భార్యతోఁ గలహించిగాని దారపుత్రాదుల పోషణభారము తప్పించు కొనుటకుఁ గాని భార్య దుష్టురా లగుటచేతఁ గాని సన్న్యసించినవాఁడు కాఁడు. నగరములోఁ బాకధూమము నిలిచిన తరువాత మధ్యాహ్న పంచభిక్షకై యెవరు నమస్కరింతురో యను భయముచేఁ దలపై ముసుఁగు గాని గృహస్థుల యిండ్లలో భోజనము చేయువాఁడు కాఁడు. లభించిన యన్నమును నాశ్రమమునకుఁ దెచ్చి నీటఁగడిగి పశుపక్ష్యాదులకుఁ గొంతయిచ్చి మిగత నిశ్శేషముగ బ్రహ్మార్పణమని భుజించును. సూర్యచంద్ర నక్షత్ర కాంతులు దప్ప దీపాదికృత్రిమ తేజముల నుపయోగింపఁడు. ఎండైన నరిగి రాక తడవాయోనేని ప్రొద్దు నుపయోగింపఁడు. ఎండైన నరిగి రాక తడవాయెనేని ప్రొద్దు గ్రుంకినచోటనే పరుండును. ఎంత దవ్వైనఁ గాల్నడఁ బయనించునే కాని యానారోహణము సేయఁడు. నడచునపు డతని దృష్టి కాఁడిమ్రాఁకు దవ్వునకన్న నావలఁ బడదు. తాను దెచ్చుకొన్న నీరే తానుపయోగించుకొనును గాని యితరులు దెచ్చినదానిని స్పృశింపఁడు. సర్వభూత మైత్రిగలవాఁడు. ఎవ్వరితోడను స్నేహము చేయఁడు. దేనియందును బ్రీతిలేదు. ఈ విధముగ నియమ గరిష్ఠుఁడై యుండు నయ్యతి శ్రీభాగవతంబున “భగవంతుఁడు సర్వాభీష్ట ప్రదుఁడు. శ్రద్ధకొలఁది ఫలము” అని చదివి యిట్లు లాలోచించెను. భగవంతుఁ డొకఁ డున్నాఁడని యాయన మోక్షము నిచ్చునని విశ్వసించి నేనీ నియమము శ్రద్ధాభక్తులతో జరపుచున్నాడను. మోక్షమో కానరానిదశ, అదికలదో లేదో, కలదనిశాస్త్రోక్తి విశ్వాసము. ఉన్నను దుస్సాధ్యము. భగవంతుఁడు మోక్షదాత. యని చెప్పు గ్రంథమే సర్వాభీష్ట ప్రదాతయని చెప్పుచున్నది. అటైనచో నేనేది కోరినను భగవంతుఁడు దానిని దప్పక నెఱవేర్పవలయును. ఈ దేహికి దుష్కరమైన దానిని గోరెదను. భగవంతుఁడిది సాధ్యపఱచెనా మోక్షము సాధ్యమే. శాస్త్రము సత్యమే. లేకుండిన శాస్త్రము కల్ల, మోక్షము హుళిక్కి,

దేవుఁ డుండుట దబ్బఱయని దృఢనిశ్చయుండై దిగాలున లేచి చక్క నా నగరమేలు రాజునింటికిఁ బోయెను. ఎన్నఁడు దన్నుఁ గన్నెత్తియైనఁ జూడని సన్యాసి తన యింటి వాకిట నిలుచున్నవాఁడని విని యెదురుగఁ బోయి గౌరవించి వాకిట నిలుచున్నవాఁడని విని యెదురుగఁ బోయి గౌరవించి లోనికిఁ దోడితెచ్చి కరములు ముకుళించి నిలఁబడి మహాత్మా! తమ రెన్నఁడు రానివారు నేఁడు మా యింటికి వచ్చుటచే నా యిల్లు జన్మము వంశము పావనము లయ్యెనని నందించి తమ రాకకుఁ గారణమేమో తెలుపుఁడని వేఁడికొనెను.

ఆ సన్యాసియు రాజేంద్రా నీ వలన నొక ప్రయోజనము గోరి వచ్చితిని. శుష్కాలాపములతో శూన్యహస్తములతోఁ జెల్లుపెట్టక నా కోరిక నెఱవేర్చెదవేనిఁ జెప్పెద. అది సమకూర్చితివేని నీకు మహాభ్యుదయము గలుగునన యతీంద్రా! నాకు సాధ్యమగు నేని తప్పక ఘటించెద నని రాజనెను.

నాకు నీ పుత్రికను వివాహమాడ నభిలాష గలదు. ఇచ్చెదవా వ్యర్థముగఁ బొమ్మనెదవా? అని యతి యనెను. ఈ మాటలు విని రాజు నిర్విణ్ణుఁడై "గొప్పసన్యాసి – విరాగి – ఏండ్లు చెల్లినవాఁడు ఈయనకేమి? పెండ్లిపిచ్చియేమి? అందు నా కూఁతుపై గాంక్షయేమి?" అని చాలదూర మాలోచించి యిట్లనియె. "సన్యాసివర్యా! కన్యాదానము సర్వశ్రేయస్కరము. కన్య యెప్పటికైనఁ బరునివిత్తమే. అందు మీవంటి యుత్తమపాత్రము దొరుకుట మహాభాగ్యము. ఐనను గన్యాదానమందు జననీ జనకు లిరువురు స్వతంత్రులు. కన్యాభీష్టమును దెలియవలసి యున్నది. కావున రేపు వచ్చెదరేని వారి యభీష్టము తెలఁగెఱిఁగి మీకు విన్నవించుకొనెద" ననిచెప్పి పంపెను. ఈ వార్త భార్యకుఁ దెలుపఁగానే "సరిసరి బాంధవము బాగున్నది. సన్న్యాసి వయస్సు మీఱినవాఁడు. వీనికేమి పెండ్లియేమి? అందు నా కుమార్తె నిచ్చుటేమి? పుట్టక పుట్టక ముత్తెమువలె నొక బిడ్డ పుట్టఁగాఁ గావిగుడ్డ రాయనికాయియ్యవలయును? ఏమి చూచి పిల్ల వీనిని

వరించును? వీని సరసిన గడ్డమునుజూచి మోహించునా? కావిగుడ్డలకై కామించునా? గోచికై భ్రమించునా? మెడలోకి తులసి పూసలహారము లాభరణములు. కాఁబోలు. కావిగుడ్డ చీర – పైటకు గోఁచి–ఇవి వస్త్రములు. ఎంతమంది పెండ్లికొడుకును సంపాదించితిరి." అని యామె యుల్లస మాడెను. అప్పుడు రాజు తన మంత్రిని బిలిపించి సర్వముఁ దెలిపిన నతఁ డిట్లనియె.

"రాజేంద్రా! యాసన్యాసి నిజమరిగాని వంచకుఁడు గాఁడు. గొప్ప మహిమ గలవాఁడైనను నివురు గప్పిన నిప్పు. అతఁడు నిజముగ వలపుచే వివాహమాడునని నేను దలఁపను. ఒకవేళ నితఁడు కాముకుఁడే యైనచో నెందో రహస్యముగ వ్యభిచరించును గాని రాజగు నిన్ను నీ కూఁతు నిమ్మని యడుగునా? మాంసము దినువాఁడును బ్రేగులు మెడలో వేసి కొనఁడు గదా. సన్యాసి యిట్టి కార్యము బహిరంగముగఁ జేయ సాహసించునా? ఇతని నడవడి విన్నా, నేఁడా చూచుచున్నాము. ఇందేదియో రహస్యమున్నది. మన కిప్పుడు తెలియదు. మొఱటుగ నిచ్చుట లేదని తిరస్కరించితివా శపించును. సత్కరించి సవినయముగా నిట్లు విన్నవింపుము. యతీంద్రా! లేక లేక నాకొక కూఁతురు గలిగెను. స్త్రీలు ధనాభిలాషగలవారని యాభరణములే వారికిఁ బ్రాణములని మీ రెఱుంగనిది కాదు. వివాహము వివాదము సమానులయందు శోభించును. పిల్లయుఁ దల్లియు మీరుసిరికాయ లంతటివి. రెండుగోతముల మంచిముత్తెములు దెచ్చి యిచ్చెదరేని యీ కార్యమున కంగీకరించెద మనుచున్నవారు. మీకు మహాత్ములకు మీకసాధ్యములేదు." అని యీ విధముగ గౌరవవాక్కుల నభినందింపుము. అంతతో నతఁడూరకపోవునని చెప్పెను. అందఱు దానికి సమ్మతించిరి.

మఱునాఁటి తేపట యతి వచ్చి క్షితిపతింగని యేమి రాజా! ఏమనెద వనెను. రాజు యతిరాజుతో నిట్లనియె.

"మీరు వ్రతహానికైననోర్చి మా పిల్లను గామించుట మమ్ముఁ గృతార్థులఁ జేయుటకేయని మా యందఱమతము. కావున మీకోరిక మాకు సమ్మతము. అయినను మత్తకాశినులు విత్తాసక్తచిత్తులు. లోపాముద్రవంటి తపస్వినియు నగస్త్యుని రాజకన్యకోచితములైన వాసోభూషాదులఁ గోరెఁగదా. ఇంకఁ బామరకన్యల నేమనవలయును. రెండు గోతముల మంచిముత్తియము లుసిరిక కాయలంతవి యుంకువగాఁ గోరుచున్నది. మీరు మహాత్ములరు మహా తపస్సంపన్నులరు. మీకసాధ్య మెందును లేదు. కావునఁ జిన్నదాని మనస్సు చిన్నపుచ్చక మచ్చికతో నీమాత్రము చనవొసంగుఁడు" అని యెంతో వినయముగఁ బ్రియవాక్కులాడెను.

రాజా! యట్లే కానిమ్ము. పోయివచ్చెదనని చెప్పి యా సన్న్యాసి వెడలి చక్క సముద్రతీరముఁ జేరెను.

ఇట్లు వేలావనిఁ జేరి యా సంయమి నీటియొద్దునఁ గూర్చుండి దోసిటితో సముద్ర జలము ముంచి భూమిపైఁ బోయెఁ దొడఁగెను. ఐదాఱు దినములైనను నిద్రాహారములు మాని యేక నిశ్చయముతో భారము భగవంతునిపై వైచియట్లే చేయుచుండెను. అప్పుడు విష్ణువొక ముసలి వానివలె రెండుగోతముల మంచి ముత్యములు కావలయును. అవి సముద్రమునందుఁ దప్ప మఱియెక్కడను దొరకవు. కావున సముద్రపు నీళ్ళు పాఱఁజల్లి వానిని గైకొనెదను" అని సంయమి చెప్ప నా వృద్ధుఁడు నవ్వియిట్లనియె.

"ఓయీ నీకు మతిలేదా యేమి? సముద్రపునీళ్ళు దోసిటనా పాఱఁజల్లెదవు? మేలు మేలు! ఇది సాధ్యమా? నేల యొకపాలు నీళ్ళు మూఁడు పాళ్ళనుట యెఱుఁగవా? ఛీ! బుద్ధి లేనివాఁడా! లేచిపొమ్ము. కూడునీళ్ళు చాలించి యిది యొక నాఁట నొకపూఁటనగు కార్యమువలె నీ దొడ్డకార్యమును జేయుచున్నావు. ఎవరైన వినిన నవ్వుదురు. వెఱ్ఱివాఁడందురు. పోపొమ్ము" అని యెంతెంతో నిరుత్సాహవాక్యములు పలికెను.

"అయ్యా! నీ వేల గొంతుచించుకొందువు భగవంతుఁ డొకడుండుట నిశ్చయమేని యతఁ డాశ్రితాభీష్ట ప్రదుఁడేని నా సంకల్పము వ్యర్థముపోదు. పో పొమ్ము. నీకేల యీాశ్రమమని యా సన్న్యాసి తనపని తాను జేయుచుండెను.

ఇట్టులే భగవంతుఁడు రెండు మూఁడు విధముల వచ్చి నిరుత్సాహ పఱిచెను గాని యతఁడు మానినవాఁడు కాఁడు. అప్పుడు శ్రీమహావిష్ణువు "సముద్రునిఁ జూచి యితఁడు నామీఁద నెపము పెట్టి ప్రాణములైన వీడుటకు సాహసించి యున్నాఁడు. వీఁడు కోరిన ముత్తెము లిమ్ము నీవే వాని నితఁడు కోరినచోటికిఁ దీసికొనిపోవ సేవకుల నియమింపుము" అని చెప్పిన నజ్జలధిరాజును నుసిరిక కాయలంత ముత్తెములు రెండు గోతముల నిండఁ దెచ్చి యతీంద్రా! భగవంతుఁడు నీకు వీని నిమ్మని యాజ్ఞాపించెను. గైకొమ్ము అనిన నేను వీని నెట్లు మోసికొని పోఁగలను. నా యాశ్రమమునకు నివి పంపుమనిన సముద్రుఁడు నిరువురు సేవకుల నిచ్చి యా రెండు గోతముల ముత్యములను సన్న్యాసి వెంటఁబంపెను. సన్న్యాసియు వాని నెత్తించుకొని చక్క రాజగృహమునకు వచ్చి సభలోనున్న రాజునెదుట నారెండుగోతములుంచి సేవకులను బొమ్మని సెలవిచ్చి రాజా యిదిగో! నీ కూఁతురు కోరిన యాణి ముత్తెములు. ప్రతి మౌక్తిక మిసిరిక కాయయంత యున్నది" అను సన్న్యాసి వాక్యములు విని వానినిగని రాజు మంత్రి సభ్యులు దిగాలుపడి దిగ్భ్రమగొని యుండిరి. రాజు వాని నంతఃపురమునకుఁ బంపెను. యతీంద్రా! ఱేపుదయమున వచ్చిన మాట లాడుదమని రా జాయనను పంపెను.

ఇట్లాయనను బంపి మంత్రినిజూచి రాజు "సచివవర్యా! మన యుపాయము ఫలింపదయ్యెను. ఒక పక్షములోపల నిన్ని ముత్యము లీసన్న్యాసి యెట్లు సంపాదించెనో; లోకములో నుసిరికాయయంత ముత్యముండుటే విన్నవారముగాము. అట్టివి రెండు గోతములఁట మంచి

ముత్యాలంటఁ!! ఇఁకఁ గర్తవ్యమెయ్యది చెప్పుము" అనిన నమాత్యుఁ డిట్లనియె.

"రాజా! యాయన సామాన్యుఁడు గాడని మున్నే చెప్పితిని. అతఁడు కామవశుఁడని నేనిప్పటికని దలంపను. అయినను గాకున్నను నింత శ్రమపఱిచి యిప్పుడు తిరస్కరించెదవేని నిన్నుఁ దప్పక శపించును. కావున మరల నాయన రాకముందే ఱేపే ముహూర్తమని నిశ్చయించి లగ్నపత్రిక వెంటనే పంపుము. సన్న్యాసిపెండ్లి కన్నియు శుభలగ్నములే" యనిన రాజును నట్ల కావించి నగరు నగరి నలంకరింపించి రాజు పుత్రికను వివాహమని చాటింపఁబంచి తానే తగు పరిజనులతోడఁ బోయి లగ్న పత్రికనిచ్చి సన్న్యాసి నింటికిఁ దోడితెచ్చెను. సంభారము లన్నియు సిద్ధము చేయఁబడెను. మఱునాఁడు లగ్నవేళ సమీపించెను. రాచనగరు జన సమ్మర్దముచే వ్రేలెఁ డెడము లేనిదై యుండెను. పెండ్లికొడుకు కాని వస్త్రములతో దండ కమండలువులతోఁ బెండ్లిపీఁటలపై గూర్చుండెను. విధవల పెండ్లిండ్లకే మంత్రములు వదరు బ్రాహ్మణులుండ సన్న్యాసుల పెండ్లికి లేకపోదురా? మంగళసూత్ర ధారణసమయము వచ్చెను. యతీంద్రా! ఈ మంగళసూత్రమును వధూకంఠమునఁ గట్టుమని పురోహితుఁడు చేతి కిచ్చెను. సన్న్యాసి దానిని బళ్ళెరములో నుంచి చివాలున లేచి పోఁజొచ్చెను. రాజును రాజబంధువులు వెంబడించి యడ్డమువచ్చి యిది యేమి పోయెదరే యని యడిగిన నతఁడిట్లనియె.

"ఏండ్లు చెల్లిన సన్న్యాసికి నా కేమి పెండ్లియేమి? భగవంతుఁడు సర్వాభీష్ట ప్రదాత. శ్రద్ధానుసారము ఫలమని శ్రీభాగవతమునఁ జదివి యది యెంతమాత్రము సత్యమో పరీక్షింపనిన్ని పోకలఁబోయితిని. ఆ ముత్యములు మీరే గ్రహింపుఁడు. నాకుఁ బనిలేదు" అని చెప్పి యాశ్రమముఁ జేరెను.

## 6. మతిలేని రాజు

కళింగదేశమున మందేహుఁడను రాజుండెను. నవరత్నముల వ్యాపారముచేయు కొందఱు వర్తకు లీయనయొద్దకు వచ్చి తమయొద్దనున్న యమూల్యములైన నానావిధరత్నముల నెల్లఁ జూపిరి. రాజును సంతోషించి వానిలో మేలైన వాని నెల్ల నాలుగులక్షల విలువగల మణులను గొని మఱియు వారితో నిట్లనియె. ఓవర్తకులారా! మీరుమరల జావాహిరి తీసికొని వచ్చునపుడు మా దర్శనమునకుఁ దప్పక రండు. ఇంతకు నెక్కువగఁ దీసికొందుము. వలయునేని మీకు ముందుగ సంచకరువుగ నేఁబదివేల రూప్యంబు లిచ్చెదఁ గొనుఁడని చెప్పెను ఆ మాటలు విని మంత్రి యిట్లనియె "వీరు వ్యాపారముచే జీవించువారు. వీరికదియేవృత్తి. మనల నుద్ధరించు కోసరము వచ్చెదువారుగారు. ఇట్టివారికి నొకటి గాదు. రెండుగా దేఁబదివేల రూప్యంబు లేల ముందుగ నీయవలయును? వారు రాకున్న నేమి చేయవలయును? వీరు దేశాంతర ద్వీపాంతర సంచారులు. మనరాష్ట్రము దాఁటిరేని వారల మనమేమి చేయఁగలము? మెతుకులు చల్లినఁ గాకులకుఁ గఱవా? కొనువారున్నచోటికి నమ్మెదువారు తామే వత్తురు" అని బోధించిన రాజిట్లనియె.

"ఓయి మంత్రీ! నీకుఁ దోఁచినది చెప్పితివి. తప్పేమి గాని మనవలె నిట్టివానిని గొనువారు లోకములో నెందఱు లేరు? వీరు మనయొద్దకే రావలయునని విధియా? ఎక్కడ నమ్ముదు పోయిన నక్కడనే విక్రయింతురు. మనము సంచకరు విచ్చిన నమ్మకముగా మనయొద్దకే వత్తురు" అని చెప్పి యా బేహారులకు నేఁబదివేల రూప్యంబులిచ్చెను. వారును సంతోషముతో నక్కనుద్రొక్కి వచ్చితిమని చంకలు తట్టుకొనుచుఁ బోయిరి.

ఆవలఁ గొన్నినాళ్ళ కీమందేహుఁడు మంత్రినిఁ బిలిచి "యోయీ! మన రాష్ట్రములోనుండు మతిలేని వారినెల్ల నొక పట్టీవ్రాసి నెలదినముల లోపలఁ జూపుము. ఇట్టివారు దేశమున కనర్థక ప్రదులు. కావునఁ దఱుమఁ

గొట్టెద"నని చెప్పెను. ఆ మంత్రియు నట్టులే కానిండని యొక పుస్తకము సిద్ధముచేసి యందు మొట్టమొదటి పేరుగ "మ-రా-రా-శ్రీ రాజమందేహనృపాలుఁడుగారు" అని బిరుదముతోడ వ్రాసి యావల నెల్లయ్య పుల్లయ్య యని యేవో కల్పితనామములఁ గొన్ని పుస్తకమునిండ వ్రాసి నెల గడువు కాఁగానే రాజుచేతి కిచ్చెను. ఆయన దానియందుఁ దనపేరు ప్రథమమందే యుండుట చూచి యేమి మంత్రీ! నాపేరు మొదట వ్రాసితివి. నేనేమి మతిమాలిన కార్యము చేసితినని యడిగెను.

"దేవరా! రత్నముల వర్తకులకు నేఁబదివేల రూప్యంబులు సంచకరు విచ్చితిరి. అంతవఱకుఁ బ్రతి సంవత్సర మొకసారియైన వచ్చువారు సంచకరువు తీసికొని మూఁడు సంవత్సరములైనను వచ్చినవారు కారు. కావున వ్రాసితి ననియెను.

"ఇఁకమీఁద వారు వచ్చిననో" యని రాజనెను.

"తమపేరు దీసివైచి వారిపేరు వ్రాసెదను" అని మంత్రి చెప్పెను.

## 7. జారయైన రాజదార

ఒకానొక రాజునకు వెలిచని మరగిన యొక యిల్లాలుండెను. దీని నడవడి రాజునకుఁ దెలియవచ్చెను. అతఁడు బోధించెను, బాధించెను గాని యాచెడిపె తన నీచగుణమును మానినది కాదు. ఆ నిమిత్తమున నా రాజు రాజకార్యములను గూడ మాని యంతఃపురములోనే పెండ్లానికిఁ గావలి కాచుచుండెను. ఇట్లుండ నా రాజు గ్రామాంతరము పోవలసిన యావశ్యకకార్యము తటస్థించుటచే నేమి చేయుటకుఁ దోఁపక తన కత్యంతాప్తుఁడైన యొక బ్రాహ్మణుఁ బిలిచి యిట్లనియె.

"మిత్రమా! నా దుఃఖము నేనేమని చెప్పుకొందును? నా భార్య చీఁకటితప్పున నాతితేతిన దని నీవును వినియుందువు. ఆ హేతువుచే దాని కావలిగాచుచు నిన్నాళ్ళు గడిపితిని. ఇప్పుడు నేను గ్రామాంతరము పోవలసియున్నది. ఇఁకనది విశృంఖలవృత్తిఁ జరించును. ఈ

యవమానమునకన్న నెందైనఁ జచ్చుట మేలని తోఁచుచున్నది. ఏమి చేయుమనెదవు."

"నీ శోకమునకుఁ దగిన కారణము గలదు గాని లేదని చెప్పను. తమ భార్యలు ఱంకాడిన దుఃఖింతురు గాని తమ ఱంకుపోతుతనమునకు సాధ్వులైన తమ భార్య లెంతదుఃఖింతురో యది పురుషపశువులు గ్రహింపఁ జాలవు. భర్తలు వ్యభిచరింపవచ్చునుగాని భార్యలు వ్యభిచరింపరాదఁట. ఏమి యీ నీతి! భర్త కాముకుఁడై వ్యభిచరించెనా యది భార్య వ్యభిచరించుట కనుజ్ఞయిచ్చుటయే యని నా యభిప్రాయము. అదటు లుండనీ ఇప్పుడు నీకొక యుపాయము చెప్పెద వినుము నీవు నీ భార్యయొద్దకుఁ బోయి నీ ప్రణయవార్త యెఱింగించి నయవాక్యములు నిట్లనుము. ప్రేయసీ! నీ వత్యంత కాముకవు. క్రీడాతత్పరవగుట యెఱింగి నీ సంతోషమునకై యొక క్షణమైన నిన్ను విడిచి యుండఁ జాలకుంటిని. ఇప్పుడు గ్రామాంతరము పోవలసిన కార్యము దాపరించినది. నేను బోక తప్పదు. నీచిత్తవృత్తినే నెఱుఁగుదును. నీకుఁ బురుషసాంగత్యమున కనుజ్ఞ యిచ్చితిని. ప్రాతఃకాలమున మల విసర్జనమునకై యెవ్వఁడు మిగుల దూరము పోవునో నట్టివానితో నేను వచ్చు వఱకు రమించుచుండుము. అట్లైన నీకు వ్యభిచార దోషబాధ కలుగదు" అని చెప్పి పొమ్మని బోధించెను.

ఆ రాజట్టులే భార్యకు బోధించి బాసగైకొని యిల్లు విడిచిపోయెను. సూర్యోదయమునకు ముందే యా యిల్లాలు మేడ కట్టకడపటి యంతస్తుపై కెక్కి నలువంకలు చూచుచుండెను. అప్పుడు నడిమి ప్రాయపు బ్రాహ్మణుఁ డొకఁడు ముంతతో నీళ్ళు దీసికొని యూరివెలుపలఁ జాల దవ్వుపోయి మఱుగునఁ గూర్చుండి మలవిసర్జనము చేయుచుండెను. వెంటనే యా రాణి సేవకుల కతనిని జూపి వాని నెట్లైన నిచటికిఁ దోడితెండు. విడువవలదని యాజ్ఞాపించెను.

ఆ భటు లాదరబాదర యచటికిఁ బోయిరి. వీరు పోవునప్పటికిఁ గార్యము దీర్చుకొని యత డెదురుగ వచ్చుచుండెను. ఆ భటులాయనను

జూచి యయ్యా! మా రాణిగారు నిన్నుఁ బిలుచుకొని రమ్మనినారు. రండు పోదమనిరి.

బ్రాహ్మణుఁ డా మాటల విని "పోపో, మీ రాణితో నాకేమిపని, మీతో నా కేమిపని. నేను రాను" అని తిరస్కరించెను. రాకున్న విడువము. బలవంతముగఁ బట్టుకొనియైనఁ బోయెదమని వారనిరి. నన్నుఁదాఁకిన మీతలలు పగుల మొత్తెదనని బ్రాహ్మణుఁ డనెను. ఈ విధముగఁ గలహము పెరిఁగెను. భటు లా బ్రాహ్మణుని రెట్టలు పట్టుకొనిరి. వాఁడు వారి చెంపలు పగులఁ గొట్టెను. వాగ్వాదము ముష్టియుద్ధముగఁ బరిణమించెను. ఈ కలహములో భటులచేతి దెబ్బ తగిలి బ్రాహ్మణుచేతి మంటిముంత పగిలిపోయెను. అయ్యో! నా ముంతా యని బ్రాహ్మణుఁ డేడ్వఁజొచ్చెను. ఏడ్చినను మొత్తుకొన్నను వదలక యతనిఁ బట్టుకొనివచ్చి భటులు రాణి ముందర నిలిపిపోయిరి. రాణియు జరిగిన దంతయుఁ జూచుచుండెను.

"ఏడ్చుచుఁ దల కొట్టుకొనుచుఁ బ్రాణత్యాగము చేసెదను. నేనిఁక జీవింపను" అని ప్రలపించుచున్న యా తరుణాగ్నిహోత్రిని జూచి యా రాణి సానునయవాక్యంబులు పలికి "యయ్యా! యేల యింతగ శోకించెదవు. ప్రాణత్యాగము చేయవలసిన కార్యమేమి సంభవించెను?" అని యడిగెను.

బ్రా : మానహానికంటె బ్రాణత్యాగ కారణ మింకొం దేదిగలదు?

రాణి : మా భటులు నిన్నుఁ బట్టి తెచ్చిరని కోపించెదవేని క్షమింపుము. దానికిఁ గారణభూతురాల నేనే. నిన్ను సమ్మానింపఁ దోడి తెమ్మంటిని. వారు ధూర్తులై యట్లు చేసిరి. వారిని శిక్షించెదను క్షమింపుము.

బ్రా : నీ సమ్మానమునకు నేను బొంగను. నీ యవమానమునకుఁ గ్రుంగను. నన్ను భటులచేతఁ బట్టి తెప్పించుటకు నేను జారత్వము చేయలేదు. చోరత్వము చేయలేదు.

ధూర్తత్వమునకు నిన్ను లోకము నిందించునుగాని నన్ను నిందింపదు.

రాణి : అటైన నీవు ప్రాణత్యాగము చేయనేల?

బ్రా : నాకు బుద్ధి తెలిసినది మొదలు నేను బహిర్భూమికిఁ బోవునప్పు డంతయు నొక ముంతను దీసికొని పోవుచుంటిని. ఆ ముంతతప్ప నా మర్మాంగమును జూచినది వేఱొకటి లేదు. దానిని నీ విపుడు పగులఁగొట్టించితివి. సిగ్గుమాలిన వాఁడనై యిఁక నా యంగమును దేనికిఁ జూపుదును?

రాణి : మంటిముంతపోయిన బంగారుముంత నిచ్చెదను. దీని కేల వ్యసనపడియెదవు?

బ్రా : మంటిముంతకై నేను వ్యసనపడలేదు. నా మర్మస్థలము చూచినది యది యొక్కటియే. ఆ యొకటి పోయెను. ఱేపటినుంటి నా గతియేమి?

రాణి : (నవ్వుచు) ఏమయ్యా! ముంతపోయిన లోకము మునిఁగినట్లు వాపోయెదవు? అదిపోయిన మఱియొకటి యాయెను. ఏదైననేమి? ముంతలకుఁ గఱవా? ఆ ముంత తప్ప వేఱుముంత పనికిరాదా?

బ్రా : రాజపుత్రివి రాజభార్యవు నీ పరువునకుఁ దగినట్లు మాటలాడెద వనుకొంటినిగాని వాడవదినెవలె, వేశ్యవలె భాషింతువని తలఁచినవాఁడను గాను. నీవు శీలమన నెట్టిదో యెఱిఁగినదానవుగాఁ దోఁపవు. నీవు పతివ్రతయును గావు. భార్యభర్తకును, భర్త భార్యకును దప్పఁ దన మర్మస్థలము

ఎవ్వరికైనc జూపవచ్చునా? ఇది వివాహమైనవారి విషయము. నేను బ్రహ్మచారిని. కావున నొక ముంతమాత్రమే నా మర్మస్థలము చూచునట్లేర్పాటు చేసికొని యుంటిని. గోప్యాంగములని యేల పేరు వచ్చెనో యెన్నcడు నీ వాలోచించిన దానవు గావు. వస్త్రముల ధరించుట సిగ్గునకా? సింగారమునకా? సింగారమున కందువేని తినc బిండములేని యెంతటి పేదవారైనను స్త్రీలైనను బురుషులైనను జేనెడు గుడ్డయైన నేల మొలను ధరింతురు? గుడ్డ లెట్టివో యెఱుcగని యడవిమనుష్య లాకు లేల నడుము చుట్టు కట్టుకొనియెదరు? ఆ స్థలముపై నెండయైన సోcకరాదని కదా సూర్యచంద్రుల కభిముఖముగా మలమూత్రోత్సర్జనము చేయరాదని శాస్త్రములు చెప్పుచున్నవి. సంగమకాలమున దీపకాంతియు నుండరాదని యేల శాస్త్రము విధించుచున్నది? వానికిc జేయురక్షణము దేహమునc బ్రధానమైన శిరస్సునకును, నింద్రియములc బ్రధానమైన నేత్రములకుc జేయుచున్నారమా? ౪-౫ సంవత్సరముల ప్రాయము మొదలు బాలురకు గోcచులు, బాలికలకుc బావడ లేల కట్టెదరు? నవరంధ్రములలో నది యొక రంధ్రమని మాత్రము నీ వెఱుcగుదువు కాcబోలు. అన్ని యవయవముల వంటివేయైనచోc దక్కినవానిని బహిరంగముగ విడిచినట్టు లేల వానిని విడువరు? జుట్టు బొట్టు పుట్టము విడిచిన సన్న్యాసులును బైటలువిడిచి తిరుగు స్త్రీలును గట్టు పుట్టము లేల విడువరు? మొలకొకతుండైనc జుట్టుకొందురుగదా. కన్ను కాలు లేనివారిని జూచి మనుష్యు

లయ్యో పాపమందురుగాని యా యంగబలము లేని మాచకమ్మలను షండులను జనులు చులకనగఁ జూచుటలేదా? అన్ని రంధ్రములవంటి దది యైనచో నందఱు స్త్రీలవంటిదానవు నీవు కావా? నీ వేల యంతఃపురములో ముసుఁగులు కప్పికొని యుండెదవు? నలువురితోపాటు నీ వేల వీధులఁ దిరుగరాదు? నీకీ పూజ్యతయేల? ఇది మనుష్యకల్పితమందువా? ఆవులు నెద్దులు మొదలైన జంతువులకుఁ దోఁకలే మఱుగు ప్రదేశమును దాఁచుచున్నవో యాలోచింపుము. మగపశు వులకుఁ గానరానిచోట వెనుకటి రెండుకాళ్ళనడుమ నేల యని యుంపఁబడినవో యోజింపుము. పక్షులందును నీ భాగములు వెండ్రుకలచేఁ గప్పఁబడుట యెఱుఁగవా? వృక్ష బీజములందును నివి యెంత గూఢప్రదేశములఁ దోఁపఁబడినవో నీవేమి యెఱుఁగుదువు? ఇవన్నియు నాలోచించినచో మర్మాంగములు గోప్యములనియు సంతసొరకాయలు కావనియు వేశ్యవలె జారిణులవలె వాని నంగడిఁ బెట్టరాదనియుఁ దెలివిగలవారి కేల తోఁపక పోవును? ఇట్లంగడిఁ బెట్టువారు పడెడు నరకబాధ లెట్టివో మదనపిశా చగ్రస్తు లేమెఱుంగుదురు? ఈ లోకమునందును నిట్టివా రెంతటి నీచాతినీచులుగఁ బరిగణింపఁబడుచున్నారో యెఱుంగవా? వీరికి గౌరవముకలదా? అంకుటాంద్ర బిడ్డల నట్టివారుగాక యితరులు వివాహ మాడుదురా? తన తల్లితోఁగాక వేఱొక పరస్త్రీతో సంభోగించు తండ్రియందుఁ బితృగౌరవ ముంచవలసిన పని లేదనియుఁ బరపురుష సాంగత్యముచేయు భార్యను ఘట శ్రాద్ధము చేసి వదలించు

కొమ్మనియు శాస్త్రములు చెప్పవా? 'అపుత్రస్య గతిర్నాస్తి' 'పుత్రాద్దశగుణం పుత్రీ!' యని శాస్త్రములు ఘోషించుచున్నవి గదా. వీరు వేనివలన జనించుచున్నారు? భూమిమీఁదఁ బుట్టవలసిన జీవులకు నెల వెయ్యది? అపవిత్రస్థలములా జీవాత్మలకు శరణములు. ఇవి యజ్ఞపరికరములుగా శాస్త్రములు చెప్పవా? పెంటి పశువులు రెండుమూఁడు పోతులతోఁ గలియుట లేదా యందువేని నీవు పసరమైనచో నా యుపమానమున కుపమేయము గమ్ము. మర్మాంగములు వీథిఱోళ్ళు, దొమ్మరి డోళ్ళు, మద్దెలకొడుపులు గావు.

రాణి : అయ్యా నీవు చెప్పినదంతయుఁ జేతనముల కన్వయించును. ముంత యచేతనము గదా!

బ్రా : మన చేతనములని తలఁచునవి. యన్నియు సంత స్సంజ్ఞములని వేదములు చెప్పుచున్నవి. నీవు గాఢ సుషుప్తియందున్న నచేతనమగుదువా? రాణీ! నీతో నా కిన్ని మాటలేల? నీ కుపన్యసించుటకు నేను రాలేదు. నీవు నా ముంత పగులఁ గొట్టించుటచే వేఱొక ముంత యాశింపవలసి వచ్చును. నా సిగ్గు దీసితివి. నేనాహారమును గొంటినా మలమూత్రబాధ గలుగును. కావున నిప్పటినుండి నేనాహారమే కొనను. నేనిందే యుండి నీకుఁ బ్రీతిగా నుపవాసములచే దేహము విడిచెదను. కొట్టించినఁ గొట్టింపుము. ఈడ్పించిన నీడ్పింపుము. చంపినఁ జంపుము. ఇప్పుడే యురిపోసికొని ప్రాణము విడుతమనిన నది యాత్మహత్య యగునని మానితి. ఇందే ప్రాయోపవేశము చేసెదనని పరుండెను.

ఆ జాలి కేమియుఁ దోఁపక నిత్రాతివలె నిలఁబడి యిట్టు లాలోచించెను. నేనెంత నీచురాలను. పవిత్రమైన వరాంగమును సత్రము పెట్టితిని. నిమిషసుఖమునకై యుభయలోక భ్రష్టనైతిని. సుఖమా? ఏమిసుఖము? గజ్జి దురద సుఖమా? అయ్యో నేనేదియో చేయఁబోయిన నది యేదో యయ్యెను. సత్యము, సత్యము. పాపకార్యమునకుఁ బాపఫలము గాక పుణ్యఫల మెట్లు వచ్చును? కామాంధముచే స్వైరిణినై చరించి పుట్టిన యింటివారికి మెట్టిన యింటివారికి నపకీర్తి తెచ్చితిని. తల్లిదండ్రులు తోడఁబుట్టువులు పైకి మాటలాడినను వారు నన్ను తుచ్ఛగాఁ జూచుచున్నారు. భర్తయో నా పొత్తు నాఁడు పాఁప పొత్తుగా దలంచుచుండును. మూఁడు వంశములవారిని నరకముపాలు చేసితిని. ఆత్మగౌరవము నెందచనైతిని. కడుపుకూటి నిమిత్తమై నన్నీ పరిచారికలు గౌరవించుచున్నారుగాని వీరికి నాయెడ నిజమైన గౌరవబుద్ధి యెట్లు పుట్టును? వ్యభిచరించి బాగుపడినవా రెవరు? నూర్వురు తమ్ములతోఁ గీచకుఁడు చచ్చెను. రావణవంశమే నిర్మూలమయ్యెను. నహుషుఁడు పాపమయ్యెను. శక్రునకు దేహమెల్ల యోనులై షండుఁడై శత్రువులచేఁ జిక్కి కారాగృహబద్ధుఁడయ్యెను. అహల్యగతి యందఱెఱింగినదియే. ఇట్టి వెన్నియో కలవు. సీత – ద్రౌపది – చంద్రమతి – దమయంతి – మదయంతి – యనసూయ – నాలాయని లోనగు పతివ్రతలు లోకస్తుతి పాత్రలయిరిగాని అంకుటా లొక్కతెయైన గౌరవింపబడునది లేదు. పరమపాపియైన నాకుమాత్ర మన్యథాత్వ మేల కలుగును. హరిహరి! యా పావనజన్మల పేర్లైన నుచ్చరింప నాకు యోగ్యత కలదా? ఈ బ్రాహ్మణుఁడు మరణించెనా బ్రహ్మహత్య దాపరించుట యటుండ నా దురుద్దేశము లోకమున నెట్లైన వ్యాపింపక మానదు. భర్త యేమనును? లోకులేమందురు? తల్లిదండ్రు లేమందురు? ఈ పాపమునకుఁ బ్రాయశ్చిత్త మీ బ్రాహ్మణునకన్న నేను ముందు మరణించుటయే కావున నేనును బ్రాయోపవేశము చేసెదను. నేను మరణించినను నపకీర్తిపోదు. కావున

నొక కార్యము జేసెదను. చేసిన పాపము చెప్పినఁ బోవును. నా యుద్దేశ మున్న దున్నట్టు లీయనతోఁ జెప్పి నన్ను క్షమింపుము. నేనిఁక నిట్టికార్యములు చేయను. "అని బాసచేసెదను. బ్రాహ్మణులకు నుదుగు పిడుగు. మనస్సు వెన్నకావున నేను బాదములపై వ్రాలి శపథము చేసితినేని యేల క్షమింపకపోవును? క్షమింపకపోయెనా రెండుపీనుఁగు లేక కాలమున నీ యిల్లు వెలువడవలసినదే యని తీర్మానించుకొని యా సాహసిక తన పరిచారకుల నెల్ల నావలఁబొమ్మని తన హృదయగతమంతయు నాయన కెఱింగించి "పరమ పాపాత్మురాలిని దీనిని క్షమింపుము. ఇఁక నిట్టి కార్యములఁ దల పెట్టమని మీ పాదములు ముట్టి బాసచేసెదను. నీవు మరణించితివా నాకు మా బంధువులకెల్ల నపఖ్యాతి పాపము శాశ్వతమగును. నీవు మరణించుటే నిజమేని నీ కన్నుల యెదుట నేను ముందాత్మహత్య చేసికొనియైన మరణింతును" అని కంటనీరు కాల్వలై పాఱఁ బాదములవ్రాలి పెక్కు విధములఁ బ్రార్థించెను.

దాని యవగడపుఁ గార్యమునకు రోసి చీకొట్టి దాని వలనఁ గలుగు నష్టకష్టములను వివరించి చెప్పెను. నీచకార్యములను జేయువారి నెంత యధికులనైనను నధములును గర్హింతురుగదా! ఆయనమాట యొక్కొక్కటి నారసమువలె హృదయమున నాట నోటమాట వెడలక పాపభయమున గుండెలు కొట్టుకొనఁ గన్నీరు మున్నీరుగఁ గాఱఁ బాదముల వ్రాలి గట్టిగఁ బట్టుకొని లేవకుండెను. అట్లు కొంతతడవుండిన పిమ్మట అంకాడనేర్చినమ్మ బొంకాడనేర్వదా యన్నట్లు దాని యేడ్పులు వగలేడ్పులు కావనియుఁ, బశ్చాత్తాపముచే జనించినవే యనియు దాని దీనత్వము చేతను. విశ్వరత్వముచేతను, వైవర్ణ్యముచేతను నిశ్చయించుకొని యా బ్రాహ్మణకుమారుండిట్లనియె.

నీవు చేసిన పాపమునకు నీవు చచ్చుటే మేలు. పీడదొలఁగినదని నీ తల్లిదండ్రులు భర్త సంతోషముతో మునిఁగి కృథార్థులగుదురు. వారి

కపకీర్తియుఁ దొలఁగును. మానము మీఁద దృష్టిలేని యాఁడుది గాడిద. మానమునే యంగడిఁ బెట్టిన నీకుఁ బ్రాణమొక లక్ష్యమా? నీ వెంతకైనఁ దెంపరి కత్తెవని యెఱుంగుదు. అయినను నా నిమిత్తముగా నీవు చచ్చుటకు నా మన సొప్పకున్నది. మన యుభయుల మరణముచే నీ దుండగము లోకమున వెల్లడికాక మానదు. బ్రహ్మహత్యకు నీవు కారణమైనను నది నీ భర్తను బీడింపక పోదు. ఈ యపగీర్తి పాపము నాలోచించి ఛీ యిది యేమి బ్రదుకని నీ పెనిమిటి జీవితము మానును. దానివలన ననేకానర్థములు పొసఁగును. నా వ్రతభంగమువలన నేనొకఁడనే పాపభాజినగుదును. నాయొక్కనికై యిన్నికీడులు గలుగఁ జేయరాదు. అయినను నీ విఁక నిట్టి యకార్యముఁ జేయక శీలవతివై యుందునని ప్రమాణము చేసెదవేని వ్రతభంగమైన నోర్చెదనని దానిచేత ఘోర ప్రమాణములఁ జేయించుకొని ప్రాయోపవేశమునుండి లేచెను.

రాణియు మరల బ్రతికినట్లై సంతోషించి విప్రకుమారా! యిది యెవ్వరికిఁ దెలుపకుము. ఇవిగో వీనిని గొనిపొమ్ము. రాణియేల పిలిపించెనని లోకులడిగిరేని దానమిచ్చుటకై యనుము. అని సమస్తపదార్థములను వెండిపళ్ళెరముల నుంచి సేవకుల నాయన యింటికిఁ బంపెను.

మఱునాఁడు నరపాలుఁ డరుదెంచి వృత్తాంత మంతయు విని సంతసించెను.

### 8. నూఱు వినుము, ఒకటి చెప్పుము

ఒకానొక రాజునొద్దకు నొక కమసాలి బత్తుఁడు మూఁడు బంగారు బొమ్మలు తెచ్చి చూపెను. రూపమునందుఁ దూనిక యందుఁ బనియందును మూఁడును సమానములే. ఏమియుఁ దారతమ్యము లేదు. కాని కమసాలి యొకదానివెల యైదువేలు, రెండవదానివెల పదివేలు, మూఁడవదానివెల పదునైదువేలు రూపాయలని చెప్పెను. వెలలయందు భేదమున కేమి

కారణమనిన నది మీరే తెలిసికొనుఁడు. మీరు ప్రభువులరు. గుణాగుణములు మీకుఁ దెలియనివా? యని చెప్పెను.

అప్పుడు రాజు తన యమాత్యునిఁ దిలకించి మంత్రీ! గుణతారతమ్యమును బట్టి మూల్యతారతమ్యమని స్వర్ణకారుఁడు చెప్పుచున్నాఁడు. గుణభేద మెట్టిదియో తెలిసికొని చెప్పుమని యా మూఁడు స్వర్ణవిగ్రహములను నా సచివుని యధీనమున నుంచెను. ఆ మహామాత్యుఁ డావిగ్రహములను దన గృహమునకు నెత్తించుకొనిపోయి యెంతయుఁ బరీక్షించి రహస్యము నెఱింగినవాఁడై మఱునాఁడు వానిని రాజునొద్దకుఁ గొంపోయి యిట్లు వచించెను. నృపాలా! వీని రహస్య మెఱిఁగితిని. ఈ విగ్రహములయందు నీ మొదటిబొమ్మ కుడిచెవిలో నొక పుల్లను దూర్చితిమేని యది యెడమచెవిలోనుండి వెలువడును. రెండవబొమ్మ చెవిలోని రంధ్రములో నుంచిన నోటిలో నుండి బయలువెడలును. మూఁడవ విగ్రహములోని రంధ్రము శిరమునందే నిలిచిపోయెను.

ఈ చెవినిబడిన మాటను ఆ చెవిని వెడలఁ బుచ్చువాని మొదటి విగ్రహము వీని కేది చెప్పినను మనస్సున కెక్కదు. ఏది వినను వెంటనే దానిని వెలిబుచ్చక మాట దాఁచుకొనలేనివానిని దెలుపునది రెండవది. వీని నోటమాట దాఁగదు. వీని కే రహస్యవిషయమును దెలుపరాదు. విన్న విషయమంతయుఁ దనయందే యుంచుకొని రహస్యమును వెలిపఱుపని వానివంటిది. మూఁడవది వీఁడు నూఱు వినుము. ఒకటి చెప్పుము అను లోకోక్తికి గుఱియైనవాఁడు. వీని నమ్మియే రహస్యమైనఁ జెప్పవచ్చును. ఈ మూఁడు నీతులను దెలుపునవి యీ మూఁడు విగ్రహములని చెప్పెను. ఆ భూపాలుఁ డామాట విని సంతోషించి వానివెల యిచ్చి తీసికొనెను. కావున బుద్ధిమంతులు "నూఱువిను ఒకటి చెప్పుము. నూఱు చెప్పుము ఒకటి వ్రాయుము" అను సామెత మఱవరాదు.

*శ్రీ రామార్పణమస్తు*

1. నయజ్ఞుడు = నీతి తెలిసినవాడు

2. హర్మ్యము = మేడ

3. రిత్త = వ్యర్థము

4. శక్రుఁడు = దేవేంద్రుడు

5. ఆత్మజ = కూతురు

6. ఇల్ల = కన్నడంలో ఇల్ల అంటే లేదు.

7. ప్రాయోపవేశము = తానే బలవన్మరణానికి ఆహారాదులను త్యజించి సిద్ధపడడం.

* * *

# ఎనిమిదవ భాగము

## 1. అజామిళోపాఖ్యానము

కన్యాకుబ్జపురమున నొక బ్రాహ్మణ కుమారుఁడు గలఁడు. ఇతఁడు సత్కులీనుఁడు. అధీతవేదశాస్త్రుఁడు. వైదికకర్మ నిష్ఠుఁడు. ఆచారసంపన్నుఁడు. వృద్ధసేవి. సత్యవాది. మంత్రవేత్త. దేవ, పితృగురు భక్తిమంతుఁడు. ఇతఁ డాచారవతి, గుణవతి, రూపవతి, మతిమతి యగు కన్యకను వివాహమాడెను. పంచలకారయుతయైన[1] యా సతియు సాధ్వీగుణంబు మానక భర్తృసేవ సేయుచు, నత్తమామలఁ బరిచరించుచు నిట్టి దాంపత్యము కలదాయని లోకులు మెచ్చఁ గాఁపురము సేయుచుండెను. ఇట్లుండ నతనికి వివేకవనదహనమైన యౌవనము ప్రాప్తించెను. కామ వికారములు సాకారంబు లయ్యెను.

సీ. కడకంట యౌవన గర్భంబు పొడగట్టె
మదిలోన నుద్రేక మదము దొట్టెఁ
గడుమేనఁ గామవికారంబు దలచూపె
ముఖమునఁ జిఱునవ్వు మొలకలెత్తె
నతిపుష్టి నిష్ఠురంబయ్యె దేహంబెల్లఁ
గచభారమున నెఱికప్పు మెఱసెఁ
గటిభారమున నూరుకాండముల్ జిగిమీఱె
బాహుశాఖలు దీర్ఘభంగిఁ దోఁచె

ఆ. నురము విపులమయ్యె నుల్లసద్వరకాంతి
పూరమంగకమునఁ బొందుపడియె
భూరితేజుఁడైన భూసురాన్వయునకు[2]
నభినవైక యౌవనాగమమున

మరందంబునకై యరవిందంబున వ్రాలు మిళింద బృందంబు[3]లో యన నా కుమారుని వదనంబున నూనూఁగు మీసలు భాసురంబు లయ్యె.

అంత సర్వజనస్వాంత కాంతంబగు వసంతంబు ప్రాప్తించె. భూజాతంబుల లతాంతంబు లేకాంతంబయ్యె. కోకిలల వాకు లంకురించె. చిలుకల కలకలం బినుమడించె తుమ్మెదల ఝుంకారంబు తోరంబయ్యె. విరహుల వేదన ఘోరంబయ్యె. అట్టి వసంతంబున నద్ధరామర కుమారుండు జనకాదేశంబున వనప్రదేశంబునకు సమిత్కుశాహరణార్థం బరిగి తిరుగువాఁడు నొకచో దట్టంపుఁ జెట్లనీడల నొక విటుండు స్వైరిణి[4]యగు శూద్రయు మదనకళా చమత్కారంబులు నెఱపుచు నొకరి భుజంబులపై నొకరు చేతులువైచి పద్దులు పలుకుచు ముద్దులు గులుకుచు ముద్దులు గొనుచు నేవేయియో పలుకుచు నేమేమియో గావించుచుండిరి. వారిని జూచినంతన బ్రాహ్మణకుమారుని హృదయ హసంతి[5]యందుఁ గుములుచున్న మదనాలంబు భగ్గున రేఁగి మండఁజొచ్చె. దాని పొగచేతనో యనఁ గామాంధకారంబు కనులఁ గప్పెను. ఆ తాపజ్వరము చేతనో యన మనస్సు వికలమయ్యెను. ఇఁక వీఁడు మనల నాదరింపఁడని కాఁబోలుఁ జేనున్న కుశలు, సమిధలు నెందో తమంత రాలిపోయెను.

ఇట్టి దుర్దశాపన్నుఁడై యా చిన్నవాఁడు గృహంబుఁ జేరి తన యిల్లాలిని బరుండఁ బిలిచెను. ఆ మగనాలు రహస్యముగ నిదియేమి వేళగాని వేళ యిట్టు పిలిచెదరు? పట్టపగ లిట్టికార్యము చేయవచ్చునా? నేనేమి వేశ్యనా? అత్తగారు మామగారు వచ్చుచుఁ బోవుచుందురు. ఏదైనఁ బనికై పిలుతురు. వారెఱిఁగిన బోగము కాఁపురమనరా? ఇట్టి కార్యములకుఁ బగలు నిషిద్ధమని మీ రెఱుఁగరా? అనుచుండులోపల నత్తగారి పిలుపు వినరాఁగా నబ్బాలిక వెడలిపోయెను.

నసగూఁడి నసరున నష్టవివేకుఁడైన యా బ్రాహ్మణుఁడు శాస్త్రములఁ దాను జదివిన చదువు పెన్నలోఁ గలిపి కామోన్మాదంబున నిట్లు ప్రలాపింపఁ దొడఁగెను.

ఆహా యేమి యిల్లాలు! ఏమినీతి! ఏమి యాచారము! తాను మగనాలcట. వేశ్యగాదcట. పగలcట పెద్దలు వత్తురcట అక్కఱకాcదుకొనని యిల్లాలుండిన నేమి లేకుండిన నేమి? కామోపభోగమున కుపకరింపని భార్య భార్యయా? వివాహము చేసికొనుట యేల? ఇష్టము వచ్చినట్లు సుఖించుటకుc గాదా? అటుకాదేని వివాహశ్రాద్ధము మానుటేమేలు. వివాహమని చేసికొనిన నెన్ని నిర్బంధములు. దశములcట యేకాదశు లcట ద్వాదశులcట యామావాస్యలcట పున్నమలcట నిషిద్ధ వారములcట నిషిద్ధ తిథులcట, వ్రతములcట వారి తాత శ్రాద్ధములcట. అనృతుకాలమcట. శాస్త్రకారులు షండులో సన్న్యాసులో ముసలి ముండకొడుకులో కాకున్న నిట్లు వ్రాయుదురా. ఇట్లుచూచిన ౩౬౦ దినములలో ౩౦౦ దినములు వ్యర్థముగc బోవుచున్నవి. ఇరువది సంవత్సరముల వయఃపరిమాణములో నలువది నెలలు భోగార్హకాలముగ నేర్పడును. ప్రాయమందే చచ్చినను వృద్ధై జీవించినను భోగాశలేదు కదా. వెన్నెలయందే కదా యెల్లో నేరేళ్ళు చీcకటియందేమి కలదు. ప్రాయ ముడివోయెనా యావల నేమిభోగము? ఈ కాలమైన నెట్లు వినియోగింపcబడునో చూతము. పంచ పంచోషః కాలమున నిద్దురలేచి రాత్రి జామున్నఱ వఱకు గృహకృత్యములు చేసి చేసి యలసి యప్పుడిల్లాండ్రు పడుకటిల్లని యొకటి యుండిన దానిలోనికి వత్తురు అది లేనివారు వంట యింటిలోనే పెరటిలోనో పిడుcదులతోడి పసలకొట్టములోనో చాcప మీcదనో నల్లుల నులకమంచము మీcదనో పరుండుదురు. ఇల్లాలు శయన మలంకరింప వచ్చునప్పటికి మగcడు గాఢనిద్రయం దుండును. అప్పటికైన నత్తగారను గ్రహించినc గదా. అత్తగారు మేలుకొనియుండc గోడలు పండుకోc బోరాదcట. కొంద ఱత్తముండలు దొంగనిద్ర పోయినట్లేపోయి కోడలు పండుకోcబోcగానే పేరుపెట్టి గట్టిగ బిలుచును "నప్పుడే పడుకొనcబోయితివా? ఏమి స్వాతంత్ర్యము ఏమి మదము! అని మూరు నాcడెత్తికొని పోవc గేకలు

వైచుచు మఱునాడు ఇంటింట నయ్యో నా కోడలా గూఁటిలో దివ్వె నోటిలోఁ గడి. ఎప్పుడును మగని ప్రక్కవిడువదు. ఇవి దానికి బాగుగఁ దెలియును. తెల్లవాఱుదాఁక గుసగుసలు నసనసలు వానిని నిద్దుర పోనిచ్చిననా? దీనికి భయపడి వాఁడు సగమైనాఁడమ్మా యని చెప్పుచుందురు. తలదువ్వుకొని పూలు పెట్టుకొనెనా బోగముసొగసు. మంచి చీరకట్టుకొని పడుకటింటికిఁ బోయెనా యది మగనికిఁ గాఁపురము చేయునది కాదు. మగఁడు భార్యతో మంచి మాటలాడెనా వానిపాత నేదోయుంట వేసినది" అని యీప్రకారము అత్తలు దాంపత్య సుఖమును నాశముచేయు మిత్తుఁలగుదురు. కావుననే కదా యేకాదశియు నత్తలు నొకటియని పూర్వులిట్లు చెప్పిరి.

**శా. తామై పూలు ధరింప నీదు. మఱిగంధం బెంచఁగా నీదు, బల్**
**నేమంబొత్త భుజింపనీదు, పగయౌ నిద్రావిహారాదులున్**
**బ్రేమం బూరుష సంగమోర్వదు సుమీ వీటికథల్ సైఁచునే**
**యేమే కోడల! నన్నుఁ దిట్టెదవ? లేదే యత్త! యేకాదశిన్.**

ఇట్లొక కోడలేకాదశి నెపమున నత్తను నిందించెను.

అంత ప్రొద్దుపోయి చెమటకంపుతో మాసిన చీరతో వచ్చి పరుండినను మగఁడు దాఁకబోయినఁ దాళుదురు అబ్బా! కాలుసేతులు పీఁకుచున్నవనును దానిలోఁ గోపాలుతాపాలు. ఇల్లాలొల్లక యఱువదియేండ్లు మగఁడొల్లక ముప్పదియేండ్లు బాలప్రాయము పదియేండ్లు సరిపోవును. ఏమి యిల్లాలు! ఏమిసుఖము!! స్వేచ్ఛానుసారము సుఖపడని జన్మము జన్మమా యని యా మతిహీనుఁడు దలఁచి ప్రారబ్ధము కట్టిపట్టి యీడ్వ భ్రష్టన్యకావాగతి యనుటకు లక్ష్యభూతుఁడై కండమెండుగఁగల యొక బోగముదానిని దగులుకొని యిచ్చకొలఁది దానితోఁ గ్రీడించుచు నింటిని నిల్లాలిని దల్లిదండ్రుల వదలి దానియింటనే యుండుచు నిల్లుకూలార్చి పితృధనము దాని పాలుసేసి క్రమక్రమముగ

దాని చేతనే తినుచుఁ దొలుత మద్యమాంసముల దానికిఁ దెచ్చియిచ్చుచుఁ బిదపఁ దాను వానిని జవిగొనుచు వానికై చేయరాని హింసాద్యకార్యంబులఁ జేయుచు ధనార్థియై జూదమాడుచు దుర్వాదంబుల నారితేఱి కష్టుఁడు భ్రష్టుఁడు నష్టకుల శీలాచారుఁడై యూరు నాడురోయ హేయపు బ్రదుకు బ్రదుకుచుండెను.

ఇట్లుండ నతనికిఁ బదుగురు బిడ్డలా శూద్రయందు జన్మించిరి. అందుఁ గడపటి కొడుకుపేరు నారాయణుఁడు. శూద్రస్త్రీ యందు బిడ్డలఁగన్న బ్రాహ్మణుఁడు శూద్రుఁడే యగును. శూద్రునివలన బిడ్డలఁగన్న బ్రాహ్మణస్త్రీకిని బిడ్డలకును జండాలత్వము ప్రాప్తించును. ఈ విధముగ నతని భ్రష్టత్వము పారము ముట్టెను. ఉత్తముఁడు చెడిన భ్రష్టతముఁడే యగును. వానివలె మఱి యెవ్వరును జెడఁజాలరు. బ్రాహ్మణుఁడు పాపకార్యములకుఁ బూనినచో వాఁడు చేయునంతటి ఘోరపాపములను జాతిచండాలుఁడును జేయ సాహసింపఁడు కావుననే కర్మచండాలునికన్న జాతి చండాలుఁడే శ్రేష్ఠుఁడు జాతి చండాలు విశ్వసింప నగునుగాని కర్మచండాలు విశ్వసింపరాదు.

ఇట్లుండ నా పతితునకు నెండకాలపుఁ జెలమ నీటివలె వయస్సు క్షీణించెను. పాపబీజము మొలకెత్తెనో యన వార్ధక మంకురించెను. కామాంధకార మడఁగెనోయన నల్లని వెంద్రుకలు తెల్లనయ్యెను. మదన మదంబు సదమదంబైనట్టు లంగములు సడలి ముడుతలుపడి వ్రేలాడఁజొచ్చెను. భోజనసౌఖ్యము తోడ దంతములు రాలిపోయెను. ఇహలోక దృష్టి మాను మన్నట్లు కన్నులఁ బొరలు గప్పెను. ఇంద్రియ వాంఛలు చాలునన్నట్లు తల వడఁకఁజొచ్చెను. చేసిన పాపములకు దండమే గతియన్నట్లు చేతికి దండము వచ్చెను. పరమపాపిని మీర లీ పాపిదేహమున నిఁక నుండరాదని వెడలిపోవ వెలికి బ్రాణవాయువులఁ ద్రోయుచున్నదో యన్నట్లు వగర్పు దగ్గు ప్రబలెను. ఎట్టి కలుషాత్మకులకును దుదకు

నారాయణుండే గతియన్నట్లు చీటికి మాటికిఁ బుత్రభ్రాంతిచే నారాయణా యని వాఁడు కొడుకును బిలుచుచు నుండెను. ఈ విధముగ నతఁ డెనుబదియెనిమిది వర్షంబులు జీవించెను. పాపి చిరాయువుగదా. క్రమక్రమముగ మంచమెక్కెను. అట్లుండియు పుత్రవాత్సల్యాతిశయముచే నతని విడిచియుండఁజాలకు యెడపాదడపా నారాయణా యని పిలుచుచు లాలించుచు ముద్దు లిడుచుండెను. ఫలమునకుఁ బతన భయమువలె భూతకోటికి మరణ మనివార్యము కదా.

వాని కంత్యకాలము ప్రాప్తించెను. దేహి తల్లిగర్భము నుండి వెడలివచ్చునపుడును మరణకాలమునందును వెయ్యి తేళ్ళు కుట్టినంత బాధపడును. దీనినే మరణసంకట మందురు. పాపాత్ములయం దిది దుస్సహమై యుండును. ఈ సమయమున నీ లోకజ్ఞానము దృష్టి తప్పును. వాఁడువాఁడు పుట్టినది మొదలు చేసిన పుణ్య పాపకార్యము లన్నియు బొమ్మలాట యందువలె స్పష్టముగ నెదుట గోచరించును. పాపాత్ములగు వారు వానిని జూచి తమ పాపకృత్యములకు భయపడి మలమూత్రంబుల విడుతురు. అట్టి గతి యీ భ్రష్ట బ్రాహ్మణునికిఁ దటస్థించెను. అట్టి దశయందుఁ గాకిమేనులు, దిసమొలలు, నెఱ్ఱని మిడిగ్రుడ్లు, నిడివికోఱలు. జుంజుఱు నిట్ట వెంట్రుకలు వికారపు ముఖములు, లావు పెదవులు, బాకులవంటి గోళ్ళు, కోఱమీసములు గల యమదూతలు దంతము, పాశము కశలు[6] ధరించి పండ్లు పటపట కొఱుకుచు భయదభాషణము లాడుచు వచ్చి యతని ప్రక్క నిలిచి యతని దేహమునుండి యంగుష్ఠమాత్ర పురుషునిఁ బాశములచే వెలికి లాగఁజొచ్చిరి. అప్పుడు వాఁడు బెగ్గడిల్లి తత్తఱపోయి మేను వణఁకఁ గొడుకును దలఁచుకొని నారాయణా నారాయణా నారాయణా యని యఱచెను.

నారాయణా యని వాఁడఱువఁగానే యాజానుదీర్ఘ బాహువులును, గమలదళ విశాల లోచనులు, దరహాస సుందర వదనారవిందులును

గ్రైవేయహార కేయూర కటక కిరీటశోభితులును శంఖచక్రాలంకృత హస్తులును బీతకౌశేయ వాసులును నగు దివ్యపురుషులు విష్ణుపార్శ్వచరు లరుదెంచి యమకింకరుల నదలించి, జీవుని కట్లు తొలఁగించి యమకింకరులంగని యిట్లనిరి. ఎవ్వరు మీరు? వీనినేల కట్టితిరి? ఎక్కడికిఁ గొంపోయెదరు? వీని నేమి చేయఁదలఁచితిరి? అని యడిగినఁ దత్తేజోజాతపురాభూతులైన దండధరికింకరు లిట్లనిరి. మేము యమునిదూతలము. ఆయన యాజ్ఞచొప్పున నాయువుతీఱిన పాపుల సంయమనీ పురంబునకుఁ గొంపోవుచుందుము. ప్రేతలను యముఁడు విధించిన శిక్షలకుఁ బాలుపఱుతుము. వీని చరిత్రము మహాఘోరము. వీఁడు పరమపాపి. దుర్లబంబైన బ్రాహ్మణవంశంబున జనించెను. అది దుర్లభం బెట్లందు రేని ఈ లోకంబున జీవుండు తొలుతఁ గఠినపాషాణ దేహుండై యాసనాది రూపంబులఁ బుణ్యాత్ముల కుపగరించి తత్సుకృతి విశేషంబున నందుత్తమోత్తమ రత్నాదిరూపంబు వహించు, అప్పుడు దానింబుణ్య స్త్రీపురుషులు స్పృశింప ధరింప దేవతాద్యలంకరణంబుల నుపయోగింపను నైన పుణ్యంబునఁ దృణాది జన్మంబుగాంచి పశ్వాదుల కాహారంబై యా సుకృతవిశేషంబునఁ బరిణామక్రమంబున నుత్తమోత్తమ ఫలవృక్షంబై ఛాయాఫలాది దానంబులనైన పుణ్యంబునఁ దిర్యక్కుల జనించి యం దార్జించిన సుకృతంబులచేఁ గాలక్రమంబున మనుష్యులయందు నధమాధమ జన్మంబెత్తి యం దనేక జన్మంబుల కవల నధమచండాలుండై జనించు అనేక జన్మంబుల కవల నధమచండాలుం దుత్తమ చండాలుండై వేయి సంవత్సరము లుండిన యనంతరమున నధమ శూద్రుండై యావల నుత్తమశూద్రుండగు. ఇట్లు శూద్రత్వంబున ముప్పది వేల సంవత్సరములు చన నవల వైశ్యుఁడై జన్మించు. అంతకు నఱువది మడుఁగుల దీర్ఘంబైన కాలంబున వైశ్యుండు క్షత్రియుండగు. అంతకు నఱువదంతలు విడివియైన కాలంబున క్షత్రియుండు పతితుఁడైన బ్రాహ్మణబ్రువుండగు. అంతకు రెండు నూర్లు మడుంగులు దీర్ఘంబైనకాలంబున నాయధమ బ్రాహ్మణుండు

శస్త్రవృత్తి జీవించు బ్రాహ్మణుండగు. అంతకు మూన్నూఱేండ్లు నిడుపైన కాలంబున నా బ్రాహ్మణుండు గాయత్ర్యాది మంత్రంబుల నుచ్చరింప యోగ్యుండైన బ్రాహ్మణుండగు. ఇంతకు నాల్గునూర్ల సంవత్సరముల దీర్ఘంబైన కాలంబున నతండు వేదాధ్యయన సంపన్నుఁడైన బ్రాహ్మణుండగు. ఇప్పుడును వీని రాగద్వేషములు సుఖదుఃఖములు కామ క్రోధలోభములు పీడించు. వానిని వీఁడు జయించె నేని పరమపదంబు ప్రాప్తించు. అవి వీనిని జయించెనేని చెట్టు కొనకొమ్మనుండి నేలఁగూలువానివలె నధమగతుల పాలఁబడును. వీనిగతి యిట్టిద. శూద్రస్త్రీయందు సంతానంబుఁగాంచి యితఁడీ జన్మమందే శూద్రస్త్రీయందు సంతానంబుఁగాంచి యితఁడీ జన్మమందే శూద్రుఁడయ్యెను. కామదాసుఁడై వీఁడుచేసిన పాపములన్ని యిన్ని కావు. నిష్కారణముగ వీఁడు వీడుటచే వీని భార్యయుఁ తల్లిదండ్రులు కార్చినకన్నీరుమున్నీరులై యున్నవి.

వీనిని యాతనాశరీరంబునఁ బ్రవేశపెట్టి మెడకుఁ బాశముగట్టి యత్యల్పకాలములో యముని సన్నిధానమున నిలుపుదుము. ఆయన యాజ్ఞచే మరల వీనిని గొనివత్తుము. వీఁడు మరల దేహములోఁ బ్రవేశింపఁ జూచునుగాని మేము మరలఁ బ్రవేశింపనీక త్రాళ్ళగట్టి పట్టుకొనియుందుము. ఆఁకలి చేతను దప్పిచేతను నా కొంప కూలిపోయెనో నా యొడలు మండిపోయెనో యని యేడ్చుచుండును. పాపాత్ముల బిడ్డలు పిండములు పెట్టి నీళ్ళు విడుతురుగాని ఇవి తిని త్రాగినను బాపాత్ములకుఁ దృప్తి కలుగదు. కొడుకులు చేయు దానము శ్రాద్ధము జలాంజలి యివి పాపిని నుద్ధరింపఁజాలవు. కావున వానికి నాఁకటి దప్పులు శమింపవు. ఆ నీళ్ళుకూడ విడువక పోయిరా కల్పాంతమువఱకు నిర్జనారణ్యములో బహు దుఃఖపీడితుఁ డగుచుండును. నూఱుకోట్ల కల్పములైనను జేసిన పాపమనుభవింపక తప్పదు. యమయాతన ననుభవింపక మరల మనుష్య దేహము రాదు. ప్రతి దినము పుత్రులిచ్చు పిండములు నాలుగు భాగములు చేయఁబడును. అందు రెండు మరల దేహసృష్టికిఁ గారణము లగును.

ఒకటి కావలి యున్న యమకింకరులకు నగును. ఒకటి ప్రేతము తినును. ఈ విధముగఁ దొమ్మిది రాత్రులు పగలు దిను పిండముచే నూతన దేహము లభించును. పదియవ దినమున పూర్ణదేహుఁడై బలముగలవాఁడగును. మొదటినాఁటి పిండమువలన శిరస్సేర్పడును. రెండవ నాఁటి పిండమువలన మెడలు, భుజములు నేర్పడును. నాలుగవనాఁడు వీఁపు ఐదవనాఁడు నాభి, ఆఱవనాఁడు పిఱుఁదులు మర్మాంగములు, ఏడవనాఁడు తొడలు, ఎనిమిదవనాఁడు మోకాళ్ళు తొమ్మిదవనాఁడు పాదములు, పదవనాఁడాకలి దప్పులు, పిండముల వలనఁ గలిగిన దేహము నాశ్రయించి జీవుఁడు పదునొకండు పదిరెండవదినముల నాఁకలిదప్పులచే నావురావురని భుజించును. పదుమూఁడవనాఁడు మరల యమకింకరులు వానిని బగ్గములఁ గట్టి యీడ్చుకొని పోదురు.

ఇచ్చటికి యమపురి వైతరణి[7]గాక యెనుబదియాఱువేల యోజనముల దూరమందున్నది. ఈ జీవుని యాతనా శరీరంబునఁ బ్రవేశపెట్టి యమకింకరులు దినమున కిన్నూటనలువది యేడు యోజనముల వంతున రేయిపగులనక యీడ్చికొనిపోదురు. ప్రయాణము మిగుల ఘోరము. త్రోవయందు నిలువ నీడ త్రాగ నీళ్ళు దొరకవు. ఆహార పదార్థములును లేవు. ప్రలయమందువలె ద్వాదశ సూర్యు లేకకాలమునఁ గాసినంత వేఁడిమికలదు. ఒకచో వడవడ వడకించు జిల్లుమను చల్లగాలి వీచుచుండును. వేఱొకచోట ముండ్లు ఱాలు దేహమును జీల్చుచుండును. ఈ త్రోవలోఁ బాపాత్ములను దేళ్ళు మహా విషసర్పములు భయంకరములైన పులులు పీఁకుచుండఁగా నిప్పులలో నీళ్ళలో వేసి కింకరు లీడ్చుకొని పోదురు.

ఈ త్రోవలో నొకచోట రెండునూర్ల యోజనముల నిడివి వెడలుపు గల యసిపత్ర వనము గలదు. అందలి చెట్ల యాకులు కత్తులవలె నుండును. ఇవి గాకులు – గ్రద్దలు – డేగలు – గూబలు – తేనెటీగలు –

దోమలు వీనిచే నిండి యీ పాపాత్ముని బాధించును. ఒకచోటఁ గారుచిచ్చులు మండుచుండును. వాని ఆకులు వీని దేహము పనసకాయ కుందినట్లగును. యతనాశరీరమగుటచే బాధ తెలియునుగాని శరీరమునకు హానిలేదు. ఒకచోట సంధకూపమునఁ బర్వతాగ్రమునుండి దబాలునఁ బడఁద్రోయుదుము. మంగల కత్తుల మీఁదను నీటెలమీఁదను వేసి యీడ్తుము. ఒకచోట నీళ్ళలో నొకచోట బురదలో వాఁడుపడును. అప్పుడు జలగలుపట్టి కఱచును. ఒక్కొకచోట మండెడు యిసుకలోఁ గ్రాఁగిన పెనములమీఁద, నిప్పుల కుప్పలమీఁద వేసి యీడ్తుము. ఒకచోట జీవిపై నెత్తురు-నిప్పులు ఱాలు పిడుగులు వర్షముగఁ గురియును.

ఇట్లు పోవఁబోవ వైతరణియ నెడు నిప్పులనది యడ్డము వచ్చును. పాపాత్ముఁడు వచ్చుట చూడఁగనే యా నది నిప్పులు మంటలు గ్రక్కుచు సలసల క్రాఁగెడి చమురువలెఁ బొంగి, చూడ భయంకరమై యుండును. పాపాత్ములను దీనిలోవైచి యీడ్వఁగా నందున్న మొసళ్ళు-చేఁపలు-తాఁబేళ్ళు-జలగలుపట్టి పీఁకఁగా నయ్యోయయ్యయ్యో యని జీవులేడ్చు చుందురు. ఆ యేటిలో నురువులతోఁ గ్రాఁగిన నెత్తురు పాఱుచుండును. ఆ జీవి సహింపరాని యాఁకలి దప్పులచేఁ దత్తఱలాడుచు జీవముతోడి యా నెత్తుటినే త్రాగును. ఇందుఁ దేళ్లు పాపములు నుండును. పాపాత్ము లీ భయంకరనదిని జూడఁగానే మూర్ఛపోదురు.

ఇట్లీడ్చుకొని పోవుచుండ నా దురాత్ముఁడయ్యయ్యో, నా పెండ్లామా! నా బిడ్డలారా! అని యేడ్చుచుఁ దాను జేసిన పాపములు జ్ఞప్తికి రాఁగా నయ్యో పుణ్యము సేయనెత్తినే పాపము చేసితినే అయ్యో యెంతో పుణ్యముచేసి సంపాదించిన మనుష్యజన్మమును వ్యర్థముచేసితినే. నేనెవరి కేమిమేలు చేసితిని? దానములు చేసితినా? హెూమములు చేసితినా? తోఁటలు తోఁపులు వేసితినా? తపము చేసితినా? జపము చేసితినా? దేవసేవ చేసితినా? యాత్రలు పోయితినా? ఓయి జీవా! తరించుట కుపాయమేదియుఁ జేయవైతివి కదా.

పెద్దలసేవ చేసితివా? తీర్థముల మునిఁగితివా? సజ్జన సాంగత్యము చేసితివా? పరోపకార మేమైనఁ జేసితివా? ఓయి జీవా! తరించుట కుపాయమేదియుఁ జేయవైతివి కదా.

నీళ్ళులేనిచోటఁ బశువులకుఁ బక్షులకు మనుష్యుల కుపయోగపడఁ జెఱువులు కట్టించితివా? బావులు త్రవ్వించితివా? చలిపందిళ్లైనఁ బెట్టించితివా జీవా? తరించుట కేమి పుణ్యము చేసితివి? గోవులకు గ్రాసమిచ్చితివా? పురాణములవింటివా? శాస్త్రరీతి నడచితివా? పుణ్యులకుఁ గొంచెమైన సహాయపడితివా? పెద్దలకు మ్రొక్కితివా? సాధువుల నాదరించితివా? తరించు నుపాయ మేదియుఁ జేయవైతివికదా. అయ్యో! యెన్నరాని యెన్నెన్ని పాపములు చేసితివి. పరస్త్రీల గామించితివి. నమ్మినవారిని మోసగించితివి. అసత్యము లాడితివి. దేహమును బెంప మాంసమునకై యేకారితివి. పరు ధనముల దొంగిలించితివి. పరుల వంచన చేసితివి. తల్లిదండ్రుల ధిక్కరించితివి. కట్టుకొన్న భార్యను విడిచి జారుఁడవైతివి. ధర్మహాను లెన్నియో చేసితివని జీవు నుద్దేశించి పురుష లేడ్చుచుండ స్త్రీలయ్యయ్యో కండకావరమున మగనినే వంచించితినే. పరపురుషులఁ గామించితినే. మగని ధనము లపహరించితినే. మగనిని ధిక్కరించితినే. బంతిలోఁ బక్షపాతము వహించితినే. అతిథు లింటికి వచ్చిన లోభముచేతను మదము చేతను నాదరించి మంచినీళ్లైను నీయనైతినే. ఉపవాస ముండనైతినే. వ్రతానుష్ఠానములు మానితినే. నేను జేయని పాప మేదికలను అని యేడ్చుచుఁ బోవుచుందురు.

ఇట్లాప్రేతములు వాయువేగముతోఁ బయనించి పదునెనిమిదవ దివసంబున రమ్యంబైన సౌమ్యంబను పురంబు చేరుదురు. అందు బుష్పభద్రానదియు, బ్రియదర్శనంబైన మఱ్ఱిచెట్టును గలవు. అందు వారు కింకరులతోడ విశ్రమింతురు. అందు విశ్రమించి ప్రేతములు తమ పెండ్లాము బిడ్డలను భూమి పుత్రులను నిల్లువాకిలిని ధనమును దలఁచుకొని తలఁచుకొని తాము పడిన సౌఖ్యముల నెంచి యెంచి హెూరని యేడ్తురు.

అప్పుడు కింకరులు వారిని జూచి పాపజీవులారా! యిప్పు డేచ్చిన నేమిఫలము? భూలోకము కర్మభూమి. ఇది ఫలభూమి. అక్కడ మీరు చేసిన కర్మములకు ఫలమిచ్చుట ననుభవింతురు. దారపుత్రాదులు ఋణప్రాప్తులనుట మఱచి నా పెండ్లాము నా బిడ్డలని కట్టుకొని కౌఁగిలించుకొని ప్రక్కఁబైన వేసికొని వారే తారకమని యదే స్వర్గమని యుంటిరే. వారందఱేరీ? పొయ్యి క్రిందను, దొంతికుండలలోను, బారి గుంతలలోను నినుపపెట్టెలలోను బూడ్చిన దాఁచిన ధనమేదీ? దారినడచువారికిఁ దాము కూడఁదెచ్చుకొన్న బత్తెమే బలము కదా. ఈ ప్రయాణమునకుఁ గాను మీరేమి బత్తెము తెచ్చుకొంటిరి? ఇచ్చటఁ గ్రయవిక్రయములు నక్కటక్కులు వంచనలు, నాలుకతీపులు దబ్బఱలు చెల్లవు. ఈ మార్గ మిట్టిదని బాలురుకూడ నెఱుంగుదురే మీ రెఱుఁగరా? ఎఱుఁగ కేమి? పురాణముల వినలేదా, పెద్దలు చెప్పలేదా. అన్ని పాపములు తెలిసి తెలిసి చేసితిరి. అప్పుడు నవ్వుచుఁ జేసిన వాని ఫలమిప్పు డేడ్చుచు ననుభవింపవలయును. తాము చేసిన పుణ్య పాపములు మాత్రము వెంటవచ్చును గాని మఱి యేమియురావని వారి నదలించి యఱవకుండఁ గొట్టుదుము. ఇచ్చట ప్రీతితోనో కృపతోనో కొడుకులో, మనమలో, మిత్రులో, కృపగలవారో మాసికమునాఁడు పెట్టిన పిండము లీపురంబున నున్న వేళఁ బ్రేతములు తిందురు. ఎవరు పెట్టకపోయిరా వస్తుపోదురు. అచ్చటినుండి యమకింకరులు ప్రేతములఁ దన్నుచు నీడ్చుకొని సౌరిపురంబుఁ జేరుదురు. అచ్చట మృత్యువువలె భయంకరాకారుఁడైన జంగముఁ డను రాజును జూచి ప్రేతములు చేష్టలెల్ల మానును. త్రైపక్షికము నాఁ డియ్యఁబడుపిండమును, నీళ్ళను బ్రేతము లిచ్చటఁగొనును. ఇట్టులే నెలకొక పురమువంతున వారు నాగేంద్రభవనము, శైలాగమము, క్రౌంచము, క్రూరపురము, చిత్రభవనముఁ జేరుదురు. దానిని యముని తమ్ముఁడు విచిత్రుఁడనువాఁడు పాలించును. ఆమహాకాయునిఁ జూడఁగనే ప్రేతములు భయపడి పరుగెత్తును. ఆవల వైతరణి సమీపింపఁగాఁ గొందఱు

పడవవాండ్రు వచ్చి యో జీవులారా! మీకై పడవలు తెచ్చితిమి. మీ రిట్టి పుణ్యము చేసియుండిన నీ యోడలోఁ గూర్చుండుఁడు. వితరణ మనఁగా దానము. వితరణముచేఁ దరింప సాధ్యమగునది వైతరణి. మీరొక గోవునైన దానము చేసియుండిన నిందుఁ గూర్చుండుఁడందురు. దానములు చేసినవారందుఁ గూర్చుండి వైతరణి దాఁటుదురు. తక్కినవారి పెదవులకు ముండ్లు గ్రుచ్చి త్రాడుగట్టి గాలమునకుఁ దగులుకొనిన చేఁపనీడ్చునట్లు జీవుల నా యేటిలో వేసి యీచ్చుచుఁ గింకరు లాకాశమార్గంబునఁబోదురు. ఆవల నానాక్రందము, సుతప్తభవనము, పయోవర్షణమందు నాబ్దికపిండములఁ దిందురు. సంవత్సరాంతంబున శీతాధ్యాయమను పురంబు జేరుదురు. అందు హిమాలయము నందలి చలికన్న నూఱంత లెక్కువ చలి బాధించును. అప్పుడు చలి యాఁకలి బాధింపఁగాఁ దమ్ము రక్షింప బంధువు లెవ్వరు లేరా యని జీవులు నలుదిక్కులు చూతురు. మీ రేపుణ్యము చేసితిరని భటులడుగుదురు. సంవత్సరాంతమున యమపురి సమీపించి బహుభీతియను పురంబుఁజేరి హస్తప్రమాణమైన దేహము నచ్చట వారు వదలుదురు. అంగుష్ఠమాత్రపు యతనాదేహముతోఁ గర్మఫలానుభవమునకై కింకరులతోడ జీవులు యమునిసన్నిధికిఁ బోదురు. బహుభీతిపురమునకు యమపురమునకు నలువదినాలుగు యోజనముల దూరముగలదు. దానికి నాలుగు ద్వారములు. ఇప్పుడు చెప్పినది పాపాత్ములు పోవు దక్షిణద్వార మార్గము. యమపురము సమీపింపఁగనే లోపల నరకబాధలఁబడు పాపాత్ముల హా హా కారములు నేడ్పుధ్వనులు నయ్యయ్యో యను రవము లీపావులఁ జెవిఁబడఁగా వీరును హాహాకారములు గావింపఁ బ్రారంభింతురు. ఇట్లు వీనిని గొనిపోయి ద్వారపాలకుఁడైన ధర్మధ్వజుఁడను వాని కెఱిఁగించి లోపలికింబోయి ధర్మరాజు సన్నిధిని నిలుపుదుము. వీనిని జూడఁగానే వీని పాపము లన్నియు నాయన యెఱిఁగినవాఁడయ్యును. మర్యాదార్థము వీఁడేపాపములను బుణ్యములను జేసెనని చిత్రగుప్తు నడుగును. ప్రతిజీవి చేసిన

పుణ్యపాపములన్నియు నొక్కటైన విడువక పటములవలె నాయన పుస్తకములం దెక్కియుండును. అట్లున్నను మరల నాయన శ్రవణ దేవతల నీ పాపాత్ములగుఱించి యడుగును. ఈ శ్రవణదేవతలు బ్రహ్మపుత్రులు. వీరు భూమ్యాకాశ పాతాళలోకంబుల నిరర్గళంబుగ సంచరించుచు నీ మూఁడు లోకంబుల జరుగునన్నిటిని వినుచుందురు. దీర్ఘదృష్టిచేఁ గనుచుందురు. వీరికి దూరమున జరుగు విషయములు దెలిసికొను శక్తియుఁ గలదు.

వీరి భార్యలు శ్రవణులు[8]. వీరికి నట్టి శక్తి కలదు. వీరు స్త్రీలు చేయు పుణ్యపాపముల నెల్ల నెఱుంగుచుందురు. ఈ భార్యాభర్తలు లోకముల నెల్లవారు చేయు పుణ్యపాపముల నెల్లఁ జిత్రగుప్తున కెఱిఁగించుచుందురు. మనోవాక్కర్మముల మనుష్యులుచేయు పుణ్యపాపము లన్నియు నున్న వున్నట్టు వీరెఱుంగనివి లేవు. మనుష్యుల వృత్తములు కనిపెట్టువారు నెఱుఁగువారు యమ చిత్రగుప్త శ్రవణీశ్రవణ దేవతలు మాత్రమేగారు. సూర్యచంద్రులు – భూమి – నీళ్ళు – అగ్ని – వాయువు – ఆకాశము – హృదయము – పగలు – రాత్రి, రెండు సంధ్యలు, ధర్మదేవత వీరెల్లరు మనుష్య వృత్తము లెఱిఁగి యుందురు. కావునఁ దాను జేసిన పాపము నెవ్వరెఱుఁగరు. అతి రహస్యముగఁ జేసితినని తలఁచువాడు మూఢుఁడు. కన్నులు మూసికొని పాలుత్రాగు పిల్లివంటివాఁడు. ఇట్టి పాపుల వృత్తములు[9] తెలిసికొని యముఁడు భయంకరాకారుఁడై వీరికిఁ గానవచ్చును. మహాకాయుఁడు – దండహస్తుఁడు – మహిషవాహనుఁడు – ప్రళయ కాలమేఘ ధ్వనివంటి కంఠరావము గలవాఁడు – మెఱుఁగులవలె మెఱయు నాయుధములు కలవాఁడు–కాటుక కొండవంటి దేహముగలవాఁడు– ముప్పదిరెండు చేతులవాఁడు–మూఁడామడ విస్తారమైన మేనివాఁడు– బావులవంటి కన్నులు గలవాఁడు–భయంకరములైన కోఱలుగలవాఁడు– ఎఱ్ఱని నేత్రములవాఁడు–దీర్ఘనాసిక గలవాఁడు నగు నా ధర్మరాజును జూచి యీ పాపాత్ములు భయపడి వడఁకుచు విలపింతురు. ఆయనవలెనే

చిత్రగుప్తుఁడు లోనగువారు భయంకర వేషంబులఁ గానవత్తురు. వీరి పాపముల విచారించి తగినశిక్ష యముఁడు చెప్పి నరకములకుఁ గొనిపోవఁ బ్రచండుఁడు చండకుఁడు నను భటుల కాజ్ఞాపించును. అప్పుడు యమధర్మరాజు పాపాత్ముల కిట్లనును.

ఓ పాపులారా! నవ్వుచుఁ గామక్రోధములకుఁ బాల్పడి చెప్పరాని చేయరాని పాపములనెల్లఁ జేసితిరే. ఇప్పుడేడ్చిన నేమిఫలము? ధనికుఁడైనను నిర్ధనుఁడైనను రాజైనను భిక్షకుఁడైనను బలవంతుఁడైనను దుర్బలుఁడైనను బండితుఁడైనను బామరుఁడైనను నందఱపట్ల యముఁడు సముఁడై యుండునని మీ రెఱుంగరా. మీ ధనములు మీ రాజ్యము మీ బలము మిమ్మిప్పుడు రక్షించునా? ఏల మీరిట్టి పాపములఁ జేసితిరి? సులభములైన యన్నము మంచినీళ్లైన నొకరికి నిచ్చినవారు కారే. కుక్కలకుఁ గాకులకుఁ బిడిచెఁ డన్నమైన నిడితిరా. అథిథుల నభ్యాగతుల నాదరించితిరా. పితృలకు శ్రాద్ధములను శ్రద్ధతోఁ బెట్టితిరా. అప్పటి మీ మాటలు యుక్తులు చమత్కారములు తర్కవాదము లిప్పుడు స్మరింపుఁడు. అమావాస్యనాఁడు పితృదేవతల కిన్ని నీళ్లైన విడిచితిరా? తీర్థముల క్షేత్రముల దర్శించితిరా. తీర్థము లనఁగా నీళ్ళనియేకదా దలఁచితిరి. దేవాలయము లందలి దేవతలను బొమ్మలని మాటలాడితిరికదా. ఇట్టి మిమ్మెంత బాధ పెట్టిననేమి? మీ తప్పుల క్షమించువాఁడు భగవంతుఁడు నారాయణుఁడు. రెండక్షరములుగల యాయనపేర్లు రామ-కృష్ణ-హరి-విష్ణు వని యుచ్చరించుట కూడ మీకుఁ గష్టమయ్యెనే. ఆయనకాక మీకు రక్షకులెవ్వరు. అని కింకరుల కప్పగించును. వారు వీరికి ముక్కుత్రాళ్ళు గుచ్చి యీడ్చుకొనిపోయి మండెడు మంటవలె నుండి యోజనము నిడివి యైదుయోజనములు వెడలుపుగల శాల్మలీ తరువునకుఁ గట్టివైచి కత్తుల నఱకుచు, అంపములఁగోయుచు, బాకులఁ బొడుచుచుఁ దేళ్ళచేతను బాములచేతను గఱపించుచు, క్రాఁగెడు నూనెలోఁ ద్రోయుచు, నెఱ్ఱని పెనములపైఁ బొరలించుచు నిట్లు నానావిధముల బాధింతురు.

ఈ భ్రష్టుc డన్నివిధములైన నరకయాతన లనుభవింప నర్హుcడు కావునc దీసికొనిపోవచ్చితిమి. ఇట్టివానిని మీరు విడిపింప వచ్చితిరి. ఇట్లైన నరకము పాడుపడదా? పాపము పెచ్చు పెరుcగదా. ఇcక భూమిపై పుణ్యము నెవcడు చేయును? పుణ్యాపాప భేదమే నశించునుగదా? అనిన విష్ణుదూత లిట్లనిరి.

పాపాత్ములు శిక్షింపc బడరాదని మామతముగాదు. కార్యాకార్యములకు శాస్త్రము ప్రమాణ మనుట మేము నంగీకరించితిమి. పాపములకు శిక్షవిధించిన శాస్త్రములం దాపాపములకుc బ్రాయశ్చిత్తములు విధింపcబడ లేదా ప్రాయశ్చిత్తములు పాపపరిహారకము లందురా? వ్యర్థమునందురా? అట్టి ప్రాయశ్చిత్తములం దెల్ల నుత్తమోత్తమ ప్రాయశ్చిత్తమేది? ధర్మములం దెల్ల నుత్తమధర్మమేది? అన్ని వ్రతములలో నన్ని నియమములలో నుత్తమవ్రతమేది? అన్ని వ్రతములలో నన్ని నియమములలో నుత్తమవ్రతమేది? ఏది చేయకున్న నన్ని వ్రతములు నియమములు జపతపంబులు దాన ధర్మంబులు నిస్సారములగు? మీరు ధర్మరాజు కింకరు[9]లేని చెప్పుcడు ఉత్తమోత్తమ వ్రతము నుత్తమోత్తమ నియమము నుత్తమోత్తమ జపము నుత్తమోత్తమ తపము నుత్తమోత్తమ దానము ధర్మము నెద్ది? ఎప్పటికిc బండియుండు పంటయేది? మీకుc దెలియకున్న వినుcడు భగవన్నామ మొక్కటే. దూదికొండను నిప్పుకణికవలె నెంతపాపమునైన భగవన్నామము భస్మము చేయును. వీcడు పుత్రుని పేరుపెట్టి నారాయణ నామ ముచ్చరించుటేకాక యంత్యకాలమందును నారాయణ స్మరణము చేసెను. వాcడు పిలిచినది కొడుకునుగదా భగవంతునిc గాదే యందురేని సత్యము. తెలిసి తాకినను దెలియక తాcకినను దహించు నిప్పువలె నెట్లుచ్చరించినను భగన్నామము దాని గుణముc జూపకపోదు. తెలిసి తినినను దెలియక తినినను నేపాళము విషము. వాని గుణము మానునా? అట్టులే యమృతము త్రావిన దాని గుణము మానునా? తెలిసినను దెలియకున్నను వస్తుతత్త్వము మాఱనట్టు లెట్లుచేసినను భగవన్నామము

దాని గుణముఁ జూపక మానదు. వీఁడు భక్తితో నుచ్చరించియుండిన నిప్పుడే వైకుంఠమునకుఁ బిలుచుకొనిపోయి యుందుము. అటు లేమిని విడిచిపోవుచున్నాము. మీరు వీనిని బాధింపక మీత్రోవం బొందన వారును మరలిపోయి తమకుఁ గలిగిన పరాభవము యమునకు విన్నవించి నీయాజ్ఞ యిట్లు వమ్మగుటకుఁ గారణమేమని యడిగిన యముండిట్లనియె.

దూతలారా! మీరు చూచినవారు విష్ణుభటులు, సృష్టియు రక్షణము నెవఁడు చేయుచున్నాఁడో యతఁడే దండనము చేయుచున్నాఁడు. అట్టి మహావిష్ణువునాజ్ఞ శిరసావహించి మేమందఱము బ్రహ్మయు–రుద్రుఁడు లోనుగాఁ గలవారెల్ల వర్తింతుము. ఆయన యాజ్ఞచే సూర్యుఁ డెండగాయును. అగ్ని జ్వలించును. వాయువు వీచును. సర్వస్వతంత్రుఁ డాయనయేగాని మేమెవ్వరము దేనికిని స్వతంత్రులము గాము. స్వతంత్రించి యెవ్వరిని దండించు నధికారము మాకులేదు.

**కం.** **అదిగాన విష్ణుభక్తులఁ**
**గదియఁగఁ జనవలదు మీరు కరివరదు లస**
**ల్పద పద్మవినతి విముఖులఁ**
**దుది నంటఁగఁ గట్టితెండు ధూర్తులు వారల్**

**సీ.** **ఏకసక్కెమునకైన నిందిరారమణునిఁ**
**బలుకంగలేని దుర్భాషితులను**
**గలలోననైన శ్రీకాంతుని సత్పాద**
**కమలముల్ చూడని కర్మదృశుల**
**నవ్వుచు నైనఁ గృష్ణప్రశంసకుఁజెవిఁ**
**దార్పనేరని దుష్కథాప్రవణుల**
**యాత్రోత్సవంబులనైన నీశునిగుడి**
**త్రోవఁ ద్రొక్కఁగలేని దుష్పదులను**

ఆ. బరమ భాగవతుల పాదధూళి సమస్త
తీర్థసారమనుచుఁ దెలియలేని
వారి వారివారి వారిఁ జేరినవారిఁ
దొలుతఁ గట్టితెండు దూతలార!

ఆ. పద్మనయనుమీఁది భక్తియోగంబెల్ల
ముక్తియోగమనుచు మొదలెఱుంగు
వారి వారివారి వారిఁ జేరినవారి
త్రోవఁ దలఁపవలదు దూతలార!

ఆ. బిడ్డపేరు పెట్టి పిలుచుట విశ్రామ
కేలినయిన మిగుల గేలి నయినఁ
బద్య గద్య గీత భావార్థములనైనఁ
గమలనయనుఁ దలఁపఁ గలుషహరము

అని వారికి సెలవిచ్చిపుచ్చె. అక్కడ నజామిళుండు పులివాతంబడి తప్పించుకొన్న లేడివలె యమకింకరులచే విడువఁబడి తన్ను విడిపించిన మహాపురుషులతో నేమియో చెప్పఁబోవ వారదృశ్యులైరి. అతండు మృత్యువాతఁ దప్పి యమకింకరుల వాక్యంబులు స్మరించి స్మరించి గడగడ వడఁకుచుఁ దాఁ జేసిన పాపములకుఁ బరితపించుచు నిట్లని తలపోసె.

అయ్యయ్యో! బంగారువంటి బ్రాహ్మణ కులమునఁ బుట్టి వేదాధ్యయన సంపన్నుఁడనై స్నాతకుఁడనై సదాచార సంపన్నుఁడనై శీలవంతుఁడనై వివేకినై యుండియుఁ గామదాసుఁడనై సర్వము నిమిషములో నేటఁగలిపితిఁగదా. కని పెంచి పెద్దచేసి రక్షించిన తల్లిదండ్రుల కీకంటి నీరాకంటఁ బోసితినిగదా. శీలవతియు గుణవతియుఁ బతివ్రతయు నాచారవతియునైన భార్యను చిన్నదానిని విడనాడి యాచారముల నేటఁగలిపి దురాచారమునకు లోపడి టక్కుటనక్క, లచ్చికక్క, క్రచ్చపొద, యాచారహీన, వన్నెపూసిన పేఁడబొమ్మ నడివీధి యాఁడుకుక్క యగు

బోగముదాని వలలోఁబడి నేను జేసినకార్యములు దలఁప నాకే సిగ్గయ్యెడిని. పలువురు దూషించినను నలువురు నుల్లసమాడినను నాకు సిగ్గు దోఁపదయ్యె. పండినచేనికిఁ గల్లవంటి పెద్దలఁ గల్లలాడి మర్యాదా శాసకుల శాస్త్రకారుల దూషించితిని. కింకరులు చెప్పినట్టు నేను జేయని పాపము లేదు. ఏ జన్మమునఁ జేసిన పుణ్యమో నారాయణ శబ్దము నాలుకకు రాఁగా బ్రతికితిని గాక. నరకమునకేపోయి యుండిన మరల నీవల వచ్చుటయుఁ గలుగునా? ఆ హా నన్ను విడిచిన పుణ్యాత్ము లెవ్వరోగదా. వారల మరలఁ జూతునాయని గంగాద్వారమునకుఁ బోయి మఱచిన చదువుల స్మృతికిఁ దెచ్చుకొని ధ్యానయోగనిష్ఠుండై రక్షాభరంబు భగవంతునిపై నిడి సర్వదా నారాయణ చింతనముగావించి దేహంబువిడిచి భగవత్కృపవలన వైకుంఠమున కేగి యందు వారలఁ గాంచి వారివలెఁ దానునై శ్రీమన్నారాయణచరణసేవానిరతుండై సుఖించె.

## 2. కోమటి యుక్తి

ఆంధ్రదేశంబున బద్దెనప్రోలను గ్రామము గలదు. ఈ బద్దెన ప్రోలే బద్వేలయ్యెనందురు. ఆ గ్రామమున నుండు నంతటి నీచవైశ్యులు మఱి యెందును లేరు. పిసినితనమున వారిని జెప్పి నవకోటి నారాయణుని జెప్పవలయును. యాచకులు కనఁబడిరా మొగముల పీనుఁగుకళయే. వారిని తలయెత్తి చూడ భయపడుదురు. చూచిరా యమకింకరులఁ జూచినట్టు దేహమంతయు వణఁక కట్టుకొన్న వస్త్రములోనే మల మూత్రములు విడుతురు. పలుకులుడుగును. చూపులు తిరుగుడుపడును. నోరెండును. శ్వాసము నిలుచును.

ఇట్టి కోమట్లు కలుగఁబట్టియే కదా భీమకవి "కోమటి కొక్క టిచ్చి పదిగొన్నను దోసములే"దని చెప్పుటయు దాని నాక్షేపించి "కోమటి కొక్కటీక పదిగొన్ననుదోసము లే"దని వేఱొక కవి చెప్పుటయుఁ గలిగెను.

ప్రల్లదుఁడైన యొక్క కులపాంసను చేసినదానఁ దత్కులం బెల్లను దూషితంబగుట యేమి యపూర్వమని భారతంబునఁ గలదు కదా!

ఒకరిద్దఱవలననే కులమునకు, వంశమునకు, దేశమునకుఁ గీర్త్యపకీర్తులు వచ్చును. అట్లుండ గ్రామముననున్న యనేకులు కోమటు లట్టులయిన నపకీర్తి యేలతప్పును? కాలముపోయినను నిందపోదు.

అట్టులుండిన యా కోమటులలో నెల్ల మిన్నయై సిద్దిపొట్ట, కందెన చాయ, రాసభస్వరము, పాషాణహృదయము, బుఱ్ఱముక్కు గల యొక కుమతి కోమటి యుండెను.

తులాధారుఁ డెంతటి ధర్మరతుఁడో యితఁడంతటి యధర్మిష్ఠుఁడు. అగరుగొండితనమున నగ్రపూజ కర్హుఁడు. లోభమునకుఁ బుట్టినిల్లు. వంచన యుగ్గుపాలతోనే లభించినది. కలహములకుఁ గలిపురుషుఁడు. ద్రోహమునకు రావు. చెల్లునో చెల్లదో యని నాణెమిచ్చినఁ దీసికొని యిప్పుడు త్యాజ్యకాలము ఱేపు రాయిచ్చెద నను. ఇచ్చుట కొక సేరు పుచ్చుకొనుట కొకసేరు. సేరు వంకరపెట్టి కొలుచును గాని సరికొలఁత కొలిచి యెఱుఁగడు. తక్కెడ దండమునకు నట్టనడుము తప్పించి దారముండును. తట్టకుక్రిందఁ జింతపండు కఱపించియైన నుండును. చింతపండు వీసె తూఁచి రెండువీసెలనును. అది యేమి యనినఁ బండువీసె, పులుపువీసె యనును. పులుపులేని చింతపండు గలదాయనిన నింటిలో నాఁడువారు వంటకు వాడఁగా మిగిలిన పిప్పి సేకరించి యుంచినదానిని జూపి చింతపండుమాత్రము కావలయుననిన దీనిని దీసికొనుఁడనును. వస్తువులు తూఁచియో కొలిచియో కనువారి యొడిలో వేయులోపల న్యాయముగాఁ గొంత హరించును. డబ్బు లెంచునపుడు కరలాఘవంబున నఱచేతఁ గొంత దాఁచును. కాలివ్రేళ్ళకు మైనముపూసికొని యెంచునపుడు త్రొక్కి కొంతదాఁచును. ఏమఱించి కొంత, కలహించికొంత, దొంగిలించికొంత, యీ ప్రకారము సగానికి సగమైన హరించును. క్రొత్తయాచకులు వచ్చిరా యిచ్చువాడుక లేదనును. ప్రాఁతవారు వచ్చిరా పెద్దవారిచ్చినది చాలదా. వారిచ్చి నేనియ్యవలయునా

లేదు పొమ్మనును. తిరిపెగాండ్రను దీసికోమట్టి యనుటచేఁ గోమటియను పేరు సార్థకపఱచుచుండెను. ఇట్లతఁ డా గ్రామములో నుండు సెట్టులలో నెల్లఁ పెద్దసెట్టియయ్యెను.

తాను బెట్టకున్నను బెట్టునట్టి యిల్లుచూపుమని సామెత మనస్సున నిలిపి యాకోమటి తాను బెట్టకున్నను నా వీథిలోనుండు నొక దాతయింటికిఁ బొండని వచ్చిన యాచకుల కాయిల్లు చూపుడువ్రేలఁ జూపుచుండెను. ఇట్లుండ నతని కపమృత్యువు ప్రాప్తించెను. కింకరు లతనిని యమధర్మరాజు నొద్ద నిలిపిరి. "ఇతఁడు బుద్ధి తెలిసినది మొదలు తాను బెట్టకున్నను పెట్టెడునిల్లు తర్జనిచేఁ జూపుట తప్ప మఱియు పుణ్యము చేసినవాఁడు కాఁడు. వీఁడు వంచన-మోసము-టక్కులు-టంక టొంకులు-కల్లలు తప్పఁబుణ్య మెఱుఁగఁడు" అని చిత్ర గుప్తుఁడు చెప్పెను. "అటైన జుట్టిన వ్రేలికిమాత్రము గంధము పూయుఁడు. పూలు చుట్టుఁడు. తక్కిన యుపచారములఁ జేయుఁడు. తక్కిన దేహమునంతయుఁ బనసకాయవలెఁ గుందికాకులకు గ్రద్దలకు వ్రేయుఁడు. కుక్కచేఁ గఱపింపుడు. క్రాఁగెడినూనెలోఁ ద్రోయుఁడు" అని యాజ్ఞాపించెను. కాని యింతలోఁ జిత్రగుప్తుఁడు "దేవరా! ప్రమాదము. వీని కింకను కొన్నాళ్ళాయువున్నది. వానిని మరల భూమికిఁ బంపి వానికి మాఱుగ వీని యింటికిఁ బొరుగుననున్న వానిని రప్పింపవలయును" అనెను. అటైన వీని నిప్పటికి విడువుఁడని యముఁడాజ్ఞాపించెను. కింకరులు వానిని దెచ్చి బొందిలో విడిచి ప్రక్కయింటి వానిని గొనిపోయిరి. ఈ లుబ్ధాగ్రేసర[10] చక్రవర్తి బ్రదికెను. తాను బ్రేతరూపమునఁ గన్న దంతయు స్మరణము వచ్చెను. ప్రక్కయింటివాఁడు చచ్చెను. ఈ దుష్టవైశ్యుఁడు ఇట్టు లాలోచించెను. పెట్టెడువానియిల్లు చూపుడు వ్రేలఁ జూపుటచేఁగదా దానిని సుఖపెట్టి తక్కినద దేహమును బాధపెట్టుఁడని యముఁ డాజ్ఞపించెను. మంచిదే కానిమ్మని యది మొదలు బిచ్చమునకు వచ్చిన వారికయ్యా యా యింటికిఁ బొమ్మని యన్ని వ్రేళ్ళతోను, మోఁకాలితోను,

మోఁచేతితోను, దలతోను, బాదములతోను, వీఁపుతోను, బిఱుఁదులతోడను నిట్టు ప్రత్యవయవము తోడను జూపుచుండెను. ఇట్లు చేసిన యెడల యముఁడిఁక నే యవయవమును బాధ పెట్టఁజాలఁడని యతని యుపాయమే కాని యిల్లు చూపినంత మాత్రమున నంత పుణ్యమైన యెడల దానము చేసిన మఱెంత పుణ్యమో యని యా నిర్భాగ్యునకుఁ దోఁచినదికాదు. పుట్టిన గుణము పుడకలతోఁ గాని పోదు.

### 3. కలిపురుషుఁడు - బ్రాహ్మణుఁడు

కలియుగారంభ దినములందు నొక బ్రాహ్మణుఁ డొక యూరినుండి వేఱొక యూరికిఁ బోవుచుండెను. అప్పటి కుదయమై మూఁడు జాములప్రొద్దు కావచ్చెను. త్రోవలో నొక దోసతోఁట గానవచ్చెను. ఆఁకొన్నవాఁడై యీ బ్రాహ్మణుఁడు ఫలము నొక దానిఁ గొనఁగోరి తోఁటవానిని బిలిచెను. గాని యందెవ్వఁడును గానవచ్చినవాఁడుగాఁడు. అప్పుడా బ్రాహ్మణుఁడు తానే మంచి ఫలముగఁ జూచి కోసి దాని వెల పైకము నా పండుండిన తొడిమె కాకులోఁగట్టి సగము ఫలము భుజించి తక్కిన సగము మడిసంచిలో నుంచుకొని దాపుననున్న యొక యగ్రహారమునకుఁ బోయి యొక విప్రునింట నతిథియై భుజించుచుండెను. ఇట్లు వారు భుజించుచుండు సమయంబున నొక మాలది నలువురు బిడ్డలతోడ నా బ్రాహ్మణుని వాకిటనిలిచి యోయయ్యా యోయయ్యా యని యఱచుచుండెను. ఎవరేమి యదరించినను బెదరించినను నది పోక యిప్పుడు మీయింటి కొక బాఁపనయ్య వచ్చెనే యాయన నిటురమ్మను మనుచుండెను. ఆయన బ్రాహ్మణులతోడ భోజనము చేయుచున్నాఁడు. ఇప్పుడు నీతో మాటలాడఁడు పొమ్మని వెలుపల నున్నవారు చెప్పిరి. "బలే బాఁపఁడు లేవయ్యా. ఇన్నాళ్లు నాతోడ సంసారముచేసి నలుగురు బిడ్డలఁగని యీ దినము ప్రొద్దునఁగూడ నాతోడ నొక సానికయందు మాంసపుఁగూడు తిని మీ యింటికి రాఁగానే దొడ్డ

బాఁపఁడయ్యెఁ గాఁబోలు" నని చెప్పెను. ఇంతలో గృహస్థులు లోపలినుండి వెలికి రమ్మని సర్వము విచారించిరి. ఈ యయ్య యిన్నాళ్ళు నా తోడ సంసారముచేసి బిడ్డలఁ గని యీ దినము నాతో గ్రుద్దులాడి కోపించి నన్ను నా బిడ్డలను దిక్కులేనివారిని జేసి యిచ్చటికి వచ్చినాఁడు. నే నెట్లు బ్రదుకుదును? నా బిడ్డల నెట్లు బ్రతికింతును. ఏదో వెరవు చెప్పుమనుఁడు పోయెదను" అనెను. ఆ యతిథి బ్రాహ్మణుఁ దే లంజముండా! ఏమి కూసెదవు. నీ వెవ్వతెవు నే నెవ్వఁడను? నీ ముఖ మెవ్వఁడెఱుఁగును ఛీ పొమ్మని యదలించెను. గాని యది వదలక "చాలు లేవయ్యా యీ శ్రీరంగనీతులు నా మొగమే నీ వెఱుఁగవా? నా మొగము నీవు నీ మొగము నేను నెఱుఁగకున్న నీ బిడ్డ లెచ్చటనుండి వచ్చిరి? మొగ మెఱఁగవు కాని తక్కిన యెదలంతయు బాగుగ నెఱుఁగుదువు కాఁబోలు. నేను మాంసము నాఅవేయుచుండి యీయనదేనికో-యింక దేనికున్నది- పిలిచిన రాకపోయితినట. బుఱ్ఱుమని కోపించుకొని పాఱివచ్చినాఁడు. అంతమాత్ర మడ్డు చెప్పక యున్నారా యీ యాఁడువారందఱు. ఇంత యేలయ్య ఈయన సంచిదీసి చూడుఁడు. ప్రొద్దున మేమిరువురు మొక సానికలోఁ దినఁగా మిగిలినమాంస మున్నదో లేదో" యని చెప్పెను. ఆ మాటలువిని యాయింటివారా సంచిని బరిశోధింపఁగా నందు మాంసపు ముద్ద బయలు వెడలెను. సగము దోసపం డట్టులే మాంసమై యుండెను.

అది చూచి యా బ్రాహ్మణులు రోషావేశంబున నా యతిథిని జావఁదన్ని యూరువెడలఁగొట్టి ప్రాయశ్చిత్తములు పెట్టుకొని కన్నయగచాట్లుపడి ఛీ యిఁక మీఁద బ్రాహ్మణుఁడని వచ్చిన నమ్మి యన్నము పెట్టరాదనుకొనిరి. చక్కఁగ మర్దితుఁడైన యీ బ్రాహ్మణుఁ డేడ్చుచు నేఁడు నిద్దురలేచి యెవరిముఖముఁ జూచితినో యనుకొనుచు నొక యడవిలోఁ బోవుచుండెను. అయ్యా యని మాలదిమాత్రము విడువక యఱచుచు వెంబడి పోవుచుండెను. ఇట్లు చాలదూరము పోయినపిమ్మట నిర్జనమైన యొకచోట నా బ్రాహ్మణుఁడు తిరిగిచూచి "యెవ్వతెవే నీవు?

నీ ముఖమైన నే నెఱుగుదునా? ఏల నున్నc జలపట్టి సాధించెదవు? నీకు నే నేయపకారము చేసితిని? నాపాలి శనైశ్చరుcడవా?" యని యడిగిన నది యిట్లనియె.

"ఓయి బ్రాహ్మణుడా! నేను గలిపురుషుcడను. ఇది నాయుగమనుట మఱచి తక్కిన యన్ని యుగములలో నాడిన యాటలిప్పుడును నాడcజూచెదవా? ఆ యాటలింకc జెల్లవు. నా యుగమున నాకు సమ్మతమైనరీతిని వర్తింపవలయును. అటు చేయవేని నీవు గవ్వకుc గొఱకాక భ్రష్టుcడవై వాసి వన్నె లేక చెడుదువు. నీ కాcకలియైనచోc దోసపండుతీసికొని తింటివి. సంతోషమే. తొడిమకు డబ్బులు కట్టకున్న నీ యబ్బగంటేమి మునిcగెను? ధర్మమా యధర్మమా యనుట విచారము మానుము. విధి నిషేధములు పాటింపకుము. కావలసిన పదార్థము కనcబడెనా తీసికో. భోగింప బుద్ధి పుట్టెనా భోగింపుము. నీకు బుద్ధివచ్చుటకై యిట్లు చేసితిని. ఇcక నిట్లు చేయకు"మని మాయమైపోయెను.

ఔరా! కలియుగమా! కాముcడే పరమదైవమcట. కడుపే యిలవేలుపcట ఇcకనేమి జెప్పవలయు. సాధువులకీ లోకంబున నిcక బ్రదుకులేదనుచు నా బ్రాహ్మణుcడుపోయెను.

## 4. కలియుగ ధర్మములు

కలియుగమున ధర్మమొక్క పాదమే నడచును. దానివలన సత్యము క్షీణించును. సత్యహానివలన నాయువు క్షయించును. ఆయువు క్షయింపcగా విద్య లల్పములగును. అప్పవిద్యలచేత విమోహం బభివృద్ధిcగాంచు. దానివలన లోభంబు పెరుగు. లోభావేశముచేc గామ మగ్గలించును. కామము తోడc గ్రోధము హెచ్చగును. క్రోధమున వైర మతిశయించును. వైరముచే నందఱు జనులల్యోన్యపీడ గావింతురు. ఒకని బుద్ధిచొప్పున మఱియొకcడు పోcడు. స్వైరవృత్తిచే వర్ణ సంకరముగలుగు. బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు జపతపస్స్వాధ్యాయములు వదలి శూద్రులవలె నగుదురు.

శూద్రులు తపస్సు చేయుదురు. క్షత్రియులు శూద్రవృత్తి నవలంబింతురు. రసగంధద్రవ్యంబుల పసచెడును. భూమి నిస్సారమై పంటలు కొంచెములగును. ఆవుల పాఁడియును జెట్టులcబూలు పండ్లును గొంచెముగ నగును. రాజు లెక్కువ కప్పము తీసికొని ప్రజల బాధింతురు. బ్రాహ్మణులు వాణిజ్యము కృషిసేసి జీవింతురు. వర్ణాశ్రమములు పాషండ శాస్త్రముల పాలగు. జనులు దేహరక్షణమం దెక్కువ యాసక్తి గలవారగుదురు. ఈ పుణ్యమున కీ ఫలమను మాట బొంకగును. సకాలమున వానలుగురియవు. బీజములందుc బొల్లుగింజ లెక్కువగును. క్రయవిక్రయంబులc గపటంబు హెచ్చును. ఇల్లడసొమ్ముల మరల నీయరు. సాధులు రోగములచే నల్పాయువు లగుదురు. పాపులారోగ్య వంతులై దీర్ఘకాలము జీవింతురు. ఆరుగపంటలు గొఱ్ఱెలపాఁడి హెచ్చగును. పురుషులకు భార్యలును వారి యన్నదమ్ములును ప్రాణబంధువు లగుదురు. అత్తమామలు గురువులగుదురు. సాధారణముగా నందఱు చేఁపల భక్షింతురు. బ్రాహ్మణులు వేదము లమ్ముదురు. అందఱు నన్న మమ్ముదురు. స్త్రీలు తమ యంగము విక్రయింతురు.

ధనముగలవాఁడే కులముగలవాఁడు. ధర్మ న్యాయవ్యవస్థయందు ధనమే బలము. ధనముగలవాఁడే జన్మాచార గుణముల యోగ్యుఁడు. అభిరుచియే దాంపత్య హేతువు. అనృతమే వ్యవహారమున బలము. స్త్రీ పురుషులయందు రతికుశలత్వమే భోగహేతువు. యజ్ఞోపవీతమే బ్రాహ్మణ చిహ్నము. వర్ణాంతర ప్రాప్తికి లింగమే చిహ్నము. కాషాయ వస్త్రము సన్న్యాసి లక్షణము వృత్తిహేతువులు. ధనుదర్బలత్వమే పరాజయ హేతువు. వదరెడువాఁడే పండితుఁడు. అసమర్థుఁడే సాధువు. స్నానము చేసినవాఁడే పవిత్రుఁడు ఉదరభరణమే సర్వపురుషార్థములు. దానమే ధర్మహేతువు. స్త్రీని వశపఱుచుకొనుటే వివాహము. వేషధారణమే గొప్పవాని లక్షణము. సమానమే సత్యవాదిత్వము. దూరపునీళ్ళె తీర్థము. మంచి వేషము వేసినవాఁడు పాత్రుఁడు. వయస్సు బలము గలవాఁడే రాజు. పురుష

లబ్ధధనముచేతనే ధనాఢ్యులమని గర్వింతురు. స్త్రీలు కేశములచేతనే రూపవంతులమని పొగరుపడుదురు. కలియుగమున బంగారుమణులు నశింపఁగా స్త్రీలు వెంద్రుకలుమాత్రమే భూషణముగాఁ గలవారగుదురు. ధనములేని మగని విడిచి స్త్రీలు ధనముగలవానిని మగనిఁగాఁ జేసికొందురు. ఎక్కువగ నిచ్చువాఁడే యేలిక. ద్రవ్యము గృహనిర్మాణముతో ముగియును. బుద్ధిధనార్జనముతో ముగియును. తానుమాత్ర మనుభవించుటతో ధనముముగియును. స్నానము లేకయే దేవతాతిథిపూజ భోజనము చేయుదురు. పిండోదక క్రియలు నిలిచిపోవును. స్త్రీలు కామాసక్తలు కుఱుచ దేహములు గలవారు. ఎక్కువతిండి తినువారు పెక్కురు బిడ్డలఁగలవారు నల్పభాగ్యలు నగుదురు. స్త్రీలు రెండుచేతులఁ దలబఱికికొందురు. రాజులుజేసిన పాపముచే బాలురు చత్తురు. పంద్రెండేఁడులకే తలలు నరయును. దేవతలంట యెందోయున్నారఁట, బ్రాహ్మణులఁట యుత్తములఁట, వేదములఁట ప్రమాణములఁట. స్నానముచేసిన శౌచమఁట యని పాషండులు పలుకుచుందురు. వస్త్రములు జనుపనార పట్టలవంటివగును. చెట్లు జమ్మిచెట్లవలె నగును. అన్ని వర్ణములవారు శూద్రులవలె నగుదురు. ఆవులు మేఁకలవలె నగును. అత్తమామల ననుసరించి పురుషులెక్కడి తండ్రి యెక్కడి తల్లి కర్మవశమునఁ బ్రాప్తింతురని యనుచుందురు. స్పర్శదోషము పోవును. శుచిత్వ ముపేక్షింపఁబడును. వర్ణాశ్రమాచారములు నిలిచిపోవును. ఏదోయొక యుపాయముచే దీక్షితు లగుదురు గాని సచ్ఛాస్త్రపద్ధతిని గాదు. అందఱు (అవైదికకార్యాదులును) దేవతలే యగుదురు. ఉపవాసములు–కృచ్ఛ్రాదివ్రతము–తీర్థయాత్రాదులు వారి వారి యిష్టప్రకారము చేయుదురు. సామర్థ్యము కుటుంబ పోషణమునకే యగు ఆశ్రమములు గృహప్రాయములగును. యోనిసంబంధమాత్ర ప్రధానులు బంధువులు. మేఘముల మెఱుపు లెక్కువగును. గృహములతిథి భోజనాది రహితములై శూన్యము లట్లగును.

శ్రాద్ధములయందు బ్రాహ్మణులు మీయింటికి మేము వచ్చెదము మా యింటికి మీరు రండని యందురు. జనులు చోరులు, నాస్తికులు, దురాచారులు నగుదురు. కొడుకుసొత్తు తండ్రి యపహరించును. బ్రాహ్మణాదులు కుతర్కవాదములకు మరగి నీచకార్యములు సేయుదురు. మనుష్యులు పల్లపు భూములు దున్ని నాఁగేటికిని బరువులు మోయుటకును నేఁడాది దూడలను గట్టుదురు. తండ్రి కొడుకు లొకరి నొకరు చంపినను నిందితులుగారు. మనస్తాపము నివారించుకొననిట్లు చేయుటయేగాక యింతటి ఘనకార్యము చేసితిమని గర్వింతురు. దేశమందంతట మ్లేచ్ఛాచారములు ప్రబలును. సంతుష్టి శూన్యమగును. బలహీనులయు, దిక్కులేనివారలయు, విధవలయు ధనముల జను లపహరింతురు. ఇట్టి పాపకార్యములఁ జేయువారు పెద్ద మనుష్యులని గణింపఁ బడుదురు. జ్ఞానశూన్యులు–శక్తిహీనులునై విప్రులు, దుర్మార్గు లవమాన పూర్వకముగా నిచ్చు ధనముఁగొని సంతోషింతురు. రాజులు జ్ఞానశూన్యులై తమ తెలివిని దామే మెచ్చుకొనుచుఁ బరస్పరము కలహించి ప్రజల హింసింతురు. రాజులు రక్షణము సేయకున్నను నుగ్రశిక్షలు మాత్రము చేయుచుందురు. వీరు ప్రజల భార్యలను ధనములను వారు మొత్తుకొనుచున్నను బరితాపపడక బలాత్కారముగ గ్రహింతురు. కన్యలను దానమిచ్చుటగాని దానముగఁ గొనుటగాని నిలిచిపోవును. కన్యలు తమకుఁ దామే యిచ్చవచ్చినవారిని దగులుకొందురు. ధనవంతుఁడే మగఁడు. బలవంతుఁడే భర్త. దేశమంతయు మ్లేచ్ఛీ భూతమగును. యుగాంతమునఁ గుడిచేయి యెడమచేతిని, నెడమచేయి కుడిచేతిని మోసగించును. పిఱికి పందలు వీరులవలెఁ జరింతురు. వీరులు భీరులవలె నణఁగి యుందురు. పాపులు సంపన్నులై యభ్యుదయము గాంతురు. పుణ్యులు సకల విధముల క్షీణదశయం దుందురు. బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు నిశ్శేషముగ రూపుమాయుదురు. కలియుగాంతమున నందఱేకవర్ణము వారగుదురు.

అందఱొకవిధమైన యాహారమునే భుజింతురు. జాతిభేద మాహారభేదము నశించును. తండ్రి కొడుకును వంచించును. కొడుకు తండ్రిని వంచించును. భార్యాభర్తలు పరస్పరము వంచింతురు. భార్యలు పతిసేవ చేయరు. ఈ కాలమున నందఱు గోధుమలు, యవలు ముఖ్యాహారముగాఁ గల దేశములఁ జేరుదురు. స్త్రీ పురుషులు కేవల స్వతంత్రులై స్వేచ్ఛగాఁ దిరుగుచు నొకరి చేష్టల మఱియొకరు సహింపకుందురు. శ్రాద్ధములు నిలిచిపోవును. గురువని యెవ్వరు నెవ్వరి నాదరింపరు. ఆ కాలమున మనుష్యుల పూర్ణాయువు పదునాఱు సంవత్సరము లగును. ఐదారు సంవత్సరముల ప్రాయపుఁ గన్యలు బిడ్డలఁ గందురు.

మిథ్యాచారములు విశేషించును. బాటలవెంట దుష్టస్త్రీలు విహరించుచుందురు. అందఱు సర్వభక్షకు లగుదురు. శాస్త్రజ్ఞానము శూన్యమగును. జనులు తోఁటలను, వృక్షములను నఱకుదురు. దురాశచే బ్రాహ్మణులఁ జంపి వారి ధనముల శూద్రు లపహరింతురు. అప్పుడుత్తమ జాతివారు రక్షకులులేక యయ్యోయని మఱచుచు దేశములువెంటవలస పోవుదురు. జీవహింస దోషాకరమనుట మఱచి మనుష్య లొకరినొక రెప్పుడు విచ్చలవిడి చంపుదురో యప్పుడు కలియుగాంతమగును.

చోరబాధ సహింపలేక జనులు కొండలలో, గుహలలో, నదులలో దాఁగుదురు. ఆకులలములు, వేరు వెల్లఁకులు, దిని చెట్లపట్టలు నాకులును వస్త్రముల మాఱుధరింతురు. దుష్టప్రభువులబాధ సహింపలేక యుత్తమవర్ణులు శూద్రుల సేవకులై యుందురు. శూద్రులు వేదార్థము లుపన్యసింపఁగా బ్రాహ్మణులు వారిని సేవించి వారు చెప్పిన యర్థముల ప్రకారము తమ యాచారము సవరించుకొందురు. దేవతాపూజమాని మనుష్యులు గోడలలోని శల్యాదులఁ బూజింతురు. ఋష్యాశ్రమములు బ్రాహ్మణాధ్యయనశాలలు క్షేత్రముల, చెఱువులు సమాధులచే వికారము చేయఁబడును. దేవాలయములు నశించును. విష్ణుపూజ నిలిచిపోవును.

ఇవి కలియుగాంత చిహ్నములు. పూలలోఁ బూలు, ఫలములలో ఫలము లెప్పుడుత్పత్తియగునో, యెప్పు డందఱు మాంసభక్షకులగుదురో యప్పుడు కలియుగ మంతమగును. గురువును శిష్యుఁడు లక్ష్యపెట్టఁడు. గురువు శిష్యునియెడ వంచకుఁడగును. ఆ యుగాంతమున దిక్కులు మండును. నక్షత్రములకాంతి క్షీణించును. ఉల్కలు రాలును. ఆర్వురు సూర్యులు ప్రకాశింతురు. ఉదయము మొదలు సాయంకాలము వఱకు రాహువు సూర్యుని బట్టియుండును. స్త్రీలు కఠినవాక్కు లాడుచు నేడ్చుచుందురు. స్వైరిణులై మగలను, బిడ్డలను జంపుదురు. బాటసారుల కూడ నీళ్ళు నిడువారులేక బాటలప్రక్కలఁ బండుకొందురు. బంధువులు మిత్రులు ధనకాంక్ష చేతనే సహాయము చేయుదురు.

ఇట్టి ఘోరకాలము ప్రాప్తింపఁగా మరల దైవానుగ్రహంబున మంచి కాలమువచ్చును. సూర్యుఁడు-చంద్రుఁడు-బృహస్పతి-పుష్యము నెప్పుడేక కాలమునఁ బ్రవేశింతురో యప్పుడు మరలఁ గృతయుగము ప్రారంభించును. అప్పుడు శంబళ గ్రామమున విష్ణుయశుండను బ్రాహ్మణునకు విష్ణువు కల్కియై యవతరించి మ్లేచ్ఛులనెల్ల వధించి నాలుగు వర్ణముల నేర్పఱచి ధర్మము ప్రతిష్ఠించును. కలియుగమున మూఁడు పాదములమాత్రమే ధర్మమునశించి యొక్కపాదము ధర్మము మిగిలి యుండును. కాని ధర్మము నిశ్శేషముగా నశింపదు కావున నప్పుడుండువారిలో శమము-దమము-శౌచము-శాంతి గుణము లెవరియందుండునో వారందఱు బ్రాహ్మణులుగాఁ బరిగణింపఁ బడుదురు. యుద్ధమునందుఁ బరుగెత్తక ధైరస్థైర్యము లెవరుకలవారై యుందురో వారు క్షత్రియులగుదురు. ఎవరు న్యాయముగ వాణిజ్య పశుపాలక కృష్ణులు చేయుచుందురో వారు వైశ్యులగుదురు. ఎవరు ఒకరియొద్ద సేవచేసి జీవించుచుందురో వారు శూద్రులగుదురు.

## 5. కలికాల సాధుత్వము

ఏకాలమున నల్పధర్మము మహాఫలము నిచ్చునో యట్టి కలికాల మారంభింపఁగా గొందఱు ఋషులు తమ సందేహమును దీర్చుకొన వ్యాసులను దర్శింపఁబోయి యాయన గంగానదియందు స్నానమాడుచుండ నొక వృక్షముక్రిందఁ గూర్చుండిరి. వారి రాకకుఁ గారణము దన జ్ఞానదృష్టిచే నెఱిఁగి వ్యాసులు–కలిసాధువు–శూద్రుఁడు ధన్యుఁడు. స్త్రీ సాధ్వి–ధన్యురాలు. వారికంటె ధన్యతరుఁ డెవఁడు అని గట్టిగఁ జెప్పి ముమ్మాఱు మునిఁగి యొడ్డునకు వచ్చి యోహో ఋషీశ్వరులారా! యెప్పుడు వచ్చితిరి? ఏల వచ్చితిరని ప్రశ్నించెను.

మునీంద్రా! మేము వచ్చినకార్యము తెలిపెదము. ఇప్పుడు మీరు స్నానము చేయుచుఁ గలిసాధువు–శూద్రుఁడు–ధన్యుఁడు–స్త్రీ సాధ్వి ధన్యురాలని యంటిరే. అదియేమి? రహస్యము గాదేని వాని యర్థము వినఁ గోరెదము. అనిన వ్యాసమహర్షి యిట్లనియె.

కృతయుగములోఁ దపస్సు – బ్రహ్మచర్యము – జపము పది సంవత్సరములు చేసిన ఫలము త్రేతయందు నొకయేఁడు చేసిన లభించును. ద్వాపరమున నొక మాసమున లభించును. కలియుగమందొక రాత్రియుఁ బగలు చేసిన లభించును. చిత్తశుద్ధియు స్థిరచిత్తము గలిగి ధ్యానించిన మనుష్యుఁడు కడతేఱును. ఆ విధముగఁ ద్రేతయందు యజ్ఞము చేసినఁ గృతార్థుఁడగును. ద్వాపరమందు సదాచారముతోడి దేవతార్చనముచే యజ్ఞముచే ధన్యుఁడగును. కలియందు విష్ణునామసంకీర్తనము చేతనే తరించును. కలియుగమున నల్పపుణ్యము హెచ్చుఫలము నొందనగును. వంచనలేక కీర్తి ప్రతిష్ఠలు గోరక పుణ్యకార్యముచేయ సంకల్పించినంతన యాకార్యము నెఱవేఱుకున్నను బుణ్యఫలము తప్పదు. పాపకార్యము చేసినఁగాని దాని ఫలము గలుగదు. కావునఁ గలిసాధువంటిని.

కలియుగమున బ్రాహ్మణులు నిత్యనైతిమిత్తిక కర్మానుష్ఠానలోపమున భ్రష్టులగుదురు. వేదము వ్రతచర్య స్వధర్మముచే నార్జించిన ధనముతో యజ్ఞముచేయుట యివి బ్రాహ్మణులకు జరుగవు. అవిగాక వారు హరివిషయము గానట్టి వ్యర్థకథలఁ గాలము వృథాపుచ్చుదురు. భగవన్నివేదితముగాని యన్నము తిందురు. దంభలోభాది పూర్వముగా యజింతురు. ఏ కార్యము చేసినను వారు చక్కఁగఁ జేయవలయును. పాపభోజనములందును స్వేచ్ఛానుసారము వర్తింపరాదు. అన్ని కార్యములందును వారు విధిపరతంత్రులు. ఇంత క్లేశముచేఁ గాని వారి కుత్తమగతులు లేవు. శూద్రులకిట్టి కేళ్వశము లేదు. భోజ్యాభోజ్య పేయాపేయ నియతిలేదు. నిత్యనైమిత్తిక కర్మబద్ధులుగారు. ద్విజసేవచేతనే వారు సులభముగ సంసారము నుత్తరింతురు కావున శూద్రుఁడు సాధువంటిని. ఇఁక స్త్రీలోజారత్వములేక మనో వాక్కాయంబులఁ బతిసేవచేసి యతనికి హితముఁ గోరుచుండిరేని తత్పతులతోడ సాలోక్యము గందురు. మిక్కిలి కష్టించి ప్రాజాపత్యాది క్రతువులుచేసి యేమి లాభము నైష్ఠిక బ్రాహ్మణులు పొందుదురో యిట్టి కష్టము లేకయే యా లోకములు స్త్రీలు సాధింతురు. కావున స్త్రీలు సాధువులు ధన్యలు నంటిని అని చెప్పెను.

ఋషీశ్వరా! మే మీవిషయము తెలియఁగోరియే మీ యొద్దకు వచ్చితిమి. మా మనోగత మెఱిఁగి ప్రత్యుత్తర మిచ్చితిరి. ఇఁకఁబోయెదమని వారు పని వినిరి.

## 6. పితృశ్రాద్ధము - మార్జాలబంధనము

ఒక గ్రామంబున విద్యాధనధాన్యసమృద్ధి గల బ్రాహ్మణుఁడొకఁ డుండెను. ఈయన వేదవేదాంగ షట్ఛాస్త్రములందు నపారపాండితి గలవాఁడు. విస్తారముగ సుక్షేత్రములను సంపాదించిన వాఁడగుటచే నింట గోతముల కొలఁది నవధాన్యములు సర్వదా కొఱతలేక యవారిగ నుండెను.

ఇట్టి యీయనకు ననుకూలవతియగు భార్యయుఁ గొడుకులు గలరు. ఈయన ధాన్యసంరక్షణమునకై నాఱు పిల్లుల సాఁకుచుండెను. పాఁడిపంటయు దండిగనుండెను.

ఈ బ్రాహ్మణుఁడు తన తల్లిదండ్రులు యాబ్దికదినములందు శ్రాద్ధము[11]నకై సంపాదించిన పదార్థములను మార్జాలములు మూచుచును స్పృశించు నను తలంపుతో నా పదార్థము లపవిత్రములై పోకుండ వలయునని తలఁచి కొడుకులను బిలిచి నాయనలారా! ఈ దినము నా తండ్రి శ్రాద్ధము జరగవలయును. పిల్లుల నాఱింటిని బట్టికొనిపోయి దొడ్డిలో గుంజలకుఁ గట్టివేయుఁడని చెప్పుచుండెను. వారునట్లే కావించుచుండిరి.

ఆవలఁ గొన్నిదినములకు నా పండితుఁడు మరణించెను. ఆయన కుమారులు తమ తండ్రికి శ్రాద్ధము పెట్టవలసిన దినము ప్రాప్తించెను. అప్పుడు వారందఱు నిట్టులాలోచించిరి. తన జననీ జనకులు ప్రత్యాబ్దికమందును మన తండ్రి దొడ్డిలో నాఱు బిడాలములను బంధించి శ్రాద్ధమును బ్రవర్తింపఁజేయుచుండిరి. జనకుని మార్గము పుత్రుల కనుసరణీయము. గదా. ఆయన మహాపండితుఁడు. సదాచార సంపన్నుఁడు. ఆయనకుఁ దెలియని యాచారములు మనకేమి తెలియును? కావున మనము నాఱుపిల్లులను దొడ్డిలో బంధించియే పితృకార్యము జరుపుదమని యా పండిపుత్రు లాలోచించి యాఱు పిల్లులను దొడ్డిలోఁగట్టి శ్రాద్ధము సాగించిరి. వారి కాలమిట్లు జరిగెను. ఆవల వారికి వారిపుత్రులు శ్రాద్ధము జరుపుకాలము తటస్థించెను. అప్పటికింట నాఱు పిల్లులు లేవు. నాలుగు పిల్లులేయుండెను. అప్పుడు వారిట్లాలోచించిరి. మన తండ్రులు పిల్లుల నాఱింటిని దొడ్డిలోఁ గట్టి శ్రాద్ధము జరుపుచుండిరి. ఇప్పుడు మనయింట నాలుగు పిల్లులే యున్నవే! ఆఱు పిల్లులఁ గట్టకున్న కర్మహానిగదా యని వితర్కించి యిరుగు పొరుగు

వారింట రెండుపిల్లులను దెచ్చి యాతింటిని దొడ్డిలోఁ గట్టి శ్రాద్ధము జరిపిరి. ఇట్లు వారు చేయుచు గతించిరి. అప్పటికి వారికి క్షీణదశ ప్రాప్తించెను. మునుపటివలె నింట విశేషముగ ధాన్యము నిలువ యుండుటలేదు. కావునఁ బిల్లులును లేవు.

ఇట్లుండ తండ్రి శ్రాద్ధము దాపరించెను. అప్పుడు వారిట్టు లాలోచించిరి. తండ్రి శ్రాద్ధము వచ్చెనే! పిల్లులు లేవాయెనే! ఏమి చేయుదమా యని యాలోచింప నందు నపూర్వ బుద్ధిమంతుఁడైన జ్యేష్ఠ భ్రాత తమ్ములను జూచి యిట్లనెను. తమ్ములారా! దీనికింతవిచారమేల? భార్యలేనివారు భార్యకు బదులు రవిక రొండిని జెక్కుకొని కన్యాదానము చేయుటలేదా. విఘ్నేశ్వరపూజ చేయువారు మట్టి విఘ్నేశ్వరుని బూజించుటలేదా! అట్టులే మనము మంటితోఁ బిల్లులను జేసి శ్రాద్ధము జరుపుదమని చెప్పెను. మేలు మేలని యందఱు సంతోషించి మంటిపిల్లులను జేసి దొడ్డిలోఁ గట్టి యెట్లో శ్రాద్ధము జరిపిరి. వీరును గతించిరి. వీరి కొడుకులు శ్రాద్ధములు జరుపు కాలము వచ్చెను. అప్పుడు వీరిట్టు లాలోచించిరి. శ్రాద్ధమునాఁడు మన పెద్దలు దొడ్డిలో మంటి పిల్లులను గట్టుచుండిరి. కలవారు కావునఁ బెద్దల పేరు చెప్పి కూరలు–పచ్చళ్లు–వడలు లోనైనవి దండిగఁజేసి యితరులకుఁబెట్టి తామును గడుపారఁ దినుచుండిరి. ఇప్పుడు మన కంతటి శక్తిలేదు. పిల్లులను దొడ్డిలోఁ గట్టుటేకదా శ్రాద్ధముపెట్టుట. దానికి లోపము లేకుండ జరుపుదము. భోజనవిషయమా మనమొకరిని బిలిచి షడ్రసోపేతముగఁ బెట్టజాలము. కావున మన యింటివారము మాత్రము మనకు దేవుడిచ్చినంత చేసికొని తిందము. అని నిశ్చయించి యాఱు మట్టిపిల్లులను దొడ్డిలోఁ గట్టి తాము మాత్రము భుజించిరి. ఇట్లు కొన్నాళ్లు జరుగనొక బ్రాహ్మణుఁడు వారింటికివచ్చి యయ్యా! మీయింటికి నేఁడు భోజనమునకు వచ్చెదనని చెప్పెను. అప్పుడా గృహస్థు "నేఁడు మా యింటఁ బితృకార్యము

చాలఁ బ్రొద్దగును" అని చెప్పెను. అట్లైన నాకింత బియ్యము బేడలు నిండు; నేనొకచోట వంటచేసికొని తిందునని చెప్పి యవి వారీయగా తీసికొని వంటచేసికొని భుజించి యా యింటిలోనే యరుఁగు మీఁదఁ బండుకొనెను. మధ్యాహ్నము కాఁగానే యింటిపెద్దవాఁడు తమ్ములను బిలిచి 'తమ్ములారా' నేఁడు మన తండ్రి శ్రాద్ధదినముకదా! దొడ్డిలోఁ బిల్లులను 'కట్టివేయుడని' చెప్పెను. వారు నట్టులే యాఱు మంటిపిల్లులను దొడ్డిలోఁ గట్టిరి. ఆవలనందఱు నింటిలో భోజనము చేసిరి.

పండుకొనియుండిన బ్రాహ్మణుఁ డిదియంతఁ జూచి యిట్టు లాలోచించెను. వీరు నేఁడు తమ తండ్రి తద్దినమనిరే! నిమంత్ర బ్రాహ్మణులు వచ్చినవారు కారు. మంత్రములు పఠించిన జాడలేదు. శ్రాద్ధము నాఁటిచిహ్నముల నొక్కటియుఁ గానరాదు. తండ్రి తద్దినమని దొడ్డిలోఁ బిల్లులను గట్టివేయుమనిరి. ఇదియేమియో తెలిసికొందమని యా బ్రాహ్మణుఁడా గృహస్థులఁ బిలిచి మీ జనకుని శ్రాద్ధమంటిరే! ఏల జరుపలేదు అని ప్రశ్నించెను. అప్పుడు వారు కోపించి ఏమయ్యా యిట్టులనెదవు? మేము తండ్రితద్దినము మానునంతటి భ్రష్టులమా, బ్రాహ్మణులము కామా? మాకుఁ బితృభక్తి లేదా? వలసినచోఁ జూడఁబొమ్ము. దొడ్డిలో నాఱు మంటిపిల్లులను వరుసగఁ గట్టితిమో లేదో యనిరి.

తద్దినమేమి? ఆఱు మంటిపిల్లులఁ గట్టుటయేమి? యని బ్రాహ్మణుఁ డడిగెను.

నీ వెన్నఁడు తద్దినము పెట్టిన బ్రాహ్మణుఁడవు గావు. కావున నీకుఁ దెలియదు. ఎద్దిన మాఱుపిల్లుల దొడ్డిలోఁ గట్టుదురో యానాఁడు తద్దినము. బ్రతికిన పిల్లులు దొరకలేదు. కావున మంటిపిల్లులఁ గట్టితిమని యా యింటి విప్రకుమారులనిరి. అతిథిగావచ్చిన బ్రాహ్మణుఁడు దీనికేదో కారణముండవలయునని యిరుగుపొరుగువారల విచారించి తెలిసికొని యా గృహస్థులను నొకనాఁ డుపవాసముంచి యావల యథావిధి తిథి ప్రవర్తింపఁజేసి పోయెను.

ఇప్పటి మనవారి యాచారములు-మడుఁగులు-ఉపవాసమునాఁటి ఫలహారములు నీగతికే వచ్చినవి.

## 7. భక్తిలక్షణము

శ్రీరంగమందు భట్టరువారని యొక వైష్ణవ గురువులుండిరి. వీరియందు నపార పాండిత్యమేకాక భక్తియు నతిశయించి యుండెను. ఇట్లుండ నొకనాఁడు వీరి శిష్యుఁడొకఁడు వచ్చి 'స్వామీ నాకుఁ దిరువారాధనక్రమము నేర్పుఁడని ప్రార్థించెను. అట్టులే కానిమ్మని వారు తత్క్రమమంతయు సాంగోపాంగముగ వ్రాసియిచ్చి యీప్రకారము చేయుచుండుమని' బోధించిరి. ఆ శిష్యుఁడును దానిని గొనిపోయి దానిలో నున్నప్రకారము చేయనారంభించెను. ఈ దేవపూజచేయుటకు మూఁడు గంటలకాలము పట్టుచుండెను. అయినను విసుఁగులేక చేయుచుండెను. ఆవలఁ గొన్నినాళ్లకు మరల గురువును దర్శింప శిష్యుఁడు పోయెను. ఆ సమయమున భట్టరువారు తిరువారాధనచేయు క్రమమును జూఁడగాఁ గాలుగంటలో వారు సర్వము ముగించుచుండిరి. వారము దినములుండి చూచినను బ్రతిదిన మట్లే జరుగుచుండెను.

అదిచూచి శిష్యుఁడిట్టు లాలోచించెను. ఇదియేమి? నాకుఁ దిరువారాధనక్రమము మూఁడుగంటలు పట్టునంత వ్రాసియిచ్చిరి. తాము పాతికగంటలో సర్వము ముగించుచున్నారు. వారికొక క్రమము నాకొక క్రమమా? అడుగవలయునని తీర్మానించుకొని యొకనాఁడు స్వామీ! మీరు నాకు వ్రాసియిచ్చిన తిరువారాధనక్రమము ప్రకారము జరపిన మూఁడుగంటల కాలము పట్టుచున్నది. అట్టిదానిని మీరు కాలుగంటలో ముగించుచున్నారే. అది యెట్లు? అని ప్రశ్నించెను.

అప్పుడు భట్టరువారు రేపు నీవు మాయింటికి భోజనమునకు రావలసినదని శిష్యునితోఁ జెప్పిరి. ఆయనయు నట్లే చేసెను. అంతకు

ముందే భట్టరువారు వంటవానితో మా కిరువురకు నేతికిబదులు వేఁపనూనె వడ్డింపుమని చెప్పిరి.

గురుశిష్యు లిరువురు భోజనమునకుఁ గూర్చుండిరి. పప్పన్న మిరువురు కలిపిరి. వంటవాడువచ్చి యిరువురకు వేఁపనూనె వడ్డించెను. భట్టరువారు ముఖవికారమైన లేక సాపడిరి. శిష్యునకు మొదటి కబళము లోపలికిఁ బోయినది కాదు. భట్టరు వారు తక్కిన వ్యంజనము లన్నియు వేఁపనూనెతోనే భుజించి మజ్జిగ వేయించుకొనిరి. శిష్యుడు మొదటి కబళమైన నోరనుంచుకొనక గ్రుడ్లు మిటకరించుచుండెను. అప్పుడు భట్టరువారు శిష్యునివంకఁ దలయెత్తి చూచి యేమి? యట్లు కూర్చున్నవాఁడవు. సాపాటు చేయరాదా యనెను. "వంటవాఁడు వేఁపనూనె వడ్డించెను. తినలేక యున్నాను" అనెను. ఏమి వడ్డించితివిరా? అని భట్టరువారు వంటవాని నడిగిరి. బంతిలోఁ బక్షము పనికిరాదని మీకు వడ్డించినదే యాయనకు వడ్డించితినని వాడు బదులు చెప్పెను. అప్పుడు భట్టరువారు శిష్యునితో నిట్లనిరి.

నాయనా! నీ మనస్సు తిను పదార్థములపై నున్నది. కావున నిది రుచిమంతమని యిది సువాసనయని యిది దుర్వాసన యని నీకుఁ దెలియుచున్నది. నాకు మనస్సు భగవంతునిపై నున్నది కాని తిండిమీఁద లేదు. ఆ కారణముచే నేమి తినుచున్నానో తినునవి యెట్టి రుచి వాసన గలవో నాకుఁ దెలియలేదు. మన కిరువురకు భేదమింతయే. నాకు సర్వకాల సర్వావస్థల మనస్సు భగవంతునిపై నుండుటచే నేను తిరువారాధన చేసి మేలులేదు చేయకున్న దోషము లేదు. జపతపోనుష్ఠానములు స్నానసంధ్యాది నిత్యనైమిత్తిక కర్మములు మనస్సు భగవంతునియందు నిలుచుటకై చేయు నుపాయములేకాని యితరములు గావు. మనస్సు భగవంతుని యందు నిలుకడ నిలుచువఱకు నవి కృత్యములు. ఆవలఁ జేయ బనిలేదు. అట్లైనను నేను బొత్తిగ మానితినేని మీ యిట్టివారు తత్త్వమరయలేక మీ గురువులవారే

తిరువారాధన చేయుట లేదే నేనేల చేయవలయునని మానుదురు. ఆ కారణమున భ్రష్టులగుదురు. కావున మీరు చెడకుండుటకై మేము చేయవలసి యున్నది. సర్వకాల సర్వావస్థల నీ మనస్సు భగవంతునిపై నెప్పుడు స్థిరముగ నిలుచునో యప్పుడు నావలెనే నీవును జేయవచ్చును. ఈ లోపల మానితివేని చెడుదువు సుమా యని హితముపదేశించి పంపెను.

### 8. కామము - భక్తి - లీలాశుకుఁడు

లీలాశుకుఁడను బ్రాహ్మణుఁడు పూర్వ వయస్సున మిగుల వేశ్యాలంపటుఁడు. గుణవతి – రూపవతి – శీలవతియగు నతని భార్య కన్నుల వేఁడినీరు ధారలై కాఱఁ బైటచెఱఁగు నేలఁ బఱుచుకొని భర్తయొల్లని నాకుఁ దల్లీ! సీతకువలె నీవే దిక్కని యామెను గౌఁగిలించుకొని యౌవనము వనమునఁ గాచిన వెన్నెలయైపోవ రాత్రులందుఁ బరుండఁ దాను వివాహకాలమునఁ దన భార్యకుఁ జేసిన ప్రమాణము వఱదఁగలిపి పశువులతోను వేశ్యలతోను రమించువాఁడు, ప్రాజాపత్య వ్రతముఁ జరిపింపవలయునన్న సూక్తిమఱచి వేశ్య స్మశాన కుసుమమువలె మర్జనీయయను నార్యోక్తి తలఁపక, కన్నవారి యెంగిళ్ళకు మూకుడైన వేశ్యవాతెఱ తనపాలికి గండకత్తెర యని యెంచక, "కలకంఠకంఠి కన్నీరొలికిన సిరి యింటనుండ నొల్లదు సుమతీ" యను సుమతి వాక్యమును మతినిలుపక సదాచారము పదటఁ గలిపి, వార స్త్రీహృదయములు విషసదనములనియు వారి మాటలుమాత్రము తేనె తేటలనియు, సింగారములు కారాగారము లనియుఁ దలఁపని నీచునికంటె బాపాత్ముఁడు వ్యర్థజీవి యిహపరలోక దూరుఁడు అవిశ్వసనీయుడు, దురాచారుడు, మఱియెవఁడు.

**చ. వినఁ దని రోయ, రంధుఁడని వీఁగరు, తుదిలుదంచు గేలిగాఁ**
**గొనరు, వికర్ణుఁ దంచుఁదగఁ గూయరు వామనుఁ దంచుఁ బోరు, దు**

**ర్మనుఁడని పాయ, రజ్ఞుఁడని మానరు, నిష్ఠురరోగపీడితుం**
**డనరు, కునిష్ఠుఁ డంచుఁ జెడనాడరు భోగిను లర్థవంతునిన్**

అనుట స్ఫురణకు రానీయక తమ యౌవన ధనములను వేశ్యయనెడు మదనజ్వాలయందు హెూమముచేసెడు మతి హీనునకు, మంటయందుఁ జొఱఁబాఱు మిడుతకు భేదమేమి?

చ. **తలపుల్ చిచ్చులు, మాట లుజ్జ్వలసుధా ధారల్ విభుండైన బు**
**వ్విలుతున్ మెచ్చర, యన్యులన్ వలతురే, విశ్వాసముల్ లేవు, క్రూ**
**రల పొత్తున్ బతినైనఁ జంపుదు రధర్మల్ నిర్దముల్ చంచలల్**
**వెలయాండ్రెక్కఁడ? వారి లేబరము లా వేదాంత సూక్తంబులే**

యను భాగవతసూక్తి ముక్తాఫలంబున రక్తిలేని వాఁడు ముక్తియం దాసక్తి లేనివాఁడేకదా?

ఉ. **చీఁకటి తప్పునం బరులచేడియలన్ రమియించి దూతికా**
**లోకము మాట తీపులకు లోపడి భీత్యభిమాన లజ్జలన్**
**బోకడఁబెట్టి ప్రాణమొకపోకకుఁ గైకొనకుండు సాహసుల్**
**పైకొని చేరి తన్నుభయపార్శ్వములం గడుభక్తి గొల్చిరాన్**

లోకసంచారము గావించు నించువిలుకాని సేవించు క్రించులలో లీలాశుకుఁడును జేరి చింతామణియను వేశ్యచేతి లీలాశుకమై కాలము ద్రోయుచుండెను.

అతఁడు మంచు ముంచినను వానలు దోనెలంత ధారలైనను, బిడుగులుపడుచున్నను భీమనదిని దాఁటి యావలి యొద్దనుండు చింతామణి యింటికిఁబోని రాత్రిలేదు. ఏకాదశులైనను శివరాత్రులైనను, బర్వములైనను మాతాపితృశ్రాద్ధంబులైనను, జింతామణితో రమింపని రేయిలేదు. ఇట్లుండొక నొక యంధకార బంధురంబైన రాత్రియందుఁ బాములు వ్రేలాడఁగట్టినట్లు ధారలు రాలుచుండెను. ఉఱుములుఱుము

చుండెను. గర్భిణుల గర్భములు స్రవింప భీరువుల గుండెలు పగులఁ బిడుగులు పడుచుండెను. రణమునకై పోవుశూరునివలె, మరణమునకై పోవు పరీతకాలునివలె, కామరణమునకై యతఁడు పయనింప సమకట్టి ముసుఁగుపెట్టి చక్కఁబోయెను. అప్పటికి భీమరథిపొంగి రెండొడ్డు లొరయ భీమవేగంబునఁ బాఱుచుండెను. కన్ను కట్టుకున్నను ద్రోవ కానరాదయ్యెను. మెఱపుల మెఱుగుల దెఱసిచూపునిరులలోఁ బోయినదే త్రోవగాఁబోయి యా నదీతీరముఁజేరి దాఁటుట యెట్లాయని యాలోచించుచుండఁ దళుక్కని మెఱుఁగు మెఱయఁ దానున్న చోటన యొక మొద్దువలె నేదో యొకటి కనరానదియే తెప్పకొయ్యయని తలఁచి యాసాహసికాగ్రణి దానిపై నెక్కి యెట్లెట్లో వానిభార్య మంగళసూత్రబలమున నావలి యొద్దుచేరి చూడఁ దానెక్కి వచ్చిన యది ముసలిగాని కొయ్య మొద్దుగాదని తెలిసికొనెను. ప్రవాహము పాలై పోకుండుటకును, మొసలివాతఁబడక యుండుటకు భగవంతుని స్మరింపక, భగవత్కృపయని యైనఁ దలంపక కామాంధకారమున మునిఁగియుండువానిని వెలిచీఁకటి యేమి చేయఁగలదు? కావునఁ దెంపరియగు నాకాముకుఁడు దరిచేరి ప్రియురాలి కౌఁగిట! జేరితిని, ధన్యుఁడ నైతిని తనయందు నాకెంత వలపుండునది నేఁడుగదా నా ప్రియురాలు కాంతామణియైన చింతామణి యెఱిఁగి నా పాలికిఁ జింతామణియై యత్యంత సౌఖ్యముంగూర్చు. ప్రియురాలికై ప్రాణమియ్యలేని వాని కామమొక కామమా? మోహమొక మోహమా? వలపొక వలపా? యని యా మూఢుఁడు దన్నుఁదాను శ్లాఘించుకొనుచుఁ జీఁకటిలోఁ బోయిపోయి చింతామణీభవనముఁ జేరెను. ఆహా కామమెంత బలిష్ఠమైన వ్యాధియోకాని కన్నులు కానరావు. కానవచ్చినను నొకపదార్థము మఱియొక పదార్థముగాఁ గానవచ్చును. వీనులు వినరావు. మతిబలము తగ్గును. కామజ్వరబలమున నోటిరుచియుఁ జచ్చును. కులాభిమానము ఆత్మగౌరవము చెడును. మాతాపితృభార్యలు ద్వేష్యులగుదురు. తనయగారమే తనకుఁ గారాగార మగును. నరకమార్గమైన లంజయిల్లు స్వర్గముగఁ

దోఁచును. కామమే క్రోధమునకుఁ దల్లి. క్రోధమువలన సమ్మోహము జనించు. సమ్మోహమువలన స్మృతిచెడును. స్మృతి చెడుటవలన బుద్ధి నాశనమగును. బుద్ధి నాశమువలన సర్వవిధముల నశించును. కావుననే మనుష్యులకుఁ గామమువంటి శత్రువులేఁడు. కామము జయించిన వాఁడు ముల్లోకములను జయించును.

ఇట్లా కామదాసుఁడు చింతామణి సదనంబుఁజేరి చూడఁగవాటంబు లన్నియు బంధింపఁబడి యుండెను. అప్పుడా విటుఁడిట్లాలోచించెను. ఆహా నా ప్రియురాలెంత నిర్దయురాలో చూచితివా? నేనెట్లులైన వచ్చెదనని యెఱిఁగి యెఱిఁగి యీ తెఱవ యొకవాకిలి యైనఁదెఱచి యుంచదయ్యె. నాచే లంచములుగొను నొక పరిచారికయైన నాకై యెదురుచూచు చుండదయ్యె. దీపమైనను గానరాదు. తలుపెంత తట్టినను మాఱు శబ్దములేదు. ఏమిచేయుదును? అని తలపోసి మరల నిట్లు చింతించెను.

నిర్దోషురాలియందు దోషమెంచు నేనే పరమ దుష్టుఁడను. దానియందేమి దోషము గలదు. అర్ధరాత్రముదాటెను. కన్నులు గానరాని చీఁకటి. వర్షమా బిందెలతోఁ గ్రుమ్మరించినట్లు సంతత ధారాపాతము. గాలియా ప్రళయ ఝంఝూమారుతమువలె వీచుచున్నది. ఇట్టి స్థితిలో మనుష్యుఁడగు వాఁడెవ్వఁ డేఱుదాఁటి చిమ్మచీఁకటిలో వచ్చునని నమ్మవచ్చును? నన్నుఁ బదుగురిలోఁ బదునొకండవవానిఁగా నెంచెనుగాని తనయందు నా కెంతప్రేమ యుండునది యాలోచించినదికాదు. నేనెంత పిలిచినను దలుపు తట్టినను నీ గాలి వానలో గాఢనిద్రయం దుండువారి కెట్లు వినవచ్చును. అట్లని యింతదూరము వచ్చి యూరకుండవచ్చునా? యని యా మేడకు నాలుగు వంకలఁ దిరిగి యొకచోఁ గిటికీనుండి వెలుతురు కానవచ్చుటయు నా మార్గమున లోపలికిఁ బోవయత్నించి యందుఁ జేతితోఁ దడవఁ ద్రాడువలె నొకటి చేతికి దొరకెను. దానిఁ బట్టుకొని యెక్కి పై మేడకుఁబోయి దీపము వెలుతురునఁ జూడ నది త్రాడుగాదు, పెనుఁబాము. వీఁడు తోఁక పట్టుకొనఁగానే యక్కడనుండి

పడుదునను భీతిచే నదిగట్టిగ పడగతో నినుపకమ్ములఁ బట్టుకొనెను. వీఁడు లోపల దుముకఁగానే తనకుఁ బ్రాణగండము తప్పెనని యది పారిపోయెను. ఆ పామునుజూచి దైవకృపవలన నా ప్రియురాలికి నా భాగ్యమునకు నా పరదేవతకు గండము తప్పెను. నేను రాకున్న నా సతీరత్నమును నావిసపు పురుగేమి చేసి యుండునో ఈ మూఁడవ సాహసముచేతను నా వల్లభ నన్నెక్కువగఁ బ్రేమించును.

అని సంతోషంబున నుప్పొంగుచుఁ బోయి శయ్యాతలంబున సుఖనిద్రచేయు నా* పురమండనముపై చేయి వైచెను. అది యులికిపడి లేచి నీరుకారు మేనితో యమకింకరుఁగన్న పాపాత్మునివలె గడగడ వడఁకుచున్న యా బ్రాహ్మణకుమారుఁ జూచి కట్టుకొన వేఱు వస్త్రమిచ్చి కూర్చుండఁ బెట్టుకొనెను. అప్పుడా పడఁతితోఁ నిట్లునుడివెను.

ఓ ప్రియురాలా! నీ వెంతటి నిర్దయురాలవు. నిర్మోహవు. వలపు లేనిదానవు. ఇట్టి కారుచీఁకటిలో గాలివానలో నా ప్రియుఁడు వచ్చునుగదా వేచియుందమని తలఁపవైతివి కదా? వాకిలియైనఁ దీసి యుంచవైతివి గదా! వాకిట దీపమైనఁ బెట్టవైతివిగదా. నేను బ్రక్కన లేకున్న నీకెట్లు నిద్దురవచ్చెను? కన్నులెట్లు మూఁతవడెను. నీకై నేనెంత సాహసముచేసి వచ్చితినో యెఱుఁగవైతివిగదా?

చిమ్మచీకఁటి–గాలివాన–ఒడ్డరసి పాఱు నదీప్రవాహము–మొసలి తెప్ప–సర్పరజ్జువు నని తన పడిన ప్రయాసము–చేసిన సాహసము లన్నియుఁ జెప్పి నా పుణ్యోదయమెట్టిదో నీ ప్రాణము రక్షింపఁ గలిగితిని. నిన్నుఁ గన్నారఁ జూడగలిగితిని. చిలుకపలుకులవంటి నీ ముద్దులపలుకులు వినఁగలిగితిని. నిన్నుఁ గౌఁగిలింపఁ గలితిని. ఈ రేయి వ్యర్థము పోకుండఁ జేయుటే భగవంతునకు నాయందుఁ బరిపూర్ణాను రాగము గలదని యెఱింగితినని న్యాయ్యనిష్ఠురములాడెను.

---

* పురమండనము= వేశ్య

అప్పుడు గుణవతియు సుమతియు సత్స్వాంతయు నగు నక్కాంత యా బ్రాహ్మణునితో నిట్లనియె.

బ్రాహ్మణోత్తమా! నాయందలి నీ ప్రీతి యద్వితీయము. సందేహము లేదు. నా ప్రాణసంక్షరణముఁ గావించిన వాఁడగుట నేను నీ పట్ల సర్వదా కృతజ్ఞురాలనై యుందు దానను. కాళరాత్రివంటి యిట్టి రాత్రి మనుజుఁ డెవ్వడు మట్టాడును? నీ వెట్లు రాగలవని తలంచుటఁజేసి నేను గాచియుండమి నా తప్పే. నమస్కరించెద. క్షమింపుము. నేను సామాన్యనగుట ధనముగల యందఱ సొత్తు నగుదునుగాని నేనొక్కని సొత్తుమాత్ర మెన్నడునుగాను. నేను వెలియాలినగుట తలఁపవా? నేను గృహిణినా?[12] నా మెడను మంగళసూత్ర మెవ్వఁడైన నీవు నా సొత్తని కట్టెనా? అగ్నిసాక్షికముగ ధర్మార్థకామముల నిన్ను నతిక్రమింపనని యేమగవాఁడైన నా విషయమునఁ బ్రమాణము చేసెనా? అట్టి నీవే బ్రాహ్మణుడవయ్యు శూద్రనగు నాతో రమింపవచ్చితివికదా? అయ్యా విప్రోత్తమా? నీపై జాలిపుట్టి చెప్పుచున్నదానను. అన్యథా తలంపకము. నామాటలు చెవియొగ్గి వినుము. తత్త్వము కనుము. ఇంత ప్రాణగొడ్డమైన కార్యములుచేసి వచ్చితివికదా. దేనికై వచ్చితివి? నీకైయని యందువా? నాయందుండు దేనిపై మోహముపడి వచ్చితివి? నా ముక్కుమీఁద మోహమా? ముఖముమీఁద మోహమా? నా చేతులపై మోహమా? నా కాళ్ళపై మోహమా? నా చర్మముపై మోహమా? కాదుగదా. నా మూత్రపాత్రము గదా నిన్నింత ప్రాణాంతక కార్యము చేయఁ బ్రేరించినది? అది నీకియ్యఁగలది యేమాత్ర సుఖము? ఆ సుఖము క్షణభంగురమేకదా? శాశ్వతము కాదుకదా? ఇంతకు నదిసుఖమా? గజ్జి లేచినవాఁడు దురదకై గీఱుకొను సుఖమునకు దీనికిఁ దారతమ్య మెంతో చెప్పదవా? మోహకారణమున దానిని నీవు సుఖమని భ్రమించెదవుకాని వాస్తవముగ సుఖము గలదా యని సంగమవేళ నాలోచించిచూడుము. గుట్టురట్టగును. ప్రత్యక్షముగఁ జూచిన సర్వాసహ్యమై, పాపకార్యములకు బ్రేరకమై

యుండుటచేఁ గదా స్త్రీలు దానిని గుడ్డలమడఁతల గప్పిపెట్టుట. అట్లు గాకున్నఁ గన్నులు లోనగువానివలె నేల బహిరంగ పరుపరాదు? గుడ్డవిడిచిన మానము పోవునన నేమి యర్థము. సర్వాసహ్యమైన దానియున్నరూపు దెలిసినయెడ దానిపై గౌరవము తగ్గును. రహస్యము వెలువడునని యేకదా? ఆవల దాని నెవఁడాశించును? పురుషులు దాని నాశింపరేని స్త్రీలగతి యేమి? కావుననే యీ దాపరికము. అటుగాక దానియందు గుణము సుఖము గలవనియే యంగీకరింతునుగాని యట్టిది నీ భార్యయందు లేదా. దానికి దీనికి నేమైన భేదముగలదా? ఇది యిచ్చు సుఖ మది యియ్యఁజాలదా? ఇంత సాహసముచేసి యిన్ని గండములు తప్పించుకొని వచ్చితివిగదా. నడుమఁ బ్రాణాపాయమైయుండినఁ దొలుత నీ గతియేమి? ప్రాణాంతకాలమున దేనిని స్మరింతురో యా జన్మమే వచ్చునని ప్రమాణము కలదుగదా. మనస్సంతయు దీనిపైనుంచి ప్రాణమువిడుచు నీవు మఱుజన్మంబునఁ దీనియందుఁ గ్రిమియయికదా పుట్టుదువు? రామరామ! మనుష్యునకు నందు బ్రాహ్మణునకు నింతకంటె నికృష్ట దశ వేఱొండుండునా? పాపము చేసినవాఁడవు నీ వనుభవించుట టటుండనిమ్ము. నీచే భరింపఁ బడవలసిన దగుటచే భార్యయై ధర్మార్థకామముల నన్ను విడువనని నీవు చేసిన ప్రమాణమునమ్మి. నీకర్ధాంగలక్ష్మియై నీ సుఖదుఃఖములను సమానముగఁ బంచుకొని, నీ సుఖమే తన సుఖముగను, నీ దుఃఖమే తను దుఃఖముగను నెంచుచు, నీ కూర్ధ్వలోక సుఖములఁ గలిగించు పుత్రులఁ గనవలసినదై యుండు నీ భార్యగతి యేమి? నీ భార్య సమస్త సుఖములు నీతో సరిగదా. నీకై త్రెంచునది నీ భార్యయేగదా. నీ యనంతరము నీ భార్య పరులయింట దాసికదా? ఎంతటి యల్పసుఖమైన నాశించు నదృష్ట మామెకు లేదుగదా? తుదకు రెండుపూటలఁ గడుపునిండఁ గుడుపును లేదుగదా. క్షణమునకు బూర్వమామె యెదురుగ వచ్చిన శుభశకునమని సంతోషించువారావల నపశకునమని యీసడింతురు

గదా. నిన్ను నమ్మి నీ భార్య యైనందున కిట్టి యధమస్థితి నీ వనాలోచితముగ దుర్వ్యాపారముచేఁ గలిగింపవచ్చునా? అది పాపకార్యము కాదా. నాకేమి? నీవు పోయిన నీ యట్టివారు నూర్వురు వత్తురు. వేఁకటి నిలిచిన యౌవనము చెడునని మేము చేయు భ్రూణహత్యలలో నీకును భాగము కలదు కదా. మాసంసర్గమున సంతానము గాంచితివేని నీవు శూద్రుఁడవే కదా. అట్టి నీకు నా భార్యయందు సంతానము గలిగిన యెడల వారు చండాలురే కదా యగుదురు. నీకై నీ యింట నీ భార్య గార్చు కన్నీటిబొట్టు లనుకొనుకుము. నరకమున నిన్నుఁ గాల్చునగ్నికణము లనుకొనుము. అటుగాక నాకై నీవు ప్రాణమిచ్చిన నీకేమి పేరా ప్రతిష్ఠయా? బ్రతికినన్ని దినాలు బ్రతికి బోగముదాని పంచనఁ జచ్చెనన్న సామెతయే కదా నిజమగును. పక్షికై దేహమిచ్చిన శిబివగుదువా? సీతకై ప్రాణమిచ్చిన జటాయు వగుదువా? ఇంద్రునకు దేహము కోసి యిచ్చిన కర్ణుఁడ వగుదువా? పాపమునకై ప్రాణ మియ్యఁబూనిన జీమూతవాహనుఁడ వగుదువా? దేవతలకై చచ్చిన దధీచి వగుదువా?

అయ్యా! నీ విషయమున నా మనస్సు మిగులఁ బరితాప పడుచున్నది. కావున హిత ముపదేశించెదను. నీవు శాస్త్రము లన్నిటిని జదివితివి. వేదముల వల్లించితివి. మంచి వంశమునఁ బుట్టితివి. ఆలోచించి చూడుము. నీకీ మోక్షమున మోక్షము లేదు. నీయందొక యమూల్య వస్తువు గలదు. అది ప్రేమ. అందు నీ యందుండునది యనన్య ప్రేమ. అనన్యప్రేమయే భక్తి. అనన్య ప్రేమవలననే ముక్తి అయినను నీ యనన్యప్రేమ భగవంతునియం దుంచవలయును. ఈ ప్రేమ ప్రాకృత పదార్థములం దుంచితివేని ప్రకృతి మండల మందే సంసార శృంఖలా[12] బద్ధుండవై యల్లాడుచుందువు. అప్రాకృత వస్తువునం దుంచితివేని ప్రకృతి కతీతుఁడైన భగవంతుని సన్నిధానముఁ గాంతువు. నీయందు నాకుఁ బ్రేమ జనించుటకు నీ సౌందర్యము కారణ మందువా? అటయిన నాకీ సౌందర్య

మెందుండి వచ్చెను? లోకములోని సౌందర్యము నంతయు మూటకట్టి యొకచోట నుంచినను భగవంతుని సౌందర్యమున నొక న్యర్బుదాంశమైన నగునా. ఆయన సౌందర్య లేశచ్ఛాయగల నేనే సుందరి అయినచో పుంసాంమోహన రూపాయ యన్నట్టు మహాయోగీశ్వరుఁడు స్థాణువునైన శివుని సాక్షాన్మథ మన్మథుఁడు, మోహింప జేసిన సౌందర్యము గలవాఁడు. జితేంద్రియులైన మహామునులును గౌగిలింపఁ గోరిక కలిగించువాఁడు నైన నారాయణుఁ డెంత సుందరుఁడై యుండవలయును? ఆయన ప్రేమైక సాధ్యుఁడు. అట్టిప్రేమ నీసొత్తైయుండ నీవు కోరినచోఁ బ్రయత్నించినచో నీకాయన తన దివ్యమంగళ విగ్రహమును గనిపింపఁ జేయకుండునా? పైవన్నియ పూసిన పేఁడబొమ్మకు నాకు భేదమేమి? పైవన్నియ మాత్రమేకాని లోపల నేమున్నది? మలము-మూత్రము-ఎముకలు-మాంసము నెత్తురు-క్రొవ్వు-ఇవియేకదా. వీనిని వేఱు వేఱుఁ జూడుము. సుందరములా? ఇట్టి మలభాండముపైఁ బ్రీతినుంచిన నగు లాభమేమి? కాముఁడు రాముఁడు నొకచోనుండరు. ఆ కామమైనను ధర్మవిరుద్ధమైన యెడల నంతకీడు లేకుండునేమో కాని ధర్మవిరుద్ధ చరిత్రలమగు మా యందుంచినఁ గీడుకాక మఱి యేమి మూఁడును. లంజ శబ్దమునకు నర్థమేమో యాలోచింపుము. ఎట్టి కర్మ చండాలునకైనఁ గాసునకై మానమమ్ము మా బ్రదుకొక బ్రతుకా? మావలన నెందఱారోగ్యహీనులై శవప్రాయులై, నిర్ధనులై, సుఖదూరులై యల్లాడుచుందురో యెఱుఁగవా? ఎన్ని కుటుంబములు మావలన నాశము లయ్యెనో లెక్కింపఁ గలవా? మావలన దుఃఖ మనుభవించు కులసతుల కన్నీళ్ళు కొలిచిన నేడు-కాదు కాదు పదునాలుగు-మహాసముద్రము లగునేమో, దంధనమగు ధనమునకై మేము చేయని పాపకార్య మేది గలదు? మందులు పెట్టుదుము - చంపింతుము - ఇఁక దక్కిన కార్యముల లెక్కయేల?

పతివ్రతల పాతివ్రత్యము రక్షించుటకై మాకీవృత్తి పూర్వులు నియమించిరి. నీచజాతి స్త్రీలమగుట మానమునందు మాకు లక్ష్యములేదు.

కామము దుర్నివార్యము. భార్యలఁ గోలుపోయి మరల వివాహము చేసికొన సాధ్యపడని విధురులును, రోగులు–సంధులు–లోనగువారు వివాహ యోగ్యులు కాకున్నను గామము నణఁప శక్తిగలవారగుదురా? అందు ధనమున్నచో వారు కామము నణఁతురా? కామము దుర్నివార్యముకదా! అట్టివారికిఁ గామము దీర్చు మాయట్టి స్త్రీలు లేకున్న సంసారములుచేయు కులసతులను, విధవలను, బుట్టినింట దీర్ఘకాలముండు నాఁడు పడుచులను, రోగుల భార్యలను, దరిద్రుల దారలను, కురూపుల పెండ్లాలను, స్వతంత్రలను మఱియు నిట్టివారిని ధనాశచూపి చెఱుతురు. అట్టివారిపై వారికి మనస్సులు పోకుండుటకై యేవేవో సొగసులు చేసికొని తిరుగుచుందుము. మేము ధనాదాసికలము. వారు కామదాసులు. ఈ విధముగఁ గులాంగనలు మాచే రక్షింపఁబడు చున్నారు. ఇంటికి మలమూత్రవిసర్జనమునకై దూరము పోలేని వారికి దొడ్డి యెట్టిదో జనసంఘమునకు మే మట్టివారము. అట్టి దొడ్డి లేకున్న నిల్లంతయుఁ బీతిరి దొడ్డియగునట్లు మేము లేకున్న కులస్త్రీలందఱుఁ గులటలే యగుదురు. కాముకులు తత్కాల కండూతి నివారణార్థమై మమ్మాశ్రయింతురుగాని నిజమైన వలపు వారికిని లేదు, మాకును లేదు. నీ వట్టి వాఁడవగుగావు. కావున నీవు చెడనొల్లక హిత ముపదేశించెదను. భక్తులయందుండవలసిన యనన్య ప్రేమ భయ, లజ్జాభిమాన హీనతయుఁ జితైకాగ్రత్వము–మైత్రి–కరుణ–ధృతి లోనైన గుణములు నీయందును గలవు. ప్రేమగుణమును నాయందు నుండి తీసి భగవంతుని యందుంచితివా నీవు పరమభక్తుఁడవై వెలసెదవు. మధురభావము కృష్ణునందుఁగలదు. నీ చిత్తవృత్తికిఁ దగినమూర్తి శ్రీకృష్ణుఁడే. ఇన్ని సంవత్సరములు వ్యర్థపఱచితివి. చాలును–దేహము శాశ్వతముగాదు. సంసారముఁ దరించు మార్గము వెదకుము.

**చ. ధృతిగొని రోగముల్ జరయు దేహము నొంపక ముందె యింద్రియ**
**ప్రతిహతి లేకముందె, తన ప్రాణవిరామము రాకముందె, పం**

**డితజనుఁ డాచరింపదగు తీవిఁ బ్రయత్నము ముక్తికిన్ మహో**
**ద్ధతశిఖి నిల్లు కాలుతఱిఁ దాలిమి నూతులు ద్రవ్వవచ్చునే**

**ఉ. ఆయువువీచి చంచలము, యౌవనమల్ప దినోచితంబు పు**
**ష్పాయుధకేళి జన్య సుఖ మస్థిర, మర్థము వాంఛవోలె సా**
**పాయము, భోగముల్ మెఱపు లట్ల భ్రమించి భవాబ్ధిలంఘనో**
**పాయము బ్రహ్మచింతనముఁ బాయక సేయుదు సజ్జనోత్తముల్**

**చ. కదు వెఱపించుచున్ ముదిమిగద్దఱి బెబ్బులి మాడ్కి నున్న, దె**
**క్కుడు పగదాయలంబలెఁ దెగుళ్ళ శరీరము నొంచుచున్న దె**
**ప్పుడుఁ జను భిన్నకుంభజలముంబలె నాయువు లిట్టులయ్యుఁ దా**
**రుడుగక మానవుల్ దురిత మోలి నొనర్చుచునున్న వారహో**

అను భర్తృహరి వాక్యములు స్మరణీయములుగావా? నీతి వాక్యస్మరణము లటుండనిచ్చి మనకుఁ బ్రత్యక్ష దర్శనమైన దాని నాలోచింతము. మనము భోగములని తలంచు నీచీఁకటి పరువు లెన్ని దినములు? యౌవనము శాశ్వతమా? ఇదిగో మామిడిపండ్ల కాలమువచ్చెను. ఇదిగో మెల్లపూల కాలము వచ్చెను. ఇదిగో వెన్నెల రాత్రులు వచ్చెనని సంతోషింతుమే. కాని యొకసారి వచ్చినది మఱియొకసారి వచ్చులోపల నెంత కాలము పోయెనో యాలోచింపవలదా! ప్రతి సంవత్సరము మూఢులు జన్మదివసమని పుట్టినదినమున పండుగలు చేయుదురు. అంతియకాని యొక సంవత్సర మాయువు వ్యర్థముగఁ బోయెనని యాలోచింపరుగదా. నిజముగా నది బుద్ధిమంతునకు దుఃఖదినము. ఒక్క సంవత్సరకాలము వ్యర్థము పోయెఁగదా. భూమిమీదఁ బుట్టి మనమేమి పురుషార్థము[13] సాధించి నట్టని విచారపడవలసిన దినము. అదిగో సూర్యుఁడు పుట్టెను. అదిగో సూర్యుఁడ స్తమించెను. అని లోకులు సంతోషముతోఁ జూతురేకాని తమ యాయువులో నింతకాలము పోయెనేయని తలఁపరు. సూర్యుఁ డెన్నియో లక్షల యోజనము లొక్క నిమిషమున నేగునఁట. అట్లనిన నేమియర్థము. అంతవేగముగ మన యాయువు పోవుచున్న దనియేకాదా!

యౌవనము శాశ్వతమా? బాల్యముపోయి యౌవనము వచ్చినట్లే యౌవనముపోయి వార్ధకమువచ్చుట సత్యమేకదా. తలనెరిసి దంతములురాలి, దేహము ముడుతలుపడి, కనులపొరలు గప్పి, కంఠమునఁ గఘము ప్రబలి, దగ్గు–వగర్పు పుట్టికేలనూఁతకోల కొని, యడుగులో నడుగు పెట్టుచుఁ గడుపారఁ దిని కన్నార నిద్రించు కాలము పోవఁ జావున కేకారు వారిని నెందఱఁ జూడము. వారిని జూచి నేర్చుకొనవలసిన దేదియు లేదా? ఇంతకు నంతకాలము వచ్చువఱకు జీవింతుమని యేమినమ్మకము. కానరాని యాలోకమునకుఁ బోవుటే నిజమైనచో దారిబత్తెమైన మనమేమి కట్టుకొన్నట్టు? మన బత్తెము మన కొంగున లేకున్నఁ బరలోకమున మన కెవరిత్తురు?

ఎప్పుడో యేమో వచ్చునని యిప్పుడే భయపడి సుఖము మానుమనెదవా యందువేని యేది సుఖము? అది నిజముగా సుఖమా. మనయారోపితమా? లేక భ్రమయా! యాలోచింపుము. రతివేళఁ గ్రీడించునపుడు నిజముగా దీనియందు సుఖము కలదా? ఇది సుఖమా? ఎట్టిసుఖము? రొండిగజ్జి గలవాఁడు వేఁడినీళ్ళు పోసికొనుచు వాఁడిగోళ్ళతో గీయునప్పటి సుఖమునకు దీనికిఁ దారతమ్య మేమాత్రమో విమర్శింపుము.

**చ. స్తనములు మాంసపిండములు; చక్కనిబంగరు కుండలంచు నా**
**సనము కఫాలయంబు తుహిన ద్యుతితుల్య మటంచు మూత్ర భా**
**జన జఘనస్థలంబు కరిచారుశిరస్సమమంచు, గామినీ**
**జనమలినాంగముల్ సుకవి చాతురి వర్ణనకెక్కె నిమ్మహిన్.**

**మ. మలభూయిష్ఠపుఁదోలు బొమ్మయగు కొమ్మంజూచి విద్వాంసుఁడుం**
**బులినశ్రోణి[14], మనోహరస్తని, నవాంభోజాస్య, నీలోత్పలా**
**క్షి, లతాతన్వి, యటంచు మత్తుఁడగు హర్షించున్ రమించున్ భళీ**
**భళీయంచున్ వినుతించు మోహవికృతుల్ భావింపఁగా జిత్రముల్**

**చ. అల నెల కామినీ వదనమై జనియింపఁగలేదు కల్వలున్**
**నెలఁతకుఁగన్నులై యునికి నిక్కముగాదు కదానిచే నొడల్**
**వలనుగఁ జేయలేదు కవివంచిత మానసుఁడై వివేకియున్**
**మలమలినాంగనా తను సమాశ్రయుఁడై విహరించు మందతన్**

అయ్యా యీభర్తృహరి సూక్తులు సత్యములుగావా? ఇవి నీకుఁ బ్రమాణములుగావా? ఇవి నీయం దెంతవఱ కన్వయించునో చూచుకొనుము. తాఁజెడ్డ క్రోఁతి వనమెల్ల జెరిచినట్టు దుష్కవి తాను జెడుటయేగాక యసత్యములాడి యితరులను జెఱుచుచున్నాఁడు. నా కహితమైనను నీహితముఁగోరు దాన నగుటచేత వేశ్యను గావున సిగ్గువిడిచి నీకుహిత ముపదేశించెదను. వీనులు విచ్చివినుము-కన్నులు దెఱచి చూడుము. మనస్సు విచ్చి యాలోచింపుము. నిజముగా ఱొమ్ములు మాంసపిండములో బంగరుకుండలో పరీక్షింపుము. ఒక కవి స్త్రీల కుచములు కుండలనఁగా వేఱొకఁడు గుండులనెను. మఱియొకఁడు కొండలనెను. ఇంతకంటెను భ్రాంతచిత్తులు వేఱొకరుందురా? ఇట్టి భ్రాంతచిత్తులవాక్యములు నమ్మి కామమత్తులగువా రెంతటి యున్మత్తులోకదా-ఇట్టివి తమకును రెండండములు కలవుకదా వానినేల గుండులని-కుండలని-కొండలని వర్ణించుకొని యానందింపరాదు. వారు మాయంగముల వర్ణించినట్లు మేము వారి యంగములను రోఁకండ్లని-కాఁడిమ్రాఁకులని-ధ్వజస్తంభములని, తాటిచెట్లని వర్ణించిన వారెంత యానందింతురో ఏ స్త్రీ వీరిని మోహించునో వీనియందు మనస్సుంచుటచేఁ గవియుఁ జెడుచున్నాఁడు. అట్టి దుష్కావ్యములఁ జదువు వారును గామావిష్టులగుచున్నారు. కావుననేకదా కావ్యాలాపములు వర్జింపవలయునని వేదములు శాసించెడిని. నీవు విద్వాంసుడవు-కవివి. నీవు చదువని పురాణేతిహాస శాస్త్రములు లేవు. కామముచే నంధుఁడ వగుటచే సర్వశాస్త్ర విపశ్చిత్త్వం శ్రమ ఏవహి కేవల మ్మనుటకు గురివైతివి. అయ్యా యొకటిచెప్పెద వినుము. కామము ప్రేమమునను వానియందు

వస్తుభేదములేదు. విషయములందలి ప్రేమము కామమనిపించుకొనును. భగవంతుని యందలి ప్రేమము భక్తియనిపించుకొనును. మొదటిది యధోలోకముల పాలుసేయును. రెండవది మోక్షసాధన మగును. కామము కృష్ణునియందు సమర్పించి కదా గోపికలు ముక్తికిఁ బాత్రలైరి. కావున నీవును నాయందలి ప్రేమమును శ్రీకృష్ణుని యందుంచితివేని యీ జన్మాంతమందే ముక్తికన్యను వివాహమాడి సుఖింపఁగలవు. ఇంతయేల?

**మ. మనసింపొందఁగ ధీరులార! కరుణామైత్రీ మనీషా[15] క్షమా**
**వనితాసంగమ మాచరింపుఁ డెపుడున్ భామా సుఖం బస్థిరం**
**బని వర్జింపుఁడు, హారరమ్య కుచముల్ ప్రాంచన్మణీమేఖలా**
**ధ్వనితాలంబినితంబముల్ నరకబాధ ల్మాన్పి రక్షించునే**

**చ. విడువక పుట్టు గ్రుడ్డికిని వృద్ధశరీరికిఁ గుష్ఠరోగికిన్**
**జడునకు జాతిహీనునకుఁ జారునిజాంగము లొక్కరూకకై**
**కడువడి నిచ్చువారి గుణకల్పలతల్ విదళించుకత్తులన్**
**బడుపుఁ బడంతులన్ దనదు భావముఁ జేర్చునె యెవ్వఁడేనియున్**

**కం. జార భట చోర చేటక,**
**చార నట ప్రభృతి నీచ జననిష్ఠీవా**
**ధార *శరావము వార**
**స్త్రీ రమ్యాధరము సంస్పృశింతురె కులజుల్**

ఈ పద్యములను నీకుఁ గానుకగా నర్పించితి. ఇఁక నీ యిష్టమైన మార్గమున వర్తింపుము.

అని విరమించిన నయ్యించుఁబోఁడి వాక్యంబులాలించి యావివేకి జనసత్తముండు తనలోఁగొంత తడవు చింతించి చింతించి తటాలున లేచి యా చింతామణికిఁ బ్రదక్షిణ మాచరించి యా గడియనుండి నీవు నాకు జ్ఞానదాత్రివగుట యాచార్యపు తల్లివి అని సాష్టాంగ నమస్కారంబు గావించి

---

* శరావము = మూకుడు.

లేచి నేలపైఁ గూర్చుండి తన పూర్వవృత్తంబంతయు స్మరించి స్మరించి నిక్కపు నిర్వేదంబు జనింప దుఃఖించి దుఃఖించి గడచినదానికి శోకించి ఫలము లేదని విరమించి భావికర్తవ్యం బాలోచించి యత్యంత కృష్ణభక్తుండై కృష్ణకర్ణామృతంబును రచించి యందుఁ దనకు హితం బుపదేశించిన చింతామణిని స్మరించి సర్వముఁ ద్యజించి దేహాంతంబున ముక్తింగైకొనియె.

*శ్రీరామార్పణమస్తు.*

1. పంచలకారయుతయైన = ఐదువతనం కలిగిన ముత్తైదువ లక్షణాలుగల
2. భూసురాన్వయునకు = బ్రాహ్మణ వంశజునికి
3. మిళిందబృందము = తుమ్మెదల సమూహము
4. స్వైరిణి = స్వేచ్ఛా సంచార ప్రవృత్తికల స్త్రీ
5. హసంతి = కుంపటి
6. కశలు = ఝూటీలలాంటివి
7. వైతరణి = నరకంలోని నది
8. శ్రమణులు = వైదికధర్మాన్ని అంగీకరించనివారు
9. కింకరులు = సేవకులు
10. లబ్ధుడు = లోభి, పిసినారి
11. శ్రాద్ధము = శ్రద్ధతో చేయడం
12. శృంఖల = సంకెళ్ళు
13. పురుషార్ధము = ధర్మ, అర్థ, కామ, మోక్షములు
14. శ్రోణి = పిరుదు
15. ఇంచుఁబోఁడి = స్త్రీ పర్యాయ పదము.

* * *